

చెన్నపట్టణము, ఆగష్టు ౧౯౨౮

సంపుటము ౫ విభవ సంవత్సరము శ్రావణమాసము సంఖ్య ౮

వేసవి

వద్దాది సుబ్బారాయుఁడు గారు

ఆమని మామిడి యెక్కఁడు, రాముఁడు కళ్యాణపుష్ప రథ మెక్క, వనా
రామంబులఁ గలకంఠులు, గ్రామంబులను గలకంఠకంఠులుఁ బాడఁగ.

కువకువ వేకువం జెవులకుం జవు లీను రసాయనంబుగా
సవిధరసాలసౌధమున సారెకుఁ బాడెదు మేలుకొల్పు; నీ
వెవరవొ? యేమి? మాధవ మహీధవు మంగళపాఠకుండవా?
కవులును గాయకుల్ పొగడు కంఠము నీకిడినాఁ డతండె. శా.

కోకిలమా! ధన్యమ వీ - వేళ ప్రభుసేవయందె యొనయించెదు నీ
లోకోత్తర కలగాన క-ళాకౌశలి, మాధవోపలబ్ధస్వరమా!

వేఁడి వెలుఁగు కతన వేసంగి పవళుల - నంటరాని వయ్యె నఖిలవస్తు
వెవని పాలనమున నెల్ల భూప్రజ వాని - యట్ల యూట సాజమంద్రు గాదె?

వలసలుపోయె స్వర్ధునికి వాపులుఁ గూప నదీతటాకముల్
నిలువఁగ లేక వెట్ట, కవనీసతి దప్పిక నావులించె; నాఁ
కలి గడుహెచ్చి చిచ్చశనఘాతకతన్ గబళించె గ్రామముల్;
బలితపువేసవిన్ విభవ భానువిభన్ వెగ డొందె భూతముల్.

వేసవి వేవెలుంగుబలువెట్టకు మూర్ఛిలినట్లు, భూతసం
త్రానము గాఁగ నొక్కొ-కదినమ్మున నేమిఁ జలింప కుండు వి
శ్వాసపు గాలికిన్, జను లహర్నిశ మొక్కట సేద దేలఁగా
వేసర కల్లనల్లనను వీతు రుశీరపు వీజనమ్ములన్.

తీవ్రరోహిణిని దృతీయహనా దినమున - దప్పి విభవ నతిగఁ ద్రావునీళ్లు
కడవ గిడవగాదు లోడితేఁడుసాట్ట, యం - దెట్టువట్టె? నహ్వి యెట్టువట్టె?

మబ్బులో చందమామ యీమాపు జగతి - పగటినై దాఘతాపంబు పాయునట్లు
సన్నచినుకులు రాలు; యుష్మత్కరముల-హిమతుషార మొ వారిదామృతకణములో!

కోయిల జోలపాడఁగను గోమ• కంఠకుహూస్వనంబునన్
గాయము ఘర్మవాఃకణనికాయము తెమ్మెరకూన లానఁగన్
రేయిట తెప్పవాలని శరీరులు వేసఁగి నెట్టకేలకున్
హాయిగ వేగుజాము సమయంబునఁ గున్కుదు రారుబైలులన్.

కటితటి భర్మచేల మెదఁ గౌస్తుభసోదరి భాసిలన్, మహో
త్కటముగఁ బాంచజన్య నినదం బడరన్, మధువైరి, ప్రాణులం
బెటపెటఁ బేల్చు వేసవిరవిం గబళించి ప్రపంచ మోహమఁగాఁ
జటుకునఁ దోఁచె నాఁదగ నచంచలమై జలదంబు గర్జనన్.

విభవను మృగశిరబిందువు - లభవుజటాజూట బిందులట్టివి యమ్యోన్
నభము పెనుచిల్లి పడిన ట్లిభతుండనమోఘ ధారవృష్టి ఘటిల్లెన్.

గద్యకథానక

డి. ఏ. నరసింహము గారు, యం. ఏ., యల్. టి.

దేశకాలపరిస్థితుల ననుసరించి సారస్వతములోని జాతులును, రీతులును మారుచుండును. ఆంగ్లసారస్వతప్రాబల్యమువలన మనయాంధ్రవాఙ్మయమున జనించిన సారస్వతజాతములలో గద్యకథానకములు ఇప్పుడు ప్రాముఖ్యము నొందుచున్నవి. ఇవి వినోదము నొసగుటయే కాక సాంఘికములగు ఆచారవ్యవహారములను, వ్యక్తులవింతపోకడలను, జీవితమును చీకాకు చేయు క్లిష్టసమస్యలను, మనస్సును దిగ్భ్రమ నొందించు దైవవిపాకములను నేర్పుతో ప్రదర్శించి చదువరులను వివేకవంతులనుగా జేయుటకు తోడ్పడుచున్నవి. సాహిత్యముయొక్క ముఖ్యాశయములగు రంజనము, వివేకదీపనము ఈసారస్వతజాతమునకూడ ప్రబలముగా నెరవేరుచున్నవి. మనపత్రికలలో ఇవి మెండుగా బడుచున్నవి గావున వీనితత్త్వమును, ఉపయోగమును పరిశీలించుచు వీనివిలువను చదువరులు తెలుసుకొనుటకు తోడ్పడు వ్యాస మొకటి వ్రాయవలసిన దని భారతీపత్రికా కార్యాలయమువారు కొన్నినెలలక్రిందట నన్ను కోరిరి. పలుకారణములవల్ల నట్టిది వ్రాయుటకు జాగైనది. ఇదివఱకు వ్రాయబడినవి, ఇపుడు వ్రాయబడుచున్నవి అన్నియు తెలిసికొనుటకు వీలులేనందున ఆంగ్లసారస్వతపరిచితివలనను, ఆంధ్రపత్రికా భారతీపత్రికలలో ప్రచురింపబడు చిన్నకథలను చదువుచుండుట వలనను నాకు బోధపడినంతవరకు ఈ గద్యకథానకము లనుసారస్వతజాతమును గురించి యీ వ్యాసమున చర్చించుచున్నాను. ఇందుదాహరింపబడు కథలను ముఖ్యముగా ఆంధ్రపత్రికసంవత్సరాదిసంచికలలోను, భారతీపత్రికలోను, "అభ్యుదయ" అనుపత్రికలోను చదువవగును.

౧

వీనికి "కథానకము" లను పేరు బెట్టియుండు నని శ్రీయుత వేటూరి ప్రభాకరశాస్త్రిగారివలన వింటిని. "కథిక" లను నామము నేను మునుపొకవ్యాసమున "భారతి"లో సూచించియుంటిని. కథానకము లనుపేరే బాగున్నదని తోచి యీవ్యాసమున దానినే అవలంబించితిని. పద్యకవితయందును చిన్నకథ లుండును. కాని గద్యకథానకములను గురించి మాత్రమే యీవ్యాసమున చర్చించుచున్నాను. ఇంగ్లీషులో వీనిని 'షార్టు స్టోరీస్' (Short Stories) అందురు. చిన్నకథలు అనుమాటను, ఈమాటయును మనము ఉపయోగించుకొనవచ్చును. కాదంబరి, వాసవదత్త మొదలగు ప్రబంధములు పెద్దకథలు. ఆంగ్లమునను, ఆంధ్రమునను మిక్కుటముగా వెలువడు నవలలును పెద్దకథలే. అయితే పెద్దకథలను సంగ్రహపరచినంతమాత్రమున అవి చిన్నకథలు గానేరవు. ఇవి రెండును ప్రత్యేకజాతులు. వీనికి నలయు నేర్పును వేరువేరుగా నుండును. ఆంగ్లమున కొన్ని చిన్నకథలు నలువది యేబదిపుటల ప్రమాణమునకు మించియుండును. కథావస్తువు చిరిది యగుటవలనను, ఏకాంశమున కేంద్రీకరింప వలసియుండుటను రాజస్థానకథావళి, వ్యక్తులజీవితచరిత్రలు, అరేబియను నైట్సు వినోదకథలును ఈ కథానకజాతిలో చేరవు. ఏకనాయకాశ్రయత్వము కథానకముయొక్క రచనకు చాలదు.

నవలయొక్క ఆశయము సాంఘికజీవితమును ప్రతిబింబింపజేయుట. వ్యక్తుల వచనశీలలు, జాతుల మర్యాదలు, స్త్రీపురుషుల సంభాషణములు, యోచన లేని వచనములవల్లను, మాటలవల్లను మన యిరుగుపొరుగువారికి, బంధువులకు, హితులకు మనము కలిగించు మనస్తాపములు, మన దుఃఖములు, మన సుఖములు, మన ఆశయములు, మనవేమరుపులు, మన దౌర్బల్యములు, మన ఉత్సాహములు—ఇవి యన్నియు చక్కగాను, సప్రమాణముగాను, భావబోధకముగాను ప్రతిబింబింపజేయబడును. నాయికానాయకులే కాక పలురకముల వ్యక్తులును, వారివారి వ్యవహారములును

గూఢ నవలయందు హాగ్స్ బడును. జీవితపటము నవలయందు విశాలముగ నుండును. కథానకమం దట్లుండ నేరదు. నిరూపింపబడునంశ మొక్కటిగా నుండవలెను చదువరి యొక్క శ్రద్ధ దానియందే లగ్నమయి యుండవలెను. "రాజశేఖర చరిత్ర" యందు నాయకుడు రాజశేఖరుడా, రామరాజా యనుసందియమునకు తావున్నది. అట్టి సందేహము "శివరామా" యనుకథానకమందు లేదు. ఇంకొక హంతకుడు దారుణవేషము వేసుకొని, యొక ముదుసలి సంపన్నుని జంపుటకు కరము చాచియు చంప కుండనట్లు నిలిచిపోవును. కారణ మేమి యని చదువరి యుత్కంఠతో చదువును. తాను ఇల్లువిడుచునప్పుడు తన చిన్నికుమారుడు వెళ్లవద్దని చేయిచాచెనట; వంశనాశన మగునని భార్య వారించెనట. వంశనాశనమే దీనిఫలమని యా ముదుసలి బ్రాహ్మణుడును శపించెనట. ఇన్నిటిని సరకు గొనక తననిశ్చయప్రకారము హంతకుడు కత్తి నెత్తెను. కాని చంపలేకపోయెను. అట్లే ప్రతిమవలె నిలువబడిపోయెను. 'ఏమి యూరకున్నావు'అని ముదుసలి బ్రాహ్మణు డడుగ, "శివరామా" యని కత్తిని క్రింద పడవేసి, "నే నిక నెవరిని జంపను. నీవు బ్రదుకుము, నాయనా" యని యరచి క్రింద కూలబడెను. ఒక్కొక్కటిగా తాను నిర్లక్ష్యము చేసిన యంశము లన్నియు పుత్రప్రేమ యను లోనదాగియున్న శక్తిని బయటకు లాగి బలపరచి, దురాశాసర్పముపై నొక్కుమ్మడి వాడిచెడలి, దానిని నిర్వీర్య మొనరించెను. దీనినుండి మంచినీతిని తరువాత తీయవచ్చును. "మానవస్వభావ మెంత యగాధము!" అని ఆశ్చర్యపడవచ్చును. ముదుసలి బ్రాహ్మణుని నిశ్చలత్వమునకు సంతోషింపవచ్చును. ఇన్ని రేని యూహింపవచ్చును. కథ ముగియువరకు మనస్సు ఆనీలవస్త్రసంభాదితమగు హంతకుని విగ్రహము పైని, మీది కెత్తబడిన కృపాణముపైని, కృపాణమును హస్తమును నిర్వీర్యముచేసిన అవ్యక్తభావవిజృంభణము పైని నిలిచియుండును. తక్కిన ప్రశ్నలకు, ఊహలకు అవకాశమున తావుండదు. ఇట్టి ఏకాగ్రత నవలలో నుండదు. రాజశేఖరుడుగారి జీవితమందు, వారికుమార్తెల దుఃఖములయందు, పాంథికములగు చెడుగులయందు మనస్సు పలుత్రోవలుగా పోవును. "అహల్యాబాయి" యను నవలయందు చదువరిమనస్సు శ్యామసుందరుడు, భిల్లుల జీవితము మొదలగు నంశములయందు రాణిజీవితమునందు కంటె ఎక్కువ అభిరుచిగలిగియుండును. "నీఋణముతీర్చుకున్నా" అను చిన్నకథయందుగల స్త్రీపురుషులయందు కన్నవారికంటె పెంచినవారికి గలిగిన అపూర్వానుభవము నందే మనస్సు లగ్నమగును. తాము ముద్దుచేసి పెంచిన పొరుగువారి పిల్లవాడు తమయింట తల్లిదండ్రులుదగ్గర లేని సమయమున జచ్చుటయు, ఆపిల్లవానితండ్రి "నాపిల్లవానిని నాకిమ్మని" చేసిన ఆర్తనాదము, "నీఋణము తీర్చుకుంటా" నని స్నేహితుడు బదులు చెప్పుటయు, తిరుగ నాస్నేహితునికి ఒకపిల్లవాడు కలుగుటయు, ఆపిల్లవానిని మొదటిదంపతులు ముద్దుగా చేరదీసి పెంచుటయు, వాడు వారిచేతిలో జచ్చుటయు, "నీ ఋణము తీర్చుకున్నా" నని యాస్నేహితుడు మాట నొప్పజెప్పుటయు — ఇది ఆ యపూర్వానుభవము. నమ్మండి, నమ్మకపోండి. చదువునంతసేపు మనస్సునకు ఈ ఒక్క అంశమే ఉత్కంఠను గలుగజేసి నింపును. అది చిన్నకథలోని ముఖ్యమాత్రము. చిన్నకథ మిక్కిలి చిన్నదిగా నుండ నక్కరలేదు. కాని దీనిలోని కథావస్తువు విరివిగా నుండినయెడల దీనిపస చెడును. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి "సువర్ణగుప్తుని కథ" పెద్దదే; కాని రాజగు విక్రమార్కుడు "కుక్కను గౌరవించి నీయన్నల నేల యిట్లు అమానుషముగా అవమానపరుచుచున్నావు?" అని యడుగుటయు, ఆప్రశ్నకు జవాబుగా తనజీవితచరిత్రను వివరించుటయు, అందులో తనయెడల కుక్క గనుపరిచిన విశ్వాసమును, అన్నలు చేసిన ద్రోహమును స్పష్టమగునట్లుగా కథయంతయు వివరింపబడుటయు చూడ నిది యొకకథానక మని తోచుచున్నది. కథావస్తువు విపులమైనను ఏకాంశమున కేంద్రీకరింపబడినది. ఇట్లే "భిక్షువు" అనే కథానకము సన్న్యసించి పలుబాధలకు లోనైన యొక పోలీసు ఉద్యోగియొక్క దుర్నీతివర్తనమును ఆతనిచేతనే చెప్పించును. అరణ్యప్రాంతపు స్టేషనుకు బదిలీయగుట, అక్కడ నొకభోయకన్యను మోసగించుట, రోగములపాలయి,

ఉద్యోగమును విడిచి, బంధువులచేతను, భార్యచేతను విడువబడి భిక్షువగుట యింతలి కథావస్తువు. అరణ్యమున ప్రకృతిసౌందర్యమును, ఆటవికుల నిర్మలస్వభావమును ఈసందర్భమున తేటపడును. అవి మిక్కిలి నేర్పుతో కథలో ఉపాంగముగా సమర్పబడినవి. "కుబేరలక్ష్మి" యను కథానకము రాట్నముయొక్క ఉపయోగమును హృదయంగమముగా ప్రదర్శించుచున్నది. బ్రదికి చెడిన యొక స్త్రీ రాట్నమువల్ల తనను, తనపిల్లలను ఎట్లు తిరిగి ఉద్ధరించుకొనగలిగినదియు తెలుపుచున్నది. ఆమెయొక్క పూర్వపు ఉన్నతస్థితి, ప్రస్తుతపు దీనస్థితి, ఎప్పుడును విడువనిసౌశీల్యము,మార్దవము,మానము అన్నియును ఈముఖ్యాంశమును బలపరచి మనోరంజకముగా నొనరించుచున్నవి. కథానకముయొక్క వస్తువు ఏకాంశమున కేంద్రీకరింపబడవలెను. అంశములు ఎక్కువైనయెడల పస చెడును. చదువరిమనస్సున కథాంశము దృఢముగా నాటుకొనదు. ఈకథలో నాయికయొక్క పెనిమిటి చేసినవ్యాపారములు, లాభములు సంగ్రహముగా దెలుపబడినవి. వ్యాపారముల ప్రశంసకుగాని, రాటపువ్యాప్తికి చేయబడు యత్నముల ప్రశంసకుగాని ప్రాముఖ్య మీయబడలేదు. అవి ముఖ్యాంశమగు కుటీరసముద్ధరణప్రశంసకు సాధనమాత్రములుగానే ఉంచబడియున్నవి.

౨

ఇంతేకాక కథాంశము సులభగ్రాహ్యముగాను, స్పష్టముగాను ఉండుటవలన కథానకముయొక్క ప్రాశస్త్యము హెచ్చును. "జన్మాంతరసంబంధము" అను కథలోని ముఖ్యాంశ మంత సులభముగా గ్రాహ్యము కాదు. తెలిసిన తరువాత నైనను మనస్సున కంత దృఢముగా పట్టదు. మంచన్న అనే మరగుజ్జ బ్రాహ్మణచిన్నవాడు తనయన్నచే మోసగింపబడి దేశాంతరము పోయి ఒకధర్మాత్ముని యింటిలో కుదురుకొనెను. ఆయింటియజమాని కేలాగో యీచిన్నవానియందు మిక్కిలిప్రేమ జనించెను. ఆచిన్నవాడును ఆయనయందు విశ్వాసముగా నుండెను. ఆయన చనిపోవునప్పుడు ఆలుబిడ్డలను మరచి మంచన్నను పిలిచి కౌగిలించుకొని ప్రాణము వదలెను. 'జన్మాంతరసంబంధము మాత్రమే యిట్టిప్రేమను కలుగజేయగలదు' అని చదువరి నమ్మజాలడు. మంచన్నయొక్క నిర్మలసాత్త్వికస్వభావము, అమాయకత్వము, ముగ్ధత్వము, రూపవైకృత్యము జాలిగొలిపి ప్రేమపుట్టింపజాలును. ఇట్టిసందేహము మనస్సున పొడమినచో కథానకము బలహీనమగును. "దయ్యాలకొంప" అను కథానకమునగూడ నిట్టినీరసత కనుపడును. దయ్యములున్నవను నమ్మకము లేక, అట్టినమ్మకములను తిరస్కరించుచున్నదా యీకథ? లేక అట్టినమ్మకము తప్పుగానని ఋజువుచేయుచున్నదా? యను సందేహము చదువరికి చదువుచుండగనే కలుగును. అందులో మనదయ్యములరీతులను, పాశ్చాత్యులు కనిపెట్టిన దయ్యములచే వ్రాయించు ప్లాంచెట్ (Planchet) విధానమును ఈకథకుడు కలుపుచున్నాడు. ఇదియు చదువరి మనమున సందేహము కలుగజేయును. ఇది కథానకమునకు లోపము.

3

కథానకములయొక్క రచన పలువిధములగు చమ
త్కారములను గలిగియుండవచ్చును. పూసగ్రుచ్చినట్ల
సంగతులను వివరించవచ్చును. ఇట్టిరచన "జన్మాంతర
సంబంధము","నీఋణం తీర్చుకున్నా" అను కథలలో కన
పడును. లేదా, ఎవరో ఒకరు సంభాషణలో మిత్ర
లకు చెప్పుచున్నట్లును, నడుమ నడుమ ప్రశ్నలవల్ల కథ
భాగములు తేటపడునట్లును రచింపవచ్చును. భమిడిపాటి
రామసోమయాజులుగారు వ్రాసిన "జానకి" యన
విచారకథకు గోదావరీతీరమున పడవమీదకూర్చుండి నా
సేవించుచున్న యిరువురుమిత్రుల సంభాషణ సాధనము
గోదావరీకల్లోలములు సదృశమైన రంగాలంకారము
నడుమనడుమ పొర్లివచ్చు భావవీచికలు శ్రుతి. జాన
పెనిమిటి అన్యాక్రాంతహృదయుడై ఆమెను తిరస్క
రించి పెట్టినబాధలు, పతిని విడిచియుండ నను దృ
సంకల్పముచే నామె పతిని వెంటాడి తుదకు నాతద్రో
బడి చంపబడుటయు కథావస్తువు. తుదవరకును చదువరి
ఉత్కంఠ పెరుగుచునే యుండును. "నామిత్రుని జీవి
చరిత్ర"లో నెల్లిమర్ల అను గ్రామమునుండి సంపదను గో

ోయిన యొకకాపురుమునకును శిరగపురము ప్రాంతమున
కు పోయి జీవితమును సుఖముగా గడుపుచు, క్రొత్తను
ాచమునకు లోనై, క్రమముగ తనసుఖమును, పిల్లలను,
ార్యను చంపుకొని, ఏకాకియై, ఆస్పత్రిలో పడి
యుండగా, పూర్వపుస్నేహితు డొకడు వచ్చి చూచి,
రిత్రనంతయు తెలుసుకొని, వాని కోరికప్రకారము
ానిని జన్మస్థానమునకు తీసుకవెళ్ళిరిడిచెను. ఆస్నేహి
ుడే యీకథను చెప్పును. "భిక్షువు" అనుకథలో
ోడ్డుమీద పోవుచుండు నొక తగుమనిషి, యీకథా
ాయకుడను భిక్షువునకు ఒక అణా ధర్మముగా నొసగి,
ంతట నాతడు ఇంగ్లీషున నాశీర్వదించుటను విని
శ్చర్యపడి, యాతనివృత్తాంతమును తెలిసికొనగోరెను.
అప్పుడాభిక్షువు తాను పోలీసు ఉద్యోగిగానుండి చేసిన
ుర్నీతిపనులకు శిక్షగా కుష్ఠరోగియై, బంధువులచే నిర
ంపబడి,యీవృత్తి నవలంబించి కూటికి గుడ్డకు కష్టపడు
ున్న సంగతి వివరించెను. ఇట్లు కథానకములలోనికథ
థానాయకునిచేత చెప్పింపబడవచ్చును; లేదా, అతనికి
ంబంధించిన వారిచేత చెప్పింపబడవచ్చును; మిత్రులసం
ాషణ పూర్వకముగా తగినభావసంచాలనముతో చెప్పిం
బడవచ్చును. కథకునిచేతనే పూసగ్రుచ్చినట్లు మొదటి
ుండి చివరవరకుకథాంశమునకు సంబంధించినసంగతులన్ని
యు వివరింపబడవచ్చును. కథకునినేర్పుప్రకారము కథాం
మునకుతగిన ఉత్కంఠ భావపోషణరచనకు వన్నెదెచ్చి
థాంశమును చదువరిమనమున దృఢముగా నిజముగా నడి
నసంగతివలె నాటకేయును. అయినను కథకుడు మరుగు
డియుండి కథాపురుషులచేతనే చెప్పించుట యొక నేర్పు.
ట్టికథనమునకు అనుకూలముగ ప్రకృతిసన్నివేశములను
త్తరువు వెనుకభాగమునందు (background) వలెను,
ానంపుశ్రుతివలెను మేళవించుట దీనికి మించిననేర్పు.
థకునినేర్పు ఇంకననేకరీతులను కనిపెట్టవచ్చును. ఇవ
్నియు నిర్ణయించుట కలవి గాదు.

"యుగములనుండి నీకొరకు కనిపెట్టుకొనియుం
టిని గదా" యను కథానక మొకటి వింతత్రోవను త్రొ
క్కుచున్నది. ఒకరాజకుమారుడు యుద్ధరంగమున శత్రు
ాజకుమార్తెతో పోరి, మెప్పువడసి యామెను కౌగి
లించుకొనుటయు, నిద్దరును హర్షమందుచుండ అందరు వచ్చెరువంది మెచ్చుచుండ వారిద్దరు జచ్చుటయు పూర్వభాగము. నూతనవిధములగు నాటలలో మెప్పునందిన బలశాలియగు వైకుంఠరావు అనుయువకుడు అట్లే ప్రవీణతను గడించిన యొకపార్శీయువతిని గలుసుకొని, పూర్వస్మృతి కలిగి "యుగములనుండి నీకొరకు కనిపట్టుకొని యుంటినిగదా" యనుటయు, నామెయును నట్లే పూర్వస్మృతి కలుగుటయు నిదంతయు ఉత్తరభాగము. అయితే యిందులో వధూవరులు సుఖింతురు. ఉత్తరభాగము చివరవరకు పూర్వభాగమునకును దీనికిని గలసంబంధము కనుపడదు. అయిన నిదియొకలోపముగాదు. జన్మపరంపరయందు నమ్మకము గల మనకు ఇట్టికథ వింతగొలుపదు. ఉత్తమవీరజన్మమునుండి బంతియాటల ప్రసిద్ధిగల జన్మమునకు కొంచెము హీనక్రమము (anti-climax) తోపకమానదు. అయినను ఇది కాలపరివర్తనముగదా. కథకుడు పూర్వచరిత్ర యీనూతనవధూవరులలో నెవరిచేతనైన చెప్పించినయెడల ఈహీనక్రమ మంతగా దోపకయుండెడిది; కథాంశరచనయు బింకముగను, భిన్నత్వసూచన లేకుండగను ఉండెడిది. ఇట్టిరచనాలోపము "అత్తవారిల్లు" అను చిన్నకథలోను గన్పట్టును. ఇందలికథాంశము స్వల్పము. అత్తవారింటిలో మగనియాదరణమున మురియుచుండిన పిల్ల పండుగకు పుట్టినింటికి పోవలెనని కుతూహలపడుటయు, వెళ్లి కొన్నాళ్లుండి మగనియుత్తరువుప్రకార మతిసంతోషముతో తిరిగి యత్తవారింటికి వచ్చుటయు నిందలికథ. క్రొత్తదాంపత్య మందలి అనురాగోత్సుకోత్సాహముల నుదాహరించుటయే ముఖ్యాంశము. రచనావిధానము ఈ ముఖ్యాంశమును అంత తేటగా వ్యక్తపరచలేదని నాకు తోచుచున్నది.

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు వ్రాసిన కథానకములలో గల అనేక ఉత్తమగుణములలో రచనాపటిమ యొకటి. వీరు వ్రాసిన "పద్మాక్షి", "ప్రౌఢాపరివ్రాజకవివాహము" అను కథానకములను చూడుడు. మొదటిది విషాదాంతము, రెండవది హర్షాంతము. రెండిటియందును ప్రథమ

వీక్షణసంజనితప్రేమయే ముఖ్యాంశము. ఎట్టియాటంకములు వచ్చినను ఈపవిత్రమగు ప్రేమభావము మారదు; నశింపదు. పద్మాక్షి రూపవతి యైనను పుట్టుగ్రుడ్డిది. అయినను, స్వరమాత్రమున తనకు విధిప్రేరితుడై వచ్చిన యువకునియందు బద్ధానురాగ యై, వ్యతిరేకప్రశంస చెవిని బడగనే బావిలో బడి యాత్మహత్య చేసుకొనెను. ఆయువకుడును తలిదండ్రులను విడిచి, శ్మశానమునకు బోయి తనప్రేయసియందు లీనమాయెను. ఇచ్చోట కథ అంత స్పష్టముగా లేదు. "ఆశ" యనుకన్య చిన్ననాటి సహపాఠియగు ఉపకలాపునికొరకు ప్రతీక్షించుచు జనకుని ఒడబరచి సాంఘికావమానమును లెక్కగొనక కన్యగానే యొంటరికాపురము జేయుచు తనహృదయచోరుడు పండితనరుడై యూరికివచ్చియు, తనసంగతి తెలిపికొనిన పిమ్మట దైవికాంతరాయమువలన మనసు కలగి యూరు విడిచిపోగా, ఆశ యతనిని వెదకికొనుచు పోయి తనవిగ్రహమును నిర్మించుకొని దేవతగా నుపాసించుచున్న ప్రియుని గనుంగొని సుఖించుట యీ కథానకములోని వస్తువు. ఆమెనిర్మలప్రేమదీక్షవల్ల వివాహనిర్బంధముల తగ్గించుటకై సాంఘికోద్బోధనము చేయుట ముఖ్యాంశము. కథకుని ఆశయము ఇది యని నాకు తోచినది. మొదటినుండి చివరవరకు ఆశయొక్క నిర్మలప్రేమమూర్తి చదువరియెదుట ప్రకాశించుచునే యుండి, మధ్యమధ్య తెలియజేయబడు చిన్ననాటిచరితలు, వివాహయత్నము, దానినిరసనము, సాంఘికావమానము, శత్రువువలని హింస మొదలగు వంశములవల్ల ఆప్రేమమూర్తి మరింత మనోహరము, మరింత గౌరవాస్పదమునై మెరుగువారుచుండును. ఇందువలన కథ పాత్రపోషణమందును భావపరిశీలనమందును నే కాక రచనైకాగ్రతయందును కూడ మిన్నయగుచున్నది. పండిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిలుగారి సంఘసంస్కారాశయముగల కథలయందును ఇట్టిరచనైకాగ్రత, ఏకాంశకేంద్రీకరణము బాగుగా కనబడుచున్నవి.

౪

కథానకముల వస్తు వనేకరీతులనున్నది. మానవ వ్యాపారములలో నీసాహిత్యజాతమున కనువు గానివి లేవని తోచుచున్నది. పూర్వచరిత్రల నాశ్రయించి "వసుబాలుడు" అను వేగువానికథ వ్రాయబడియున్నది. ఆశ్చర్య మగురీతిగ నిందులో యువకులప్రేమ వేగు వ్యాపారముతో మేళికవేయబడినది. కృష్ణదేవరాయల తొలినాటి సరదారుల పిల్లలు ఆయిద్దరు వేగుకారగు యువతీయువకులు. ఇందులో చారిత్రము, అద్భుతము, ప్రేమ యీమూడును కలిపియున్నవి. విజయనగర సామ్రాజ్యమునకు సంబంధించిన "రంగరాజు" అను కథలోను ఇట్టిరసములు కలవు. దురాశచే రంగరాజు హంతకుడై తనబంధువులను, అన్నను, అన్నపిల్లలను జంపి, తానును హతుడగును. తుదకు ప్రయోజనము లేని సంతాపముపాలగును. నెల్లూరుజిల్లాలో క్రిందటియేడు జరిగిన తుపాను విపరీతములలో నొకయూరగల విద్యానందుడను రెడ్డియువకుని సాహసౌదార్యకృత్యములు "ముద్దుకృష్ణ" యను కథానకమునకు వస్తువు. ఇందులోనుగూడ చారిత్ర అద్భుత ప్రేమరసములు కలిసి యున్నవి. ఈ అద్భుత రసము "దయ్యాలకొంప"లో నింకొకరీతిని పోషింపబడి యున్నది. అపరాధపరిశోధకములగు కథానకములు కొంతవర కీయద్భుతరసపోషణ చేయుచున్నవి. ఆంధ్ర పత్రికలో క్రిందటి ఏడు "వీరవనిత" యనుకథ చదివితిని. కొన్నిరచనాలోపము లున్నను, అద్భుతరసము నుదాహరించుచున్న దీకథ. ఒకదొమ్మరి ఆటగాడు కరణముగారి భార్య యింటిలో నొంటరిగ నున్నదని గ్రహించి, దొడ్డిద్వారమున బ్రవేశించి, యామెను బలవంతము చేయ జూచుటయు, నామె సమయస్ఫూర్తి గలిగి యాతనికి భోజన మిడునెపమున వంటయింట దాకొని లోన తలుపు బిగించుకొనుటయు, వాడు గోడ త్రవ్వి లోనికి బ్రవేశించుచుండ వానిశిరముపై నొక కొయ్యపారను వైచి అణచిపెట్టుటయు, ఇది యంతయును తాను చచ్చినవెనుక తలుపులు కొట్టి లోన ప్రవేశించిన తనపతికి స్వప్నమున తాను తెలుపుటయు, అత దీదుఃఖమును భరింపలేక చచ్చుటయు—ఇట్టి సాహసాద్భుతములు ఈకథకు వస్తువు. విమర్శనకు దీనిరచనగాని, అంశములుగాని తాళవు. కాని చదువరికి ఉత్కంఠ కలుగజేసి యాతనిమనమును బలవద్గ్రాహముగా పట్టియుంచును,

"యుగయుగములనుండి నీకొరకు కనిపెట్టుకొని యుంటిని గదా" యనుదానిలో ప్రేమాద్భుతరసపమ్మేళన బాగుగా నున్నది. ప్రేమ యనునది తాత్కాలికభావము గాదు. "జన్మజన్మాంతరములయందును జీవుని వదలదు" అను ప్రేమతత్త్వమును, ప్రేమప్రాశస్త్యమును సూచించు కథ యిది. అనేకజన్మము లైనను ఒకరి నొకరు పూర్వ దంపతులు తెలిసికొనగలుగుట యనే అద్భుతము దీనికి సాధనము. కొంతవరకు విపర్యవాక్యములతో గూడుకొని యున్నను రాయసం వెంకటశివుడుగారి "పులిపాన" యను చారిత్రకకథయును, చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి "పంచపరిత్ర"యును ఇట్టికథానకరీతిని వ్రాయబడి యున్నవి. రచనావివరణములు ముఖ్యరసమును పోషించు చున్నవి. అద్భుతకథానకములలో తదనుకూల ప్రకృతి వర్ణన లుండవచ్చును. అయితే ప్రకృతివర్ణన యెట్టి కథలలో నైనను జేనుపబడవచ్చును. ఇదియొక ముఖ్యాంశము గాదు. "భిక్షువు" అనేకథలో మాత్రము భోయలు అడవులు కథావస్తువుతో సరిసమానముగా చదువరిమన మును ఆకర్షించును. అయితే యిందులో అద్భుతరసము చాలాతక్కువ. ఆబోయయువతియొక్క హావభావదర్శనములు మంత్రశక్తులు మాత్రము కొంచెమద్భుతజనకములు.

సాధారణముగా ఈ కథానకములు ప్రేమభావ మును ఆధారముగా గలిగి యున్నవి. చిన్నవయస్సుగల యువతీయువకులే వీటిలో నాయికా నాయకులగుచు న్నారు. ప్రేమస్వభావము, దానిలోపమువలన గలుగు కీడులు, దానియుద్రేకమువలన గలుగు కీడులు, ఆలుమ గలకుండవలసిన సైరణ, సమానప్రేమ లేకున్నచో గలుగు అనుమాననిర్వేదములు, ఇవి సామాన్యముగా కథానకము లలో వస్తువుగా గ్రహింపబడుచున్నవి. "తోషిణీసు ధారకము", "బంగళాలో కాపురము," "లక్ష్మి" (యిది చిన్ననాటిక యైనను కథానకముగా నెంచుచున్నాను) "జానకి" యనురెండువిచారకథలు ఇట్టికథలు చాలా వరకు నీతిదీపకములుగానే ఉన్నవి. యువజనులు ఇట్టి అన్యోన్యభావపరిశీలన కలవాటుపడుటవలన ఘనబుద్ధి, ఔదార్యము కలుగవచ్చును. సుఖజీవనమునకు అన్యోన్య ప్రేమ, ఉదారభావము, సైరణ యున్నియు అవసరమే కదా. యువకులమనస్సులను తెలుసుకొనలేక పెద్దలు వారిని హింసించుచుందురు. వారి ప్రేమప్రవాహమునకు అడ్డువచ్చుచుందురు. అట్టివారికి గూడా ఈ కథానక ములు వివేకజనకములని తలచెదను.

ఇందులో సాంఘికసంస్కారాశయములను అనేక కథకులు మేళవించుచున్నారు. ఇందులో పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ప్రవీణులని నాకు తోచుచున్నది. ఇట్టికథ లల్లుటలో వారికి సహజమగు నేర్పు మిక్కిలిగా నున్నది. దీనికి సంఘసంస్కార మందు వారి కున్న ప్రేమయేకాక సాహిత్యాభిరుచి కూడ ముఖ్యకారణ మనవచ్చును. వీరికథనచాతురి, సంభా షణలాలిత్యము, మానవాభివృద్ధియందు గల నమ్మకము గమనింపదగును. వీరు సృజించు స్త్రీపురుషులపాత్రల యందు వీరి సహజమగు ఉత్సాహము గనబడును. బ్రా హ్మణయువకుడు వేశ్యాకన్యను పెండ్లాడుటయో, వితంతు బాలికను పెండ్లాడుటయో, బ్రాహ్మణుడు వ్యాపా రము జేసి మార్గదర్శి యగుటయో యిట్టి వెన్నియేని వీరి కథలనుండి ఉదాహరించవచ్చును. ఇవి "అభ్యుదయ" అను మాసపత్రికలోను, ఇతరచోట్లను చదివితిని. కథల లోని సంభవములను, సందర్భములను పొందుపరచుటలో వీరి చాతుర్యము, లోకానుభవము, జీవితపరిశీలనము బాగుగా కనుపడును. ఇట్టి సంఘశుద్ధి ఆశయములు గల కథానకముల వ్రాయుటలో అ. భాస్కరమ్మగారుగూడ నేర్పు గనుపర్చుచున్నారు. వీరు వ్రాసిన "ప్రభావతి" యనేకథ బాల్యవివాహములయొక్క కీడును వ్యక్తపరచు చున్నది. రాయసం వెంకటశివుడుగారు వ్రాసిన "నాగ రత్నము" అనుకథానకము ఇంగ్లాండు వెళ్లి ఇంగ్లీషు కన్యను పరిణయమై వచ్చిన కోమటియువకుని గురించి వ్రాయబడినది. మగని తంటాలుపెట్టక, సౌశీల్యముగలిగి, ఆయాంగ్లయువతి పెనిమిటికిని అత్తవారికిని అనుకూల వతి యై తానును సుఖించినది. ఇట్లైనచో విదేశీయుల తో సంబంధములు మంచివే యని చూపుటకు వ్రాయ బడిన దీకథ. కాని మామూలుగా మనము వినేసంగతు

లను బట్టి విదేశీయులతో వివాహములు సుఖము నిచ్చుట లేదని తెలుసుకొనుచున్నాము. "వరకల్యాణము" లోని కథను కూడ తెలియజేయుచున్నది "అనాథబాలిక" లో వితంతువుల దుఃస్థితులు వ్యక్తీకరింపబడుచున్నవి. ఇప్పటి కృత్రిమనాగరికతను నిరసించుచు పూర్వపురీతిని అతిథిసత్కారమును నడుపుచున్న ధుంఢీశ్వరుడను తపోనిధియొక్క మూర్తి "అతిథిదేవుడు" అనేకథలో వేలూరి శివరామశాస్త్రిగారిచే చిత్రింపబడినది. వీరే "వాని" యనుకథావకములో వేశ్యలైనంతమాత్రమున మానవ భావములు, హార్ద్రతనములు, మానవమర్యాదలు లేవని యనుకొనరాదని చూపుచున్నారు.

ఒక్క యువతీయువకుల ప్రేమయే కాక మాతృప్రేమ, పుత్రలాలన, స్నేహము మొదలగునవి కూడా కథానికవస్తువు లంగీకరించవచ్చును. "పిన్ని" యను రవీంద్రనాథటాగూరుగారు వ్రాసిన కథను తెలుగున చదివితిని. ప్రేమ లేని భార్యపై ప్రేమ పెట్టుకొని వ్యాధి తెచ్చుకొన్న యువకునికి నిజము తెలుపకుండ ఆతని పినతల్లి పరిచర్య చేసెను. భార్య తనయందు ప్రేమతోనే అన్ని పనులును చేయించుచున్నదని ఆతని నమ్మించి స్థైర్యముతో నుంచెను. తుదకు ఆతడు మరణసమయమున నిజము గ్రహించి పినతల్లియొక్క ప్రేమకు అచ్చెరువంది, ఆమెను శ్లాఘించుచు, దేవుని స్తుతించుచు ప్రాణము విడిచెను. "మాతృనిర్వేదము"న బిడ్డలేని యొకస్త్రీ తనపిల్లవాడే సర్వస్వమని యెట్లో పెంచుచు, వాడు మృత్యువాతను బడినప్పుడు పడినదుఃఖము వ్యక్తము చేయబడినది.

ఈకథలలో సాంఘికమర్యాదలను మన్నుట గలుగునట్లుగా ప్రదర్శించునవి కొన్ని అత్యంతమనోహరముగా నున్నవి. "అత్తవారిల్లు", "రాజేశ్వరి", "మూడుమారిన కొత్తరికం" అనుకథ లిందుకు ఉదాహరణములు. వీనిలో మొదటిది, మూడవది క్రొత్తగా కాపురమునకు వెళ్లుట, పుట్టింటికి వచ్చుట, మళ్లీ అత్తింటికి వెళ్లుట వీనిలోగల వేడుకలను, మనోభావముల మార్పులను జీవితమునకు సరిగా నుండునట్లు ప్రదర్శించుచున్నవి. రెండవది "రాజేశ్వరి" ముద్దులు మూటగట్టుచున్నది. బాల్యము నుండియూ ఒకపిల్లను తనపిల్లవానికి చేసుకొనవలెనని కుతూహలముగల యొకవృద్ధబ్రాహ్మణుడు ఆపిల్ల తలిదండ్రులతోను, ఆమెతోను "ఖోసేటిశాస్త్రి" యను నామముతో పరిచయము గలిగించుకొనును. తరువాత ఆపిల్లవివాహసమయమునందు నిజము తెలియగానే వారందరికి గలిగిన ఆనందాశ్చర్యముల నూహింపవలసినదే.

కొన్ని హాస్యరసప్రధానములగు కథానికలు చదువరికి సహజానందమును గూర్చుటయేకాక సంఘములోను, వ్యక్తులలోను గల అనేక చిల్లరబుద్ధిహీనతలను బైటికి తెచ్చుచున్నవి. ఇందువలన వివేకము గలిగి జనులువర్తింపవచ్చును. నాటకములో "కామెడీ" (ప్రహసనము)వలె నవ్వుపుట్టించును. గోరంతలను కొండంతలను, కొండంతలను గోరంతలుగాను జేయుచు నవ్వుపుట్టించును. ఈకథలలోను గూడా రచన కట్టుదిట్టముగా నుండవలెను. హాస్యమునకైనను తుది, మొదలు;ఉండవలెను. ఎట్టి హేళనకైనను ఏదోయొక మూలముండును. "చింతలపూడి వారిసంభావన", "తమ్ముని పెండ్లికి తల్లివెళ్లుట", "నాబావమరిది పెండ్లి" యనుకథలు మన పెండ్లిగడబిడలను, ప్రయాణపుగలభాలను, అల్లుండ్ర పెంకెతనములను, భోగము మేళముల నడతలను, వైదికబ్రాహ్మణుల మొరటుతనమును ప్రదర్శించుచున్నవి.

"పేరూ-కొన్నరొట్టె" యను హాస్యరసపుకథ, పెండ్లామును ధిక్కరించి తానువంటచేసుకొను మగడుపడేపాట్లను బహువినోదముగా ప్రదర్శించుచున్నది. ఇది మూడేండ్లక్రిందట భారతిలో చదివినట్లుజ్ఞాపకము. "మాటీలు" అను శ్రీ వాసుదేవరావుగారు వ్రాసిన కథ లలితముగా నున్నది. హాస్యరసమును ప్రయోగించుచున్నది. వితంతువైన యువతి తనయక్కబావల రక్షణలో కాలము గడుపుచు కృతజ్ఞతతో తనయక్కకు మాటీలు చేయించుటకు ఏర్పాటుచేయుటలో అనుమానమునకు గురియైనది. కథ నిజము తెలిసినవెంటనే ఆనందజనకముగా పరిణమించెను. పురాణం సూర్యనారాయణ తీర్థులుగారి మోసగాండ్ర కథలు బహువినోదకరములును, పురాణపఠనమందు విశే

[జ]నకములను అయియున్నవి. "హాహాస్" అను పెట్టి లక్ష్మీనరసింహముగారి కథ హాస్యరసోద్రేకమును జనించి [చ]క్కి గాని యందులో సత్యములున్నవని వారే తెలియ జేయుచున్నారు. గౌతమి వ్యాఖ్యచరిత్ర యను శోకకథ రాయసం వెంకటశివుడుగారిచే రచింపబడినది. ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలో నాలుగేండ్లక్రిందట చదివితిని. "గౌతమి" యొకకుక్కపేరు; కాని యిది హాస్యరసపుకథగాదు. జంతువులకును ఆత్మయుండును; భావములుండును. మనవంటలు జంతువులబుద్ధి యెట్లు కనుపడునో యనుకుతూహలము మనస్సును అప్పుడప్పుడు కలుగవచ్చును. అట్లు తెలుసుకొను ప్రయత్నములలో నిది యొకటి. ఒకబ్రాహ్మణుల ఇంటి కుక్క వారిపిల్లతో కూడా పెరిగి ఆపిల్లకల్యాణమైనతరువాత అత్తింటికి వెళ్లుటయు,మళ్లీ వచ్చుట అనుసందర్భములలో ఎట్లు భ్రమపడి విచారపడినదియును తెలుపుకొనుట యుండలిచన్నవు-ఇది యొక కథయూ అని ఒకరు నన్నడిగిరని జ్ఞాపకము. ఇట్టివి యింగ్లీషు షార్టుస్టోరీజులలో చాలా గలవు. "బ్రౌను" అను పేరుగల కుక్కయొక్క పౌరుషమునుగురించి యొకకథ గలదు. ఆకుక్క ప్రబంధనాయకునిగా వర్ణించబడినది. కొంచెము వినోదము కలిగించును. గనుక హాస్యరసముకలసినకొనవచ్చును. కాని యిట్టికథలు భావపరిశోధనకు తోడ్పడు నుద్దేశము గలిగియున్నవి. చారిత్రకములు, అద్భుతజనకములు, సాంఘికాచార ప్రతిబింబకములు, సంఘశుద్ధిబోధకములు, వినోదకరములు అను కథానకజాతములను పరిశీలించితిని. ఈపై జాతులలో చేరక కొన్ని వ్యంగ్యార్థయుతములై పరగుచున్నవి. అందుచే వీటిని వ్యంగ్యార్థయుతములు (Allegorical Stories) అనియే పేరిడుచున్నాను. "నాగరాజు" అను అడివిబాపిరాజుగారు వ్రాసినకథ యిట్టిది. అందులోని వ్యక్తులు గాయకుడు, పూర్వాచారపరాయణుడు దనుపండితుడు, నాగరాజు, సరస్వతి—వీరు దేవతలు గారు, మనుజులు గారు. కథకుని కలమున రూపొందిన కొన్ని ఆశయములు. గాయకుడు క్రొత్త రీతులను పాడెనట. "నాగరాజు"ను పిలిచి బాగోగులు దెల్పుమనెనట. పూర్వాచారపరాయణుడు తప్పు లెంచి జేయును.

నట. నాగరాజు గాయకుని శిక్షింప నుద్యమించెనట. సరస్వతి ప్రత్యక్షమై వానిని వారించి యానూతన సంగీత రీతులనుగూడా తాను స్వీకరించితి ననెనట. స్పష్టముగా ఇందలి యర్థము క్రొత్తపాత భక్కిని సమర్థించుట. దేని యందము దానిది అని కథకుడు తెల్పుచున్నాడు. "కైక" యనుకథలో శ్రీ. భాస్కరమ్మగారు భరతుని తల్లి యొక్క నడవడికి క్రొత్తయర్థమును సూచించుచున్నారు. రాముని కిగల దేశసంచార కాంక్షను గ్రహించి, అతనికోరికప్రకారము కాఠిన్యము వహించినదని కల్పించినారు. మంచివివేకము గలది, ఉత్సాహసంకురాలు అని ప్రదర్శించినారు. వాల్మీకములోని కైక మంథర యను దాసిచేతి కీలుబొమ్మగా ప్రదర్శింపబడినది. ఇది యిప్పటి కాలపు విమర్శకులు పురాణప్రసిద్ధులగు వ్యక్తులను నూతన రీతులను విమర్శింపబోవుట కొక నిదర్శనము. కర్ణుడే భారతనాయకుడనియు, రావణుడే రామాయణ నాయకుడనియు, కవి వీరి కన్యాయము చేసె ననియు కొంద రభిప్రాయపడుచున్నారు. నిజము దేవు డెరుగును. కవి తాను విన్నకథను ప్రతిభచే జీవితసాక్షాత్కారము చేసుకొని ప్రబంధ మల్లును. కవికి పక్షపాత ముండదు. అతిశయోక్తి లుండును. అయినను కైకను శ్రీకీర్తిని ఒక నూతనవిధ్యానతి సమర్థించుట నాకు బాగుగనే తోచుచున్నది. ఇది సంభాషణరూపముగా రచింపబడినను, కథానకముగా గణింపబడవలెనని తోచినది. వేలూరి శివరామశాస్త్రిగారు రచించిన "శాంతశోష్యాసకుడు", "కాముకవి" అను కథానకములు గూడా ఈజాతిలోనివే. కవిత పాండిత్యము నకన్న ధారయొక్క ఆధిక్యమును తెలుపుచున్నది; కాని, రెండును సమముగా గలిసి యుండినచో కవిత వన్నెకెక్కును అనుమాట చదువరికి ఆకథ చదువుచున్నంతసేపు తోచును. "లక్ష్మీరామేశ్వరము" అనుకథలో భార్యాభర్తల ప్రేమ వారిలో నెవరైన ఒకరు చనిపోయినచో నిలుచునా యనుప్రశ్న "నిలుచును. అది ముక్తికి అడ్డునగులను" అనుజవాబు గలదు. ఇందలివస్తువు అతిస్వల్పము. ఇందలిసంభవములు చదువుచుండగనే మనస్సును సందియములు గలుగ

౫

ఇట్లు కథానకములు పలురీతుల నవలంబించి విజృంభించుచున్నవి. ఇవి నవలలవలె గాక చిన్న నగుట చేత పత్రికల అవలంబనము లేక నిలువజాలవు. కాని కొన్నికథానకముల జేర్చి "పూలదండ" మొదలగు పేర్లతోగూర్చి సంపుటములుగా ప్రచురించుచున్నారు. ఇందులో ఎక్కువ కళాప్రాశస్త్యము గలవానిని ఏర్చి స్కూలువిద్యార్థుల ఉపయోగము కొరకును, వాఙ్మయాసక్తుకొరకును ప్రచురించుట మంచిది. ఆంధ్రగ్రంథ మాలాధికారు లిట్టి ఏర్పాటు గావించగలుగుదు రని నమ్ముదును.

సాహిత్యకళయందు చిత్రకళయందువలె సౌంద ర్యమే పరమావధి యని కళావిమర్శకు లందరు ఒప్పు కొనవలెను. కాని కళయును మానవోపయోగముకొరకే జనించును గనుక ఏదోయొకరీతిని, స్పష్టముగానో, వ్యంగ్యముగానో, నీతినో, ఔదార్యమునో, అభిరుచినో బోధించుచుండును. రోచించి కవిభావమును గ్రహించు వారు గ్రహింతురు; లేనివారు శైలి, రచన, నైజ ప్రతిబింబనము వీటితో తృప్తినొందవచ్చును. కథానక ములు ప్రస్తుతము మనదేశమునకు సంఘమునకు సాహిత్య కళానందము నిచ్చుటయేకాక వివేకదీపనము జేయుచు అభివృద్ధినొంది బాగుపడుపలుమార్గములను సూచించుచు న్నవని నేనుతలంచుచున్నాను. రెండుఉదాహరణములతో ఈ వ్యాసమును ముగించుచున్నాను. "అనర్థం" అనే కథ హాస్యరసము గలిగియున్నది. అందులో నుగడు స్నేహితునితో ఇంగ్లీషున మాట్లాడుచుండ సౌందుడి విని మాటలకు అర్థము తెలియక అపార్థములను కల్పించు కొన్నయువతి నిజము తెలిసి తనతప్పును ఒప్పుకొన్నది. సౌందుడి సంభాషణలను వినకూడదని తీర్మానించుకొ న్నది. నుగడు ఇంగ్లీషు తెలిసినచో నీకు అపార్థములు తోచకుండును గనుక ఇంగ్లీషు చదువుకొను మన్నాడు. చదువరికి ఇందులో ఏయభిప్రాయము రుచించునో! కథ కుడు సగముసగము జ్ఞానమువలననో, సౌందుడి వినుట వలననో సంభవించిన యనర్థమునుమాత్రము సంఘమునకు నేర్పుతో చూపించినాడు.

"కృష్ణవేణి" యనుకథానక మొకటి భారతిలో చది వితిని. కథారచన బాగున్నది. భావపోషణము బాగున్నది. కాని యిందులో రెండులోపములు గనుపడుచున్నవి. కథావస్తువు కల్పితమా, లేక ప్రస్తుతపు అధునిక జీవితము నుండి గొలదిమార్పుతో గ్రహింపబడినదా యనుసందేహ ము కలిగించుట ఒకలోపము. కల్పననైజ జీవిత ప్రతిబింబ ముగానుండవలెనుగాని నైజజీవితకథన మేయగుచో వెగటు బుట్టించును; కళయొక్క ఆశయమే చెడిపోవును. ప్రకృ తి ననుసరించి నైజజీవితమును ప్రతిబింబింపజేయు కల్పన జీవితమునందును, మనుజులభావముల యందును గలమంచి చెడ్డలను సుస్థిరముగ మాత్ర మొసగుచు మనస్సుకు ఆనందము కలిగించును దిక్కుమాలిన కృష్ణవేణి వెంకట్రావు అను విద్యార్థిచే మోసమున చెరుపబడి గుంటూరు చేరుటయు, సాంఘిక సంస్కారోద్యమములయందు కృషిచేయుచున్న దంపతులవల్ల రక్షింపబడి తుదకు తనజీవితమును అనాథ బాలికల నుద్ధరించు విద్యాసంస్థకు నివేదించుటయు, తరు వాత వెంకటరావు పత్రికలలో నిది చదువుకొని తనచేయి దమునకు పశ్చాత్తాపమునొంది కృష్ణవేణివలన తిరస్కరిం పబడి తనజీవితమునుగూడ నొకదీనోద్ధారక విద్యాసంస్థకు నివేదించుటయు నిందలివస్తువు. కథాంతమున చదువరులు ఇందువలన నేర్చుకొనతగిన పదనీతులపట్టిక చేర్చబడినది. ఇది కళకు పెద్దలోపము. ఈపట్టిక లేకున్న కథ బాగుం డెడిది. ఆ. భాస్కరమ్మగారు వ్రాసిన "శాంత" యను కథానకమునకు కాకినాడకాలేజీతో అంతవివరముగా సం బంధము కలిగింపకపోయినయెడల ఆకథ ఏలోపములేక యుండునని నాకు తోచుచున్నది. శాంత ఆకాలేజీలో నుంచి యఫ్. ఏ. పరీక్షలో రాజధానికి ఫస్టుగా ప్యాసయి నది. అనగానే చదువరికి రిజిస్టర్లు వెదుకవలెనని బుద్ధి పుట్టును. అంతేకాక, కథముగింపు సాంఘికసంస్కారో ద్యమమునకు అనుకూలమైనను మానవప్రకృతికి అనువు గాదు; కథలో వివరింపబడిన అద్భుతసంభవములకును అను రూపముగా లేదు. కేవలము సంస్కారపరమైన నీతిని బోధించుటకు వ్రాయబడినదని చదువరికి తోచును.

ఇట్లు గద్యకథానకములు అనేకవిధముల చదువరు లకు వివేకానందములను గలుగజేయుచు సాహిత్యాభి

వృద్ధికి దోహదపడుచున్నవని తలచెదను. వాని కీకొలది విమర్శించి గద్యకథానకముల రీతులను, ఆశయములను నిరూపించితిని. ఈవిమర్శన కథకులకును, చదువరులకును గూడ కొంత సహాయముగా నుండు ననుకొందును. నేను చదువనివి, యింకను జేర్చ వలసినవి ఎన్నియో కథానకరత్నము లుండును. ఆంధ్రసాహిత్యమున విమర్శభాగమును పెంపొందించు నుద్దేశముతో వ్రాయబడిన యీ వ్యాసమును సహృదయులగు చదువరులు సాదరముగ చదివి యిందలిలోపములను క్రొత్తవ్యాసములలో పూర్తి జేసి విమర్శకసాహిత్యాభివృద్ధికి తోడ్పడుదురుగాక.

విస్మయము

పురిపండా అప్పలస్వామి గారు (కవితాసమితి)

నీయనంత వినిర్మాణ నియతిఁ గాంచి
విస్మయోన్మత్త మతి నైచు విహ్వలతను
నన్ను నేనె మఱచిపోదు: నాహృదంత
రాళమం దెద్దియో నూత్న రాగగరిమ
దివ్యవిద్యుత్ప్రభాతీక్ష్ణ దీప్తితోడ
ప్రాఁకిపోవును తనువెల్ల, బాపురే! యి
దెట్టి యింద్రజాలమొ కాని యెఱుఁగలేను—

నమె జీవించు నొకసూనమునుగూడఁ
గాంచఁబరికింపఁ దెల్ప శక్యమ్ము కాని
జీవకళ నెట్టి మాధుర్య భావము నిడి
అనుపమానూన సౌందర్య మమరఁజేసి
సౌరభచ్ఛవిఁ గూర్చి భాస్వరతఁ జేర్చి
నీవు చూపిన ఘననైపుణీవిభవము
హృదయము హరించు; త్వన్మృదుపదతలమున
దాసి నైపోవఁ గోర్కె యుద్భాసిత మగు.

* * * *

ఎట్టివారికిఁ గూడ నూహింపరాని
ఈవిచిత్ర వినిర్మాణ మేవిధాన
నేరకడ నేర్వఁ గలిగితి వీవు నాథ!

'గోపిక.'

ఆంధ్ర భాషావతారము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

అఖండస్ఫోటమై వెలయు శబ్ద బ్రహ్మము ధ్వని తాదాత్మ్యధ్యాసచే నానా దేశము లందు, నానాజాతిజనులందు బహుభాషలుగా బహ్వర్థములతోఁ బరిస్ఫురించుచున్నది. ఆకస మునుండి మేఘ మతినిర్మలమయిన యంబు వును వర్షింపఁగా నది యుష్ణఁబట్టులందు, రేవడి చెలికలందు, మహౌషధీమయములగు నరణ్య ములందు, రసధాతుభరితములగు పర్వతము లందును బడి తత్తాదాత్మ్యముతో భిన్నరూప ములను,భిన్న రుచులను బొందుచు జాలువాఱి కోళ్లై, సెలయేళ్లై,వంకలై,వాఁగులై,నదులై, మహానదులై,ప్రబలములైనభేదములఁ బడయు చున్నది. భాషల పుట్టుపూర్వోత్తరములు గూడ నిట్టివే.

సహ్యపర్వతమునఁ దొలుత జాలువాఱు టలో సమానలక్షణములు గలవై యున్నను కృష్ణా కావేరీ నదులు ఆంధ్ర దేశమునకును, అఱవ దేశమునకును సాగను సాగను విభిన్న లక్షణముల వెలసివెలసి వేఱువేఱు తీరులను, పేరులను బడసినట్లుగా ఆంధ్రద్రవిడ కర్ణాట భాషలు తొలుత (ఆంధ్రద్రవిడ కర్ణాటు లని నేఁడు విభిన్నులుగా నున్న వారొకప్పుడొక్క చోట నొక్కసంఘముగా నుండి వెడలి వేఱు పడిన వారే యని నా నమ్మకము.) నొక్కటి గానే యుండి కాలక్రమమున భిన్నభిన్న దేశ ములఁ జెంది భిన్నభిన్నత్వములఁ బడసినవి. ఆంధ్రద్రవిడకర్ణాటభాషల నేఁటి స్వరూపము లెంత భిన్నములుగా నున్నను, పూర్వపూర్వ మును బరిశోధించుచుఁ బోవనుబోవను వాని భేదములును దక్కువతక్కువ లగుచుండుట తెలియనగును. ఇట్లు చూడఁగా రెండువేల యేండ్లకుఁ బూర్వ మీభాషల పృథగ్భావము విస్పష్ట లక్షణములతో వెలసియుండక పోవుట గోచరించును.

వర్షోదకము నేలపైఁబడినప్పుడు మట్టితోఁ గలసి వండువాఱి తేటదనము, తేలిక దనము లేక కలుషమై, యస్వారస్యమై యుండునట్లు భాషకూడఁ దొలుత శబ్దరూపోచ్చారణాదు లందుఁ దేటదనము, తేలికదనము, హృద్యత లేక, క్లిష్టమై యుండును. కాలక్రమమున నా నీరు ఏళ్లలోఁ గోళ్లలోఁబడి నదులై ప్రవహిం చుచుఁ దేటవాఱి నడుమనడుమ గుంటలలోఁ గోనేళ్లలో నిలువరమంది ప్రసన్నమైరుచ్యమై యొప్పును.అట్లే భాషకూడఁ గాలక్రమమునసా ధూచ్చారసంస్కారమంది, అందందు గ్రంథము లందు నిబద్ధమై నిలువరమంది,స్వచ్ఛమై, యా స్వాద్యమై వెలయుచుండును. వ్యవహారప్రవా హమున భాష వడివడిగాఁ బరిణామ మందు చుండును గాని యది గ్రంథనిబంధము నందిన పిదపఁ గొంత కట్టుదిట్టమును బడిసి నిలుకడఁ

జెందును. ఆవలఁ దత్పరిణామము పూర్వమంత త్వరగా సాగదు. ఆంధ్రద్రవిడ కర్ణాటభాషల యారంభ మొక్కటియేయైనను, సంస్కృత ప్రాకృతసంబంధ మల్పముగాఁ బడసి గ్రంథము లందు నిబద్ధమై నిలువరమంది లక్షణపరిష్కా రములను బడయుటలో నఱవము మొదటి దయినది. ఆనిలువరముమీఁదను, ఆలక్షణ పరి ష్కారములమీఁదను నాఁగక ఇంకను గొంత యుచ్చారవ్యవహారమునఁ బరిణామమును బొందిపొంది సంస్కృత ప్రాకృతముల సాహా య్యము నధికముగాఁ జెందిచెంది పెంపొంది గ్రంథములందు నిబద్ధమైనది కన్నడము. ఈ రెం డింటి కంకను దర్వాత నీ రెండింటిలక్షణపరిష్కా రములతో నిల్వక యింకను నుచ్చార సంస్కా రములఁ బడసి, నవరసయి యందచందముల బొంది సంస్కృతప్రాకృతముల సరససాహాయ్య మున నభ్యుచ్ఛ్రితముఁగాంచి గ్రంథములందు నిబద్ధమైనది తెలుఁగు. దక్షిణ హిందూదేశ ముప్పది దేశభాషావధూటి పసిప్రాయపుఁబలుకు అఱవము; ఎలప్రాయపుఁబలుకులు కన్నడము; జఱతనపుఁ బలుకులు తెలుఁగు. ద్రవిడ కన్నడములు తెలుఁగుకంటెఁ బెద్దవేకాని చిన్న దయినను తెలుఁగుభాషా కన్య కందచంద ములు, పలుకుపొంకములు హెచ్చు. అఱవపద ములకును, దత్ప్రత్యయములకును, కర్ణాట పదములకును, దత్ప్రత్యయములకును నుచ్చా రణమునఁ దోఁచు కార్కశ్యము నాఁటనాఁటఁ దొలఁగి తొలఁగి నవరసయిన యుచ్చా రణమును బడసిపడసి తెలుఁగు పదములును, ప్రత్యయములును వెలసినవి. ఉచ్చారణసుంద రములయిన తెలుఁగుపలుకుల పూర్వ పూర్వ పరిణామ క్రమదశలలో ద్రవిడకర్ణాటపదరూప ములు రెండునుగాని, రెండింట నేదే నొక్కటి గాని పొందియుండుట పెక్కుచోట్లఁ గాన నగును.

పై యుభయభాషా సంబంధము లేనివి యచ్చపుఁ దెలుఁగుఁబలుకులు, ప్రత్యయము లు గొన్నియున్నవి. ఇవియేకాక, సంస్కృత ప్రాకృతోభయ భాషోచ్చారణ క్రమపరిణామ ములఁ బొందినవియు, సంస్కృత మాత్రో చ్చారణ క్రమపరిణామములఁ బొందినవియు, ప్రాకృత మాత్రోచ్చారణ క్రమపరిణామ ములఁ బొందినవియుఁగూడఁ బెక్కుపలుకులు, ప్రత్యయములు తెలుఁగునఁగలవు. ఇట్టివెల్లను గూడి సుకుమారోచ్చార సంస్కారములను బడసిపడసి వానికంటె వైలక్షణ్యమును బొంది మన తెలుఁగు వెలుఁగొందుచున్నది. మీఁదఁ బేర్కొన్న విషయమున కుదాహరణముగా నొక్క పదమును బరిశోధించి చూపుదును.

'నూనె'—ఈపదము 'నూవు' 'నెయి' అను పదములసమాసము. 'నూవులనెయి'=అనఁగా 'నూవులసారము' అని అర్థము. ఇందు 'నూవు' అనుపదము ద్రవిడ కర్ణాట భాషల సంబంధ మేమాత్రమును లేని యచ్చపుఁ దెలుఁగుఁబ లుకు. నూవులకుఅఱవమునను, గన్నడమునను, 'ఎళ్' అనిపేరు. 'నెయ్' అనుపదము ద్రవిడము నను, గర్ణాటకమునను గూడఁ గలదు. కాని

యది కర్ణాటకమున 'నే' 'నేయ్' ఇత్యాదిరూపములఁ గూడఁ బొందియున్నది. తెలుఁగున ఉచ్చారణ పరిణామములలో ససుందరమయిన హలంతత్వము దొలఁగిపోయి 'నెయి', 'నెయ్యి', 'నేయి' 'నేయు' 'నై', 'నే' అనురూపములు వెలసినవి. 'నెయ్' అనురూపమునకంటెను నీరూపము లుచ్చారణ సుందరములు. తెలుఁగు భాష హలంతత్వము నేవగించునుగాన 'నెయ్'ని అజంతముగాఁ జేసికొనుటలో 'ఇ' ని జేర్చుకొనఁగా 'నెయి' అయ్యెను. 'నెయ్' పదము అజాదిపదములు పరమయినపుడు 'నెయది' అనురూపము ఉచ్చారణ సహముగాదు గాన, 'నన్ + అది = నన్నది', 'అన్ + అలేఁడు = అన్నలేఁడు' అనురూపములందినట్లు, 'నెయ్యది' ఇత్యాదిరూపముల నంది, అట్టి సంధినుండి పదచ్ఛేదముఁ బడయుటలో 'నెయ్యి' అను రూపమును బొందెను. ఏకలఘుపూర్వక హల్మాత్రముగల శబ్దములు ఉచ్చారణపుష్టిగలిగి యుండవు గావున హలుచ్చారణ బలము పూర్వహ్రస్వమునకుఁ దన్ని దానిని గురువునుగాఁజేసి యంతలోఁదాను గరఁగిపోవఁగా 'నే' అనురూపమేర్పడెను. అకరఁగిన హల్మాత్రయకారము అజాదిపదములు పరమగునపుడు వానితోఁగలసి యకారముగాఁ నిలువఁగల్గుచున్నది గాన దానిపై నజంతత్వపుఁ జికిలి జరగఁగా కొంత దుర్బలమయిన యుచ్చారముగల యకారముతో 'నేయు', 'నేయి' అను రూపములేర్పడెను. హల్మాత్రమగు యకారము దుర్బలమగుటచేతనే 'నెయ్యి' అనురూప మేర్పడినట్లు 'నేయ్యి' అనురూపము పుట్టఁజాలకపోయెను. 'నెయ్'లోని 'య్' 'ఇ' గా మారఁగా 'నై' అను రూపము పుట్టెను. పై రూపములందు 'నేయి', 'నై' రూపము లర్వాచీనములు. ఇట్లు 'నేయ్' శబ్దముపై నేర్పడిన బహుసుందర పరిణామములెల్ల మన తెలుఁగునఁ గలవు. 'చెయ్, వెయ్' మొదలగు శబ్దములు గూడ నిట్టి పరిణామములఁబొందెను. శబ్దముల ప్రాచీనరూపములకుఁ దాతలనాఁటివన్న గౌరవముండఁగా నర్వాచీనరూపములకు హృద్య సంస్కారముల ననేకములఁబడసి వెలసినవన్న వేఱొక గౌరవవిశేషము గలదు. ఆంధ్రుల కాచారవ్యవహార స్వరూప స్వభావాహార దేశ లక్షణాది బహుకారణములచేఁ గల్గిన భిన్న భిన్నలక్షణముల కనుగుణముగా నేర్పడిన శబ్దరూపములను మీఁదఁ జూపితిని. 'నెయ్'శబ్దము తెలుఁగులో నిన్ని హృద్యరూపముల నందినది గాని యిది 'నూవు' శబ్దముతో సమాసమందినప్పుడు కొన్ని ప్రాకృతభాషాసంబంధ సంభవములైన వికారములకుఁ గూడఁ బాల్పడెను. 'నూవు'శబ్దము తొలుత 'నూవ్' అనురూపము తెలుఁగు హలంతత్వము నేవగించుకొనును గాన యది 'నూవు' అనురూపమును బడసెను. ఆహల్మాత్రము కరఁగిపోవుటచే 'నూ' అను రూప మేర్పడెను కరఁగిపోయిన యా హల్మాత్రమయిన 'వ్' అచ్చుపరమయి నప్పుడు మరలఁ గానవచ్చును. 'నూ + నెయ్' పదములు రెండును సమసింపగా, 'నెయ్'పద మెన్ని రూపములతో నున్నదో, అన్ని రూపములతోను ఆసమాస

ముందుట న్యాయ్యము—అనఁగా 'నూనెయి', 'నూనెయ్యి', 'నూనే','నూనేయి''నూనేయు', 'నూనై'అనురూపములు గూడనుండవలెననుట. కాని యట్టిరూపములు తెలుఁగున పుట్టలేదు. దానికిఁ గారణమేమనఁగా:'నూనె'యనుసమాసపదము, 'నెయ్'పదము మీఁదఁ జేర్కొన్న పరిణామములనెల్లఁ బడయుటకుఁబూర్వమేపుట్టి రూఢమైనది. అప్పుడు'నూ + నెయ్'అనియుండి తెలుఁగునకుఁ బ్రియముకాని కడపటి హల్మాత్రము లోపింపఁగా సమానదశలో నాపదము గురులఘు ఘటితమగుటచే 'నెయ్' 'నే' రూపమును బడయనక్క—అలేకపోఁగా'నూనె'అయ్యెను. కరఁగిపోయిన కడపటిహల్మాత్రపు 'య్'అచ్చుపరమయినపుడు మరలఁగానవచ్చును గాన 'నూనె'+'అది' కలసినపుడు 'నూనెయది' అయ్యెను. ఇట్టి యకారమునే తెలుఁగువైయాకరణులు 'యడాగమ' మని పేర్కొనిరి. ఇట్టు 'యడాగమ'మని పేర్కొనఁబడుచున్న స్థలములనేకము లట్టి పదాంత యకారహల్మాత్రము ద్రవించిపోఁగా నచ్చు పరమయినపుడు మరలఁగానవచ్చుటను బట్టి యేర్పడినవే. అట్టి దేశిశబ్దముల రూపసాజాత్యమునుబట్టి యకారపుచ్ఛములేనివయినను తెలుఁగునఁ జేరిన సంస్కృతప్రాకృత శబ్దములకును నట్టి యడాగమము పుట్టెను: 'రమ + అది=రమ యది' ఇత్యాదులు.

పైనిఁ జేర్కొన్నవిధమున నూనెపదము తెలుఁగు సంప్రదాయపరిణామమునుబట్టి పుట్టియుండఁగా దానిమీఁద 'నూనియ' అను రూపము ప్రాకృతభాషా సంప్రదాయమును బట్టి పుట్టెను. 'కన్నియ' 'వన్నియ' 'దీవియ' మొదలయినశబ్దములు కన్యకా, వర్ణక, దీపికా శబ్దాదులనుండి ప్రాకృత సంప్రదాయమును బట్టి పుట్టి తెలుఁగునఁ జేరినవి. వీనికి 'కన్నె' 'వన్నె' 'దీవె' రూపములును గలవు. వీనిపోలికనుబట్టి 'నూనె' శబ్దమునకుఁగూడ 'నూనియ' అనురూపము వచ్చెను. 'నూనె' నూనియ శబ్దములు పుట్టినతర్వాత వాని సాదృశ్యముచే 'తేన్' అని యఱవమున రూపముగల 'మధు' వాచకశబ్దము తెలుఁగున 'తేనె' 'తేనియ' అను రూపములఁ జెందెను.

ద్రవిడ కర్ణాట ప్రాకృతభాషల పలుకుబడి నూనె శబ్దముమీఁద నెంతచెల్లెనో పై పరిశీలనమువలనఁ దెలియవచ్చెను. కాని యిందు సంస్కృతపు పలుకుబడికూడ హెచ్చుగాఁ గలదు. ఎట్లనఁగా 'నెయ్' అను పదము దేశిపదమని కొందఱన్నను 'స్నేహ' మను సంస్కృతపదమునకు వికృతియని కొందఱందురు.

ద్రవిడభాషలో 'నెయ్' పదము 'సారము' అని యర్థముగలది. క్షీరములనుండి యెత్తిన సార మగు ఘృతమునకే తర్వాత నదిరూఢమయినది. 'నూనె'యను సమాసమునఁ జేరుటచే నెయ్, 'స్నేహ'వాచకమైనది కాని యది స్నేహశబ్ద వికృతికాక దేశిపదమే యగునని కొందఱు.

మఱియు,నూనె యనునర్థముననే సంస్కృతమున 'తైల'పదము గలదు. తైలపదము శబ్ద

నిష్పత్తినిబట్టి నూవుల సారమునకే వాచకమయినను స్నేహసామాన్యమునకును చెల్లుచున్నది. తిలతైల, తైరండతైల, భల్లాతకతైలాదులు చూడఁదగును. నూనెపదము గూడ నిట్లే తిలస్నేహవాచకమే యయినను, స్నేహసామాన్యమునకును జెల్లుచున్నది.

నూవులనూనె, కొబ్బరినూనె, వలిసెలనూనె, ఇత్యాదులు చూడఁదగును. అట్లేవముఁగూడ నూనెకు 'ఎళ్ నెయ్' 'ఎణ్ణెయ్' అని పేరు. అదికూడ స్నేహసామాన్యవాచకమే. 'తేఙ్గాయెణ్ణెయ్' ఇత్యాదులు చూడఁదగును.

నూనెపదము తైలపదమువలె తిలస్నేహవాచకముగానే పుట్టుట, అది స్నేహసామాన్యమునకు వాచకమగుట సంస్కృతభాషావ్యవహారసంప్రదాయ సంస్కారమును దెలుపుచున్నది.

ప్రతిబింబము

మద్దిపట్ల వేంకటరమణయ్య గారు

ముందు తా విన్నయందంబుఁ గ్రిందుపఱచు - పద్మినీరూప విభ్రమ వైభవంబు
మానికపు నిల్వుటద్దంబులోనఁ దోఁప - భ్రమానుపడి నిల్చె అల్లయుద్దీను ఖిల్జీ.

చిత్రకారుని తూలిక సృష్టి యనుచు - నమ్మఁ డయ్యె నాప్రతిఫలనమ్ముఁ దొల్త
చంచలతటీయతుంగవక్షంబు వరసి - చాల నాశ్చర్య మందెను సాహి బవల.

తా నిలుచునెలకట్టు రేతేని రాలు - పద్మరాగంబులో యనుభ్రాంతిఁ గొల్పు
మంజుమంజీర విభ్రాజమానమైన - తద్వరారోహామృదుపదద్వంద్వ మాది-

కనకపట్టాంశుకావగుంఠనములోన - గనిపియాడు నీలంపు ముంగురులదాఁక
సుదతి సౌందర్యమాధురి జుఱ్ఱుకొనుచు - నంతిపురి వీడ లేకాతఁ డాఁకవడియె.

భూరిరోషవిషాదధిక్కారకలనఁ - గలుషితం బయ్యె మానినీతిలకముఖము
కాంచుటకె యిచ్చ గొల్పె నక్కాముకునకు - భృంగసంగతవికచారవిందమట్లు.

పడఁతి కుచ్చెళ్లు జీరాడునడుగుదోయిఁ - గలికివాల్గంటిచూపు లగ్నంబు గాఁగ
వంచినమొగంబు మున్నివేళ్ళఁ బైకి నెత్తి - ముద్దుగొన నాసపడియె నామొఱకుతురక.

పిడికిట నడంగు చిన్ని నెన్నడుము నొడిసి - గురుకుచను గౌఁగిటికిఁ దార్పఁ గోర్కి-పడిమె
"కటకటా! యిది కలలోని కనక" మనుచు- ధైర్యమును నిస్పృహాగ్ని కింధనముఁ జేసె.

ఆణిముత్యాలచాలును శ్రేణిసేయు - పల్వరుస దోఁప నించుక పడఁతి నగినఁ
గాయువెన్నెలలోఁ దోఁగఁ గాంక్షసేసె - నతఁడు దేహతాపంబు చల్లాఱునట్లు—

మగువతొగరువాతెరనుండి నిగుడునుడులఁ-దియ్యఁదన మెంత నెగడునో తెలియఁ గోరెఁ
గనులతో సమానమ్ముగాఁ గర్ణములకుఁ - బ్రమదమును బంచ నెంచి యాపాదుసాహి.

ప్రాడ్వాకవిధంబు కై సేసి ముద్దుగుమ్మ-యొద్ద నొయ్యార మొలుకంగ నొయ్యనొయ్య
నడచునొప్పిద మీక్షింపఁ బడయనైతి - నక్షిసాఫల్యముగ నంచు నతఁడు కుందె—


ధనికుపేటికలోని కాంచనశలాక - దోఁచుకోఁ దలంచెడు గజదొంగయట్లు
తహతహను జెందె మునలిమాన్ ధరణిభర్త - ముకురమందలి బంగారుబొమ్మఁ జూచి.

తపనునకుఁ గానిపద్మినీదర్శనంబు - పడయుటను మెచ్చుకొనె నిజప్రాభవంబు;
నీడయే కాని నిజమును జూడలేమిఁ - దనయదృష్టంబు నిందించుకొనె నతండు—

రాజపుత్ర తేజో బల రక్షితమ్ము - ననమసౌందర్యరాశిఁ గన్నారఁ గంటి
మంటి నని సంతసిలె వారి మానుషాన - కాత్మవిక్రాంతి కుంఠిత మాట కడలె—

భావనాబలమ్మునఁ బ్రతిద్వారమందుఁ - బద్మినీరూపమే కాంచి భ్రాంతిఁ జెందె
మహీశచిత్తూరు దుర్గంపుఁ బ్రహరివరుస - మెల్లగా దాఁటి వెళ్లెడుమ్లేచ్ఛవిరహి—

వినుకలిని కల్గువలవంత విడువ నేఁగి - మగిడెఁ గనుకలిఁ గట్టిగా నగరునుండి
జానుపున బాడి కడుగుకో సరసుఁ జొచ్చి-తొడవఱకు నూబిలో దిగఁబడినయట్లు—



౪. మృగ్య



3. గుఱ్ఱపు రౌతు.

అనెడు ప్రతీతులు సమానాధికరణమందు మనకుఁ గలుగుచున్నవి. ఈ ప్రతీతులందు సద్విషయిక బుద్ధి (అనఁగా ఉనికిని గుఱించిన బుద్ధి) యొకటియు, ఘటపటాదివిషయికబుద్ధి మఱియొకటియు రెండుబుద్ధులు గోచరించుచున్నవి. అట్టిప్రతీతులందు సద్బుద్ధి వ్యభిచరింపనిదియు, ఘటపటాదిబుద్ధి వ్యభిచరించునదియు నగుచున్నది. సద్బుద్ధికి విషయము 'సత్తు' అని వాక్యములందే కనఁబడుచున్నది. కావున ఘటపటాదులు 'అసత్తులు' అని ధ్వనించుచున్నవి. సమానాధికరణ మేమనిన, విశేషణవిశేష్యములు రెండును సమానాశ్రయములుగ, లేక అభేదసంబంధములుగ నుండుట అని తాత్పర్యము. ఉ. నీలోత్పలము- నీలాభిన్నమగు ఉత్పలమని యీసమాసపదమునకు శాబ్దబోధ. అటువలెనే 'సన్ ఘటః' అనునచో సదభిన్నమగు ఘటము అని శాబ్దబోధ చేసికోఁదగును. అటువలెనే సమస్తప్రపంచకార్యములును సదభిన్నమగునవి యని తేలుచున్నది. కావున సద్వస్తువునందుఁ గల్పింపఁబడుచున్నవి.

ఈపైవివేచనమునుబట్టి కేవలసద్వస్తు వొకటి కార్యకారణవిభాగవిహీన మగునది మనబుద్ధులకు మనము గుఱుతింపకుండియుఁ దగులుచున్నదనియు, అందువలననే అట్టిసచ్ఛబ్దసమానాధికరణవాక్యప్రయోగములు మనము వాడుచున్నామనియు సిద్ధాంతము సేయఁదగియున్నది.

అయితే, నీలోత్పలము అనుచో నీలపదము గుణవాచి, ఉత్పలపదము గుణివాచి అగుటచేతను, గుణము గుణికంటె భిన్నమగు వస్తు వగుటచేతను, నీలోత్పలపదము ఏకవస్తునిర్దేశక మైనప్పటికిని, దానిలోనిపదములు భిన్నవస్తుగ్రాహకము లగుచున్నవి. అటువలెనే 'సన్ ఘటః, సన్ పటః' అనుపట్టులఁ గాంచఁదగు సమానాధికరణవృత్తిత్వము భిన్నవస్తుగ్రాహకము కాఁగూడదా యని శంక పొడమవచ్చును గాని సరి కాదు. "సో ఽయం రామః" (ఈ కనుపించెడువాఁడు ఆరాముఁడే) అనెడు ప్రతీతియందుఁ గాంచఁదగుసామానాధికరణ్యము భిన్నవస్తుగ్రాహకము కాక ఏకవస్తునిష్ఠం బగుటం బట్టి ముఖ్యార్థమందు సామానాధికరణ్యము(?)నకు నిది యేయుదాహరణము. నీలోత్పలము అనుప్రతీతియందుఁ గాంచఁదగు సామానాధికరణ్యము గుణిగుణుల కగునది. ఇయ్యది గౌణమని (అముఖ్యమని) యొప్పుకోవలెను. 'మృద్ఘటః, మృత్పటః మృద్ధస్తీ' అనెడు ప్రతీతులందుఁ గలసామానాధికరణ్యము సామాన్యవిశేష్యములకు (జాతివ్యక్తులకు) అగునది కాని గుణిగుణులకు అగునది కాదు. కావున ఆప్రతీతులందుఁ గలుగు సామానాధికరణ్యము "సో ఽయం రామః" అనుస్థలమందువలె ముఖ్యార్థమందు ప్రసక్తము గాని 'నీలోత్పల'స్థలమందువలె గౌణార్థమందుఁ గాఁ నేరదు. సామాన్యవిశేష్యముల కగు సామానాధికరణ్యముకూడ గుణిగుణులకువలె గౌణమే యనిన, మృత్తునకు, దానికార్యములగు ఘటశరావాదులకును భేదము, అభేదముకూడ చెప్పవలసియుండును. నీలోత్పలప్రతీతియందువలె ఇట్లు చెప్పుట యసంగతము. ఇటు లగుటంబట్టి 'సన్ ఘటః, సన్ పటః' ఇత్యాదిప్రతీతులందుఁ గలుగు సామానాధికరణ్యము ముఖ్యార్థమందే చెప్పుకోవలెనని స్పష్టమగుచున్నది.

సరియేకాని, 'సన్ ఘటః' అనెడుప్రతీతి ఘటకాలమందు ప్రవర్తించునుగాని ఘటము నష్టము అగుచోఁ బ్రవర్తింప నేరదుకదా! అట్టియెడల నష్టఘటమునందు ఘటబుద్ధితోపాటు సద్విషయికబుద్ధికూడ నశించునని చెప్పవలసియుండును. అట్టిచో ఘటబుద్ధి వ్యభిచరించుచుండ సద్బుద్ధి వ్యభిచరించుట లేదనియు, సర్వత్ర అనుగత మగుచున్నదనియు నెట్లు చెప్పఁదగును అనిన:— ఘటము నశించినను పటాదులు నశింపనికారణముచేతను, పటాదులయందు 'సన్ పటః, సన్ హస్తీ' ఇత్యాది ప్రతీతులు అనుగతములే యగుచున్నందునను సద్బుద్ధి వ్యభిచరించుట లేదని చెప్పవలెను. 'నీలోత్పలమ్, నీలాంబరమ్, నీలాగః' అనెడు ప్రతీతులందు విశేష్యములగు ఉత్పలాదులు నశించినయెడల ఉత్పలాదిబుద్ధి వ్యభిచరించియు, విశేషణమగు నీలశబ్దార్థబుద్ధి వ్యభిచరింపక, ఇతర విశేష్యార్థంబుల గోచరించుచున్నవిధమున 'సన్ ఘటః' అనుప్రతీతియందుఁగల విశేషణీభూత సచ్ఛబ్దార్థబుద్ధి విశేష్యమగు ఘటశబ్దముచే గ్రాహ్యమగు ఘటము నశించినప్పుడు 'సన్ పటః' 'సన్ హస్తీ' ఇత్యాదిప్రతీతులందుఁ గల విశేష్యార్థంబులు గోచరించుచుంటచే వ్యభిచరించుట

లేదనియు, అనువృత్తమే యగుచున్నదనియు నెంచు కోవలెను.

ఘటము నశించినప్పుడు సద్బుద్ధి పటాదులయందు గోచరించుటంజేసి వ్యభిచరించుట లేదని చెప్పినచో ప్పున ఘటబుద్ధికూడ ఘటాంతరములందుఁ గాంచనగును గాన, వ్యభిచరించుట లేదని యేల చెప్పనొల్ల దనిన, ఘటము నశించినప్పుడు పటాది సమస్తకార్యజాతమునందును అను వృత్తి మగుచుండుటచేత, ఘటబుద్ధి ఘటాంతరములందు అనుగతమైనను, పటాది సమస్తకార్యజాతమందును అను వృత్తము కాకపోవుటచే వ్యభిచరించుచున్న దనియే చెప్పవలెను. ఘటము నశించినప్పుడు 'సన్ ఘటః' అనెడు ప్రతీతి పుట్టకపోయినను, 'సన్ పటః, సన్ హస్తీ' ఇత్యాది ప్రతీతులు గలుగుచునేయున్నవి. కాని 'ఘటః, పటః, ఘటో హస్తీ' ఇత్యాది ప్రతీతులు గలుగనేరవు. కాన ఘటబుద్ధి వ్యభిచరించుచున్నదనియే తాత్పర్యము.

ఘటము నష్టము అగునప్పుడు 1 నష్టఘటమునందు సద్బుద్ధి అనుస్యూతము గానేరదు కాన నష్టఘటమునందు సద్బుద్ధి వ్యభిచరించుచున్నదని యేల చెప్పఁగూడదు అనెడుశంక పరిహర్తవ్యము. 'సన్ ఘటః, సన్ పటః' ఇత్యాదిప్రతీతులందు సద్బుద్ధికి విషయము విశేషణీభూత సచ్ఛబ్దార్థము. విశేషణ శబ్దము విశేష్యశబ్ద ముండినఁ బ్రవర్తించును గాని విశేష్యము లేనిచోఁ బ్రవర్తింపదు అని శబ్దశాస్త్ర మేమాత్రము దెలిసినను గోచరింపఁగలదు. ఘటము నశించినప్పుడు విశేష్యమగు ఘటశబ్దముతో పాటు విశేషణమగు సచ్ఛబ్దముకూడ తొలఁగిపోవు చున్నది. సచ్ఛబ్దము తొలఁగిపోయినంతమాత్రమున సచ్ఛబ్దార్థము పోనేర దని వేఱె చెప్పనక్కఱలేదు. కాని అట్టి విశేషణార్థము (సచ్ఛబ్దార్థము) ఘటశబ్దార్థ వ్యంజకముమాత్ర మగుట లేదని చెప్పనగును. కాన, విశేషణార్థము(సచ్ఛబ్దార్థము)నకు విషయముగాఁగలయట్టిసద్బుద్ధి, విశేష్యమగు ఘటశబ్దమునకు విషయమగు ఘటము నశించుటచే ఆఘటమును అభివ్యక్తపఱచుట లేదు అని చెప్పవలెను గాని అసలే నశించిన దనికాని, అందుచే వ్యభిచరించుచున్న దనికాని చెప్పఁదగదు. అట్టి సద్బుద్ధికి విషయము ఘటోపహితమగు సత్తునకు బదులు కేవల సచ్ఛబ్ద వాచ్యమగు బ్రహ్మమే యగుచున్నది కాన వ్యభిచరించుట లేదు అని తాత్పర్యము.

వ్యక్తి యగుఘటము నశించినప్పుడు సర్వవ్యక్తిగతమగు తజ్జాతి నశింపకయు గోచరింపని చందంబున సదితి విశేషణాభివ్యక్తమగు సత్తను బ్రకాశింపఁజేయు ఘటవిశేషము నశించినప్పుడు తద్గతమగు సత్త నశింప లేదనియు, ఘటోపహితమై మాత్రము బుద్ధికి గోచరించుట లేదనియుఁ జెప్పనగును. ఘట మున్నప్పుడు తద్ఘటమందు ఘటోపహితంబుగ నుండు తజ్జాతి ఘటోపలక్షితమై ఘటాంతరకార్యముల గోచరించు చందంబున ఘటకాలమందు తద్ఘటోపహితమై గోచరించు సద్బుద్ధి విషయుక సత్త ఘటోపలక్షితమై సర్వప్రపంచకార్యము లందును గోచరించుచుండును. ఇట్లగుటచే ఘటనాశమైనను, ఘటోపలక్షిత సత్త వ్యభిచరించుట లేదనియు, సర్వగతముగఁ బ్రకాశించుచున్నదనియును, దానంజేసి సద్బుద్ధి ఘటనాశమందును వ్యభిచరించుట లేదనియుఁ దాత్పర్యము.

'నీలోత్పలం' అనుసామానాధికరణ్యమందు నీలత్వ ఉత్పలత్వము లను రెండుపదార్థములు సిద్ధించుటం జేసి 'సన్ ఘటః' ఇత్యాదిసామానాధికరణ్య స్థలము లందుఁగూడ విశేషణ విశేష్య పదవాచ్యంబు లగు సత్తయు, ఘటత్వాదులును అను రెండుపదార్థము లుండవలెను గాన రెండును భావములే కావలెను గాని ఒకటియే భావము (సత్తు) అనియు, ఘటత్వాదులు అభావములు (అసత్తులు) అనియు నెటులు చెప్పనగును అనియును, ఒకటి భావమును, మఱియొకటి అభావమును అగునెడల సమానాధికరణత్వ మెటులు సిద్ధించును అని

1. ఈపూర్వపక్షి తార్కికుఁడు. తార్కికులే అభావముకూడ ఒకపదార్థమనియు, అట్టిఅభావము ప్రాగభావము, ప్రధ్వంసాభావము అని రెండుతెరగులుగ నుండుననియుఁ జెప్పుదురు. నష్టఘటము ప్రధ్వంసాభావము గాన ఈనియమమునుబట్టి యీపూర్వపక్షము పుట్టుచున్నదని తెలియంగనగును.

యును శంకింపఁజనదు. సమానాధికరణ ప్రయోగమందు విశేషణవిశేష్యము లను రెండుపదము లుండవలెను అనెడునియమము ఉన్నది. కాని రెండును భావములే అయియుండవలె ననెడు నియమము లేదు. మరీచిని (ఎండమావులఁ) జూచి 'ఇదమ్ ఉదకమ్' అనునప్పుడును, శుక్తిని జూచి 'ఇదం రజతమ్' అనునప్పుడును, రజ్జువును జూచి 'అయం సర్పః' అనునప్పుడును విశేష్యపద వాచ్యంబులగు ఉదక రజత సర్పములు అభావము లయ్యు (మిథ్యాభూతము లయ్యు) ఆ ప్రతీతులందు సమానాధికరణబుద్ధి యోగ్యమగు చందంబున "సన్ ఘటః, సన్ పటః" ఇత్యాదులయందుఁగూడ విశేష్యార్థములు అభావము లయ్యు, సామానాధికరణ్యము సిద్ధింపఁగలదు అని యెఱుంగవలెను. మరీచ్యాదులందు ఉదకాదులు గల్పింపఁబడుచున్న చందంబున వస్తుజగత్కార్యములును సత్పదార్థమందుఁ గల్పింపఁబడుచున్నవి అని కూడ సిద్ధించుచున్నది.

ఘటాదులయందు మృదాదికారణధర్మంబులగు కాఠిన్యనైల్యాదు లెటులు సూక్ష్మదృష్టికి అనువృత్తములై భాసించుచుండునో, అటులే జగత్కార్యజాతమందుఁ దత్కారణమగు బ్రహ్మయొక్క అవిభిన్నధర్మములగు సత్తాచైతన్యానందంబులు అనువృత్తములై వివేకశాలికి భాసించుచుండును. అనఁగా వివేకి యగువాఁడు సర్వత్ర సిద్ధించు సత్తాచైతన్యానందంబులు బ్రహ్మస్వరూపమని తెలిసికొని, జగత్కార్యములందు అధర్మము లెచ్చ పెచ్చుట మిక్కిలి అభివ్యక్తములో వానియందు బ్రహ్మ నుపాసించుచు, ఉపాసన పక్వమైనకొలఁదినిసమస్తమునందుసత్తాచైతన్యానందంబులే అనుభవించుచు జీవన్ముక్తుఁ డగును అని యెంచవలెను. మఱియు జగజ్జాతమందుఁ గాంచనగు సత్తాచైతన్యానందంబులు సదాత్మస్వరూపమనియు, నామరూపక్రియాకలాపము అసన్మాయాస్వరూపమనియు, మాయాస్వరూపనిష్ఠులు పామరులనియు, సత్స్వరూపనిష్ఠులు పండితులనియు భావింపవలెను.

ఈశ్లోకమందు బ్రహ్మస్వరూపమగు సత్తయొక్కటే ప్రతిపాదింపఁబడినను, ఇతరత్ర 'సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ' 'విజ్ఞానమానందంబ్రహ్మ' ఇత్యాదిశ్రుతుల ననుసరించి సత్తామాత్రముచేతనే చైతన్యానందంబులు గూడ బ్రహ్మస్వరూపంబుగా నెఱుంగనగును. అయితే బ్రహ్మకు మూఁడు స్వరూపంబులు అనిన, కాదు. సత్యజ్ఞానానందంబులు బ్రహ్మను లక్షింపఁజేయు బ్రహ్మాభిన్న(బ్రహ్మ+అభిన్న) ధర్మంబులని యెంచవలెను గాని బ్రహ్మకు మూఁడు స్వరూపముల నొసఁగునవి యని యెంచరాదు.

ఇంతకును గార్యకారణవిభాగసక్తమగు పరిచ్ఛిన్నవస్తువు శబ్దవృత్తులకు గోచరించును, గాని, కార్యకారణవిభాగవిహీనమని పరిష్కరింపఁబడిన సత్పదార్థము శబ్దవృత్తులకు అతీతమనియే చెప్పవలెను. అటులయ్యు శబ్దసహాయము లేకయే మనము వస్తువుల గ్రహింపలేని కారణమున అట్టి యపరిచ్ఛిన్నవస్తువును గ్రహించుటకై యేవేని శబ్దములను మనము వాడుకొనవలసి వచ్చుచున్నది. అట్టి శబ్దములు ఎవరియిష్టము వచ్చినట్లు వారు వాడుకొనిన వస్తుస్ఫురణ మే కాకపోవునేమో అని యెంచి, 'సత్, చిత్, ఆనందము, ఆత్మ, బ్రహ్మ, ఈశ్వరుఁడు' మున్నగు పదములు గ్రహించి శ్రుతులు అట్టి అపరిచ్ఛిన్న వస్తువును నిర్దేశించియున్నవి. శ్రుతులు వాడిన పదము లగుటచే నవి మిగుల సర్థోపపత్తి గలవనియు ఆపదములు బ్రహ్మాఽభిన్నధర్మ ప్రతిపాదకము లనియు నెఱుంగఁదగును. అటులయ్యు నవ్యాని బ్రహ్మవాచకములు గానేరవనియు, బ్రహ్మలక్షకంబులనియు, గ్రాహ్యము. ఈయర్థముచే "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ" అనెడుశ్రుతి ప్రతిపాదించుచున్నది. బ్రహ్మవస్తుస్ఫోరకశక్తి లేనియట్టి పదముల ద్వారా బ్రహ్మను గ్రహింపవలసి వచ్చుచున్నందున శబ్దప్రతీతులవలనఁ గలిగెడు శంకలు మన కనేకములు వొడముచుండును గాన నవి యీపైన వివరించినట్లుగఁ బరిహార్యములు.

కాన దేహాదివిషయప్రపంచమును, శీతోష్ణాదులును, వీనికిఁ గారణమగు మూలప్రకృతియుఁ ద్రికాలములందును ఉండునవి కావు. అనఁగా నియ్యవి అసత్పదార్థములు: వీనికి భావ మనఁబడు పారమార్థికసత్త లేదు; వ్యవహారసత్తమాత్రమే యున్నది. ఇఁక విషయి యగు నాత్మ యన్ననో, సర్వానుగతమును, సర్వాధిష్ఠానమును

...టచేఁ త్రికాలాబాధ్యము- అనఁగా వియదాదియే సత్య...ర్థము; దీనికి అభావము లేదు-అనఁగా ఎప్పుడును, దేని...తను బాధింపఁబడదు; కానఁ బరమార్థసత్త గలది అని ...శ్లోకముయొక్క ప్రథమపాదము ఆస్తికమతము నను...సించి అద్వైతసిద్ధాంతము సేయుచున్నదని తాత్ప...ర్యము.

ఇది యిటు లుండి, యీశ్లోకపాదము నాస్తిక...తము నెటులు ఖండించుచున్నదో తెలిసికొందము గాక! ...హోత్పత్తికిఁ బూర్వమును, దేహనాశానంతరమును ...త్మము కంటె విలక్షణమై, నిత్యమై, సత్యమై, సుఖ...దుఃఖభోక్తయై, పరలోక వార్తయే లేదని విశ్వసించి, ...కోక్తవిధినిషేధ వాక్యములు తమకుఁ బ్రవర్తకములు ...కావని ప్రవర్తించువారు నాస్తికులు. వీరు చార్వాక ...త్రాంతిక వైభాషిక యోగాచార మాధ్యమిక కార్హత ...భేదముచే నాఱుతెగలుగ విభజింపఁబడి యుండిరి. ...ప్పుడు మనసంఘములో మనము గనెడు నాస్తికులు ...డ నీ యాఱుతెగలలో నే యొకతెగకో కాని, ...యాఱింటి సంకరముచేఁ గలుగు భిన్నశాఖలకుఁగాని చెం...వారుగ నెంచఁదగి యుందురు. వీరిలో వీరికి మత...సిద్ధాంత భేదము లనేకము లుండవచ్చును. అవి మన ...ప్పుట ప్రపంచయితవ్యములు గావు. దేహ మున్నంత ...వఱ కైనను గ్రాహకవస్తు వొకటి గోచరించుచున్న...ది వీ రందఱును ఒప్పుకొనక తప్పనది కావున వెనుకఁ ...జెప్పఁబడినది. అట్టి గ్రాహకశక్తి క్షణిక మనుఁడు, దేహ...ముతోఁ బుట్టి దేహముతోఁ బోవునది యనుఁడు, మ...రేమైన ననుఁడు, కాని అట్టి గ్రాహకశక్తి మాత్రము ...ప్రత్యక్షప్రమాణసిద్ధ మని యొప్పుకొనక తప్పదు.

ఇట్టి గ్రాహకశక్తి మహాభూతాది వస్తుసంయోగ...ముచేఁ బుట్టినను, మఱియొకలాగునఁ బుట్టినను, అయ్యది ...మును నట్టి విలక్షణమును, నిత్యమును అని చెప్పక తప్ప...దని వెనుక చెప్పియుంటిని. జ్ఞానము క్షణికమైనను, గ్రాహక...శక్తి యనంబడు సంస్కారపరంపరలు నిత్యములు అని ...చెప్పకతప్పదు అని యిదివఱలోఁ జెప్పియుంటిని. ఇట్టి ...గ్రాహకశక్తి దేహోత్పత్తికిఁ బూర్వము లేదనియు, దేహోత్పత్తితోఁ బుట్టునదనియు, దేహముతో నశించు ననియుఁ జెప్పుటకు వీలు లేదని భగవంతుఁ డీశ్లోకమున సిద్ధాంతము చేయుచున్నాఁడు. ఎటులనః___అసత్తునకు భావము గలుగనేరదు అనుటచే జీవించుకాలము నందు సత్తుగఁ బ్రకాశించు గ్రాహకశక్తి దేహమునకుఁ బూర్వము అసత్తు గాదు, అనఁగా అసలే లేనిది కాదు అనియు, సత్తునకు అభావము గలుగనేరదు అనుటచే సత్తు అగునట్టి గ్రాహకశక్తి దేహము మృతి నొందిన పిదప అసత్తు గానేరదు, అనఁగా నశింపనేరదు అనియు నీశ్లోక ప్రథమపాదార్థముగా నీప్రకరణమున గ్రహింపనగును. ఈసిద్ధాంతమునకు ఉపపత్తి యెటులో సంగ్రహముగాఁ దెలిపెదను.

భూతాది వస్తుసంయోగముచే అప్పటికప్పుడు గ్రాహకశక్తి గలుగుచుండుట ప్రత్యక్షానుమాన ప్రమాణ సిద్ధంబు కాదు. విద్యుచ్ఛక్తి (electricity), ఉష్ణశక్తి (heat) మున్నగుశక్తులు వస్తుసంయోగముచేఁ గలుగు చున్నవి కాని యిట్టి చేతనము మనకుఁ గల గ్రాహకశక్తి వంటివి కావు. ఇది గాక, శక్తికూడ నొకపదార్థమే యగుటచే నది పుట్టుటకుఁ గారణ ముండియే తీరవలెను అనియుఁ, గారణమునందు లేనిధర్మము కార్యమునందు వ్యక్తము గానేర దనియు భౌతికశాస్త్రజ్ఞులు ఒప్పు కొనుచున్నారు. అటు లగుచో, గ్రాహకశక్తికిఁ గారణ మెయ్యది? అట్టికారణ మేధర్మముగలది? యని వితర్కింప నాకారణము చైతన్య మని చెప్పక తప్పదు. అటు లగు చో, అట్టి గ్రాహకశక్తి అచేతనమగు దేహమువలనఁ బుట్టు నది గాని, దేహముతో నశించునది గాని యనుటకు వీలు లేదు. కార్యము కారణముయొక్క అన్యథాభావ మని వెనుక చెప్పఁబడియున్నది గదా! కాన గ్రాహకశక్తి చైతన్యముయొక్క అన్యథాభావ మనియు, దేహముతోఁ బుట్టి దేహముతో నశించునది కాదనియు, ఇటు లగు టచేఁ ద్రికాలాబాధ్య మనియుఁ దేలుచున్నది.

ఇది యిటు లుండఁ, సమష్టిప్రపంచమును, వ్యష్టి దేహంబును దానిదానియుత్పత్తికిఁ బూర్వము లేవు అనెడువాదము కూడ దుర్బరము. అటు లగునెడల,

శూన్యమునుండి ప్రపంచమును, దేహమును బుట్టుచున్నవని చెప్పవలెను. ఇటు లనుటయుఁ బ్రత్యక్షప్రమాణవిరుద్ధమును, కారణము లేకయే కార్యము పుట్టనేరదు అనెడు తర్కశాస్త్రనియమమునకు ద్రోహమును అగుచున్నది. కాన నీరెంటికిని కారణము లుండియే తీరవలెను. అటు లగుచో వీనికిఁ గారణ మెద్ది యని విచారించిన, సచ్ఛబ్దవాచ్యమగు పరమాత్మయే యని వెనుక చర్చించినదానినిబట్టి సిద్ధాంతము గాఁగలదు. కాన నీశ్లోకపాదము ఈవిధంబున నాస్తికవాదమును ఖండించుచున్నదని తెలియంగవలెను.

ఈసందర్భమున మఱియొకమాట చెప్పవలసియున్నది. కారణము అని పైన ననేకపర్యాయములు వాడఁబడినది. అట్టి కారణము ఒకపక్షమున రెండువిధములని తెలియంగఁదగును — నిమిత్తకారణము, ఉపాదానకారణము అని. ఘటోత్పత్తికిఁ గులాలుఁడు నిమిత్తకారణ మనియు, మృత్తు ఉపాదాన మనియు మీ రెఱుంగనిది కాదు. అట్టి యుపాదానము తిరిగి రెండువిధములు — పరిణామోపాదానము, వివర్తోపాదానము అని. ఈవిషయ మిదివఱలోఁ జెప్పఁబడినది. కారణము లేకయే కార్యము పుట్టనేరదు అనిన నిమిత్తోపాదానకారణములు లేనిది కార్యము ఉత్పత్తి కానేరదు అని అవధరింపఁదగును. ప్రపంచకార్యమునకు మాయోపాధి యగు నీశ్వరుఁడు వివర్తోపాదాన మనియు నిదివఱలో స్థిరీకరింపఁబడినది. ఇఁక నిమిత్తకారణ మెవరు అని ప్రశ్నింపవలెను. అదియును ఈశ్వరుఁడేయని తెలుసుకోఁదగును. అటులు గానిచో నీశ్వరుఁడు పరిచ్ఛిన్నుఁడును, అనిత్యుఁడును గావలసివచ్చును. కాన నిమిత్తోపాదనములు రెండును ఈశ్వరుఁడేయని "యతో వా ఇమాని భూతాని జాయంతే" ఇత్యాదిశ్రుతులు చాటుచున్నవి. ఈయర్థముకూడ పైనవివరించిన వాక్యార్థమునుబట్టి యీశ్లోకతాత్పర్యముగ నెఱుంగఁదగును.

ఈసదసద్వివేచనము భగవంతుఁడగు శ్రీకృష్ణుఁడు గాక మఱియొక్కరైన గుఱుతించిరా యనిన, తత్త్వదర్శులున్నారని భగవంతుఁడే యీశ్లోక ద్వితీయపాదమునఁ జెప్పుచున్నాఁడు. తచ్ఛబ్దముయొక్క భావార్థకము తత్త్వము లేక తత్త్వము. తచ్ఛబ్దము సర్వనామము, అనఁగా సమస్తపదార్థములను నిర్దేశింపఁగల నామవాచకము. ఇయ్యది యుష్మత్, అస్మత్ మున్నగు సర్వనామములవంటిది కాదు. ఈపదములు 'నీవు, నేను' అనువ్యక్తులనే సూచించును. ఇఁక 'తత్' అనుపదము అన్నివస్తువులను నిర్దేశింపఁగలదు. కాన దానికే సర్వనామ మనుపదము అన్వర్థము. 'సర్వంఖల్విదం బ్రహ్మ' అనెడు శ్రుతినిబట్టియు, పైన వివరించిన దానిని బట్టియు సర్వము బ్రహ్మము అని తెలిసికోఁబడుచున్నది కాన తచ్ఛబ్దము సర్వమగు బ్రహ్మను నిర్దేశించునది యని రూఢమగుచున్నది. ఇటు లనుటచే తత్త్వమనిన బ్రహ్మభావము, అనఁగా బ్రహ్మయొక్క యాథార్థ్యము అని తాత్పర్యము. అట్టి బ్రహ్మయాథార్థ్యము సత్యజ్ఞానానంతస్వరూపమే. ఇఁకఁ దత్త్వదర్శులు అనిన బ్రహ్మ సత్యజ్ఞానానంతస్వరూప మని సాక్షాదనుభవంబున దర్శించినవారు; బ్రహ్మవేత్తలు అని యర్థము. ఇట్టి బ్రహ్మవేత్తలు జగన్మిథ్యాత్వమును బూర్వమే తిలకించి యుందురుకాన వీరు సదసత్తులయథాస్వరూపమును నిర్ణయించినవారని యీశ్లోకము నివేదించుచున్నది.

మనుజుని సూక్ష్మపరిశీలనము హెచ్చినకొలంది వాని ప్రాముఖ్యము హెచ్చుచుండుట మన కనుభవసిద్ధమే. చదువుకొననివారు చదువుకొనినవారిని, చదువుకొనినవారు తమకంటె నెక్కువ చదువుకొనినవారిని, సమానముగఁ జదువుకొనినవారు తమలో తీక్ష్ణమేధావులను బ్రమాణముగ నెంచుకొని ప్రవర్తించుచుందురు. కారణ మేమనిన తమకంటె వారు సూక్ష్మవస్తుదృష్టి గలవారని విశ్వసించుటయే. సర్వగతమగు బ్రహ్మము సూక్ష్మాత్ సూక్ష్మతమము. అట్టిబ్రహ్మమును దిలకించు బ్రహ్మవేత్తలు సూక్ష్మజ్ఞతములు. 'సర్వజ్ఞం బ్రహ్మ' అనుశ్రుతినిబట్టి బ్రహ్మము సర్వజ్ఞము అగుటచేతను, సర్వము బ్రహ్మమే అగుటచేతను బ్రహ్మవేత్తలు సర్వజ్ఞులు అనెడు అన్వర్థాభిధానము గలవారు. కాన నట్టిసూక్ష్మజ్ఞతములు అగు సర్వజ్ఞులదృష్టి పరమప్రమాణము గాన వారియనుభవము ననుసరించి 'బ్రహ్మ సత్యం జగన్మిథ్యా' అని గ్రహించి, శోకమోహములవీడి, శీతోష్ణాదుల సహించి, మోక్షార్థత సంపాదించుటకై యథోక్తకర్మభక్తిజ్ఞానవిధుల నాచరింపఁదగునని యీశ్లోకముయొక్క ఉత్తరార్థ తాత్పర్యము.

ఆంధ్రక్షేత్రములు

పం. వెంకటసుబ్బయ్య శాస్త్రిగారు

అమరావతి

ఓయమరావతీ, సవినయుండను; నేఁ డిటు వేలవోలె నే
దో యొక నామమాత్రమున నుండిన నిన్ గని మ్రొక్కవెట్టి పో
నై యరుదెంచితిన్; వడి బయల్పఱుపంగదె తావకీన పూ
ర్వాయత వైభవమ్ముఁ గనులారఁ గనుంగొను వేడ్క పుట్టెడున్.

ఎల్లరకు ముక్తి గలదని వెల్లడించు - బౌద్ధమతమునఁ గల సూత్రఫక్కి - నీ వి
శాలవీథులు; గొందిలో జగము లిన్ని-పాసఁగరానివి గద ముక్తిఁ బొందు టెట్లు?

బుద్ధహృదయమ్మువలె స్వచ్ఛములును మిపుల-స్నిగ్ధములు నైన శశికాంత శిలలు ప్రాచ్య
శిల్పవిద్యా సరస్వతీ స్మృతు లివెల్ల - వ్యక్తపఱచెడు నీపూర్వవైభవమ్ము.

ఇది బుద్ధాకృతి యట్టె శాంతరస మొందేఁ గల్గినన్ దాని కి
య్యది గా నొప్ప జనుః స్థల మ్మిచట నాయంతస్సు రంజిల్లుచు
న్నది, యద్దంబునఁ దన్నుఁ దాను గని యానందంబునన్ మున్గ నె
మ్మదితోఁ జేతులుఁ గాళ్లు దుర్బలము లై మానున్ స్వకీయక్రియల్.

అమరేశ్వరస్వామి

ఓహో స్వామి, యుమాసతీవ్యతికరం బూహించి నేత్రాగ్నిచే
దేహంబున్ జెడఁగాల్చి మన్మథుని శాంతిం బొంద కేతెంచి ప్ర
త్యూహంబున్ గలిగించికొంటి విటు రుద్రున్ నిన్నుఁ జాముండికా
బాహాబంధములందు నామె నయనప్రాగల్భ్యముల్ ద్రోసెనే?

ఆకాశంబులఁ దాఁక నీ వయితి లోకాధీశుఁ డన్యుండు లేఁ
డా కల్యాణమయస్వరూప, వృథ యేనా విఘ్న వంచున్ నరో

జాకీర్ణాననుఁ డంచు భిన్నగతులన్ బ్రార్థించుటల్? సర్వమున్
నీకుం జెందున? లోకముల్ సతతమున్ నీలోననే నిల్చునా?

క్లేశంబున్ దిగమ్రింగి నన్వివిధకేళీలోలుఁ గావించి దీ
ర్ఘాశాంతంబులఁ బట్టి పోవు హృదయ వ్యాపారముల్ మాన్చి శి
క్షాశక్తిం గని నే నిటుల్ నిలిచినన్ జ్ఞానమ్మసంపూర్ణ వి
ద్యాశంకన్ ననుఁ ద్రోయుచున్నది జగద్భద్రంకరా, శంకరా!

చేతుల్ మోడ్చి నమస్కరించితిని నాచిత్తంబు నిండింపవే
శీతాంశూజ్జ్వల దుత్తమాంగ, బుధులన్ సేవించెదన్ నీమత
ఖ్యాతిన్ మెచ్చక దుష్టతంత్రములపాలై బూడిదన్ బ్రుంగు నా
జాతిన్ నేను సముద్ధరించెదను భిక్షాభోగినై, భోగినై.

చాముండికా దేవి

'ప్రాతశ్శైభిదిశాముఖి' యనుచు సంభావింపనా? 'సాగర
స్రోతః పూరసుతామణీ' యనుచుఁ గే ల్జోడింపనా? 'సౌమ్యతా
స్ఫీత ఖ్యాతకళావతీ' యనుచు సంశ్లేషింపనా? లేక, చ
ట్రాతింబోలి యిటన్ నిలంబడి నినున్ రంజిల్లఁ గీర్తింపనా?.

సౌందర్యం బిట రూపుగొన్న దని యెంచన్ బోలుఁ గాదేని నే
యందూ బంధమునం దగుల్కొనిన వాఁడై నిల్చు నీరీతిఁ దా
నెందుం బోవుట మాని శంకరుఁడు తల్లీ, దాననే కల్గెనో
మందప్రజ్ఞత సర్వభూతములకున్ మత్తిల్లెనో లోకముల్.

తా నానేత్ర హుతాశనాంచల శిఖాదగ్ధోద్ధతానంగుఁ డీ
శానుం డెచ్చటి నుండి వచ్చెఁ దనకున్ శ్యామాతను శ్రీ దిదృ
క్షానైసర్గిక వాంఛ లా నవ నయస్కాంతంబు చెంతన్ క్షణం
బేనిన్ నిల్వఁగ నేర్చునే యినుము స్వోద్వృత్తిన్ విడంబించుచున్.

అమ్మా, నిన్నును నాకసంబునకుఁ దానై యొప్పు నీయయ్యనున్
సమ్మోదంబునఁ దెచ్చి శిల్పి యెవఁడో సంధించె నాంధ్రావనీ

ధమ్మిల్ల ప్రసవాభిరామమగు నీస్థానమ్మునన్ నిర్ఝరా
ఘమ్ముల్ చుట్టును జేరియుండఁగ ముదాకారమ్ములై చండికా!

నీకర్ణాంత విలోచనమ్ములు కృపాసిక్తమ్ము లానంద మా
ధ్వీకందమ్ములు ప్రాకృపించినవి నన్ వేసారు లీచోటికిన్
నాకున్ బుద్ధివికాసముం గొలుపు చైనన్ సర్వధాత్రీ, నమో
వాకంబుల్ పచరింతు నీవలని తాత్పర్యం బసంపూర్ణమే.

ఈ సంపూర్ణము గాని జ్ఞానము నన్నున్ హేరాళ దుఃఖమ్ము పా
లే సేయున్ సుఖదాయి గాదు, ప్రజ 'హీహీ' యంచు నన్నుం బరీ
హాసంబుల్ వలుకంగఁ జొచ్చు నటు లేలా? తల్లి, బాధాకరం
బౌ సింహాసనమైనఁ గోరను మదీయాకాంత గుర్తింపవే!

రాజా వెంకటాద్రినాయుడు

అధిగతజ్ఞాని యాచరిత్రానభిజ్ఞ-నంసభాగములందు వ్రేలాడుఁ బూర్వ
శిల్ప విద్యా సరస్వతీ స్మృతులు పాడు-చేసినట్టి వినింద కైశికము నట్లు.

ఇతని వితరణధార లహీనవాహి-నులు గడిగి వేయుచున్నవి నలుపులెల్ల
సురలు గొనియాడ మాటలు దొరకవేమొ?-మెదలకున్నారు మూలల నొదిఁగి యొదిఁగి.

ఓయి నృప, మర్మమునఁ జెంచునాయకులను-సంహరించిన చంద్రహాసంబు నీది
మూల్గుచున్నది యొఱ నిప్డు పూర్ణత ప్త-చిత్తమట్లు నీ కెందును క్షేమ మగునె?

కృష్ణా నది

కృష్ణవేణీ, జగము లెన్నిరీతు లయి న-శించినను నీవుమాత్రము చెక్కు-చెదర
వ్రాల్లపై నూల్లుపడిన నే ములికిపడని-కరణములమీఁద నొకరాగి కాసు పడునె?

నీ వెడపాట నీవు గమనింతువు లోకము లాలకించునో
యూవల నాలకింపవో? రయంబునఁ బోవుచు నుండు నీకుఁ జిం
తావహమైనఁగా దది మహానది, ధర్మ వినిశ్చితాత్మ దీ
ప్తా వృతబుద్ధి నిన్ నిలుపఁ జాలునె స్తోత్రములున్ వినిందలున్.

అయినను గొంచె మాఁగుము దయారసరూపిణి, నిన్ను నాశ్రయిం
చి యొకట సర్వలోకముల శ్రీలఁ దనర్చిన యాంధ్రజాతి నేఁ
డయునయహీన మై బ్రదుకు నక్కటా, పూర్వకథాస్మృతుల్ భరం
బయి హృదయావగుంఠనము లావలఁ ద్రోసి హితంబు సెప్పవో?

కొనియాడవే మహాక్రూరమౌ భూతహింసనము నింద్యం బన్న జ్ఞానమహిమ
ప్రకటింపవే రామరాజ్యంబునంబలెఁ బ్రజలు సుఖించినప్పటి విధంబు
కీర్తింపవే రణక్రీడ శత్రుశిరంబు లాటబంతులు చేసినట్టి నేర్పు
వెలయింపవే దేవతలకు సైతము శర-ణ్యములైన యాపట్టణముల సొబగు
పొనుఁగు వడిన నిప్పుపోలిక నుండిన-యుగయుగములనాఁటి మగతనమ్ము
గలిగినంతవట్టు వెలిఁగింపవే తల్లి - కెరటములను విసరి కృష్ణవేణి!

దారిద్ర్యమా

రాయసం శేషగిరిరావు గారు

"మమ్ము చూచిన జగము ద్వారమ్ము మూయు
మాటలాడిన వినరు మాపాటు కనరు
ఏడ్చినన్ మమ్ము నోదార్ప కేగుచుండు
సోకగూడని నీచూపు సోకినంత
సంతసంబేదొ మాకుగా నంతరించె
సౌఖ్యమన్ననొ మము చూచి సాగిపోయె
భాగ్యదేవత భయపడి పారిపోయె
అసలు ప్రాణమె నిర్గంధకుసుమమయ్యె
అరయ క్షుద్బాధ మాయింట నతిథియయ్యె
కష్టదేవత మా గృహకాంతయయ్యె
ఆపలేనట్టి పెనుదుఃఖ మాప్తుడయ్యె
అశ్రుధారలె మాకయ్యె నార్జనములు
సేవ్యమగునట్టి మానవజీవయాత్ర
కుటిల దుర్గంధసంయుక్త కూపమయ్యె
సర్వఫలసస్య యుక్తమౌ జగతి యంత
శూన్యగృహమయ్యె—
ఇంకేటిసుఖము మాకు."

గుడిపాటి వెంకటచలంగారి 'శశిరేఖ'

అరికపల్లి లక్ష్మీనరసింహారావు గారు, బి. ఏ., బి. యల్.

ఇప్పుడు అమలులో వున్న కొత్త తెలుగుభాషను ప్రస్తుతపు ఉన్నతస్థితికి తెచ్చుటకు ప్రయత్నించిన యువకులలో శ్రీ వెంకటచలంగారు ముఖ్యులు. పూర్వంనుంచీ వున్న భాషను, భావాలను కూడా వీరు మార్చి తమ యథాశక్తిని మన ఆంధ్రభాషను ఉద్ధరించుచున్నారు. అందుకు వీరు వందనీయులు. వీరు అప్పుడప్పుడు వ్రాసేకథలను నేనతిశ్రద్ధగా చదివేవాణ్ని. అందు కనే నాకు వీరియందు కొంత అభిమానము. వీరు వ్రాసిన 'శశిరేఖ' అను నవలను ఈమధ్య నామిత్రుడొకడు నాకు యివ్వగా చదువుట తటస్థించినది. మార్కెటులో వున్న యితరనవలలవలె దీనినికూడా ఒకమారు చూచి పారేయడానికి వీలు లేదు. ఇట్టిభాషాభిమానులు ఒక 'సెట్టుపర్పసు'తో వ్రాసినగ్రంథములను పరిశీలించి అందలి మంచిచెడ్డలను విమర్శిస్తూ వుంటే భాషకూడా వృద్ధిఅవుతుంది. ఆంధ్రభాషకు చిరపరిచితులగు శ్రీ శివశంకరశాస్త్రిగారు యీగ్రంథమునకు ఒక చిన్న ఉపోద్ఘాతమును వ్రాసినారు. మామూలు ఉపోద్ఘాతాలవలె గాక యిందు సాహిత్యానికి సంబంధించిన సమస్యలు కొన్ని చర్చించబడినవి. శ్రీశాస్త్రిగారి అభిప్రాయములకు ఎంతేని విలువ గలదు. అందువలన వాటిని మనము తృణీకరించ రాదు. అయినను ఆఅభిప్రాయములు ఎంతవరకు సమంజసములో మనము పరిశీలించవచ్చును. ఆపీఠికలో వారు నిరూపించినవాంశము లేమనగా—

(1) "సాహిత్యానికి నీతితో పనిలే" దంటారు వీరు. మొత్తంమీద యిది కొంచెము పంచదారపూయని కొయినామాత్రే మింగడానికి. "రమణీయార్థము ప్రతిపాదించడమే కావ్యోద్దేశ్య" మంటారు. ఎవరిరమణీయార్థము? నారమణీయార్థమని నాయిష్టము వచ్చిన అశ్లీలములు వ్రాస్తే చదువరులు సహిస్తారా? అయితే, "కథావ్యపదేశంతో కావ్యము నీతినే బోధించవలె" నని వీరే ఒప్పుకుంటూ, "అవినీతిని కూడా వర్ణించవచ్చు" నంటారు. బోధించడానికి, వర్ణించడానికి ఏదో భేదము తీస్తున్నారు. బాగా విచారిస్తే యీరెంటికి యెక్కువ తేడా కనుపించదు—అంటే విభజీయుటకు వీలు లేదని నా తాత్పర్యము. గ్రంథములోని పాత్రలనోటిలోనుంచి వచ్చినభావాలు ఒక్కొక్కప్పుడు వర్ణించడ మవుతుంది; మరొక్కప్పుడవ్వే బోధించడ మవుతుంది. 'చింతామణి' అందరిని బుట్టలో వేసుకోడం చూస్తే వర్ణించడములాగ కనుపడుతుంది; వైరాగ్యమబ్బినతరువాత తాను చేసినపనులు చాలా

శప్పని సాటిస్తే బోధించడ మైనది. "వరవిక్రయం"లో మొదట పాత్ర లందరూ మనసంఘం లోని దురాచారాలను వర్ణిస్తారు. పెళ్లికూతురు నూతిలో పడేటప్పుడు చెప్పే సోలిలోక్వీ చూస్తే బోధించడ మైనది. కాబట్టి వర్ణనే బోధ నవుతుంది. బోధనకూడా వర్ణ నవుతుంది పరిస్థితులను బట్టి. యీగ్రంథములో మాత్రము ముఖ్యముగా వర్ణనబోధనలకు పరస్పరభేదము లేకుండా గ్రంథకర్తగారు వర్ణనరూపేణా బోధన చేస్తున్నారు. ఇట్టిది తగునో తగదో చదువరులే ఊహించుకుందురుగాక.

(2) "దేశకాల పాత్రలనుబట్టి నీతులు మారుతి" వంటారు. ఇట్లనుకోటం కేవలము పొరబాటని మనవిచేస్తున్నాను. ముఖ్యనీతులు యెల్లప్పుడూ ఒక్కటే. బైబిలులో చెప్పిన Ten Commandments కు ఎప్పుడైనా చలన ముంటుందా?

(3) ప్రేమ శాశ్వతమా చంచలమా అనే ప్రశ్నకు "చంచలమే" నని శ్రీశాస్త్రి గారు జబా బిచ్చినారు. "ఒకరిమీద అనురాగము నడలినతరువాత యింకొకరిమీద ప్రసరించవచ్చు"నట-అంటే ప్రేమ అనేది ఒకరు తప్పితే మరియొకరు, వారు పోతే వేరొకరు-యీవిధంగా యెంతమంది మీదపడితే అంత మందిమీదికి ప్రవహిస్తుం దన్నమాట, తుమ్మెదగనుక ఒకపువ్వులోని రసమును తాగి వేరొక పువ్వుమీదికి పోయినట్లు. అప్పుడు దీనికి 'ప్రేమ' అనే గొప్పపేరు తగుతుందా? అటువంటిది Fancy అవుతుంది. ఇంకా ముదిరితే Lust అంటారు. ప్రేమ అంటే "ఆత్మను ఆత్మను కలిపి కుట్టే దార" మని ఒకకవి వర్ణించాడు. అంతకంటే ఏనుగులుకూడా తెంపలేని గట్టి యినుపగొలుసంటె బాగుంటుందేమో, కొంచెము మోటుగా వున్నప్పటికీ.

మిగతాహాంశములు సందర్భానుసారంగా చర్చిస్తూ అసలుకథకు వద్దాము. ఈనవలకు కథానాయకు డెవ్వడో చెప్ప వీలు లేకపోయి నప్పటికి కథానాయికమాత్రము శశిరేఖ. మన కథాప్రారంభమునాటికి యీమెకు పదునారేండ్ల వయస్సు. నిండుజవ్వని. చక్కనిచుక్క. యీమెకు వివాహమైన పదియవ ఏటికిపూర్వమే రామారావనే ఆయనను ప్రేమించినదట. ఆయన సీమకు వెళ్లుటచేత యీమె ప్రేమ కృష్ణారావు అనే "బాలుని" వైపునకు తిరిగినది. కాని అతనియొక్క అవస్థ చూస్తే బాలునికంటె పెద్దవాడని తోస్తుంది. ఒక నాటి సాయంకాలము ఆయిద్దరు పరస్పరాలింగనమువలన కలిగిన ఆనందమును అనుభవించి ముందు కర్తవ్య మాలోచించి, ఎవరిదారిని వారు వెడతారు. ఇంటికి వెళ్లినతోడనే శశి తన అమ్మతో తనకు రామారావునే భర్తగా చేయమంటే చేయక, వేరొకని కిచ్చి వివాహము చేసినందున తన అయిష్టమును చూపుతూ, తనకు ప్రస్తుతపు భర్తతో కార్యం చెయ్యకూడదని పట్టుబట్టి, నాలుగుచివాట్లు తిని చివరకు కార్యంరోజున చేసినముస్తా

బుత్తో అర్ధరాత్రివేళ కృష్ణారావువద్దకు పరుగెత్తుకుని రాగా, యిద్దరూ కలిసి ఆరాత్రే యెక్కడకో లేచిపోతారు.

కృష్ణారావుయొక్క స్నేహితుడైన సుందరరావుతో కొంతకాల ముంటారు వీరిద్దరు. సుందరరావు ఆప్రాల్లో డాక్టరు; డబ్బు బాగా సంపాదిస్తున్నాడు. అప్పుడే కథానాయకురాలికి అతని సుగుణములు, సంపాదన చూస్తే కొంచెము ఆమెయొక్క దృష్టి అతనివైపు తిరుగుంది. మరి మూడు సంవత్సరములకు కృష్ణుడు, శశిరేఖ తమస్వగ్రామము చేరుతారు. సూదిలో దారమల్లే సుందరరావు కూడా యిక్కడకు డాక్టరుగా తయారు. ఒకనాడు యీముగ్గురు కలిసి పడవషికారు వెళ్లగా డాక్టరుగారు ఫిడేలు వాయిస్తారు. దానితో శశి ఒళ్లు మరచిపోతుంది. ఈఆనందములో కృష్ణుడు నిద్రపోతాడు. ఇదే సమయమని డాక్టరుగారు తమ కాంపైను మొదలుపెడతారు. డబ్బు, సంగీతము, ప్రేమ మున్నగుకబుర్లమధ్య డాక్టరుగారు ఆమెకు సంగీతమునేర్పుతా నని ఆమె చెయ్యి పట్టుకుంటే ఆకంగారులో పడవ ఒరుగుతుంది. శశి నీళ్ళలోపడుతుంది. మొగవాళ్లిద్దరు ఆమెకు శుశ్రూష చేస్తారు కాని ఆమెకు జ్వరము వస్తుంది. ఉదారపురుషులగు డాక్టరుగారు ఆమెను తనఆసుపత్రిలో ఇన్ పేషంటుగా తీసుకుంటారు. ఇంతలో అదృష్టవశాత్తుకృష్ణుని తల్లికి విషజ్వరము తగిలినందున శశి యింటికి వెళ్లుటకు వీలుకాక మరికొన్నిరోజులు ఆసుపత్రిలోనే గడపడం తటస్థిస్తుంది. ఏవో మాటలసందర్భములో డాక్టరుగారు ఆమె చేతులను ముద్దు పెట్టుకుంటారు. శశికి లోపల యిష్టము; పైకి కష్టము. ఆమెయొక్క ఆందోళనను గ్రంథకర్తగారు నాలుగుపేజీలలో వర్ణిస్తారు. పర్యవసానమేమంటే, ముట్టుకుంటే మూర్ఛపోతుందేమో అని ప్రేమించేకృష్ణుడు గాక ఆమెను "నలిపి" "జీవనరసమును పిండి" "తీవ్రమగు ఉద్రేకముతో బలముగల భయంకర మోహముచే" తన్ను తృప్తిచేయ గలుగు డాక్టరుగారే కావలసివస్తారామెకు. ఎట్లాగైతే నేమి? ఒకనాటిరాత్రి తన యిష్టమువచ్చినట్లు డాక్టరుగారితో గడిపి ఆమరునాడే కృష్ణుని మొఖాన్ని ఒకవుత్తరము పారేసి కథానాయకురాలు డాక్టరుగారితో లేచిపోతుంది.

కొంతకాలానికి ఆసుపత్రిలో అనాటిరాత్రి చూపిన ప్రేమంతా మరచి పోతారు డాక్టరుగారు. మున్నాళ్ల ముచ్చట తీరగానే డాక్టరుగారికి శశిరేఖంటే విసుగు పుడుతుంది. యీమెకుకూడా ఆయనయందు ప్రేమ నడలింది. యథాప్రకారం డాక్టరుగారిని వదిలేసి లేచిపోదామని (యీసారి ఆమెకు తోడుయెవ్వరూ దొరకలేదు, పాపము!)రయిలుకు బయలుదేరగా దారిలో కాంభోట్లను నాతడు సైంధవుడులాగ అడ్డపడతాడు. తిరిగి యింటికి వస్తూంది డాక్టరుగారిబండి బోర్లపడి ఆయనకు గాయ

ములు తగులతవి. ఆయనకు మందివ్వడానికి పెద్దడాక్టరుగారు ఇంకొకరు దాపరిస్తారు. ఇంక దాచడమెందుకు? పెళ్లికాకపూర్వము తాను ప్రేమించిన రామారావే యీపెద్ద డాక్టరు. మొదట దూరపుతళుకు చూపులు; తరువాత సరసవల్లాపములు; క్రమంగా అనురాగం పర్పడుతుంది వీరిద్దరకు. రామారావుచెయ్యి సుందరరావు చేతికంటె ఎక్కువలావుగా వుంటుంది; ఎక్కువబలముకూడా ఉంది. ఇవన్నీ చూచి సుందరరావుకు కొక్కుపెట్టి రామారావుతో లేచిపోయి ఆయన కుదర్చిన ఒక యింటిలో వుంటుంది.

ప్రతిరోజు సాయంత్రమూ రామారావూ శశీ షికారువెళ్లేవారు ఎంతో ఆనందంగా కాలము గడుపుతారు. ఒకనాటిసాయంత్రము రామారావు వస్తానన్న సమయానికి మళ్లీ సుందరరావు ప్రత్యక్షమయి తనతో తిరిగి రమ్మని బతిమాలి నయానా భయానా చెప్పగా తన మామూలుప్రకారం రామారావు కీ క్రింది వుత్తరమును వ్రాసి వెడుతుంది. "రామా! నన్ను క్షమించు సుందరరావును వదలలేను. ......నన్ను మరచిపో."

సుందరరావు, శశిరేఖ మద్రాసులో కొంత కాలము గడుపుతారు. యథాప్రకారం ఎడ చూపులు, పెడచూపులు. ఇది సహించలేక శశిరేఖ ఒకరాత్రి యింటిలోనుంచి పారిపోతుండగా నవజీవనదాసు అనే ఆయన ఈమెను సోదరభావముతో ఆదరిస్తాడు;ఎంతోమర్యాద చేస్తాడు. చిత్రమేమిటంటే ఆ మెసడతచూడగా ఈయనకు కూడా చివరకు మోహము కలుగుతుంది, అంతా అయిపోయినాక శశిరేఖమీద. ఇక్కడ పాత రామారావును తిరిగి కలుసుకుంటుంది. ఆయన తన్ను పెళ్లి చేసుకోమంటాడు. పెళ్లిమీద ఒకపెద్దలెక్చరిచ్చి పెళ్లిచేసుకో నంటుంది. కారణమేమిటంటే(ఇది మనము జాగ్రత్తగా గమనించవలెను.) రామారావు మీద ఇప్పుడు ఉండే ప్రేమ ఎల్లకాలంవుంటుందని గారంటీ లేకపోవడమేట. ఇదీఈమెకు తెలిసినప్రేమ. మామూలుగా మనము చూసే ష్లట్టింగుకు దీనికీ ఏమైన తేడాఉందేమో చూడండి. పెళ్లిచేసుకోకపోతే తనకు అక్కర్లేదని రామారావు వెళ్లగా శశిరేఖ బహుశా (ఈ లాగు మనము ఆలోచించుకోవలెను) ఆత్మహత్య చేసుకుని రంగములోనుండి విరమిస్తుంది.

శ్రీశివశంకరశాస్త్రిగారు ఈకథానాయిక "సామాన్యస్త్రీ"కాక "ప్రేమైకజీవిని" కాబట్టి "తనకు యోగ్యుడైన ప్రియునికోసము ఎట్టి త్యాగమైనా చేసిం" దంటారు. ఇట్లు వ్రాయడము కొంచెము నగుబాటుగా వుంటుందని మనవి చేస్తున్నాను. ఈ విపరీతాభిప్రాయంతో ఎంతమంది ఏకీభవిస్తారో శ్రీశాస్త్రిగారికి తెలియకపోలే దనుకుంటాను. గ్రంథకర్తగారియందు తమకున్న అభిమానముచొప్పున ఇట్టివిమర్శన చేసినారు గాని, నిష్పక్షపాతంగా ఇచ్చిన అభిప్రాయంమాత్రం కాదని తోస్తుంది. సామాన్యస్త్రీకంటె అధ

మము అనేఅర్థములో ఈమె సామాన్యస్త్రీ కాదంటే నేనుకూడా ఒప్పుకుంటాను. ఈమె యొక్క జీవితములో నిశ్చలము, అకళంకము ఐనట్టి దివ్యస్వరూపముగల ప్రేమ ఎక్కడైనా కనుపడుతుందేమో ఆలోచించండి. కృష్ణారావుతో వుంటూ డాక్టరు సుందరరావుమీదికి యిష్టము పోనిచ్చుట ప్రేమలక్షణమేనా? ఈసుందరరావుగారిని వదిలి అంతకంటె బలాఢ్యుడైన రామారావుతో వెళ్ళడానికికూడా "ప్రేమ" అనే పవిత్రనామము పెట్టవచ్చునా? పవిత్రమైన ప్రేమ ఈమెకు తెలియనే తెలియదు. గ్రంథకర్తగారి ఉద్దేశము అట్టి ఆదర్శకమైన ప్రేమమూర్తిని నిరూపించుటయే అయియుండవచ్చును; కాని అయ్యవార్లంగారిని చేయబోతే ఏదో అయినట్లుంది. కృష్ణారావును ప్రేమించకపూర్వము రామారావును ప్రేమించెను. కృష్ణారావును ప్రేమిస్తూ సుందరరావువైపు దృష్టి మరల్చెను. రామారావుపైని వలపు చూపుతూ రెండవపర్యాయము సుందరరావుతో కాలము గడిపెను. దీన్నిబట్టి చూస్తే ఈమెయొక్క ప్రేమకు అర్థమేమనగా, తనకు ఎవరు ఏసమయానికి కంటికింపుగా వుంటే అప్పుడు వానితో కాలము గడపడమే తప్ప స్వార్థమును మరచి శాశ్వతమైన పవిత్రప్రేమను ఈమె ఎరుగనే ఎరుగదు. ఈమెకున్నది 'మియర్ అనిమల్ పాషన్'-చదువరులు మన్నింతురుగాక.

ఇంక, ఈమె చేసిన స్వార్థత్యాగమేమి? ఆత్మహత్య చేసుకోడం కాబోలు! తననడతను, తన ఆదర్శములను, తన అభిప్రాయములను మెచ్చుకొని తన్ను దగ్గరకు చేరదీయు 'నా' అనేపురుషుడొక్కడైనను లేనప్పుడు చేయు కర్తవ్యమేమి? తాను ఆత్మహత్య చేసుకొని శశిరేఖ తనకే కాక సంఘమున కంతకును ఉపకారము చేసిందంటే అతిశయోక్తి కాదు. ఇది కొంచెము కఠినాభిప్రాయమైనప్పటికి వెలిపుచ్చక తప్పదు. ప్రేమ యను పేరుతో ఈమె చూపిన దంతయు విలాసచేష్టలు కాని వేరు కాదు. సోదరివలె ఆదరించిన నవజీవనదాసు గారికికూడా ఈమెనడత అసహ్యము కలిగించినది.

అన్నిటికంటె విపరీతమేమనగా, శ్రీశాస్త్రిగారు ఈమెను "స్వధర్మప్రకారము నిస్సంశయముగా పతివ్రత" అనుట. దీనినిబట్టి చూడగా పీఠిక వ్రాయుటలో శ్రీశాస్త్రిగారి ఉద్దేశము ఈగ్రంథమును, తద్రీత్యా గ్రంథకర్తను తమ అభిమానముచొప్పున పొగడుటయే కాని, సరిఅయిన విమర్శచేయుట కాదని తేలుతుంది. పతే లేనప్పుడు పతివ్రత ఎట్లగును? ఏపతిని ఈమె పూజించి గౌరవించినది? ఈమె పతివ్రత అవునో కాదో ఒక్కమాటవల్ల తెలుస్తుంది. ఈమెను ప్రథమంలో పెళ్ళిచేసుకొన్న నిర్భాగ్యుడు చనిపోయినట్లు తెలియగానే ఈమె అంటుంది: "పోయినావా ఆఖరికి పాపం!...ఈజుట్టూ గిట్టూ నొరిగేవాళ్ళగావును. అప్పుడు నువ్వు వచ్చి పెళ్ళిచేసుకొంటానని జుట్టు పెంచితే ఈపాటికి సీతల

మల్లె వుండేది నాతలకూడా." (అంటే బెంగాల్యుక్రాంతంగుల్లాగన్నమాట). ఏమాత్రము Sentiment ఉన్న అడదైనా ఇట్లాంటిమాటలు అనగల్గదేమో ఆలోచించండి. నలుగురి విటకాండ్రతో తిరిగి ఏవరిఉప్పు తిన్నప్పుడు వారి కనుకూలముగా ఉండడము పతివ్రతాత్వమా? "స్వధర్మప్రకార" మంటే ఏమిటి? స్వధర్మమునకు లోకముయొక్క మంచిచెడ్డలతో నిమిత్తము లేదు. సంఘముయొక్క ఉద్దేశాలు అసలే పాటించ నక్కరలేదు. ఎవరికి తోచేపనులు వారు చేస్తే వారు స్వధర్మమును నిర్వహించుకొనినట్లే. వాడిధర్మ మది కాబట్టి దినదినము వేనవేలు మేకలగొంతుకలు పరపర కోయు కటికవాడు, తనధర్మప్రకారం కూనీలు, దొంగతనాలు చేసేవారు, అదే ప్రకారం యువకుల కొంపలు తీయు వారకాంతలు, అందరుకూడా ఈసూత్రముప్రకారము వందనీయు లవుతా రన్నమాట. సర్వము తెలిసిన శ్రీశాస్త్రిగారు ఇట్టిఅభిప్రాయములను వెలిపుచ్చుట శోచనీయము.

ప్రేమతత్వాన్ని నిరూపించడానికి సాహసికుడైన ఈగ్రంథకర్త ప్రయత్నించినా డంటారు శ్రీశాస్త్రిగారు. వాస్తవముగా ఈగ్రంథకర్త కడుసాహసికుడు; నిర్భయుడు. ఇంచుమించుగా "లోకముతోటి మన కేటి" అనే బాపతు. అయితే అట్టిప్రేమతత్వాన్ని నిరూపించడానికి ఈగ్రంథకర్తగారు చేసిన ప్రయత్నములు ఫలించినవా? ముమ్మాటికిని లేదని నామనవి. అసలు అక్కడ ప్రేమ ఉంటేగా, దానితత్వము బయలుపడడానికి?

ఈగ్రంథముయొక్క శైలి చాలామందికి కష్టము కలిగిస్తుందని శ్రీశాస్త్రిగారు అభిప్రాయపడుతున్నారు. నేనుమాత్ర మీఅభిప్రాయమును ఆమోదించలేను. మీదుమిక్కిలి ఈగ్రంథమునకు వన్నె తెచ్చేది దీనిశైలి అని నానిశ్చితాభిప్రాయము. ఈగ్రంథకర్తగారు స్వచ్ఛమైన వాడుకభాషలో ధారాళంగా వ్రాస్తారు. ఇప్పుడు పండితులు, పామరులు కూడా మెచ్చుకునేది వాడుకభాషే నని చెప్పవచ్చును. అర్థములేని పదగుంభన తక్కువ. భావాలు గొప్పవి—నూతనోద్దేశాలు. ఒక్కొక్కప్పుడు భావోద్రేకంలో భావముకొరకు భాషను బలియిచ్చినా, మొత్తంమీద గ్రంథకర్తగారి శైలి సజీవముగా ఉంటూ, సర్వజనాదరణీయముగా వుంటుం దనుటలో సందేహము లేదు.

ఈ గ్రంథముయొక్క ముఖ్యోద్దేశము అనాదినుంచి అన్ని దేశాలలోను వున్న వివాహములను నిరసించడములాగ కనపడుతుంది. పెళ్లి అనేపద్ధతి ఒప్పుకోరు గ్రంథకర్తగారు, కథానాయిక కూడాను. పెళ్లి చేసిన పాపమేమిటనగా భార్యాభర్తలను శాశ్వతముగా బంధించుతుందట. మనధర్మశాస్త్రప్రకారము పెళ్లి అనేది ఒకమతవిధి. ఇతరదేశాలలోనికిమల్లే కేవలము కంట్రాక్టుకాదు. అయితే ఇతరదేశాలలో భార్యాభర్తలకు అనుకూలము లేకపోతే ఒకరి నొకరు త్యజించవచ్చును. కాని

మన దేశంలో అట్టిఅవకాశాలు తక్కువ. మతం మాట అటుంచినా, పరస్పరారోగ్యానికైనా పెళ్లి అనేది ముఖ్యావసరము. సంసారపతం గా ఆలోచిస్తే అటువంటి Sacred కట్టుబాటు ఒకటి ఉంటేనే కాని వీలులేదని తేలుతుంది. ఏది ఎట్లున్నను మన దేశంలోమాత్రము అటు వంటిది ఒక్కటి ఉండితీరవలెను. పెళ్లి లేక పోతే న్యాయశాస్త్రమునకు సంబంధించినఇబ్బం ది ఒకటి కలుగుతుంది. ఇతర దేశాలలో ఉన్న "Your children, my children and our children" అనేవారి హక్కులు స్థిరపరచుట కష్టము. అప్పుడు న్యాయశాస్త్రము కూడా మారవలసి వస్తుంది. మన హిందూధర్మశాస్త్రము పూర్వ పురుషులు వ్రాసినగ్రంథములపైన ఆధారపడి యుండగా, దానిని ఇప్పుడు మార్చుట కష్ట తరము. ప్రస్తుతపు వివాహములలో అనేక దురాచారా లున్నా యన్నమాట నిజము. అటువంటివి పోగొట్టుటకుప్రయత్నించాలిగాని కేవలము వివాహముఅనే Institution ఉండు టకు వీలులేదంటే మాత్రము సంఘము ఒప్పు కోదు.

ఈగ్రంథము నీతిబాహ్యము కాదని శ్రీ శాస్త్రిగారు వాదిస్తారు. 'నీతి' విషయమై వీరి కున్న అభిప్రాయములు మొదటనే తెలియ జేసినాను. ఇట్టి సందర్భములలో ఈగ్రంథము నీతిబాహ్యము అవునో కాదో చదువరులే ఊహించుకుందురు గాక. ఇట్టి గ్రంథములు ఆంగ్లభాషలో హైనాల్డునకవి వ్రాసినాడుకాని సదరు గ్రంథములలో సంఘములలో ప్రబలి యున్న అవినీతులను చూపిస్తూ, వాటిని ఆకవి నిరసిస్తాడు. కాని ఈగ్రంథములో అట్టిది కన పడదు. మీదుమిక్కిలి అవి ఆమోదించ బడి నవి. పైన ఉదాహరించిన ఆంగ్లగ్రంథములలో కనపడేపాత్రలు Victims of circumstances అవుతారు. అందువల్ల మనకు వారలయందు సానుభూతి ఉంటుంది. ఈగ్రంథములోని కథా నాయకులు అట్లుగాక తాను చేసిన పను లన్నియు కళ్లు తెరచి స్వబుద్ధితో కావాలని చేస్తున్నందువల్ల ఈమెయందు చదువరులకు సానుభూతిగాని సదభిప్రాయముగాని కలుగుట కష్టము.

ఇంకొక్కమాటతో ముగిస్తాను. శ్రీ వెం కటచలంగారు ఇట్టి గ్రంథమును వ్రాసి చదు వరులు గట్టిగా ఆలోచించుటకు కొన్ని సమస్య లను చూపించినారు. ఆసమస్యలు సాహిత్య మునకు, సంఘమునకు చెందినవై యున్నందు వల్ల ఆయావిషయములో అభిమానము గల వారాయాసమస్యలను నిష్పక్షపాతబుద్ధితో పరిశీలించి, అవి ఎంతవరకు ఆచరణీయమో, ఎంతవరకు ఆదర్శప్రాయమో ఆలోచించి, ఆ ప్రకారము నడుచుకొనుట కర్తవ్యము. ఈ గ్రంథము సామాన్య నవలలవలె చదివి పార వేయతగినది కాదు. చదివినకొలది సమస్యలు హెచ్చవుతవి. ఆలోచనకు తగు ఆహారము ఇచ్చిన ఈ గ్రంథకర్తగారు ఎంతయు వంద నీయులు.

రేరాణి

కలువలపల్లి రంగనాథశాస్త్రి గారు

పెక్కు రకాల తావులను బెక్కు రకంబుల వన్నెలం గడున్
ముక్కును గన్నులం దనుపు పూవులు పెక్కు రకంబు లుండినన్
చక్కని వన్నెఁ గాంచు నెఱజాణవు నీవెకదా! గుణజ్ఞులం
జొక్కఁగఁ జేయు నీవలపు సొంపు వహవ్వ రె! రేయిరాణిరో!

మాలతియు మల్లికయు నవమాలికయును-వలపు పెంపును వన్నెచిన్నెలు గడించి
పుడమి సరసులఁ దనియించు ప్రౌఢవైన-నిన్ను బోలంగ నేర్తురే యెన్నఁ జైన.

లలితాకారము కల్మి బల్వలపునన్ లాలించు నైపుణ్యమున్,
విలసన్మంజుల మూర్తియుం గలిగి యుద్వేల ప్రమోదంబు తజ్
జ్ఞులకుం బాయక కూర్తు సర్వసుమన శ్చూడామణీ, త్వద్గుణ
జ్ఞులు శ్లాఘింతురు వేయినోళ్ల భళి యంచున్ రాత్రిరాణీ, నినున్.

పురుడే పూవులుఁ గావు నీకు సుమనః పుంజావతంసంబ, నీ
సరు వే పువ్వుల కబ్బ దింత నిజ మవ్యాజస్థితిన్ మించి రా
తిరి రాణించెడి రాణి వై వెలయు నీతీ రెన్న మాబోంట్లకుం
దరమా? నీసరువంబు నీవలపు సంస్తవ్యంబు లింకేటికిన్.

ధీరోత్తంసులు నిన్ను డాసి మది నెంతేఁ గాంతు రామోద మ
య్యారే, మేదిని సారెసారెకును నీ యామోదమున్ మెచ్చుచున్
రేరాణీ, నినువంటి మంజులగుణ శ్రీకం గనుంగొంటిమే
ధీరశ్లాఘ్యవు, నీకు నీవె జగతిన్ దీటొందు లే దెవ్వరున్.

పవ లెప్పట్టునఁ గానరావు నిజసౌభాగ్యంబు దైవార, గా
రవ శీలంబుల పెంపుఁ గాచుచు నసూర్యంపశ్య వౌటన్ నిస
ర్గవికాసంబున మంచితావులను రేరాణీ, మహాధీరులన్
భవదుత్కృష్ట గుణంబులం దనుపు దెన్నన్ మాపులన్ బాపురే.

దవ్వులకున్ బుగుల్కొనెడు తావిని మూర్కొని యబ్బ మొంది పేః
పువ్వులతావియో యనుచు ముగ్ధులు సైతముఁ గౌతుకంబునం
జివ్వున నీదు చెంగటికిఁ జేరి నినుం గన నెంతు రింక నీ
మవ్వపురూపు నీవలచుమాదిరిఁ గాంచిన నెన్నకుందురే.

మూఁత దీసిన యత్తరుబుడ్డి మాడ్కి--గమ్మగమ్మన వలచు నీకమ్మతావి
నెల్లకడల బుగుల్కొల్పి యెల్లరకును-హాయి గల్గించుచున్నావు రేయిరాణీ!

నీమేలితావుల నెమకుచు నిను డాయ వచ్చు నెంతటి చక్రవర్తియైన
నేమారుమూలనో యీవున్న నినుఁ జూడ రాఁ గోరు నెంతటి రాణియైన
నపరిమితామోద మంద నీచెంతకుఁ జనుదెంచు నెంతటి ధనికుఁడైనఁ
బ్రచురసువాసనావశ్యుఁడై నీదండఁ జేరుఁ బో యెంతటి ధీరుఁడైనఁ
దమిని దతి వేచి నీదుపాదముల దరికి - నింక సామాన్యుఁ డేతెంచు టేమి వింత
నోము లెన్నేనిఁ దొలివేఁన నోఁచి యింత-ప్రాభవంబును గంటి! రేరాణి, భళిర.

టాటోటుంబువు లెన్ని పాట్లు పడినన్ డంబంబు లెంతేనియున్
నీటుం గోటును జూపినన్ మఱియు నెన్నే వన్నెలన్ మించినన్
నీటన్ మున్గియుఁ గానలం దపము లెన్నే సల్పినన్ రాణి, నీ
సాటిం గాంచఁగ లేవు నిక్క-మముగన్ జన్మాంతరం బొందినన్

పలుతెగల పూలు పుడమిన్ - వెలసిన 'నైట్‌క్వీ' ననియెడు పే రొక నీకే
చెలువారుఁ బుష్పరత్నమ, - కలుగునె సుకృతులకుఁ బోలె ఖ్యాతి పెరలకున్?

కమ్మతావులకుం బట్టుఁ గొమ్మ లనుచుఁ - బలుమరున్ నిక్కు-విరుల దర్పంబు నణఁచి
జగతిఁ దనరు రాతిరిరాణి సకలపుష్ప - దర్పదమని యన్ బిరు దొందఁ దగుదు వీవు.

అసదురూపుఁ దాల్చి యాడంబరము లేక - వింతతావి వెల్లివిరియఁ జేసి
మంచి పువ్వనంగ మహి నింతు రేరాణి - మేలుమేలు సుమతి మెలఁగు నిటులు.

సవతు లేనట్టి సౌభాగ్య సౌరభముల - మంచిపేరును గడియించి మనుచు నున్న
నీదు ప్రఖ్యాతి లొఁటికి రాదు రాదు - తనరు రేరాణి, యాచంద్రతారకముగ.

కాలభైరవుడు



సోమన్నారాజుల వేంకటరామమూర్తి గారు

౧

పాలిసెంటు ఫిర్కా రివిన్యూ ఇన్స్పెక్టరు వెంకట సుబ్బయ్య వెల్నాటి బ్రాహ్మణుడు. నలభై యేళ్లు వయస్సు కలిగి పిండనీకి వగందూరంలో వున్నాడు. తేరగా ధర్మ పిండాలు బజాయించి దమ్మిడీ ఖర్చు లేకుండా తీరం రాళ్లన్నీ మూటకట్టి పెట్లోపారేసే వుద్యోగాల్లో రివిన్యూ ఇన్స్పెక్టరీ చాలా ఉన్నతిస్థానం వహించిందని వాడుక అయినప్పటికీ మన వెంకటసుబ్బయ్య న్యాయంగా దేవునిమొగం చూసి కాలక్షేపం చెయ్యవలసినవాడే కాని, ఒక రేరు రెయ్యి అయినా యితర్లని నోరు విడిచి అడగవలసిన మనిషి కాడు. ఇంతకూ—ఏం పదిమంది మందున్నారు గనుకనా అతని కుటుంబంలో? ఒక్కగా నొక్క పున్నమ్మ అనే ఆడపిల్ల. ఆపిల్లని పన్నెండేండ్ల క్రిందట కని వెంకటసుబ్బయ్యగారి భార్య గతించింది. పంచప్రాణాలూ ఈ పన్నెండేండ్ల పిల్లమీద పెట్టుకుని వుంటాడు మన వెంకటసుబ్బయ్య. మూలకారణం అందుకు తోడు పరమకోపం, దుర్వాస మహాముని అవతారమెత్తి పుట్టాడేమో అనిపిస్తుంది. ప్రపంచంలో అతని కంటబడిన ప్రతిమనుష్యుడూ, జంతువూ కూడా అతని కెప్పుడో ఒకప్పుడు కోపం కలిగించే వుంటారు. ఆ గ్రామంలో అన్నింటికంటే ముఖ్యంగా అతగాడికి ఎక్కువకోపం (భయం కూడాను) కలిగించినది ఒక వల్ల కుక్క. ఒకనాటావల్ల కుక్క మన రివిన్యూ ఇన్స్పెక్టరు గారు చెరువుగట్టుక్రింద బాహ్యానికి వెళ్లి వస్తూంటే వెంటబడి ఆ దబుల్ పన్నా బ్రాహ్మణ్ని చెరువుచుట్టూ మూడు మార్లు త్రిప్పి, యింటివద్ద మూడు చెంబుల మంచినీళ్లు తాగించింది. అప్పట్నుంచీ వలుసరు తిలార్లు కర్రలు పట్టుకొని అగల్ బగల్ వదుస్తేనేకాని ఆయన సాయంత్రం గమ్యం కదలడు. ఆ దెబ్బతోటి ఇప్పటికీ ఎక్కడైనా గట్టిగా కుక్క మొరిగిందంటే ఠక్కున దడ్చి పోతాడు పాపం!

అవూరు కరణంపేరు శేషయ్య. వెల్నాటిబ్రాహ్మణుడే. వయస్సు పందొమ్మిది సంవత్సరాలుంటుంది. ఒక్కపలచగా, ఎర్రగా తొగరుదారంలాగుంటాడు. అతడు సాధారణంగా వెంకటసుబ్బయ్యగారింటే వుంటూ తల్లి లేని పున్నమ్మకూ, కాలంమళ్లిన వెంకటసుబ్బయ్యకూ పనుల్లో తోడ్పాటూవుంటాడు. శేషయ్యకి వెనకా ముందూ ఎవళ్లూ లేరు. "ఏక్ నిరంజన్" అని ఏకాకి; అయితే నేకాకి అని కుతలాపనూ కొట్టి పారేయడానికి వీల్లేదు. ఎందుచేతనంటరా? అతగాడికి పున్నమ్మమీద చెప్ప వీల్లేనంత స్నేహం, అభిమానం, ప్రేమూన్నూ. సాయంకాలం తవకీ తండ్రికీ భియ్యంపడే? పున్నమ్మ తీరుబాటుగా పెరట్లో జామిచెట్టువద్దకు కూర్చొని శేషయ్య చెప్పే కథలన్నీ సరదాగా వింటుంది. "అనగనగా ఒక రాజకుమారుడు; వేటకెళ్లాడు; అడవిలో ఒక పెద్దపొద; ఆ పొదలో ఒక చక్కని పన్నెండేండ్ల బాల"—అని యేమో కథలు చెప్తూవుంటే పున్నమ్మ మనస్సులో అమితమైన సిగ్గు ఉదయించి, ఆసిగ్గు పున్నమ్మయొక్క నీలం ముక్కల్లాంటి కళ్లలోంచి పైకి బలవంతంగా పొంగి వచ్చేటప్పుడు, ఆ వేగానికి కనురెప్పలూరికే అల్లాడిపోవడం; చెక్కు టెర్రబారడం; మొగం క్రిందికి వంగడం; పెదవులమీద చిరునవ్వు; గుండెలు దడదడ—ఇన్నిలక్షణాలు ఒక్కమాటు కనిపించేవి. ఇవన్నీ చూసి మన శేషయ్య చిన్నప్పట్నుంచీ పున్నమ్మని చేరదీసి హాస్యంమాటలు చెప్తూ, ఆమె నవ్వినప్పుడు ముద్దెట్టుకుంటూ వుండిన అలవాటు పోవ, ఇప్పుడుకూడా (అంటే 'ఇప్పుడుకూడా'

అని మనం అనుకుంటున్నాము కాని, అసలు వాళ్లు పెద్ద వాళ్లయిన సంగతి వాళ్లకి తెలియదు; ముద్దులూ మురిపాలున్నూ.

౩

ఆ వేళ కార్తిక సోమవారం. రివిన్యూ ఇన్స్పెక్టరు వెంకటసుబ్బయ్య పగలల్లా ఉపవాసంచేసి సాయంత్రం ఈశ్వరాలయంలోకి పూజకి బయల్దేరాడు. నల్లకుక్క భయంచేత దండపాణులైన యిద్దరు తలారులు వెంట నడిచారు. వెంకటసుబ్బయ్య ఆవేళ సాయింత్రం కరణం శేషయ్యని భోజనానికి పిలిచాడు. నక్షత్రదర్శనం అయినవరకూ వెంకటసుబ్బయ్య శివాలయంలోంచి రాడని తెలిసివుండి పున్నమ్మతో నిరాటంకంగా యిష్టాగోష్ఠి కోసమని శేషయ్య పెరటివేపునుంచి వేంచేశాడు. తనతండ్రి తిరిగిరావడానికింకా అరగంట వ్యవధి వుందని పున్నమ్మ మడితోనే తీరుబాటుగా కూర్చుంది. శేషయ్య కూడా మడికట్టుకునే వచ్చాడు. ఇన్స్పెక్టరుగారు యింట్లో లేరు. ఇక నేముంది? శేషయ్య పున్నమ్మలిద్దరూ ఒకరి



నొకరు చేరువన్నారు. స్నేహబంధాలు వాళ్లని దగ్గరగా యీడుస్తూంటే వాళ్లతరమా మరి? అయస్కాంతం, యినుమూ రెండు చేరుకోవడం స్వభావమే కాదండీ? ఏదైనా ఒక కథ చెప్పమని మామూలుగా పున్నమ్మ శేషయ్యని అడిగింది కాని, కథ పూర్తికావడానికి అవకాశం లేదని చెప్పి, శేషయ్య సంభాషణని స్వవిషయంలోకి దింపాడు.

* * * *

పున్నమ్మ—"సరేకాని, నువ్వు కథల్లో 'ప్రేమ, ప్రేమించడం' అంటావుకదా, అదేమిటో సరిగా చెప్పవూ?"

శేషయ్య—"మహా గట్టిప్రశ్న వేశావు. 'ప్రేమ' అంటే నాకూ సరిగ్గా బోధపడడం లేదు కాని, అయినా నావుద్దేశం మనవిచేస్తాను, వినుమరి. ఇప్పుడు మనమిద్దరం వున్నాం కదా; నువ్వు దూరంగావుండి నాకంటికి కనిపించకుండా వున్నప్పుడు నిన్ను చూడాల్ని నామనస్సులో వుంటుంది; తరువాత మీయింటికి వచ్చి నీదర్శనం చేసుకున్నాననుకో—అప్పుడు నువ్వు మాటలాడుతే వినాలని వుంటుంది; ఏదైనా సందర్భంలో నువ్వు నీకోకిలకంఠంతో నాతో ఒక్కమాటాడి, నీకడకండ్ల చూపొక్కటి నామీద పారేశే సరికి నావొళ్లు ఝల్లుమంటుంది; పట్టరాని సంతోషము కలుగుతుంది; పరుగెత్తి జల్లి నీబుగ్గలు ముద్దెట్టుకుందామా అని కోరిక కలుగుతుంది; అయితే మీనాయన వున్నారని మళ్లీ మనస్సు వెనక్కి లాగుతుంది; అప్పుడు మళ్లీ యిదంతా తలుచుకుంటే సిగ్గు కలుగుతుంది.

పూర్వకవుల గ్రంథాల్లో చెప్పిన 'ప్రేమ' అంటే ఇదే అని నే ననుకుంటున్నాను. ఈ మాసంప్రకారం చూస్తే నేను నిన్ను ప్రేమించానన్నమాట. నామాట చెప్పానుకదా! నువ్వుకూడా నీసంగతి నేనిప్పుడు చెప్పిన సూత్రంప్రకారం తైపారువేసి చెప్పుమరి."

పున్నమ్మ—"నాకూ నీముఖం చూడ్డామనీ, నీమాటలు విందామని వుంటుందికాని ఒక్కొక్కప్పుడు సిగ్గు వేస్తూంటుంది భయముమాత్రం లేదు. స్నేహంపట్ల భయమెందుకూ? అయితే సిగ్గుమాత్రం ఎందుకుండాల్నా అని సందేహం."

శేషయ్య—"సిగ్గు—సిగ్గు ప్రేమయొక్క లక్షణమే. మన ప్రేమలో సిగ్గు తప్పకుండా కలిసివుంటుంది. ప్రేమా, సిగ్గూ నువ్వు వేరువేరుగా భావిస్తున్నావు—అదీ పొరబాటు. అవి రెండూ వేరుకావు. ఒకదాన్నొకటి అనుసరించుకునే వుంటాయి.........సరే, ఈమాటకేం గాని, మీనాన్న నీకోసం ఎన్నో సంబంధాలు చూస్తున్నారు. దేవుడిదయవల్లనూ, నా అదృష్టంవల్లనూ యింతవరకూ అవన్నీ తేలిపోతూవచ్చాయి. నువ్వు పెద్దదా

ని పడతావు. ఇలాగు ముసుగులో గుద్దులాట వ్యవహారం ఎన్నాళ్లు! అంచేత, రేపు ఎలాగైనా తెగించి మీనా యన్ని మనవివాహం విషయమై కదప దలుచుకున్నాను."

పున్నమ్మ—"అమ్మయ్యో! అతగానికి చాలా కోపం. ఒకవేళ కోపంవచ్చి ఆయన నిన్నేమైనా అంటే నా ప్రాణానికి బాధిస్తుంది. అది కాకుండా, మాతండ్రి ఇవాళపొద్దున్నుంచీ చాలాకోపంగా వున్నాడు. రేపేమో తాసిల్దారుగారు వస్తున్నారుట. చిన్నప్పుడు ఆయనా, మాతండ్రీ కలిసి చదువుకొన్నారుట, అలాంటి తాసిల్దారు మొన్న దేనికో ఉద్యోగరీత్యామాతండ్రిని ఆక్షేపించాడుట. అప్పట్నుంచీ మాతండ్రి అతగాడిమీద కారాలూ మిరియాలు నూరుతున్నాడు. అతడూ కోపిష్టేనట. వీళ్లిద్దరూ రేపు కలుస్తే ఏం కొంప మునుగుతుందోనని హడలుగా వుంది. అలాంటిసమయంలో అగ్గిమీద గుగ్గిలం వేసినట్టు నువ్వుగానీ పెళ్లిమాట ఎత్తావంటే చెప్పేదేముంది!"

శేషయ్య—"తాసిల్దారుగారు రేపు వస్తున్నారా!..."

పున్నమ్మ—"ఔను. ఆయన భార్యతో కూడా వస్తున్నారుట. భార్యాభర్తల వ్యవహారాల విషయంలో మన కథ మొదటిపాఠం." (ఇద్దరు నవ్వుదురు)

వాళ్ల సంభాషణ అంతమైంది. అందుకుకారణం వీధి వైపునుంచి వెంకటసుబ్బయ్య రావడమే. భోజనాల దగ్గిర వెంకటసుబ్బయ్య ప్రస్తుతాంశము లేమీ మాట్లాడ కుండా, మొగం ధుమధుమలాడుతూ పెట్టి, ఎవరినో వుద్దేశించి "పింఛనుకి పెద్దమైన ముండాకొడుకుని నాకు తప్పు లెంచుతాడేం? ముసలాడయినాడు వాడికిమాత్రం తెలియదూ, కష్టసుఖాలు? చిన్నప్పుడు తోటలో రేగుపళ్లు ఎత్తుకొచ్చి పారిపోతుంటే తోటవాడు వెంటబెట్టి చావ గొట్టాడు—చలపతి రావు—'చల్లన్న—మజ్జిగన్న—పెరుగన్న' అని వుడికించేవాళ్లం; చేటికాలానికి 'ఆన్, పీస్' అని నాలుగింగిలీషుముక్కలు రావడంచేత తాసిల్దారీ అయిందని వీడి కిప్పుడు కళ్లు నెత్తికెక్కాయి. ఎందుకూ! రేపుంది కథ; నాలుగూ మొగం ఎదుట ఝాడిస్తాను" అని మరునాడు రావలసివున్న తహసీల్దారు చలపతిరావుపంతుల్ని వుద్దేశించి మాట్లాడుతూ తొందరగా నాలుగు మెతుకులు వేసుకొని దిగ్గున లేచాడు. శేషయ్య ఆలోచనలో మునిగివున్నాడు. పున్నమ్మ తండ్రివాలకం అంతా చూసి, రేపు రావలసివున్న ప్రళయాని కిదంతా ఉపోద్ఘాతం అనుకుని, ఆ శేషాంకంతో భగవంతుడా అనుకుంటూ, భయపడడం తప్ప మరేమీ చెయ్యలేక పూరుకుంది.

3

మంగళవారంనాడు ప్రొద్దున్న యేడుగంటలు కావచ్చింది. పాలిపెంట వూరి పొలిమేర తూర్పువైపు నుంచి ఒక రెండెడ్లబండీ గ్రామాన్ని సమీపిస్తూంది. బండీ ముందువెనకల యిద్దరు బిళ్లజవానులు నడుస్తున్నారు. బండీ తహసీల్దారు చలపతిరావు పంతులుగారిదే. చెరువు గట్టు దగ్గిర కొచ్చాక బండీ నిలబడింది. అందులోంచి చలపతిరావుపంతులు దిగాడు. స్థూలకాయుడు కాబట్టి 'దిగాడు' అనేకంటె దూకిపడ్డాడంటే సరిపోతుంది. చెరువుదగ్గర కాలకృత్యాలు తీర్చుకుని వూళ్లోకి వెళ్లదామని అతని ఉద్దేశం కాబోలును— కప్పుకొన్న ఎర్రశాలువ బండిలోకి విసిరి, బండిని రివిన్యూఇన్స్పెక్టరు వెంకటసుబ్బయ్య యింటికి తోలమన్నాడు. బండి సాగుతూంది. అదివరకు అప్పుడే అరగంటనుంచి చెరువు గట్టున కూర్చొని దంతధావనం చేసుకుంటూవున్న కరణం శేషయ్య ఇదంతా కనిపెడుతున్నాడు. ఆ తాలూకాకి క్రొత్తగా వచ్చిన తహసీల్దారు చలపతిరావుపంతులుగారి దర్శనం అతడింకా చేసుకోలేదు. బాహ్యానికని బండిదిగిన తహసీల్దారు కెదురుగావెళ్లి దండంపెట్టి నిలబడడాని కరణాని కిష్టంలేక, మించిపోయిన దేముందని, వూళ్లోనే సావకాశంగా చూడ్దామనుకున్నాడు.

చలపతిరావు పంతులు ప్రాతఃకృత్యాలు తీర్చుకుని ఊరుమొగమై బయల్దేరాడు. చెరువుగట్టుమీద వేప చెట్టుదగ్గిరకొచ్చే-సరికి-ఏం చెప్పమూ! - పాపం!- నల్ల కుక్క- అరిచివెంటపడింది. బ్రాహ్మడు అసలే స్థూలకాయుడు; పరుగెత్తలేడు. పోనీ ఒకవేళ పరుగెత్తుదామా అనుకుందుకి అంతా యేమనుకుంటారో అని భయం. పోనీ, కుక్కని

కొంచెం భయ పెడుదామని వెనక్కి తిరిగేసరికి నల్లని శరీరం, నిప్పులురాల్తూన్న కళ్లు, నోట్లోంచి వ్రేల్లాడుతూ ఎఱ్ఱని నాలుకతో, కోరలుచూపుతూ మెరుస్తూ పెనుభూతం లాగు, నాలుగుకాళ్ల మీదవున్న కాళికాదేవి అపరావ తారమే మో అన్నట్టుగా ఆ బ్రాహ్మడిదృష్టిలో పడేసరికి



"పాపం !-నల్ల కుక్క అతనివెంటపడింది."

కుక్కని అవమాయింపడం సంగతి అలావుండగా, అత గాడికే ప్రాణా లెగిరి పోయాయి. నల్ల కుక్క కోపానికి తానే గురిఅయిన సంగతి తెలుసుకున్నాడు: అందులో యేమీసందేహం లేదు. అకారణంగా ఆ శునకానికి తన మీద అంత ఆగ్రహం యెందుకు రావాలో ఆలోచింపడా నికి అతనికి కాలం లేదు. ఆలోచించినా ఏంలాభం? చేపలు ఈదడానికీ, పక్షులు ఎగరడానికీ ఏమికారణమో, ఆనల్ల కుక్క స్థూలకాయుల్ని వెంబడించడానికీ అదేకారణం. దాని స్వభావమది. కుక్కబుద్ధికి సబబేమిటి? స్థూలకాయు లైతేచాలు: పాచిపెంట నల్లకుక్క వెంటపడిం దన్న మాటే. అంచేతేకదూ మునిసిపల్ శానిటరీ ఇన్స్పెక్టరు వెంకట సుబ్బయ్య ఇవాళనరకూ తనశరీరాన్ని లావుగా సృష్టించి నందుకు బ్రహ్మదేవుణ్ణి మనస్సులో తిట్టుకుంటూ వుండడం!

ఏమైతే నేమి—చలపతిరావు పంతులు కుక్క స్వరూపాన్ని చూడడం, చటాల్న వేపచెట్టు యెక్కడం ఒక్కమారు జరిగింది. 'ఎక్కడం' అన్న ముక్క చలపతి రావు పంతులు అప్పుడు చేసిన క్రియకి సరిపోదు; ఇక వేరేపదం ఎక్కడా భాషలో లేదు. ఏమంటారు?—

అతడు మొదటికొమ్మ పట్టుకుని ఒక్కమాటు "ఊమ్" అని విశ్వప్రయత్నం చేసి శరీరాన్ని మీదికి ఒక్క ఊపు ఊపి తనకాళ్ల మధ్యని మీదికొమ్మను గట్టిగా అదిమిపట్టు కున్నాడు. [ఈ ఫీటు స్థూలకాయులకి సాధ్యం అవు తుందా అన్న సందేహం మొదట నాకూ కలిగింది.

అయితే "ప్రాణంమీదికి వొచ్చినప్పుడు సాధ్యాసా ధ్యాల్తో సంబంధం లేదనిన్నీ, మిన్నొచ్చి మీదపడి నప్పుడు అసాధ్యాలే సాధ్యాలౌతా" యని ఊహిం చాను.] చేతులతో కిందికొమ్మ, కాళ్ల మధ్యని మీది కొమ్మ, మనిషంతా తల్లక్రిందులా, మాపు నల్ల కుక్కపైపూ- నిజంగా చూడవలసిన దృశ్యమే. సృష్టికర్త భూమికి (gravity) ఆకర్షణశక్తి ఎం దుకు కల్పించాలా అని చలపతిరావుపంతులు లాసమ యంలో చాలా విసుగుకున్నా డనటలో సందే హం లేదు. ఏమంటారు? తలక్రిందులావున్న అత గాడి శరీరంలో వున్న రక్తమంతా మొగానికి దిగింది. అంచేత మొగం బరువెక్కి యెఱ్ఱబారింది. శరీరం బరువు అంతా చేతులమీదా కాళ్లమీదా వుంది. పొరబాట్న గాని కాళ్లపట్టు జారిపోయెనా, క్రిందవున్న నల్లకుక్క పాదాలు కొరికేయడంలో సందేహం లేదు; చేతులు పట్టుగానీ వదుల్తే ముఖం కుక్క కందుతుంది, అప్పు డింక ప్రాణం పోయినట్టే. ఈప్రకారంగా ముచ్చెమ టలూ పోసి, బరువుకి వూగులాడుతున్న కొమ్మలు విరిగి పోకుండా వుండడానికిన్నీ, చెట్టుమీదవున్న కండచీమలు తన కాళ్లనీ చేతుల్నీ కుట్టకుండా వుండడానికిన్నీ, కుక్కకి విసుగుపుట్టి వెళ్లిపోయేటట్టు చెయ్యడానికిన్నీ, పరమేశ్వరుని ప్రార్థిస్తూ అల్లా వున్నాడు. అయితే కుక్క మాత్రం మొండికత్తె "ఎంతసేపుంటావో చెట్టుమీద చూస్తాను కామా మరి" అన్నట్టు దృష్టి నిగుడ్చి అక్క డనే స్థిరంగా స్థైతాయించింది.

ఈవ్యవహారం అంతా గట్టునివున్న శేషయ్య చూస్తూనే వున్నాడు. పద్యాభిప్రాయానికి గట్టిఆపద వచ్చిం దని అనుకుని చలపతిరావుపంతులు కష్టంతోలగిద్దామనీ, కొంతవరకూ అతని మెప్పు పొందుదామని వుద్దేశాలతో, స్వభావతః పరోపకారియైన శేషయ్య వేపచెట్టువైపు పరుగెత్తాడు. సన్నపాటి మనుష్యులికి నల్లకుక్క భయం

ఎంతమాత్రం లేదని అతనికి బాగా తెలుసును. గట్టుకింద నున్న మంచి నునుపైనది, బరువైనదీ రాయి వొకదాన్ని కుడిచేతులో సంధించాడు. తన కోపదృష్టులన్నీ చెట్టులోంచి వ్రేల్లాడుతున్న చలపతిరావుపంతులుమీద నిలిపి వున్న నల్లకుక్క మన శేషయ్యని చూడలేదు. కుక్కకీ శేషయ్యకీ మధ్య నైదారుగజాలు ఎడం వుంటుంది. బాగా గురిచూసి శేషయ్య పాషాణం ప్రయోగించాడు· అస్త్రపరీక్షనాడు అర్జునునిబాణం మాయపక్షిని తెగేసినట్టు, ఆ రాయి సరిగా వెళ్లి నల్లకుక్క మూతిమీద తగిలేసరికి, 'కుయ్యో' మని దీర్ఘమైన ఒక్కకేక వేసి ఒక్కక్షణమాత్రం వెనక్కి తిరిగి ఆ గ్రామసింహం తోక ముడుచుకుని గ్రామంవైపు దౌడాయించింది

హృదయపూర్వకంగా దైవాన్ని ప్రార్థిస్తూ వుండిన చలపతిరావుపంతులు క్రిందివైపు చూస్తూనే వున్నాడు కాని ఏమిజరిగిందీ కొంచెమైనా ఆతనికి తెలియదు. మనస్సంతా అన్యథా (అనగా భగవంతుని వైపు) వుండడంచేత అతని యింద్రియాలన్నీ స్తంభించి పోయాయి. గజేంద్రమోక్షంలో "లావొక్కింతయు లేదు" అన్న పద్యంలో చెప్పినట్టుగా వున్నాడు మన చలపతిరావు పంతులు. అలాంటప్పుడు కర్ణకఠోరమైన శునకధ్వనం చెవిని పడేసరికి అతనియింద్రియాలన్నీ ఒక్కమారు మేలుకున్నాయి. త్రుళ్లిపడి భయంలో కాళ్లపట్టు వదిలేశాడు. వొదిలేశాడేమిటి! వదిలిపోయింది. తరువాత చేతులొదిలేశాడు. ప్రమాదవశాత్తు మొదట చేతులూ, తరవాత కాళ్లూ వొదిలివుంటే చాలా ప్రమాదం సంభవించేదే. భూమిమీద పాదాలపైని పడ్డాడు. పూర్తిగా తెలివివచ్చి చూశాడు. కుక్క అంతర్ధానం అయింది. ఎదురుగా చిరునవ్వుతో వున్న శేషయ్య అతనిదృష్టిలో పడ్డాడు. చక్రప్రయోగంచేత మకరాన్ని సంహరించి గజరాజుని రక్షించిన నాటి విష్ణుమూర్తి తన పాలిటకూడా ఆవేళ ఆ 19 ఏండ్ల కుర్రాడిరూపంగా సాక్షాత్కరించాడేమో అని అనుకున్నాడు చలపతిరావుపంతులు. చెట్టులోనుంచి తానుచేసిన ప్రార్థన పూరికే పోలేదన్న సంతోషముతో పల్లపొంగరంలాను గుండ్రముగా స్ఫోటకపుమచ్చలతో నున్న అతని ముఖం వికసించింది. నవ్వుతూ ప్రశంసాపూర్వకంగా శేషయ్యని కౌగిలించుకొని, "నాయనా! నాపాలిట దేవుడిలా గొచ్చావు; ఎవరిచిన్నవాడవోయి తండ్రీ? నీపేరేమిటి నాయనా?" అని ప్రశ్నించాడు చలపతిరావుపంతులు. "నాపేరు శేషయ్యంటారండి; చేసీ పూరి కరణాన్నండి" అని శేషయ్య అనేసరికి తాసిల్దారుగారు మొదట కొంచెం సిగ్గుపడినప్పటికీ (ఒక తహసీల్దారు ఒక కుక్కకారణంచేత కరణంయెదుట లాచారీ అవడమనేది సిగ్గుకి కారణం కాదూ మరి) వెంటనే నవ్వేసి, "చూశావూ, వెధవముండాకుక్క! నన్నుకూడా చెట్టెక్కించింది" అని గట్టిగా దిశలు బ్రద్దలయ్యేటట్టు నవ్వాడు! తరువాత యిద్దరూకలిసి పూర్వోక్త లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ నడిచారు

౪

శేషయ్య తాహసీల్దారుకి వెంకటసుబ్బయ్యగారిల్లు మారంసుంచే చూపించి, మలుపుతిరిగి పెరటిదారిని ఆయింట్లోకే ప్రవేశించాడు. పున్నమ్మ పెరట్లో ఒక్క



ర్తే కూర్చొని నాల్గోవాచక పుస్తకంలో సింహంపాఠం చదువుకుంటోంది. శేషయ్య రాగానే ఆమె పుస్తకం మూసేసి, మందహాసంతో, "శేషూ! తహసీల్దారుగారి

భార్య వచ్చింది. మనయింటిసారుగున్న సావడిలో బస చేశారు. ఇంకా ఆయన వొచ్చినట్టు లేదు. వారు వచ్చాక మావాన్ని, ఆయన ఏమి కలబడుతారో అని భయంవేస్తూంది" అన్నది. ఆమాటలు విని, "దళపతిరావు పంతులు గారూ నేనూ కలిసి యిప్పుడే వస్తున్నాం; అతడు చాలా మంచివాడులాగు కనిపిస్తున్నాడు. మీ నాయనకి అతనికీమధ్య మరేం ప్రమాదం సంభవించినా నేనున్నాను గా అన్నీ సరిచెయ్యడానికి" అని గర్వంగా శేషయ్యపలికిన పలుకులు పున్నమ్మకి అర్థంకాకపోవడమే కాకుండా, రాత్రోయే గాలివానలో తన శేషయ్యకు ఏమి ఆపద వస్తుందో అని విచారించింది. ఈ వ్యవహారంలో శేషయ్యని ఏమీ తొందర కలుగకేసుకోవద్దని చెప్పేదికాని ఇంతలో ఎక్కడో 'అమ్మయ్యో' అన్నట్టుగా ఒక ఆర్తధ్వని వినిపించింది. స్త్రీకంఠస్వరం. వెంటనే చీకట్లో కనుక్కుందామని శేషయ్య వీధిలోకి ఒక్కఅడుగు వేశాడు. అక్కడేం కానరాలేదు. సారుగున్న సావడిలోకి తొంగిచూశాడు. తహసీల్దారుగారి వంటమనిషి (అన్యఒకర్తె) ఒకమూలని తడకలగదిలో వంటచేసుకుంటూంది. తహసీల్దారు యింట్లో లేడు. రివిన్యూఇన్స్పెక్టరూ, అతనూ కలిసి కొన్ని దెబ్బతిన పొలాలు పరీక్షించి, వ్యవసాయదారుల రెమిషన్ అర్జీలు విచారించడానికి వెళ్లిపోయారు. 'అమ్మయ్యో' అన్న ధ్వని ఆయింట్లోంచే వచ్చియుండాల్ని వూహించి శేషయ్య లోపల ప్రవేశించాడు. పెరటిద్వారంలో అతనికి కనపించిన దృశ్యం అత్యద్భుతము! ఆశ్చర్యమైనసంగతి! నూతి దగ్గర అప్పుడే స్నానంచేసి తడిచీరతో, కాలం మళ్లినదీ, స్థూలశరీరంగలది అను ఒకానొక ముత్తైదువు ద్వారానికి ఎదురుగుండా ముఖంతిప్పి నిలబడివుంది. ఆమె ముఖంవల్ల ఆవిడ భయభీతురాలైనదని స్పష్టమవుతుంది. సమ్మంలో శేషయ్యవైపు తిప్పి అనగా ఆవిడవైపు ముఖమంచి నల్లకుక్క! ఆ ముత్తైదువే తాసిల్దారుగారి భార్య. పేరు లక్ష్మీబాయమ్మ. పురుషసింహం దళపతిరావు పంతులేన్ని ముప్పతిప్పలా పెట్టిన నల్లకుక్క యాకృతి స్త్రీ యను లక్ష్మీబాయమ్మను భయపెట్టిం దనుటలో ఆశ్చర్యమేముందికి అయితే దైవాత్తు లక్ష్మీబాయమ్మ చేతులో చెంబు వుండడంచేత కుక్క దూరంగా కూర్చునే, తనకు స్థూలకాయులను మానవులమీదనున్న కోపం అంతా అక్షి ద్వయరూపంగానే చూపుతూంది కాని, ఆ యిల్లాలిని సమీపించి కోటిగో క్రియారూపంగా ప్రకటించడానికి ధైర్యం చాలింది కాదు. ఇలాంటి సందర్భంలో మన శేషయ్య వచ్చిన పడి కాగానే కుక్క వెనక్కి తిరిగి చూచింది. చూడడమే తడవుగా — పోరయాత్ర "కుయ్యో!" మని చెరువుగట్టుమీద తిన్న దెబ్బనొప్పి అంతా ఒక్కమారు దానికి అనుభవంలోకి వొచ్చినట్టుగా అరచి, చెరువుగట్టుమీద ప్రొద్దున్న ప్రారంభించినపాట యిక్కడ పూర్తిచేసింది; పిమ్మట గోడమీది కొక్క లఘువేసి అదే పరుగు, వాయువేగ మనోవేగాల్తోను. "ఎవ్వరు నాయనా నువ్వు-మాకొడ్డ స్తురాశిలా నున్నావు! నీశ్శక్తి కాగలేక పెఘనుక్క పరుగుచ్చుకుంది. నువ్వు రాకపాతే నా పనేమైయుండేదో కోయి బాబూ! స్నానం చేస్తుంటే గోడదిగి ద్వారంలోవొచ్చి దక్కా కూర్చుంది. పాపం రివిన్యూ ఇన్స్పెక్టరుగారి అమ్మాయి వాళ్లింట్లో స్నానం చెయ్యమంటూనే వుంటే బుద్ధిలేక యిక్కడ స్నానం చెయ్యడానికని వచ్చాను వొచ్చినందు కనుభవించాను. పాపం! ఆపిల్ల మాదొడ్డపిల్ల, మణిపూస! పనిపాట్లు ఎంతశ్రద్ధగా చేసుకుంటుందే! తల్లిలేని పిల్లట పాపం! ఏదో ఒక లోపం!... నాయనా! నీపేరేమిటో చెప్పావుకావు!" అని తుదకి ప్రశ్నించింది. పేరు చెప్పడానికి అసలు సావకాశం కలుగలేదు కాదూ మన శేషయ్యకి! కొందరిస్త్రీలకు సహజమైన గుణం ఏమిటే అంటే, ఒక్క అంశంగురించి మాట్లాడుతూ వున్నప్పుడు వాళ్లకి జ్ఞాపకంవచ్చిన కబుర్లన్నీ యాకరు పెట్టడమే — అదిసందర్భమైనా సరే, అసందర్భమైనా సరే; ప్రస్తుతమైనా సరే, అప్రస్తుతమైనా సరే; లక్ష్మీబాయమ్మగారి అప్రస్తుత ప్రశంసమధ్యని శేషయ్య జవాబుచెప్పక పూరుకోవలసి వచ్చింది. ఆవిడ ధోరణి సన్నగిల్లిన తర్వాత శేషయ్య, "నా పేరు శేషయ్యంటారండి, నే నీవూరికరణాన్నండి" అంటూ తొందరగా వీధులోకి నడిచాడు. కొలది కాలంలోనే తాసిల్దారంతవాడి చేతనే కాకుండా తాసిల్దారుకి తాసిల్దారయిన (దళపతిరావుపంతులు భార్యను భయపడి వణుచుకుంటూంటాడని చిల్లజవాన్ల గుసగుసల




౫. పంచతీర్థములలోని సౌభద్రతీర్థమున స్నానమాడబోయిన అర్జునునివలన నందు మొసలిరూపైయున్న యప్సరసకు శాపవిమోచన మగుట.

ద్వారా వెళ్లడి) లక్ష్మీబాయమ్మచేత కూడా మెప్పు పొంది, పాగస్త్ర అందినందుకు మన శేషయ్య గర్వానికి మేర లేకపోయిందంటే ఆశ్చర్యం లేదు. అందులో లక్ష్మీబాయమ్మ పున్నమ్మయెడల చూపిన మాటల సానుభూతి చూస్తే, ఈ వ్యవహారం అంతా సమయం వచ్చినప్పుడు, శేషయ్య పున్నమ్మల వివాహానికి సహాయం చేసితీరుతుందని అతనికి నమ్మకం కలిగింది.

ఇలాంటి ఆలోచనలతో అతడు వీధులోకి వచ్చేసరికి ఎదురుగా వున్న సుబ్బయ్యగారి యింట్లోంచి ఏవో కేకలు వినిపించాయి. మాటలస్వరంబట్టి రివిన్యూ ఇన్స్పెక్టరు వెంకట సుబ్బయ్యకీ, తాసీల్దారుగారసు దళపతిరావు పంతులుకీ ఏదో వాగ్వాదం జరుగుతూందని మన శేషయ్య గ్రహించాడు. వాలకం అంతా చూస్తే, పున్నమ్మ చెప్పినట్టు వారిద్దరూ కలబడ్డారని అతనికి స్పష్టమైంది. ఇదే సమయ మనుకుని మెల్లిగా



సుబ్బయ్యగారింట్లోకి ప్రవేశించాడు శేషయ్య. గది గుమ్మందగ్గర నిలబడ్డాడు. లోపలనున్న ఆఫీసర్లిద్దరికీ వ్యవహారం మితిమించి రాగంలోకి దిగింది.—"నువ్వు చిన్నప్పుడు తోటలో రేగుపళ్లు దొంగిలించి తోటవాడి చేత చావదెబ్బలు తిన్నావు, నువ్వా నాకు చెప్పడమేమిట్రా, బల్లన్నా!" అని వొకరు; "నువ్వు మాత్రం ఏం బుద్ధిమంతుడ వని! మా డోక్లాసు నడుపుతూ వున్నప్పుడు నువ్వు మేష్టరు కాంతారావుగారి డెస్కులో పిరా పారపోసి, మేష్టరు 'ఎవరు పోశార్రా?' అని అడిగేసరికి గుప్చుప్‌గా మునిగి పోతులాగు వూరుకొని, తరువాత మేష్టరుకి తెలిశాక బెత్తంతో దెబ్బలు తినలేదుట్రా, సుబ్బన్నా?" అని యింకొకరు. ఇలాగు మాటలు మహా జోరైపోతూవుండడం విని, శేషయ్య, ఇకమారుమంటే పిగ్గకి చేటేమో అని వూహించి, తలుపు మెల్లిగా తోసుకొని గదిలో ప్రవేశించి చూసేసరికి "బల్లన్న సుబ్బన" లిద్దరికీమధ్యని జానెడెడమైనా లేదు. జామెట్రీలో రెండువృత్తములు లొకచోట



కలిసిన రీతి చెప్పినట్టుగా వాళ్ల యిద్దరి పొట్టలూ అప్పుడే ఒకదాన్నొకటి అంటుతూ వున్నాయి; మొగాలు బాగా కాలిన మినపరొట్టెలాగు ఎఱ్ఱబారాయి; కోపం యిద్దరి ముఖాలమీద తాండవిస్తూంది; ఇద్దరు పళ్లు పటపటకొరుకుతున్నారు; పిడికిళ్లు గట్టిగా మూసి, ఆపిడికిళ్లలో ఒకరినొకరు నలిపి ముద్దచేసేస్తున్నారేమో అన్నట్టుగా వున్నారు. ఇలాంటి సమయంలో వాళ్లిద్దరూ తలుపువడి

విన్నారు. ద్వారంలో వున్న శేషయ్యని చూశారు. ఉపన్యాసాని కిదేకాలమని వెంటనే మన శేషయ్య, "ఇదిగో, మీరిద్దరూ ఒకడిపార్టుమెంటు వుద్యోగస్థులు. చిన్నప్పుడు చదువుకున్న వాళ్లు. స్నేహంగా వుండకుండా పందెముకోళ్లలాగు ఒకరితో ఒకరు కొట్లాడుతూవుంటే బాగుండదు. నేను మీతాబేదారుని; మీతిలో జవాన్లున్నారు; మాఅందరికీ ఈ అసందర్భం తెలిస్తే ఏంబాగుంటుందో ఆలోచించండి" అని, నల్లకుక్క కారణంచేత ఇదివరకే తాసీల్దారుని జేబులో వేసిన ధైర్యంతో, లెక్చరు వొదిలాడు. ఆ ఉపన్యాసం తను అనుకున్నట్టుగా వాళ్ల కోపాన్ని తొలగించి, లజ్జను ఆవేశింపజెయ్యడం చూచి, మనస్సులో సంతోషించి, శేషయ్య వ్యవహారం దక్కపడుతుందని ఎంచి, ఆ నాటకంలో సూత్రధారము వహించుతే తనమాటలు వారిద్దరూ వినే అవస్థలో వున్నారని ఆలోచించి, మరింత ధైర్యం తెచ్చుకొని, తన రెండుచేతులతో వారిరెండు కుడిచేతులు కలిపి, "ఇక మీరు స్నేహంగా వుండాలి" అంటూ మళ్లీ యేదో కొద్దిగా లెక్చరు సాగిద్దామనుకుంటూంటే, రెండువేపులావున్న సుబ్బయ్య చలపతు లిద్దరూ ఒకరినొకరు కౌగిలించుకొనే ప్రయత్నంలో వున్నారని తెలిసికొని, వాళ్లిద్దరి మధ్యనూ ఆలాంటప్పుడు నిలబడివుంటే ఆపొట్టలమధ్యని అడకత్తెరలో పోకచెక్కలాగు నలిగిపోతాడేమో అన్న భయంచేత, మెల్లగా ప్రక్కనుంచి జారి, ఆ ముసలి ఆఫీసర్ల పశ్చాత్తాపాన్ని సూచించే గాఢాలింగనాన్ని, కొంచెం దూరంగా నిలబడి, కన్నులపండువుగా చూశాడు. "నన్ను నువ్వే మొదట చల్లన్నా అన్నా"వని ఒకరు; "నన్ను సుబ్బన్నా అన్నా"వని మరొకరు. "నీతో ఎప్పుడూ పోట్లాడనని చెంపలు వేసుకుంటున్నా"నని ఒకరు; "నీతో ఎప్పుడూ కోపంగా మాట్లాడనని చెవులు మెలుపుకుంటున్నా"నని మరొకరు. "తెలివి తక్కువచేత నిన్ను అనిన మాటలు క్షమించు" అని సుబ్బయ్య; "బుద్ధిలేక నీమీద కోపంగా కేకలేసినందుకు క్షమించు" అని చలపతిరావుపంతులు. పిమ్మట, వచ్చిన పశ్చాత్తాపం బాష్పరూపంగా పొంగి వాళ్ల బొజ్జలమీంచి పారేదేకాని, ఇంతలో ఒక విశేషం జరిగింది.

వెంకటసుబ్బయ్యకోపం చల్లారుతూవున్నప్పుడు అతగాడిదృష్టి ద్వారంలో నిలబడివున్న శేషయ్యమీద పడింది. జరిగిన ముచ్చటంతా అతని ఊహలోకి వచ్చి, "ఒక్కముక్క పన్నలారని కుర్రాడు, ఇంతనాటకం చేస్తాడా!" అని పోతూవున్న కోపం మరలివచ్చింది. "శేషయ్యా! నువ్వెలాగొచ్చావు, ఈ వ్యవహారంలోకి? ఏకో సాటిశాఖ వాడివని వూరుకుంటూంటే, నీ అధిక ప్రసంగం ఎక్కువవుతూంది! నీ కక్కర లేని ప్రసంగం లేదు, మా పెద్దమనిషిలాగు! కుర్రముండాకొడుకులు కుర్రముండాకొడుకుల్లాగుండాలి!" అని అసంతృప్తి, ఆగ్రహం కనబర్చాడు సుబ్బయ్య. ఈమాటలు విని, చలపతిరావుపంతులు, "ఇదిగో ఈ కుర్రాడ్ని ఏమన్నా అంటే నే నొప్పుకోను, జాగ్రత్త; కుర్రాడు చాలా బుద్ధిమంతుడు. ఇప్పు డితడు లేకుంటే మనమిద్దరమూ గాడిదలకంటే నీచంగా ప్రవర్తించి వుందుము. కృతజ్ఞత చూపడానికి మారుగా కోపపడుతున్నావూ!—రావోయి శేషయ్యా! ప్రొద్దున్న నువ్వు చూపినధైర్యం ప్రశంసనీయము" అని చలపతిరావుపంతులు ఆయువకుని చెయ్యి పట్టుకున్నాడు. సుబ్బయ్య కిదేమీ అర్థం కావడంలేదు. తాసీల్దారు కరణంగాడిని చెయ్యిపట్టి 'రావోయి బాబూ!' అని లాగడం అతగాడి సర్వీసులో ఎక్కడా అనుభవానికి రాకపోవడంచేత తెల్లమొగంవేసి, "వీడు కరణం శేషయ్య, ఎవరనుకున్నావో కాని!" అన్నాడు. ఆమాట విని చలపతిరావుపంతులు, "తెలుసును; కరణమైతేనేం, మనిషే. ఈ కుర్రాడివాళ ప్రొద్దున్న చెరువుగట్టుమీద లేకపోతే నల్లకుక్క నన్నేంచేసి వుండేదో!"—"చెరువుగట్టు, నల్లకుక్క" ఈరెండుముక్కలూ చెవినిపడేసరికి వెంకటసుబ్బయ్య తేలుకుట్టినట్టు గెంతాడు. ఆరునెలలక్రిందట చెరువుగట్టుమీద తనకూ నల్లకుక్కకూ జరిగిన ముచ్చటంతా అతనికి జ్ఞాపకం వచ్చింది. దాంతో బిక్కమొగంవేసి వెంకటసుబ్బయ్య "ఏమిటీ? నల్లకుక్కా?" అని ప్రశ్నించేసరికి చలపతిరావుపంతులు కొంచెంసేపుక్రితం జరిగినసంగతి యావత్తూ పూసగుచ్చినట్టు చెప్పి, శేషయ్య ధైర్యాన్ని మరల ప్రశంసించి ముగించాడు. సాంతముగా విని, వెంకట

సుబ్బయ్య, "అబ్బ శేషూ! మనవూరి నల్లకుక్కని సాధించావట్రా నాయనా! ఎంత గట్టివాడివు!" అని వీపుమీద తట్టాడు.

ఇంతలో తాసిల్దారుగారి భార్య లక్ష్మీబాయమ్మ రంగంలోకి ప్రవేశించింది. ఆ యిల్లాలిని చూడడంతోటే జలపతిరావుపంతులు, ఒక్కమాటు తాంబేలు తన శిరస్సుని మూసేసరికి తన అవయవాలన్నీ బురిక్రిందికి ముడుచుకున్నట్టుగా, చిన్నవాడైపోయాడు. అతని సంతోషం అంతా మాయమై పోయింది. అయితే భార్యముఖం నవ్వుతూవుండడం చూచి అతనికి కొంచెం ధైర్యం కలిగింది. లక్ష్మీబాయమ్మగారు తహసీల్దారుగార్ని, రివిన్యూఇన్స్పెక్టరుగారిని చూచి, "ఓహో! బాల్యస్నేహితులుకాదూ మరి! వంటయింది స్నానానికి లెండి" అని ముసిముసినవ్వుతో అన్నది. "శేషయ్య లేకపోతే మా బాల్యస్నేహం బయలయ్యే"దని మనస్సులో వాళ్లిద్దరూ అనుకున్న సంగతి ఆమెకేం తెలుస్తుంది? ఇంతలో లక్ష్మీబాయమ్మ శేషయ్యవైపు తిరిగి, "ఇదిగో, ఈఅబ్బాయికూడా ఇక్కడే వున్నాడూ? నాయనా! ఇందాక చెప్పకుండానే వెళ్ళిపోయావు! నిన్ను భోజనానికి పిలుద్దామని అనుకుంటూంటేనే వెళ్ళిపోయావూ?" అనేసరికి, సుబ్బయ్య తనలో—"వీళ్లందరికీ పిచ్చి రోగమేమిటి? ఈమాటలు నాకేమీ అర్థం కాకుండా వున్నాయి. ఈసాగస్తంతా నిజంగా శేషుగాడిదే!" అనుకుంటూండేసరికి, లక్ష్మీబాయమ్మ సుబ్బయ్యవైపు తిరిగి, "సుబ్బయ్యగారూ! మీరుకూడా మా బసకి భోజనానికి రావాలి. మరేం అడ్డుచెప్పకూడదు" అని మరల శేషయ్యవైపు తిరిగి, "నాయనా! నువ్వంటే నల్లకుక్కకి సింహస్వప్నమేనోయి!" అనేసరికి జలపతిరావుపంతులు, సుబ్బయ్య యిద్దరూ గతుక్కుమన్నారు. "మళ్లా నల్లకుక్కేమిటి?" అని యిద్దరూ ఏకకంఠంతో పలికారు. అప్పుడు, లక్ష్మీబాయమ్మ ఒక పావుగంటక్రితం స్నానంచేసినప్పుడు జరిగిన సమాచారం అంతా తెలిపింది.

ఇంతలో ఈగోలంతావిని పున్నమ్మకూడా లోపలినుంచి గదిలోకి వచ్చి ఒకమూలని ముసిముసినవ్వు నవ్వుతూ నిలబడ్డది. శేషయ్య దృష్టి వెంటనే చెదరిపోయింది. పున్నమ్మ చిరునవ్వు శేషయ్య పెదవులమీదకూడా మందహాసరేఖని ఉదయింపచేసింది. శేషయ్య మందహాసం గర్వసూచకంగాకూడా వున్నది. లక్ష్మీబాయమ్మగారుచెప్పిన నల్లకుక్క కథ ననుసరించి తదేకధ్యానముతో ఆలోచిస్తూ పులకించిన వెంకటసుబ్బయ్య శేషుమీద కలిగిన సంతోషాన్ని పట్టలేక అతన్ని కౌగిలించుకుని, "బాబూ శేషూ! 'కాలభైరవు'డ్ని (ఆగ్రామంలో పిల్లకాయలంతా కలిసి ఆనల్లకుక్కకి 'కాలభైరవు'డని నామకరణం చేయించారు) లొంగదీశావట్రా!" అంటూ వుంటే శేషయ్య బుర్రలో అనేక ఊహలు బయల్దేరాయి. వెంకటసుబ్బయ్యవంటి కోపిష్టికికూడా తనమీద అనుగ్రహం కలిగిందని చూచి, 'పర్వాలేదు, జయించా'ననుకొని, శుభముహూర్తం మించిపోకుండానే, అనగా వెంకటసుబ్బయ్య బాహుచక్రంలో వుండినప్పుడే, మన శేషయ్య ఈవిధంగా లెక్చరు ఆరంభించాడు: "సుబ్బయ్య మామా! నామనస్సులో నాలుగు ముక్కలూ చెప్తున్నాను విను. ఇన్నాళ్లనుంచి నీతో చెప్పడానికి సాహసించలేదు, నువ్వేమంటావో అన్న భయంచేత" అనేసరికి వెంకటసుబ్బయ్య ముఖకమలం వికసమైంది. ఇది చూచి శేషయ్యకి మరింత ధైర్యం కలిగి, "మామా! మరేం లేదు: ఇదుగో మీపున్నమ్మ! మాయిద్దరి వివాహానికి నువ్వు అనుమతిచ్చావంటే, మాయిద్దరికీ తృప్తికలిగించినవాడివి అవుతావు" అని నాలుగుముక్కలూ జంకూగొంకూ లేకుండా ఒక్కవూపిరిలో బజాయించాడు. ఈమాటలు వినేసరికి వెంకటసుబ్బయ్య ముఖంలో గొప్పమార్పు కలిగింది. స్వచ్ఛమైన సూర్యరశ్మితో నిండి కలకలనవ్వుతూ వున్న భూప్రదేశముమీద ఒకమాటు మబ్బు వేసి నల్లయింది. కోపం వచ్చింది. ఆకోపంలో శేషయ్య అతనిచేతుల మధ్య ఏమైపోయివుండునో కాని, యింతలో జలపతిరావుపంతులు మాటల కల్పించుకున్నాడు: "అభ్యంతరం ఏముంటుంది? ఈడుజోడు సరిగ్గా సరిపోయింది; నాకు ఆడపిల్ల లేక పోయిందికాని—" ఇంతవరకూ చెప్పి జలపతిరావుపంతులు భార్యవైపు ఒకసారి దృష్టి వేసి గప్చుపని మౌనం ధరించి దిక్కుమొగం వేశాడు. తనభార్యవుద్దే

తెలియకుండా, తనునవ్వులో మాట జాహీటంగా లిపుచ్చినందుకు ఆతడు పశ్చాత్తాప పడుతూ, ఏంకొం ముసుకుంటుందో అని భయపడ్తూవుంటే లక్ష్మీబాయమ్మ వ్వుతూ, "సందేహ మేమిటి? నాకుగానీ ఆడపిల్ల వుంటే ంలో నేను దానిని శేషయ్యకిచ్చి పెళ్లి చెయ్యనూ!" న్నది. చలపతిరావుపంతులు 'బ్రతుకుజీవుడా' అనుకుని గా వూపిరి తీశాడు. చలపతిరావు పంతులు, ఆతని ర్య—వీరిద్దరివాక్యాలు సమయానికి టంకంపాడివేసి ట్లు పడేసరికి మన శేషయ్య సంతోషానికి మేరయెక్క డి? కార్యమంతా సానుకూలంగా నడుస్తూవున్నందుకు ఆతడు తనలోనే ఈశ్వరునికి ధన్యవాదాలు సమర్పిం చాడు.

ఇంతమంది, యిన్నివైపులనుంచీ తనమీదకి దండె త్తేసరికి వెంకటసుబ్బయ్యమాత్రం ఏంచెయ్యగలడు? అతడు ముఖముతిప్పి మూలనున్న కూతురువైపు చూశాడు. అప్పు డు పున్నమ్మముఖం కొంచెంప్రక్కకితిప్పి, మందహాసంతో ోడమీద మాపుడుక్రేలితో ఏదో గీస్తోంది. పున్నమ్మ భావంకూడా సుబ్బయ్యగారికి వ్యక్తమైంది. విచారణ ముగిశాక సెషన్సుకోర్టులో జడ్జీగారు జడ్జిమెంటుయిచ్చి ట్టు గంభీరంగా వెంకటసుబ్బయ్య, "ఇంతమంది చెప్పాక తప్పుతుందా మరి! 'జనవాక్యంతు కర్తవ్యం' అన్నారు; మాయిష్టమే నాయిష్టమూను" అన్నాడు. అప్పుడు లక్ష్మీ బాయమ్మగారు మూలను ముసిముసి నవ్వులతో వున్న పున్నమ్మని చెయిపట్టి తీసుకొచ్చి, ఆమెచెయ్యిని శేష



య్యచేతిలో కలిపి, "ముందు బాజాలతోను, మంత్రాలతోను కాబోయే పాణిగ్రహణ మహోత్సవానికిది రిహార్సు" అని తనయింగ్లీషు పదప్రయోగానికి పక్కున నవ్వింది.

* * * *

మాఘ మాసంలో శేషయ్య పున్నమ్మల వివాహం జరిగింది. పెళ్లిలో తాసిల్దారు చలపతిరావుపంతులు గారు పెళ్లికొడుకు శేషయ్యపేర వెయ్యిరూపాయల కట్నం చదివించారు (అనగా భార్యఅనుమతి తీసికొని). పున్నమ్మ శేషయ్యల ఆయురారోగ్యములకు, వంశాభివృద్ధికి వారిని ఆశీర్వదించి మనంకూడా విరమిద్దాము.

లీలాబాలుఁడు

కోటమర్తి నాగేశ్వర శర్మ గారు

ఒకటి కింకను బదుమూఁడు నొవరఁ గూర్చి
బొంగరములను, మిగుల నుప్పొంగి నీవు
స్వేచ్ఛయను రజ్జువునఁ జుట్టి చిత్రగతిని
ద్రిప్పుచున్నావు, మంచిదే; తెలియఁ బలుకు
విసుగు పుట్టదొ? తుణమైన విడువలేవు

బాలకా! నీవు సామాన్యబాలకుఁడవె?
కనులు మూయవు మెతుకైనఁ దినవు నీవు
కష్టసుఖములు నీకు సిక్కంబులేవొ
పట్టుదల యెుండె నాకుఁ గన్పట్టుచుండె
నెంతకాల, మిఁ కీయాట కంతు లేదె.



౧

పరశురామయ్యపంతుల పైసా సాయము లేనిది క్షీరపురిలో కాదుగదా, ఆయూరికి చుట్టుపట్టులలో నుండు గ్రామములలోగూడ పెండ్లిండ్లు కావు; చదువులు సాగవు; వాట్లు పడవు; కోతలు వెలువేరవు; శిస్తులు చెల్లవు. వేయేల, ధనావసరము గలిగిన ప్రతివనియు పరశురామయ్యవద్ద ప్రామిసరీనోటు వ్రాసినదే కాని కాదు. ఇప్పటి జనసామాన్యపుస్థితి యట్లున్నది. ఈ విధముగా చూచిన పరశురామయ్య ఆపద్బాంధవు డనియే చెప్పవచ్చును. కాని ఆయన పుచ్చుకొనెడి అధికపు వడ్డీలు చూచినను, నూటికి పదినూరులు పుచ్చుకొనునా డైనను పైసాత్రోసివేయుట కిచ్చగింపని కాఠిన్యమును చూచినను ఆయనను నక్షత్రకు డనువారేకాని ఆపద్బాంధవు డనువారు మాత్రము కానరారు. అయిన నేమి? అయన యివ్వవలెను, వారు పుచ్చుకొనవలెను. కాలము కఱవుకాలము. పంటలు తక్కువ. ఖర్చు లెక్కువ. పిల్లలుజాస్తి. ధనికుడైనవాని నాశ్రయింపక జనసామాన్యము బ్రతుకు టెట్లు? కాబట్టియే ఆగ్రామజనులే కాక ఆచుట్టుపట్టుల నుండు గ్రామముల జనులుగూడ పరశురామయ్య పిడికిలిలోని పిచ్చుకలు. పరశురామయ్య మంచి నైష్ఠికుడు కాని అందులో మతాభిమానముకంటె సాంఘికపేడయు, నిరంకుశత్వమునే యెక్కువగా ద్యోతకమగుచుండును. దానికి తగినట్లుగా పరశురామయ్య మంచి ఒడ్డుపొడుగుగల మనిషి. దానికి తగినట్లుగా మొగము విశాలము. కన్నులు కాషాయపురంగు. అందువలన భయంకరుడుగా నుండును. ఉదయమే లేచి ప్రాతఃకృత్యములు తీర్చుకొని, స్నానసంధ్యా ద్యనుష్ఠానములు తీర్చుకొని, మొగము నిండిన విభూతిరేఖలతో, మెడనిండిన రుద్రాక్షమాలికలతో పంతులు పీఠియరుగుపై గూర్చుండెనా, చిన్న పెద్దల కావీథిని నడువ వెఱపు. ఎవరు నడచినను పక్క పక్కలనే.

బుద్ధిశాలియగు విష్ణుశర్మ రాజకుమారులకు హితోపదేశము సేయుటకు కరటకదమనకుల నేనాడు సృష్టించెనో కాని, తత్సంతతివారు ఇప్పటికిని ఉన్నారు. సాధారణముగా పెద్దపెద్ద లందఱ కీమనుష్యరూపగోమాయువులే కన్ను, కాలు, చెవి, చిత్తము. సామాన్యముగా కులపెద్దలుగా నున్నవారి కేమి, గ్రామపెద్దలుగా నున్నవారి కేమి, మఱి యే యితర స్థానికాధికారములలో నున్నవారి కేమి, ఈకరటకదమనక సంతతివా రగు మనుష్యలోకలో, యిద్దరో పార్శ్వవర్తులై యుందురు. ఆపెద్దలకు వారు పెట్టినదే భిక్ష. ప్రత్యక్ష పరిశీలన తక్కువ. న్యాయాన్యాయవిచక్షణ శూన్యము. వారు తిమ్మియనిన తిమ్మి, బెమ్మియనిన బెమ్మి. అంతకంటె దూరదృష్టి లేదు. పరశురామయ్య పంతులకు శివయ్య


శాస్త్రి నమ్మిన బంటు. కోపించినప్పుడు పంతులు మొత్తియు, శాంతుడై యున్నప్పుడు చెవులుకొఱికియు సమయానుకూలముగా పంతులువద్ద మెలగెడి నేర్పు శాస్త్రి కున్నట్లు మఱియొకరికి లేదు. పంతులుకు ఒకరిపై నిగ్రహముగాని, అనుగ్రహముగాని గలుగునట్లు ప్రసంగించుటలో శాస్త్రి కడు చతురుడు. పంతులుతో నేదైన వ్యవహారము నైనను జరుపుకొనదలచిరేని వారు శాస్త్రిద్వారా వెళ్లినచో వారికార్యము సఫలము; లేకపోయిన శాస్త్రి పుల్లవిఱుపు మాటలకు వారికార్యము పొల్లుగావలసినదే: కాన పంతులవలని భయముకంటె శాస్త్రివలని భయమే ప్రజల కెక్కువ.

౨

ఆయూరికి నడుమ నొకవేపచెట్టు; దానికిచుట్టు నొకగచ్చుటరుగు; దాని కమ్మవారి తిన్నె యని పేరు. దానిపై సాయంత్ర మైదుగంట లగునప్పటికే, పంతులు, శాస్త్రి, వారియనుచరులు కొందఱు సమావేశ మగుచుందురు. ఇక నక్కడ జరుగుచర్చలలో శాస్త్రదృష్టి తక్కువ; ఆచారపు పట్టుదల లెక్కువ. ధర్మనిర్ణయము తక్కువ; అధర్మపు తీర్మానము లెక్కువ. క్షేమవిచారణ తక్కువ; కష్టపెట్టు యత్నము లెక్కువ. సఖ్యపఱచు యోచన లల్పము; బహిష్కార బాంబుల ప్రయోగ మత్యధికము. ఎవరియింట నాలుమగలు జగడమాడినను, ఎవరియింట నత్తకోడళ్లు వాదులాడినను, వీరికే. అందులో బలవంతులపక్షము చేరుట, బలహీనుల పీడించుట వారిపని. పంతులు శాస్త్రిని చూచి, 'శివయ్యా! ఏమిటి విశేషాలు?' అని తిన్నెపై కూర్చుండగనే యడుగును. అడుగగనే, 'బాబూ!' వింటివో లేదో: రామయ్యకొడుకు పట్నంలో చదువుకు చేరగానే క్రాపెంగు పెట్టినాడు. మొఖాన బొట్టు పెట్టుకోడు. ఇటువంటివాడు మాలకూడు తిని వచ్చాడంటే సందేహ మేమిటి? మఱొకసంగతి: సుబ్బయ్య శాస్త్రికూతురు నిత్యము సాయంత్ర మయ్యేటప్పటికి తల్లో పూలు ముడుచుకోకమానదు. పెనిమి టెక్కడనో బొంబాయిలో చదువుకుంటుంటే యిదీ పూలు పెట్టుకొని పలకటం యేమిటో అర్థంకాదు. అది సరే. మొన్న వెంకటచలం వ్యాజ్యానికని గుంటూరు పోయి వితంతు వివాహం చేసుకున్నవాడి స్నేహితుడి యింట్లో తాంబూలం సేవించి వచ్చాడట. ఇక గోపయ్య, యింగ్లండు వెళ్లివచ్చిన మాధవరావు తల్లి పినతల్లి ఆడబిడ్డకూతురింట్లో గస్పళ్లేమే కొట్టి వచ్చినాడట. వెంకయ్యకొమార్తె గుజ్జుములా నున్నది, ఇంతవఱకు పెండ్లియత్న మేలేదు. ఒకటో రెండో అయ్యేవుంటుంది. అడిగేవా డెవడు? కులకట్టుబాట్లు కూలిపోతున్నవి. వర్ణాశ్రమధర్మాలు, శాస్త్రచోదితకర్మలు వల్లకాడై పోతున్నవి. పెద్దవాళ్లము మన మింకా పూర్వాచారాలు విడవలేక యేడుస్తుంటే ఈకులభ్రష్టుల మూలంగా మనకుగూడా వర్ణసంకరం ప్రాప్తిస్తున్నది. ఇంకా మీవంటి కర్మిష్ఠులు వేదమతాన్ని రక్షిస్తూఉండబట్టి ప్రపంచం యింకా ఏభూకంపపు ఉపద్రవంచేతనో నాశనంకాకుండా నిలిచియున్నది.' అని శివయ్య ప్రసంగము సాగించును. ఆస్తోత్రపాఠములతో పంతులుకు శివము పెరుగును. అతడు నిజముగా తనవల్లనే లోకమంతయు నిలిచియున్న దనుకొనును. వేదమతము నుద్ధరించుటకు తానొక శంకరావతార మనుకొనును. వెంటనే, 'పంపండోయి అంతఃపత్రికలు, వర్ణసంకరం ముండాకొడుకుల కందరికీ' అనును. రాత్రి యెనిమిది తొమ్మిది గంటలవేళ ఈతీర్మానము. తెల్లవాఱేయు తెల్లవాఱకమును పే యింటింటి కొక అంతఃపత్రిక. అదిచూచి యాగృహస్థు లాలగోడు, బాలగోడు. ఇక వారి కేవృత్తులవారు పనిచేయరు. సరిగదా, ఏబావినీళ్లను వారిని తగులనీయరు. పురోహితులు అబ్దికాదికర్మలకు రారు. ఊరివారు భోజనపేరంటములకు పిలువరు. ఈవిధముగా వారెన్నిదినము లగచాట్లుపడుదురు? పాప మాగృహస్థు లీ బాధలు పడలేక అమ్మవారితిన్నెమీద వేంచేసియుండు అమాత్యసమేతుడగు బహిష్కారచక్రవర్తిని, అనగా పరశురామయ్యపంతులును, క్షమాపణ కోరియో, అపరాధరుసుము చెల్లించియో, ప్రాయశ్చిత్తము గావించుకొనియో, బహిష్కారమును బాపుకొని, సంఘములో చేరుచుందురు. క్షీరపురిగ్రామస్థులకు పరశురామయ్య ప్రభృతులచే నివి నిత్యపాట్లు.

3

పరశురామయ్య పంతులుకు కొమారులు మువ్వురు కొమార్తె లైదుగురు. పెద్దకొమారుడు కరిణీకము చేయుచున్నాడు. రెండవవాడు కొంత చదివి మానివేసి, పంట పైరులను, ఇచ్చి పుచ్చుకొను వ్యవహారములను జూచుచు, తండ్రికి సాయముగా నున్నాడు. మూడవవాడగు శంకరుడు బాపట్లలో మెట్రిక్యులేషన్ పరీక్ష నిచ్చి గుంటూరులో ఎఫ్. ఏ. చదువుచున్నాడు. కాని దురదృష్టవశముననో, అదృష్టవశముననో శంకరునకు ఎఫ్. ఏ. పరీక్ష రెండుమాఱులు పోయినది. మొదటిమాఱేమో ప్రమాదమనుకొనెనుగాని రెండవమాఱుగూడ పరీక్ష పోయిన దన



గనే పరశురామయ్యపంతులు ఒడలు మండిపోయినది. “తెలివిమాలిన వెధవా, యీమాటుకూడా తప్పిపోయినావా? నీ వేమో చదివి తాసిల్దా రేడుస్తావని మీ అమ్మ యేడిస్తే వెయ్యి రెండువేలు నీబొందమీద పోశాను. చదివిందీలేదు యేడ్చిందీలేదు. యేటేటా తప్పటమే. నీచదువుకు పెట్టినడబ్బు కట్నంగా లాగవచ్చునంటే నష్టంలేదని ఒప్పుకున్నాను. ఇట్లా తప్పే వెధవకు కట్న మెవ రిస్తారు? ఇక చాలు, యింట్లో కూర్చో: చదువూవద్దు గిదువూవద్దు”. అని యేమేమో తిట్టినాడు. పరీక్ష పోయినందులకే లోలోన కుళ్లి యేడ్చుచున్న శంకరునకు తండ్రిమాటలు గోరుచుట్టుపై రోకటిపోటువలె మహా వేదనను గలిగించినవి. ఆదినమెల్ల అన్నము నీళ్లు గానకుండ గదిలో ముసుగుపెట్టుకొని పడుకొని, యేడ్చి యేడ్చి వేసారిపోయినాడు. కడగొట్టుకొడుకని కాబోలు, సుభద్రమ్మకు శంకరునిపై మహాప్రేమ. కాన కొమారుని యొద్దకు బోయి, ‘నాయనా! వెధవపరీక్ష పోతేపోయింది. దానికోసం యింతదుఃఖపడట మెందుకు? ఏమో చదివితే మంచి దనుకున్నాము. మనగ్రహచారం చాలక కలిసి రాలేదు. పోనీ, నీవు చదివి సంపాదిస్తేనేగాని పొట్టగడవని సంసారం కాదుగదా? నీవు అన్నము నీళ్లూ కానకుండా యింతగా దుఃఖపడట మెందుకురా బాబూ! మీ తండ్రి మాటలకా, ఆయనమాట లెప్పుడూ అంతే. నీవు తప్పి పోయినావని ఆయనకు దుఃఖం లేదు; డబ్బు నష్టమైందని ఆయన విచారం; అందుకోసం అట్లా వేష్టపడ్డారు. ఆయనమాటలు మనకు క్రొత్తా. ఎవ్వాళ అట్లాగే అంటారు; రేపు ఆయనే మళ్లీ చదువుకోమని పంపుతారు నాయనా! ఏడవ్వద్దు బాబూ ఏడవ్వద్దు’ అని తల్లి కడుపు గడ్డం పట్టుకొని బతిమలాడినది. శంకరుని మనస్సు తేరలేదు. ఏ విధముగా నైనను పెద్ద పరీక్ష లిచ్చినగాని తనకు ఖ్యాతి లేదని భావించినాడు. కాన యేదేశం పోదాము, ఏమి చదువుదాము; ఎక్కడ చదివినస్తే గొప్పఉద్యోగం దొరుకుతుంది—అని దీర్ఘముగా యోచించినాడు. ఈవిధముగా యోచింప యోచింప, శంకరున కొకయుపాయము తోచినది. దానితో వానిని చింత నివృత్తియైనది. అంత చివాలున లేచి వంటయింటి లోనికి వెళ్లినాడు. తల్లి వంటచేయుచున్నది. ఆమెతో ఏమేమో గుసగుసలాడినాడు. తల్లి మొదట యొప్పు కొనని యట్లు మాట్లాడినది. తరువాత దీర్ఘచర్చమీద అంగీకరించినట్లు తల యూపినది. అప్పటికి ఎనిమిది

గంటల రాత్రి యైనది. శంకరుడు వేగముగా భోజనము చేసి తనముల్లెమూటలు సరుదుకొని చల్లగా తొమ్మిది గంటలకు వచ్చు పట్నంప్యాసింజరుకు వెళ్లిపోయినాడు. మద్రాసు ప్యాసింజరుకూత వినినగాని అమ్మవారి తిన్నె దిగుపద్ధతి లేదు పంతులుకు. ఆవిధముగానే రైలుకూత వినగానే యింటికి వచ్చి భోజనము చేసి పడుకొనినాడు పంతులు. శంకరునిమీద కోపము వచ్చియుండుటచే వానిని సమాచారము పరశురామయ్య అడుగలేదు, సుభద్రమ్మ చెప్పలేదు. ఆరాత్రి గడచిపోయినది.

ఉదయము స్నానసంధ్యాద్యనుష్ఠానము లన్నియు తీరినవెనుక రాత్రి చేపెట్టెలోని యెనిమిదివందల రూపాయలను ఇనుపపెట్టెలో పెట్టనిమాట పంతులుకు చప్పున జ్ఞాపకము వచ్చినది. తటాలున వెళ్లి చేపెట్టె తెఱచినాడు. ఇక నేమున్నది? రూపాయలసంచి లేదు. పంతులుగుండె గుభేలుమనినది. మొగము వెల్లనైనది. చేతులు వణికినవి. సంభ్రమస్వరముతో భార్యను కేకలెట్టిపిలిచి, 'రూపాయలసంచి లేదేమే' అనినాడు. 'ఏమో నాకేమి తెలుసు? ఎక్కడ పెట్టుకున్నారో బాగా చూచుకోండి' అన్నది సుభద్రమ్మ. 'ఇంకెక్కడ పెట్తాను? నిన్నసాయంత్రమే గదా, రామిరెడ్డి యెనిమిదివందలు యిచ్చిపోయినాడు! రాత్రికి యినుపపెట్టెలో పెట్టవచ్చును, ఇంతలో ఏమైపోతుందని ఈసందూకాలోనే పెట్టిపోయినాను, రాత్రి జ్ఞాపకం లేకపోయింది. యిప్పుడు చూస్తే లేదు. వేసినతాళం వేసినట్లే ఉంది. పెట్టినకాగితాలు పెట్టినట్టే ఉన్నాయి. ఎవరు తీశారు? పెద్దవాడు జమాబందీకి వెళ్లినాడు. చిన్నవాడు అత్తవారింటికి పోయినాడు. ఇక ఎవరు నాపెట్టె తీశారు? శంకిగాడేమైనా తీసి ఉంటాడా? ఏడీ శంకిగాడు?' అని సంభ్రమముతో ప్రశ్నించినాడు పంతులు. 'ఏమో' అనినది సుభద్రమ్మ.

'బహిర్భూమికి పోయినాడా?'

'ఏమో నే చూడలేదు.'

'అన్నిటికి యేమో యేమో అంటావు, నీదుంపతెగ. ఎక్కడికి పంపించావు చెప్పవే' అని పంతులు పట్టరానికోపముతో పండ్లు పటపటకొఱుకుచు పలికినాడు.

'రాత్రినుండి వాడిమొగమే చూడలేదు. నన్నడిగితే నాకేమి తెలుస్తుంది?' అని సుభద్రమ్మ అక్కడనుండి వెళ్లిపోయినది.

'ఏమో మాయగా వుంది' అని పంతులు పదిమందిమనుష్యులను పిలిపించి నలువైపులకు పంపినాడు. రైలువద్దకు పంపినాడు. వాళ్లు నలువైపుల వెదకివచ్చి కనపడలేదని పంతులతో చెప్పినారు. అంతటితో రూపాయలచౌర్యము శంకరునిపనియే యని పంతులుకు రూఢిగా తోచినది. 'ఏమే, ఎక్కడికైనా పోతానన్నాడా, శంకరుడు?' అని భార్యను పిలిచి అడిగినాడు. 'నాతో చెప్పలే'దన్నది సుభద్రమ్మ. శంకరునిమీద కోపమెక్కువైనది పంతులుకు. 'వెధవ, ఎనిమిదివందలు యెత్తుకొనిపోతే ఏమవుతుం దనుకొన్నాడు? ఒకవేళ యీయెనిమిది వందలతో ఈ ఎఫ్ఫే ప్యాసయినా బియ్యే ఎట్లా చదువుతాడు కుంక? పస్తులుపడి చస్తున్నాడన్నా పైసా పంపను. ఏమన్నా కానీ, వాడు నాకు కొడుకు గాడు; నేను వాడికి తండ్రిని కాను. నేటితోసరి. వాడికి నాగడప త్రొక్కప్రాప్తి పోయిం' దని చిత్తము వచ్చినట్లెల్ల శంకరుని చెడతిట్టి, యంతటితో కసిదీరక భార్యను తిట్టి, అంతకును ఉమ్మలికము దీరక నౌకరులను దిట్టి, తనకీసొద తెచ్చిపెట్టిన యింగిలీషుచదువును తిట్టి, తాను డబ్బు ఇనుపపెట్టెలో పెట్టుకొనకపోయినందులకు తన్ను దిట్టుకొని, నోరు నొచ్చి వూరుకొనినాడు పరశురామయ్య.

౪

శంకరుడు ఇల్లు వదలి వెళ్లి వారము దినములైనది. మధ్యాహ్నభోజనానంతరము నిద్రపోయి లేచి విసనకఱ్ఱతో చెమట నార్చుకొనుచు సావడిలో కూర్చున్నాడు పరశురామయ్య. సుభద్రమ్మ పెనిమిటి కెదురుగా కత్తిపీట ముందు వైచుకొని కూర్చుండి మామిడిపండు ముక్కలు కోసి పెనిమిటి కందింపుచున్నది. ఇంతలో తపాలాబంట్రోతు ఒక జాబును తెచ్చి పంతులు కిచ్చి వెళ్లినాడు. తినుచున్న మామిడిపండు ముక్కల నావల పెట్టి పరశురామయ్య సులోచనముల దెచ్చుమని భార్యతో

చెప్పినాడు. వెంటనే గదిలోనికి వెళ్లి ముక్కద్దములను తెచ్చి యామె పెనిమిటి కిచ్చినది. భుజముపైనున్న కొల్లాయితో కంటియద్దములు తుడిచి కన్నులకు పెట్టుకొని, తత్తరపాటుతో నుత్తర మొక్కమాఱు చదివి, "అయ్యో!" అని పెద్దకేక పెట్టి, నిశ్చేతనుని వోలె



గోడకు చేరగిల బడిపోయినాడు. "అయ్యో! ఏమి! ఏమి!" అని మొఱపెట్టుచు కొయ్యయైపోయిన పెనిమిటిని సుభద్రమ్మ తియ్యబోయినది. మొదట పంతులు పెట్టిన గావుకేకను, తరువాత సుభద్రమ్మ యేడ్చిన యేడ్పును విని యింటిలోనివారును, నిరుగుపొరుగువారును పోగైనారు. బహువిధోపచారములు చేసినమీదటగాని పంతులుకు ప్రాణము చేరుకొనలేదు. తెలివి రాగనే, "నాకొంప మునిగింది: నే నెట్లా బ్రతికేది?" అని పంతులు మరల దుఃఖింపసాగినాడు. పెనిమిటి యేడ్చుచుండెనని భార్య యేడువసాగినది. వారిని చూచి బిడ్డ లేడువసాగినారు. వారందఱను జూచి యితరులు కంట దడిపెట్ట మొదలిడినారు. ఈవిధముగా నొకయఱగంట గడచిపోయినది. సమాచార మెఱిగి యేడ్చుచున్న దొక్కపంతులే: తక్కినవారంద ఱాతని నేడ్పుమజూచి యేడ్చుచున్నవారే. సంగతి తెలియకుండ యేడ్చుట బాగుగ లేదని పంతులు పెద్దకొమారుడైన లక్ష్మీపతికి దోచినది. కాన నతడు దుఃఖమును కొంత యుపశమింపజేసికొని యుత్తరమును విప్పి చూచినాడు. అం దిట్లు వ్రాయబడియున్నది:

"రాజమాన్య రాజపూజితులైన శ్రీ కోటంరాజు పరశురామయ్య పంతులు నాన్నగారికి తమకొమారుడు శంకరుడు అనేక సాష్టాంగనమస్కారములు. తర్వాత- నేను మూడుదినముల క్రిందట యీ బొంబాయికి వచ్చితిని. ఇచ్చటనుండి నే పురయప్పు స్టీమరులో సీమకు వెళ్లుచున్నాను. నీ పెట్టెలోని యెనిమిదివందల రూప్యములను నేనే తీసికొనివచ్చితిని. నేను బారిష్టరుపరీక్షనై వచ్చుట కగువ్యయ మంతయు గుంటూరులోని యొక న్యాయవాది యొసంగునట్లు ఆయనకు నాభాగపు ఆస్తిని తాకట్టుపెట్టి యేర్పఱచుకొని వచ్చితిని. పరీక్షయందోడిన యవమానమును తీర్చుకొని, తమ యుద్యోగమున కర్హుడనైన వెనుకనే తమ దర్శనము చేయగలను. క్షమించవలెను. మహాలక్ష్మి సమాన యగు మా తల్లిగారికి నా నమస్కారములు.

బొంబాయి, ౨-౮-౨౮. } ఇట్లు: విధేయపుత్రుడు, శంకరుడు.

లక్ష్మీపతి యుత్తరము చూచుట ముగియుటతోడనే, 'ఏమిటి, ఏమి'టని అందఱడిగిరి. 'ఏమీ లేదు. మావాడు సీమకు వెళ్లుతున్నా నని యుత్తరము వ్రాశా' డని అత డనెను. ఆమాట వినుటతోడనే, 'పంతులుకు బలేశాస్తి అయింది. ఊరందఱిని ఉత్తుత్త నెపములు కల్పించి పెలి పెట్టినట్లు గాదు' అని లోలోన సంతసింపుచు గుమి

కూడినజను లెక్కసేయక యక్కడకు వెళ్లిపోయిరి. ఏమి ప్రమాదమో అని భయముతో నేడ్చుచున్న సుభద్రమ్మ ఆసమాచారము వినుటతోడనే యీసమాచారము తాను కొంతకొంత యెఱిగినదే యగుటచే ఏడ్పు మానివేసినది. కాని శిష్టాచారసంపన్నుడనని డాబులుకొట్టుచు, కారణము లేని నెపములు కల్పించి యూరిజనుల బహిష్కారములతో బాధింపుచు, నిరంకుశుడై వర్తింపుచున్న పంతులు లాయవమానము నెట్లు భరింపగలడు? పాపము, పంతులు లా యవమానదుఃఖమును సైరింపలేక, నలువురలో తల యెత్తుకొని తిరుగజాలక, యింట్లోనుండి బయటికి రాలేదు. తననిష్ఠ నీళ్లగలిసెనే, తనకే బహిష్కారకర్మము పట్టెనే యని లోలోన కుములుచు, అన్నము నీళ్లు గానక, చిక్కి శల్యమై, మంచము పట్టిపోయినాడు. పాప మాతడు వచ్చి కూర్చుండకపోవుటచే సమ్మవారి తిన్నె చిన్నపోయినది. తమ బహిష్కారవ్యాపారమునకు విఘాతము గల్గుటచే శివయ్య ప్రభృతులకు వెఱ్ఱెత్తినట్లయినది.

౫

శివయ్యశాస్త్రికి ఒకతే ఒక్కకూతురు: పార్వతి చక్కనిచుక్క; పరువమందిన బంగరు బొమ్మ. ఆ బిడ్డకు విద్యాబుద్ధులు గఱపుటలో పూర్వాచారపరాయణుడగు శివయ్య నూత్నపంథా త్రొక్కినాడు. అతని యనూనకృషిచే పార్వతి గీర్వాణాంధ్రముల యందు మంచిప్రజ్ఞావతి యైనది. "ఊరివారి నందఱిని ఊరకనే ఆక్షేపిస్తావు. నీవుదొరసానిలాగ నీకూతురుకు ఆపదు నేమి"టని ఎవరైన నడిగినచో, "అయ్యా! ఏమి చెయ్యను? నాకు కొడుకైనా అదే, కూతురైనా అదే-నా ముచ్చటెట్లా తీరాలి?" అని దీనముగా చెప్పి తప్పించుకొనువాడు. "అవును పాపము" అని లోకులుగూడ మనస్సమాధానము చేసికొనువారు.

శివయ్య శ్రమపడి రెండువేలు పోసి పార్వతివిద్యాబుద్ధులకు దగినవరుని బి. ఏ. పరీక్షకు జదువుచున్నవానిని తెచ్చి పెండ్లిచేసినాడు. కాని విధివిధానమును దప్పింప నెవరితరము? శంకరుడు సీమకు వెళ్లిన యాఱుమాసములకు రాజమండ్రిలో చదువుచున్న పార్వతి పెనిమిటి గోదావరిలో నీతగొట్టబోయి యందుపడి మరణించినాడు. ఎవతెను తమ ప్రాణపదముగా నెంచుచుండిరో అట్టి తమ ప్రియకొమార్తెకు రారాని దురవస్థ ప్రాప్తించినప్పుడు తల్లిదండ్రు లెట్లు సైపగలరు? అందు శివయ్య దుఃఖము తల్లిదుఃఖముకంటె మిన్నయై పోయినది. పాప మాతడు నేల నంటిపోయినాడు. 'వాని వెధవకూతురు నగలు పెట్టుకుంటున్నది. దీని విధంతుకొమార్తె రవిక తొడుక్కుంటున్నది. వానికూతురు సకేశి; వానియింట బ్రాహ్మణార్థము చేయరా'దని నిరంతరము ఊరిజనుల నాక్షేపించుచు పంతులుతో కొండెములు చెప్పి ఆంక్షపత్రిక లంపుచు బాధించెడిశివయ్య కిట్టికష్టము ప్రాప్తించినందులకు 'పాపకర్మునకు దగినశాస్తి అయిం'దని అతనితో నగచాట్లు పడినవారు కొందఱు సంతోషించినను, పెక్కుమంది లావణ్యవతియైన పార్వతి దురవస్థకు మిక్కిలి దుఃఖపడిరి. ఈదుఃస్థితిలోనే అభాగ్యురాలగు పార్వతి రజస్వలయైనది. ఏకఠోరనియమములు విధంతువు లవలంబింపవలెనని శాస్త్రి రూక్షముగా బలుకుచుండెనో, ఆకఠోరనియమములను తనప్రేమైకనిలయయైన పార్వతిపై ప్రయోగించుట యనిన శివయ్యహృదయము విదారించికొనిపోయినది. 'అయ్యో, ఆపాడురూపము నేను చూడలే'నని తల కొట్టుకొని యేడువసాగినాడు. 'అయ్యో! పదునాలుగేండ్ల పిల్లగదా, ఇంకా రెండేళ్లు చీరరవికలు కట్టుకొంటేనేమి? చెవి కమ్మలైనా పెట్టుకుంటేనేమి? చేతి బంగారుగాజులైనా ఉంచుకుంటేనేమి?' అని యోచన సాగించినాడు. తలనొప్పియు, దారిద్ర్యమును తన దాక వచ్చినగాని తెలియదని లోకసామ్యము గదా.

౬


మూడేండ్లు గిఱ్ఱున తిరిగిపోయినవి. శంకరరావు బారిష్టరు శంకరరావై స్వదేశమునకు తిరిగి వచ్చినాడు. తనరాక ముందుగా తల్లిదండ్రులకును, బంధుమిత్రులకును దెలియబఱచినాడు. శంకరునిఆగమనవార్త దెలియబడగనే యింట్లో పెద్దవివాదము బయలువెడలినది. 'వస్తే రానీ నాగడప త్రొక్కనియ్య'నని పరశురామయ్య వాదన.

'మూడేండ్ల క్రిందట ఇల్లు వదలి పోయినబిడ్డ నేటికి మరల దేశంలోకి వస్తుంటే నేను చూడకుండా ఉండలే'నని సుభద్రమ్మ యేడుపు. వాడికి మనయింట్లో అన్నము పెట్ట వద్దు;నీళ్లు పొయ్యవద్దు. ఇంటికి వచ్చి చూచిపోనీ, దానిలో తప్పేముం'దని కొడుకులసమాధానము. 'శంకరుడు యింటికే రావాలె-పంతులుకు బహిష్కారపత్రిక పంపించేదే. అందలేని వెలిపెట్టినట్టుగాదా, తనకు యింకోధర్మమా?' అని యూరిలోనివారి ఆలోచన. పంతులుకు ఎటు చేయుటకును తోచలేదు. శంకరు నింటికి రానిచ్చినచో గ్రామస్థులు తన్ను బహిష్కారావమానమునకు పాల్పరచెదరని భయము. రానీయకున్న భార్యాపుత్రులతో తీవ్రమైన పోరాటము. ఏది చేయును,ఏదిమానును? ఎటు చూచినను గళబద్ధకముగనే యున్నది. ఆలోచింప నాలోచింప, గ్రామస్థుల బహిష్కారమునకైన నొప్పుకొననగును గాని భార్యాపుత్రులతో పోరాడుటకు పరశు రామయ్యకు సాహసము కలుగలేదు. ఏల యందురా: "శంకరునితో నిర్దాక్షిణ్యముగా పోరాడినందుననే నాతడిట్లు విదేశ మేగుట ప్రాప్తించినది. అట్లు గాక 'నాయనా! పరీక్ష పోతే పోయింది, మళ్లీ చదువరా' అంటే శంకరు డింత సాహసం చేసేవాడు కానేకాదు గదా! కాబట్టి ఒక అవివేకము వల్ల కుటుంబమున కిట్టి యాపద తెచ్చినాను. ఇప్పుడు ఈ భార్యాపుత్రులతో గూడ వివాదము పెట్టుకొనినచో వీళ్లేమి చేస్తారో! యిందువల్ల మరల యెట్టికుటుంబ చిక్కులు వస్తాయో!" అని పంతులుకు మనస్సులో పెద్దభయము పుట్టినది. కాన ఎటును సమాధాన మీయకుండ ఊరకొనినాడు. తండ్రి మౌనము చూచి తమ్ము నింటికి పిలుచుకొని వచ్చుటకు అన్న లిరువురు పూనుకొనినారు.

మఱునాడుదయము రైలువద్దకు వెళ్లి అన్న లిరువురు శంకరు నింటికి తీసికొని వచ్చినారు. సుభద్రమ్మ కొమారుని కౌగిలించుకొని తన యనుపమాన వాత్సల్యమును నయనవినిర్గతబాష్పబిందువులచే వెల్లడించినది.

ముక్కవోయిన కత్తివలె, కోఱలు పెఱికిన సర్పమువలె, వాడిచెడిన వాడై, ఖేదమోదశూన్యమైన నిర్వికార నిరాలాప నిశ్చల దృష్టితో కొమారునకు స్వాగత మిచ్చినాడు పంతులు.

శంకరు డింటికి వచ్చిన సమాచారము ఒక్కనిముసములో గ్రామమంతట వ్యాపించినది. సంబంధము లేని వారికిగూడ నూహాపోహలతో సంబంధములు గల్పించి పంతులుచేసిన బహిష్కారములచే బాధింపబడియున్న గ్రామస్థులకు పంతులుపై కసిదీర్చుకొనుటకు మంచియవకాశము లభించినది. అనామకులందఱు నాయకులైనారు, మూలనున్నవారెల్ల ముందుకువచ్చినారు. 'వాకిట్లోకివచ్చిన వాడు వంటయింట్లోకి వచ్చియుండడా? పంతులుపై బహిష్కారపుసంకు ప్రయోగించవలసినదే.' అని నిశ్చయించి



నారు. ఆపాయంత్రము అమ్మవారితిన్నె గ్రామజనములతో బిల బిల లాడినది. బహుదినములనుండి బహిష్కార నాయ కులలో నొకడుగా నుండుటచే నొప్పుదల లేకున్నను శివయ్య సభాధిపతిగా నుండుట తప్పనిసరి యైనది. సరే యని సభాధిపతిగా కూర్చున్నాడు. 'ఈగ్రామపెద్దయు, శిష్టాచారసంపన్నుడును నైన శ్రీ కోటంరాజు పరసు రామయ్య పంతులుగారు, ఇంగ్లండు వెళ్లి మూడువత్సర ములు దొరలతో మద్యమాంసాదులు సేవించి వచ్చిన కుమారుని యింటికి రప్పించి, యెట్టి ప్రాయశ్చిత్తము లేకుండ పంక్తిభోజనము పెట్టినారు గావున, వారిని బహిష్కరించవలసినది. నేటినుండి యీగ్రామస్థు లెవ్వ రును శుభాశుభకర్మలకు వారిని తమయింటికి పిలువ రాదు; వారింటికి నెవ్వరును పోరాదు. అన్ని కులముల వారు ఈకట్టడికి లోబడి యుండవలెను. అట్లు లోబడని వారు తమకులస్థులచే వెలివేయబడుదురు.' అని తీర్మా నించినారు.

౭

పార్వతి శంకరునకు చిన్ననాటి నేస్తకత్తె. వారిద్దరి కారేడువత్సరములు వ్యత్యాస మున్నను వా రిద్దరు చాల స్నేహముగా నుండువారు. బుద్ధిమతి యగు పార్వతికి శంకరుడు తనచెల్లెలితో పాటు చదువు చెప్పు చుండువాడు. ఆసమయములో తనసౌందర్యవివేకములచే శంకరునిమనస్సు కొల్లగొనినది పార్వతి. ఆమెబుద్ధి నైశిత్యమే శంకరున కామెపై నకారణప్రేమను గలుగ జేసినది. అతడు పెద్దవాడై ఉన్నతతరగతులలో జదువు చుండెడి దినములలో గూడ సెలవుదినములలో తాను వచ్చినప్పుడు దినమున కొకటి రెండు మాఱులు శివయ్య యింటికి వెళ్లి పార్వతిని చూడకుండ నుండువాడు కాడు. బాలికలు చదువుకొనుట యనిన శంకరునకు మహా అపేక్ష. "పార్వతి శ్రద్ధగా చదువుకొంటుందని, చూడు, ఎంతప్రేమగా విచారించిపోతాడో! పట్నవాసాలలో చదివే పిల్లలకు మహాగర్వం ఉంటుంది: పాపం, శంకరుడికి అటువంటివేషాలు లేవు. చిన్ననాడు ఆడుకొన్న సావాసంగూడా మఱచిపోకుండా పార్వతిని చూచి పోతాడు!" అని పార్వతి తల్లిదండ్రులు వాత్సల్యపూర్వ కముగా శంకరుని శ్లాఘించుచుండెడివారు.

ప్రస్తావవశమున తల్లి పార్వతి వైధవ్య మందిన సమాచారము శంకరునకు చెప్పినది. శంకరుని దయా పూర్ణహృదయమున నావార్త పిడుగువలె దాకి యాతని హృదయమును విదారించినది. 'అంత మంచి పార్వతికి, అంతవిద్యావతియైన పార్వతికి, అంత సౌం దర్యవతియైన పార్వతికి, వైధవ్యమా! అయ్యో, విధాత యెంత నిష్కరుణుండు!' అని నిశ్చేష్టుడై పోయినాడు శంకరుడు. అప్రయత్నముగా నతని నేత్రములనుండి యశ్రువులు జలజల రాలినవి. ఆ దుఃఖ మాపు కొనుటకే అతని కెంతయో కష్టమైనది. పరస్పర ప్రేమ ప్రకటనము గావించుకొనుచు, స్త్రీ పురు షులు యథేచ్ఛముగా సంచారముచేసెడి దేశములో శంక రుడు మూడేండ్లు గడపివచ్చినాడు; పెక్కుమంది స్త్రీల గలసి వసించినాడు; చదువుకొనినాడు; విహారములు సల్పినాడు: కాని యతని వినిర్మలచిత్త మెప్పుడును కళంకి తము గాలేదు. విద్యావిహారముల స్వేచ్ఛావర్తినులైన పాశ్చాత్యనాగరక యువతీమణులయెడ నాతని హృదయ మెప్పుడును నాకర్షింపబడలేదు. అమాయకమును, సౌమ్య మునగు హైందవసాధ్వీముగ్ధస్వరూపము పార్వతీరూపము న నాతని చిత్తఫలకమున నంకితమై యుండుటయే యందు లకు కారణము. పార్వతి వివాహిత యయ్యెనని యాతనికి తెలియును. ఆమెపై తనప్రణయదృక్కుల బ్రసరింప రాదనికూడ అతడు తలంచెను. కాని తనకు పత్నిగా నుండెడి యువతి యిట్టి ముగ్ధమోహనసుందరి యై యుండ వలెననెడి తలంపుమాత్ర మాతడు తనహృత్సీమనుండి తొలగింపజాలక పోయెను. ఈవిధముగా తనహృదయో ద్యానమున గోముగా పెంపబడుచుండెడి ప్రేమలతయైన పార్వతి దుర్భరవైధవ్యదుఃఖమునకు పాల్పడినదని వినుట తోడనే శంకరు డామెను చూడకుండ నుండలేకపోయి నాడు. కావ తనరాకకు గ్రామస్థులు చేయుచున్న సందడియు, శివయ్య పూర్వాచారపరాయణత్వమును బాగుగా నెఱిగియుండియు, శంకరుడు చివాలున లేచి పార్వతిని చూచుటకు వెళ్లిపోయినాడు.

౫

శంకరుడు శివయ్యయింటికి వెళ్లినప్పటికి పార్వతి తలిదండ్రు లిరువురును నింట లేరు. చింతకు కాణాచియై యున్న మొగముతో, వశ్రువుల కునికిపట్టయియున్న కన్నులతో పార్వతి యాతనికి సావడిలోనే కన్పడినది. ఆమెను చూచుటతోడనే శంకరునకు మహాదుఃఖము వచ్చినది: అచేతనునివలె యట్టె నిలుకబడిపోయినాడు. అతనిని చూడగనే పార్వతికిగూడ పట్టరాని యేడుపు వచ్చినది. ఆతనియెదుట నిలువబడుటకుగూడ నశక్తురాలైనది. కాని విధివశమున నాసమయమున నామె తలిదండ్రు లిరువురుగూడ నింట లేకుండుటచే దుర్భరవైధవ్య దుఃఖోపహతచేతస్క యగు పార్వతియే యాతనిని కూర్చుండుడని మర్యాద చేయక తప్పినదికాదు. కాన పొంగి పొరలివచ్చుచున్న దుఃఖము నెట్లెట్లో కంఠగతము గావించుకొని, కుర్చీవైపు చేయిచూపి, 'కూర్చోండి' యనినది. దుఃఖభారముచే నిలువ నశక్తుడై యున్న శంకరుడు తత్క్షణమే కుర్చీలో కూలబడినాడు.

పార్వతికి పదునారువర్షములు వచ్చియున్నవి. కాని నామె యవయవముల పొందికయు, మేనిచాయయు నిసుపడించి యుండెను. ఆమె యింకను చీరరవికెలను ధరించియుండెను. మఱియు నలంకారములను గూడ పూర్తిగ పరిహరించియుండలేదు. అయినను నవి యెల్ల నిర్జీవశరీరమున కలంకరింపబడిన ట్లున్నవే కాని యామె కట్టిశోభ నొసంగుటలేదు. ఆ అరుణాధరముపై చిఱునవ్వు కఱవై యున్నది. ఆ విశాలలోచనములలో నాత్మోల్లాసముల భావమై యున్నవి. ఆచంద్రార్ధసదృశ లలాటభాగమున కుంకుమరేఖ కొఱవై యున్నది. ఆనిద్దంపు చెక్కుటద్దము లశ్రుధారాకళంకితమై యున్నవి. ఇరులు గ్రమ్మినట్లు ఎటు చూచిన విషాదచ్ఛాయలే మొగమున నట్టిపడుచున్నవి. అట్టిస్థితిలో రూపవతియయ్యును పార్వతి విరూపవలెనే కన్పట్టుచున్నది. పార్వతి దైన్యాకృతి చూడంజూడ శంకరునిదుఃఖము దుర్భర మయ్యెను. అతడామెను బలుకరించుటకు గూడ నశక్తు డయ్యెను. లజ్జానతయు, దుఃఖవిహ్వలయు నైన పార్వతిగూడ నాతని నెట్టికుశలప్రశ్నయు నేయలేదు. గోడ నానుకొని నిలువబడినది నిలువబడినట్లే యుండిపోయినది. పదినిముసములపాటట్టె కడచిపోయినది. ఆపన్నురాలై యున్న పార్వతిని పలుకరింపవలసిన భారము తనదే యని శంకరునకు తోచినది. కాని, 'యేమని పలుకరింతును? నాయోదార్పు ఆమెదుఃఖమును దూరీకృతము చేయునదిగా నుండవలదా? ఇట్టి విద్యాసరస్వతికి, ఇట్టి భూలోకసుందరికి, ఇట్టి అనాఘ్రాతకుసుమమునకు మాంగల్యశోభ నొసంగని యట్టి యోదార్పులవలన ప్రయోజన మేమి?' అనుకొనినాడు శంకరుడు. కాని, 'యట్టిసూచన లేమైన చేసిన పార్వతియంగీకరించునా? శుద్ధవైదికుని కడుపునబుట్టిన బిడ్డగదా!' అని మరల యోచించినాడు. 'వేదమత మే యంగీకరించునో వైదికు లాచరించుటలో నాక్షేపణ మేమి? కాన గీర్వాణపండితురాలగు పార్వతిని పునస్సౌభాగ్యమును బడయుటకు గీర్వాణభాష నేశోధించి తరింపవలసినదని హెచ్చరించుట యుక్త'మని శంకరునకు తోచినది. 'అదియూ మెకష్టమును తొలగించుటకు యుథార్థమైన యూరడింపు.'అని శంకరు డూహించినాడు. ఇందు బ్రాయుటకు కొన్ని నిముసములు పట్టెనేకాని శంకరుని మనస్సున నిట్టిభావములు మెఱుపులు మెఱసినట్లు క్షణములో మెఱసిపోయినవి. శంకరుడు లేచినాడు; పార్వతివంక చూచినాడు. అవిరళాశ్రుధారలచే నామె లలితకపోలము లార్ద్రములై యుండుట శంకరునకు కన్పట్టెను. శంకరు డిక మనస్సు నిలుపలేకపోయెను. తనమాట లెవ్వరైన విందు రను శంకనో, ఏమో, పార్వతినొకింత సమీపించి, "పార్వతీ! వీడుకొనుము. అర్థమతము నీ సౌభాగ్యమును పునరుద్ధరింపగలదు." అని చెప్పి వెడలిపోయెను. ఆపలుకులును, ఆరోడ నాతడు చూచిన చూపులును పార్వతి హృదయమున నాశాంకురముల మొలక లెత్తించినవి.

౬

గ్రామస్థులు గావించిన బహిష్కారతీర్మానము ఆరాత్రియే పరశురామయ్యపంతులు కందజేయబడినది. అది చూచి పంతులు నిశ్చేష్టుడైపోయినాడు. 'అయ్యో! పూలమ్మినయూర కట్టె లమ్మవలసివచ్చె'నని, దుఃఖము

డినాడు. తెల్లవారిన తరువాత గ్రామస్థుల మొగము జూచుట కాతనికి మొగము చెల్లలేదు. కాన ఆరాత్రియే



"పార్వతీ! ఏడువకుము. అర్థ మతము......పునరుద్ధరించగలరు"

మూట ముల్లెలు గట్టుకొని కాశీకి వెళ్లిపోయినాడు. సుభద్రమ్మ యాతనిని వెంబడించినది. ఊరిలోని కోలాహలము చూచి శంకరుడు గూడ నారాత్రియే గుంటూరు వెళ్లినాడు. తెల్లవారగనే బహిష్కార ప్రభావము పంతులింటివారికి బాగుగా కన్పట్టినది. పనిమనిషి రాలేదు. చాకలి రాలేదు. పంచాంగపు బ్రాహ్మణుడు, నీళ్లు పోయు సుబ్బమ్మ రాలేదు. ఎన్నడు నెఱుగని యీ దురవస్థకు పంతులు కొడుకులు, కోడళ్లు అడలిపోయినారు. అలవాటులేని పనులన్నియు చేసుకొని ఆదినము వారు భోజనము చేయునప్పటికి మూడుఝాములు గిఱ్ఱున దిరిగిపోయినవి.

పల్లెటూరి బహిష్కారములలో మతనిష్ఠకంటె పగసాధింపులే యెక్కువగా నుండును. ఆపట్టింపుల కర్థముండదు. ఆ అంక్షలలో న్యాయ ముండదు. దొరలకు గూడ గుడ్డ లుతుకు చాకలులు దొరల దేశమునకు వెళ్లివచ్చినవాడు వచ్చిన యింటి వారికిగుడ్డ లుతుకకునుటలో నర్థ మేమున్నది!

౧౦

మానవులు తలచిన తలపులెల్ల, దలపెట్టిన కార్యములెల్ల నిర్విఘ్నముగాను, నిరంతరముగాను జరుగుచున్నచో, బలవత్ప్రభువులు 'భగవంతు డను వాడు లేడు: మేమే భగవంతుల'మని డప్పు బజాయించువారే; కాని అపారశక్తి సంపన్నుడగు పరమేశ్వరుడు వారి నొకకంట కనిపెట్టి వారి యత్నములకు విఘ్నములనో, వంచనలనో, పరాభవములనో కల్పించి తన జగన్నాథత్వమును నిలుపుకొనుటచేతనే ప్రజాప్రపంచ మాయనను మఱువజాల కున్నది. దీనశరణ్యు డగు భగవంతు డట్లు తనమహామహిమను బ్రకటింపకున్నచో మతసంఘ రాజకీయారి కబలో నేతుల రాయిడికి దీనజనుల డిందవలసిన దేకదా!

ఇంకను బాగుగా తెల్లవాఱనైన లేదు— శివయ్యశాస్త్రి కొమార్తె యెక్కడకో పోయిన దట నెఱుగుచున్నారు, అనువార్త యూరిలో బడినది. ఒకరి నుండి యొకరికి ఊరంతట నొక్కక్షణములో వ్యాపించినది. వైధవ్య దుఃఖము భరింపలేక ఎందులో బడినదో, ఏమైనదో అని ఊరంత వెదకిరి. కాని పార్వతిజాడ కన్పడలేదు. అందుమీద, "పెండ్లి చేసుకో పోయిందేమో" అని కొందఱు; "పెండ్లి పెటాకులు దీన్నెవడుచేసుకోవచ్చాడు? ఎవడో మోసగించి తీసుకుపోయినా"డని కొందఱు; ఛా, అటువంటిది కాదు; మంచియోగ్యురాలు. యింట్లోకాలు బయట పెట్టియెఱుగదు. మాడేండ్లయినదిగ దామగడు నెచ్చి, ఒక్కచెడ్డమాట విని యెఱుగము. తలవని తలంపుగా యింత సాహసం చేస్తుందా?"అనికొందఱు; "ఏమిఎఱుగనట్లుండే వాళ్లే యెంతపనైనా చేసేది" అని కొందఱు; "అదికాదు. మొన్న పంతులుకొడుకు శివయ్య యింటికి వెళ్లినట్టు

విన్నాము కాదా; వాడే దాన్ని లేవదీసి ఉంటాడు” అని కొందరు — ఎవరికి తోచినట్లువారు వ్యాఖ్యానము చేయ సాగించినారు. ఊరిలో ప్రజలనోళ్ల యిట్లుండ, తలి దండ్రుల గోడు చూడ శక్యము గాకున్నది. అల్లుడు పోయినందుకే యేడ్చుచున్నవారికి అమ్మాయిగూడ కంటికి కఱవై పోయినప్పుడు వారేవిధముగా భరింపగలరు? ఆదినమున వారు పాచిమొగములుకడుగుకొనలేదు; పాచి వాకిలి యూడ్చుకొనలేదు; పరచినపక్కలపైనుండి లేవ లేదు: కన్నీటితో పక్కలు తడుపుచు అట్లే పడియు న్నారు. ఎవ రెన్నివిధముల నోదార్చినను వారు దుఃఖ విముక్తులు కాలేదు.

ఆదిన మావిధముగా గడచిపోయినది. మఱునాడు గూడ వారట్లే దుఃఖించుచుండ ఎక్కడనుండియో శివయ్యకొక యుత్తరము వచ్చినది. దానిని ఆతురతతో విప్పి చూడ, అం దిట్లు వ్రాయబడి యున్నది:

“పూజ్యులైన శ్రీతండ్రిగారిపాదపద్మములకు తమ ప్రియ కొమార్తె పార్వతి నమస్కార శతములు.

నాన్నా—

నీవు ప్రేమపూర్వకముగా చెప్పిన గీర్వాణభాష నాకు మాంగల్యభిక్ష పెట్టినది. చూడుము:—

“నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ,
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.”
—పరాశరుడు.

“పాణిగ్రహే మృతే బాలా కేవలం మంత్రసంస్కృతా,
సాచేదక్షత యోనిస్స్యాత్ పునస్సంస్కార మర్హతి.”
—వసిష్ఠుడు.

మతకర్తలగు మహర్షులవాక్యము లిట్లుండ, సర్వ మంగళ విశేషరహితమగు వైధవ్యావస్థలో నేనుండ నేల? శాస్త్రనిషిద్ధము కాదని యెంచినందున నేనే పున ర్వివాహమున కంగీకరించితిని. నీప్రియ కొమార్తనైన నేను నీసహజవాత్సల్యమునకు దూరము గానని నమ్ము చున్నాను.

ఇట్లు: నీ ప్రేమంపుతనయ,
పార్వతి.”

ఆయుత్తరమును చూడగనే శివయ్య గుండె బాదు కొని కొమార్తె పెండ్లాడుచున్నందుకు గాక ప్రతిష్ఠ పోయినందులకే కొంత యేడ్చి, ‘సాధ్యమైతే రవ్వ గాకుండా తీసుకవస్తాము’ అనిచెప్పి, సమాచార మెవ్వ రికి చెప్పకుండ, భార్యాసహితుడై గుంటూరు వెళ్లి నాడు.

౧౧.

సుప్రసిద్ధులగు లక్ష్మీనారాయణ పంతులుగారి యుదారకృపచే పార్వతీ శంకరుల వివాహము మహా వైభవముగా జరిగినది. కొమార్తయున్న దేవిధముగా నైన మాన్పి యింటికి తీసికొనిరావలె ననుమోహముతో బయలుదేరిన శివయ్యశాస్త్రి గుంటూరు చేరి, లక్ష్మీనారాయణ పంతులుగారి యింటికేగి చూచునప్పుడే పెండ్లిపీటలపై నుండి లేచి పెద్దపెద్ద లందఱకు నమస్కరించుచున్న పార్వతీ శంకరులు ప్రత్యక్షమైనారు. తండ్రిని చూచుట తోడనే తటాలున వచ్చి పాదములపై బడినది పార్వతి. తెల్లబోయి, తెలివి దెచ్చుకొని, “దీర్ఘ సుమంగలీ భవ” అన్నాడు శివయ్య!

కవి ప్రబోధము

మంగిపూడి వేంకట శర్మ గారు

(కెమకటిసంచిక తరువాయి)

కవిమండలి సమకూర్చి - సవినయ మతు లగుచు దేశసౌభాగ్యము జే
రువ జేర్చునట్టి ఫక్కిక - లవలంబింపంగ దివురు డతి ధృతి మెరయన్.

ఎవ రేపొత్తము వ్రాసిన - జనమున స్వాతంత్ర్యపదవి సంపాదింపన్
వివిధోపాయము లిచ్చెడు - కవనమె యల్లంగ బద్ధకంకణు లగుడీ.

పెద్దదొ చిన్నదొ గీతమొ - గద్దెమొ పద్దెంబొ యనక గ్రంథంబుల నే
పెద్దలు పిన్నలు వ్రాసిన - తద్దయు మన్నింపుడీ యుదారత నెరయన్.

దేశాభ్యుదయము జూపెడు - కోశంబులు గూర్పవలయు కోట్లకొలందిన్
కోశాభ్యుదయములోనే - దేశాభ్యుదయంబు గలదు తెలియుదురె కదా.

ఏవీ దేశ చరిత్రము - లేవీ జీవితచరిత్ర లెన్నున్నవి యే
వేవీ దేశాభ్యుదయమె - పావన మని బోధసేయు పలుకబ్బంబుల్.

శీలమును బెంచునవియున్ - శ్రీలం గూర్పంగ నుపమ జెప్పెడు నవియున్
తాలిమిని దెలుపు నవియున్ - ధీలలితుల జేయు కృతులు తెలుగుల గలవే.

నీతిని నిల్పెడు నవియును - చాతుర్యము నేర్పునవియు జాతీయకళా
భూతి మతసాంప్రదాయిక - రీతుల బోధించు నెన్నికృతు లున్నవియో.

నిరుపమమగు నృపనీతిని - గరపు నవియు ధైర్యశౌర్య గాంభీర్యగుణో
త్కరుల గలిగించు నవియును - వరకావ్యము లెన్ని తెనుగుబాసను గలవో.

బానిసతనమున గ్రుగ్గెడు - మానిసులను దేశభక్తి మహితాత్ములు గా
మాననిధులుగా మార్చెడు - మానితకావ్యంబు లెన్ని మన కున్నవియో.

కడుపున్ గక్కుర్తికినై - చెడు గ్రంథంబులను చెడుగుచిత్రముల రచిం
చెడు వారిని వారించెడు - నుడుగులుగల గ్రంథములు తెనుంగున గలవే.

దేశాభిమాన నిరతిని - దేశమె సర్వస్వమనుచు త్రికరణశుద్ధిన్
దేశమునకు బలి కాగల - ధీశాలుల జేయుకృతులు తెనుగున గలవే.

ఆత్మగౌరవంబె యైశ్వర్య మని సర్వ - సంపదలను రోసి శాంతి మదిని
కష్టములె సుఖాలుగా నెంచు నభిమాన - మతుల బుట్ట జేయు కృతులు గలవె.

బాలికలకు బాలురకున్ - స్త్రీలకు ప్రత్యేకవిధులు దెలిపెడు సద్గ్రం
థాలును నట్టివె పత్రిక - లాలోకింపంగ ముచ్చ టైనను గలవే.

ఆరోగ్యబలంబుల కా - ధారం బై సకలసౌఖ్యదం బగు వ్యాయా
మారాధన సాధనలం - గూరిచి వివరించు కృతులు కోరిన గలవే.

కల్లబొల్లి పత్రికము లెల్ల చదివి యే - త్రోవ తెన్ను లేక జీవితములు
వ్యర్థపరుచుకొనుచు బ్రతుకుచున్నా రహో - పామరులు ద్విపాదపశువు లగుచు.

ఇట్టి పరిస్థితులం దిట - బుట్టిన సుకవులు స్వజన్మభూమికి గలయీ
కట్టు లణప కంకణమును - గట్టుకొనగ వలదె సార్థకత గనవలదే.

ధనమే ప్రధానముగ నీ-మనముల దలపోయ దగునె మాన్యులు గద జీ
వనములు బుద్బుదములుగద-ఘనకీర్తి గడింపవలదె కవిజనులారా!

కలమును బట్టినదానికి-ఫలమును దిలకింప నుదర భరణమె యైనన్
హాలమును బట్టగ దగదే- కలితనమున మెరసి కీర్తి గాంచగవలదే.

కలమే కనకము గావలె-కలమే ఘనజాతిరత్నఖని గావలయున్
కలమే కోరందగినన-కలమున్ సమకూర్చు కల్పకము గావలయున్.

కలమే వజ్రము గావలె-కలమే విపదబ్ధికలము కావలె తొలియే
కలమే యన నెత్తగవలె-కలమే యువసతిని గన్న కవిజన్మ భువిన్.

కడు సామర్థ్యంబున జిక్కిన-జనులగు దేశీయు లెల్ల జ్ఞాను లగునటుల్
వడివడి సద్గ్రంథము లె-క్కుడుగా రచియించి ప్రజలకును నిడదగదే.

ఆశావాగురలన్ బడి- దేశంబును మరచి స్వార్థదృష్టిని మోహా
వేశు లగువారి బహుగతి- దేశము వహి త్రిప్ప దీక్ష దివురగవలదే.

దేశాభిమాని వేషము - దేశీయులు మెచ్చుపద్ధతిని వేయుచు ను
ద్దేశముల పనుల నేరగు - దేశద్రోహులను కవులు తెగడగవలదే.

మనసంఘమందు జొచ్చిన - మనమతమున జేరియున్న మహాధ్యాచారా
లను మాన్పి సంస్కరింపగ - ఘనతర మగు దీక్ష బూన గవికిక దగదే.

తాటోటు మాట లాడుచు - కోటీశ్వరులట్లు నీటు గోటు గలిగి కై
లాటము చేసెడు తులువల - బూటకములు మానిపింప బోలదె కవికిన్.

నింగ మెతుకు లేదు మీసాల సంపెంగ - నూనె యున్నయట్లు కూళ లింట
కూడు గుడ్డ లేక గోడు జెందుచు నుండ - షోకు చేయు నరుల నేక దగదె.

పూర్వతపఃఫలలబ్ధ మ పూర్వంబగు కవిత మారు పుంతల నిడుచుర
దుర్వినియోగము చేసి య - ఖర్వాఘము గట్టుకొనగ గవులకు తగునే.

శృంగారరసం బన్న చె - విం గోసికొనంగ వేసవే లున్నారం
చుం గల పొత్తకములకే - శృంగారపు సంజ్ఞ జేర్చ జెల్లునె యకటా.

శృంగార నీతిశాస్త్రము - శృంగార బ్రహ్మచర్య చింతామణియున్
శృంగార తర్కశాస్త్రం - బుం గల్పనచేయు కవులు పుట్టిరి బళిరా.

శృంగార శుకచరిత్రము - శృంగారపు బుద్ధదేవు శ్రీచరితంబున్
శృంగారపు సావిత్రిక - థం గల్పన జేయు కవు లుదయమై రహహా'

తిలకింప దేశమున కిది - ప్రళయసమయ మనుచు మదిని భావింపకయో
అలరుచు ప్రణయామోదంతం - బులనే లిఖియించు చుండ బోలునె చెపుడా.

బంగారువంటి దేశము - దొంగలు పాల్పేసినట్టి దోసంబునకై
క్రుంగిన కవులకు మనకా - శృంగారరసంబు ప్రణయచేష్టలు చెపుడీ!

పచ్చియవినీతికథలను - స్వేచ్ఛాప్రేమంబులని రచించెద రకటా
రెచ్చి మృగంబుల వరుసను - స్వచ్ఛందవిహారు లగుటె పరమార్థమొకో?

వేదాంత మన్న ప్రజ కా - మోదం బగు నంచు విషయముగ్ధులె ద్రవ్యా
శాదోహప్రేరితు లై - వేదాంతగ్రంథగణము విరచింతు రహా!

ఏమొడలే దింతటి య-న్యాయం బిది ప్రజ కపాయ మని తలప కదో!
వ్రాయుదురు వైద్యగ్రంథము-లాయుర్వేదంబు తెలియనట్టి ఖలు లహో!

హాస్య మనియొ వినోదంబు లనియొ బండ - బూతు లన్నియు బుస్తకంబులను వ్రాసి
పరువు గలవారు తల వంచి పరితపింప - డబ్బు లాగుచు కైనరు లుబ్బ దగునె.

కవులు వ్రాసిన యేపుస్తకంబులైన - స్త్రీలు బాలురు చదివి చర్చించు నెడల
కొంకు సిగ్గుల కెడ మీయకుండుటె కాక - యుపకరింపంగవలె వారి కొజ్జలట్లు.

తనకలమును దేశారా - ధనకై వినియోగపరచి ధన్యు డగుదు నే
నని దీక్ష బూని నెరవే - ర్చిన కవిరత్నంబు తెనుగునీమను గలడే.

కవివరుల చేతిలో ను - న్నవి పత్రిక లెల్ల పత్రికావళివశ మై
భువనము లున్నవి నిజముగ - కవి తలచిన చేయలేని కార్యము గలదే.

గిలుకకుండు కల్లకృతులను - పలుకుదు సత్కృతులు బుధులు బళిబళి యనగా
తళుకుంగరవాలము లన - కలముల ఝుళిపింపు డాంధ్రకవివరులారా.

కవులకలములముఖముల గలవు మతము - సంఘమును దేశమును సమస్తమును గూర్చ
నెంత బాధ్యత తా నిర్వహింపవలెనో - యెరుగుకవి తన విధి నుపేక్షింప గలడె.

లోక మిపు డెట్టు లున్నదో - లోకము గనకున్నచో గలుగు ఫల మేమో
సాకల్యంబుగ దెల్పి వి-వేకము గలిగింప గవికి విధి కాదొక్కో!

ఉండ నిల్లు లేక పండ మంచము లేక - కడుపు నిండ త్రాగ గంజి లేక
కట్ట గుడ్డ లేక కష్టించు పేదల - కతలు వెల్లడింప కవికి తగదె.

ఆరుకోట్లమంది యస్పృశ్యు లై సంఘ - దూరు లగుచు దేశభార మగుచు
దైన్యదశను మునిగి తల్లడిల్లుచు నుండ - వారి నుద్ధరింపవలదె కవులు.

ఏయేంగళ్లను గన్న వి - లాయితి వస్తువులె వృత్తులకు భయ మయ్యె,
పోయెను ధనము ప్రవాహం - బై యీదురవస్థ కవుల కక్కరలేదే.

వెలతక్కువకె బజారున - సులభముగా చిక్కు ననుచు చూతురు కానీ
నెల తక్కువబిడ్డ లనుచు - తిలకరు పరదేశముల పదార్థము లయ్యో!

దాపురించు నవనితల్లి నెరుంగక - తండ్రిపెండ్లి తలచి తలచి పొంగు
చందమున విలాతి చౌక వస్తువులకు - మురియుచుందు రయ్యొ ముగ్ధనరులు.

అల్పజీవితంపు టవసర - ములకును గా కెల్ల భోగములకు విలాస
మ్ములకే కలధన మంతయు - సెలవయ్యెడు ప్రజ కిదేమి చేటుం బాటో.

కరి తిన్న వెలగపం డై - సిరి యెల్ల హరించి చేవ చెడి యున్నది బం
గరు భరతఖండ మయయొ - మరి సెద రిది యేమి మోసమో కవులారా.

రత్నగర్భ యగుచు రహి నన్న పూర్ణ యై - పుణ్యభూమి యన్న పొగడు గన్న
ఆర్యమాత నేటి కన్నార్తురా లయి - శోక మొందదగునె సుకవులార!

మన దేశంబున నిర్మిం-చిన వస్తువు మోటుదైన చిత్తము లలరం
గొని వాడుకొనెడు నట్టుల-జనులను ప్రోత్సాహపరుప సత్కవికి తగున్.

ఏయుంగల్లకు బోయిన-నేయే పాత్రములు చేత నెత్తిన దేశ
శ్రేయము బోధించెడు న-ధ్యాయములే చదువరికి సదా తోపవలెన్.

మన రాజనీతి చతురత-మన విజ్ఞానాతిశయత మన యౌదార్య
మ్మును మన పరాక్రమంబును-గనువిందుగ నెల్లయెడల గన్పడ వలయున్.

మన రాజుల యౌన్నత్య-మ్మును మన వహాముల మహాత్త్వమును మన సాధ్వీ
మణుల ప్రభావము శూరుల-ఘన సాహసశౌర్యములును గన్పడవలయున్.

మన స్త్రీల కలాకుశలత-ఘన శౌర్యము సాహసంబు గాంభీర్యంబుం
వినయము వివేక విలువు-తనమును వర్ణించు సత్కథలె వెలయవలెన్.

మానము కొరకై నమసిన-మానవతుల చరిత లొప్ప మంగళకృతులం
ధీనిధులు బాలశూరుల-గానము గావించు కృతులు గన్పింపవలెన్.

ఆలముల బెదరి వచ్చిన-బేలపతుల ప్రోత్సహించి పెంపు దలిర్పం
దోలిపరువు నిచ్చిన యా-బాలల శీలములె తోచ వలె గబ్బములన్.

నాటకంబుల యందును నవలలందు-సకలకథలందు సరసహాస్యములయందు
నాటపాటల యందును మాటలందు-నెల్లెడల దేశభక్తి రంజిల్లవలయు.

వ్యాసంబులలోన నుప-న్యాసంబులలోన బాంధవాశ్రిత తతితో
వ్యాసంగంబుల లోపల-దేశాభ్యుదయ ప్రసక్తి దీపింపవలెన్.

ఏలలను మేలుకొలుపుల-జోలల కోలాటములను సుద్దులలో వి
య్యాల వినోదపదంబుల-బోలగ స్వాతంత్ర్యభావములె వెలయవలెన్.

కవి యన్న వానితలపై-దవులుకొనినభార మెంతో తలపోసితిరే
కవిధర్మచ్యుతు లైనను-గవియను వేలుపులు గతులు గలుగవు సుండీ.

ధర్మము నడిపింపంగల-కర్ముడు నై వెలయువాడు కవి యాకవియే
ధర్మమును విడిచి నడిచిన-నిర్మలుడని లోక మనునె నిష్కృతి గనునే.

దేవుం డిచ్చిన కవితను-దేవునకును ధర్మమునకు దేశంబునకున్
వావిరి వినియోగించిన-పావనుడే సుకవిపట్టభద్రుడు గాడే.

దేశంబు పరులపాలై-కోశంబులు వట్టిపోవ కూటికి పేదై,
క్లేశంబు లనుభవింపుచు-నాశం బగుచుండ జూడ న్యాయమె కవికిన్.

దేశాభిమాన మెద లవ-లేశంబులు లేక స్వార్థలీలావశులై
దేశీయు లుండ వారి స-దాశయులను జేయు గవులధర్మము గాదే.

జన్మభూమిగూర్చి జాతీయతనుగూర్చి-స్థితినిగూర్చి లోకగతిని గూర్చి
సంఘశక్తిగూర్చి స్వాతంత్ర్యమును గూర్చి-గిలికినారె నోట బలికినారె.

మూడుజగంబుల గడగడ-లాడించిన భారత స్వరాజ్యోద్యమమున్
ఏడక బలపరుచుచు వెం-టాడెడు కవు లెంద రాంధ్రులం దున్నారో.

ఖద్దరయిన గట్టితిరో - వద్దికతో రాట్నమైన వడికితిరో యే
కొద్దియు ధన మిచ్చితిరో - యెద్ది యొనర్చితిరి చెప్పుడీ కవులారా!

కలకంఠము గలిగినకో - కిలలవలెన్ కొసరి కొసరి కీర్తింపుడు మి
మ్మలరించు జన్మభూమిని - నెలమిగ సోదరులు మదుల నెచ్చరిలంగన్. (నక్షేమము)

ప్రాచీన రాజధర్మము

మా॰ శేమండ రామారావు గారు, బి. ఏ. (ఆనర్సు)

శ్రీ స్తుశకమునకు పూర్వము భారతీయ రాజ్యాంగ రంగమున రెండు విధము లగు పరిపాలనాపద్ధతు లుండెడివి. వానిలో రాజాధీన రాష్ట్రము లెక్కుడుగనుండి, నేటికిని వర్ధిల్లుచున్నవి. రెండవది గణాధీన రాష్ట్రము.[1] వన ప్రజాచోదితుడగు నాయకునియాధిపత్యము క్రింద పరిపాలనము సాగింపబడు చుండెను. క్రీ. శ. 5 వ శతాబ్దానంతర మా గణములు క్షీణ్యము నందినవి.

రాజ్యమునం దైనను, గణమునం దైనను రాష్ట్రనాయకుడు ప్రజానియమితుడై యుం డెను. వేదయుగమున రాజులు సభలచేతను, సమితులచేతను నెన్నుకొనబడుచుండెడివారు. దీనికి దశరథుని మరణానంతరము నూతన రాజ నియమార్థము రాజకార్యకర్తలు సమావేశ మయిరను శ్రీమద్రామాయణాయోధ్యాకాండ స్థమగు నిదర్శనమే ప్రమాణము మఱియు నుజ్జయినీపరిపాలకుడును, ఛత్రపతిబిరుదాంకితుడు నగు రుద్రదమనుని ప్రజలెల్లరును తమ రక్షకు నిగ నెన్నుకొనిరను జునగడశాసనము ద్వితీయ నిదర్శనము.[2]

రాజకీయధర్మము లనేకములు మహాభారతమున పేర్కొనబడియున్నవి.

"ప్రజాదాయమున 1/6 సుంకముగ పరిగ్రహించియు ప్రజలను రక్షింపనియెడ రాజునకు ప్రజాపాప ఫల మంతయు నమకూరు" నని యున్నది.[3] కర పరిగ్రహణ విషయమున మిక్కిలి స్పష్టముగ నున్నది. బలిషడ్భాగము రాజునకు ప్రజారక్షణ వేతనముగను, సామ్రాజ్యానుభవము ప్రజారక్షణ బాధ్యత గలదిగను పేర్కొన బడినవి.

మనుధర్మశాస్త్రము రాజపదవి కెక్కుడు గౌరవము జూపుచు, రాజు నరరూపి యగు దేవత యనియు[4], నీలోకమున శాంతి నెలకొల్పుటకై రాజపదవి సృష్టింపబడియున్న దనియు,[5] నధికారమదముచే ప్రజాపీడన మొనర్చునాతడు రాజ్యభ్రష్టుడై కుటుంబనాశము, నాత్మనాశము

1. "కేచి ద్దేశగణాధీనాః కేచి ద్రాజాధీనాఇతి" —అభిధాన శతకము.
2. "సర్వవర్ణై రభిగమ్య రక్షణార్థం పతిత్వే వృతేన"—Dr. Bhandarkar's Early History of the Dekkan, p. 28.
3. "అరక్షితారం రాజానం బలిషడ్భాగహారిణమ్; త మాహు స్సర్వలోకస్య సమగ్రం పాపచారిణమ్." —భా. ఆ. అ 213, శ్లో. 3.
4. "మహతీ దేవతా హ్యేషా నరరూపేణ తిష్ఠతి." —మ. ధ. శా. అ 7, శ్లో. 8.
5. "రక్షార్థ మస్య సర్వస్య రాజాన మసృజ త్ప్రభుః." —మ. ధ. శా. అ. 7, శ్లో. 3.

గూడ నందు ననియు చెప్పుచున్నది. శరీర బాధచే వీర్యమువలెనే, రాష్ట్రకర్షణచే రాజ జీవితము క్షీణించును.[6]

కరపరిగ్రహణాభిప్రాయమును, దానిచే రాజున కగు బాధ్యతయును మహాకవియగు కాళిదాసుచే నిట్లు ప్రశంసింపబడినవి: "సూర్యుడు వివిధజలాశయములనుండి జలము నాకర్షించి, తిరిగి శతాధికముగ దానిని విడుచునటులు, రాజు ప్రజలనుండి బలిని పరిగ్రహించెను."[7]

కరపరిగ్రహణవిధానము మహాభారత శాంతిపర్వమునందును, మనుసంహితయందును, గరుడపురాణమునందును గూడ చక్కగ నిర్ణయింపబడినది. "మధుపములు పుష్పములనుండి మధువును గ్రహించురీతిని, ధేనుపీడన స్తనవిదారణాదికము లేక గోదోహ మొనర్పబడునటులును, జలూక రక్తము పీల్చు చందమునను, రాజు శ్రీమంతులగు ప్రజలనుండి క్రమాభివృద్ధి నందురీతిని సుంకమును గ్రహింపవలెను."[8]

మహాభారతసభాపర్వస్థమగు యుధిష్ఠిర నారదసంవాదమునుండి యీ క్రిందిసంగతులు విశదము లగుచున్నవి. "రాష్ట్రమున చోరుల వలన, నత్యాశాపరులవలన, స్త్రీబాలక్రౌర్యమువలన నేమియు బాధ కలుగకుండవలెను. రాజ్యమున పెక్కులు సరస్సులు నిర్మింపబడి తత్రస్థమగు జలము భూములకు సమముగ నిర్దేశింపబడవలెను. కృషి, వాణిజ్య, గోరక్షణ కోశాదిరాజ్యాంగములు యోగ్యాధికారిపాలితములై యుండవలెను."

"రాజా ప్రకృతిరంజనాత్" అను నార్యోక్తి ననుసరించి ప్రజాసంరక్షణానురంజనములే రాజునకు ప్రథమకర్తవ్యములు. రాజశబ్దము తోషణార్థకమగు ధాతువునుండియే వచ్చును.[9] తా నామె పరిశుద్ధ యనియు, నక్లిష్టచరిత్ర యనియును విశ్వసించియు, కేవలప్రజానురంజనార్థమే శ్రీరాముడు సీత నరణ్యమున కంపుట యీ విషయమున ప్రమాణము.

మత్స్యపురాణస్థమగు నీయంశ మత్యాదరణీయము. "రాజు లెల్లపుడు నేకార్య

---

6. "మోహాద్రాజా స్వరాష్ట్రం యః కర్షయత్యనవేక్షయా, సో ఽచిరాద్భ్రశ్యతే రాజ్యాత్ జీవితాచ్చ సబాంధవః. శరీరకర్షణా త్ప్రాణాః క్షీయంతే ప్రాణినాం యథా, తథా రాజ్ఞామపి ప్రాణాః క్షీయంతే రాష్ట్రకర్షణాత్."
—మ. ధ. శా. అ 8, శ్లో. 112.

7. "ప్రజానా మేవ భూత్యర్థం స తాభ్యో బలి మగ్రహీత్, సహస్రగుణ ముత్స్రష్టు మాదత్తే హి రసం రవిః."
—రఘు. 1. స. 4, శ్లో. 18.

8. "మధుదోహం దుహే ద్రాష్ట్రం భ్రమరా ఇవ పాదపమ్, జలౌకావ త్పిబే ద్రాష్ట్రం మృదునైవ నరాధిపః. అల్పే నాల్పేన దేయేన వర్ధమానాం ప్రదాపయేత్, తతో భూయ స్తతో భూయః క్రమవృద్ధి సమాచరేత్."
—భా. శాం. ప. అ. 88, శ్లో. 4,7.

9. "రంజితాశ్చ ప్రజాః సర్వా స్తేన రాజా."   —భా. శాం. ప. అ. 59, శ్లో. 125.

ములు ప్రజాతోషకము, లెయ్యవి వారికి హేయము లని విచారించి, ప్రజల కసంతృప్తి నొనగూర్చు కార్యముల నాచరింపకుండవ లెను."[10]

అధికార దుర్ణయములనుండి ప్రజలను రక్షించుటకొఱకు, ప్రాచీన రాజ్యాంగతత్వవేత్త లనేకము లగురక్షల నుపపాదించి యున్నారు.

"స్థానిక రాజకీయోద్యోగులు ప్రాయశః అధికార గర్వితులు, క్రూరులు నయియుండు టచే రాజు సర్వదా ప్రజల నుద్యోగులబారి నుండి రక్షింపవలెను" అని మనువును, శుక్రుడును గూడ విధించుచున్నారు.

సుప్రసిద్ధబౌద్ధయాత్రికుడగు హ్యూయన్ త్సాంగ్ చే నుదాహృతమగు హర్షవర్ధనుని కాలపు మతసమావేశమునుగూర్చి వివరించుచు హేవెల్ గా రిట్లు వ్రాయుచున్నారు—

"ప్రాచీనాదర్శ ప్రతిపాదకు లగు పండిత వర్యులకు ప్రజానాయకు లెక్కుడుగౌరవము జూపుటభారత రాజకీయజీవితలక్షణము. తత్త్వవేత్తల నిర్దేశములే కాక పట్టాభిషేకసమయమున రాజులు చేయు ప్రమాణముగూడ వారిని ధర్మనైతిక శాస్త్రముల కవిరుద్ధమై యుండు ప్రతివిషయమును దైవతుల్యముగ భావించి తదనుగుణ్యముగ ప్రవర్తించునటులు శాసించుచున్నది. ఆధ్యాత్మికస్వచ్ఛందతయును, వ్యక్తిక రాజకీయములగు హక్కులును జాతీయ ధర్మమునను, రాజ్యాభిషేకప్రమాణమునను నణగియుండుటచేతను వానికై యీదేశమున వివాద మనవసర మై యుండెను. తృణబాహుళ్యనిర్మితమగు రజ్జువు మృగరాజునైన బంధింపగలుగునటులు, పౌరాభిప్రాయము రాజశాసనమును నిర్దేశింప సామర్థ్యముగలిగి యుండును. నిరంకుశత్వముపై నియతుల నను వదించుపట్ల హైందవ ధర్మశాస్త్రకారులు మిక్కిలి విస్పష్టముగ నుండిరి. ఈవిషయము నుగూర్చి చర్చించుచు హేవెల్ గారు తిరిగి యిట్లనుచున్నారు.—

"ఈ(శుక్రనీతిసార) గ్రంథకర్త యెవ్వరై యుండిన నాతడు సర్వరాజన్యమాన్యమగు ప్రాచీనధర్మము ననువదించు ననుట నిర్వివాదాంశము. ఈనీతిశాస్త్రములే రాజవిద్యాభ్యాసమునన గ్రగణ్యములు. ప్రాయికముగ ననేకరాజులు తమవిద్యావ్యాసంగముల మఱచియు, పెడదారిని నేర్చియు నుండినను, హైందవయుగమున నాధునికసమ్మతమగు రాజ్యాంగనిర్మాణ మేమియు నుండియుండ లేదనుట గొప్పతప్పు."

ఆధునికేతిహాస పరిశోధనా సూచితము లగు పూర్వీక స్థానికపాలనాపద్ధతులు, సమితి సభాదినిర్మాణములు మున్నగు 12 వ శతాబ్దపునాగరికతనుగూర్చి వ్రాయుచు హేవెల్ గారు మరల నిటు లభిప్రాయపడుచున్నారు—

"హైందవరాజత్వ మెల్లపుడును నియమితమును, నిరంకుశమునే యను సామాన్య పాశ్చాత్యాభిప్రాయము భారతచరిత్రమును గూర్చి యైరోపీయులకు గల విషమజ్ఞానము

10. "తస్మాత్ ప్రయత్నేన నరేంద్రముఖ్యః కార్యోఽనురాగో భువి మానవేషు." —మత్స్యపురాణము.

లలో నొక్కటి. పాశ్చాత్యదేశవినిర్మితమును, అధికారదుర్ణయ ప్రతీకార రక్షాసహితమునై యార్యమతమునకు సాంఘికరాజకీయమూలకముగ నార్యులచే నిర్మింపబడిన హైందవస్థానిక ప్రభుత్వముకన్న నుత్కృష్టమగు పరిపాలనాపద్ధతి పూర్వముగాని, ప్రకృతమునగాని యితరోపాఖండమున నెచ్చటను గానరాదు. ఆంగ్లస్వాతంత్ర్యము బహుళ వివాదానంతరమును, సంగరయుద్ధాదిమూలముగను సంపాదింపబడెను. హిందూరాజ్యాంగనిర్మాణములు మహాత్ములచే ప్రజాసౌకర్యార్థము నిర్మింపబడినవి. అయ్యవి ప్రత్యేకజాతులకు గాక జనులెల్లరకును వారి యోగ్యత ననుసరించియు, జాతీయాభివృద్ధి కనుగుణముగను, స్వాతంత్ర్యము, నైహికాముష్మిక ద్రవ్యముల నిచ్చునవియునై యుండెను."

క్రీస్తుశకమునకు పూర్వపు దక్షిణదేశపరిస్థితులనుగూర్చి కృష్ణస్వామి అయ్యంగా రిట్లు వ్రాయుచున్నారు:

"ఆ కాలపు రాజులు రాజకీయ విషయముల నుత్కృష్టములగు నాదర్శముల ననుసరించుచుండిరి. మన్త్రి, పురోహిత, సైనిక, గూఢచారి, ద్యూత వినిర్మిత సభాజనితమగు పౌరాభిప్రాయమునకు రాజశాసనము లోనయి యుండెను. బ్రాహ్మణులును, పండితులును రాజాస్థానముల నక్కుడు గౌరవమంది ప్రజాస్థితినిగూర్చి తమయభిప్రాయముల నిరాఘాటముగ వ్యక్తీకరించుచుండిరి."

భారతదేశము ప్రజాపాలనానర్హ మను వాదమును సాగించుటకు రచింపబడిన యొక చిన్న పుస్తకమున భారత సానుభూతి గల చరిత్రకారులలో నగ్రగణ్యుడు స్మిత్ దొరగారు సహిత మిట్లు వ్రాయుచున్నారు:

"హిందూ మహమ్మదీయ యుగములలో రాజుల కెక్కుడుగ నధికార ముండిన యెడ వారలకు తతోధికముగు బాధ్యతగూడ నుండెను. ఒకరీతిని వారు ప్రభువులైనచో నింకొక విధమున వారు ప్రజాసేవకులుగ భావింపబడుచుండిరి. రాజులకు ప్రజాసేవకత్వము సారస్వతమునందును, విశేషించి యశోకశాసనములందును ప్రతిపాదింపబడు చున్నది."

ఏడవశతాబ్దమున భర్తృహరి తన నీతిశతకమున నిటుల నుచున్నాడు:

"ఓ రాజా! నీవు భూమినుండి గోవువలె క్షీరగ్రహణ మొనర్చునెడ నీ ప్రజలను ధేనువుల వలె రక్షింపుము."

"ప్రభుప్రకృతులన్యోన్యానురక్తులై యుండు దేశము చక్కగ నభివృద్ధినందు"నని శుక్రనీతి యుపపాదింప, "రాజక్షేమమే ప్రజాక్షేమము, ప్రజాక్షేమమే రాజక్షేమము. అయినను పాలకుడు కేవలాత్మతోషణములందే యనురక్తుడు గాక, ప్రజాక్షేమకరములగు సంశముల నెల్ల నాత్మశ్రేయస్కరములుగ భావింపవలె" నని యర్థశాస్త్ర ముద్ఘోషింపుచున్నది.

ఆధిపత్యము

మిన్నికంటి గురునాథ శర్మగారు

అనధికార మున్నపుడె ధర్మము చేసినఁ బాప మాచరిం
చిన; సుయశంబుఁ బొందినను జెడ్డయశంబును గాంచినన్; మహా
జనుఁ డను పేరుఁ జెందినను జాల్ముఁ డటం చనునాఖ్యఁ గొన్న; నా
వెనుక మఱేమి యబ్బెను? లభించును నాకమొ, కాలులోకమో.

ఎప్పటి కెట్టివీలు లభియించిన వేసరవోవ నీక తా
నప్పటి కప్పుడే సుకృత మార్జన సేయుట లెస్స "దీప ము
న్నప్పుడె దేవులాడుకొన నో"యని చెప్పరె పెద్ద లావలం
జొప్పడు నయ్య, నీకుఁ దఱి, చూచునె నీ వొగ మొక్కఁడేనియున్.

గతి యిఁక మీరె యంచు, నపకారము చేసిన మేలు చేసినన్
మతి యిఁక మిమ్ము వీడ దని, మాబ్రదు కంతయు మీదె యంచు, నం
స్తుతు లొనరించు మానవులు దూరమున న్నగుచుంద్రు నిన్ బద
చ్యుతుఁ గని యప్డు నీకు సుకృతోదయ మొక్కఁడె సుమ్ము దిక్కగున్.

"అదిరా కన్నను మిన్ను, గన్పడక యుగ్రానేక దుష్కార్యముల్
పొదలం జేసితిఁ జిన్నపెద్ద లనుచున్ బుద్ధిం దలంపన్, గనుల్
చదల న్నిల్పితి, గర్వి నైతి" నని పశ్చాత్తాపముం బొందఁ బో
వెదుసుమ్మా! యధికారపీఠ మెడ యా నేనాఁడొ ఆనాఁడునన్ (?).

"అవురా దైవము లేదు పూర్వజనిపుణ్యాం బుంటయుం బొంకు వే
దవిధుల్ కేవలకల్పితంబులు. నిరాధారవ్యవస్థాక్రమం
బవు స్వర్గానుభవంబు సర్వజనసౌభ్రాత్రం బశక్యప్రియం
బవు"నం చెంచితి వంచు నేడ్చెదవుసుమ్మా, ఆధిపత్యచ్యుతిన్.

పరిణామంబు చరాచరప్రకృతికిన్ స్వాభావ్యమం చాత్మ నీ
వెఱుఁగం జాలవె? ఊసరక్షితియుఁ గాదే సర్వసస్యాఢ్య? ని
ర్ఝరిణీస్ఫూర్తియు నింకదే? జనుఁడ, నీస్వాంతంబున న్నిత్యతా
స్ఫురణం బాయుము వీడు గర్వమును జాపు న్నిల్పు భావిస్థితిన్.

"ఉపకారం బొనరింపఁ డాయె నని యెంతో వేడ్తువో మూఢుఁడా!
అపకారం బొనరింప కుండుటయె సుమ్మా నీకు మేల్సేఁత"యం
చపనోదించెడు లాఁతి నెవ్వగను, ని న్నాభంగిఁ బైవార ల
న్నపుడే "నత్తయు నొక్క యింటి స్నుష"యం చాత్మన్ విచారింపవో?

మాలోఁ బుట్టితి, వెట్టటో పెరిగి తౌ మాలోన, మాలోన వి
ద్యాలేశంబును గంటి, మిత్రులదయాప్రాప్తిం దదుద్యోగముం
బాలింపం దొరకొంటి, విప్పుడు మము న్వంచింప యత్నింతు; వే
మో లక్షించెదు క్రొత్తవారిపగిదిన్ భూతాభివిష్టుండవో?

వాడుకరీతిన్ దరియ వచ్చినవారలఁ గోపగించి మా
టాడఁగఁ బూన నెప్పటిక్రియం దగు బందుల నాదరింపఁగాఁ
జూడకయున్న, మిత్రుల నసూయను గాంచిన, నప్డు నీమదిం
గాఁడుసుమీ పరాభవవికారశరం బధికారశూన్యతన్.

నిను నీదాష్ట్యము నీచరిత్రమును నీ నిస్సారవాచాలతన్
గనులం జూచి సహింప లేక నత మేకాంతంబునన్ సేవకున్
గినుకం దిట్టఁ గడంగు చుండెదరు దుష్కీర్తిప్రవాహంబు డా
యును మే ల్గల్గ దటం చెఱుంగ వీఁక నీ యుద్యోగముం గాల్పనా?

నిత్యము లౌనె దేహములు నిల్చునె సంపద లెల్లకాలమున్
మృత్యువు వెంట నంటుకొని మేని కపాయము సేయ కుండునే?
సత్యపథం బొకండె నిను స్వర్గముఁ జేర్పఁగఁ జాలు నేల నీ
భృత్యుల నేడిపించుటలు కృత్రిమపుంబను లాచరించుటల్.

చేతికిఁ జిక్కి వీఁడు కృప సేసినచో నిఁక నన్నుఁ గాంచి ని
ర్భీతి మెలంగు నంచు నొసరించెద వీ వపకార మయ్యో! నీ
చేఁతకు నవ్వ వచ్చుఁ గృప సేసినచో నిను గౌరవింపఁడే?
ఆతెరు వేల ద్రొక్క, ఫణియట్లు? దురాశయపూరితాత్మకా!

మనవుల్ శ్రోత్రములం జొరంబడవు, ప్రేమారావముల్ నోట రా
వు, నమస్కారములం గనుల్ గనవు; చూపుల్ క్రోధముం గ్రక్కు చుం
డు; నవిశ్వాసము నెమ్మదిం గలఁచు చుండున్, సుస్థిరానంద మెం
దు నిమేషం బయినన్ లభింపదు దురుద్యోగప్రభావంబునన్.

మిత్రులతోనైన మెలఁగడు మన సిచ్చి తనగౌరవంబు తగ్గునో యటంచు
ఆంతరంగిక సేవకాళితోనైన నవ్వుచుఁ బల్కఁ డేదియో పోవు నంచు
ఎఱిఁగినవారలే నెఱిఁగినఁ దల వంచుకొనిపోవుఁ దన కేమొ కొదవ యంచు
చూడ వచ్చినవారితోడనే నభిముఖుం డై పల్కఁ డభిమాన మారు నంచు
అమ్మయైనను "నాయనా" యంచుఁ బల్కనోడు నెప్పుడు ధుమధుమలాడు నంచు
బిడ్డయైన దగ్గఱకు రా బీతు నిందు-నాధిపత్యదౌర్జన్య మేమంతసుఖమొ?

తొలి నీచేసిన పున్నె మీపగిది నుద్యోగంబుగా మారు నం
దుల కానందము నొంది యెడ్డ నివు డంతో యింతో పున్నెంబు నె
ట్టుల నేనిం గడియించుకొమ్మదియ యుండు న్నీకుఁ దోడయ్యు నె
చ్చెలి చందంబున భావిజన్మమునకున్ సిద్ధంబుగా మూర్ఖుఁడా!

* * * * *

తా నొనరించు కార్యము సదా సఫలం బగు చున్నచో భళీ!
యేనె సమర్థుఁడన్ భగవదిచ్ఛ యటంట యసత్యమం చనున్
గాని యొకండు చేటు పొడగట్టినచోఁ దన కష్ట మీశ్వరా
ధీనము సర్వ మంచుఁ బ్రకటింపఁ దొడంగు మనుష్యుఁ డద్దిరా!

ప్రార్థనాద్వయము

కప్పగల్లు సంజీవమూర్తి గారు
(అనువాదము)

నిన్నరాతిరివేళ నాచిన్నిసుతుఁడు
తనదుపిన్నాఁట తప్పొప్పికొనుచు నాదు
మ్రోల జానువులూది కూర్చుండి యశ్రు
వితతి గ్రమ్మఁగ, "దేవ! వివేకయుతుఁడు
బలయుతుఁడు నైనమాయయ్యవగిది నన్ను
పెద్దవానిని గావింపవే" యటంచుఁ

ప్రార్థనము చేసె; నంత నే వాఁడు నిద్ర
పోవుపడక చెంత యొకింత మోఁకరిలించి
శిరమువాంచి నాయఘము లేకరువు పెట్టి,
"దేవ! నిష్కల్మషాత్మతఁ దేజరిల్లు
వీనిగతి బాలు నన్నుఁ జేయవే" యటంచు
భావ ముప్పొంగఁ జేసితిఁ బ్రార్థనంబు.

చెంచులు, కోయలు

ఆర్. సుబ్బారావు గారు, బి. ఏ., యల్. టి.

I. చెంచులు

ఆకారాది విశేషములు

చెంచులు నల్లని శరీరమును, ఎత్తైన బుగ్గ ఎముకలున్ను, నల్లని లోతైన కండ్లును గల్గిన అడవిజాతివారు. వీరు పొట్టిగ నుందురు. వీరుకోయలవలెనే సోమరితనము, త్రాగుడు మొదలగు దురాచారములకులోనై, దొంగతనములు, నరహత్యలు మొదలగు పాపపుపనులు చేయుటయందు కడుసమర్థులు.

నివాసములు

వీరు గోదావరిజిల్లాలోని చోడవరము, పోలవరము ఏజన్సీలయందున్ను, కర్నూలు జిల్లాలోని నల్లమలెకొండలయందున్ను, అడవుల యందున్ను ముఖ్యముగా నివసించుచున్నారు. మరియు తూర్పుతీరమునం దంతటను ఇప్పుడిప్పుడు తెనుగుమీరి నాగరికులై, స్వల్ప వ్యాపారములపైని తిరుగుచున్నారు. అడవి చెంచులు వీరివలె గాక, శ్రీశైలప్రాంతమందలి అడవులయందు అనాగరికులై గుహలలోను, చెట్లక్రిందను అడవిజంతువులవలెనే బట్టబయళ్లలో నివసించుచున్నారు. వీరు వెదుళ్లతోను, చొప్పతోను తమగుడిసెలను వేసుకొని నివసింతురు. వీరు కాపురముండుపల్లెలకు 'చెంచుగూడెము' లని పేరు. ఈ గూడెములయందు 10 మొదలు 50 వరకు గుడిసె లుండును. అడవిచెంచులు గడ్డిపీలికలను, ఆకులను ధరించి, వారిమానములను కాపాడుకొందురు. వీరు కాపురముండు గూడెములు ఒకదాని కొకటి చేరువగనే యుండును. చెంచుగూడెములలోని గుడిసెలు తేనెపట్టువలె దగ్గరదగ్గరగా కట్టబడియుండును. తరుచు ఒకే కులమునకు చెందిన చెంచు లందరు కలిసి నివసింతురు.

చెంచుకులములు

వీరు తమ యిష్టదైవమైన శ్రీకృష్ణుడే చెంచుకులమును ఏడుజాతులుగ పుట్టించెనని నమ్ముదురు. ఆజాతుల పేర్లు ఈక్రింద వ్రాయబడినవి.—

1. అడవిచెంచులు

వీరు బొత్తిగ అనాగరికులై, అడవిజంతువులను బోలి సంచరింతురు. అడవిపంటలను దినుచు, అడవులయందు సంచరించుచున్నారు.

2. కైతచెంచులు లేక గడపలు

వీరు వ్యవసాయము, ముఖ్యవృత్తిగా గల్గి, అడవిచెంచులవలె సోమరులై తిరుగక, నివాసము లేర్పరుచుకొని కాపురము చేయుచుందురు.

3. దాసరచెంచులు

వీరు అడవులయందు తిరుగాడు పులులను, దుప్పులను, నెమళ్లను వేటాడి, వాటి చర్మములను, గోళ్లను, వెంట్రుకలను సంపా

...ంచి, సమప్రదేశమునందలి ప్రజలకు అమ్ముకొనుచు జీవించుచున్నారు. వీరు ముఖ్యముగ సవరములను, నెమిలికన్నులను, పులిగోళ్లను పెద్దపట్టణములయందు అమ్ముకొను విషయము మనకు తెలిసినదే.

4. పుట్టచెంచులు

వీరు తేనె, మైనము, కొమ్ములు మొదలగు అడవిపంటలను సంపాదించి సమప్రదేశములందలి ప్రజలకు అమ్ముచుందురు.

5. ఆటచెంచులు

వీరు చెంచుకులము లన్నిటిలోకి తెలివికలవారు, నాగరికులు. వీరు చెంచునాటకమును ఆడుచు, చెంచులక్ష్మి కృష్ణునిచే వరింపబడినదనియు, గనుక కృష్ణుడు వారి ఇష్టదైవమయ్యెననియు చెప్పుచుందురు.

6. వేటచెంచులు

వీరు అడవిజంతువులను వేటాడుట, పక్షులను గొట్టుట, చేపలను బట్టుట మొదలగు వృత్తులవలన జీవించుచున్నారు.

7. ముత్తరాసుచెంచులు

వీరు గింజలు, పూసలు, సూదులు మొదలగు వస్తువుల నమ్ముకొనుచు జీవించుచుందురు. వీరు సోది చెప్పుటలో కడుసమర్థులు.

పై ఏడుకులములవారు ఒకరితోనొకరు భోజనములను చెయ్యరు. సంబంధబాంధవ్యములను జరుపరు. వివాహాదికృత్యములు కులమువారిలోనే జరుగుచుండును. పై కులముల యుత్పత్తికి ఆయాకులములు చేయు పనులే ముఖ్యకారణములుగా కనబడును.

చెంచుమతము

వీరు చెంచుదేవతలకు తేనె పళ్లు మొదలగునవి పండుగసమయములందును, కరువు, వ్యాధులు మొదలగు కష్టములు సంభవించినప్పుడును సమర్పించి పూజింతురు. మరియు వీరు అహోబల నరసింహస్వామిని "ఓబలేశప్ప" యనుపేర నారాధింతురు. ఈ దేవుడు "చెంచీత"ను వివాహమాడిన కృష్ణుని యవతారమని నమ్మెదరు. ఈవివాహమునకై కృష్ణుడు కన్యాశుల్కముగా చెంచుకులమంతకును వెదురుపిడియము ఇచ్చెననియు, అందుచేతనే చెంచులు వెదురువల్ల జీవనము చేయవలసి వచ్చెననియు చెప్పుదురు. గోదావరిజిల్లాలోని రంపచోడవరము, పోలవరము మొదలగు తాలుకాలలోని చెంచులు ఇప్పుడుముఖ్యముగా వెదురువర్తకమువల్లనే వేలకొలది జీవనము చేయుచున్నారు. (ఈ జాతివారి ఛాయాపటములను నిందు చూడ నగును.) మరియు పండుగ సమయములయందు చెంచులు రామలక్ష్మణుల విగ్రహములను పూజింతురు. దీనినిబట్టి వీరు వైష్ణవమతావలంబకులనితోచుచున్నది. మరియు వీరు తమబొట్టును నిలువుగీతగా ధరింతురు. ఈ చెంచులు పోతరాజు, గుఱప్ప, శుంకాలమ్మ మొదలుగాగల కొండదేవతలను పూజింతురు.

వేషభాషలు

అడవి చెంచులు గోచీలను మాత్రమె ధరింతు రనియు, సమప్రదేశమునందలి చెంచులు నాగరికులై అడుగుభాగమున గోచీ

లను, పైభాగమున పంచెలను లేక నెత్తి గుడ్డయును ధరింతు రనియు తెలుసు కొంటిమి. వీరు చూచుటకే అసహ్యకరముగ నుండి, బద్ధకస్తులును, త్రాగు బోతులు నై, వ్యవసాయము చేయుటయం దిష్టము లేనివారై, దోపిడిగాండ్రవలె కన్పట్టుచున్నారు. కనుకనే, సమ్మప్రదేశములందు చెంచుగుంపులు సంచరించునపుడెల్లను పోలీసువారు వారికి అభ్యంతరము కలిగించుచు, వారిరాకపోకలను కనిపట్టుచునే యున్నారు. కర్నూలుజిల్లాలోని అడవిచెంచులు తమకు అడవిపంటలు దొరకనప్పుడెల్లను బందిపోటుతనమువల్ల జీవించుచున్నారు. బాటసారులను బాధించి దోపిడిచేయుచు, పంటలను తెగులబెట్టి వ్యవసాయదారులను బాధపెట్టుచున్నారు. సర్కారువారు వీరికి అభ్యంతరములు పెట్టినమొదల అడవులను తగులబెట్టి, సెలయేళ్లలో విషము కల్పి, సర్కారు ఉద్యోగస్థులను కొట్టుచు తిట్టుచు నున్నారు. ఇట్టి అనాగరికులగు మోటుపశువులను లొంగదీయుటకై సర్కారువారు వారికి తమ ఇంటి యుపయోగము నిమిత్తము కావలసిన అడవిపంటలను (వంటచెఱుకు, వెదుళ్లు, చొప్పగడ్డి, వేళ్లు, పళ్లు, తేనె, మైనము మొదలగువస్తువులు) కొంపోవ సెలవిచ్చిరి. మరియు వీరు స్వేచ్ఛగ వేటాడుటకును, వీరి పశువులు అడవియందు మేయుటకును అంగీకరించిరి. ఇట్టి సామోపాయములచేత అనాగరికులగు చెంచులను లోబరుచుకొను చున్నారు. మరియు చెంచుగూడెములయందు సర్కారు బడులను స్థాపించి విద్య నేర్పుచున్నారు. విద్య నేర్చిన చెంచులను వారి ప్రదేశములయందు తలయారులుగను, బడిపంతుళ్లుగను, అడవిని సంరక్షించుటకు నౌకర్లుగను నియోగించు చున్నారు. అయినను విశేషఫలము గానవచ్చుట దుర్లభము. సహజముగ మోటులై, త్రాగుడు అభ్యాసమైన చెంచులు తరుచు వారి గూడెములలో అల్లరులు, కొట్లాటలు గల్పించుకొనుచు ప్రాణములను గూడ గోల్పోవుచున్నారు. గోదావరి, విశాఖపట్టణం జిల్లాలకు సంబంధించిన ఏజన్సీలోని చెంచులు తెలుగు ఓఢ్రభాషలను రెండింటిని మాట్లాడుదురు. కాని వీరు మాట్లాడుభాష గ్రామ్యము. వీరు ఈభాషలను వ్రాయలేరు. నల్లమలె కొండలలోని చెంచులున్ను, కర్నూలుప్రాంతపు చెంచులును తెలుగుభాషను మాత్రమే మాట్లాడుట, చదువుట, వ్రాయుట నేర్చుచున్నారు.

జాతకవివాహాది కర్మలు

వీరి జాతకకర్మలు కోయలజాతకకర్మలను బోలియుండును. శిశువును దినమువిడిచిదినము కడుగుటయును, పదొకొండవ రోజున కులమునంతయు నామకరణోత్సవమునకై పిల్చుటయు, విందుచేయుటయు జరుగును. శిశువునకు పూర్వికునియొక్క పేరుగాని, కొండదేవతలపేర్లుగాని ఉంచుట సహజము. పోలుగాడు, నాగలేటిగాడు, అచ్చిగాడు మొదలగునవి చెంచుపేర్లు. కోయలలోవలెనే వీరియందును వివాహములు రెండువిధములు: వధూవరులతలిదండ్రులసమ్మ


తిపైని జరుగువివాహములు వరునియింట జరుగును. పేడతో గుండ్రముగా అలికిన భూమిమీద విల్లుఅంబులు ఉంచి వధూవరులను వాటికి చుట్టును మూడుసార్లు ప్రదక్షిణము చేయింతురు. వధూవరులనెత్తిపైన బియ్యము చల్లుట, వధువునకు "తాళి"కట్టుట జరుగును. విందు, నాట్యము ప్రతివివాహమునకు తప్పవు. ఒక్కొక్కప్పుడు వధూవరులు ఒకరి నొకరు ప్రేమించి గూడెమునుండి రాత్రి పరారై, గాంధర్వవివాహము జరుపుకొనిమరునాడుదయము గూడెముచేరుట కలదు. ఒక్కొక్కప్పుడు వరుడు పిల్ల నెత్తుకొనిపోయి బలవంతముగా రాక్షసవివాహము చేసుకొనును. అట్టి సమయములందు కులముపెద్దలు సమావేశమైతప్పు చేసినవానికి జుల్మానా విధింతురు. ఆ సొమ్ము ఇవ్వనియెడలగాని, ఇచ్చినను కోపము తీరనియెడలగాని కుటుంబకలహములు పెరిగికొట్లాటలు, మరణములు సంభవించును. చెంచుల యందు తదితరము లడవిజాతులయందు వలె, విడాకులిచ్చుటగలదు.అట్టిసమయములందు నేరస్తులు పంచాయతిదారుల ఇష్టానుసారముగా కొంతమొదరా నియ్యవలసియుండును. వీరిలో వితంతువివాహములు గలవు. చెంచులు తదితరజాతులవలెనే పిచ్చినమ్మకము గలవారగుట చేత వారికి కల్గునష్టములు,కరువులు అన్నియు గ్రహములవల్లను, పిశాచములవల్లను, కొండదేవతలవల్లను,కలుగుననినమ్మి, వారికిజాతరలు జరిపింతురు. చనిపోయినవారిని తగుల బెట్టక పూడిచెదరు. పూడ్చిన స్థలముమీద కొంచెము పాలు, బియ్యము వేయుదురు. హిందువులలోవలెనే వీరు పదకొండురోజులు మయిల పట్టి, ఆఖరున పెద్దదినమని ఒకవిందును చేయుదురు. అట్టివిందునకు కులమువా రందరును చేరుదురు.

2. కోయలు

కోయలు, గోదావరివిశాఖపట్టణంజిల్లాలకు చేరిన ఏజన్సిడివిజనులయందున్ను, బస్తరు నైజాము రాష్ట్రములలోని అడవులయందున్ను, గుట్టలయందున్ను నివసించుచున్నారు. వీరు అరణ్యప్రాంతములయం దుండు సెలయేరులను ఆధారముగా చేసికొని జీవించుటచేత వీరికి అడవివాగులే ముఖ్యములగు కాపురస్థలములని చెప్పవచ్చును.

నివాసములు

ఈకోయలు కాపురముండు గూడెముల పది మొదలు ఏబదివరకు ఇం డ్లుండును. ఆ యిండ్లు తాటాకులతో గాని, పూరితో గాని నేయబడిన గుడిసెలు. వీరు కాపురముండు గూడెముల లేక పల్లెలచెంతను తాటిచెట్లు, ఇప్పచెట్లు విశేషముగా ఉండును. వీరు తమగూడెములను కట్టుకొనుటకు ముందుగా తమ"పెద్ద"చేత కొన్నినిదర్శనములు కావింతురు. అప్పుడు ఆటంకములు లేవని తెలుసుకొన్నయెడల, గూడెము కట్టుటకు నిశ్చయింతురు. కాని కట్టుటకు పూర్వము వారికొండదేవతలను, గ్రామదేవతలను ఆరాధించి, మేకనుగాని, ఎద్దునుగాని బలియిచ్చి, విందు జరిపి మరిన్ని గూడెము కట్ట ప్రారంభింతురు.




౧. అచ్చపు కోయజాతిపురుషు లిద్దఱు




౨. కోయవాండ్రు



3. సుగాలివారు



౮. కోయవాడు కల్లు తీయుటకయి తాటిచెట్టెక్కుచున్నాడు



౯. కోయజాతి ఆటకాండ్రు

కొన్ని గ్రామములగుంపునకు "సమతు" అని పేరు. ప్రతిగ్రామమునకున్ను గ్రామపెద్దయుండినట్లే ప్రతిసమతునకున్ను సమతుదొరయుండును. వీరు తమ ఇళ్లచుట్టును కొంత ఖాళీస్థలమును వదలి, దానియందు తమపశువులను కట్టుదురు. వీరికి పశువులే ముఖ్యధనము. వీరిపశువులకు వింతయగు పేరు లుండును. వీరు ఒకపూట మాత్రమే పాలను పితుకుదురు. పశువులు పగటిభాగమున అడవిగడ్డిని, ఏటినీరును త్రాగి బ్రతుకును. సవరలవలెనే వీరును పశువులను దొంగిలించుటలో కడుసమర్థులు. మరియు వీరు పోయిన పశువులను జాడదీసి కనుగొనుటలో మిక్కిలి నేర్పరులు. వీరు మేకలనుగూడ పెంచుచున్నారు. పులులవాత బడకుండ తమపశువులను వెదురుతడకలక్రింద నుంచి రాత్రులందు కాపాడుదురు.

వీరు ఆవులయొక్కయు, మేకల యొక్కయు పాలను అనుభవించుటయేకాక, వాటిని చంపి పచ్చిమాంసమును భుజింతురు. వారు దేవతలకు బలియిచ్చునప్పుడును, వివాహములు, లేక ఉత్సవములు చేయునప్పుడున్ను పశువులను విశేషముగా వధింతురు. వీరి పశువులు అడవులయందు మేసినను, వీరికి పన్నులుగాని, ఇతర అభ్యంతరములుగాని లేవు. పశువులను దొంగిలించినప్పుడు పట్టుబడిన దొంగలు తమ నేరమును వెంటనే ఒప్పుకొని, దానికి పదియుంతలు ముదరా నిత్తురు.

ఈకోయలలో గుట్టకోయ లనబడువారు మన్యప్రాంతములనుండి, పోడువ్యవసాయమును, వేట, అడవిపంటలతో వర్తకము ముఖ్యవృత్తులుగా గల్గియున్నారు. పళ్లు, కాయలు, వేళ్లు, ఇప్పపువ్వు, తేనె, చింతపండు, పొగాకు, కల్లు మొదలగువాటిని అడవులయందు సంగ్రహించి తమకు కావలసినది తిని, మిగిలినదానిని అమ్మివేయుదురు. వెదురుబియ్యము పిండి చేసుకొని తిందురు. వెదురు, వంటచెరకు, అడవి పంటలు వీటిని విశేషముగా ఎగుమతిచేసి ధనము నార్జించుచున్నారు. కాని వీరు బద్దకస్తులగుట చేతను, త్రాగుడునందెక్కువప్రీతి గలవారగుటచేతను, తమవస్తువులకు తగినసొమ్మును సంగ్రహించలేనివారగుటచేతను కడు బీదలుగా నగపడుచున్నారు. గుట్టకోయలు సోమరులగుటచేత దుక్కిదున్నక, పోడువ్యవసాయము చేయుచున్నారు. కావలసినచోట అడవిని నఱికి, తవ్వుగాలితోకాని, దుక్కి చాలుతో కాని భూమినికదిపి, చెట్లనుకాల్చివేసి, నీటితో తడిపి విత్తులను నాటుదురు. వారి ఇండ్లకు చేరిన దొడ్లయందు కూడ వ్యవసాయము చేయుదురు. చామ, గంటి, జొన్న, దుంపలు, పొగాకు మొదలగువాటిని పండింతురు. పల్లపుప్రాంతములందుండు కోయలు వారి గూడెములకు చేరిన కొంతభూమిని సాగుచేయుచున్నారు. వీరి దరఖాస్తులపైని భూమి వ్యవసాయమునకై ఎకరము 1 కి 0-4-0 రేటుపైనిఇవ్వబడును. వీరు భూమిని చిన్నదియు,సన్నదియునగు నాగలితో పైపైని దున్ని, మెరకపైరులనేకాక వరి మొదలగువాటిని గూడ పండించుచున్నారు. తమపంటలను అడవిమృగములనుండి కాపాడ,

టకై పొలములకు చుట్టును "అలవను" కట్టుదురు. మరియు, పొలములయందు మంచెలను కట్టుకొని పిట్టలను, అడవిమృగములను తోలుచుందురు. పైరులు, పంటలు తయారుకాగానే వాటిని షాహుకార్లకు గుత్త కిచ్చివేసెదరు. తఱుచు వీరు పచ్చిపైరులనే భుజింతురు.

కోయలు అడవిపోడులను, కొండపోడులను వ్యవసాయము చేయుటయే కాక, లంకలయందుగూడ వ్యవసాయము చేయుదురు. ఈలంకలు దుబ్బుగడ్డి, చెట్లు, చేమలు, ఇసుకతిప్పలు మొదలగువాటి ఆటంకములచేత నదులమధ్యను ఏర్పడును. ఈలంకలయందు తమపసులను మేపుటయేకాక, ఆముదము, జొన్న, కూరగాయలు, పొగాకు, మిరపకాయలు మొదలగు పైరులు పండింతురు.

జాతి మత విషయములు

నవరలలోవలెను, కోదులలోవలెను వీరిలోగూడ కులభేదములు గలవు. పల్లపుప్రాంతములందు వ్యవసాయము చేయు కోయలకు గుమ్మకోయ లనియు, అడవు లందు వేటాడు కోయలకు గుట్టకోయ లనియు పేర్లు. వీరిలో లింగధారణము చేయువారు కొందరు కలరు.

వీరిలో వృత్తిభేదములను బట్టికూడ వేర్వేరు పేర్లు గలవు. బాసకోయలు, వడ్డికోయలు (వ్యవసాయము చేయువారు), డోలుకోయలు (అపరకర్మలు చేయువారు), కాకకోయలు (కూలిపని చేయువారు), కమ్మరకోయలు (కమ్మరపని చేయువారు) మొదలుగాగల కులము లున్నవి.

చేతనాచేతనవస్తుపూజయే వీరిమతము. వీరు చెట్లయందును, కొండలయందును, నదులయందును, ప్రకృతియందును దేవు డున్నా డని నమ్ముదురు. వారికి కల్గు రోగములు, కష్టములు మంచిచెడ్డలు వీటివల్లనే కలుగుచున్నవని వీరి దృఢనిశ్చయము. ఇంతేకాక, ముత్యాలమ్మ, గంగారమ్మ, కొండదేవతలు, వేల్పులు, మొదలుగాగల వారిని ఆరాధించి, పూజింతురు. కష్టకాలములందు జాతరలు జరిపించి, మేకలను, పోతులను బలియిత్తురు. కోయలయందును, కొండరెడ్లయందున్ను శ్రీమునిమతము వారు చాలమంది కలరు.

వీరు భూపండుగ, కొత్తపండుగ లేక సామకొత్తలు, సంక్రాంతిపండుగ, మొదలగు పండుగలు జరుపుకొందురు. ప్రతిపండుగసమయమునందును పచ్చిమాంసము తినుట, ఇప్పసారాయిని త్రాగుట, నాట్యమాడుట మొదలగువాటితో గొప్పవిందులను జరిపింతురు.

జాతక వివాహాది కర్మలు

వీరిలో స్త్రీలు పురిటిసమయమువరకు తిరుగులాడుచుందరు. పురుడు వచ్చిన తర్వాత వీరు మందులను తీసుకొనక, కొన్ని చెట్లఆకులు, వేళ్లు కషాయముగా మరగబెట్టి పుచ్చుకొందురు. శిశువు పుట్టిన ౫వ లేక 7-వ దినమున ఆశిశువును కడిగి నామకరణము చేయుదురు. బంధువులలో పెద్ద ఏపేరు తలపెట్టిన, దానినే పెట్టి పిల్చెదరు. త్రాగుట, నాట్యమాడుట, విందారగించుట జరుగును. వీరిలో రజస్వలానంతరమే వివాహములు జరుగును. మేనరికము

గలదు. వివాహము స్వయంవరము, రాక్షసము అని రెండువిధములుగాను జరుగును. సవరలలో వలెనే, వరుడు సాధ్యమైనంతవరకు తనఇష్టమువచ్చిన కన్యను బలవంతముగానైనను తీసుకొనిపోయి వివాహము చేసుకొనును. కన్యాశుల్కము గలదు. "తాళి"కట్టుట ఉన్నది. విందు, త్రాగుడు, నాట్యము మొదలగు వాటితో వివాహము ముగియును.

వీరిలో వితంతువివాహము గలదు. వితంతువు తనమరదిని సహజముగా వివాహమాడవలెను. అట్లు చేయనియెడల ఆమెగాని, ఆమెను వివాహము చేసుకొనిన వరుడుగాని కొంతముదరా నియ్యవలెను. వీరిలో వ్యభిచారము చాల మెండు. కనుకనే జబ్బులచేత పీడింపబడి, వీరు క్రమక్రమముగా క్షీణదశకు వచ్చుచున్నారు. ఒక పురుషుడు పెక్కుస్త్రీలతో నుండవచ్చును గాని, స్త్రీకి అట్టిఅధికారము లేదు. బిడ్డలులేని వితంతువు తప్పక పెండ్లియాడవలెను.

వీరిలో చనిపోయినపిల్లలను పూడ్చెదరు. కాని వివాహమైన పెద్దవారిని తగులబెట్టి, అస్థులమందున్న బూడిదను ఒక కుండయందుంచి, అక్కడనే దానినిపూడ్చి అస్థలముపైని ఒకరాతిని పాతెదరు. దానిదగ్గర కొన్నిపాలు నెయ్యము అప్పుడప్పుడు ఉంచుదురు. చనిపోయిన 10 దినములలో చిన్నదిన మనియు, పెద్దదినమనియు రెండువిందులను గావింతురు. బంధువు లందరు వచ్చుటయు, వారివారికి తోచిన పారితోషికములనిచ్చుటయుజరుగును. విందారగించిన పిదప ఇప్పసారాయి త్రాగుట, నాట్యమాడుట జరుగును. చనిపోయినవాడు దయ్యము, లేక భూతముకాకుండ వానికి ప్రేతకర్మలన్నియు నాచరింతురు.

వేషభాషలు

వీరు సవరలవలెనే మొలవరకుమాత్రము బట్టలను ధరింతురు. కొందరు గోచీలను, లంగోటాలను ధరింతురు. వీరిలో కొందరికి లంగోటాకు తోకలుండుటచేత వారికి "లంజ" కోయలని పేరు. స్త్రీలు తమ పాలిండ్లను బట్టలతో కప్పరు. కాని, మెడకున్ను చేతులకున్ను విశేషముగా పూసల దండలు వేసికొందురు. వీరిలో పచ్చాకు బొట్లు పొడిపించుకొనుట గలదు. అందమునకున్ను, దయ్యములు పట్టకొనకుండ సురక్షితముగా నుండుటకున్ను, వాతపునొప్పులు పోగొట్టుకొనుటకున్ను వీరిట్లు పచ్చాకుబొట్లు పొడుపించుకొందురు.

వీరు కూయి, తెలుగుభాషలను రెండిటిని మాట్లాడుదురు. కూయిభాష గోండుభాషలో చేరినదిగాకన్పట్టును. బస్తరు నైజాము రాష్ట్రములలోని గుట్టకోయలు శుద్ధ కోయభాషనే మాట్లాడుదురు. వీరిభాషకు వ్రాతలిపిలేదు. ఈదిగువకొన్ని కోయమాటలున్ను, వాటికి సరియగు తెలుగుమాటలున్ను వ్రాయబడినవి—

కోయపదములు	తెలుగుపదములు
అయ్యా	అయ్యా, తండ్రి
యవ్వ	తల్లి
అన్న	అన్న

అబ్బ	తమ్ముడు
పేక	కొడుకు
పేకి	కూతురు
అక్క	అప్ప
పోయి	అత్త

శేషము

కోయలు కడు అమాయకులు. నీతిమార్గము తప్పనివారు. వారికి అపకారము చేయనివారికి ఎన్నడును హాని చేయరు. కాని వారికి కీడు చేసినయెడల దానికి తప్పక కీడు చేయనిదే వదలరు. త్రాగుడు, బద్ధకము, అజ్ఞానము వీటిచే పీడింపబడుచున్నారు. వీరియందు ఇటీవల విద్య నభ్యసించు నలవాటు కల్గినది. కోయగూడెములయందు సర్కారు బడులు, జిల్లాబోర్డుబడులు ఉంచబడినవి. తరిఫీజుఅయిన ఉపాధ్యాయులు విద్యను చక్కగా నేర్పుచున్నారు. ఈభాగములందు రోడ్లను అభివృద్ధి చేసి, ఆసుపత్రులను ఉంచి, విద్యను అభివృద్ధిపరచి, కోయవారికే ఆయాప్రాంతములయందు వీలయినంతవరకు ఉద్యోగముల నిచ్చినయెడల కోయల జనసంఖ్య అచిరకాలములోనే వృద్ధి పొందగలదు.

దేవదాసి

పెనుమర్తి వెంకటరత్నము గారు

కవి

ఎడనెడ నీవసంతనటుఁ డేఁగెడుఁ దేనెల వాఁకలోనఁ దే
లెడు రతనాలనౌక, మధులిట్కులకాహళి మల్లదే! ధ్వనిం
చెడు, జగదేకసుందరి! సుశీతలదృఙ్మధుధార లోఁడిక౯
దడుపు! జను శ్శతోగ్రపరితాపపు వేఁడిమి గొంత యారునో?

భయపడ నేల, అంబరసభాభవనమ్మున నీకుముద్వతీ
ప్రియున కసూయ పుట్టునని? పెన్నిఱిగుంపు మొగిళ్లనుండి నీ
నయన సుధార్ద్రరోచిషము౯ దరితీపుల పాలవెల్లిలో
లయ మయి యాయగాథపు విలాపమునం బడి క్రుంగిపోవుద౯ :

తీవెలమేడలోఁ గలకలి న్నదియించు విహంగవీణలోఁ
దావులు ముమ్మరింప మధుతాండవకేళిని దాఁగి యున్నదో

పూవులరాణి! నీదువలపుల్ పులకించిన కంటకాగ్రవ
న్యావలి నేనుగూడఁ బులుఁగై పడిపోతిని తెక్క లార్చుచున్.

దే వ దా సి

ఓకవిరాజ, నీవు వినవో! రసలుబ్ధజగత్ప్రవృత్తి మా
యాకృతి; విశ్వవీథికలయం దవగుంఠన మీఁగఁ జాల నో
యీ! కెరటాలు పొర్లు జలధీశ్వరుఁ డేని నతీతలోక ది
వ్యాకృతి నన్నుఁ జూచి జడతాత్మకుఁడై కడు మోసపోయెడిన్.

నాయవగుంఠన మ్మెడలినా నను మానుషమంద, దైవపా
దాయతనాన మోకరిలినట్టె మహాత్ముఁడు, పూలరాణితోఁ
దీయములాడు బంభరుఁడు తేఁకువ దప్పి ప్రగాఢ మోహబా
ధాయుతు లై త్రపావిరహులన్ బడిపోదురు వెఱ్ఱివార లై.

నాసౌందర్య మహాప్రవాహములు గంధర్వాళి వర్ణింతు రో
హో! సిద్ధంబ యమర్త్య మంచు, దివిషద్వ్యూహంబు మోహంబునన్
శోషిల్లం బడిపోవు నాత్మభవనిష్ఠ్యూతోగ్రకోపాగ్ని, పే
రాసన్ మానుము మానవుండవు, దవీయశ్శోభిరోచిస్మృతిన్.

అపరసీమంతినీ చరణార్ద్రలాక్ష - శోణఘుసృణసంధ్యా నవాంశులు తొలంక
నాగళోద్గారి మధురగాంధర్వవాణి - దేవతలకుఁ గన్పడెద మాధ్వీపిపాసి!

*　　*　　*　　*　　*　　*　　*

నా జననవృత్తములు పండునాఁడు, నాదు-వాకిళులు విచ్చి నాథుఁడే వచ్చిపోవు!
నాఁటి కనగుంఠనము దీసి, నాయతీత - జననసౌందర్యముల నుపాయనము లిత్తు!

మా గోపాలకృష్ణుడు

బసవరాజు అప్పారావు గారు

చచ్చినదాకా బతికుంటే పెళ్లిచేస్తా నన్నాడట గడుసుబుఱ్ఱ యెవడో, వెనకటికొక వెఱ్ఱివాణ్ణి జూచి! అంతకన్నా తెలివిగలవాడు మరొకడు వెఱ్ఱిబాగుల వాణ్ణొకడికి చచ్చినతర్వాత పెళ్లిచేస్తా నన్నాడట! కాని మా గోపాలకృష్ణుడు చురుకైన తెలివిగలవాడు గనుక వాళ్లూ వీళ్లూ ఆశాశ పెడుతూవుంటే పొంగి బోర్లపడక ఈ కల్లలమారి కపటాంధ్రప్రపంచాన్ని నమ్మివుండక గాంధర్వ వివాహపద్ధతిని మృత్యుకన్యను పరిణయమైనాడు. బతికినన్నాళ్లు ఈ ఉప్పుతెడిసి ముప్పందు మూతున్న ఆంధ్రవీరుడికి గతి కనుక్కొని కృతఘ్నాంధ్రు లందరికి నేటికి గణం పూని వీరావేశ మెక్కుతున్నది. విగ్రహాలు, ప్రతిమలు, స్మారకచిహ్నాలు, కుటుంబనిధులు మొదలైన స్కీములు నిలవలు పలవలుగా వేసి, ఏమీ చెయ్యటానికి తోచక, గవర్నమెంటు వారిలాగ సెలక్టుకమిటీవారికి వదిలివేశారు, మన కెందుకీగొడవంతా అని. ఏమి? సుభాష్ బోసుపాటి చెయ్యడా ఆంధ్రులకు ఆంధ్రవీరావతంసమైన గోపాలకృష్ణుడు? ఈస్మారకచిహ్నాలకి పెట్టదలచిన ఖర్చంతా బతికున్నపుడే గోపాలకృష్ణునికి పెట్టివున్నట్లయితే బతికేవాడేమో? బంగాలీలు పంతముబట్టి సుభాష్‌బోసుని జయిలునుండి తప్పించి బతికించుకున్నారా లేదా? చీరాలయెడారిలో ఏకాకిగా ఆంధ్రవీరుడు పడినయిబ్బందులు ఆంధ్రులకు తెలియక పోలేదని నేను నమ్ముతాను. తెలిసి ఉపేక్షించారు. ఉపేక్షవల్లనూ, కాలకర్మ దోషమువల్లనూ ఆంధ్రరత్న గోపాలకృష్ణుడు దాటిపోయినాడు. మళ్లీ ఎన్నటికీ ఆంధ్రదేశానికి రాడనే నానిశ్చయము.

బతకనిబిడ్డ బారెడా పదిబారలా? గోపాలకృష్ణునికి **seriousness** లేదని ఆక్షేపించినవారు, కార్యదీక్ష లేదని ఎకతాళిచేసినవారు, అతగాడు వొట్టి అస్తావిస్తపు హాస్యగాడని వెక్కిరించినవారు, యావన్మందీ నేడతని సుగుణజాలం పద్యరూపంగా, గద్యరూపంగా, మీదు మిక్కిలి ఉపన్యాసరూపంగా ఘోషించడం చూస్తే నాలో నాకే నవ్వొస్తుం దొకపట్టున! కాని చచ్చినతరువాత కూడా బతికివున్నా డన్నట్లు భ్రమ కల్గించే ఆంధ్రరత్న గోపాలకృష్ణుని శక్తి ఎటువంటిది! ఆయనజీవితానికి మాత్ర మేది! అతని జీవితమార్గ మితరుల కెంతవరకు అనుసరణీయము?

గోపాలకృష్ణుడు మంచిరసికుడు. రసికతే అతని జీవితానికంతా సూత్రము. రసికత అంటే మనశాస్త్రకారులకు భయమేకాని కవీశ్వరులకుమాత్రం ప్రాణం. రసికుడైనవాడికి అరసికుడితో పొత్తు దుర్భరము. అనలేదా కాళిదాసు, "ఎన్ని పాపఫలాలైనా నానెత్తిని గొట్టుకాని అరసికులకు రసము నివేదించ మనిమాత్రం ఎన్నడూ నానెత్తిన రాయవద్దని! గోపాలకృష్ణుడికి ఆజంకు కూడా లేదు, అరసికులనుకూడా రసికులను చేయగల రసికచక్రవర్తి గనుక.

గోపాలుడికీ నాకూ యిరవైయేళ్ల పరిచయం. చిన్ననాటినుండీ అతడు రసికుడే! చక్కనిరూపము, దివ్యమైన ముఖవర్చస్సు, శ్రావ్యమైన గానధోరణి, మాటకారితనము, అన్నిటికన్న ఎక్కువైన నాట్యకౌశలము- ఇంకేమిటి లోటు రసికతకు? ప్రప్రథమము అతని పరిచయము నాకు ఆంధ్రవీరుల రంగభూమి అయిన కొండవీటిదుర్గముమీద కలిగింది. ఆంధ్రవిద్యార్థి మహాసభ బందరులో 190[illegible] సం॥లో జరిగింది. సభానంతరము కొండవీడు దుర్గము దర్శించవలెనని అందరము సంకల్పించుకొన్నాము. ఆసందర్భములో గోపాలుడు కూడా అక్కడికి వచ్చేశాడు. రెండురోజు లున్నాము. రెండు రోజులూ గోపాలుడి కబుర్లతోను, సంగీతముతోనూ రెండుగంటల్లాగు ఎగిరిపోయినవి.

గోపాలుడు తరవాత పెద్దచదువులు చదవటానికి సీమకు పోయినాడట. పండితుల ప్రాపూ పరిచయమూ

కూడా పొందినాడట. మిత్రుల ప్రేమ జూరగొన్నాడట. రసికశిఖామణి ఆనందకుమారస్వామి పండితుడూ, ఆయన సతీమణీ గోపాలుడి గాననైపుణ్యానికి అబ్బురపడి సాక్షాత్తూ గోపాలకృష్ణుణ్ణి పూజించినట్లుగా పూజించారనీ, సీమలో భారతవిద్యార్థి సంఘానికి కార్యదర్శిగా వుండి చాణక్యప్రజ్ఞ ప్రదర్శించాడనీ, భారతదేశానికి తిరిగి పండితుల మహదాశీర్వచనముతో వచ్చాడనీ విని యెప్పటి కప్పుడు మహదానందము పొందుతూ వుండే వాడిని. చెన్నపట్టణంలో విక్టోరియా హోస్టలులో ఒక సారిన్నీ, బెజవాడలో గవర్నరుపేటలో ప్లీడరు గంగ రాజు కృష్ణరావుగారింట మరొకసారిన్నీ అతని పరిచయము కలిగింది. సీమకు వెళ్లి వచ్చేటప్పటికల్లా వేషంలో వైదికపుకత్తు పోయి చిరుగడ్డపు ప్యారిస్‌కత్తూ, సంగీతములో కంపెనీకత్తు పోయి గీతగోవిందపుకత్తూ ద్యోతకమైనవి. అప్పటికి ముఖపరిచయమల్లా చనువులోకి దిగింది ప్రాప్తకాప్త. అంతకు మునుపు గుంటూరు ఎమెచూర్స్ అనే నాటకసంఘములో మేం సభ్యులవటం మెంబర్లమే. అతను ప్రజ్ఞ వుండటంవల్ల పెద్ద పెద్ద రాజువేషాలు కూడా వేస్తుండేవాడు. నేను కుర్రవాణ్ణి గనక చూచి ఆనందించేవాణ్ణి.

కొంతకాలానికి చెన్నపట్నంలో ఆంధ్రసారస్వత సభ, ఆంధ్రసాహిత్య పరిషత్తుకు సాటిగానో పోటీగానో, 1919 సంవత్సరము శీతకాలములో జరిగింది. ఆసభకు గోపాలుడూ, మిత్రుడు అబ్బూరు రామకృష్ణరాయడూ విచ్చేశారు. గోక్లేహాలు ఎదుటవున్న హోస్టలు మేడ సున్ని మువసారాలో నేనూ, గోపాలుడూ, రా. కృష్ణరాయడూ, మరిద్దరు స్నేహితులూ చేరి కూర్చునివుండగా ఎవరో నన్ను కాస్త సంగీతం పాడ మన్నారు. అప్పటికే కాస్త పద్యాలు గెలుకుతూ వుండేవాణ్ణి. 'సంపుడుపాటకు దరిద్రమా' అని పాడ మనగానే సాగదీయించుకోకుండా పాడేస్వభావం కలవాణ్ణి గనక వెంటనే రామప్రియ రాగములో "ఆడవె, ఆడవె, అన్నులమిన్నా" అని నేను రచించినపాట పాడినాను. పాడగానే బ్రహ్మానందభరితుడై ఎంతో పొంగి, "చ్యుతిసమయంలో పాడే రాగం ఇది, భావం ఎంతో సరసంగా వుంది," అని మెచ్చుకున్నాడు గోపాలుడు. మిత్రులు ఔనని తల లూపారు. నాకూ heart అరడుగులు expand అయింది. శేషు, ఇంకొక్కటి కానియ్య మన్నాడు గోపాలుడు; మిత్రులుకూడా సుస్తరించారు. జంకుకూడా తీరి పోయింది. వెంటనే, "పావకమ్ములో పుడక నేటికిటు పడవేసితివో దేవా! ముద్దుగులాబీ ముట్టబోవగా ముల్లు విరిగెనో దేవా!" అనే సొంతసొదను యమునాకల్యాణిలో పాడి వినిపించాను. వినే వినగానే గోపాలుడు అలౌకికావేశ పూరితుడైనాడు. "తత్ చేతసా స్మరతి నూనమబోధపూర్వం భావస్థిరాని జననాంతర సౌహృదాని" అని కాళిదాసు చెప్పినరీతిగా యేమి జ్ఞప్తికి వచ్చిందో కాని, కొంచెముసేపు నిదానించి ఆలోచించి, సోత్సాహంగా "ఈ రాగం ఎక్కడనుంచి పట్టినావోయ్? ఇది నాస్థాయీరాగం. నాలో ఎక్కడో నిద్రపోతున్న యీరాగాన్ని మళ్లీ మేలుకొలిపావోయ్! పద్యభావ మెంతో బాగున్నదోయ్! టాగూరు ఎందుకు నీముందర? ధూపానికి కూడా చాలడు!" అని పొగడ్త ప్రారంభించాడు గోపాలుడు. వెర్రిబాగులా నైతే వెంటనే పాట నింగ్లీషులోకి ఏకజిన్స్‌గారిచేతనో తర్జుమా చేయించి Nobel Prize కోసం ultimatum పంపించేవాడినే! ఎల్లాగో దైవం ఆ ఛెడన తప్పించాడు, నాపుణ్యమా అని, ఆంధ్రుల పుణ్యమా అనీ! గోపాలుడికీ నాకూ మనసు మనసు అతకడానికీ యమునాకల్యాణిరాగమూ, నాముద్దుగులాబీ పాటా ముఖ్యకారణా లయినవి. యేమిచిత్రమో కాని, అప్పటినుండి గోపాలుడు నన్ను మిత్రకోటిలో, అంతరంగగోష్ఠిలో చేర్చుకొని ఆ మరణాంతము ఆదరించాడు.

గిరీశం "ఈవేళ పూటకూళ్లమ్మకీ నాకూ యుద్ధమైపోయింది" అని కన్యాశుల్కములో కంప్లెంటు చేసినట్లుగా గోపాలుడికీ అరసికు లైనవాళ్లకీ ఎప్పుడూ యుద్ధ మౌతూనే వుండేది. ఏల పాటలు, జంగమకథలు మొదలైన పునాదులమీద దేశచరిత్రసౌధము నిర్మించాలనే గోపాలుడి భావము Rajahmundry Training College వారి కెల్లా బోధపడుతుంది? జాతీయవిద్యకూ విజాతీయ యంత్రవిద్యకూ పొత్తుకుదర దనేవాదము బందరు జాతీయకళాశాలవారి కెల్లా నచ్చుతుంది? అది రసి

కతకు సంబంధించిన విషయము, గోపాలు డన్నట్లుగా, 'all a question of taste.' పూటకూళ్ల వ్మ తిండిలో ఎంత taste వుంటుందో ఛాంధసపద్ధతులమీద నడిపింపబడే ఈ పూటకూళ్ల చదువులబడుల (educational hotels) చదువులో అంత taste (రసికత) వుంటుంది. అందుకనే గోపాలుడు పై రెండుకళాశాలలలో ఉద్యోగము చిలోదకా లిచ్చాడు. ఇచ్చినందుకు విచారించక చీరాలసమీపములో వాడరేవు కనతిదూరంలో ఆంధ్ర విద్యాపీఠగోష్ఠిని నెలకొల్పినాడు. " Proximity with the Infinite " లభించిందని పొంగిపోతూ వుండేవాడు గోపాల రసిక చక్రవర్తి.

కాని అరసికులైన ఆంగ్లప్రభుత్వమువారు ఆరామములాంటి చీరాలలో అసహ్యమైన మ్యునిసిపాలిటీని బలవంతముగా యేర్పాటుచేశారు, ప్రజలంతా వద్దని మొత్తుకున్నాను. రసికుడైన గోపాలుడికి ప్రభుత్వంవారి అరసికచర్య చూచేసరికి అసహ్యం అయింది. వెంటనే ఆబాలగోపాలం ఊళ్లోజనాన్ని లేవదీసుకొనిపోయి వనవాసం చేయించాడు చీరాల తీడిమామిడితోటల్లో. దేశము అట్టుడికిపోయింది. ప్రభుత్వమువారు గడగడా వణికిపోయారు. గాంధీమహాత్ముడిదాకా దేశం దీవార్త. వచ్చిచూచాడు మహాత్ముడు. చూచి ఆశీర్వదించి హుషారిచ్చాడు. ఆంధ్రమహాజనులు ధనసాహాయ్యము చేశారు పుష్కలంగా, కొందరు గుణకారులు వద్దంటున్నప్పటికీ.

ఇంతటిలో బరంపురం ఆంధ్రసభలు వచ్చినవి. చీరాలగ్రంథపారాయణానికి గోపాలుని సభకాహ్వానించారు. ప్రభుత్వమువారు కంగారై గోపాలుని వాగ్బంధము చెయ్యవలెనని చూచారు. గోపాలుడు ప్రభుత్వమువారిని ధిక్కరించాడు. సర్కారువారు గోపాలుని పట్టుకొని ఖైదుచేశారు. అదంతా ఒక పెద్దభారతకథ. ఆభారతం అన్ని పర్వాలూ వ్రాసిపెట్టివుంచాను. ఆంధ్రలోకానికి అడిగినప్పుడు అదునుకు సమర్పించాలని కపితీరక ప్రభుత్వమువారు రెండోకేసు పెట్టినారు, Prince of Sections అని గాంధీమహాత్ముడి ప్రస్తుతిగన్న 124 A, I. P. C. క్రింద గోపాలుడిని అణచటానికి! కాని గోపాలుడు తన రసికప్రసంగముతో న్యాయాధికారిని డిల్లపోశేసి తొమ్మిదినెలల విశిష్టైదుతోటే శైటపడ్డాడు. సర్కారువారు చిన్నబోయారు.

తిరుచినాపల్లి జైలులో యేడాది వుండివచ్చి గోపాలుడు గాంధీమహాత్ముని అసహాయోద్యమము అరసికపద్ధతిని నడుస్తున్నదని గ్రహించి దాసు, నెహ్రూ మొదలైన రసికులకు చేయూతఇచ్చి స్వరాజ్యపక్షానికి శాసటగా నిలిచి, కాంగ్రెస్ మహాసభకు కార్యదర్శిగా ఎన్నుకోబడి చాణక్యప్రజ్ఞ ప్రదర్శించి దేశసేవచేశాడు. కాంగ్రెసు బొక్కసం ఖాళీ యిందని గ్రహించి ఊరూర ఉపన్యాసాలిచ్చి నూర్లు చొప్పున పోగుచేసి కాంగ్రెసుసంఘాలకి దానంచేశాడు గోపాలుడు. దేశమాత ఆనందభరితురాలైంది. కాని అంతలో ఎవరిదృష్టి గొట్టిందో యేమో కాని గోపాలుడికి రోగబాధ పంపకములాను యేర్పడ్డది.

మొట్టమొదట బొంబయి మలేరియా జ్వరముగా జోరబడి, క్షయగా మారి, మారిదై రోగము మాగోపాలుని తనపాట్ట బెట్టుకొన్నది. ఆలుబిడ్డలు గోలున నేడుస్తున్నారు. ఆంధ్రలోకము అల్లాడుతున్నది. మిత్రులంతా నిరుత్సాహులై విచారముతో కుమిలిపోతున్నారు. ఏడీ! లేడుగా మాగోపాలుడు? రాడుగా తిరిగీ?

గోపాలుడు రసికచక్రవర్తి. ఆనందకుమారస్వామి పండితునితోగూడ "అభినయదర్పణ"మును ఆంగ్లమున "The Mirror of Gesture" అనే పేరుతో రసికలోకానికి దానము చేశాడు. చిత్రకళ భారతీయ సహజమైన భావస్ఫురణతో ప్రకాశింపవలెనని ఘోషించేవాడు. సంగీతములో కూడా రాగచ్ఛాయ, రాగరేఖ ప్రధానలక్ష్యాలుగాని సంగతులసంఖ్యగాదని పాడిచూపి సిద్ధాంతము చేసేవాడు. అతను ఏరాగము పాడినా జీవకళ ఉట్టిపడుతూ వుండేది. నాదము సింహనాదము, కాని అతి శ్రావ్యమైనది. ఆదిభట్ల నారాయణదాసు, మహమ్మదు హుసేనుగార్ల గాత్రాలు గోపాలుడి గాత్రానికి సరిపోలుతవి. సంగతివేశాడంటే రసమూ, జీవకళా ఉట్టిపడవలసిందే! శ్లోకంగాని, పద్యంగాని చదివాడంటే ప్రత్యక్షర రసస్ఫురణ కావలసిందే! ఎంత సుమాసమైనా

గంభీరముగా నోటబట్టవలసిందే! తొస్సు అనేదిలేదే ఆనోటికి, ఆపాటకు?

ఇక అతనివి ఉపన్యాసాలా? కావు, హరికథలు! ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రికల సంపాదకవ్యాసాల ఫోటోగ్రాఫులా? కావు, సద్యఃకల్పితములైనట్టువంటి కావ్యరత్నాలు! ఆభావ? ఆంగ్లవాసనావాసితమా? కాదు, స్వచ్ఛాంధ్రసుగంధగంధితము! ఆంధ్రులకు హరికథాకాలక్షేపమే నిజమైన ఉపన్యాసధోరణి అని గ్రహించి వేలాది వేల ఉపన్యాస వేదికలమీద ఆ హరికథా ధోరణితో నారాయణస్వరూపమైన మహాజనుల నారాధించి సేవించినాడు. సద్యస్స్ఫురణ అతనిదేసొమ్ము. ఏదైనా పద్యముగాని, శ్లోకముగాని ఉదాహరించాడంటే లక్కలాగు అతుక్కొని పోవలసిందన్నమాటే! స్వరాజ్య పత్రికవారిదీక్ష "జాయై, మాసై, గృహదారుసై,... పూసై, తన్మకరందమై పెలుచ పాఱ్ఱోనీళ్లకుం బల్చసై" పోయిందని గోపాలుడు ఆక్షేపించేసరికి శూలంలాగు గుచ్చుకొని పోయిందిగదా? వందలు వేలు ఉదాహరించవచ్చును. అచిరకాలములో ఆంధ్రులకు పంచభక్ష్యపరమాన్నములతో గోపాలుని వాగమృతము విందొసగ సంకల్పించుకొన్న మాప్రయత్నము ఆంధ్రుల ఆదరణవల్లనూ నెరవేరగలదని మాఆశ.

ఇంక అతని వాదధోరణి? ఏమాత్రమూ కటువుగాక, పిట్టకథలతోను, పురాణగాథలతోను, హాస్యప్రసంగాలతోను, లోకోక్తులతోను, చాటుపద్యాలతోను చతురోక్తులతోను నిండి నిబిడీకృతమై ప్రియుడి నఖక్షతాలలాగు, పెళ్లాము సాధింపులలాగు బాధపెట్టకుండా, ద్వేషము పురికొల్పకుండా కార్యసానుకూలానికి తోడ్పడేది. "Excess of Sorrow laughs" అని డాక్టర్ పట్టాభిగారికి ప్రత్యుత్తరమిచ్చి గోపాలుడు చీరాలవాసుల విషయమై ఆంధ్రుల హృదయాలలో ఒక్కమారుగా చిచ్చురేపాడు. ఆనాడు సభలో వున్నవారంతా ఒక్కపెట్టున హర్షించారు. ఎవ్వరికీ మనసు నొవ్వలేదు. డాక్టర్ గారికికూడా మనస్సు నొవ్వలేదనే నా నిశ్చితాభిప్రాయము.

మరి స్నేహపక్షపాతమో? అగణితము. "నీవాళ్ల"నుకున్నవాళ్లని చేపట్టి బ్రహ్మాండనాయకులను చేయటానికి ప్రయత్నించాడు. స్నేహితులను అన్నదమ్ములవలె చూచాడు. అడిగినవాళ్లకు అన్నదానము తనకున్నా లేకపోయినా మరురోజు సంగతి విచారించుకోకుండా చేసేవాడు. డబ్బులేకుండా ఇబ్బందిపడ్డాడంటారా? గడిచి బ్రదికినవాళ్లెందరో లేరే? మహానుభావు లెందరో కష్టపడ్డారే? ఉద్యోగంలో వుంటే గోపాలుడూ వేలకువేలు సంపాదించి లోకానికి శ్రీరంగనీతు లుపదేశించేవాడే! Life is a gamble (జీవితము జూదములాంటిది) అని భావించి సంచరించాడు గోపాలుడు. జూదములో ఓడిపోయాడో గెలిచాడో నిర్ణయించదగినకాలం ముందున్నది. కాని బ్రతికున్నంతకాలము "మత్తేభేంద్ర విభిన్నకుంభ పిశితగ్రాసైకబద్ధ స్పృహః, కిం జీర్ణం తృణమత్తి మానమహతా మగ్రేసరః కేసరీ" అన్న భర్తృహరి వాక్యమునకు లక్ష్యప్రాయుడై బ్రతికి, తుదకు ముఖాముఖిని మృత్యువును సందర్శించి, వరించి, చేపట్టి మృత్యువశుడైపోయినాడు.

కత్తులూ, కలహాలూ కలకాలముండవు. కాలము పసుపుజల్లెడలాంటిది. మనుష్యుల గుణాగుణాలన్నీ ఆజల్లెడ చిల్లులలోగుండా జారి దిగిపోతవి. వాటినన్నీ మూటగట్టి దాచుకొన్నవాళ్లకే శోభవమూ ధనమూను. లేనివాళ్ల కెన్నడూ లేమే!

కాలచక్రము గతిగడచి తెనుంగు
భావిభాగ్యమెల్ల పండినవెనుక
ఆనాటి కవ్వరైన నడుగక పోరు
గోపాలకృష్ణు డేగోష్ఠివాడంచు?
భాగ్యవశమ్మున భావికాలాన
అమృతతుల్యమ్ములు నతిభావభరిత
ములునైన నాగీతముల వినినంత
గోపాలకృష్ణుని గొప్పదీపించు!

లక్కగేదె

నాళము కృష్ణారావు గారు

విప్రుఁ డొక్కఁడు లేమిచే వెతలఁ బడుచు - తనకుటుంబముఁ బోషించుకొనఁగ లేక
ధనము నార్జింప మానసంబునఁ దలంచి - జలనిధిని దాఁటి దూరదేశముల కేఁగె.

కొంతకాలము గడచినయంత, నతఁడు - ధనము గడియించి తనపురంబునకు వచ్చె
పౌరు లెల్లరు నత్యంతగౌరవమున - వానిఁ దోడ్కొని వచ్చిరి స్వగృహమునకు.

భర్తరాకకు ముద మంది వానిభార్య - కమ్మనెయ్యియు, కూరలు, గట్టిపెరుఁగు,
పిండివంటలు వడ్డించి ప్రీతితోడఁ - దనివి దీఱఁగఁ బతికి భోజనము వెట్టె.

ఆతఁ డవి యెల్లఁ గడుపార నారగించి - యిట్లు వచియించె "సాధ్వి! నే నింటనుండి
అరుగునప్పుడు చిల్లిగవ్వైన లేదు - ఇన్నికూరలు భక్ష్యంబు లెట్లు వచ్చె?

ఇందుఁ దక్కిన వన్నిటి కేమి గాని - యిట్టిపెరుఁగును జవిచూచి యెన్నఁ దెలుఁగ,
ఎట్లు లభియించె నీ కిట్టిగట్టిపెరుఁగు? - గేదెపెయ్యయు మనయింట లేదు కాదె?"

అనుడు నవ్వుచు నాయింతి యనియె నిట్లు:-"గట్టిపెరుఁ గన్న మీ కెంతొ కాంక్ష యనుచుఁ
గొంటి నొకగేదె మనపొరుగింట నున్న - కంసలికి గుల్లగుట్ర తాకట్టు వెట్టి."

"ఎచట కొంటివి? మనయింటి కెదుట నున్న - యట్టికంసాలిచెంతనా? అమ్మచెల్ల!
నిక్క మగుగేదె కా దది లక్కగేదె - సుమ్ము, కంసాలి యకట! మోసమ్ము చేసె."

అనుచు నాతఁడు వచియింప, ననియె నింతి:-"నీదువచనంబు చోద్యంబు గాదె నాథ!
లక్కగేదెలు కలుగునే యెక్కడైన? - ఎవ్వరేనియు విన్నచో నవ్వ రొక్కొ?"

"ఎవ్వ రెన్నివిధంబుల నవ్వ నిమ్ము - 'నిక్క మగుగేదె కా దది లక్కగేదె'
అంచు ముమ్మాటికిని వచియించుచుంటి" - అనుచు సతితోడ గట్టిగ ననియె నతఁడు.

'గడ్డి మేయుచున్నది:' 'గడ్డి మేయు;' - 'పాల నిచ్చుచున్నది:' 'పాల నిచ్చు;'
'పేడ వేయుచున్నది;' 'పేడ వేయు;' - 'దూడ లీనుచున్నది:' 'దూడ లీను'.

ఆలుమగలకు నీరీతిఁ జాలసేపు - జరగె వాదము; పతిమాట సరకు గొనక
తాను పట్టినమాటయే తథ్య మనుచు - పెనఁగులాడె 'ననేమిరా' యనుచు భర్త.

అంత నీరీతి భర్తతో ననియె భార్య: - "వాద మేటికి? అది లక్కగేదె యనుచు
మీరు దృఢముగ మదిని నమ్మితిరయేని - ఋజువు చేయుఁడు హేతు వేదేని చెప్పి."

"అట్టులైన, వచించెద నతివ! వినుము: - మున్ను నే నీపురంబున నున్నయపుడు
కుండలంబులు చేయించుకొనఁ దలంచి - మూఁడుబంగారుకాసులఁ గూడఁబెట్టి-

ఎదుట నున్నట్టి బత్తునియింటి కేఁగి - 'కంసలీ! నీదు నేర్పెల్లఁ గానిపింప
గట్టికుండలములజత కట్టవలయు' - అనుచుఁ బలికితి, నీరీతి ననియె నతఁడు.-

'ఇరుగు పొరుగున నుంటిమి యిన్నినాళ్లు - లాఁతివాఁడనె పలుక నీరీతి?' ననుచు
మంచిమాటల నన్ను నమ్మంగఁ బలికి - శీఘ్రముగఁ గుండలంబులు చేసి యిచ్చె.

తూనిక తూఁచితి, సరియైన తూనిక తూఁగె; - గీటు పెట్టితి, మేలిమిగీటు వచ్చె;
నాణె మరసితి, చక్కనినాణె మమరె; - సంతసించితి, పనిజిగిసంతసకును.

కొంతకాలము గడచినయంత, నపుడు - పెద్దకోమటియింటను పెండ్లి యొకటి
జరుగ, సంభావనంబున కరిగియుంటి; - త్రోపులాడిరి దొడ్డిలో బాపనయలు.

చెవులు పట్టుక నను లాగె సెట్టికొడుకు - ఇంతి! యాతనిపోతర మేమి చెప్ప?-
వెంటనే కుండలంబులు పెఱుకు మనుచు - లొట్టపడి యీవలికి వచ్చె లోనిలక్క.

చెవులు చేతులఁ దడవుచు నివలఁ బడితి - మనమునం దిట్లు తలపోసికొనుచు నంత:
మాయురే! బత్తుఁ డెంతటిమాయ చేసె - మంచిమాటల నన్ను నమ్మంగఁ బలికి?

లక్కపోఁగులఁ జేయఁగలట్టివాని - కొక్క లెక్కయె చేయంగ లక్కగేదె?
కాన, చెప్పుచునుంటి నో కాంత! వినుము - గేదె కాదిది మఱి లక్కగేదె కాని."

జన్మ పరంపర

చింతా దీక్షితులు గారు
[సాహితీసమితి]

౧

అతడు ఫ్రాంసులో బీదకుటుంబములో జన్మించినాడు. శ్రీమంతులు దరిద్రులను పెట్టే బాధలన్నీ అతడూ అనుభవించాడు. రెండుమూడుసార్లు అకారణముగా చెరసాలలో వాసము చేయడము కూడా అతనికి సంభవించినది.

ప్రజలందరూ భాగ్యవంతులమీదికి తిరుగుబడ్డారు. భాగ్యవంతుల వశములో ఉన్న రాజ్యమును విధ్వంసము చేయుటకు పూనుకొన్నారు. ఆ స్వాతంత్ర్య యుద్ధములో అతడూ పాల్గొన్నాడు. చెరసాలను గోడను పడగొట్టుతుండగా ఒకరాయి అతని మీద పడుటచేత అతడు మరణించినాడు.

౨

అతనికిపునర్జన్మవచ్చినది. అమెరికా దేశములో పుట్టాడు. నీగ్రోజాతిలోజన్మించినాడు. అతనికి స్వజాత్యభిమానముఎక్కువగా ఉన్నది. తెల్లవాళ్లు నీగ్రోలవిషములో చేస్తూఉన్న దౌర్జన్యములను అతడుచూచి సహించలేక పోయాడు. వారితో కలహము పెట్టుకొన్నాడు. వాళ్లను దూషించినాడు. తత్ఫలముగా ఒక తెల్లదొర తుపాకిదెబ్బతినిఅతడుమరణించాడు.

౩

అతనికి పునర్జన్మ వచ్చినది. ఆఫ్రికా దేశములో 'జూలూ' జాతిలో అతడుపుట్టాడు. "జూలూ" జాతివారికి జాత్యభిమాన మెక్కువ. తన జాతి నాయకుడు ప్రక్కజాతి నాయకుడికి లొంగి యున్నాడు అది స్వతంత్రమునకు భంగమని అతడు తనజాతి నాయకుణ్ణి పురిగొల్పాడు. అందరూ యుద్ధసన్నద్ధులయ్యారు. ఉభయ జాతులకూ మారణయుద్ధమైనది. జాతు లంతరించినవి. ఆయుద్ధములో మిగిలిన వారితోపాటు అతడూ మరణించినాడు.

౪

అతనికి పునర్జన్మ వచ్చినది. అతడు హిందూ దేశములో పుట్టాడు. ఇంగ్లీషు వారి అధికారం దేశములో అభివృద్ధిచెందుచున్న రోజులు. అతడొక సిపాయి. స్వాతంత్రేచ్ఛ ఒకకారణముగా అతడుకూడా ఇతర సిపాయీలతోపాటు ఇంగ్లీషువారిపై తిరగబడ్డాడు. వీరుడనిపించుకొన్నాడు కాని ఫిరంగి వాతబడి మరణించినాడు.

౫

అతనికి పునర్జన్మ వచ్చినది. అతడు ఇంగ్లాండులో ఉన్నత కుటుంబమున జన్మించినాడు. మంచిచదువులు చదువుకొన్నాడు. మంచి రాజకార్యధురంధరుడని పేరు పొందాడు. స్వదేశమునకు ఆపత్కాలమున మంచిమంచి సలహాలిస్తూ ఉంటాడు. "భారతీయులకు స్వాతంత్ర్య మియ్యవచ్చునా" అంటే, "ఇయ్యకూడదం"టున్నా డతడు.

శ్రీగద్వాలసంస్థానపురెడ్డిరాజుల గురుభక్తి

ఆదిపూడి ప్రభాకరకవి గారు

శ్రీ రామభూపనుత, సీ-తారామక్షోణిధవ, సుధాధామమహో
దారయశస్సారతర-క్షీరాబ్ధివిహారహారి, కేశవ, శౌరీ!

చలదుత్తుంగతరంగశోభితము కృష్ణాతీరమం దాయహో
బలలక్ష్మీనరసింహ దివ్య పదసేవాధుర్య శ్రీరంగ నా
థలసద్బోధన నామదేశికుని సీతారామ భూపాలుఁ డ
త్యలఘుం డాదటఁ గొల్చెఁ దచ్చరణ భక్త్యారూఢచిత్తాబ్జుఁడై.

కనకాంబరంబులు గణన కెక్కుడు గాఁగ నర్పించె గురునిపాదాబ్జములకు
రజతస్వరూపముల్ రాసులు వోసి యర్పించెఁ దచ్చరణ రాజీవములను
నవరత్నమయ భూషణముల సంఖ్య లొసంగి మెఱఁగెఁ దదంఘ్రిపంకరుహయుగళి
షడ్రసోపేత భోజనతుష్టి యొసఁగ సేవించెఁ దత్పదపద్మ వినతుఁ డగుచు
హస్తి తురగశతాంగ పల్యంకికాది-దివ్యవాహనములు నివేదించి భక్తిఁ
బూజ లొసఁగె సీతారామ భూధవుండు-నతులు నుతు లొప్ప శ్రీరంగనాథయతికి.

కాల్బలంబులచేతఁ గత్తుల చకచకల్ దినమణిద్యుతులకుఁ దేజు లీన
రాహుత్తులబుజాల రహి వహించు తుపాకు లమరారులకు మతిభ్రమణ మొసఁగఁ
బటుభటోద్భటహస్త పర్యటత్ కేతన పటలంబు సురల కభయము సూప
నాశావకాశ మాద్యత్తూర్య ఘోషమ్ము లరుదెంచు శుభసమయమ్ముఁ జాట
స్వారి వెడలిన సంయమిస్వామితోడ-సరిగె నరసింహు కెలనఁ బ్రహ్లాదుపగిది
మోడ్పుకేల్దమ్మియును నరమోడ్పుచూడ్కి-కొమరు మిగులంగ నరపాలకుంజరంబు.

అఖిలజీవవ్రాత మాత్మతుల్యంబుగా సరసి యీషణముల నడఁచువాని
నైహికభోగమ్ము లన్నియు నమ్మహా మాయావికల్పనఁ జేయువాని
నవ్యాజ కరుణామృతార్ద్రమై శోభిల్లు హృదయంబుతోడ వర్తించువాని
సరసఁ జేరిన యెట్టి చండాలునేనియు సచ్చరిత్రునిఁ జేయఁ జాలువాని

అగో

సర్వశోభనవితతి కాస్పదము విష్ణు - దేవుపదసేవ యనుచు బోధించువాని
నెఱిఁగి సేవించె సేవించి యెఱుకఁ గాంచె - మాన్యుఁడు మావిభు ప్రేరితానురక్తి.

పండ్రెండుమూవు లొప్పంగఁ గ్రాలెడు చండభానుండు వెన శీతభానుఁ డయ్యె
మిన్నుమన్నును నాక్రమించి వచ్చెడు కృష్ణవేణమ్మ రుచిరాళివేణి యయ్యె
గాలిద్దఁ జుఱచుఱఁ గాల్చు చుండెడు శిలాతలములు మిహిర శీతలము లయ్యె
నెఱగలిమంటలఁ గురిసెడు ఖరకర కరములు గాంగశీకరము లయ్యె
చిట్టిదొరసాని ముద్దులపట్టిఁ గూడి - భక్తిపరవశుఁ డయి గురుస్వామి సాగ
నంప సోపానములు డిగి యల్లనల్లఁ - బల్లకీతోడ నడచు మాపార్థివునకు.

ఆందోళికావరోహణవేళఁ గై దండ యొసఁగి పావలు ప్రోల నుంచునపుడు,
సోపానములు డిగ్గువో నడుగడుగున కెచ్చరించుచుఁ బరా కిచ్చునపుడు,
పడవపై నెక్కునప్పుడు పార్శ్వములు కాచి పాయక శ్రమ లేక పట్టునపుడు,
పాయఁ ద్రోసెడుతఱిఁ బాదపద్మములపై శిర ముంచి ప్రణతులు సేయునపుడు,
ఎంతవినయంబు, నయ మెంత, యెంతభయము-భక్తి యెంత యీభూపాలపరివృఢునకు
నంచు జలజల రాల్చె బాష్పాంబువులను - నయనములనుండి శ్రీరంగనాథదండి.

ప్రాచీన పుణ్యంబువశమున వచ్చెఁగా కిట కేల తా వచ్చు నీఘనుండు
వచ్చిన వచ్చెఁగా కిచ్చమూఁడేండ్లు సేవించు భాగ్యంబు లభించు నెట్టు
లదియు లభించెఁగా కల మహాత్ముని కేల కలుగు నాపయి నింత కనికరంబు
కనికరంబును గల్గెఁ గా కేల యింతటఁ బైనంబు తానెట్లు ప్రాప్త మాయె
ఇంక నెక్కడిగురుసేవ, యేడ తీర్థ - సంస్మరణ మేడ, యేడప్రసాదభోగ
మనుచుఁ దల వంచుఁ బలవించు మనుజనాథుఁ-డంచుఁ గన్నీరు గురువియోగార్థచింత.

అన్యాంగనాసక్తుఁ డైన నాథుని నేఁడు భంగాలఁ బెట్టఁగా వలయు ననుచు,
రత్నమ్ము లెల్ల నేరమణి కిచ్చునో నేఁడు, పని బూని పట్టుకో వలయు ననుచుఁ,
గూడికూడని యిట్టి కూటంబునకు మదిఁ గలలోఁతు దెలిసికో వలయు ననుచుఁ
దనపాం దలనికి నచ్చునో నచ్చదో యెక్క-బాస చేసికొనంగవలయు ననుచు,
వార్థిఁ జేరంగఁబోవు సంభ్రాంతి యెసఁగఁ - బఱచు శ్రీకృష్ణవేణమ్మ భాగ్యమహిమ
నొదవె నాయమ్మ కపుడు శుభోదయముగఁ - బరమగురునాథుచరణసేవావిభూతి.

ముడిచిన కెందమ్మి పూవు లివే లంచుఁ జయ్యనఁ దీసి విజ్జల్లుకరణి
నల్లిన జడ సూచి యలరువా రెవ రంచుఁ బొడవువేసలి విరఁబోయుకరణిఁ
గట్టిన వలికోక గౌరవం బేమని విప్పి యయ్యాది పాఱవేయుకరణిఁ
దాల్చిన ముత్యాల దామమ్ము లే నొల్లనే యని వెసఁ ద్రెంచివేయుకరణి
వీచువీచీకరమ్ములు వినతి మోడ్చి - సిగ్గు విరిమొగ్గలుగ నర్చచేసి గురుని
కేఁగఁగాఁ బాయ యిచ్చె మాకృష్ణవేణి - పతియు యతియును నివ్వెరపడి భజింప.

మాయాకురంగంబు మహిఁ గూల్పఁ జనుచున్న రఘుకులస్వామి నారాచ మనఁగ
నంతరిక్షంబున అమృతకుంభము పూని పఱచుచున్న విహంగపతి యనంగ
నుదయార్కబింబంబు నమియఁ బోగయి యేఁగు చండదీధితుల పుంజం బనంగ
బాణాసురప్రాణ పానాశఁ జనుచున్న శార్ఙ్గనిర్గతసుదర్శన మనంగ
భ్రాంతి యొనఁగొల్పు చాయానపాత్ర పూజ్య - తీర్థపుంగవు నరసింహదేవుఁ డున్న
హొన్నుపల్లకితోఁ బాయ నుఱికె కృష్ణ - వేణి కద్దరిఁ జేరెఁ బృథ్వీపతి యలర.

ప్రాభాతసూర్యబింబము ప్రాచిఁ బ్రాఁకుచోఁ బరిఘవిల్లెడు నొప్పఁ బరిహసించి
వనవిహారార్థంబు చనుచు మేరువు నెక్కు నైరావతముసొంపు బేర ముడిచి
భూభార మటు డించి పుట్టపై కేతెంచు భోగీంద్రు సాగ సెల్ల బుట్టఁ బెట్టి
దైత్యలోకకుకూలదహనుఁ జూడఁగ నేఁగు నాకకర్మంది విన్నాణ మడఁచి
అల్లనల్లన నవలిగట్టాయతీంద్రుఁ - డెక్కు గమ్యస్థలంబు నిం పెసఁగఁజేరెఁ
బఱియు నాదిక్కునకు నమస్కృతి యొనర్చి - సౌధరంగంబుఁ జేరె విశ్రాంతి యొసఁగ.

రవీంద్రుడు*

గరిగిపాటి రామమూర్తిగారు, బి. ఏ.

జలనిధిపూరముల్ తరణి సంతతమున్ గ్రహియించు చుండు, న
బ్బలరిపు డంబుదావళుల బంపి సువృష్టి నొసంగు, సృష్టిలో
గలుగు రహస్యసారమును గ్రాహ్య మొనర్చి కవిత్వవర్షమున్
గలుగగ జేయు దీవు రవికం టెను, నింద్రునికంటె మిన్న వై.

---

* శ్రీయుత కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారి సంస్కృత శ్లోకమునకు భాషాంతరీకరణము,

బోధనాపద్ధతులు

[19-3-1927 వ తేదీని రాజమండ్రీ బోధనకాశాలలో ఉపాధ్యాయసంఘ వార్షికోత్సవసందర్భంలో, ఒకపాతవిద్యార్థి చదివిన వ్యాసం.]

"బోధించడం" అంటే ఒక తెలిసినవాడు ఒక తెలియనివాణ్ణి దగ్గిర కూచోబెట్టుగుని, ఒక కొత్తవిషయం పట్టుగొచ్చి అది అరిటిపండు ఒలిచినట్టు చెప్పి, "చెప్పాను, నా పని అయింది" అని ఊరుకోడం కాదు; వాడి చేత "హాం" అనిపించి "అదా! తెలిసిందండీ" అనిపించడం. అనగా బోధనలో ఉపాధ్యాయుడూ, విషయం, విద్యార్థీ ముగ్గు రుండాలి; కాని ఈముగ్గురూకాక మరొకపదార్థం ఉంటేనేగాని బోధనక్రియ నెరవేరదని జ్ఞానుల ఊహ. అదేమిటంటే, విద్యార్థి అయినవాడికి చెప్పేవాడియందుండవలసిన ఒకభావం. విద్యార్థికి మేష్టరంటే 'హడల్' ఉన్నానరే— యముడ్రా వీడు,తప్పట్టుగుని చంపేస్తాడ్రా—అని.'భయం' ఉన్నానరే—యమకింకరుడురా వీడు, అదే తన్నడం తన్ని బాధిస్తాడేమో—అని. 'భక్తి' ఉన్నా నరే — సృష్టించిన దేవుడ్రా, నేను మొక్కాలీ — అని. 'విశ్వాసం'ఉన్నా నరే—యజమానుడురా, నేను సేవించాలి— అని. 'నమ్మకం' ఉన్నా నరే — జ్ఞానిరా, నేను ఆశ్రయించాలి — అని. 'గౌరవం' ఉన్నానరే — అనుభవ శాలిరా నేను వినాలీ—అని. పోనీ 'స్నేహం'ఉన్నానరే— సహవాసిరా, నేను తిరస్కరించనా — అని. ఆఖరికి 'సిగ్గుభిడియాలు' ఉన్నానరే — అవతల మేష్టరికి రాకపోడం అనుమానం అయినా, నాకు రాకపోడం రూఢిగదా—అని. ఆలాంటి భావం ఉన్నన్నినాళ్లు మేష్టరులో ఉండేది చదువు; మేష్టరుయందు గురుత్వం ఉండేది. ఆతరవాతనించి కుర్రాడిలోనే గురుత్వం ప్రవేశించింది. అనగా, అప్పటిదాకా విద్యార్థి విద్య అర్థించేవాడు, అక్కణ్ణించి ఆ అర్థించడం మానుకున్నాడు. మానుకుని"విద్యకోసం మరి నేను బయలుదేర్నా. అంత అవసరంగా ఉంటే విద్యనే నాదగ్గిరికి రమ్మనండి. నాకేం పట్టింది? కావలిస్తే ఏమన్నా మధ్యవర్తులకి నాలుగురాళ్లు గిరవటెడతాను." అని బిగిసి కూర్చున్నాడు. అయితేం గాక, అతడు అర్థించకపోయినా నరే "మేం మాత్రం మా కొచ్చింది బోధించక మానం"అని అనేక కారణాల వల్ల ఉపాధ్యాయులు విద్యార్థిని పట్టుగున్నారు; ఆలోచించారు. "ఆఁ. ఏమిరా ఇదీ. కుర్రాడు ఇల్లా వినిపించుగోకుండా వచ్చాడు; వీడికి కల్మషం లేదే! వీడు దేవుడు. వీడి మనస్సు కని పెట్టాలి. ఇన్నాళ్లనించీ ద్రోహంచేసి వీణ్ణి కేవలం కుర్రాడి కిందగట్టి చదువు తెగచెప్పి నెగ్గుకుపోతున్నారు కొందరు. అల్లాంటి అన్యాయం జరగకుండా కట్టుదిట్టం చెయ్యాలి" అని స్థిర

పరిచారు. "కుర్రాడికి తెలియకపోవడానికి కారణం కుర్రాడు కాదు, మేష్టరుగారి తెలివి తక్కువ" అన్నారు. అంతటితో మరి మెదడు వెనక్కి పట్టి మెథడ్ తియ్యమన్నారు.

ఆఫళంగా బోధనాపద్ధతులు వెలిశాయి. ఉపాధ్యాయుడు తనకి ఊహా మహావచ్చును గదా అని విశేషాలు గబగబా అదే వాగుడు కింద ఊరికే చెప్పిపారెయ్యకూడదన్నారు. సంగతులకి కొత్తంటూ ఏముంది? ప్రతీసంగతీ కూడా నున్నా కుర్రాడి బుర్రకాయలోనే ఇదివరకే ఏమూలో దాగుడు ముచ్చీలు ఆడుతూ వుంటుంది. అది ఎక్కడుంటుందో వెతికి బయటికి లాగడంపూచీ మాష్టరిది అన్నారు—ఇదే ఎలిసిటింగ్ మెథడ్ అంటారు. కొందరు 'కుర్రాడికి ఏదో శాస్త్ర లంచమిచ్చి బెల్లించాలి; లేకపోతే చదవడు' అన్నారు. కొందరు వాడు ఏం కావాలంటే అది చెప్ప మన్నారు. వాడేమీ వద్దంటే ఊరుకోడమే విద్య అన్నారు. వాడు 'ఎప్పుడు, ఏది, ఎంతవరకు' కోరితే 'అప్పుడే, అదే, అంతవరకే కానీ' మన్నారు. వాడి బుర్ర గుంజుని అంటిపెట్టుగుని కొన్ని గొప్ప లక్షణాలు ఉంటాయి; వాటికి ఓ పట్టకారు పట్టించి ఇవతలికి పెల్లగించడమే 'ఎడ్యుకేషను' అంటే అని, ప్రతీమనిషీ లెక్చెరివ్వగలడు. ఇల్లాగ్గా ఒక్కొక్క కొత్త ఊహతో, వెనకటి పద్ధతుల్లో లోట్లు తమరు పూడిచాం అని ఎవరి మట్టుకు వారు చెబుతూ, ఒక్కొక్కటీ చొప్పున, అనేకమైన నవీనబోధనా పద్ధతులు బయలుదేరదీశారు! దాంతోటి ఏం జరిగింది? జీవంఉన్న మాష్టర్ని వదిలేసి లేచిపోయిన గురుత్వం జీవండున్న కుర్రాణ్ణీ ఆశ్రయించలేదు, కుర్రాడు మైనరుగదా అనిగా వున్న-ఆగురుత్వం ఇప్పుడు జీవంలేని మెథడ్ ని నమ్ముకుని ఉంది. ఆమెథల్ మహాదేవతనే అందరూ కొలుస్తున్నారు.

ఎల్లానో అల్లా అంతా మెథడ్స్మరణే. మతాల్లో ఉండే కక్షలు, వృత్తుల్లో ఉండే అభిమానం, భాషల్లో ఉండే అసహ్యాలు మెథడ్లలో ఉన్నాయి. ఏమనిషి మంచివాడో నిర్ణయించచ్చు; చివరికి ఏగడియారం రైటో తేల్చచ్చు గాని ఏమెథడ్ మంచిదో చెప్పలేం. ఈమెథడ్ మంచిదా ఆమెథడ్ మంచిదా అనే చర్చ అసలు కూడదు. వెనక ఓకవి వైదీకా, నియోగా అని మీమాంస వచ్చింది. సరి, ఓ వైదీకిగారు కవి వైదీకే అని వాదించి పదిపదిహేను దృష్టాంతరాలు చూపించాడు. తక్షణం, ఒక నియోగిగారు బయలుదేరి కవి నియోగే అని ఇరవైచోట్ల ఋజువులున్నాయి; గ్రంథవిస్తరభీతిచే ఆగుతున్నానన్నాడు. ఆంధ్రసాహిత్య విమర్శనలో గొప్ప వాదనవిషయాలు ఏవంటే ఇవీ, కాలనిర్ణయమూను. చివరికి ఓ ఆసామీ చక్కావచ్చి, ఆకవి నియోగీకాడు వైదీకీకాడు, అసలు బ్రాహ్మడే కాడు వల్లకాడు, అబ్రహ్మణ్యుడని చెప్పి పూర్తిగా సిద్ధాంతం చేశాడు. అందుకని మంచి మెథడ్ మాట అటుంచి ఎవరేనా వచ్చి ఇవి మెథడ్లే కావంటే! చావాలి. కాని, కొందరు మెథడ్లు అంటే తమరికి ఇష్టం లేదం

టూ మెథడ్లు ఉపయోగిస్తారు; ఏమీ బా గుండలేదు, కాస్త వంకాయకూర ఇల్లా వడ్డిం చండి అన్నట్టు. మరికొందరు, మెథడ్‌ని ద్వేషించినా అది నిరర్థకం అని శాసన చెయ్యా డానికిట ఉపయోగిస్తూన్నది; చుట్ట కాల్చడం ఎందుకయ్యా అంటే, పొగాకంటే నాకు ద్వేషం కనపడ్డ చోటల్లా దాని మొహం తగలేస్తున్నా ను అన్నట్టు. చాలామంది మెథడ్ అవలంబించి ఫలితం శూన్యం అయితే మెథడ్‌ తప్పంటారు; టెన్నిసులో పాయింటు పాడుచేసి బాట్ కేసి చూసి మొహం చిట్లించినట్టు. చేసేటట్టు చేస్తే ప్రతీమెథడూ మంచిదే అని కొందరు. తమరి మెథడే మెథడని కొందరు.

పూర్వం బోధనకి పద్ధతులంటూ వినం. ఆచరణలో కొన్నిరీతు లున్నా, అవి పేరు మోసిన పేర్లతో లేవు. కాబట్టి మనమే వాటికి కొన్ని పే ర్లెట్టాలి. మొదట 'దెబ్బ దేవేంద్ర లోకం' మెథడ్, అనగా "తెలిసిందా, తెలిసిం దా లేదా; తెలిసిందను, అను" అని తెలిసే వరకు కొట్టడం. తరవాత, 'పొడుంపట్టు' మెథడ్, అనగా బొటనవేలూ చూపుడు వేలూ కలిపి పట్టుగుని— "ఆయొక్క— శ్రీరామచంద్రుల వారు ఏమన్నారూ?" అంటూ సభక్తికంగా చెప్పడం. ఆపైని 'వాయినం' మెథడ్: మేష్టరు 'గివ్' చేస్తూం టే విద్యార్థి 'టేక్' చేస్తూండడం, "ఇస్తినమ్మా వాయినం" అంటే, "పుచ్చుగుంటినమ్మా వాయినం" అన్నట్టు. ఒకవేళ విద్యార్థికి ఇష్టం లేకపోయినా 'గివ్'చేస్తే, కూరడం లక్షణం ఉంది గనక 'కాయావకాయ్'అనేవ్వంటి 'గన్ పౌడర్' మెథడ్ అవుతుంది. అక్కణ్ణించి "ఫెయిర్"మెథడ్ ఉండేది— అనగా సంత కింద పాఠం చెప్పడం. ఆతరవాత,'వడ్డీమంగలి' మెథడ్, అంటే శిష్యుడు కాళ్లు పిసుగుతూంటే గురువు పాఠం చెప్పడం. వీటిల్లో"ఊఁ మెథడ్" అని ఒకటుంది. ఓ తాసిల్దారుగారు తమరి అబ్బాయిని 'నాలుగుమూ ళ్లెంత?' అని అడి గితే అతడు కాయితం ఉంటేనేకాని తేలదని అది పుచ్చుగుని దానిమీాద "2" అని వేశాట్ట. తాసిల్దారుగారికి కోపం వచ్చి తమరింటో ప్రై వేటు ట్యూషన్ మనిషికి కబురంపించి, "ఏమి టయ్యా నీచెప్పు? నాలుగు మూళ్లైనా రాదే మావాడికి!" అన్నాట్ట. అంటే మేష్టరు- "ఇది వరకు పదిసార్లు చెప్పానండి, రెండు మూడు సార్లుగాదు, పదికాని; దానికి మెథడ్ వుంది లెండి మీరెరగరు. చూడండి నే తీన్తాను సమాధానం. నాలుగుమూ ళ్లెంతోయ్!"

అ—పది! (అని మూలుగుతాడు).

మే—ఊఁ-

అ—పదకొండు!

మే—(మరీఘట్టిగా)ఊఁ-

అ—పన్నెండు!

మే—(బహుదీర్ఘంగా తాపీగా) ఊఁ...

తా—మరి, మీారైతే ఇప్పుడు ఇల్లా చెప్పించారుగాని, ఇందాకా వాడేసిన 'రెండు' తప్పు కాదూ?

మే—కాదండి. ఈ ప్రశ్నకి రెండాన్స ర్లున్నాయి. మీాఅబ్బాయి'2' ఎందు కేశాడో

తెలిసిందా? నాలుగు మూళ్లు రెండు గజాలు గదా అని. కాదుటోయ్?

అ—మరేనండి!

మే—ఊం.

ఇదికూడా ఒకజాతి "ఎలిసిటింగ్ మెథడ్." ఇంకా "ఫింగర్ అండ్ స్ట్రెయిట్ మెథడ్" (వ్రేళ్లతో దండ్యం మెలెయ్యడం—పరా:—దండ్యం ఉంటేమాటే), "వాల్ ఫైర్ మెథడ్" (అనగా గోడకుర్చీ మెథడ్) లాంటివి ఉన్నాయి కాని మనం ఇక ఇటీవలి పద్ధతులలో పడదాం.

మొదట సోక్రటిక్ మెథడ్; అనగా ఊడదూ బసవన్నా మెథడ్. మేష్టరు "కాదుట్రా" అంటే విద్యార్థి "అవునండి, ఒట్టు, అంతేనండి" అంటాడు. అప్పుడే వెంటనే మేష్టరు "అవునా?" అంటే "కాదండి, ఒట్టు" అంటాడు. కుర్రాడు 'యెస్' 'నో'లే ప్రయోగించేది. వెనకటికి 'యెస్, నో, ఆల్ రైట్' వచ్చిన ఒకాయన దొరగారితో మాట్లాడ్డానికి వెడితే దొరగారు మొదటి ప్రశ్న "మీా వూరికి మెడ్రాస్ ఎంత" అని వేశాట్ట. వేస్తే ఆయన 'నో' ప్రయోగించాట్ట. దొరకి తెలిసి, "నీకు జాతిభాష రాదుగావున్ను" అన్నాట్ట. మనవాడు "యెస్" అన్నాట్ట. అక్కడితో దొరకి విసుగెత్తి "నీవు ఫూల్‌లా వున్నావే" అన్నాట్ట. 'ఆల్ రైట్' విసిరి మనవాడు చక్కాపోయాట్ట. అల్లాంటిదే కొశ్చెన్ మెథడ్. వీటిల్లో మాష్టరుకి బాగా వస్తుంది పాఠం. తరవాత కొన్నాళ్లకి ఒక డైరెక్టరు అనే దొర ఒక మెథడ్ కనిపెట్టాడు. అదే డైరెక్టు మెథడ్. తెలియని భాష నేర్చుగోవాలంటే తెలియకుండా మాట్లాడుతూంటేగాని బాగా తెలియ దన్నారు వీరు. ఈయునికి ఏజెంటు ఫొనెటిక్స్ అనేదొర. ఈదొర ఊరుకో పేరు, ఒక్కొక్క మనిషి దగ్గిర ఓవేషం వేసేసరికి ఈన అసలు నామరూపాలు పోతాయి. విన్నప్పుడు ఈన బాగానే ఉంటాడు గాని, చూపులకి మాఅసహ్యం. ఎవరిష్టం వారిది ఈయన్ని పిలవడంలో. ఒక యజమాని మేష్టర్ని ఇల్లా ఆశ్రయించాట్ట—"మా కుర్రాడిమీాద ఆ ల్యూనటికుస్ దొరగారికి కోపంట. తమరు చెప్పి కొంచెం కూడ తీద్దురూ!" అని. అక్కణ్ణించి 'రియలిస్టు' అనే మరొకదొర—దొరేమిటంటే, ఇంగ్లీషు ఊరుపేరు, దేశంపేరు, పర్వతంపేరు, జంతువు, పక్షి, మనిషి ఇవన్నీ దొరగార్లే మనికి—ఒక మెథడ్ స్థాపించాడు. ఇదీ కొంత ప్రబలింది. ఓమేష్టరు పిల్లిమీాద రియలిస్టిక్ మెథడ్ ప్రకారం 'ఐడియల్'గా పాఠం చెబుదామని, ఒక పిల్లిని క్లాసులోకి పట్టి గెళ్లాడు. వెడితే అది బరిమీాద పడి కొందర్ని రక్కి, కడంవాళ్లని గుడ్లుపీకి చేతిలో పెట్టడానికి సిద్ధమైందిట. పదపడి ఒకాయన 'కాంక్రీట్' మెథడ్ కనిపెట్టాడు. రోడ్డు కాంక్రీట్‌కీ ఈయనకీ సంబంధం తేలేటట్టుగా ముందు ముందు శాసనం దొరకచ్చు. ఓపంతులు దీని ప్రకారం పాఠం చెబుతున్నాడు. 'ఐ టాక్'

అన్నాడు. అని, అన్నదల్లా చెయ్యాలిగా, రి, మాట్లాడాడు. ఇదివరకునుంచీ మాట్లాడు కూండడంవల్ల కొత్తగా అప్పుడేం చేశాడో ర్రాళ్లకి బోధపడలేదు. 'ఐ సింగ్' అన్నాడు, అని పాడాడు. 'ఐ లాఫ్' అన్నాడు, అని వ్వాడు. 'ఐ క్రై' అన్నాడు, అని పాపం, డిచాడు. 'ఐ డై' అన్నాడు, అని పాఠం గిపోయిందని తరవాత హెడ్‌మాస్టరుగారు ప్పడతారని గావును అంతటితో ఊరు న్నాడు. పోనుపోను ఒకతను 'రీజనల్' మెథడ్ చేశాడు. కొండలమీద పాఠం అయితే అంతా కొండెక్కాలి. గోదావరిమీద అయితే అంతా కట్టకట్టుగుని గోదావరిలో దిగాలి. గాలిమీద పాఠం అయితే అంతా గాలిలోకి గరాలి. ఇది రమారమీ 'ఎయిరీ' మెథడ్. ఈలోపున 'సైన్సు' దొరగారు ఒక మెథడ్ సృష్టించాడు. ఇందులో ఒక్కటే వచ్చింది చిక్కు. ప్రతీవాడూ తన ఆయుర్దాయం సాగ గొట్టించుగుని, తెలివితేటలు చెక్కించుగుని రావలసివచ్చింది. ఈస్థితిలో ఒక 'లేబర్' పక్షం మనిషీ, ఒక 'టోరీ' పక్షం వాడూ జాయింటు మతంచేసి 'లేబరేటరీ' మెథడ్ కనిపెట్టారు. బాగా కృషి చెయ్యాలి, డబ్బు విపరీతంగా ఉండాలి, అదెట్టి కర్రా కంపా సామగ్రీ కొని తయారుచేసి ఉంచితే, ప్రతీవాడూ అందులో డి కొట్టుగుని కొన్నాళ్లకి ఏదో కనిపెట్టలేక పోడన్నారు. కాని ఇంకో ఇద్దరు తలెత్తారు: 'డిడక్షన్' దొర 'ఇండక్షన్' దొర అనేకమల ల్లలు. ఎవరెవరో పోల్చడం మా కష్టం. లోపల కూర్చుని వచ్చానంటాడు మొదటాయన. వచ్చాను, లోపల చిక్కడ్డాను అంటాడు రెండోఆయన. వీరు చెరోవేపూ నడిచి, చివరికి రాజీపడి 'ప్రొడక్టివ్' మెథడ్ ఒక్కటి మాత్రం స్థాపించారట. ఇల్లా ఉండగా 'హ్యూరీ' అనే మరొక దొరగారు బయలుదేరారు. ఆయన చరిత్ర వ్రాసిన 'బ్యూరీ' అనే దొరకి మేనమామ అయినట్లు మా స్వకీయ విలేఖరి వ్రాస్తున్నాడు ఈయన, తక్కువామిటి- "నేనే కనిపెట్టా, నేనే కనిపెట్టా," నంటూ ఒక మెథడ్ నెలకొల్పాడు. అదే 'హ్యూరిస్టిక్' మెథడ్ అయింది. ఈపద్ధతి ప్రకారం విద్య స్వకపోలకల్పితం. పదపడి 'కిండర్ గార్టెన్' బయలుదేరింది. అనగా మేష్టర్ని 'తోటమాలి' పని చెయ్యమన్నారు. మొక్కల తిండి మొక్కలకి తెలుసులెండి, అన్నారు. ఆ మట్టున ఒకదొరసాని వ్యక్తిత్వం సంపాదించడానికి ప్రతిబాలుడికీ స్వేచ్ఛ యింకా కావాలి, చాలదు అని విచారించి, ఒక 'సారీ' మెథడ్ పెట్టింది. అదే 'మోంటిసారీ' మెథడ్. ఇందులో కుర్రాడు ఏమంటే ఆదే వేదం: వాడు మేష్టర్ని నోరుమూసుకోమంటే మేష్టరు అంతే చెయ్యాలి. లేకపోతే వాడిమనస్సు పాడై చదువురా దన్నారు. కాని ప్రతీమెథడ్‌లోకిమల్లేనే అందులోనూ, చెప్పినవాటిల్లో చాలాపరతులు పాటించక్కర్లేదుట. కాలక్రమాన్ని డాల్టన్ దొరగారి మెథడ్ వచ్చింది: ఇందులో మేష్టరు చెప్పకుండా చెప్పాలి. విద్యార్థికి బాధ్యతా, పట్టుదలా, ఓర్పూ ఉండీ, చేతినిండా డబ్బూ,

బీరువాలనిండా కొత్తపుస్తకాలూ ఉంటే ఇహ నేమీ అక్కర్లేదు పొమ్మన్నారు. ఒకచోట ఈ మెథడ్ నడుపుతూ, ఒక కుర్రవాడికి ఒకకూడిక లెక్ఖ ఎక్సైన్ మెంటు ఇచ్చారు. ఆఅబ్బాయి లెక్ఖతప్పాడు. మేష్టరు "రూపాయల్లో తప్పావు, మళ్లీ చెయ్యి" అని మళ్లీ అదే ఇచ్చాడు. ఆ అబ్బాయి మళ్లీ తప్పాడు. మేష్టరు "అణాలలోతప్పావు,మళ్లీ చెయ్యి"అని మళ్లీ అదే ఇచ్చాడు. ఆ అబ్బాయి మూడోమాటు మళ్లీ తప్పాడు. మేష్టరు "పైసలు తప్పు, మళ్లీ చెయ్యి" అన్నాడు. కుర్రాడు "ఎంత తప్పండీ" అని అడిగాడు. ఆయన 6 పైసలు తక్కువొచ్చిందని చెప్పాడు. చెపితే "ఆ ఆరుపైసలూ నేను తమకి దాఖలు చేస్తాను, ఈలెక్ఖ మాత్రం నావల్ల కాదండీ" అన్నాట్ట ఆ అబ్బాయి. ఇందులో కుర్రాణ్ణి పెద్దలు నమ్మాలి. అతడు నమ్మించి ఎగెయ్యొచ్చు. మేష్టరూ తనకి పనిలేదని బైటాయించవచ్చు. దాని తరవాత 'ప్రోజెక్టు' దొర బయలుదేరాడు. ఆ పేరుకే నవాలతుగ్రంథం ఉంది. కుర్రాణ్ణి మారుమూల లోంచి సంఘంలోకీ, జీవితంలోకీ ఈడవ మంటారు వీరు. జీవితంలో సమస్య ఓటి కుర్రాడు తలపెట్టుగుని, దాని మూలస్థానమైన అశంగు కెళ్లిపోయి, ఆసమస్య నిర్వహిం చెయ్యడానికి కావలసిన శాస్త్రభాగాలు నేర్చేసుగుని సొంతంగా పనిచెయ్య మంటాడు. అనగా ఇది 'తత్సంబంధం' మెథడ్, లేక 'సాండుఫోర్డు అండ్ మర్టన్' మెథడ్. వీరూ గొప్పవాళ్లని పెట్టి కుర్రాడికి మళ్లీ చెప్పించమంటారు డాల్టన్కి-మళ్లీనే. ఇది పెద్దవాళ్లకయితే పర్వా లేదు గాని, కుర్రాళ్లు దారీ తెన్నూ లేకుండా మహారణ్యంలో పడిపోతారేమో అని కొందరి బెంగ. ఇందులో స్త్రీవిద్య అంటే గృహకృత్యం నేర్చుకోడమేట. అందుకని ఈదేశపు స్త్రీలకి ప్రస్తుతం ఇది రుచించదు. ఆపైని, 'గేరీ' దొరగారు తమ యథాశక్తి చందా పారేశారు—అదే గేరీ కంట్రిబ్యూషన్. పిల్లల్ని వదలద్దు. పని—ఆట—చదువు అన్నీ స్కూల్లోనే కావాలి. మంచి పౌరుల్ని తయారుచెయ్యాలి. తల్లి తండ్రుల్ని వచ్చి పిల్లలతో కలిసి అప్పుడప్పుడు ఆ స్కూల్లోనే బస చెయ్య మన్నాడు. కాని మన దేశంలో తండ్రి తమరి అబ్బాయి ఫేలయినప్పుడు గాని స్కూలు కాంపౌండు తొక్కడు. తల్లి తన పిల్లాడికి బూతులు రావని వాదిస్తుంది గాని, అవి తమవాడు ఎంతపరిశుభ్రంగా వాడతాడో ఎరగదు, వినదు. వీరికి 'గేరీ' చెప్పింది నచ్చకపోవచ్చు. తరవాత 'ఆటా, పాటా, తమాషా' మెథడ్, అనగా 'ప్లే, వే' మెథడ్. అందులో భాగమే 'స్కౌటింగ్' అన్నారు. నాటకాలుకూడా ఆడమంటారు వీరు. మన దేశంలో అన్నిందాలా పాడైపోయినవాడుగాని నాటకంలో వేషం కూడదని అభిప్రాయమాయిరి! అందుకని, ఇది మనకి నచ్చకపోవచ్చు!

ఇందాకట్నించీ అనుకున్నవి, ఐశ్వర్యంలో తులతూగుతూ, చల్లగా ఉండి, స్వంత రాజరికం ఉండి, మావాళ్లు విద్యావంతులై ప్రపం

చం ఏలాలి అనే దేశాల్లో మెథడ్లమాటలు కాని, మన దేశం!—మన దేశంలో విద్యా పోషణ అనేటప్పటికి,—చెయ్యి, కాలు, నాలిక అన్నీ వెనక్కి లాగేస్తాయి (ఒక్కనాడి తప్ప). అల్లా దరిద్రం వెళ్లబోసుగుంటూండి, వేడిప్రదేశమై ఉండి, విద్యానాథు లెవరో తేలకుండా, నానాజాతులూ, నానావర్ణాలూ, నానా భేదాలూగల నానా సాహేబులు నలఖైయేసి (పైవారి ఒప్పుదలమీద యాభైయేసి) మంది అజ్ఞానులు ఉన్న తరగతులు—ఒకటవ, రెండవ, మూడవ, నాల్గవ సంవత్సరం ఆ తరగతే ఎందుకురా ఇదీ అని ఉసూరున ఈడుస్తూండే పిల్లలుగల తరగతులు—మార్కులపెంట, పరీక్షలగోడవ, ప్యాసుల ఆదుర్దా, గుమాస్తాగిరీ పరమావధీగల తరగతులు—చొక్కాలు విప్పితే ఎముకలపోగులుగా ఉండి, ఆత్మికవిద్య లేక, సౌశీల్యం ఏర్పడడానికి నోచుగోక, గంట కిద్దరు మేష్టర్లని చూసేపిల్లలుగల తరగతులు—స్వభాషకి దూరాన్నిపడి అన్యభాష అందుకోడానికి అర్హత లేనిపిల్లలు గల తరగతులు— ఉంటూన్న ఈదేశంలో ఏ మెథడ్ పెట్టి చెబితే బోధన జరుగుతుందో తెలుసుగోడం మాటలు కాదు. డబ్బు చిమ్మి, తెలివిగలవాణ్ణి పెట్టి, తెలివిగలవాడికి చెప్పమంటే "ఆదర్శం ఎక్కడ కుదురుతుంది? ఉన్నదాల్లోనే ఏదో కాస్త నెత్తిమీద చమురెట్టి అయింది అనిపించాలి, ఏం జేస్తాం?" అంటారు కొందరు. ఈ దేశం మేష్టరు అందుచేత, అన్నీ కలిపేసి మహాధప్పళంమెథడ్ అవలంబించాలి. నవీనమైన మెథడ్లు ఎరుగుండడం మంచిది. అవి 'బియిడీ' పరీక్షలో పనికొస్తాయి. ఇంత సైకాలజీ, ఇన్ని మెథడ్‌లూ ఉంటేనేగాని అర్థం తెలియని ఆన్సర్లు పరీక్షలో రాయడానికి వీలుండదు. అది ఒకటి. రెండోది, మీరు ముందుముందు ఇన్‌స్పెక్టరుగా వెడితే ఆ చెప్పేవిషయం మీకు తెలియకపోయినా మెథడ్ నీ, మేష్టర్ని విమర్శించి పారెయ్యొచ్చు. ప్రతిమెథడ్‌లోనూ మంచి ఉంటుంది. అది ప్రతివాడూ పుచ్చుగుని, డబ్బు ఖర్చు లేనంతమట్టుకి ఆచరిస్తేసరి మన దేశంలో, ఏ మెథడైతేం? క్రియ ముక్క కుర్రాడికి తెలియడం ప్రధానంట. అల్లాయితే మొట్టమొదటికొచ్చాం. ఏముక్కతో చాలా పూర్వులు బయలుదేరారో ఆముక్కదగ్గిరికే మనం తిరిగి తిరిగి వస్తున్నాం. సెలవ్.

మాధవా!

శ్రీ. తి. వ. నారాయణస్వామిగారు


తలపయి బర్హి బర్హ మఱుతన్ వనమాలయుఁ గన్నుదోయిఁ గ
జ్జల మలికంబునం బన లెసంగెడు కస్తురి యొప్పఁ జిన్ని చే
తుల నవనీతముం గొనుచుఁ దోడియనుంగులఁ గూడి గొల్లగీ
ములఁ దిరుగాడు నీచెలువమున్ గృపఁ జూపఁగ రమ్ము మాధవా !

లలితవిశాలశాద్వలతలంబులఁ బచ్చిక మేయ నాల వి
చ్చలవిడిఁ దోలి ప్రాంతవిలసచ్ఛిలపై వసియించి యంగుళీ
వలయిత వేణుదండమున వర్ణ్యసుగానలతా ప్రపంచమున్
వెలయఁగఁ జేయు నీరుచిరవేషముఁ జూపఁగ రమ్ము మాధవా!

చెలువగు పొన్నగున్నపయిఁ జిక్కఁగఁ బ్రాఁకిన మల్లెతీవ న
య్యెలగ నమర్చి దానిపయి హేల వసించుచు మోమునందు న
వ్వొలయఁగ నూఁగు నిన్నుఁ దనివోని ముదంబునఁ గాంచు వేత లో
జలజదళాక్ష! యేతపము సల్పిరొ తొల్లి యెఱుంగ మాధవా!

తరుణులు వేడ్కఁ దావక కథాసుధ నానుచు మించు వేడ్కతో
నరమర వీడి యుండఁగ గుణాఢ్యుఁడ! నవ్వుచు వెన్కనుండియే
కరమున నొక్కసుందరికిఁ గన్నులు మూసి యొకర్తు ముద్దు గొం
చరిగి హాసించునీదు వికచాననపద్మముఁ జూపు మాధవా.

శయవిలసత్కశాచలనచాతురి క్రొమ్మెఱుఁ గై వెలుంగఁగా
హయఖురపాతనిర్గతమహాధ్వనిగర్జల నీనుచుండఁగా
లయజలదభ్రమంబున నలందుర నిన్, గని కౌరవుల్ ధనం
జయరథచోదకత్వమున సాఁకవె! పాండవులన్ రమాధవా!




ప్రపంచమునందలి వింతలలో నొకటి

ఇది ఇటలీలోని పిటవాలుగ నున్న 'పిసా' గోపురము. దీని నిపుడు తిన్నగా చేయ యోచు చున్నారు.



ము. త్రిత్వవైఖరి

భార్య:—అయితే తా మిపు డెక్కడను న్నారు? హౌస్ ఆఫ్ కామన్సులోనా?



౮. కర్ణ ఘటోత్కచ యుద్ధము.



పల్లవులు

డాక్టరు యన్. వెంకటరమణయ్య గారు, యం.ఏ., పి. హెచ్.డి.

౧

క్రీ. శ. 3వ శతాబ్ది మొదలు 9వ శతాబ్దము వఱకు కృష్ణాకావేరుల మధ్యదేశమున పల్లవ వంశపురాజులు రాజ్యము చేసిరి. పల్లవులయుత్పత్తిని గురించి పరిశోధక పండితులు అనేకులు అనేకాభిప్రాయముల నిచ్చియున్నారు. కొందఱు భరతఖండమునకు వలసలు వచ్చిన పాశ్చాత్యు లనిరి; కొందఱు అరవ లనిరి; మఱికొందఱు సింహళదేశవాస్తవ్యు లనిరి. ఇట్లు పలువురు పలువిధములుగ బలికిరి. ఈయభిప్రాయముల నన్నిటిని చక్కగ జర్చించి, వారు పారసీకమునుండి వచ్చినవారైనను చిరకాలము ఆంధ్రదేశమున నివసించి ఆంధ్రులవేషభాషలను, మతాచారములను అవలంబించి, వారితో సంబంధబాంధవ్యములను గల్పించుకొని యాంధ్రులైన యొకతెగవారని ఇంతకుపూర్వము 'జయంతి'యందు వ్రాసియున్నాను. వీరు మొదట ఆంధ్రరాజులభృత్యులై యుండి, ఆంధ్రసామ్రాజ్య మస్తంగత మైనపిమ్మట, నాసామ్రాజ్యములోని దక్షిణభాగమున కంతటికిని ప్రభువు లైరి. ఇక్క పల్లవులకు రాజ్య మెట్లు వచ్చినదో విచారించవలసియున్నది.

పల్లవవంశమున చారిత్రపురుషుడుగ బ్రథమమున బరిగణింపదగినవాడు వీరకూర్చమహారాజు. ఇట్టిరాజుండెననుటకు సాక్ష్యము దర్శిశాసనము.1 ఇతనిపూర్వీకులు రాజులు గారు: సామంతులు, సేనాపతులునయి యుండిన యుండవచ్చును. వారితో మనకు పని లేదు. ఈవీరకూర్చునికి రాజ్యమువచ్చిన తెఱగు వేలూర్పాళెయపుతామ్రశాసన2మున నిట్లు వర్ణింపబడియున్నది:

"తత్సునాతా దజని చూతపల్లవా
ద్వీరకూర్చ ఇతి విశ్రుతాహ్వయః;
యః ఫణీన్ద్రసుతయా సహా గ్రహీ
ద్రాజచిహ్న మఖిలం యశోధనః".

వీరకూర్చమహారాజు ఫణీన్ద్రసుతతోగూడ రాజచిహ్నము లన్నిటిని గ్రహించెనని శ్లోకార్థము. ఫణీన్ద్రకన్య యన్న నేమని యర్థముచేసుకొనవలయును? నాగుబాముపిల్ల యనియా? కాదు. పూర్వ మీదక్షిణదేశమున నాగవంశజులగు రాజులు రాజ్యమేలిరి. నాగవంశపు రాజులలో నొక్కనికూతు నుద్వాహము చేసికొని తన్మూలమున రాజ్యమును వీరకూర్చరాజు వడసెను.

ఈనాగరా జెవ్వరు? నాగులకు దక్షిణాపథమునం దధికార మెట్లు వచ్చెను? అనుప్రశ్నలకు సమాధానము చెప్పవలసియున్నది. నాలుగవ పులుమావియను నతడు ఆంధ్రరాజులలో కడపటివాడు. ఇతనియనంతర మాంధ్రసామ్రాజ్య మంతరించిపోయెను. తదనంతరము నాగవంశజులగు రాజులు ప్రబలి యాంధ్రరాజ్యమును స్వాధీనపఱచుకొని రాజ్యము సేయదొడగిరి. నాగరాజు లాంధ్రదేశమునకు క్రొత్తగా వచ్చినవారు గారు. చిరకాలమునుండి యాంధ్రదేశమున నివసించుచు నాంధ్రరాజకుటుంబములతో సంబంధబాంధవ్యములను నెరపుచుండిన సామంతరాజులే యని యెఱుగవలయును.

ఇట్టిసామంతరాజకుటుంబములలో ముఖ్యముగ గమనింపదగినవి రెండు: (౧) చూటుకులము; (౨) మహారథివంశము.

(౧) చూటుకులమువారు నాగు లనుటకు మొదటి నిదర్శనము వారికులముపేరు. చూడ మన్న అరవమునందు పడిగె యని డా. కృష్ణస్వామి అయ్యంగారు తమ 'పల్లవులు' అనుగ్రంథమున వ్రాసియున్నారు. రెండవది యీవంశమువారు సర్పములను బూజించుటయు.

1. ఎ. ఇం. సం. ౧.

2. సౌ. ఇం. ఇ. సం ౮.

శాతవాహనవంశ మంతరించినపిమ్మట వారిరాజ్య
ముందు చాల భాగము చూటుకుల నాగులకు కైవసమాయెను.
ఇట్లని శాసనములవల్ల దెలిసికొనుచున్నాము.

మైసూరుసంస్థానమునకు జేరిన షికారపుర తాలూ
కాలోని మాళవల్లి గ్రామమున నొకశిలాస్తంభము గలదు.
దానిపై పురాతనములగు శాసనములు రెండు చెక్కబడి
యున్నవి. అందొక్కటి "హారీతిపుత్ర-విణ్హుకడ్డ-చుటుసా
తకంణి"యను రాజుయొక్క ద్వితీయరాజ్యవర్షమునందు
చెక్కింపబడినది. ఈతడు 'వైజయంతీ(బనవాసీ)పురరా
జా'యని వర్ణింపబడియున్నాడు. ఇతనిదే మఱొకశాసన
ము బనవాసియందు గాన్పించుచున్నది. ఇందు రాజుపేరు
హారీతిపుత-విణ్హుకడ - చుటుకులానంద' యని చెప్పబడి
యున్నది. ఈదానశాసనమును చెక్కించినది మహారాజున
ను, మహాభోజకిని కుమార్తె యగు 'నాగములనిక' యను
నామె. ఆమె తనకుమారుడగు శివఖంద నాగసిరి యను
వానితోగూడి యీశాసనమును వేయించినది. ఈశివ
ఖంద నాగశిరియు కాన్హేరిశాసనమున జెప్పబడిన ఖంద
నాగశాతకుడును నొక్కడే. ఈతనితండ్రి యొకమహారథి.
ఈశాసనములను మథింపగా దేలినవిషయ మేమనగా,
ఆంధ్రరాజ్యము క్షీణించినపిమ్మట కుంతలమును, అప
రాన్తమును చూటుకులనాగులకు స్వాధీన మాయెను.

హారీతీపుత్ర-విష్ణుకడ-చుటు శాతకర్ణి
భార్య మహాభోజి-పేరి కిరువురకును కూతురు
|
నాగమూలనిక
మహారథుని వివాహము జేసుకొనెను
|
స్కందనాగ శాతక లేక
శివస్కందనాగశ్రీ

శివస్కందనాగశ్రీయొక్క తండ్రి మహారథియని
ట చెప్పబడియున్నది. అతనిపేరు మనకు దెలియదు.
యిన, వాడె దెవ్వటివాడు? చిత్రదుర్గము (Chital-
droog in Mysore) నకు సమీపమున నున్న చంద్రా
ళీ పు ర ము ను రా జ ధా ని గ జేసుకొని తత్స
మీపభూముల నేలుచుండిన నాగవంశజుడు. విష్ణుకడ-
చుటు-శాతకర్ణి తనకుమార్తెను నాగనికను మహారథున
కిచ్చి యుద్వాహము చేసెను. కాబట్టి చంద్రావళీపురా
ధీశునకును, వైజయంతీశునికూతురగు నాగమూలనికకును
బుట్టినవాడు శివస్కందనాగుడు. ఇతనితండ్రి తుంగ
భద్రకు దక్షిణమున నున్న రాజ్యమున కంతటికిని నధిపతి.
మాతామహుడగు విష్ణుకడ-చుటు-శాతకర్ణునకు పురుష
సంతతి లేకపోవుటచేతనేమో, యాతనిరాజ్యమునకు
దౌహిత్రుడగు శివస్కందనాగుడే ప్రభు వాయెను. కావున
స్వరాజ్యారంభకాలమున నాతడు కృష్ణాకావేరులమధ్య
రాష్ట్రములకును, కుంతలాపరాంతములకును ప్రభు వా
యెను. ఈశివస్కందనాగుడే ఆంధ్రరాజులలోని కడపటి
వాడగు పులుమావికి మహాసేనానిగా నుండెనని మ్యాక
దోనిశాసనము చెప్పుచున్నది. పులుమావియనంతరము
శివస్కందనాగుడు స్వతంత్రుడై పైదేశముల కన్నిటికిని
నధిపతి యాయెను. ఈతడే పల్లవవంశస్థాపకుడగు వీర
కూర్చునికి గూతు నిచ్చి వివాహము చేసిన నాగరాజు.
ఈతని పేరే పల్లవాన్వయమునకు బరోభాగము నలంక
రించిన శివస్కందవర్మకు బెట్టబడెను. ఇట్లాంధ్ర
రాజ్యలక్ష్మి సాతవాహనవంశమును విడి, చుటు, మహా
రథులకడ గొంతకాలము వసించి, తుదకు పల్లవాన్వయము
నాశ్రయించెను.

౨

ఈప్రకరణమున పల్లవవంశక్రమమును రచింపవల
యును. ఇందుకు సాధనము లెవ్వి? పల్లవరాజుల
శాసనములు.

(౧) వీనియందు వర్ణితమగు వంశచరిత మొక్క
తీరుగను లేదు. పురాతనములగు శాసనములయం దొక్కొ
క్క దానియందును రెండుమూడుతరముల రాజుల పేళ్లే
కానవచ్చుచున్నవి. అర్వాచీనములగు శాసనములవలె
వంశసంబంధమగు పురాణగాథ లేవియు గానరావు.
ఉదా. పల్లవరాజులు భారద్వాజులనియు,పరమబ్రహ్మ
ణ్యులనియు ప్రాతశాసనములయం దున్నది. తరువాతి
శాసనములందువలె బ్రహ్మ, అంగిరస, భరద్వాజ, ద్రోణా
శ్వత్థామలగుండ వంశావతరణము వర్ణింపబడియుండలేదు.

కాలముగడచుకొలది పల్లవరాజులు స్వవంశచరిత్రను మఱచిరి. తమపూర్వీకుల పేళ్లుసైతము వారికి జ్ఞప్తి లేక పోయెను. కావున వారు తమశాసనములలో వంశచరిత్ర మును వర్ణించునపుడు ఎట్లు తోచిన నట్లు వ్రాయించిరి. అందుచే, ఈశాసనములలోని పురాతనపల్లవవంశ వర్ణనలన్నియు విశ్వసనీయములు గావు. కావున చక్కగ పరిశీలించికాని వానిలోని విషయములను గ్రహింపరాదు. ఇక వంశవృక్షరచన కనుకూలములగు శాసనములపట్టిక నొకదానిని బొందుపఱచెదను.—

౧. మయిదవోలు తామ్రపట్టిక:— (ఎపి. ఇండి కా. వా. ౬ పు. ౮౪) ఇది యువమహారాజు శివస్కన్దవర్మ వ్రాయించి యిచ్చిన దానశాసనము.)

౨. హీరహడగల్లి తామ్రపట్టిక:—(ఎ. ఇం. ౧, పుటలు ౨—౧౦. ఇది అగ్నిష్టోమవాజపేయాశ్వమేధయాజియు, భారద్వాజుడును, పల్లవధర్మ మహారాజును నగు శివస్కన్దవర్మ వ్రాయించి యిచ్చిన దానశాసనము.)

౩. చారుదేవియొక్క గుంటూరుమండల తామ్ర పట్టిక:—దీనినే బ్రిటిషు మ్యూజియము తామ్రపట్టిక యందురు. (ఎ. ఇం. సం. ౮, పు. ౧౪౩. ఇది శివస్కన్ద మహారాజు కోడలును, యువమహారాజు విజయబుద్ధవర్మ ధర్మపత్నియును, బుద్ధ్యంకురుడను రాజకుమారుని తల్లియును నగు చారుదేవి వ్రాయించి యిచ్చిన తామ్ర పట్టిక.)

ఈ పైమూడు పట్టికలును ప్రాకృతమునందు వ్రాయబడియున్నవి. సంస్కృత శాసనములకంటె ప్రాకృతశాసనములు పురాతనము లైనవని పరిశోధక విద్వాంసుల సిద్ధాంతము. కావున పల్లవశాసనము దీపైమూడును బహుప్రాచీనములని నిర్ధారణ చేయబడియున్నవి.

౪. దర్శి తామ్రపట్టిక:— (ఎ. ఇం. సం. ౧, పు. ౩౯౭. ఇది వీరకూర్చవర్మ మహారాజుయొక్క ప్రపౌత్రునిచే వ్రాయించి యివ్వబడినది. తామ్రపట్టిక లోని మొదటిరేకు మాత్రమే లభ్య మగుటచేత, వీరకూర్చవర్మకు వెనుక వచ్చువారలనామములు దెలియవు.)

౫. ఓంగోడు తామ్రపట్టిక:—౧. (ఎ. ఇం. సం. ౧౫, పు. ౨౪౬. ఇది కుమారవిష్ణుని ప్రపౌత్రుడును, స్కన్దవర్మ పౌత్రుడును, వీరవర్మ పుత్రుడును నగు విజయస్కన్దవర్మ వ్రాయించి యిచ్చిన తామ్ర పట్టిక.)

౬. ఓంగోడు తామ్రపట్టిక:— ౨. (ఎ. ఇం. సం. ౧౫. ఇది వీరవర్మ ప్రపౌత్రుడును, స్కన్దవర్మ పౌత్రుడును, విష్ణుగోపుని పుత్రుడును నగుసింహవర్మ వ్రాయించి యిచ్చిన పట్టిక.)

౭. ఉరువపల్లి తామ్రపట్టిక:— (ఇం. అంటి క్వేరీ, సం. ౫, పుటలు. ౫౦—౫౩. ఇది స్కన్దవర్మ ప్రపౌత్రుడును, వీరవర్మ పౌత్రుడును, స్కన్దవర్మ పుత్రుడును నగు యువమహారాజు విష్ణుగోపవర్మ వ్రాయించి యిచ్చిన పట్టిక.)

౮. పీకిర తామ్రపట్టిక:— (ఎ. ఇం. సం. ౮, పుట. ౧౫౯. ఇది వీరవర్మ ప్రపౌత్రుడును, స్కన్దవర్మ పౌత్రుడును, యువమహారాజు విష్ణుగోపవర్మ పుత్రుడును నగు మహారాజు సింహవర్మ వ్రాయించి యిచ్చిన పట్టిక.)

౯. మంగళూరుపట్టిక:— (ఇం. అం. సం. ౫, పు. ౧౫౫. ఇది వీరవర్మ ప్రపౌత్రుడును, స్కన్దవర్మ పౌత్రుడును, యువరాజ విష్ణుగోపుని పుత్రుడును నగు మహారాజ సింహవర్మ వ్రాయించి యిచ్చిన పట్టిక.)

౧౦. చూరతామ్రపట్టిక:— (మదరాసు శాసన పరిశోధకసంఘపు వార్షిక కార్యనివేదన పత్రిక, ౧౯౧౩—౧౪, భా. ౨, సెం ౧, రు. ఇది స్కన్దవర్మ ప్రపౌత్రుడును, మహారాజు విష్ణుగోపవర్మ పౌత్రుడును, సింహవర్మ పుత్రుడును నగు విష్ణుగోపవర్మ వ్రాయించి యిచ్చిన పట్టిక.)

౧౧. చెన్దలూరుతామ్రపట్టిక:—(ఎ. ఇం. సం. ౮, పు. ౨౩౩. ఇది స్కన్దవర్మ ప్రపౌత్రుడును, కుమారవిష్ణుని పౌత్రుడును, బుద్ధవర్మ పుత్రుడును నగు కుమారవిష్ణువు వ్రాయించి యిచ్చినపట్టిక.)

౧౨. ఉదయేన్దిరముపట్టిక:—(ఎ. ఇం. సం ౩, పు. ౧౪౨. ఇది స్కన్దవర్మ ప్రపౌత్రుడును, సింహ వర్మపౌత్రుడును, స్కన్దవర్మకుమారుడును నగునంది వర్మ వ్రాయించియిచ్చిన పట్టిక.)

౧౩. అమరావతిశిలాస్తంభ శాసనము:— (సౌ· ఇం. ఇ. సం. ౧. ఇందు పల్లవరాజులవంశవృక్ష మొక్కటి వర్ణింపబడియున్నది. అందలిరాజులకును కంచిపల్లవుల కును గలసంబంధ మిట్టిది యని నిర్ధారణ చేయుటకు వీలు లేకున్నది.)

౧౪. వాయలూరుశిలాస్తంభశాసనము:—(దు బ్రొ యిలుగారి 'పల్లవులు'– ఇందు పల్లవరాజులజాబితా యొక్కటి కలదు. అయిన నొకరాజునకును మఱియొక్క రాజునకును సంబంధ మెట్టిది యైనదియు వర్ణింపబడలేదు. శాసన నిదర్శనములు లేనిపే ర్లనేక మున్నవి.) ఇది యొ కటి పరమేశ్వరవర్మ నాటిది.

౧౫. వేలూర్పాళెపు తామ్రపట్టిక: — (సౌ.ఇం. ఇ. సం. ౨, భా. ౫. ఇది మూడవనన్దివర్మ వ్రాయించి యిచ్చిన తామ్రపట్టిక. ఇందుగూడ పల్లవవంశవృక్ష మభివర్ణితము. ఇది వాయలూరుశాసనమునకంటె విశ్వాస నీయమని పండితులయభిప్రాయము.)

ప్రాచీన పల్లవరాజ చరిత్రరచనమున కాధారభూత ములైన శాసనములివియే. వీనియం దన్నిటియందును నీరా జులవంశావళి కొంచెముగనో గొప్పగనో వర్ణింపబడి యున్నది. ౧౩, ౧౪, ౧౫ లలో దప్ప తక్కినవాని యందు దాతయొక్కముత్తాత, తాత, తండ్రులుమాత్రమే పేర్కొనబడియున్నారు. అనగా వీటిలో బ్రతిదాని యందును ఏనాలుగుతరములరాజులైనను పేర్కొనబడి యున్నారు. ఈదానశాసనముల నిచ్చినదాతలకు వారి తాతముత్తాతలపేర్లు తప్పక తెలిసియుండును. అందుచే వీనియందు వర్ణింపబడినవంశావళి వి శ్వ స నీ య మ ని యంగీకరింపబడినది. ౧౩, ౧౪, ౧౫ అట్టివి కావు. అమరావతిశాసనములోని పేర్లకును, ౧—౧౨ లోని పేర్లకును ఏలాటిసంబంధమును గా న్పిం ప దు. వాయ లూరుశాసనమున ౩౬ తరములరాజుల పేర్లు కలవు. ఒకరి కొకరి కున్న సంబంధము తెలియరాదు. వచ్చిన పేరు మరల వచ్చుటయేకాక, మూడునాల్గుపేర్లు కలసి గుచ్ఛములుగ మరలిమరలి వచ్చుచుండును. శాసనమును వ్రాసినవారికి రాజుల పేర్లును, వారు రాజ్యము చేసిన కాలక్రమమును తెలియక లేకపోవుటచేత వారి యిచ్చవచ్చిన ట్లెల్ల వ్రాసిరి; పేర్లను గల్పించిరి. కావున, చరిత్రరచనయం దీశాసన ముపై నాధారపడవలసినపుడు, జాగ్రత్తగ పరిశీలించి చూడవలయును; లేకున్న ప్రమాదము సంభవించును. వేలూర్పాళెపుశాసనమున ౧౯ రాజులపేర్లు గలవు. అందు కొంతిమట్టుకును వారి కున్న సంబంధము చెప్పబడి యున్నది. ౧—౧౨ శాసనములలోని పేర్ల వరుస కది వ్యతిరేకింపదు. కావున నది విశ్వసనీయమని నాయభి ప్రాయము. ఇక వంశవృక్షరచన కారంభించెదను.

ప్రాకృతశాసనములు సంస్కృతశాసనములకంటె ప్రాచీనమైనవని శాసనపరిశోధక పండితులసిద్ధాంతమని యింతకు ముందె చెప్పియున్నాముగదా; అందుచేత, ప్రా కృతశాసనములలో పేర్కొనబడిన రాజులు సంస్కృత శాసనములలో పేర్కొనబడిన వారికంటె పూర్వము రాజ్యమేలినవా రనుట నిస్సంశయము. ప్రాకృతపల్లవ శాసనములు మూడు: మయిదవోలు, హీరహడగల్లి, గుంటూరు మండలశాసనములు. ఇందు మిక్కిలి పురాతన మైనది మయిదవోలుశాసనము. దీనియందు పేర్కొన బడినవాడు పల్లవవంశజుడు, భారద్వాజస గోత్రుడు, యువమహారాజు, శివస్కందవర్మ. హీరహడగల్లి శాసనమున పేర్కొనబడినవాడు కాఞ్చీపురాధిపుడు, ధర్మమహా రాజాధిరాజు, పల్లవకులోద్భవుడు, భారద్వాజసగోత్ర జుడు, శివస్కన్దవర్మ. ఈశాసనమునందు మహారాజు బప్పస్వామి పూర్వము చేసిన దానమును తాను పునరుద్ధా రణము చేయుచున్నానని శివస్కన్దవర్మ చెప్పుకొనుట చేత, తత్పూర్వము పల్లవరాజ్యము నేలినరాజులలో బప్పమహారా జొకడని తేలుచున్నది. ఈబప్పమహా రాజు శివస్కన్దవర్మ తండ్రియని చరిత్రకారులయభి ప్రాయము. అట్లైన హీరహడగల్లి శాసనమున పల్లవ రాజులు రెండుతరములవారు పేర్కొనబడియున్నారు.

బప్పమహారాజు
|
శివస్కన్దవర్మ

చారుదేవి గుంటూరుశాసనమున జెప్పబడినవారు ముగ్గురు: మహారాజు విజయస్కన్దవర్మ, భారద్వాజుడు, పల్లవులయువమహారాజు విజయబుద్ధవర్మ. ఇతనికుమారుని పేరు 'కుర'యనుపదముతో ముగియును. దీనిని హూల్ట్షుదొరగారు 'బుద్ధ్యాఙ్కుర' యని పూరించిరి. కావున ఈశాసనములలోని పల్లవులు—

విజయస్కన్దవర్మ
|
యు. మ. విజయ బుద్ధవర్మ
[బుద్ధ్యఙ్] కుర

ప్రాకృతశాసనములలోని రాజులకు గలసంబంధ మెట్టిది? ఈశాసనముల కన్నిటికిని ఒక పేరు సామాన్యము. అన్నిటియందును స్కన్దవర్మ పేర్కొనబడియున్నాడు. ఈతని పేరు మయిదవోలుశాసనములలో శివస్కన్దవర్మ యని యున్నను, చారుమహాదేవిశాసనమున విజయస్కన్దవర్మ యని యున్నది. 'శివ' 'విజయ'శబ్దములు శుభసూచకములగు నుపసర్గలుగ నుపయోగింపబడినవి. అర్థభేదము విశేషము లేదు. కావున శివస్కన్దవర్మయు, విజయస్కన్ద వర్మయు, నొక్కని పేళ్లే. ఇట్లే కదంబరాజులు 'శివ' 'విజయ' శబ్దములను నుపసర్గలుగ తమనామములకు ముందు జేర్చుకొనియున్నారు. ఉ. శివమాంధాతృవర్మ శివమృగేశవర్మ, శివకృష్ణవర్మ ఇత్యాదులు. ఒకకదంబరాజు తన పేరున కుముందు 'శివవిజయ'పదములను రెంటిని జేర్చుకొని యున్నాడు.(ఎపి.కర్ణా.సం. ౭, పు. ౭.) కావున విజయస్కందవర్మయు, శివస్కందవర్మయు నొక్కరే యనుటకు శంకింప బనిలేదు. అట్లు పైరెండుపేర్లొక్కరివే యను సిద్ధాంత మేర్పడినపిమ్మట నీక్రింది ప్రాచీన పల్లవవంశవృక్షమును రింపవచ్చును.—

బప్పమహారాజు
|
శివస్కన్దవర్మ
|
బుద్ధవర్మ
|
[బుద్ధ్యఙ్] కుర

అయిన నీబప్పమహారా జెవ్వరు? 'బప్ప'యను మాట నామధేయము కాదు. 'అప్ప'యనుమాటయే ప్రాకృతమున బప్ప యైనదేమో! ఇతర నామధేయ మేమి? వేలూర్పాళెపుశాసన మీసందర్భమున కొంచెము తోడ్పడుచున్నది.

"తత్సునా దజని చూతపల్లవా
ద్వీరకూర్చ ఇతి విశ్రుతాహ్వయః,
యః ఫణీన్ద్రసుతయా సహాగ్రహీ
ద్రాజచిహ్న మఖిలంయశోధనః."

పైశ్లోకములోని చూతపల్లవుడు చుటు, పల్లవవంశములసంయోగమును సూచించు కల్పితపురుషుడుగాని యన్యుడుగాడు. ఆరెండువంశముల సంయోగానంతరము బుట్టినవాడు వీరకూర్చుడు. ఇతడు నాగకన్యాకరము యొక్కను, అఖిలరాజచిహ్నములయొక్కయు గ్రహణమును నేకకాలమందు జేసెను. ఈదంపతులకు బుట్టిన పుత్రుడే స్కన్దవర్మ. ఇతనికి స్కాన్దశిష్య డను పేరు నైతము గలదు.

"అన్వవాయనభశ్చన్ద్రః
స్కాన్దశిష్య స్తతో భవ."

ఈస్కాన్దశిష్యునిగూర్చి రాయకోటశాసనమున నిట్లు చెప్పబడియున్నది:—

"అశ్వత్థామాశ్యతస్తు భగవతు ఖలు పురా
విక్రమస్యాకృతారి
జ్ఞాతో ద్విజిహ్వాంగనిపుత్రాహ్వా హ్యాతి
జగతాం స్కన్దశిష్యాధిరాజ."[1] యత

1. ఇ. ఎ. ఇం. సం. ౫, పుట ౬౯.

ఈ పైశ్లోక మెట్టెదుస్థితియందున్నను తాత్పర్యము విశదముగ దెలియుచున్నది. అశ్వత్థామకు ద్విజిహ్వాంగనవల్ల యనగా నాగకన్యకవలన స్కన్దశిష్యుడు పుట్టెను. ఇచ్చట నాగకన్యతోడి తగులాట మశ్వత్థామకే యంటగట్టబడినది. రాయకోటశాసనకర్త క్రీ. శ. ౯, ౧౦ శతాబ్దములయందున్నవాడు. కాన నతడు నాగకన్యామూలమున తన పూర్వికులకు రాజ్యము లభించెనన్న గాథమాత్రమె తెలియును. వీరాజు నానాగకన్య వరించుటచే రాజ్యలబ్ధి యైనదియు నెఱుగడు. వీతత్కారణమున నాతడు నాగకన్యను పల్లవవంశమునకెల్ల మూలపురుషుడను ప్రథగలిగిన యశ్వత్థామకే యిచ్చి పెండ్లిచేసెను. ఏది యెట్లున్నను పల్లవులు నాగకన్యా మూలమున రాజ్యలాభమును బొందుట నిజము. అశ్వత్థామ పురాణములలోనివ్యక్తి. అతని యునికికి కవిప్రతిభయే కారణము. అట్టివానివల్ల దక్షిణదేశమున ౧౦ శతాబ్దములవఱకును రాజ్యమొనర్చిన పల్లవవంశ ముత్పన్నమైనదనుట యసంభవము. వీరకూర్చుడను రాజుండెననుటకు శాసననిదర్శనము గలదు. వాయలూరుశాసనమున[1] నీపేరు గలరాజుల నిర్వరను పేర్కొనుచున్నది. ఈశాసన మంత విశ్వసనీయము గాదని యింతకు పూర్వమే వచించియున్నారు. దర్శిశాసనదాత తన ముత్తాత వీరకూర్చవర్మయని చెప్పుకొనియున్నాడు కావున వీరకూర్చుడు చరిత్రపురుషుడు. ప్రాచీనపల్లవరాజులు కొందఱు వీనిని తమవంశమునకు మూలపురుషుడుగ వర్ణించియున్నారు. నాగకన్యకాపతి యితడనుటయే సమంజసము. పైపరిశోధనవల్ల దేలినవిషయ మేమన:—

బప్పమహారాజు లేక వీరకూర్చుడు
(నాగరాజుకుమార్తె నుద్వాహము చేసుకొని
తన్మూలమున రాజ్యమును బడసినవాడు)
|
శివ లేక విజయస్కన్దవర్మ
(ఇతనికే స్కన్దశిష్యు డను పేరు గలదు)
|
విజయబుద్ధవర్మ (చారుదేవిభర్త)
|
[బుద్ధ్యం] కురుడు.

ఇక సంస్కృతశాసనములలోని వంశములనుగూర్చి చర్చ నల్పుదము. ప్రథమమున పైపట్టియందలి ౫—౧౦ శాసనములను గూర్చి విచారింతము. ఇవి యేవనగా, ఓంగోడుశాసనములు ౧, ౨, ఉరువపల్లి, పీకిర, మంగళూరు, చూరశాసనములు. వీనియందలి రాజుల

వంశ క్రమము:—

ఓంగోడు (౧)	ఓంగోడు (౨)
కుమారవిష్ణు	వీరవర్మ
స్కన్దవర్మ	స్కన్దవర్మ
వీరవర్మ	విష్ణుగోప
విజయస్కన్దవర్మ	సింహవర్మ

ఈపై రెండుశాసనములలోని రాజు లొక్కవంశము వారనుట పై వంశవృక్షములవల్ల విదిత మగుచున్నది. ఇందు ఆరుతరములరాజులు పేర్కొనబడియున్నారు.

ఉరువపల్లి	మంగళూరు
స్కన్దవర్మ	వీరవర్మ
వీరవర్మ	స్కన్దవర్మ
స్కన్దవర్మ	యు. మ. విష్ణుగోప
యు. మ. విష్ణుగోప	సింహవర్మ

పీకిర	చూర
వీరవర్మ	స్కన్దవర్మ
స్కన్దవర్మ	మహారాజవిష్ణుగోప
యువమహారాజు విష్ణుగోపవర్మ	సింహవర్మ
సింహవర్మ	విష్ణుగోప

1. దుబ్రాయిలు : పల్లవులు.

ఈ పై నాలుగు శాసనములలోని రాజవంశము ఓంగోడు శాసనములలోని రాజవంశము నొక్కటియే యగుట స్పష్టము. కావున నీవంశవృక్షపుతునుకలను సంకలితము జేసిన, నీక్రిందివంశ మేర్పడును.—

కుమారవిష్ణు
|
స్కన్దవర్మ
|
వీరవర్మ
|
స్కన్దవర్మ
|
యువమహారాజ విష్ణుగోపవర్మ
|
సింహవర్మ
|
విష్ణుగోప

ఇట్లు పైయారుశాసనములవల్లను ౭ పురుషాంతరములుగల వంశవృక్ష మేర్పడినది. ఇంకను నిం దొకటిరెండువిషయములు గమనింపదగినవి గలవు. ఉరువపల్లి, మంగళూరు, పీకిరశాసనములలోని విష్ణుగోపుడు యువమహారాజనియే పిలువబడియున్నాడు. ఏతత్కారణమున కొందరీతడు తనతండ్రికాలముననే మృతిజెందెనని తలచిరి. ఇది పొరబాటు. ఉరువపల్లి శాసనదాతయగు యు. మ. విష్ణుగోపుడు ఆ దానశాసనమును (సింహవర్మయను రాజుయొక్క యేకాదశవర్షమున: సింహవర్మ మహారాజస్య విజయసంవత్సరే ఏకాదశే) ఇచ్చినట్లు చెప్పియున్నాడు. కావున హూల్ ట్షుగారన్నట్లు ఈసింహవర్మ విష్ణుగోపుని జ్యేష్ఠభ్రాతగ నుండవలయును. వీరితండ్రియగు స్కన్దవర్మకు పిమ్మట నాతని పెద్దకుమారుడు సింహవర్మ రాజాయెను. ఆతడు తనతమ్ముని యౌవరాజ్యాభిషిక్తునిగ జేసి రాజ్యములోని యుత్తరార్ధమున కధిపతిగ జేసెను. అతనిసంతతివారు మహారాజులమని చెప్పుకొన్నను సింహవర్మకు, కంచిరాజ్యము నేలిన యాతనివంశస్థులకులోబడి యేరాజ్యము నేయుచుండిరి. కావున విష్ణుగోపుడు తనతండ్రికి పూర్వమే మృతినందె నని కాని, తత్కారణమున నాతడు శాసనములయందు యువమహారాజని పిలువబడె నని కాని యనుకొనవలసినయవసరము లేదు. కావున నీవంశవృక్ష మిట్లుండవలెను:—

కుమారవిష్ణువు
|
స్కన్దవర్మ
|
వీరవర్మ
|
స్కన్దవర్మ
|
సింహవర్మ — యు. మ. విష్ణుగోప
|
సింహవర్మ
|
విష్ణుగోప

పైపట్టికలోని (౧౨) ఉదయేన్దిరపుశాసనమున నీక్రిందివంశము వర్ణింపబడియున్నది —

స్కన్దవర్మ
|
సింహవర్మ
|
స్కన్దవర్మ
|
నన్దివర్మ

ఈరాజులు పైవంశవృక్షములోని స్కన్దవర్మ యొక్క జ్యేష్ఠపుత్రుడగు సింహవర్మవంశజులుగ నుండవలయును. కావున నీవంశవృక్ష మి ట్లుండవలయును:—

కుమారవిష్ణువు

స్కన్దవర్మ

వీరవర్మ

స్కన్దవర్మ

సింహవర్మ — యు. మ. విష్ణుగోప

స్కన్దవర్మ — సింహవర్మ

నన్దివర్మ — విష్ణుగోప

ఇక (౧౧) చెన్దలూరుశాసనమునందు వర్ణింపబడిన రాజులవిషయము విచారింతము. వీరు—

స్కన్దవర్మ

౧. కుమారవిష్ణువు

బుద్ధవర్మ

౨. కుమారవిష్ణువు

చెన్దలూరు(౧౧)శాసనమందు చేర్కొనబడినరాజులెప్పుడు రాజ్యముచేసిరి? అనువిషయము ప్రథమమున విచారణీయము. హూల్ట్షుగారిట్లనుచున్నారు:—"చెన్దలూరుశాసనపులిపి... పీకిర, మంగళూరు, ఉరువపల్లి దానపత్రములలోని లిపిని పోలియున్నది. అక్షరముల తలకట్లపై యడ్డగీట్లు చెన్దలూరుశాసనమున లేకపోవుటయే దానికిని ఇతరశాసనములకు గల భేదము. మఱియు దీనియందు 'ర', 'క', 'య' (కొమ్ము)ను సమమైనరెండు నిలువుగీట్లై యున్నవి; ఈయక్షరములను తెలియజేయు నిలువుగీట్లు పీకిర, మంగళూరు, ఉరువపల్లి శాసనములలో మిక్కిలి కురుచలుగ నున్నవి. ఈవిషయము చెన్దలూరుశాసనముపై యర్వాచీనముద్ర నిడుచున్నది. కావున చెన్దలూరుశాసనమున చేర్కొనబడిన పల్లవరాజులు సింహవర్మ, సింహవిష్ణువులమధ్యకాలమున ప్రభుత్వము సల్పియుండవలయును."[1]

కేవల మక్షరములస్వరూపమునుబట్టి దానశాసనములను, నందు చేర్కొనబడినవారికాలమును నిర్ణయించుటకు గొంతవఱకును సాధ్యమే. స్థూలముగ నక్షరముల స్వరూపమునుబట్టి శాసనముల ప్రాచీనార్వాచీనత్వములను నిర్ణయింపవచ్చును. అట్లుగాక అక్షరస్వరూపమును బట్టి యీశాసన మిప్పటిదని నిశ్చయించి చెప్ప వీలుగాదు. హూల్ట్షుగారు పై జేసిన సిద్ధాంతముపై దుబ్రాయ లీట్లు వ్యాఖ్యానమును జేసియున్నాడు:—

"పీకిర, మంగళూరు, ఉరువపల్లి శాసనములలోని 'ర' 'క'ల కంటె చెన్దలూరుశాసనములలోని యాయక్షరములు స్వరూపము చక్కగ నేర్పడినవనియు, తత్కారణమున నది యర్వాచీన మైనదనియు లిపిశాస్త్రదృష్టితో నీశాసనములలోని యక్షరములను బరిశీలించి చూచిన హూల్ట్షుగారనియున్నారుగదా. నేను స్వయముగ నీనాలుగుశాసనములలోని యక్షరములను బరీక్షించినప్పుడు, (చెన్దలూరుశాసనమున) 'ర' 'క'ల స్వరూపము గొంచెము జక్కగ నేర్పడియున్నను, వానికి బదులు 'మ', 'య'ల స్వరూపము చక్కగ నేర్పడక యున్నది. అక్షరముల నొక్కొకదానితో బోల్చి చెప్పగలిగిన దంతయు చెన్దలూరుశాసనము దక్కినయూటితోడను సమకాలీనమనియే.

"అయితే, అక్షరముల నొండొంటితో బోల్చుటకు బదులు, లిపులయొక్క సామాన్యస్వరూపములను బోల్చి చూచితినేని, చెన్దలూరుశాసనపులిపి, ప్రాచీనశాసనములందువలె, వంకరటింకరగ నున్నది. ఉరువపల్లి, మంగళూరు, పీకిరశాసనములం దన్ననో, అర్వాచీన శాసనములందువలె, లిపి చక్కగ కుదిరియున్నది. అయినప్పటికిని సామాన్యముగ నక్షరములపోలిక యథార్థస్థితిని తెలుపగలదని నేను నమ్మను. శాసనములను వ్రాయువారు దేశకాలపరిస్థితుల ననుసరించి శాసనాక్షరములు భేదించు

1. ఎ. ఇం. స. ౮ పు. ౨౩౩.

విషయము పల్లవశాసనములవల్ల నే కాక, గాంగ, కాదంబ శాసనములవల్లను బుజువగుచున్నది. ఒక్కొకపు డొక రాజు కాలమునందలి శాసనములే యొకదాని నొకటి పోలియుండవు. కడపటిమాట: కాఞ్చీపురమున నొసగ బడిన చెన్దలూరుశాసనమును పలక్కడయం దిచ్చిన యురువపల్లి శాసనముతోడను, దశనపుర, మేన్మాతురల నుండి యిచ్చిన మంగళూరు, పీకిరశాసనములతోడను బోల్చవలసినయవసరము లేదని నాయభిప్రాయము. పలక్కడ, దశనపుర, మేన్మాతుర లనుపట్టణములు గుంటూరు సీమలోనివై యుండవచ్చును. అనగా నవి కాఞ్చీపురమునకు బహుదూరమున నుండినవి. కావున, దేశభేదమే (పైశాసనములందలి) యక్షరభేదమునకు గారణమని విశదమగుచున్నది."[1]

ఇట్లు, చెన్దలూరుశాసనము ఉరువపల్లి, పీకిర, మంగళూరుశాసనములకాలమప్పటిదో, లేక తత్పూర్వపు కాలముదో యనునభిప్రాయము దుర్బాయలుగా రిచ్చియున్నారు. ఇదియే సరియైన యభిప్రాయమని నాతలపు.

చెన్దలూరు శాసనములోని రాజులు సింహవర్మ సింహవిష్ణువుల మధ్యకాలమున రాజ్యము చేసియుండురని హూల్ట్షు అభిప్రాయపడియున్నాడు. ఇది సాధ్యము కాదు. ఏలనగా, ఉదయేన్దిర శాసనమున జేర్కొనబడిన రాజులు సింహవర్మ వెనుక కంచియందు రాజ్యము చేసినట్లు తెలియవచ్చుచున్నది. "లిపిస్వభావమునుబట్టి చూడగా నీ (ఉదయేన్దిరపు) శాసనము ఉరువపల్లి శాసనముకంటె దరువాతిదని యభిప్రాయపడుచున్నాను"[2] అని కీల్హారను చెప్పుచున్నాడు. కావున చెన్దలూరుశాసనములో జేర్కొన్న, రాజులు సింహవర్మకు వెనుక గంచియందు రాజ్యము జేసిరనుట కవకాశము లేదు. వారు సింహవర్మకు బూర్వమే చే యుండవలయును.

ఇట్లు చెన్దలూరు శాసనపురాజులకాలమును స్థూలముగ నిర్ణయించితిమి. ఈశాసనమున నిద్దరు కుమారవిష్ణువులు జేర్కొనబడియున్నారు. వీరిద్దరిలో ఒంగోడు (౧) పట్టికయందు వర్ణింపబడిన కుమారవిష్ణు వెవ్వడు? ప్రథముడా, ద్వితీయుడా? ఒంగోడు (౧) శాసనమందలి వంశావళి యిది:—

కుమారవిష్ణువు
|
స్కన్దవర్మ
|
వీరవర్మ
|
విజయ స్కన్దవర్మ

ఈశాసనము విజయస్కన్దవర్మ నాటిది. ఇతడు ఉరువపల్లి శాసనదాతయగు యు. మ. విష్ణుగోపుని యొక్క తండ్రి. ఒంగోడు(౧) శాసనములోని "యక్షరములు ఉరువపల్లి, మంగళూరు, పీకిరశాసనాక్షరముల వంటివి" అని కృష్ణశాస్త్రిలగారనుచున్నారు పితాపుత్రుల శాసనముల కంతటి బంధుత్వ ముండుట వింత గాదుగదా! చెన్దలూరుశాసనపు టక్షరములు సైతము ఉరువపల్ల్యాది శాసనముల యక్షరములవంటివని పండితుల యభిప్రాయముగదా! కావున చెన్దలూరు శాసనములోని రెండవకుమారవిష్ణువు ఒంగోడు (౧) శాసనపు విజయస్కన్దవర్మతో నించుమించుగ సమకాలీనుడుగ నుండవలయును. అట్లయిన చెన్దలూరుశాసనపు ౨వ కుమారవిష్ణువును, ఒంగోడు శాసనపు కుమారవిష్ణువును భిన్నపురుషులు. ఒంగోడు (౧) శాసనపు విజయస్కన్దవర్మయు, చెన్దలూరుశాసనపు ౨వ కుమార విష్ణువును ఇంచుమించు సమకాలికులైన, ఒంగోడు (౧) శాసనపు కుమారవిష్ణువు చెన్దలూరుశాసనపు కుమారవిష్ణునకు మూడు నాలుగుతరముల ముందటివాడగును. చెన్దలూరుశాసనము ప్రకారము ౨వ కుమారవిష్ణుని తాతపేరుకూడ కుమారవిష్ణువే కదా! వేలూర్పాళెయపు శాసనమున రాజులవరుస యిట్లు గలదు:—

స్కన్దశిష్య
|
కుమారవిష్ణు
|
బుద్ధవర్మ

1. ప్రా. ద. న. పుట ౬౬-౭.

2. ఎ. ఇం. సం. 3, పు. ౧౪౩.

కావున పల్లవ వంశవృక్షస్వరూప మిట్లీదిగ నుండ వలయును.

- వీరకూర్చ
  - స్కన్దవర్మ (౧) * (స్కన్దశిష్యుడు)
    - కుమారవిష్ణువు (౧) *
      - బుద్ధవర్మ *
        - కుమారవిష్ణువు (౨) *
      - స్కన్దవర్మ
        - వీరవర్మ
          - స్కన్దవర్మ
            - సింహవర్మ *
              - స్కన్దవర్మ (౨) *
                - నన్దివర్మ (౧) *
            - యు. మ. విష్ణుగోప
              - సింహవర్మ
                - విష్ణుగోప

ఇక ప్రాకృతశాసనపు రాజులకును, వీరికిని ఎట్టిసంబంధము గలదో విచారింతము. వీరు:

- బప్పదేవ=వీరకూర్చ
  - స్కన్దశిష్య=స్కన్దవర్మ
    - యు. మ. బుద్ధవర్మ

వీరకూర్చ మహారాజుకు ముందే యనుటకు ప్రబలనిదర్శనము దర్శి తామ్రపట్టిక. దీని భాష సంస్కృతము ఇది వీరకూర్చుని మునిమనుమని కాలము నాటిది. అక్షరములు గడు ప్రాచీనములు. దర్శి తామ్రపట్టికను ఉరువపల్లి హిరహడగల్లి శాసనములతో బోల్చిచూచితిని. అక్షరములు ఉరువపల్లి శాసనాక్షరములకంటె ప్రాచీనములుగను, హిరహడగల్లి శాసనాక్షరములకు దరువాతివిగను గన్పట్టుచున్నవి. దర్శి శాసనదాత ఉరువపల్లి, హీరహడగల్లి శాసనముల మధ్యకాలమున నుండెననుటకు సంశయము లేదు. ఉరువపల్లి శాసనదాతయగు యు. మ. విష్ణుగోపుని తాత వీరవర్మయని యొకరాజున్నాడు. అతడే యీవీరకూర్చరాజని కృష్ణశాస్త్రిగారివాదము. శాసనపరిశోధకులయ్యు వీర లిట్టిపొరబాటునకు లోనగుట చిత్రము. దర్శి శాసనము ఉరువపల్లికంటె ముందటిదని లిపియే సాక్ష్య మిచ్చుచున్నది. కృష్ణశాస్త్రిగారు 'వాయలూరుశాసనమున వీరవర్మపే రొక్కమారు గాన్పించుచున్నది. కావున వీరకూర్చుడే వీరవర్మ'[1] యని తమవాదము నుద్ధరింపజూచిరి. శాస్త్రిగారు కేవ్యక్తిలో జూచిరో కాని, సదరుశాసనమున వీరవర్మ నామమునకు బైన రెండుపర్యాయములు వచ్చు వీరకూర్చ నామము వారికంట బడకపోయెను. వాయలూరుశాసనమున (౫,౧౧) రెండుపర్యాయములును వీరకూర్చ నామము స్కందవర్మ, కుమారవిష్ణునామములకు ముందే వచ్చియున్నది. వేలూర్పాళె యపుశాసనమునను నట్లే యున్నది. దర్శిశాసనపులిపి చెన్దలూరుశాసనపులిపికంటె ప్రాచీనముగ గన్పడుచుండుటచే తచ్ఛాసనదాత రెండవకుమారవిష్ణువునకు పూర్వమున్నవాడనుట స్పష్టము. కావున నాతనిముత్తాతయగు వీరకూర్చవర్మ హీరహడగల్లి శాసనదాతయగు మొదటిస్కందవర్మయొక్క జనకుడేకాని యన్యుడు గాడు. డుబ్రొయిలుగారు లేకారణముచేతనో వీరకూర్చునిపై కత్తికైరి. పల్లవవంశవృక్షమున లేనిపేళ్లను గల్పించిరి. బప్ప, స్కన్దవర్మ, యు. మ. బుద్ధవర్మ, బుద్ధ్యాంకురులకు బిమ్మట విష్ణుగోపు నొక్కని సృజించి, తదనంతర మొక స్కన్దవర్మను వానికంటగట్టి, వానికి పల్లవవంశవృక్షము నతికించిరి. ఇట్లు డుబ్రొయిలు పల్లవవంశమును బహూకరించుట కొకకారణముగన్పడుచున్నది. క్రీ. శ. నాల్గవ శతాబ్దిమధ్య కాలమున దక్షిణదేశముపై దండెత్తివచ్చిన గుప్తరాజు సముద్రగుప్తుడు కాంచీశ్వరుడగు విష్ణుగోపుని నోడించెనని హరిసేనుడు అలహాబాదుశిలాస్తంభశాసనమున జెప్పియున్నాడు. ప్రాచీనశాసనముల నన్నిటిని గాలించి చూచినను విష్ణుగోపనామపల్లవరాజైదవశతాబ్దమధ్య

* కంచిరాజులు.

1. ఎ. ఇం. సం. ౧౫ పు. ౨౫౬.

మునందొక్కడను గాన్పింపడు. కావున విశ్వాసార్హ మగు వాయలూరుశాసనము నాధారపఱచుకొని ప్రాకృతశాసనరాజులకు వెనుక నొకవిష్ణుగోపునికి రాజ్యాభిషేక మొనర్చెను.

సముద్రగుప్తుని దక్షిణదండయాత్ర క్రీ. శ. 350-60 లమధ్య జరిగియుండునని స్మిత్తుగారనిరి.[1] హరిసేనుడు సముద్రగుప్తునియుత్తరదిగ్విజయమునకుముందు దక్షిణదిగ్విజయమును వర్ణించియుండుటనుకారణముగా గొని దక్షిణదిగ్విజయము క్రీ.శ. 335ననో, 340ననో నడచియుండునని దుబ్రాయిలుగా రనుచున్నారు.[2] తనయిరుగుపొరుగు దేశముల నుండు శత్రువుల నణచియుంచి ముందు దూరదేశములపై నేరాజునకు దండయాత్రవెడలుట సంభవింపదు. ఉత్తరాపథమునందలి శత్రువులను లోబఱచుకొనక దక్షిణదిగ్విజయమునకై సముద్రగుప్తుడు బయలుదేరె ననుట నాకు నమ్మకము కలిగింపలేదు. కావున స్మిత్తుగారియభిప్రాయమే సరియైనదని నాకు తట్టుచున్నది. సముద్రగుప్తునిదండయాత్ర యెప్పుడు నడచియుండినను ఆకాలమున విష్ణుగోపుడనుపల్లవరాజొక డుండియుండవలయును. అట్టిరా జెవ్వడైన నున్నాడేమో కనుగొందము. ఉరువపల్లి శాసనదాతయగు విష్ణుగోపుని యన్నయగు సింహవర్మ క్రీ. శ. 436 మొదలు 460 వఱకును రాజ్యము చేసినట్లు ఫ్లీటుగారు నిర్ధారణచేసియున్నారు.[3] విష్ణుగోపుడుగూడ నప్పటివాడనుట నిస్సంశయము. ప్రాకృతశాసనములందుగాని, సంస్కృతపుశాసనములయందుగాని చేర్కొనబడిన విష్ణుగోపనామముగలవారలలో ప్రథముడితడే. ఇంతకుముందా పేరుగలరా జెవ్వడును లేడు. ఉరువపల్లి శాసనపు విష్ణుగోపుడే సముద్రగుప్తుని ప్రతిపక్షి కాజాలడు. ఏలనగా, వారి కించుమించుగ నొకశతాబ్దమెడ మున్నది. కావున నురువపల్లి విష్ణుగోపున కొకశతాబ్దముపూర్వ మొకవిష్ణుగోపు డుండియుండవలయును.

అనగా నాతడు క్రీ. శ. 350 ప్రాంతమున రాజ్యము సేయుచుండి యుండవలయును. సింహవర్మకు ముందు కంచియం దైదుగురు పల్లవరాజులు రాజ్యముచేసిరి. తరమునకు ౨౫ సంవత్సరములు విడిచిన, ౧౧౧ సంవత్సరములలో నాలుగుతరములగును. సింహవర్మకు నాలుగుతరములముందున్న వాడు మొదటిస్కందవర్మ. ఈతనికాలమున సముద్రగుప్తునిదండయాత్ర నడచియుండవలయును. లేక యీతని మరణానంతరమేని నడచియుండవలయును. అలహాబాదుశాసనపు విష్ణుగోపుడు స్కందవర్మ జ్యేష్ఠపుత్రుడై యాతని తరువాత రాజ్యమునకు వచ్చియుండవలయును. సంతానహీనుడుగనో, కయ్యముననో పసితనముననే మడియుటచేత నాతని పేరు సంస్కృతప్రాకృతశాసనములయందు గానరాకపోయెను.

టి. జి. శంకరయ్యరు మొదటిస్కందవర్మపుత్రుడగు యు. మ. విజయబుద్ధవర్మయు, చెందలూరుశాసనములోని బుద్ధవర్మయు నొక్కడే యనిరి.[4] చెందలూరి శాసనపు బుద్ధవర్మ తండ్రిపేరు కుమారవిష్ణు డనుటచేత వీ రేకపురుషులనువాదము సాగదు; కావున మొదటిస్కందవర్మకు ముగ్గురుపుత్రు లుండిరని యొప్పుకొని తీరవలయును. ఇంతటితో పల్లవవంశావళింగూర్చిన తర్కమును చాలింతము.

ఈక్రింది వంశవృక్షమునందలి రాజులకాలము స్థూలముగ నిర్ధారణసేయబడినది. సింహవర్మకాల మొక్కటియే నిశ్చయముగ దెలిసినది. తక్కినరాజులకాలములు పురుషాంతరమునకు ౨౫ సంవత్సరములు తగ్గించుటవల్లను, హెచ్చించుటవల్లను తేలినవి. కావున భావిపరిశోధనవలన వాస్తవస్థితి బయల్పడవలయును.

1. ఎర్లీ హిస్టరీ ఆఫ్ ఇండియా.
2. ప్రా. ద. చ. పుట ౬౯.
3. జ. రా. ఏ. సొ. ౧౯౧౫, పు. ౪౭౬.
4. ఇం. హి. క్వా సం. ౬.

వంశవృక్షము

- వీరకూర్చవర్మ లేక బప్పమహారాజు (౨౮౫–౩౧౦)
  - శివస్కందవర్మ ౧. (స్కందశిష్యుడు) (౩౧౦–౩౩౫)
    - విష్ణుగోపుడు (సముద్రగుప్తుని శత్రువు) (౩౩౫–౩౬౦)
    - కుమారవిష్ణువు ౧. (౩౬౦–౩౭౫)
      - బుద్ధవర్మ (౩౭౫–౪౧౦)
        - కుమారవిష్ణువు ౨. (౪౧౦–౪౩౫)
      - స్కందవర్మ
        - వీరవర్మ
          - స్కందవర్మ
            - సింహవర్మ (౪౩౫–౪౬౦)
              - స్కందవర్మ ౨. (౪౬౦–౪౭౫)
                - నందివర్మ (౪౭౫–౫౧౦)
            - యు. మ. విష్ణుగోప
              - సింహవర్మ
                - విజయవిష్ణుగోపవర్మ
    - యు. మ. విజయబుద్ధవర్మ (చారుదేవిభర్త)
      - [బుద్ధ్యం]కుర

కుమారుఁడు

పండిత పురాణం సూర్యనారాయణ తీర్థులు గారు

శ్రీ మాత మణిద్వీప
స్వామినియు ననంతకోటిబ్రహ్మాండములన్
ప్రాముఖ్యముఁ గన్నది మా
కామేశ్వరి నిన్నుఁ బ్రోవఁ గలదు కుమారా.

జ్ఞానప్రదుఁ డగు గురువును
ధ్యానింపుము ముందు భక్తితాత్పర్యములన్
పై నొకపరి చదువులదొర
సానికి వందనము చేసి చదువు కుమారా.

గురుఁడె విధి గురుఁడె విష్ణువు
గురుఁడే శంకరుఁడు మఱియు గురుఁడే చెప్పన్
పరఁగుఁ బరబ్రహ్మముగా
గురునిన్ నిందించువాఁడు కూళ కుమారా.

గురువున కెదిరింపకు నీ
దొరనున్ నిందింపఁబోకు దుష్టులతోడం
బరిచయము చేయఁ బోకుము
దురితముప్రాప్తించి చెడెదు తుదకుఁగుమారా.

చదివించినగురువునకున్
పదిరెట్లధికుండు కన్నవాఁ డాయనకుం
బదిరెట్లు తల్లి హెచ్చని
మది నెంచుచు భక్తి గలిగి మనుము కుమారా.

జననిని జన్మస్థాన
మ్మును గొప్పగఁ జూడనట్టి మూర్ఖుల కెందున్
ఘనత కలుగఁబో దారెం
టిని దప్పక కొల్చుచుండు నీవు కుమారా.

తలిదండ్రులు నీకోసము
పలుబాములు పడిర యింతవానిఁగఁ జేయన్
తలపోయుము మన్న! నీ వే
వలనన్ తదృణమును దీర్పవలెనో కుమారా.

చెప్పినచొప్పున నడువని
తప్పక తద్దినమునాఁడు తనుపని గయలో
నొప్పుగఁ బిండము వేయని
యప్పాపిని బుధులు పుత్త్రుఁ డనరు కుమారా.

తమ కిహపరముల కయ్యెడు
తమకొమరుఁడు వ్యర్థుఁ డయినఁ దలిదండ్రులచి
త్తములకుఁ గలిగెడునా ఖే
ద మిట్టి దని తెలుప నెవరితరము కుమారా.

తలిదండ్రులు సన్మిత్రుం
డిల నరులకు సహజ మయినహితు లనియును అ
న్యులు వారి కార్యకారణ [మారా.
ములచే హితు లనియుఁ దెలియుము మదిఁగు

సోమరితనమును మించిన
ఆమయ మిం కొకటి లేద యందురు దానిన్
నీమదిని జేర నిచ్చిన
సేమమునకు నదియ హాని చేయుఁ గుమారా.

నాలుగు గంటలు కొట్టిన
కాలమ్మున లెమ్ము మొగము కడిగికొనుము నీ
వాలోఁ జదివినపాఠము
లాలోడన చేయు బుద్ధి నంటుఁ గుమారా.

ప్రాతఃకాలమ్మున నే
శీతలజలమందుఁ గొంతసేపు మునిఁగినన్
చేతమునకు దేహమునకుఁ
బ్రీతియు నారోగ్యమును లభించుఁ గుమారా.

తల పండినంత వృద్ధని
తలఁపకు మెవ్వాఁడు బాల్యదశనుండియు వి
ద్యలు నేర్చుచుండు నతనిన
తలఁతురు వృద్ధునిఁగ దేవతలును కుమారా.

కలలు గలవాని నందఱుఁ
దలపఱు నిడుకొందు రన్న దానిని ధరలో
వెలయించెను సర్వజ్ఞుఁడ
కలానిధిన్ తల ధరించి కనుమ కుమారా.

చదివింపనిపిత సుతునకుఁ
జదువుకొననిమోఁటకుండు జనకునకు ముదం
బాదవింప రంద్రు కావునఁ
జదువుకొనుమ బుద్ధి గలిగి చాలఁ గుమారా.

దీపము లేని గృహముతో
సాపత్యము సేతు రన్న చదువుకొనని యా
పాపాత్ముని జీవితమును
కోపపడక లెస్స చదువుకొనుము కుమారా.

తన తల్లి బాసఁ గుడిచే
తినిగా సంస్కృతము నెడమదిగ నేలిక బా
సను తలగాఁ జెప్పుదు రిం
దునిచిన భావంబుఁ దెలియు టొప్పుఁ గుమారా.

తీణమయిన వ్యర్థపుచ్చక
కణముల చొప్పున సకలకలలు ధనమ్ముల్
గణియింప నేర్చినట్టి ని
పుణుండ వో! ఎందుసుఖముఁ బొందుఁ గుమారా!

సంగీతము సాహిత్య మెం
ఱుంగనినరు విబుధు లందఱును స్పష్టముగా
శృంగములుఁ దోఁక లేని ప
సింగాఁ జెప్పుదురు వినుమ చెవులఁ గుమారా.

పుడమింపయిని కన్నులు కను
పడనికతనఁ గాఁడు గ్రుడ్డివాఁడు నిజముగా
బుడుతతనమునుండియు నె [రా.
వ్వాఁడు చదువఁడో వాఁడ గ్రుడ్డివాఁడు కుమా

పండితుఁడు తగుధనము లే
కుండియు నాదరముఁ జూప యోగ్యుఁడ విత్త
మ్మున్నయుఁ గృపణుఁడు పరిభూ [రా.
తుండ యగుచునుండుఁ జూమ్మ తుదకుఁ గుమా

బలవంతుఁ డనఁగ బాహా
బలము గల యతండె నాఁగ వలవ దెవఁడు ధీ
బలము గలవాఁడో వానిన
బలవంతుం డంద్రు పెద్దవారు కుమారా.

విద్యాహీనుఁడు పశు వను
విద్యానిధి భర్తృహరిని వేదన వలనన్
తద్యుక్తుఁడ పురుషుం డని
వేద్యం బగుచుండు వినుము వినుము కుమారా.

సిరియును విద్యయు నెవ్వని
వరియించునో వార లెట్టివా రయినను సం
సరణమునఁ బూజ్యులిది సద్
గురువచనము దీనిఁ దెలిసికొనుము కుమారా.

పుస్తకములు పయివారల
హస్తంబులఁ బడినయేని యట్టె పోవుఁ
వాస్తవ మిది కావున నీ
పుస్తకముల నెర వొసంగఁబోకు కుమారా.

కొండెములు చెప్పుటకు నీ-
అండకు నరుదెంచుహితున కగుననుచు చెవి యీ
కుండుటయు. కాక వానిని
చండాలునిఁగాఁ దలంపఁ జనును కుమారా.

పెద్దలయొద్దను వినయము
బుద్ధి గలిగి సరిగ నడువఁ బూనినచో నీ
ముద్దుగఁ జూతురు దానను
పెద్దతనము గలుగు నీకుఁ బిదపఁ గుమారా.

తనతోడివారికంటెను
తనుఁ బెద్దగ నెల్లవారుఁ దలఁచెడునట్టుల్
ఘనతను సంపాదింపఁగ
మనమున నెంచుటయె మంచిమాట కుమారా.

పదుగురిలో నే కార్యము
బెదరక చేయంగ నీకు పీ లగునో అ
ట్టిద చేయఁ బూను దానను [రా.
మది సంతస మందుఁ గుందు మానుఁ గుమా

ధర్మసందేశము

వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వర ప్రసాద బహద్దరు గారు

నీవు నీధర్మంబు నెఱవేర్చుకొనుర
ఏవేళ నూడునో యీశరీరంబు
ఇది సదాకాలంబు నెద నుంచుకొనుర
తుదిదాఁక సత్త్వంబు దొలఁగక మనుర
చేవతో ధర్మ మూర్జితము సేయంగ
పావకుండును జల్లఁ బడును డాయంగ
సర్వేశ్వరునకైన జడువఁగాఁ బోఁడు
ఉర్వి ధర్మముఁ దప్ప కుండెడువాఁడు.
గఱికిపోఁచకు గడగడలాడుఁ జూడు
తఱికి సద్ధర్మంబు దప్పెడువాఁడు.
కలదు ధర్మము దానిఁ గావ నీశ్వరుఁడు
కలఁ డేలరా చింత, కలవర మేల?
ధర్మంబు ధర్మంబు ధర్మంబు రన్న!
ధర్మానుగతి జీవితము పుచ్చ రన్న!
ధర్మానుగతి నీకు ధైర్యం బొసంగు
ధర్మానుగతి పవిత్రత నీ కొసంగు.

‘అహాదనకర’ శాసనము

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు

చాల కాలముక్రితమే కీ. శే. శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణరావుపంతులుగారు ఈశాసనములోని తెలుగుభాగమునకు అర్థము తీయుటకై చాలకృషిచేసి యున్నారు. శాసనలేఖకుడు శాసనమును చాల నశ్రద్ధగ వ్రాసియుండుటవలన, మరల ఈశాసనపుఱేకులను సంపాదించి, వాటినుండియే మూలమును జదివినచో ఫ్లీటుదొరగా రిచ్చిన పాఠముకంటె మంచిపాఠమేర్పడుట కవకాశముండునేమో యని వారలండను బ్రిటిషు మ్యూజియము వారికి ఱేకుల నిమిత్తము వ్రాసిరి; కాని వారు అసలుఱేకులను బంపుటకు వీలు లేదనిచెప్పి, ఒకప్రతి ప్రతిబింబములను ఒకప్రతి శాసనపు ఫొటోలను బంపిరి. నేనును లక్ష్మణరావుగారును ఈప్రతులను ముందుంచుకొని శాసనమునందలి యక్షరస్వరూపమును గురించియు, పదములను గురించియు చర్చించుచుండిననాటిసంగతులు నేడీసందర్భమున దలపునకు వచ్చుచున్నవి. అటుతరువాత నేను రాజమహేంద్రవరమునకు వెళ్లుటతో ఇందునుగురించిన నాకృషి నిలిచిపోయినది. లక్ష్మణరావుగా రింకను దమకృషిని సాగించుచునే యుండిరి. వారీశాసనమున వచ్చు పదములన్నిటిని తీసి, పట్టికలు తయారుచేసి, తెలిసినచో ఆ పదములకే కాని, లేకతత్ప్రాంతిక పదములకు గాని యర్థము తెలుపవలెనని కోరుచు వాటిని కొందఱు ద్రవిడ, కర్ణాట పండితులకు బంపిరి; కాని అందువలన దమకు ఏవిధమైన ప్రయోజనమును కలుగలేదని తరువాత వారి నొకపరి కలిసికొనినప్పుడు నాతో చెప్పినట్లు జ్ఞాపకము. ఏదో యొకవిధమున ఈతెలుగుభాగమున కర్థము తీసి, దానిని వివరించి ఒక ‘నోటు’ ‘ఎపిగ్రాఫియా ఇండికా’ లోను, ఒక ‘నోటు’ ‘ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక’ లోను ప్రకటింపవలెనని ప్రయత్నించుచుండగనే వారు అకాలమరణము వాతబడుట తటస్థించెను.

తిరిగి నేడు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు దీనిని కదిపియున్నారు. కడచిన భారతిసంచికలో వారీశాసనమునందలి తెలుగుభాగమునకు పద, పదార్థ వివరణములను గావించి, ఆంధ్రభాషకు మహోపకారము చేసినందుకు అభినందింప దగియున్నారు. వారు కొన్ని యక్షరములను మార్చియు, మఱికొన్ని యక్షరములను దీసివేసియు, వేరొక కొన్నిచోట్ల లేని యక్షరములను జేర్చియు ఈశాసనపు తెలుగుభాగమున కర్థవివరణము గావించియున్నారు. ఇట్లు దానిని సంస్కరించి కావించిన యీయర్థవివరణము ఎంతవఱకు సరియైనదని చాల సందేహింప వలసియున్నను కొన్నికొన్నిపట్టుల వారు కావించిన శబ్దనిష్పత్తులు భాషావేత్తల సాదరాలోచనమునకు పాత్రములు.

ఈ శాసనమునుగురించి వ్రాయుటలో శ్రీశాస్త్రి గారు రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచికలో నేనిచ్చిన ఈ శాసనమునందలి తెలుగుభాగపు పాఠమును గూర్చి కూడ తలపెట్టియున్నారు. ఆసంచికలో నేనిచ్చినది బర్జెస్‌దొరగారి పాఠము. అప్పటికి నేను రాజమహేంద్రవరమున నుండుటచేతను, నాయొద్ద శాసనప్రతిబింబములు లేకపోవుటచేతను నామతము ప్రకారము ఆ శాసనపాఠము ఎట్లుండదగునో తెలుపుకొనుటకు నాకు అవకాశము లేకపోయినది. అందువలన ఈ శాసనమునందలి తెలుగుభాగమున కిప్పుడు నాపాఠము నిచ్చుచున్నాను.

౧౭. స్వస్త ప్రిథివి పల్లవపట్టనబున ఊరి


౧౮. వారు కరిగల్ల వడవరికి ఊరిస్వామ్యుళ్ ఇచ్చిన స్తితి రేణ్డువాడల పట్టనావురకు

౧౯. అరియు డగు తెజెయు సిద్ధాయుంబు దణ్డు[1]దపపరాధబును సర్వ్వ బాదప

౨౦. రియారువు ఊరు దాయసెసి[2] ఇచ్చి దినికి వక్రంబు శేదు వచ్చినవారు గళరెని ఊరి స్తితి

౨౧. దప్పినవారు దినికి వక్రంబు వచ్చిన గచ్చురు రేణ్డువడల ఎలెవు[3] వరు లెములల[4]

౨౨. సినదియు చన్ను విరిపయినాడు[5] వరు గళ్గిన ఎళెముళ చెసిన సెయుదునను



౨౩. మహానబియుళ్ వరాళ్ కళ్[6] మహానత్థవుళ్ విరావవ మహానబియుళ్ గజ్జబు[సె]

౨౪. జ్జి[7] నడువుళ్ శమస్తభువనశ్రియకనడిరజు బ్రదపెరెయ ఊరిపనిన ప్రసివర

౨౫. వర్మ్యొటి[8] మాహానభిళ్ వర్మ్యొటి మహాభిళ్ పని కొళుచెనెరళ పచ్చిన ప్రసి

౨౬. వర్మ్యొటి మహానభియుళ్ నా[9]క[10]ల కొన్టుకళ్ సవ్వలొకశ్రయ మహానత్థవళ్

౨౭. పెద్దాళ్ నెరవద్యమహానత్థవళ్ పసిణ్డిముద్దు[11] వెటన్దల చరువయ్యా[12] విష్ణువర్ధన మ

౨౮. హానత్థవళ్ పసుత్మెవుల కొన్టుకళ్ అచ్చకుట్టవనియు కొన్టుకళ్ గజంబు[13]సెడ్ల[14]ల

౨౯. నడువుళ్ ప్రిథివి మహానత్థవళ్ వెటన్దళ్ పొనికన్టిఅము కొళనడుపు విష్ణువర్ధన

3౦. మహానత్థవల కొన్టుకలు నిరవద్యప్రిథివి కనడిరజుళ్ గునవన మహానవియుళ్

3౧. ముద్దకచ్చికొళ్ రమిస్వరాప్రిథివి మహానత్థవళ అపయుజ[15]నువకాల కొణ్డుకళ్ కొరిద్ది[14]

3౨. కరిగల ప్రిథివి మహానత్థవల కొన్టుకళ్ నన్దిమహావవిల నడుపు శ్రీమహా [కొళ్

33. నత్థవళ సకలొకశ్రయ్య ప్రిథివి మహానత్థవల టి[16]వకరయ్యపశ్చా

3౪. కొళ్ శ్రీజప్తిపెద్దటట్ట గన్టాన్టు

నే నిచ్చిన యీపై పాఠమునకును శ్రీ శాస్త్రిగారు కడచిన భారతిసంచికలో నిచ్చిన పాఠమునకును గొంత భేదముకలదని చదివినవెంటనే బోధపడగలదు. నే నట్టి పాఠము నిచ్చుటకుగల కారణములను సవిశేషముగ ఇచట చేర్కొనుచున్నాను.

1. దణ్డు: ఇచట 'ణ' కలదుకాని 'న' లేదు; 'రెణ్డు'లోని 'ణ'యు, 'దణ్డు'లోని 'ణ'యు ఒక్కరీతి నున్నవి చూడుడు.

2. నుణింత్రమున ఎ, ఏ హ్రస్వదీర్ఘములకు ఈ శాసనమున భేదముపాటింపబడలేదు. చేసి, లేదు అను పదములలోని ఎత్వమునకు దీర్ఘముకలదనుట నిశ్చయమే యైనను నాకు తెలియనిక్రొత్తమాటలలో ఎత్వమునకు దీర్ఘముండవలెనో లేదో తెలియరాకుండుటచేత భాషా జిజ్ఞాసువులు ఎత్వ, ఏత్వములను నిర్ణయించుకొన గల రను తలపున శాసనమునం దెల్లెడల హ్రస్వరూపమునే వాడితిని.

3. ప్రతిబింబమున గాన్పించురీతినిబట్టి చూచిన చో ఈయక్షరము 'వు' కాదగునుకాని 'ము' కాదని నాయభిప్రాయము. 'ము' అను అక్షరము ౧౬, ౨౫ పంక్తులనడుమ 'ప్రముఖాణ' అన్నచోటను, 'స్వాముల్' అన్నచోటను, ఈ 'రెణ్డువాడుల' అన్న పంక్తిలోనే 'లెముల' అన్నచోటను, 'ఎలెముళ్' అన్నచోటను నాలుగుపర్యాయములు వచ్చినది. ఇన్నిటిలోను మకారపు కొమ్ము స్పష్టముగ గాంచనగును; కాని యిచ్చట ఆకొమ్ము కనబడుటలేదు. 'భూతద్దము' నుపయోగించి చూచినను అది 'వు'గనే కనబడెనుగాని 'ము'గ కనబడలేదు. 'ఎలెవు' క్రొత్తపదమగుటచేత దీనిస్వరూపమును అక్షరముల వైఖరినిబట్టియే నిరూపింపవలసి యుండును గనుక ఇంత సూక్ష్మముగ వాటిని పరిశీలింపవలసిన యవసరము కలుగుచున్నది.

4. ఈ యక్షరమును ఉన్నరీతి ననుసరించి చదువవలసి వచ్చినచో 'ల'కారముగ చదువుదునుకాని 'చె'గ చదువను. ఇది 'ల'కారమునకే చేరికగనున్నది. ౧౬, ౨౨ పంక్తులనడుమ 'ఇచ్చిన', 'వచ్చిన', 'గచ్చురు', 'చను', 'చెసిన' అను పదములలోని 'చ' వర్ణమును జూచిన ఇది 'ల'కాదగు ననుకొందును.

5. శాసనము చివరికిపోయినకొలది 'ద' 'డ'లకు భేద మంతగ కానరాదు. ఏది 'డ' యైనదియు, ఏది 'ద' యైనదియు తెలియరాదు.

6. గుణింతమున ఒ, ఓలకు కూడ ఇందు భేదము పాటింపబడలేదు. ఇందువలన శాసనమునం దంతటను హ్రస్వ 'ఒ' కారమునే వ్రాసితిని.

7. ఇది 'థ' వలెనున్నది. ఇదేవిధమైన యక్షరము సంస్కృతభాగమున 'అశ్వమేధావభృథ' అన్నదానిలో వచ్చినది; కాని సాధారణముగ ప్రాచీన శాసనములన్నిటి లోను 'థ' కు పొట్టలో చుక్కయే కాని అడ్డుగీటు ఉండదు. అడ్డుగీటున్న యిట్టియక్షరములును ప్రాచీనాంధ్ర శాసనములలో చాలచోట్ల వచ్చినవి. అట్టియక్షరము శకటరేఫమని నానమ్మకము. దానికి కారణమును ముందు చర్చించెదను. ఈయక్షర వికారూపమునను, ఇందుకు గొంచెము విలక్షణమైన రూపమునను 'కొన్టుక', 'కన్టిఅము', 'గన్టాన్టు' అనుపదములలో గూడ వచ్చును. 'అశ్వమేధావభృథ' లోని 'థ' ఇట్లే యుండుటచేత ఈ తెలుగుభాగమున వచ్చిన యిట్టియక్షరముల నొక్కొక చోట ఫ్లీటు మొదలైవారు 'థ' గనే చదివియున్నారు.

8. ఈయక్షరము టి (ట్టి) యని నాయభిప్రాయము. 'చోటు','ఏటు' మొదలైన పదములలోని 'టు'రూప మిట్టిదే. ఇది 'టి' యునుకాదు, 'తి' యునుకాదు.

9. నేను 'సకల' గ చదివినదానిలోని మొదటి యక్షరమును శ్రీ శాస్త్రిగారు 'మ' గ చదివిరి. ఈశాసనమునవచ్చిన 'మ' ఎట్లున్నదనగా: 'మ' యొక్క అడుగు 'సున్న' భాగము పెద్దదిగ నుండవలెను. సున్నకును తలకట్టునకును మధ్యనుండు నిలువుగీటు చిన్నదిగ నుండవలెను; సున్ననుండి కుడివైపునకు వచ్చినకొమ్ము కొంచెము మెరుగ, పాగారివట్టుగాక చేరికగ కుదించినట్లు ఉండవలెను. ఇందువచ్చిన 'స' వర్ణమునకు సాధారణముగ ఇదియే లక్షణము. శాసనమున వచ్చిన 'మ' వర్ణములన్నియు సాధారణముగ ఇట్లే యున్నవి. ఈలక్షణమున కీయక్ష

రము విరుద్ధముగ నున్నది. కాని ౨౪-వ పంక్తిలోని కట్టకడపటి 'మ' కారమును ఇదియును కొంచె మించుమించుగ ఒక్కరీతి నున్న ట్లగపడుచుండుటవలన దీనిని 'మ' వర్ణముగ జదువవగదా యనవచ్చును; అయితే శాసనమునందలి మరి యేయితర 'మ' వర్ణము నిట్లు లేకపోవుటవలనను, ఈయక్షరమునకు 'స' వర్ణమునకు ఎక్కువపోలిక యుండుటవలనను దీనిని 'స' వర్ణముగనే చదువుట యుక్తమని నాతలంపు. 'పసుశ్మెవుల' లోని 'స' కారముయొక్క ఎడమవైపు దిగువపాక్కలిని తలకట్టుదిగువనున్న నిలువు గీటుతో కలిపిన అది 'సకల' అని నేనుచదివినదానిలోని 'స' వర్ణమునే పోలియుండును.

10. నేను 'క్ర'కారముగ చదివిన యక్షరమును శ్రీశాస్త్రిగారు 'ర' వర్ణముగ జదివిరి. అది 'క్ర' వర్ణమగునుకాని 'ర' వర్ణముకాదని నాతలంపు. ఇందుకు కారణమిది: అక్షరమును నొట్టియున్న తలకట్టుతోమాత్రమేకాక వేరే మరియొకతలకట్టుతో కూడనున్న 'ర'వర్ణము శాసనమున ఒక్కటియైన గానరాదు. "అక్షరముతో నొట్టియుండవలసిన తలకట్టుకు స్థలముచాలక లేఖకుడించుక యెడముగ జెక్కె"నని శ్రీశాస్త్రిగారు వ్రాసియున్నారు. కాని యిచ్చట తలకట్టు శ్రీశాస్త్రిగారు చెప్పినరీతిగాక అక్షరముతోనే నొట్టియున్నది. పాఠకులు బాగుగ పరిశీలింపదగును. 'ర' వర్ణముతో నొట్టియున్నతలకట్టుపై ఒకచిన్న నిలువుగీటువ్రాసి దానికి తలకట్టిచ్చిన 'క్ర' వర్ణమగును. ఈ యక్షరమున 'ర' అక్షరమును నొట్టియుండు తలకట్టును, ఎగువ మరియొకతలకట్టునుగూడ కనబడుచున్నవి. ఇది 'క్ర' వర్ణమునకొన్నచో ఒక్కనిలువుగీటే లోపము. 'శక్త్రియోపేతః' అను పదములోని 'క్ర' వర్ణమునకును, ౨౧-వ పంక్తిలోని 'దినికి వక్రంబు లేదు' అన్నచోటనున్న మొదటి 'క్ర' వర్ణమునకును, ౩౧-వ పంక్తిలోని 'కొరిగ్ర కొల్'లోని రెండవ 'క్ర' వర్ణమునకును నిలువుగీటు కానరాకపోయినను వాటిని 'క్ర' వర్ణములుగనే చదువుచున్నపుడు నేను 'క్ర' వర్ణముగ చదివినదిమాత్రము ఎందుక'క్ర' కారాదు?

11. ఈపదమును శ్రీశాస్త్రిగారు 'ముడ్లు' అని చదివిరి. 'డ' వర్ణము ౧౭-వ పంక్తిలో 'వడివరికి' అన్నచోటను, అదేపంక్తిలో 'వాడల' అన్నచోటను, ౧౯-వ పంక్తిలో 'డను' అన్నచోటను, ౨౧-వ పంక్తిలో 'రెడ్డువడల' అన్నచోటను వచ్చినది; కాని యిందేదియు శాస్త్రిగారు చదివిన 'ముడ్లు' అను పదములోని రెండవ యక్షరమును బోలియుండలేదు. వలసినచో పరిశీలింపదగును. 'ఢ' వర్ణరూపమును ౫, ౬, ౭, ౮, ౧౦, ౧౧, ౧౩, ౧౪, ౧౭, ౧౯ మొదలైన పంక్తులలో గాంచనగును. నేనీపదమును 'ముఢ్లు' అనియే చదువవలెనందును.

12. 'వయ్య'లో 'య్య'కు ఎగువ వలపలిగిలక కలదుచూడుడు. ఇట్టిదే 'విఘ్నవర్ధన'పదమునను గాంచనగును.

13. శ్రీ శాస్త్రిగారు దీనిని 'గజ్ఞ'గ చదివిరి. కాని నేనుచూచినంతవరకు 'జ' వర్ణముక్రింద 'ఞ' లేదు. ఇచట 'జ' తో కలిపి దానిపిదప నొకయక్షరమున్నది. దానికి ఉత్వమున్నది. ఆయుత్వమునే 'జ' తరువాతి యక్షరముయొక్క ఎడమవైపు నిలువుగీటుగ పొనిచ్చినట్లున్నది. అట్లే యగునేని దానిని 'బు'గ చదువదగునని కొంటిని. ఈయక్షరము కుడికొనను చుక్క కనబడుటంజేసి దానిని 'గజంబు' అని చదివితిని.

14. ఇక్కడి 'ఢ' వర్ణముకూడ 'ముఢ్లు' లోని 'ఢ' వర్ణమువంటిదే.

15. ఇది 'జ' వర్ణమగునాయని సందేహము. ఈశాసనమున ఇతరస్థలముల వచ్చిన 'జ' వర్ణము దీనికి కొంచెము భిన్నముగ నున్నది. ఈయక్షరము కుడివైపున నున్న ఎగువగీటును దిగువగీటును కలవనందువలన గాని, లేనిచో దీనిని 'ఛ' గగాని 'అ' గగాని చదివియుందును.

16. ఇది 'డ','ద'లకు భిన్నమైనవర్ణముగ నున్నది. 'ద', 'డ'లకు అక్షరముతోకలిపి తలకట్టును సంధించు చిన్న నిలువుగీటుండును. 'ట'కు అట్టిగీటు కాని, తలకట్టు గాని యుండదు. అందువలన నేను దీనిని 'ట' గా చదివి

తిని. ఒకటిరెండు ప్రాచీనశాసనములలో ఇట్టిపోలిక గల యక్షరము 'డ' వర్ణముగగూడ జదువబడెను.

‘సెఱ్ఱి’ ‘కొన్ఱుక’, ‘కన్ఱిఅము’, ‘గన్ఱాన్ఱు’ అనువానికితప్ప మిగిలిన నాపాఠభేదముల కన్నిటికి కారణములను వివరించియున్నాను. ఈ పదములను శ్రీ శాస్త్రిగారు ‘సెడ్డు’,‘కొన్డుక’,‘కన్డిఅము’,‘గన్డాన్డు’గ చదివియున్నారు. మాయిరువురి పాఠమును గమనించినచో నేను బండి ‘ఱ’ చదివిన లిపిసంకేతమును వారు ‘డ’ గ చదివిరని విదితమగును. ఈలిపిసంకేతము నెట్లు చదువవలెనను విషయమునందే వారికిని, నాకును గొంచెము భేదాభిప్రాయముకలదు.

ఈపైని పేర్కొన్న పదములలోనే కాక ఈయక్షరము క్రీ. శ. పదవ, తొమ్మిదవశతాబ్దులకు పూర్వపు తెలుగుశాసనములలో ‘శత్యాదిత్యున్ఱు’, ‘వేవాన్ఱు’, ‘వక్రంబువచ్చువాన్ఱు’, ‘వీభుచున్ఱి’, ‘అఱ్ఱపట్టు’, విన్ఱినాయకున్ఱు’, ‘మగన్ఱు’-ఈ మొదలైన పదములలోగూడ వచ్చును. రక్తప్రాణములను ధారవోసి, శాసనపరిశోధనలోనే యాయుష్కాలమంతయు గడపి, ప్రాచీనశాసనములను ప్రకటించిన ఫ్లీటుదొరగారు, బర్జెస్‌దొరగారు, హుల్షుదొరగారు, కృష్ణశాస్త్రిగారు, లక్ష్మణరావుగారు, నరసింహాచారిగారు-వీరందరునుగూడఆయక్షరసంకేతమెచ్చుట వచ్చినను దానిని బండి ‘ఱ’గనే చదివియున్నారు. వారిమార్గమునే యవలంబించి నేను ఇంతవఱకు దానిని బండి‘ఱ’గనే భావించి చదువుచున్నాను. శ్రీశాస్త్రిగారు శత్యాదిత్యనాశ మహారాజశాసనములోవచ్చినదని తెలుపు బండి ‘ఱ’ స్వరూపమునకు ఈలిపిసంకేతము భిన్నముగనున్నను దీనిని ఫ్లీటుమొదలైనవారెందువలన బండి ‘ఱ’ గ చదివిరో, వారికట్లు చదువుటకుగల యాధారములేవో నేనెన్నడును విచారించి యుండలేదు; శ్రీ ప్రభాకరశాస్త్రిగారు లక్ష్మీపుర శిలాశాసనమును, ఈ‘యుహాదనకర’ శాసనమును ప్రకటించి, యా లిపిసంకేతమును ‘డ’ గ చదువవలెననువాదమును లేవదీసిన పిదపనే ఇది ‘ఱ’ గ చదువవలెనా? ‘డ’ గ చదువవలెనా యన్నయాలోచనము కలిగి, ప్రత్యేక మీ యక్షరమును గూర్చిన పరిశోధనకు బూనుకొంటిని. ఇంతవఱకు తేలిన తత్ఫలితముల నిట వివరించుచున్నాను.

శ్రీశాస్త్రిగారు

i ఈయక్షరము ఏయే పదములలో వచ్చునో అవియన్నియు ఇప్పుడు ‘డ’కారయుతములుగ నున్నవి గనుకను,

ii ‘డ’కారముతో చదివిననే కొంచెమించుమించుగ అన్నిటికిని అర్థము సరిపోవును గనుకను,

iii “శబ్దనిష్పత్తి శాస్త్రరీతినిబట్టి పరిశీలింపగా ద్రవిడభాషలోగాని- కర్ణాటభాషలోగాని ‘ఆదిత్యున్ఱు, ఉన్ఱి, వాన్ఱు’ మొదలైన రూపములయునికి తెలియుట లేదు” గనుకను

ఆలిపి సంకేతమును బండి‘ఱ’గ గాక ‘డ’ కారముగనే చదువవలె ననుచున్నారు; కాని యిది సరియైనదికాదని నాయభిప్రాయము. ఏలయన పూర్వమునకు, ఇప్పటికి భాషలో చాలమార్పులు కలిగినవి. పూర్వపు పదములు కొన్నిటికి స్వరూపము మారినది.కొన్ని పూర్వపుపదము లిపుడు భాషలో లేకుండనే అంతరించినవి: ఇంతయేల తుదకు పదముల వర్ణక్రమమునంచియు మార్పు కలదు. ఇన్నిటిలో మార్పున్నయపుడు కొన్ని ప్రాచీనపదముల యుచ్చారణమునగూడ మార్పుండిన నుండవచ్చును. ఇది సిద్ధమని చెప్పనుకాని సాధ్యమందును. ఇట్లు తెలుగు పదములలో పరిణామమున మార్పులనేకము సంభవించినవి. అందువలన ఇప్పటి శబ్దస్వరూపమును, అర్థమును బట్టి కాని ప్రాచీనాంధ్రపదముల స్వరూపోచ్చారణములను నిర్ణయించుట సరికాదని నాతలంపు. ఉన్న యక్షరసంకేతములనుబట్టి యేర్పడు పదముల కర్థము నిర్ణయించుట యుక్తముకాని అర్థముకుదురుట కనువగునట్లు లిపిసంకేతమును చదువబూనుట యుక్తముకాదని నాయభిప్రాయము.

“ఈశాసనమును జదివినవారెల్లరు వీని (ఈయక్షర సంకేతముల) నెల్ల ‘ఢ’కారములగా జదివిరి. బండి‘ఱ’గా జదివినను, ‘ఢ’గా జదివినను నిక్కడ అర్థసంగతి దుర్ఘటమే అగును. అట్లు చదువుటచేతనే యీశాసన మెల్లరకును దురవబోధమయ్యె” ననియు, “నే నీశాసనమూలమును జదువుటలో...‘ముడ్లు’, కొన్డుకల్’, ‘గన్డాన్డు’

ఇత్యాదివిధమునే యనుసరించితిని. అర్థము కుదిరెను" అనియు శ్రీశాస్త్రిగారు వ్రాయుచున్నారు. దీనివలన సరించిచూచిన ఆసంకేతమును 'ష'గ చదువుటచేతనే వారికి ఈశాసనము సుబోధమైనట్లు తేలుచున్నది. ఇట్లుచదివినను 'కన్ఱిఱను' అనుపదమునకు అర్థము కాలేదని వారే తెలుపుచున్నారు. అది యటుండ, వారి యీశాసనవ్యాపమును జదివినచో, కేవలము ఈయక్షరసంకేతమును 'ష'గ చదివినందువలనగాక ఇతరసంస్కారములుకూడ జరిపినందువలననే ఈశాసనమునకు వారర్థము కుదుర్పగలిగిరనుట స్పష్టమగును. తాముచేసిన యీ 'సంస్కారములు సందేహగ్రస్తములు' అని వారే యనుచున్నారు. కావున తత్సందేహగ్రస్త సంస్కారఫలితముగ కుదిరిన లిపినిర్ణయమును, అర్థమును సందేహగ్రస్తమే యని తేలుచున్నది.

ఈ యక్షరసంకేతముతో వచ్చు ప్రాచీనపదములుకొన్ని శ్రీశాస్త్రిగారు చెప్పినట్లు 'అడ్లపట్టు', 'వేవాన్డు', సత్యాదిత్యన్డు', మొదలగు రూపములతో నేడు 'డ' కారయుతములుగనే ఉన్నవని నేనును అంగీకరించెదను; అనగా 'వాన్టు' మొదలగుపదములు కాలక్రమమున 'వాన్డు' మొదలగు పదములుగ మారినవని నావిశ్వాసము. ఆంధ్రభాషా పరిణామమునకును, శబ్దశాస్త్రమునకు నీయక్షరనిర్ణయమును, తన్మూలమున కొన్ని ప్రాచీనపదముల యుచ్చారణనిర్ణయమును అత్యంతోపయుక్తమును, అత్యంతావశ్యకమును గనుక ఈ యక్షరస్వరూపమును గురించి యింతగ చర్చింపవలసి వచ్చెను.

ఈయక్షరమును బండి'ఱ'గ చదివినచో ఈపదమున కేమియర్థము చెప్పెదవని నన్నడిగినచో, 'లిపిసంకేత మట్లున్నది గనుక నట్లుచదివితిని. దానినిగురించి చర్చించి పరిణామము నరసి యీపదమున కర్థము తీయు బాధ్యత భాషాశాస్త్రజ్ఞులపైగల' దనియే నాజవాబు. భాషలోనుండి జారిపోయిన ప్రాచీనపదములకు పూర్వమర్థమేదో ఎవ్వరికెఱుక? అర్థమును దెలియదు; పదస్వరూపమును దెలియదు. అందువలన తత్పదార్థ నిర్ణయమునకు మనకాధారము లేకపోయినను, తత్పదాక్షర నిర్ణయమునకు మనకు శాసనములందలి లిపిస్వరూపము ఆధారముకాకపోదు. అందువలన ఈ చర్చలో ప్రధానముగ నావాదమంతయు శాసనలిపిస్వరూపము మీదనే యాధారపడియున్నది కాని అర్థముమీద నాధారపడి యుండునదికాదు.

ఇంకనటుకు నేను ఈలిపిసంకేతమును బండి'ఱ'గ చదువవలెననుటకుగల కారణముల నిటవివరించుచున్నాను.

౧. నేను చూచినంతవఱకు ఈయక్షరము చాల ప్రాచీనశాసనములలో గాన్పించును. ఈయక్షరముగల ప్రాచీనశాసనములలో శకవర్ష సంఖ్యగాని,ఆశాసనములు పుట్టినకాలము తెలిసికొనుటకు మరియే యితరపరిగణన సాధనముకాని లేకపోవుటవలన అవి యెప్పటివో తెలియరాదు.అందుగల లిపిస్వరూపము ననుసరించి చూచినచో అవి క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దికి చాల పూర్వమువై యుండవలెనని యూహింపవచ్చును. ఇట్టి ప్రాచీనశాసనములలో ఈ యక్షరము కర్ణాటాంధ్రాది ద్రావిడభాషాపదములలోనే కాని సంస్కృతపదములలో గానరాదు. అందువలన నేను దీనిని ద్రవిడభాషలకు సంబంధించిన ప్రత్యేకాక్షరముగనే పరిగణించుచున్నాను. సంస్కృతాక్షరామ్నాయమున లేనివియు, కేవల ముఖ్యద్రావిడభాషలకు సంబంధించిన వర్ణమాలికలలోమాత్రమే యున్నవియునగు అక్షరములు ముఖ్యముగ రెండుకలవు: ఴ (ఴ) యొకటి; 'ఱ' (బండిఱ)యొకటి. ఈరెండును సున్నలనుండి యేర్పడిన యక్షరములే. ఴ (ఴ) స్వరూపమును మనమెఱుగుదుము. క్రీ. శ. తొమ్మిదవ, పదవ శతాబ్దులనాటి కది యిప్పటి బండి'ఱ'లోనున్న అడ్డుగీటు తీసివేసిన నెట్లుండునో యట్లుండెను. అయితే దీని ప్రాచీనరూప మది కాదు. వందలకొలది సంవత్సరములు గడచి, పరిణామము పొందినపిదప గలిగిన రూపమది. సున్నచుట్టి దానిమధ్య నొక నిలువుగీటుగీచిన నదియే దాని తొలిరూపము. ఈ రూపమును మనము కడుప్రాచీనశాసనములలో గాంచగలము. ఈయక్షరము నిలువుగీటుమూలమున, కాలక్రమమున, జములుచేసి నిలువుగ నిలబెట్టిన రెండు కోడిగ్రుడ్లమాదిరి నుండు అక్షరముగమారెను: అనగా నిలువుగీటు మధ్యగాగల ఆయక్షరమే కలిసియుండు రెండు సున్నలుగల యక్షరముగ కాలక్రమమున మారిపోయెను.

చర్చలోనున్న మనయక్షరము ‘ఱ’ (ఱ్మ)కు తొలిరూపముని మనమనుకొను అక్షరమునకు భిన్నముగ నుండుటవలనను, అది కేవలము ద్రావిడభాషాపదములలోనే వచ్చుచుండుటవలనను, సంస్కృతాక్షరామ్నాయమున లేని ద్రావిడ వర్ణమాలికలోని యక్షరముగనే నిర్ణయించుకొంటిమి గనుకను అది బండి ‘ఱ’ అయియుండవలెనని నానమ్మకము. ఈ + చిహ్నముచుట్టును సున్న చుట్టినట్లున్న ఈయక్షరము ఇప్పటికి బాగుగ పరిణతిని పొందిన బండి ‘ఱ’ యొక్క తొలిరూపమని నాతలంపు.

౨. ఈ + చిహ్నము చుట్టును సున్న చుట్టిన నేర్పడునట్టి యీలిపిసంకేతమునే క్రీ.శ. నాల్గైదు శతాబ్దుల నుండియు ప్రాచీనసంస్కృత భాషాశాసనములలో ఉపధ్మానీయమునకు గుర్తుగ వాడుచుండినట్లు ప్రాచీనశాసనములను బరిశీలించిన దెలియగలదు [చూడుడు, భారతి, రక్తాక్షి సం॥ శ్రావణమాస సంచికలోని శాలంకాయన నందివర్మ పెదవేగిశాసనము: ౧౩ వ పంక్తి]. ఈ గుర్తే విష్ణుకుండి, పల్లవ, కదంబ, గాంగ, చాళుక్య, రాష్ట్రకూట వంశములవారి ప్రాచీనసంస్కృత భాషాశాసనములలో గూడ గాంచనగును. బాదామి చాళుక్యవంశజుడును, క్రీ.శ. ఏడవశతాబ్ది ప్రథమభాగమున నున్నవాడునగు శ్రీ సత్యాశ్రయపులికేశి మహారాజు యొక్క ఒకానొకశాసనమును ప్రకటించుచు, ఫ్లీటుదొరగారు అందువచ్చిన యీ యుపధ్మానీయపు గుర్తును (ఈ + చిహ్నము: దానిచుట్టు సున్న) గురించి యిట్లు వ్రాసియున్నారు:

"We have here and in several places further on, the old form of the Visarga, called in this case Upadhmaniya, before 'p' and 'ph'. The sign is identical with the letter 'r' (ఱ) and is called by Vopadeva 'Gaja Kumbhakriti' (గజకుంభాకృతి) 'that which has the shape of the two projections on the fore-head of an elephant which swell in the rutting season'. It is used sometimes where in classical sanskrit 'sh' is written; e. g., 'purpa' (పుఱ్ప) for 'pushpa' (పుష్ప)."

వారుకూడ ఈ యుపధ్మానీయపు గుర్తును, బండి ‘ఱ’ యును ఒక్కతీరున నుండుననియు, ‘వోపదేవుడు’ దీనిని ‘గజకుంభాకృతి’ యని పేర్కొనెననియు వ్రాసియున్నారు. అయితేవారు దీనిని ‘ఱ’ గ చదివినారని మనముకూడ అట్లే చదివితీరవలెనని శాస్త్రములేదు. కాని యంతటి పూర్వకాలమున, క్రీ. శ. అయిదు ఆఱు శతాబ్దులలో ఈగుర్తు నెట్లుచ్చరించుచుండెడి వారో కూడ మనకు దెలియదు: అనగా అప్పటి కాయక్షరము యొక్క పేరును దెలియదు; ఉచ్చారణమును దెలియదు. అయితే శాసనములం దీయుపధ్మానీయపుగుర్తు నుంచు పద్ధతి క్రీ. శ. ఆఱేడు శతాబ్దులతో ఆగిపోలేదు. క్రీ. శ. తొమ్మిదవ, పదవ శతాబ్దులనాటి సంస్కృతభాషా శాసనములలో గూడ నది కలదు. లిపిపరిణామమున అన్ని యక్షరములును మార్పులను బొందినట్లే క్రీ. శ. అయిదవ శతాబ్దినాటి యుపధ్మానీయపు గుర్తును పరిణామమును బొంది మార్పును గాంచినది. మార్పునొందిన యీయుపధ్మానీయపు గుర్తుయొక్క స్వరూపమును వేంగీ చాళుక్య వంశజుడగు, రెండవచాళుక్యభీముని (క్రీ.శ. ౯౩౩-౯౪౫) యొక్క దిగుమర్తిశాసనము నందును, అతని కుమారుడు అమ్మరాజ విజయాదిత్యుని ‘మలియంపూండి’ శాసనమునందును గాంచనగును. ఉదాహరణమునకు ఈరెండు శాసనములను మాత్రమే పేర్కొంటిని కాని తొమ్మిదవ, పదవ శతాబ్దులలోని సంస్కృతభాషా శాసనములు వేటిని జూచినను ఉపధ్మానీయపు గుర్తే యుండునెడల దాని అయిదవ శతాబ్దినాటి స్వరూపముగాక మార్పునొందిన రూపమే గోచరించును. ఆ మార్పునొందిన రూపము సరిగా బండి ‘ఱ’ ను బోలియుండుటను గాంచగలము. దీని ననుసరించిచూడ, క్రీ.శ. పదవశతాబ్ది సంస్కృతశాసనములలో ఉపధ్మానీయపు గురుతుగ గనబడుదానికిని, బండి ‘ఱ’ కును సారూప్య సాజాత్యము లున్నయెడల క్రీ. శ. అయిదవశతాబ్దినాటిసంస్కృతభాషాశాసనములలో ఉపధ్మానీయపు గుర్తుగ గనబడుదానికిని బండి, ‘ఱ’ కును గూడ సారూప్య సాజాత్యము లుండదగునని నానమ్మకము. అందువలననే చర్చలోనున్న యక్షరమును బండి ‘ఱ’ గనే చదువవలెనని నాయభిప్రాయము.

3. ఈ + గుర్తుచుట్టు సున్నచుట్టిన ఏర్పడు లిపిసంకేతము కేవలము మన తెలుగువనే కాక ప్రాచీన కర్ణాటశాసనములగూడ గలదు. ఈసందర్భమున మనము కడుప్రాచీనకాలమునుండియు, తెలుగు కన్నడలిపులకు భేదమేమియును లేక రెండు నొక్కరీతినే యుండెనని జ్ఞాపక ముంచుకొనవలెను. అందువలన మన పూర్వపు తెలుగుశాసనములలో వచ్చు ఈ లిపిసంకేతము ప్రాచీన కర్ణాటభాషాశాసనములలో ఎట్లుచ్చరింపబడు చుండెనో అట్లే యుచ్చరించుట యుక్తము.

ఆళుపులనబడువారి శాసనములు కొన్ని కన్నడ భాషను గలవు. ఏడవశతాబ్దికి పూర్వముండినను లేక పోయినను వారు ఏడవశతాబ్దినుండి యుండిరనుటకు నిశ్చయమైన శాసనాధారములు కలవు. వారు బాదామి చాళుక్యులకు సామంతులుగను, సైన్యాధిపతులుగను నుండిరి. ధార్వాడ జిల్లాలో దొరకిన వీరిశాసనములను గొన్నిటిని హుల్ట్జదొరగారు ప్రకటించియున్నారు. వీటిలో గొన్ని 'వీరకల్లు'లనబడు 'వీరశిలల'మీద జెక్కబడియున్నవి. ఆశాసనములు క్రీ. శ. ఏడవ ఎనిమిదవ తొమ్మిదవ శతాబ్దులవాటివి. ఈయక్షరముగల మన తెలుగు దేశశాసనము లెప్పటివో అవియు నప్పటివే. అందువలన వాటిని సమకాలీనప్రమాణముగ గ్రహింప దగును. ఆవీరశిలలమీద జెక్కబడిన శాసనములు అందు పేర్కొనబడిన వీరులు శత్రువులను గొట్టి స్వర్గాలయమున కెక్కి (పోయి)రను విషయమును దెలుపుచున్నవి. 'స్వర్గాలయ క్కేఱిదర్' అనుపదము లట్టిసందర్భమున నుపయోగింపబడినవి. 'ఏఱ్'యన 'ఎక్కు'యని యర్థము. ఇందలి 'ఱ్'వర్ణమును వ్రాయుసందర్భమున ఆశాసనములలో ఈ + గుర్తుచుట్టు సున్నచుట్టగా ఏర్పడులిపి సంకేతమే చూపబడెను. కర్ణాటమున నీ 'ఏఱ్'పద మింకను అంతరించిపోలేదు. ఇప్పటికి దాని కదియే యర్థము, దానిలోనిది బండి'ఱ'యే యని తజ్జ్ఞులు చెప్పుదురు. అందువలన సమకాలమునబుట్టిన కర్ణాటభాషా శాసనములలో గూడ ఈ లిపిసంకేతము వచ్చుచున్నపుడును, దాని నచట బండి'ఱ'గనే గ్రహింపవలసియున్నపుడును, తెలుగుకన్నడ లిపులకు భేదమేమియు లేనపుడును ఆకాలముననే పుట్టిన తెలుగు దేశశాసనములలో వచ్చు నీలిపిసంకేతమునుగూడ బండి'ఱ'గనే చదువవలసి యుండునని నానమ్మకము. ఆళుపులయొక్క యొక శాసనములోని కొంతభాగము నిట పొందుపఱచుచున్నాను.

౬. ....:................ఱు

౭. భటర ఏఱిదు ప్రియచె

౮. ల్వచెల్వ శెన్నన్న క(ఖ)ల

౯. [జ*]నవర్జితఱ్ ధరెగి(గీ)

౧౦. [శ*]ర్గ ఓవదొరపత

౧౧. [తి]య అఱిదు సురలో

౧౨. కక్కె ఏ ఱి దఱ్ [1 *] కెళెయ

౧౩. వాళెఱెయ న్నిఱిసిద.

ఈ పై శాసనపంక్తులలో ఎత్తుగీటిచ్చిన బండి'ఱ' లన్నియు చర్చలోని యక్షరమునే పోలియున్నవి (అనగా ఈ + చిహ్నము: దానిచుట్టు సున్న).


ఆళుపుల శాసనములనేకాక బాదామిచాళుక్యుల శాసనములను బరిశీలించినను ఈయక్షరసంకేతము బండి 'ఱ' అనియే విదితమగును. బాదామిచాళుక్య వంశజుడైన వినయాదిత్యసత్యాశ్రయుని శకవర్షము ౬౧౬ నాటి తామ్రశాసనమున అతడు 'కిఱుకాగామాసి' యను గ్రామమును దానముచేసెనని కలదు. ఈగ్రామనామమున నేను బండి'ఱ'గ వ్రాసినచోట చర్చలోనున్న యక్షర సంకేతమే కలదు. ఆగ్రామ మిప్పుడు స్పష్టముగ నిదియని గుర్తింపరానందున దానిని 'ఱ'గ చదువవలెనో, 'డ'గ చదువవలెనో తెలియదు. కాని ఆగ్రామమునకు పరిహార్తులను దెలుపుపట్ల వచ్చు కొన్నిపదములలో ఈయక్షర సంకేతము వచ్చును. ఆశాసనమును ప్రకటించినవారు ఈయక్షరసంకేతమును బండి'ఱ'గ చదివియున్నారు. 'కుఱుపక్కెఱె' ఈ మొదలగు పదములలోని బండి'ఱ' ఆ యక్షరసంకేతమున నున్నదే. 'కెఱె' యనుపదమిప్పటికి కన్నడమున శకటరేఫముతోనే కలదు. 'కెఱె' యనగా చెఱువు. 'కెఱె' యను పదమే మన తెలుగున చెఱువుగా

మాఱినది. చెఱువుపదమున నిప్పటికి మనభాషను బండి 'ఱ' గలదు. గ్రామమునకు పరిహద్దులుగ నిచ్చినవి సాధారణముగ గ్రామనామములుకాని, చెఱువులపేళ్లుకాని, చెట్లు, గట్లపేళ్లుకాని యగుట సహజము: అందువలన 'కెఱె' యనుపద మిప్పటికి కన్నడమున బండి'ఱ' తోనుండుటవలనను, గ్రామమునకు పరిహద్దులుగ నిచ్చిన పదములలో నది వచ్చుచుండుటవలనను, ఆపదమునకు వ్యుత్పన్న రూపమగు 'చెఱువు' పదమునగూడ బండి'ఱ' యుండుటవలనను ఆయక్షరసంకేతము బండి'ఱ' యగుననియే నానమ్మకము. ఇట్టి యుదాహరణము లనేకములు చూపవచ్చును.


౪. బర్నెల్ దొరగారు క్రీ.శ.౯౫౦ నాటి పశ్చిమ చాళుక్యశాసనాక్షరస్వరూపములను దెలుపుపట్టిక నిచ్చియున్నారు. దానిలో బండి'ఱ' యొక్క సంకేతము మన యక్షరమువలెనే కలియజేర్చి నిలువుగ నిలిపిన రెండు సున్నలమధ్య అడ్డుగ నొకగీతగీసిన నేర్పడు లిపిసంకేతము వలెనున్నది. శాసనములను బరిశీలింపగా క్రీ. శ. ౯౫౦ నాటికి బండి 'ఱ' ఆస్వరూపమున నుండెనని వారికి తోచినది. అలంపుల శాసనములు మొదలైనవాటిలోవచ్చు బండి 'ఱ'స్వరూపమునకు దీనికి నంతగ భేదములేదు. ఈ + గుర్తు చుట్టు సున్నగల సంకేతమే కాలక్రమమున నించుక మార్పుచెంది ఈరీతికి వచ్చినదని నాయభిప్రాయము. ఇట్టి యక్షరమునుగూడ మన తెలుగుదేశ శాసనములలో జూడవచ్చును. శ్రీయుత పి. కృష్ణమాచార్యులుగారిచే భారతిలో ప్రకటింపబడిన రెండవ జయసింహవల్లభుని పెణుకపఱుదానశాసనమును జూడుడు. అందు పెణుకపఱులోని కడపటియక్షరము రెండుసున్నలను దగ్గరగ జేర్చి మధ్యనొక యడ్డుగీటు నిచ్చిన నెట్లుండునో యట్లున్నది. ప్రిథివీమూలుని గోదావరితామ్రశాసనమున ౫౩వ పంక్తిలో 'రేఙ్గుటకమ్పా ఱాతుకురాణామ్' అన్న దానిలో నేను బండి'ఱ' వ్రాసినచోటకూడ అట్టి సంకేతమే కలదు. వేంగీచాళుక్యవంశజుడైన రెండవ మంగి యువరాజు ముంజేఱుశాసనమున దానముచేయబడిన గ్రామము పరిహద్దులను దెలుపు సందర్భమున 'పశ్చిమస్యాందిశి విలఙ్గమిఱు' అనికలదు. ఇచ్చట నేను బండి'ఱ' వ్రాసినచోట పైని తెలిపిన సంకేతమే కలదు. 'విలఙ్గ'యే 'వెలగ' యనియు, 'మిఱు' 'మిఱ్ఱు'అనియు నాయూహ. 'మిఱు' 'అఱు' పదములు 'మిఱ్ఱు', 'అఱ్ఱు'[1] పదములకు రూపాంతరములు. శాసనభాషలో 'మిఱు' పదమును చాలచోట్ల చూడనగును. 'మిఱు' పదము మనభాషలో లేనిచో దానిని 'విలఙ్గమిసు'గ చదువదగునా లేక 'విలఙ్గమిఱు'గ చదువవలెనాయని సంశయింపదగునేమో కాని అదియున్నపుడు దానిని 'మిసు'గ గాక 'మిఱు'గ చదువుటయే యుక్తము అని నాతలంపు. అందువలన ఈ సంకేతమును బండి'ఱ'గ చదువవలెననియే నానమ్మకము.

౫. బండి 'ఱ' లేక 'శకటరేఫము' అనుపేరే ఈ యక్షరస్వరూపమును దెలుపుటలో కొంత తోడ్పడగలదు. ఈలిపి సంకేతమునకు బండికివలె చక్రములవంటి రెండు సున్నలును, ఇరుసువలె మధ్య అడ్డముగ నొక యడ్డుగీటును ఉండి, రేఫోచ్చారణ ముండుటవలననే దీనికి బండి 'ఱ' యనియు, శకటరేఫమనియు పేళ్లుగలిగెనని నా యభిప్రాయము. ఈ నామమున కాలిపిస్వరూపము లక్షణము: ఆలక్షణమున కీపేరు లక్ష్యము. ఈవిధమైన రూపముతో అతిప్రాచీనశాసనములలో గానవచ్చు నీ లిపిసంకేతము కొంతకాలమునకుపరికి శ్రీశాస్త్రిగారు సత్యాదిత్యచోళమహారాజు శాసనములో కలదను స్పష్టమైన బండి 'ఱ' రూపముగా మాఱి పరిణామమున ఇప్పటి బండి'ఱ' రూపముగ పరిణతిం జెందెను. బండియిరుసువలె మధ్య అడ్డముగ నుండు అడ్డుగీటే ఈయక్షరమునకు ప్రాణము. మొత్తముమీద ఈలిపిసంకేత మెట్టిమార్పులను బొందినను అన్నిమార్పులలోను ఈయడ్డుగీటును గాంచుచునే యుండగలము. ఈయొక్క యక్షరమే కాక

1. అఱ్ఱు, మిఱ్ఱుల వలెనే ప్రాచీనశాసనములలో 'కఱ్ఱు' అను పదమును గలదు. 'కఱ్ఱు' అనగా గట్టు అని యర్థము: ఏటికఱ్ఱు, కోటికఱ్ఱు ఇత్యాదులు. 'కఱుత' అనునది ఈ పదముయొక్క సప్తమ్యేకవచనరూపము. రాజరాజనరేంద్ర పట్టాభిషేకసంచికలో పొరపాటున 'కఱుత' అనుదానినినే ప్రథమావిభక్తిరూపముగ గ్రహించి దానికి 'గట్టు' అని యర్థము చెప్పియున్నాను. ఇది తప్పు. 'కఱ్ఱు'ప్రథమావిభక్తిరూపము: 'కఱుత' సప్తమీవిభక్తిరూపము.



౮. బకాసురుని పుత్రుడగు భీషణుడును వానిమంత్రి ధర్మరాజుయొక్క—
అశ్వమేధాశ్వమును పట్టుకొని బదిగొలుట.




౧౦. అజంతాగుహాలయములోని యొక మండోదకచిత్రము (Fresco) యొక్క నమూనా.

కాలక్రమమున తెలుగు-కన్నడ అక్షరములన్నియు ఇట్లు మార్పులు చెంది పరిణామమును బొందినవే. ఇతర లిపుల గూట రొంటులున్నను తెలుగు-కన్నడ అక్షరములలో కాలక్రమమున కొద్దిగనో గొప్పగనో ఇట్లు పరిణామము ను బొందని యక్షరము ఒక్కటియైనను లేదు. చర్చలోని యాలిపిసంకేత మే యిట్లు ఇప్పటి బండి 'ఱ'గ మారలేదన్న పశ్చాత్యదిత్యచోళమహారాజు శాసనములో కలదను స్పష్ట త్రపై విష్ణుకుండి, చాళుక్య, గాంగ, కదంబ, రాష్ట్ర కూట, శాలంకాయన, ఆనందగోత్రజాల శాసనములు పరిశీలింపదగును. అడ్డగీటుతోనున్న ౧౦-వ రూపమును మంగియువరాజు నూకులపల్లి శాసనమునను కలదు. చూడుడు: రెండవరేకు, రెండవప్రక్క: ౨, ౪, ౬ పంక్తులు.



నైన బండి 'ఱ' రూపము అంతపూర్వపు ప్రాచీనశాసనములలో గనబడవలసియుండును. కాని నేను చూచినంత వర కది అయినను, ఆ అవశేషాల్లోని శాసనములలో గానరాలేదు. అక్షరములు అన్నియు కాలక్రమమున మార్పులు చెంది పరిణామమును బొందినయప్పుడు ఈ బండి 'ఱ' యొక్కటియు నేమార్పును లేక మొదటి నుండియు నిట్లే యుండెననుట సంగతము కాదు.

ఈ బండి 'ఱ' యక్షరము పరిణామము నొందుటలో గాంచిన మార్పులను ఇట చూపుచున్నాను:



ఇన్ని విధములైన రూపాంతరములను మనము ప్రాచీన శాసనములలో గాంచగలుగుదుము. ఇందునిమి

"(౧)*...దోణశర్మణ (౨)ణపుత్రాయ కుణ్డి దోణశర్మణే కర్మరాష్ట్రే నుతుల పఱునామగ్రామే దో[క్షి](3)ణదిశాయాం పద స్తక్షేత్రదత్తమ్ రేవది స్తనే బ్రహ్మణక్షేత్ర దక్షిణాత తటా(౪)క పశ్చిమత పెఱుకపఱంబు బ్రహ్మణక్షేత్ర ఉత్తరత నిఱుంబఱుప (౫) స్త పువ్వాత దోణవాది పస్త బ్రహ్మణక్షేత్ర దక్షి ణత పేతకణ్డనామ బ్రహ్మ (౬) ణక్షేత్ర పశ్చి మత వెపెఱుకణ్డి నామ బ్రహ్మణక్షేత్ర......"

ఈ పైపాఠమున ఎత్తుగీత లిచ్చి బండి 'ఱ' గ వ్రాయబడిన వన్నియు, ఇట్టిసంకేతము కలవే. 'నుతుల పఱు'లోని చివరియక్షరమునకు ద్విత్వము లేనందున దానిని నూతులపాడుగా చదువవలెను కాని 'నుతులపఱు'గా చ దువరాదని యొకవేళ ఆక్షేపము వచ్చిన రావచ్చును. కాని ప్రాచీనశాసనములలో ఇప్పుడు ద్విత్వముతో నున్నవి

* ఈ ( ) కుండలీకరణమున నున్న సంఖ్యలు శాసనపు రేకుమీది పంక్తులను తెలుపును.

పూర్వము ద్విత్వము లేకుండ గనబడుటయు కలదు: కొంబ ఱు (ద్విత్వము లేదు); నిడుంబఱు (నిడుమఱ్ఱు; దానికి పూర్వ ము ద్విత్వము లేదు). ఇట్లే, కొల్లఱపఱు (వరేంద్రమృగరాజ విజయాదిత్యుని శాసనము), ట్రంపఱు (మూడవ విజయా దిత్యుని శాసనము), వంగిపఱు (రెండవ విజయాదిత్యుని శాస నము), మిఱు (మంగియువరాజు శాసనము) మొదలైన ద్వి త్వము లేనిపదములను జూపవచ్చును. అందువలన దానికి ద్విత్వము లేకపోయినను అది 'మతులపఱు' కాకపోదు. ఇప్పుడు 'మాతులపాడను గ్రామము కలదని ఒకవేళ 'మతు లపఱు' అని యున్నదానిని సంపూర్తిగా సంస్కరించి 'మాతులపాడు'గ చదివిన 'నిడుంబఱు'ను 'నిడుంబడు'గను, 'కొంబఱు'ను 'కొంబడు'గను, 'మిఱు'ను 'మిడు'గను చదువ వలసివచ్చును. ఈ పేర్లుగల గ్రామము లున్నట్లు వినము. తరువాతి చాళుక్యశాసనములలో 'కర్ణఱు'గ వ్రాయ బడినపదము మొదటి జయసింహవల్లభుని శాసనమున చర్చ లోనున్న లిపిసంకేతముతో 'కర్ణఱు' అని కలదు. రెండవ యక్షరములోని 'ఱ' బండి'ఱ' కాదు 'డ' అనుకొన్నను చివరియక్షరము పరిణామమున సూచించిన ౧౪-వ రూప మును బోలియున్నది.


౬. శ్రీశాస్త్రిగారు క్రిందటి భారతిసంచిక ౧౦౩-వ పుటలో "సత్యాదిత్యచోళమహారాజు తెలుగు శాసనమును ప్రకటించిన హెచ్. కృష్ణశాస్త్రిగారు దానిలోని 'చిఱుంబూరు' అను దానిని 'చిఱుంబూరు' అని చదివిరి. అది 'చిఱుంబూరు' అని చదువుటే సరి యని నానమ్మకము" అనియు, ౧౧౮-వ పుటలో 'చి ఱుంబూరు' అని యుత్తరులు చదివినతీరుతో పదముకలదు. అందలి 'ఱు' లిపి + చిహ్నము చుట్టును సున్నచుట్టి కొ మ్మిచ్చిన ట్లున్నది. ఇదిహాసి'డు'గా చదివినచో 'చిలుము కూరు' అను శబ్దనిష్పత్తికి సరిపడును. కాని యీపదమే కృష్ణశాస్త్రిగారు ఎపిగ్రాఫియా ఇండికాలో ప్రకటిం చినశాసనమున 'చిఱు(ష్టు)ంబూరి' అని యుండెను. దీనినిబట్టి 'ఱ' కును దీనికిని గూడ సంబంధ ముండి నట్లు తోచెను." అనియు వ్రాసియున్నారు: అనగా చిఱుంబూరు అను పేరులోని రెండవయక్షరము సత్యా దిత్యచోళశాసనమున 'ఱు'గ నుండెనుకాని అది కృష్ణ శాస్త్రిగారు చదివినట్లు 'ఱు' కాదనియు, ఆయక్షరమే ఆపేరులోనే వేరొకశాసనమున + గుర్తువేసి దానిచుట్టు సున్నచుట్టిన ట్లుండెననియు, 'ఱ', 'డ'లకు ఎక్కువ సంబంధ మున్నదిగనుక ఈ + గుర్తుచుట్టు సున్నగల యక్షరమునకును 'డ'కును గూడ సంబంధముండవలె ననియు, దానిని 'డ'గ చదివినచో 'చిలుముకూరు'ను శబ్ద నిష్పత్తికి సరిపోవుననియు వారియభిప్రాయము. నేనిచట



చి ఱుం బూ రి ఉ త్త

ఆ పేర్ల ప్రతిబింబములను శాసనములనుండి విడిగా దీసి యిచ్చుచున్నాను. వాటిని చూచినచో సత్యాదిత్య చోళరాజు శాసనమునందలి 'చిఱుంబూరి' అను దానిలో బండి'ఱ'యే కలదనియు, కృష్ణశాస్త్రిగారి పాఠము సరియైనదే యనియు తేటపడును.

అదియునుంగాక 'చిఱుంబూరు'లో బండి'ఱ'గాక శాస్త్రిగారు చెప్పినట్లు 'డ'కారమే యుండవలసియున్నను శబ్దనివృత్తి శాస్త్రమువనుసరించి యది 'చిఱుంబూరు', 'చిలుమూరు'గా మారునుగాని 'చిలుమకూరు'గా మారదు. అదియటుండ విక్రమాదిత్యచోళమహారాజు శాసనమునగూడ అది బండి 'ఱ'తో 'చిఱుంబూ'రనియే రెండవయక్షరము ఈ + గుర్తుమట్టు ఇంచుమించు సున్న చుట్టిన సంకేతమున గలదు. ఈయక్షరము రెండు వేరువేరు శాసనములలో ఒకే పేరులో రెండురీతులగనబడునప్పుడును, అందొకరీతి యక్షరము మనకు బండి'ఱ'యని స్పష్టముగ దెలియుచున్నప్పుడును రెండవరీతి నున్న యక్షరముగూడ_పేరొకటే కనుక_ఆ దేవిధమైన యుచ్చారణముగల యక్షరమే యని నిశ్చయించుట యుక్తము. అందువలన ఈ + గుర్తుమట్టు సున్నచుట్టగా చేర్పను సంకేతముగూడ బండి 'ఱ' అనియే నేను నమ్ముచున్నాను. ఈసంకేతముతో నున్న 'చిఱుంబూరు' పేరుగలశాసనము సత్యాదిత్యచోళ శాసనముకంటె ప్రాచీనముకాదగునని నాతలంపు.




చి ఱు బు రు


కాదు. దీనిలోని బండి'ఱ' క్రీ. శ. పదవ శతాబ్దిపరకే కాక విజయనగరాధీశులైన బుక్కరాయల కుమారుడగు హరిహరరాయలకాలమున క్రీ. శ. ౧౩౯౭ నాటివరకు గూడ కలదు. క్రీ.శ. ౧౩౯౭ నాటి యూరని చిలుమకూరి శాసనమున ఆ పేరు బండి'ఱ'తో 'చిఱుమకూరు'గ నున్నది. అందువలననే అది ఇటీవల 'చిలుమకూరు'గ మారుట సంభవించినది. శబ్దనివృత్తిశాస్త్రమునుబట్టి 'చిఱుమహూరు' 'చిలుమకూ'రగుట సంగతమే.

మరియొక శాసనమున వచ్చిన ఈ పేరులోనే

౩. ఈవిధమైన యక్షరము నెల్లూరు మండలము నుండి ఇటీవల నేను తెచ్చిన ప్రాచీనాంధ్రభాషాశాసనములలో చాలచోట్ల కనబడుచున్నది. ఈశాసనములు కొన్నిటిలో వచ్చు 'ఆచాఱ్ఱు', 'ఈఱ్ఱు' అను పదములలో కడపటి సంయుక్తాక్షరములలోని ఎగువయక్షరము ఈసంకేతముననే కలదు. ఒకటి రెండు ప్రతిబింబముల నిచట నిచ్చుచున్నాను. అందు దీనిని చూడవచ్చును.



శ్రీవల్లెగుణ్డ ఆచాల్లు
పనికేసిరి.



శ్రీకలువాది ఆచల్లుకే
సివపణియు

కేసిరి, కేసిన అను పదములు మనయిప్పటి చేసిరి, చేసిన పదములే. కన్నడమున 'క' కారములో నున్నవి తెలుగున చకారముగ మారిన యుదాహరణములనేకము తీయవచ్చును (కెయ్యి-చెయ్యి; కిఱు-చిఱు; కిలుము-చిలుము-ఇత్యాదులు).

మఱియొక శాసనమున 'కల్లు' అను పదము ఈ సందర్భమున వచ్చును:

...శ్రీపృ రాజా ల్యాలజేగారికి పన్నాస ఈచ్చినవారు దానికి పక్కి కొణ్డకావ్యాల్లు కొణ్డ

యరు నడ్వబోళ నడపయు గోరణ్డళ పేరయు దేసమ్వఱెతి ము(?)దుట్ల కొణ్డయరు పట్టి (?) ముదుఱదు ఈఱ్లునలువురాయుతో౦బ ఏవుదు ఊరెల్ల నక్కి వ్రసినవాన్రు...

ఎత్తుగీటు లిచ్చినచోట నేను బండి 'ఱ'గ చదివిన అక్షరసంకేతము చర్చలోనున్న దానిని బోలియున్నది. (ఒక సున్న, దానికిమధ్య అడ్డుగీటు).

ఈ పై పదములలో ఆసంకేతమును 'డ' గ చదివిన 'ఆచాఱ్లు'[1] అను దానిని 'ఆచాడ్లు' గ చదువవలసి వచ్చును. అట్టి రూప మున్నట్టు నే నెరుగను. అదియును గాక 'ఈఱ్లు నలువురాయు' అన్నచోట 'ఈఱ్లు'[2] అను దానిని 'మీరలు'గా అర్థముచేసుకోవలెనేమో. మీరు, నేను, నీవు మొదలగుపదములకు ఈరు, ఏను, ఈవు మొదలగునవి ప్రాచీనరూపములు. అందువలన 'ఈఱ్లు నలువురాయు' అనుదానిని 'మీరలు నలువురయు' అని గ్రహింపవలసియుండు ననుకొందును. ఇట్టి సందర్భమున ఆపదమును 'ఈడ్లు'గ గాక 'ఈఱ్లు' గనే చదువవలసియుండు నని నాయభిప్రాయము. 'ఊరు' 'మడి' పదములకువలె బహువచనమున, 'ఈడ్లు' రూపముమాత్రమే యేలయుండరాదను ప్రశ్నకలిగిన కలుగవచ్చును. కాని, ఏవియోకొన్ని పదముల బహువచనరూపము 'డ్లు'గ కనబడుచున్నది గనుక అన్నిటికి బహువచనమున నట్లే 'డ్లు' రూప ముండునని భావించుట సమంజసముకాదు. పురి, నేరు, మేడ, పాడు, అరి, గోడ, ఈమొదలైన పదములకు బహువచనమున 'డ్లు' రూపమునా నవకాశము లేదనుకొందును. ఈకారణముల ననుసరించి ఆపదములను 'ఆచాఱ్లు', 'ఈఱ్లు' గనే చదువవలసి యుండుననియు, ఆయక్షరమును బండి 'ఱ'గనే చదువవలెననియు నానమ్మకము.

౫. 'ఆదిత్యన్రు', 'ఉన్రి', 'పొన్రు', 'వాన్రు' అను రూపములు కర్ణాటభాషలోగాని, ద్రవిడభాషలో గాని లేవనియు, అందువలన ఆలిపిసంకేతమును 'డ' గనే చదువవలెననియు శ్రీ శాస్త్రిగా రనుచున్నారు; కాని ఒన్రు, మూన్రు ఇత్యాది రేఫోచ్చారణము కలిగిన పదములు అరవమున గొన్ని యిప్పటికినికలవు; కన్నడమునను గలవని విందును. ఇప్పటివఱకు నిట్టి యుచ్చారణముగల పదములు కర్ణాట, ద్రవిడ భాషలలో నుండినచో ప్రాచీన కాలమున నిట్టి వనేకము లుండియుండునని విశ్వసింపదగును. అది యటుండ 'మూన్రు' 'ఒన్రు' మొదలైన పదములనుండియే 'మూణ్డు': మూఁడు; ఒణ్డు: ఒరు మొదలగు రూపములు కలిగినవని నాయభిప్రాయము. అట్లే కానిచో మూఁడు, ఒరు మొదలగుపదముల కారూపము లెట్లు సిద్ధించినవో అరయవలసి యుండును. ఈకారణము ననుసరించి కూడ ఆసంకేతమును బండి 'ఱ' గనే చదువవలసియుండునని నాతలంపు.

౬. మఱియొక విషయము: కడు ప్రాచీనకాలము నుండియు తెలుగు రచనమున సంస్కృతవర్ణక్రమమే యనుసరింపబడుచుండెనను విషయము ప్రాచీనశాసనములను బరిశీలించిన బోధపడగలదు. అందువలన కడు ప్రాచీనకాలపు తెలుగు రచనలో అనునాసికములనే కాని పూర్ణానుస్వారములను గాని, అర్ధానుస్వారములను

1. ఈ లిపిసంకేతము ఈ పదమున గనబడుట వింతగ నున్నది. ఇది ఆర్యభాషాపదమే యైనచో ఈ సంకేత మిచట ప్రామాదికమయి యుండవలెను.

2. ఇచ్చటి సందర్భము ననుసరించి దీనిని 'వీరలు' గ అర్థముచేసుకొనుట యుచితమగునేమో కాని 'మీరు' అను దానికే కాని 'వీరు' అనుదానికిఁగూడ 'ఈరు' అను ప్రాచీనరూపము వ్యాకరణముల గానరాదు. ఒకవేళ 'ఈరు' అను రూపము ప్రాచీనకాలమున 'మీరు', 'వీరు' పదములు రెంటికిఁగూడ నుండెనేమో. అయినను దీని విషయమై ఇంకను యోజింపవలసి యున్నది. ఈపదమే మొదటి జయసింహవల్లభుని విప్పఱ్ల శాసనమున హ్రస్వ 'ఇ' కారముతో 'ఇఱ్లు' అని యున్నది. ఒకచోట 'ఇ' కారమును, వేరొకచోట 'ఈ' కారము నుండుటకు గతమేమో. ఇం దేది ప్రామాదికమో ఏది సరియైనరూపమో. దీనియర్థమును గురించియు, పదస్వరూపమును గురించియు ఇంకను ఆలోచింపవలసి యున్నది.

గాని గాంచము. కాలక్రమమున పదవర్ణక్రమముకూడ మార్పునంది యీయనునాసికములే పూర్ణానుస్వారములుగను, అర్థానుస్వారములుగను మారెనని యెల్లరంగీకరింతురు. మన 'అహదనకర' శాసనము తెలుగుభాగమున పదవర్ణక్రమమునగూడ పూర్ణానుస్వారము లున్నను చాలచోట్ల అనునాసికములు లేకపోలేదు. చర్చలోనున్న లిపిసంకేతముగల పదములలోగూడ అనునాసికము కలదు. శ్రీ శాస్త్రిగారు చెప్పునట్లు ఆసంకేతమును 'డ'గ చదువవలసియున్నచో పూర్వము పాటింపబడుచుండిన సంస్కృత వర్ణక్రమపద్ధతి ననుసరించి తదక్షరమునకు బూర్వము తద్వర్గానునాసికమైన 'ణ' యుండవలెను గాని 'న' యుండరాదు. ఒకవేళ అట్లుండుట లేఖక ప్రమాద మనుకొందమన్న శాసనమున నీలిపిసంకేత మెన్నిచోట్లవచ్చినదో అన్నిచోట్లనుగూడ తత్సంయుక్తాక్షరమున 'న' వర్ణమేకాని 'ణ' వర్ణము వ్రాయబడక పోవుటవలన దానిని లేఖక ప్రమాదముగ బరిగణింప వీలు లేదు. చూడుడు:

౧౪-వ పంక్తి	— రెణ్డు	౨౬-వ ,,	— పసిణ్డి
౧౯-వ ,,	— వణ్డు	౨౭-వ ,,	— వెటన్ద
౨౧-వ ,,	— రెణ్డు	౨౯-వ ,,	— వెటన్ద
౨౫-వ ,,	— పణ్చిన	౩౧-వ ,,	— కన్చి

౩౫-వ పంక్తి — వన్ది

ఈ పదములన్నిటిలో వచ్చిన సంయుక్తాక్షరములలో రెండవయక్షరము ఏవర్గమునకు చెందినదో ఆవర్గముయొక్క అనునాసికమే మొదటి యక్షరముగ నున్నది. ౩౧-వ పంక్తిలోని 'కొణ్డుక' పదముతక్క నేను జూడి 'ట'తో చదువవలెననుచున్న 'కొన్టక', 'కన్టిఅము', 'గన్టాన్టు' పదములే పైవర్ణక్రమమునకు విరుద్ధముగ నున్నవి. ఈలిపిసంకేతము వచ్చినచోటనెల్ల 'న' కారమే వచ్చుటచేత 'కొణ్డుక' అనునది లేఖక ప్రమాదమైన గావలసి యుండును లేదా అది 'కొన్టక' వంటి 'ట' కార యుతములైన పదములు 'కొణ్డుక' వలె 'డ'కార యుతములుగ మారుచుండిన మార్పుకాలమైన నైయుండవలెనని నా యభిప్రాయము. అదియునుగాక ఈలిపిసంకేతముగల సంయుక్తాక్షరమున అనునాసికమే వచ్చినచో అది 'న' వర్ణముగనే యున్నది కాని ఏశాసనమునను 'ణ' వర్ణముగ లేదు. కొన్ని శాసనములలో ఈసంకేతముతోను, 'న' అనునాసికముతోను వచ్చిన పదములను గొన్నిటి నిచ్చుచున్నాను చూడుడు:

శేత్యదిత్తున్టు ఏఱుచున్టి చేవాన్టు వచ్చువాన్టు	— సత్యాదిత్య చోళ మహారాజ శాసనము.
కన్టెఅవాటెవిషయ	— మొదటి జటుసింహవల్లభుని శాసనము.
ఇచ్చినవాన్టు	— వైదుంబ శాసనము.
తారుమున్టి	— పృథివీ వల్లభచోళుని శాసనము.
ఇచ్చువాన్టు	— విక్రమాదిత్య శాసనము.
మగన్టు	— ముకిపేడు శాసనము.
ఏఱువాన్టు విన్టినాయకున్టు	— వైదుంబ శాసనము.
చేయిన్చినవాన్టు ఇచ్చిన వాన్టు	— బుధమనరాయలపాటి శాసనము.
మగన్టు మున్టు	— పెట్లూరి శాసనము.
ముదిగొన్ట	— విష్ణువర్ధనుని శాసనము.

ఈవిధముగ ఈసంకేతము ఎచ్చటవచ్చినను ఎదుర యక్షరము 'న' వర్ణమేకాని 'ణ'వర్ణముకాదు. పైనిచ్చిన యీపదముల పట్టికలో అన్నిశాసనములలోను ఈసంకేతము వచ్చినచోట ఒకేరీతిని 'న'వర్ణమే కనబడుచున్నపుడు ఈవ్రాతను ప్రామాదికముగ నేను గ్రహింపజాలను. నిశ్చయమైన యేదో యొకపద్ధతికి కట్టుబడియే నాటిశాసన లేఖకులు అట్లు వ్రాయుచువచ్చిరి కాని ప్రమాదవశమున నట్లు వ్రాసియుండలేదనియే నానమ్మకము. ఈకారణమువలనగూడ ఆలిపిసంకేతము 'డ' కాదనియు బండి 'ట'యే అనియు నానమ్మకము.

౧౦. శ్రీశాస్త్రిగారు వారివ్యాసమున నొకచోట 'డ'కు రెండురూపములు ఉండెడివని తలంపవలె

నని వ్రాసియున్నారు. ఒకే యక్షరమునకు రెండురూపము లుండెడివనియే అంగీకరించుచో శకటరేఫమునకే రెండురూపము లుండెడివనియు, ఈలిపిసంకేతము ఈ విడిగవచ్చిన బండి'ఱ'యొక్క రూపాంతరమనియు నేల తలంపరాదు?

ఈ పైకారణము లన్నిటివలననే నింతవఱకు ఆలిపి సంకేతమును బండి'ఱ' అనియే నమ్ముచున్నాను. నాయభిప్రాయము ప్రకారము బండి'ఱ' వర్ణము పరిణామమున పెక్కురూపములను బొందినది. కాని యీవర్ణము పరిణామమున ఈదశలో ఈరూపమును బొందినదని యితరవర్ణములవిషయమునవలె దశలు నిర్ణయించి మార్పులను నిశ్చయింపలేము కాని యది పొందిన రూపాంతరములను మాత్రము జూపవచ్చును. ఒకేశాసనమున ఆయక్షరము పొందుచుండిన మార్పురూపములనే కాక అంతకుపూర్వపు రూపములను గూడ జూడగల్గుటయు తటస్థించును: అనగా పరిణతిపొందుచుండిన రూపములు క్రమముగా వాడుకలోనికి వచ్చుచుండినను, ప్రాచీనరూపములపైగూడ లేఖకుల కభిమానము పోలేదనియే దానినిబట్టి మనము గ్రహింపవలసి యుండును. అందువలననే 'అహదనకర'శాసనమున కొంచెము బాగుగ పరిణతిపొందుచుండిన 'ఱ' వర్ణముతోపాటు, తత్ప్రాచీనరూపముకూడ అందు కుదురుకొనియుండుట తటస్థించెనని నాతలంపు.

నే నాలిపిసంకేతమును బండి'ఱ'గ చదువుటకు నాకు ఇంతవఱకుగల కారణముల నెఱింగించితిని. ఈ పై కారణములను కాదనుటకు దగుహేతువులుండి ఆలిపి సంకేతమును 'డ'గనే చదివితీరవలెననుటకు ప్రబలాధారము లున్నచో ఇంతవఱకు చాలమంది శాసన పరిశోధకులు ఆలోచితముగనో, అనాలోచితముగనో చేయుచున్న తప్పు సవరణకాగలదు.

నాయభిప్రాయప్రకారము ఈశాసనము మాధవ విష్ణువర్ధనుని (క్రీ. శ. ౬౧౪-౬౫౧) నాటిది; శ్రీశాస్త్రి గారి యభిప్రాయము ప్రకారము ఇది ఆయిదవవిష్ణువర్ధనుని (క్రీ.శ. ౭౪౬) నాటిది. ఇందు ఏవ్వరిదయినను_మాధవ విష్ణువర్ధనునికికూడ పూర్వమున్న ఆంధ్రభాషాశాసనములు కొన్నికలవు. వాటిలో ఎక్కడనో కొన్నికొన్ని పదములుతక్క దీనివలె ఇంతబొత్తుగా అర్థముకాకుండనున్న శాసనమేదియు లేదు. ఆశాసనములలోని భాష యింతకంటె కొంచెము బాగుగ అర్థమగుచుండినపుడు ఈశాసన భాష ఇంత దురవబోధముగ నుండుటకుగూడ కారణ మరయవలసియున్నది. ఏమాత్రము నీభాష యర్థముకాని కారణముననో యేమో_బాగుగ జ్ఞాపకములేదు_ ఫ్లీటు దొరగారు ఈశాసనమును నమ్మరానిదానిగ దలంచియున్నారు. సంస్కృతమునకే యఖండగౌరవముండినట్టియు, దానలేఖ్యములను వ్రాయింపవలసి వచ్చిన సందర్భమున స్మృతిప్రమాణములను బట్టి రాజులు సీమావర్ణులతోగూడ తామ్రశాసనముల నెల్ల సంస్కృతముననే వ్రాయించుచుండినట్టియు నాకాలమున నీశాసనమున మూడు పెడల తెలుగు రచన ముండుట విడ్డూరమే. పదునొకండవ శతాబ్దినుండియే సీమావర్ణులను వ్రాయుసందర్భమున తెలుగు విపులముగ వాడబడుచు వచ్చెను. ఇంతవఱకు దొరకిన తామ్రశాసనములను బరిశీలించినచో క్రీస్తుశకము పదవశతాబ్దికి పూర్వము అసలు శాసనభాగముననే తెలుగున్న శాసన మిది యొక్కటే. ఈకారణములవలననో యేమో ఫ్లీటుదొరగారు దీనిని నమ్మరానిదానిగా దలచుట. ఒకవేళ చరిత్రవిషయకముగ నిది సరియైనశాసనము కాదని త్రోసివేసినను ఇందలి పదజాలమునకు సరియైన స్వరూపమేర్పడి అర్థవివరణమే కుదిరినచో నిది యాంధ్రభాషకమూల్యాలంకారమనుటకు సందియము లేదు.

౧

సందెపసపులనిగ్గు తేఁటప
సందుమొయిలు ముసుంగుసందున
సందడిలు బాలెంత కొండల
చెలువఁ గీర్తింతున్.

౨

చరులపొదిగిట మోము సుమమం
జరులు విరియఁగ నీటిముత్తెపు
సరులఁ బుడికిళ్లాడు పసిసెల
చనవు దీవింతున్.

౩

పొదలమాటున రొదలపాటలు
పొదల దాఁగిలి మూఁతలను శశి
గదిని సయ్యాటించు చిఱుసెల
కన్నె భావింతున్.

౪

రంగదమృత తరంగయుత హృ
ద్రంగమున నవభావమాలా
రంగవల్లులఁ బెట్టుసెలజవ
రాలి వర్ణింతున్.

౫

చల్లచల్లని తలపుతెమ్మెరఁ
జల్లుమేని విలాస సంపద
జల్లు గాఁగ నటించి చనుసెల
చాన వర్ణింతున్.

౬

అమల నూతనరాగ చిహ్నము
లమర మంజిమ యౌవనప్రభా
రమణ నడుగిడు సెలపొలంతుక
రకము వర్ణింతున్.

౭

సానునయవర్తనము రాగర
సానుభూతియుఁ జాటు చరితము
సానువుల లిఖియించికొను సెల
చాన నుతియింతున్.

౮

మానసమున నొడుదుడుకులకు నను
మాన మందక, ప్రియునికై పవ
మానవేగముతోడఁ జను సెల
మగువ నుతియింతున్.

౯

బిరబిరం జని ప్రియుని కౌఁగిట
విరిసి కరఁగి తదీయవీచుల
విరతిఁ జెందెడు సెలపడంతుక
ప్రేమ దీవింతున్.

మేము మాత్రమే మీ ఆదరణ

కర్హులమనుట కేమి కారణము?

మావద్ద పక్కా టెంధరగాని బేరములేదు గాన దళారులతో పనిలేదు. వృథా ధనవ్యయము ను కాలవ్యయమును కలుగదు.

మావద్ద కొనిన నగ లన్నిటికిని మేము పూచీ పడెదము. ఉత్తరువు (ఆర్డరు) చేసిన పిమ్మటనైనను మేము పంపిన నగలు నచ్చనిచో వాటిని తిరిగి పుచ్చుకొని వానికి బదులుగా మరికొన్ని నగలనుగాని లేక రొక్కమునుగాని కోరినప్రకార మిచ్చెదము.

నగల నన్నిటిని మాకర్మాగారమునందే మాస్వంత పరిశీలనక్రింద చేయించెదము.

మాకు 30 సంవత్సరములనుండి నగలవ్యాపారములో అనుభవముకలదు గాన మీరు మావద్ద నగలనుకొనుటలో పనితనమునందు మీకాలాభము కనబడును.

మేము పనివాండ్రమును నగలను చేయుటలో ప్రవీణ్యమునుగూడ నగుటచే మీకు తృప్తికలుగునట్లు నగలనుచేసి పంపగలుగుదుము.

మావద్ద నగలుచాల నమ్మకమైనవనుటకు 30 ఏండ్లనుండి మే మీ వ్యాపారమును జరుపుచుండుటయే ముఖ్యనిదర్శనము.

మీరిచ్చిన సొమ్మునకు సరియగుమూల్యమునే మీకు చెందజేసెదము.

మావద్ద నొకసారికొనిన మీకే నమ్మకము కలుగును.

సురాజ్‌మల్ లల్లూభాయ్ అండు కో,

నమ్మకమునకు వాసికెక్కినవారు,

313 ఎస్ప్లనేడు, మదరాసు.

కలకత్తా	తిరుచునాపల్లి	బొంబాయి	రంగూను
12, లాలుబజారు స్ట్రీటు.	135, బిగ్‌బజారు స్ట్రీటు.	359, కాల్బదేవీరోడ్డు.	134, మొగలుస్ట్రీటు.

పోషితభక్తు లై యుభయముద్రలు దేవత లెల్లఁ దాల్తు రే
వేషముఁ దాల్ప వీవు సరవిన్ జగదండము లెల్లవేళలన్
బోషణ సేయుచుందు, వరముల్ దగఁ గోర్కెకు మీఱ నిచ్చి సం
తోషముఁ గొల్పు నీదు పదతోయజముల్ నతు లైనవారికిన్.

నతజనభాగ్యదాయిని, మనంబున నిన్నుఁ దలంచి స్త్రీత్వ మం
చితగతిఁ దాల్చి మోహితునిఁ జేసె పురారినిగూడ కేశవుం
డశివ, నినున్ స్మరించియె సమంచితరూపముఁ గల్గి సన్మని
ప్రతతిమనంబులన్ గలఁచి వైచుచు నుండె మరుం డవార్యుఁ డై.

విరు లవి విల్లు, నారి యళిబృందము, బాణము లైదు, మంత్రి శే
ఖరుఁడు వసంతుఁ, డా మృదులగంధసమీరణుఁడే రథంబు, తా
నరుదుగ వీనిఁ దాల్చి యొకఁ డయ్యు జగంబుల గెల్చుచుండె శం
బరరిపుఁ డద్రిజా, భవదపాంగకృపాఘటితప్రతాపుఁ డై.

కరికలభోరుకుంభకుచ గాఢభరానత, పూర్ణచంద్రసుం
దరముఖి, క్షీణమధ్య, క్వణదంచితకాంచనకాంచి యౌచుఁ దాఁ
గరధృతచాపపాశసృణికాండవితానయు నై దయార్ద్రి యై
పురహరురాణి నాకనులముందటఁ దానటియించుఁగావుతన్.

అల్ల సుధాబ్ధిమధ్యమున నాసురసాలవనాంతసీమ రం
జిల్లెడు రత్నద్వీపమున (?) నీపవనావృత రత్నసౌధమం
దల్ల శివాఖ్యఖట్వమున నాపరమేశు శుభాంకమందు భా
సిల్లెడు నీచిదాకృతి భజింతురు కొందఱు ధన్యు లిద్ధరన్.

జన్మశాసనము - పీఠిక

[న్యాయమూర్తులు శ్రీ వేపా రామేశంపంతులుగారు 'జన్మశాసనము' అను గ్రంథమునకు వ్రాసిన పీఠిక.]

సంతాన నిరోధమునుగూర్చి డాక్టరు యస్. కె. వసు వంగభాషలో రచించిన గ్రంథమున కిది ఆంధ్రానువాదము. దీని పేరు 'జన్మశాసనము'. 'జన్మ' అనగా జననము. శాసనము అను పదము వివిధార్థములు గల యొక సంస్కృతపదము. అది సందర్భమును బట్టి 'ఆజ్ఞ', 'సంయమము', 'లోహశిలాదికములపై చెక్కబడు శాసనములు' అను అర్థముల నిచ్చును. ఇచ్చట ఈశబ్దము 'జననసంయమము' అను అర్థమున వాడబడెను. మన యనువాదకర్త యీపదమునకు తుల్యమగు నర్థము నిచ్చు 'సంతాన నిరోధము' అను శీర్షికగూడ వాడియున్నారు. ఇది సంతాననిరోధమును గూర్చి వ్రాయబడిన తొమ్మిది ప్రకరణములు గల సంపూర్ణ శాస్త్రీయగ్రంథము. ప్రథమాధ్యాయము సంతాననిరోధావసరములను దెలియఁజేయును. ఇందు ఆదాయము ననుసరించి మధ్యతరగతి కుటుంబములలో నుండవలసిన బిడ్డల సంఖ్యను దెల్పుపట్టీ చూపఁబడెను. సామాన్యజీవనాధారములు గలిగిన మధ్యతరగతివారు ఋణగ్రస్తులై దాని బారినుండి యెన్నటికిని తప్పించుకొనలేరక యెట్లు అగచాట్లు పడుచున్నదియుఁ జాపుటకు విపులముగ నుదాహరణము లీయఁబడినవి. హిందూకుటుంబమునకు వచ్చు ఆదాయము —అవసరములు నిరూపింపఁబడినవి. మఱియొక భాగము తల్లి యారోగ్యమునుగూర్చి తెలుపుచున్నది. ద్వితీయాధ్యాయము సంతానోత్పత్తి ధర్మముల వివరించుచున్నది. మూఁడు మొదలు ఏడవ అధ్యాయములు సంతాననిరోధమునకు అనేక పద్ధతులను బోధించుచున్నవి. వీనిలో యంత్రపద్ధతులు, ఔషధపద్ధతులు, అన్యపద్ధతులు గలవు. అష్టమాధ్యాయము సంతాన నిరోధమునకు ప్రతికూలురచేఁ గల్పింపఁబడిన అవరోధములఁ జర్చించుచున్నది. నవమాధ్యాయము సంతాన నిరోధోద్యమ చరిత్రమును దెలుపుచున్నది. పుస్తకములోని ముఖ్యభాగము సంతాన నిరోధపద్ధతులను దెలుపునదియే. శస్త్రవిధానమే కాక పూర్వప్రసిద్ధమగు తాంత్రిక ఆయుర్వేద విధానములు కూడ వ్రాయఁబడియున్నవి. వానిని గుణించి గ్రంథకర్త సందేహముతో తన యభిప్రాయమును వెల్లడించుచు నవీనశాస్త్ర గ్రంథములలోని పద్ధతులను బాగుగా తర్కించియున్నాఁడు. అవి సర్వజనులకు ఆచరణసాధ్యములై ప్రతివారికి అత్యంతోపయోగముగ నెంచఁబడుచున్నవి. మన అనువాదకర్త అతి జాగరూకతతో తనవిధిని నిర్వహించియున్నాఁడు. అనువాదకర్త భాషాంతరీకరింప వలసిన యోగ్యతను గలిగియుండుటలో సందియము లేదు. ఈపుస్తకము చదువునప్పుడు కొన్ని విషయములు అనువాదకుఁడు స్వతంత్రముగ నొక గ్రంథమును రచించిన బాగుగా నుండెడి దనితోఁచినది. కాని అనువాదకర్తకు ఈవిషయమున సమగ్రముగ గ్రంథపరిశోధన లేదు. ఈయనకు సమగ్రముగ ఆంగ్లభాషా పరిచయము లేదు. వంగభాషాపరిచయము ఎక్కువగా నుండుటచే ఈపుస్తకము వెలువడుటకుఁ గారణమైనది. వీరత్యుత్సాహముతో ఈభారమును వహించి యీకార్యము నెఱవేర్చినందుల కెంతయు నభినందన పాత్రులు. పుస్తకములోని విషయములఁగూర్చి యెక్కువగా వ్రాయవలసిన యగత్యము లేదు. గాని యిట్టిపుస్తకమునకు పీఠిక వ్రాయుటలో ఈయుద్యమమును గూర్చి కొన్ని యభిప్రాయముల నిచ్చుట నాకర్తవ్యమని మీరు తలంపవచ్చును.

'డాసన్ ప్రభువు' చెప్పినట్లుగ ఈయుద్యమ ప్రతికూలురు ఏమి చెప్పినను, చేసినను, ఈయుద్యమము నశించునది కాదు. 'బక్‌మాస్టరు ప్రభువు' 18-4-1926 వ తేదిని ప్రభువులసభలో నిట్లుపన్యసించెను: "మానవుఁడు శాంతి

కొఱఁ కల్లెడల నన్వేషించుటయు, నన్నిరెడల నాశాభంగము నొందుటయు జీవితములోని బాధలలో నొక్కటై యున్నది. ఒకస్థానము నాక్రమించిన వెంటనే మఱియొక స్థానము నన్వేషింపవలసిన యవసరము గలుగుచున్నది. నిరంతరము తారుమారగుచుండెడి పరిస్థితులను జీవితమును అనుసరించి పోవుచుండుటయే అభివృద్ధికి సాధనము." ఆయన నివేదికను సంతాననిరోధ సమస్య బలపఱచుచున్న దని చెప్పెను. "ఏబదేండ్లకు పూర్వమది క్రొత్త. దాని ననుసరించిన ప్రజలు నేరస్థులుగ భావింపఁబడి శిక్షార్హులగుచుండెడివారు. అందుచే ప్రజలు భీతిలిరి. భాగ్యవంతులచేఁ బొందఁబడి యనుభవింపఁబడు విజ్ఞానమును బీదలకు లేకుండఁ జేయుటకు చర్య తీసికొనుచుంటిమా యనువిషయము వివాదాంశము."

భారతదేశదురదృష్టవశమున ప్రభువరుని అంత్యవాక్యములు యూరోపా ఆఫ్రికా ఖండముల విషయమై నిజమైనను భారతదేశ విషయమున కాదు. ఇచ్చట విజ్ఞానము భాగ్యవంతులకును, బీదలకును సున్నయే. బీదల విషయమై ఆలోచించినచో ఇతర దేశములవలెనే యిచటను పెక్కు ఇడుములఁ గుడుచుచున్నారు. వీరిలో సంఖ్యాభివృద్ధియేకాని గుణాభివృద్ధి లేకపోవుటచే బాధలపాల్పడుచున్నారు. "అన్నార్తులై కాయకష్టముచేసి జీవించువారి సంఖ్యను ధనాధిపుడు మిత్రవర్గముగఁ జేసికొను" నని స్ప్యాంగరు తన యొకానొక గ్రంథమున వ్రాసెను. సంతాననిరోధోద్యమమునకు వ్యతిరేకముగ నుండుట 'కారల్ మార్క్' యొక్కయు, అతని ప్రప్రథమపు అనుయాయులయొక్కయు గొప్పపొరఁబాటని యిప్పు డనుభవపూర్వకముగ గుర్తింపఁబడెను. సాంఘికతత్త్వము సంతాననిరోధోద్యమముతో సమ్మేళనము చేయఁబడినచేకాని మానవజీవితసమస్యలు పరిష్కరింపఁ బడనేరవు. నా మిత్రుఁడు దివానుబహద్దరు రంగాచారియరుగారు ఆస్ట్రేలియానుండి తిరిగి వచ్చినపుడు ఆ దేశములోని ఆర్థికౌన్నత్యమును గూర్చి ఆసక్తితో విపులముగ నుపన్యసించుచుండెడివారు. కాని శ్రోతలకచటి ఆర్థికౌన్నత్యమునకు నిజకారణమును విశదీకరింపలేదు. ఆకారణ మేదియన, చదరపు మైలున కొక్కఁ డున్నను అచట సంతాన నిరోధము ప్రజలచే అవలంబింపఁ బడుచుండుటయే.

భారతదేశమున మనము పరిష్కరింపవలసిన సమస్యలు రెండు గలవు: అందొకటి జనసామాన్యమును పైకిఁ దీసికొనివచ్చుట, మఱియొకటి కొన్నితరగతుల వారికి సంతాననిరోధ విషయమున శిక్ష గఱపుట. బహువిస్తీర్ణమై 32 కోట్ల జనసంఖ్యను గలిగిన భారతదేశమున బొంబాయి కలకత్తాలయం దున్న రెండు మాల్తూజియను సంఘములు సరియగు పని చేయుటకుఁజాలవు. జనసంఖ్యలో ప్రపంచమున చీనాతర్వాత భారతదేశ మున్నతస్థాన మాక్రమించుకొనుచున్నది. యుద్ధానంతరమున నిరుద్యోగ సమస్య భారతదేశమున విపరీతముగఁ బెరిఁగి పోయెను. నిష్పక్షపాత బుద్ధితో విచారించిన ప్రతివారికి నిర్లక్ష్యముగ సంతానాభివృద్ధి చేయుటయే ప్రస్తుత కలకత్తలకుఁ గారణమని తోఁపకపోదు. జీవితాందోళనము నేఁడు తీవ్రమైనది. రాజకీయ నాయకులును, తదితరమగు నుద్యమ నాయకులును దీనికి ముఖ్యకారణము మితిమించిన జనాభివృద్ధి యని గమనింపక అన్యములగు సాకులను జెప్పి భ్రమించుచున్నారు. 'కార్స్ ఆండర్స్' అను నాయన 'జనసంఖ్య' అను పుస్తకమున వ్రాసినట్లు, ప్రతిదేశమందును నాగరికత యేదో యొకస్థితియందున్నపుడు తదనుసరణముగ జనసంఖ్య పరిమితమై యుండవలెను. సర్వకాల సర్వావస్థల యందును ప్రతిదేశము ఒకేపరిమితి సంఖ్యను పోషింపఁగలుగునని దీనియర్థము కాదు. అట్లనుకొనుట తప్పు. కార్స్ ఆండర్స్ అట్టి నేరమునకు గురియగుట లేదు. ప్రతిదేశముకూడ నభివృద్ధినొందుచున్నపుడు ప్రతి యవస్థయందును పరిమితిగల సంఖ్య మాత్రమే సౌఖ్యము నిచ్చుచు పోషింపఁగల్గును. పరిమిత జనసంఖ్యకును, నాగరికతకును అత్యంత సంబంధము గలదు. ఆదృష్టితోఁ జూచినయెడల ప్రస్తుతము చెన్నరాజధాని చ. మై. 298 గురును పోషింపఁ జాలదని తోఁచుచున్నది. ఈరాష్ట్రములో గంజాము, విశాఖపట్టణము గోదావరిమండలములలోని విస్తారమగు భూములుగల యేజన్సీ ప్రదేశములును, నెల్లూరు దత్తమండలములలోని కొండప్రదేశములను చేరియున్న వని తెలిసికొనినప్పుడు కొన్ని భాగములందు పూర్తిగా మితిమించిన జనసంఖ్య యున్నదని కనఁగొనుము. తంజావూరు చ. మై. 625;

దక్షిణార్కాటు చ. మై. 550; మలబారు చ. మై. 525; మద్రాసు, చెంగల్పట్టు, వేలూరు, దక్షిణార్కాటు, తంజావూరు, రామనాథపురము, మధుర, తిరునెల్వేలి మలబారు మండలములను విచారించిన గ్రేటుబ్రిటనువలె చ. మై. సగటున 482 జనసంఖ్య తేలినది. ప్రస్తుత రాజకీయ ఆర్థిక పారిశ్రామిక పరిస్థితులలో జనసంఖ్యలో గ్రేటుబ్రిటనునకు సమానముగ నుండుటకు మద్రాసు రాజధానికి అర్హతకలదా? అను ప్రశ్న ముదయించును. కాని, గ్రేటుబ్రిటనువిషయము వేరని మనము గుర్తెఱుంగవగును. ఇంగ్లండునందును, వేల్సునందును చ. మై. 649 జనసంఖ్య. ఇంత జనసంఖ్యగల ప్రదేశము మఱియొకటి లేదు. బెల్జియము, జర్మని యెక్కువ జనసంఖ్య కలిగియున్నప్పటికిని విస్తీర్ణమునందు మిక్కిలి చిన్నవి. అంత జనసంఖ్య నే యితర నాగరిక దేశములలోను లేదు. అమెరికా సంయుక్తరాష్ట్రములు చ. మై. 35 మాత్రమే. అది నూతనముగా కనిపెట్టఁ బడినదియు పూర్తిగా అభివృద్ధి నొందనట్టిదియు నగు దేశము అగుటవలన ఇంకను ఎక్కువ జనసంఖ్యను గలిగియుండుటకు వసతులు గలవు. కాని డెన్మార్కులో చ. మై. 204, ఫ్రాన్సులో చ. మై. 184 అయినప్పుడు దక్షిణ హిందూదేశమునందు చ. మై. 482 జనసంఖ్య యేల యుండవలెను? విశ్వవిద్యాలయముల నుండి వచ్చి యుద్యోగములకై పెనఁగులాడు పట్టభద్రుల సంఖ్యను, దానివలనఁ గల్గుచున్న సహింపరాని కులకక్షలను మనము గమనించినచోఁ గనీసము మధ్యతరగతుల యందైనను ఈసంఖ్యను ఎట్లు తగ్గింపవలయు నను నదియే యవసర సమస్య. పక్షపాతముతోఁ గాక న్యాయముగ నాలోచించిన సంతాన నిరోధోద్యమమును శాస్త్రీయముగ నెవ్వరు నెదిరింపఁజాలరు. ఈయుద్యమము ప్రపంచమునను్న ప్రతిభాశాలు లగుశాస్త్రజ్ఞుల యామోదముఁ బడసినది. దీనియందుఁ గలిగిన పక్షపాతము రెండువిధములు. ఒకటి సామ్రాజ్యతత్త్వము లేక సైనికము. మఱియొక మతము రాఁబోవుయుద్ధమునకు సైనికులను సిద్ధము చేయుటకై కుతూహలపడు రాజకీయ ధురంధరులు, సంతాన నిరోధోద్యమము నరికట్టిన ఫ్రెంచిగవర్నమెంటు చర్యయు, ప్రభువులసభలో 'మార్క్వెస్ ఆఫ్ సాలిస్బరి' యిచ్చిన యుపన్యాసము దీనికి తార్కాణములు. కాని హిందూదేశమునందలి క్షత్రజాతులు కొన్నిమాత్రమే యీవిషయ మాలోచింపఁదగును. హిందూదేశరక్షణవిషయమై తదన్యుల కట్టి సంబంధమును లేదు. మీదుమిక్కిలి ఐరోపాసంగ్రామము జరుగనున్న వారికివలె హిందూదేశమునకు ప్రస్తుత మంత యవసరమును లేదు. ఈవిషయమున మతసంబంధమగు పక్షపాతము గలవారు రోమనుకాథలిక్కులు. ఈపక్షపాతమువలన మూఢవిశ్వాసము ఎక్కువగ వృద్ధి యగు ననుటకు ప్రభువులసభలో వైకౌంటు ఫిట్జు అలెన్ ప్రభువు ఇచ్చినయుపన్యాసమే తార్కాణము. దీనితోపాటు తదితరప్రభువుల యుపన్యాసములు చదివిన నెంతయో విచారకరమగు దృశ్యము కానగును. ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్బరిగారి యుపన్యాసమును తిలకించినచో ఈమతసంబంధమగు పక్షపాతము కొంచెము తక్కువెగను, సహేతుకముగను ఉన్నట్లును గనఁబడును. కాని వారి నిస్సారమగు వాదమును వారికిముం దుపన్యసించిన బక్మాస్టరు ప్రభువుగారును, వారికి తర్వాత నుపన్యసించిన బాల్ఫరు ప్రభువుగారును ఖండించిరి. ఎచట నీ రెండువిధములగు పక్షపాతములు లేవో అచట సంతాన నిరోధమున కభ్యంతర ముండనేరదు; ఉండఁదగదు. నూతన సమస్యలకు అభ్యంతరపెట్టు సాధారణప్రజలయొక్క పక్షపాతమును, మందబుద్ధిచేఁ గలిగిన పాక్షికాభిప్రాయమును నేను లక్ష్యపెట్ట నవసరము లేదు. ఈపక్షపాతము జ్ఞానముచేతను, తర్కము చేతను పటాపంచ లగును. ఈచిన్నశాస్త్ర మట్టిజ్ఞానమును వెదఁజల్లు ననునాశతోను, మానవాభివృద్ధికై తోడ్పడు ఈనవీనోద్యమమును ఆంధ్రులు ఆదరించుటలో ముందంజ వేయుదు రను నుద్దేశ్యముతోను నాయాంధ్రసోదరులు ఈపుస్తకమును చదువవలెనని హెచ్చరించుచున్నాను.

పునర్విమర్శనములు

కొన్ని సందేహములు

ప్రాచీనాంధ్ర శాసనములయందు పూర్వపండితులకు దురవగాహమైన వానిని శోధించి, నూతనాంశములను బయలుపఱచుచు, వ్యాఖ్యానసహితములుగ ప్రచురించుచు పరిశోధకపండితబృందమునే కాక ఆంధ్రలోకమునంతటిని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తుష్టినంద జేయుచున్నారు. అయినను వారు వ్రాసినవిషయములలో సంశయాస్పదములు పెక్కులు గలవు. అందు ముఖ్యమైన వానిని ఇచ్చట బొందుపఱచుచున్నాను. వాని విషయమై శాస్త్రిలుగారికిని నాకును కొంతచర్చ జరిగినది. నా సందేహములు నివృత్తి కాకపోటచేతను, ఇట్టి సందేహములే కలిగినవారితరులు గలరేని, వారి యుపయోగము కొఱకును, నాసందేహములను భారతికి నివేదించుకొనుచున్నాను.

౧. నాగబు:—దీనినిగురించి ప్రభాకరశాస్త్రిగారిట్లు వ్రాసియున్నారు: "ఈ యక్షరము లించుమించు క్రీ. శ. ౨ వ శతాబ్దినాటి బ్రాహ్మీలిపి యక్షరములు. పైశాసనమును బ్రకటించిన రమాప్రసాదచందా గారు దీని నింగ్లీషులో 'Naga-bu' అని ప్రకటించిరి. వారు 'నాగ' వేఱుపదముగాను, 'బు' వేఱుపదముగాను, 'నాగబు' సమస్తపదముగాను దలచి యట్లు వ్రాసిరి. దానిని వారు శిల్పకారుని పేరు గావచ్చుననిరి. అది పాళీభాషాపద మనియే వారు తలచియుందురు. నేను చూచినంతలో పాలిభాషలో నిట్టిపదము కానరాలేదు. ఇది తెలుగు ప్రత్యయాంతమైన తత్సమపదమని నాతలంపు. నాగబు అనగా నాగంబు, పాము అని యర్థము. విరుగగొట్టబడిన మీదిశిల్పచిత్రము గొప్పసర్పమై యుండును."*

ఇందు గమనింపదగిన విషయములు కొన్ని గలవు. చందాగారు తలచినట్లు శిల్పిపేరును దెల్పునామపదమే యైన పక్షమున, అది యేభాషకు సంబంధించిన పదమని చెప్పుటకు వీలుకాదు. అట్లుగాక శాస్త్రిగారి మతము ప్రకారము నాగంబు అయినా అది తప్పక తెలుగే కావలయును. "ఇంచుమించు రెండువేలేండ్ల క్రింద తెలుగు" ఉండెనా? ఈవిషయమును నిర్ధారణ చేయుటకు "నాగబు" సాధకము కానేరదు. ఏలన, "నాగబు" తెనుగా యని శంకించినయెడల యెప్పుడు తెను గుండెనా యని ప్రశ్న చేసికొంటిమి. కావున వేరు ఉదాహరణములవల్ల రెండువేలేండ్లక్రింద తెను గుండెనని నిర్ధారణ చేసినగాని, నాగబు తెలుగను వాదమునకు పుష్టి కలుగదు.

పోనీ, పాముబొమ్మ యైన నుండి దానిక్రింద ఈ "నాగబు" వ్రాయబడియున్న, శాస్త్రిగారి వాదము నంగీకరింపవచ్చును. సర్పచిత్రము మృగ్యము. అట్టిచిత్రమొకప్పు డుండెనని యనుమానించుటకుగూడ వీలు లేదు. మన దేశమున సర్పప్రతిమలక్రింద "నాగ"మనికాని, "పా"మనికాని వ్రాయువాచారముండిన ఈ "నాగబు" పైన సర్పప్రతిమ యుండెనని యూహించుట కవకాశముండెడిది. వేనవేలు సర్పప్రతిమలను జూచియున్నాము గాని ఇంకను క్రింద పామని వ్రాయబడియుండు శిల్పమును చూడలేదు. అట్టి యుదాహరణములను కొన్నింటిని చూపించినగాని ఈ "నాగబు"పై సర్పచిత్ర ముండెనని నమ్ముటకు వీలులేదు. అయితే శాస్త్రిలవారొక సామ్యమును జూపిరి. అమరావతీస్తూపములలో ననేకములగు చిత్రములక్రింద పేర్లు కలవు. ఇదియును అట్టిదేకదా? కాదు: అవి జాతకకథలయొక్కయు, బుద్ధలీలలయొక్కయు చిత్రములు. కావున వానిక్రింద పేరు వ్రాయుట యవసరము. అమరావతీస్తూపమున సర్పచిత్రము లెన్నియేని గలవు. ఎచ్చటను 'నాగబు' అనుమాట కానరాదు. ఏమియు లేని "నాగబు" అనుమాటపై సర్పప్రతిమ యుండెనని యూహించుట వింతగదా!

౨. అహదనకరశాసనమున శ్రీశాస్త్రిగారు అనేక నూతనాంశములను వ్యక్తపఱచియున్నారు. ఇచ్చట మొ

* భారతి, సంపు. ౫, పుట ౯౩౮.


దట చెప్పవలచిన దేమనగా, శ్రీశాస్త్రిగారు శాసన భాషను తమ యిచ్చవచ్చినట్లు సంస్కరించియున్నారు. శాసనపాఠమునకును, వీరిపాఠమునకును పెక్కుస్థలముల యందు సంబంధ మున్నట్లగపడదు. ఈశాసనము ౨౧-వ పంక్తి కడపటిభాగమును శాస్త్రులవారిట్లు చదివియున్నారు: "రెణ్డువడల ఏలేమువరు లేములు" అని. శాసనమున నెట్లున్న దనగా, "రెణ్డువడలఎ లేవువరు లేములల"అని. ఇందు ముఖ్యముగ గమనింపవలసినది శాసనములోని "వు" అను నక్షరమును "ము" అని చదువుట. "లేములచె" అనుదానిలో "ము" ను పైయక్షరముతో బోల్చిన ఇవి రెండును ఒకేయక్షరము కాదనుట స్పష్టము కాగలదు. ఈతామ్రశాసనమున పెక్కు "ము" లు కలవు. అందొక్కటియు దీనిని పోలకుండుటయు, అన్ని "ము" లొక్కతీరుననుండుటయు చిత్రముగదా! శాస్త్రిగారట్లు చదువుటకు గల తేమో? "ము" అని చదువకున్న అర్థము కుదుర దనియా? అట్లగుచేని, మనకు అర్థముకాని యపూర్వపదములను మనచిత్తానుసారము మార్చి చదువుకొని చేత నయిన ట్లర్థము చెప్పవలసిన దేనా? ఈమార్గము నవలంబించిన ఏపదమున కేయర్థమును చెప్పుకొనరాదు?

"లేముల" అనుచో "లే" తప్పుగా బడినది; తొలగింపవలసినది. ఏలనగా, ఈపదమే తర్వాతిబంతిలో మరల వచ్చుచున్నది. అందు "ముళ" యనియే కలదు. తర్వాతి బంతి శాసనమున నిట్లున్నది:

"పినదియు చన్నవిరిపయి నాడు నరగళిన ఎళి ముళచేసిన సేయుడు." ౨౧ వ బంతిలోని "లేముల" అనునదియు, ౨౨ వ బంతిలోని "ముళ" అనునదియును ఒక్కటేపదమని మొదట నిర్ధారణచేసినగాని "లే తప్పుగా పడినది; తొలగింప వలసినది" అని చెప్పుటకు వీలులేదు. ఇవి రెండును వేర్వేరు పదము లేల కారాదు. కావనుటకు నిదర్శనము లెవ్వియేనియు కలవా? అట్టి నిదర్శనములు లేకున్నచో, ఆరెండుపదము లొక్కటియే యని తలచి సంస్కరింప బూనుకొనుట సాహసము. మఱియు ౨౨ వ బంతిలోని "ముళ" కు ముందొక "శ" కలదు. ఈ "శ" ప్రభాకరశాస్త్రిగారిచే పూర్వాక్షరముతో జేర్చబడుటచే "ముళ" యనుపద ముత్పత్తి యైనది. ఒకవేళ ౨౨ వ బంతిలోని పదము "శముళ" అగునేమో, అట్లగుచేని ౨౧ వ బంతిలోని "లేముల" లోని "లే" తప్పని తొలగింపవలసిన యవసర ముండదుగదా. ఇంతటికిని భాష పురాతనమైనది. మాటలకర్థము మనకాలపువారికి తెలియదు. మనపురాతన గ్రంథములు పండితులచే మరలమరల సంస్కరింపబడి "అప్టుడేటు"గా జేయబడినవి. అవి ప్రథమమున వ్రాయబడినట్లే యిప్పుడున్నవని చెప్ప శక్యముగాదు. శాసనభాష పూర్వకాలమున వాడుకలో నుండిన భాష. పదముల స్వరూపమును నిర్ధారణచేసి యర్థము చెప్పునప్పుడు, తరచుగా శాసన భాషనే ప్రమాణముగ నంగీకరించుట యుక్తము.

"మరల కొన్డుకళ్" - "ఫ్లీటుగారును, లక్ష్మణరావు గారును 'సకలకొన్డుకళ్' అని చదివిరి. బర్గెసు పాఠముగూడ నిట్లే యుండును. సోమశేఖరశర్మ గారు కూడ నిట్లే యుదాహరించిరి. కాని యిందలి తొలి యక్షరమున 'మ' కాని 'స' కాదు. ఈ శాసనమునందలి తక్కిన 'స' 'మ'లను పరిశీలించిన నిది స్పష్టపడగలదు." అని శాస్త్రిగారు నుడివిరి. వారు వచించినట్లే పరిశీలించిచూచితిని గాని వారితో నేకీభవింపజాలనందుకు చింతించుచున్నాను. ఆ యక్షరము 'మ' కాజాలదు. 'స' అగుటయే నిశ్చయము. శ్రీశాస్త్రిగారు 33 వ పంక్తిలోని 'సకలలోకశ్రయ' అని చదివినపదములోని మొదటియక్షరమును 'మరలకొన్డుకళ్' లోని మొదటియక్షరముతో పోల్చిచూచిరేని అవిరెండును ఒక అక్షరమనుట బోధపడగలదు. 'సకలలోకశ్రయ' లోని 'స' ను 'మ' గ జదువవలయు నందురేమో! 'మరల కొన్డుకళ్' లోని రెండవయక్షరమును 'ర' గ చదివిరి. ఇటువంటి 'ర' ఇకనెచ్చటనైన కలదా? "తలకట్టు క్రింది యక్షరముతో సంధింపుటకు నిలువుగీత 'క' కారమున నుండును. ఈయక్షరమున కట్టు లేదు. అక్షరముతో నొట్టియుండవలసిన తలకట్టుకు స్థలము చాలక లేఖకు డింతుక ఎడముగా వ్రాసెను" అని ప్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు. దీనిని 'ర' గ చదువుట తప్పు; 'క' గనే జదువవలయును. సంధిగీటు వ్రాయబడి మాసిపోయియుండును. లేక 'క' రెండు విధములుగ వ్రాయు

వాచారమైన నుండియుండవలయును. 'ర' తలకట్టు అక్షరమునకు నొట్టియే యుండవలయును. తలకట్టుతో చేర్పఁబడిన 'ర' శాసనములయం దెచ్చటను గాన్పింపదు. స్థలము లేకపోవుట యెట్లు? ముందు 'ర' వ్రాసి కదా వెనుకటి యక్షరమును 'అ'ను వ్రాసి యుండవలయును? అట్టి సందర్భమున స్థలము లేకపోట యెట్లు సంభవించినది? బంతివంతయు వ్రాసిన పిమ్మట 'ర'ను ఇప్పుడు వ్రాయక విడుచుటను స్మరించి యప్పట ఇరికించె నందురేమో? శాసనములను వ్రాయువా రిట్టి సందర్భమున హంసపాదిని పంక్తిక్రింద పెట్టి పైన విడిచిన యక్షరములను వ్రాయుచుండెడి వారు. కావున నది 'క' అయినను కాకపోయినను, 'ర' మాత్రము గాదు. ఈమాటతో ఇంతవేపు నస్తిపట్టియు తుదకు తామే ఓటమి వారు. 'మరల కొన్డుకళ్' తనగూఢార్థము శ్రీశాస్త్రిగారి కెఱుకపఱుపక తిరుగబడినది. కావున 'వారల కొన్డుకళ్' అని చెక్కవలసిన దానికి శాసనము చెక్కినవాడు ప్రమాదముగా 'మరలకొన్డుకళ్' అని చెక్కెను అనుటపూర్వము యుగంధరుడు "పోవుభూతమా చెట్టుకొమ్మను విరుచుకొని పోవుముగాక" యన్నట్లు "పాడుచెక్కడపుపనివా డీనిందను మోయుముగాక" యని తలచినట్లున్నది. శాసనములోని మాటకును, వారిపాఠమునకును సమన్వయమునకు ఒండొంటి కెంతదూరము! శాస్త్రిగారు తమయూహను శాసనములోనికి చొప్పింప బ్రయత్నించిరే కాని శాసనపుమాట కర్థము చెప్పలేకపోయిరి. 'మరల కొన్డుకళ్'లో 'న్డు' అను నక్షరమును 'న్థు' అని పూర్వపరిశోధకులు చదివిరి. ఈ సందర్భమున ప్రభాకరశాస్త్రిగారు కేవలము పొరపడినట్లు తలచెదను. "కొన్డుకళ్" అని శాస్త్రిగారును, "కొన్థుకళ్" అని ఇతరులును చదివినపదములో 'ను' క్రింద ఈ



సంకేతములున్నవి. దీనిని లిపిశాస్త్రజ్ఞులు సామాన్యముగ 'థ'గ చదువుట వాడుక. కదాచిత్తుగా 'ధ' యని చదువుటయు కలదు. దీనిని శాస్త్రిగారు "డ" అని చదువవలయు ననుచున్నారు. శాస్త్రిగారి వ్యాసమును చదివిన పిమ్మట పైసంకేతములుగల పెక్కుశాసనములను పరిశీలించి చూచితిని. నాపరిశోధనయొక్క ఫలితమును విపులముగ మఱియొకసమయమున వ్రాసెదను. మొత్తముమీద దీనిని 'థ' యని చదువవలసినదనియే నాయభిప్రాయము. ఈసందర్భమున శాస్త్రిగారు చెప్పిన రెండుమూడువిషయములను గూర్చి యించుక విచారింపవలసియున్నది.

౧. "కొన్థుకళ్" అని యితరులు చదివినదానిని "కొన్డుకళ్" అని చదివి " 'డ'కు లిపిలో రెండురూపములుండెడి"వని చెప్పినారు. ఇది వింతగాదు. 'బ'కు రెండు సంకేతము లుండుట నే నిదివఱకే నిరూపించియున్నాను. అటులే 'డ'కు రెండుసంకేతము లుండినను ఉండవచ్చును. అయితే శకటరేఫమున కేల రెండుసంకేతము లుండియుండరాదు? అం దొకటి 'ఱ,' రెండవది ప్లవమార్కుపైని గుండ్రని గీటు ఉండునది. ఇం దసాధ్య మేమున్నది? ఇది 'డ'కారమే కాని 'ఱ'కారము కాదని నిశ్చయించి చెప్పుట యెట్లు?

౨. కృష్ణశాస్త్రిగారిచే ప్రకటితమగు సత్యాదిత్యచోళమహారాజు శాసనములోని "శత్యాదిత్యున్ఱు, ఎఱుచున్ఱి, పచ్చువన్ఱు, వాన్ఱు" ఇత్యాదులలోని 'ఱ'ను 'డ'గ చదివి, "శబ్దనిష్పత్తి శాస్త్రరీతినిబట్టి పరిశీలింపగా ద్రవిడభాషలోగాని, కర్ణాటభాషలోగాని 'ఆదిత్యుడ్డు, ఈడ్డి, పాడ్డు, వాడ్డు' అనురూపముల యునికి దెలియదయ్యెను. ప్రసిద్ధులైన ద్రవిడకర్ణాటపండితులవలన నీవిషయము నెఱిగితిని" అని ప్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు. పైశబ్దములోని 'ఱ' కారము బహువచనమును సూచించు ప్రత్యయమని నాతలపు. మనము 'వాడు' యొక్క బహువచనము 'వాళ్లు' అనుచున్నాము. మన పూర్వికులు 'వాన్ఱు' అనెడివారు. రేఫము బహువచనమును సూచించుట కన్నడభాషయందు గాననగును: 'పేర్ని, కూతుర్గళి, పద్రి, బర్ని' ఇత్యాదులు. కావున కృష్ణశాస్త్రిగారు 'ఱ' యని చదువుటయే సముంజసముగ నున్నది.

3. చిఱుంబూరు:—"పై సత్యాదిత్య శాసనము ౧౩ వ బంతిలో 'చిఱుంబూరి' కలదు. ఇది స్పష్టముగా బండి 'ఱ' కంటె వేఱు అడ్డుగీత లేక 'జ' వంటి

యుచ్చారణముతో నున్న యక్షరముగానే యున్నది. ఇట్లున్నను కృష్ణశాస్త్రిలుగారు 'చిలుంబూరు' అనుదాని 'చిఱుంబూరు' అని చదివిరి. అది 'చిలుంబూరు' అని చదువుటే సరియని నా నమ్మకము. ఏలనగా నా గ్రామమిప్పుడు 'చిలుమ్మూరు' అనుపేర నున్నది." అని ప్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు.

పై శాసనపు ప్రతిబింబమును సోమశేఖరశర్మగారికడనుండి గైకొని జాగ్రత్తగ జదివితిని. శాస్త్రిగారు భ్రమ పడిరని యప్పుడు తెలిసికొంటిని. ఏలన, 'చిలుంబూరు' అను మాటలోని రెండవయక్షరము 'లు' కాదు. శాస్త్రిగారు తలచినట్లు అద్దుగీత లేకపోలేదు. స్పష్టముగ నగపడుచున్నది. కావున ఆయక్షరము 'ఱు' అగునే కాని 'లు' కాజాలదు. కృష్ణశాస్త్రిగారు 'చిఱుంబూరు' అని శాసనము నున్న తీరుగనే చదివిరి.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తలచినట్లు, 'చిలుంబూరే' నిజమైన పాఠము అని వాదమునకై యొప్పుకొన్నను, 'చిలుంబూరు' 'చిలంబూరు' 'చిలుమూరు' 'చిలమ్మూరు' అగునే కాని 'చిలుంకూరు' కాజాలదు. కావున శాస్త్రిగారిపాఠము తప్పని నేను తలచుచున్నాను.

మఱియు 'నాగలు' విషయమై ప్రభాకరశాస్త్రిగారిట్లనుచున్నారు. 'నాగమ్ము' అనుపదమునకు ద్విత్వశైథిల్యమును, పూర్వహల్లోపమును గలుగుటవల్ల 'నాగలు' అనురూప మేర్పడినది. దీనికి ఉదాహరణములు నన్నెచోడుని కుమారసంభవమునుండియు, అద్దంకిశాసనమునుండియు జూపియున్నారు. 'నాగలు' క్రీ. శ. ౬-వ శతాబ్దినాటిది. ఉదాహరణములు క్రీ. శ. ౯-౧౦ శతాబ్దములనాటివి. కావున, 'నాగమ్ము'నకు ద్విత్వశైథిల్యపూర్వహల్లోపములు గలుగుటచే నది 'నాగలు' అయ్యెనని ఋజువుచేయుట కీయుదాహరణములు పనికిరావు. క్రీ. శ. ౨, ౩ శతాబ్దములనాటి శాసనములనుండి యుదాహరణముల నెత్తిచూపిన మిక్కిలి యుపయుక్తముగ నుండును.

యన్. వెంకటరమణయ్య

తెలుఁగుచేసిన సీలు గేమా !

కవిసార్వభౌముఁ డను కూచిమంచి తిమ్మకవీంద్రుని సర్వలక్షణసారసంగ్రహములోని కొన్ని లక్షణములనుగూర్చి 'వజ్రాయుధ పత్రికా వ్యాసవిశేషిక'కుఁ గలిగిన సందేహములలో ముఖ్యము లైనవానికి సమాధానముగా భారతీపత్రికారత్న శ్రావణమాససంచికయందు (సంపు. ౮, సంచి. ౮) నేనొకవ్యాసమును బ్రకటించితిని. బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, నా వ్యాసమును గొంతవఱకుఁ బోషించుచు, గొంతవఱకుఁ దమకుఁ గలయభిప్రాయభేదమును కార్తికమాససంచికయందు (సంపు. ౮, సంచి. ౧౧) ప్రకటించినారు.

ఆ నా వ్యాసమునకు వజ్రాయుధపత్రికయం దేదే వినోగా ప్రత్యుత్తరము లీయఁబడియెను గాని యవి గణింపఁబడఁదగినవిగా నుండలేదు. ఏమన, గసడదవాదేశము నుగూర్చిన "న వికృతిశబ్దా త్పరతః సాంస్కృతికానాం భవన్తి గసడదవాః" అనుసూత్రము జెనిపోయుండవలయు నని కాఁబోలు, అవిలేఖకుఁడు దానిని వన్నియభట్టారకుని మెడకుఁ దగిలించినాఁడు! మఱియు నేను జూపిన శిలాశాసనప్రయోగము లాయనకు డాలు అప్పలు నయ్యెను; వేలువేలుకవుల భిన్నప్రయోగములు నయితము లేఖకప్రమాదములే యయ్యెను! ఇఁక నాయన చిత్తమే ప్రమాణము!

చిన్నకోట పెద్దనకవీంద్రుఁడు 'ప్రథమపాంతేఁ బను కచటతపలకు గసడదవ లగు' నని వ్రాసినలక్షణమున, "తెలుఁగులమీఁది సాంస్కృతికంబుల కని చెప్పఁబడియుండ లే" దని పత్త్రికాధిపతిగారు వ్రాసినారు. ఆతఁ డిచ్చినలక్ష్యమును జూచియుండియు వారట్లు వ్రాయుట చిత్రమే! ఎల్ల ప్రథమలకు (సంస్కృతాంధ్రశబ్దప్రథమావిభక్తుల కన్నిటికి) నియ్యాదేశము గలుగు చుండుటచే నాతఁడు వేఱుగఁ దెలుఁగులమీఁది సాంస్కృతికంబుల కని వక్కాణింపలేదు. లక్ష్యము నరయఁదగును.

ఇప్పట్టున సంధ్రభామగతి యించుకంత విచారింపవలసినదే.

"నాల్గుం జెల్లెడి బ్రహ్మచారిగృహివా
నప్రస్థయత్యాశ్రమం
బు గైవల్య ... ... వీ
ర ల్గోపించిన ... ... "

ఉత్తర హరివంశము, ౪ ఆశ్వా.

ఇందు, (1) ఆశ్రమంబుల్ + కైవల్య—అనునప్పుడు కకారము గకారముగ మాఱవచ్చునట! ఏల? రెండును సంస్కృతశబ్దములు గాన.

(2) వీరల్ + కోపించిన—అనునప్పుడు కకారము గకారముగ మాఱరాదట! ఏల? మొదటిది తెలుఁగుపదము, రెండవది గీర్వాణపదము నగుటచేత.

చూడుఁడు! పై రెంటను జివర నున్నది తెలుఁగు ప్రత్యయ మగు లకారమే (ల్)! పరుషమును సరళముగఁ జేయునది లకారపుఁబొల్లా? దాని వెనుక నున్న శబ్దమా? పొల్లు తెలుఁగుదైనను గీర్వాణశబ్దమును జేరుటచే గట్టిదైన దేమో! తెలుఁగుదాని యీపొల్లు పొల్లే కాఁబోలు! ఆహా! ఏమి యీసూత్రధర్మము! తెలుఁగు నేసిన పీలు గేమో!

ప్రథమలపైవచ్చు కచటతపలకు గసడదవ లాదేశమగుటనుగూర్చి ప్రభాకరశాస్త్రిగారికిని నాకును గల యభిప్రాయభేదము కొంచెమే. అయ్యాదేశము నిత్యమని నేను వ్రాసితిని. బహుళముగాఁ గానవచ్చుచున్న దని వారు వ్రాసిరి. బహుళమనుటకుఁ బ్రమాణములుగా బసవపురాణ పీఠికయందు వారు చూపిన బద్దెన భాస్కరుల ప్రయోగములు రెండును బలువ్రాఁతప్రతులలోఁ బరిశీలింపఁదగినవై యున్నవి. ఒకవేళ వ్రాఁతప్రతుల నన్నిట నట్లేయున్న, నవి ప్రయోగస్వాతంత్ర్యమును దెలుపునే కాని సూత్రవిచ్ఛేదమును జేయఁజాల వని తలంచెదను.

గసడదవాదేశమును గూర్చి నేను చూపిన ప్రయోగములకుఁ దోడుగ, ముద్రితకేయూరబాహుచరిత్రమున లేని నూతనప్రయోగమును వ్రాఁతప్రతినుండి తెచ్చి లోకమునకుఁ బ్రకటించిన శ్రీ శాస్త్రిగా రెంతయు నభివంద్యులని వేఱుగ వ్రాయనక్కఱ యుండదు.

స్థానశబ్దవిచారములు

శ్రీనాథాదిమహాకవులచేఁ బ్రయోగింపఁబడి యతిస్థానముచే సమర్థింపఁబడుచున్న స్థానశబ్దసతకారమును గూర్చి ప్రభాకరశాస్త్రిగారికిని నాకును నించుకంత యభిప్రాయభేదము గలదు. ఈశబ్దముతోడి యతిస్థానము గలపూర్వకవీంద్రప్రయోగముల నన్నిటిని మార్చి సాహసించిన "వజ్రాయుధ పత్రికావ్యాసవిశేఖరి" వలెఁగాక శ్రీశాస్త్రిగారు దానికి వేఱుగతి గల్పించి యాప్రయోగములను నిలిపినారు. ఏమైన నేమి? మా 'తా' మాకున్నది!

తకారమునకు యతి సెల్లునట్లు స్థానశబ్దమును పూర్వమహాకవులు ప్రయోగించినదాని కాధారముగాఁ గానవచ్చిన ప్రాతిశాఖ్యసూత్రమును నేను చూపితిని. ప్రాతిశాఖ్యము ఛందస్సునకుఁ జెందినది గాని భాషకుఁ గాదనియు, మునిత్రయమువారు, 'ఛందసి—భాషాయామ్' అని వేఱుపఱచి లక్షణములను జెప్పిరనియు వారు వ్రాసిరి. న్యాయమే. కాని యెల్లచోటుల నియ్యనుశాసనము చెల్లదు. ఒక్కయుదాహరణము:—

* "ఛన్దసి—పరిపన్థిపరిపరిణౌపర్యవస్థాతరి."

* శాత్రవార్థమున పరిపంథి పరిపరిశబ్దములు వేదమునమాత్రమే ప్రయోగింపఁబడును.

ఇయ్యనుశాసనమును గవీంద్రు లతిక్రమించి పరిపంథిశబ్దమును విపక్షార్థమున స్వేచ్ఛగాఁ బ్రయోగించినారు. తుదకది నిఘంటువులకు నయిత నెక్కినది! కావుననే,

"లోకేతు పరిపన్థిశబ్దప్రయోగో న న్యాయ్యః"

అనువాక్యము పుట్టినది! పరిపంథిశబ్దమునేకాక పరిపరిశబ్దమునుగూడ వైర్యర్థమున మన తెలుఁగుకవులు ప్రయోగించియున్నారు.

"పరిపరిపీలుకరుఁ బురత్క్షణముఁడు..." —రసికజన.

"ఛన్దసి—భాషాయామ్" అను మునిత్రయము వారి నియమ మిచ్చటఁ బరిగణింపఁబడలేదు. అట్లే (మునిత్రయమువారు తాఁక కున్నను) స్థానశబ్దమును మన కవులు వేదమునుండియే గ్రహించియుండవచ్చును.

మఱియు శ్రీశాస్త్రిగారు "ఋషులు, ఋషికల్పులు, నిరంకుశులు, వశ్యవాక్కులు నగు వ్యాసవాల్మీకి కాళిదాసాదికవులుగూడ నీస్త్రానరూపమును బఠింపరైరి! వేలకొలఁది యేండ్లనుండి వెలయుచున్నట్టియు, నతివిపులమైనట్టియు సంస్కృతభాషా వాఙ్మయమున నెక్కడను స్త్రానరూపము గానరాకుండఁగా, నిప్పటి కేనూఱేడులకు ముందున్న శ్రీనాథుఁడు సంస్కృతభాషామర్యాదా విరుద్ధముగాఁ దెలుఁగుకవిత్వములో వైదికవర్ణక్రమోచ్చారము గల స్త్రానపదమును బ్రయోగించె ననుట భావ్యమా?" అని వ్రాసిరి.

సంస్కృతభాషామర్యాదా (కేవల) విరుద్ధముగ 'త్రియమ్బకమ్' అని కాళిదాసుఁడు ప్రయోగించిన ఛందశ్శబ్దమునుమాత్రము వాల్మీకివ్యాసాదులు (తత్పూర్వులు) ప్రయోగించిరా? సంస్కృతకవి యగు కాళిదాసునకుఁ గల యాస్వాతంత్ర్యము తెలుఁగుకవి యగు శ్రీనాథున కేల లేకపోవలయును? అతఁడు మాత్రము నిరంకుశుఁడు గాఁడా! వశ్యవాక్కు గాఁడా?

తెలుఁగుకవిత్వమును సంస్కృతకవిత్వమువంటిదే. సంస్కృతమువలెనే యదియు వైదికవర్ణక్రమోచ్చారము గలపదములకుఁ జోటీయ నర్హమైనదియే. మఱియు సంస్కృతకవులంబోలె నాంధ్రకవులును ఋషులు, ఋషికల్పులు ననఁదగినవారే.

"ఏషా త్రిలిఙ్గభాషా సంస్కృతభాషాతుల్యా"
—మహాభాష్యకారులు.

"ఆన్ధ్రసంస్కృతభాషాభ్యాం కవిత్వంఋషితాప్రదమ్"
—కణ్వస్మృతి.

ఇట్టి పేరెన్నికగన్న పవిత్రమైన యాంధ్రకవిత్వమునందు శ్రీనాథునివంటి మహాకవి 'స్త్రానము' అను వైదికశబ్దమును బ్రయోగించుటయం దాక్షేపమా?

ఆహా! తెలుఁగు నేసిన పిలుగేమో!

పిమ్మట, ప్రభాకరశాస్త్రిగారు, వేదోచ్చారణము గలకొన్నిశబ్దాదుల నిచ్చి "వానివర్ణక్రమశబ్దోచ్చారరీతులనుగూడ నిఁక భాషలోనికిఁ జొప్పింపవలసినదే!" యని యాశ్చర్యపడినారు. అట్టివానిని జొప్పింపవలసినదని నేననను గాని చొప్పింపఁబడినవానినిమాత్ర మంగీకరించుట సమంజస మని యనియెదను.

తెనాలి రామకృష్ణుని యుద్భటారాధ్యచరిత్రమునుండి నే నిచ్చిన 'త్రియంబకం యజామహే' అను వేదవాక్య మనుకరణసహితము గావున నిరుపయోగ మని శాస్త్రిగా రనిరి. 'త్ర్యమ్బకమ్' అనియే కాని 'త్రియమ్బకమ్' అని విసంహితగా వేదమునందును లే దనియు, కాళిదాసుని ప్రయోగము 'త్రిలోచనమ్' అనునది యై యుండు ననియు నాతో వాదించిన కొందఱుపండితుల కొఱ కది వ్రాయఁబడినదే కాని యనుకరణయుక్తమగు టెఱుఁగక వ్రాయఁబడినది గాదు. అది చతురక్షరసహితమై యుండుటచే గణబద్ధమైన యాప్రయోగము వారికిఁగా నీయఁబడినది. మఱియు బృహద్వయము, పిశంగిల, పిలిప్పిల—ఇత్యాది వేదపదములు శాస్త్రసాధితములు గాకున్నను మనవారిచేఁ బ్రయోగింపఁబడిన వనియు, అట్టివానిని శాస్త్రము నిషేధింపఁజాల దనియు, నట్లే స్త్రానశబ్దముఁగూడ మనవారు వేదమునుండి తెచ్చియే ప్రయోగించినా రనియు, 'తాన' మనువికృతిపదమునకు 'స్త్రాన' శబ్దమే ప్రకృతి యై యుండు ననియు భావించియే నే నాయుదాహరణము లిచ్చితిని. "ఇట్టిప్రయోగములు పంతులుగారి వాదమునకుఁ బ్రయోజకము లగునా?" అని శాస్త్రిగారు వ్రాయుట వింతగానే యున్నది.

అనంతర ప్రభాకరశాస్త్రిగారు శ్రీనాథాదుల ప్రయోగములను సమర్థించుపొంటె 'తద్భవవ్యాజవిశ్రమ'గతిని వానికిఁగూడఁ జూపి, స్త్రానశబ్దమున మొదటి యక్షరమునకు తథదధలకు యతి సెల్లవచ్చునని లక్షణగ్రంథముల కొకక్రొత్తలక్ష్యమును సమకూర్చిరి.

విన్నాణము, విన్నపము మొదలగు వికృతిపదములకు మూలము లైన విజ్ఞానము, విజ్ఞాపనము మొదలగు ప్రకృతిపదములలోని 'జ్ఞ'కు తత్సవత్వము వ్యాజముగాఁ గల 'న'తో యతి సెల్లినట్లే 'తాన' మను వికృతిపదమునకు మూలమైన స్త్రానశబ్దమునకు తకారముతో యతి సెల్లింపవచ్చు నని వారు వ్రాసిరి. జ్ఞ న—ఈరెంటి యందును అనునాసికాధ్వని వినవచ్చును. ఆచుట్టఱికము

నకు తిస్య్కసత్వము తోఁడు గాఁగా, వాని కట్టి యతి చెల్లు ననుట యొకవింతగా గానరాదు. స్నానతానశబ్దములకట్టిచుట్టరికమును దెలుపునట్టి యేదియు వినఁబడదే! ఇది యెట్లు చెల్లును?

దీనికి శాస్త్రిగారు, "ఆయా దేశకాలములయందటు వంటి యటువంటి (స్త్నానము, స్త్నాతకము, స్త్నేహము మొదలగువానివంటి) యుచ్చారణరీతులు సామాన్యవ్యవహారమున నుండెడివి. అట్టివానిని బట్టికూడ వికృతులు వెలయుచుండును... 'తాన' మను వికృతి యిట్టివిధమున బుట్టియుండవచ్చును." అని యొకదానిని జూపిరి. దీనింబట్టి స్నానశబ్దము 'స్త్నాన' మని వ్యవహారమున నున్నకాలమున 'తాన' మనువికృతి పుట్టియుండు నని వీరియాశయ మైనట్లు స్పష్ట మగుచున్నది. ఆవ్యవహారమున నుండినస్త్నానశబ్ద మాకాలమునందు మాత్రమెక్కడ నుండి వచ్చినది? వేదమునుండియే వచ్చియుండవలయును. ఆశబ్ద మట్లు తకారము గలిగియుండుట కాధార మేది? ప్రాతిశాఖ్యమాత్రమే! కావున, తానమను వికృతిపదమునకు స్త్నానమే ప్రకృతి; స్నానముమాత్రము గాఁజాలదు.

కాళిదాసునిచే త్ర్యంబకమంబోలె శ్రీనాథాదులచే స్త్నానముగూడ వేదమునుండియే కైకొనఁబడి నిరంకుశముగాఁ బ్రయోగింపఁ బడియెను. అక్షరసామ్యమేమియు లేని తెలుఁగుశబ్దమును బట్టుకొని ఏదో ప్రకృతినుండి పుట్టిన వికృతిపద మని శాస్త్రిగారు మాత్ర మనఁగలరా?

స్నేహము—నెయ్యము; స్నిగ్ధము—నిద్దము:— ఇట్టివి వికృతు లనఁజెల్లునుగాని, స్త్నానముగాని స్నానము నుండి తానము పుట్టినదని పలుకుట సమంజసమా?

కావున శ్రీనాథాదులు ప్రయోగించినది (తకారముతో యతిచెల్లునది) స్త్నానశబ్దమే కాని స్నానశబ్దము గాఁజేరదు.

నడకుదుటి వీరరాజు.

శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటురచనము

ఈ మహాకార్యముయొక్క విధానమును గురించి భారతిలో నిటీవల విమర్శసమాధానములు మెండుగఁ గనఁబడుచున్నవి. ఇవి యీకార్యమునకు సహాయపడక చాలవఱకు వ్యర్థముగ నున్నవి. నిఘంటువునం దెట్టిపదములు చేరవలయును? ఎట్టిప్రయోగములు తీర్పవలయును? వ్యుత్పత్తి వ్యాకరణాంశములు సంస్కృత ద్రావిడాది సంబంధములు ఎంతవఱకు నిరూపింపఁబడవలయును? ఇట్టి ముఖ్యవిషయములను ప్రసంగములోనికి తీసికొనిరాక భారతీలేఖకులు స్వల్పవిషయములను విపులముగఁ జర్చించుచు కర్తవ్యమును ఉపేక్షించుచుండిరి.

ఈ మహోద్యమమునకు ఒకదశ కడచెను, రెండవదశ మధ్యకు వచ్చినది. ఫలితము కంటఁబడలేదు. జనులలో ఆతురతకలుగుట వింతకాదు. శ్రీ మహారాజాగారి యౌదార్యమును, అభిలాషయును సార్థకములగుట వారికిని, లోకులకును మహానందకరమగును.

నిఘంటుకార్యస్థానమునఁ గార్యక్రమము చతురముగ జరుగుచున్నది. అర్థ, ప్రయోగము, వ్యుత్పత్తి ఇతర భాషాసంబంధములను జాగ్రత్తగ విమర్శింపఁబడుచున్నవి. ముప్పాతికపని ముగిసినది, ఇది యక్షరరూపముఁ దాల్చుటకు ఒకటిరెండేండ్లు పట్టును. కార్యవిధానమున మాంద్యము కనఁబడదు. ఆంగ్లద్రావిడాది నిఘంటువులు రచించుటకును శతేండ్లు పట్టెను. ముద్రణకుముందుగ నివ్వన్నిగ్రంథమును నలుగురయినగురు ఆంధ్రపండితులు-రచయితలే కాక-పైవారును పరికించుట యవసరము. ఇట్టి యేర్పాటుచే అపార్థప్రమాదాదులకుఁ దావుండదు.

విమర్శనములో స్వల్పవిషయములకుఁ బ్రాధాన్యము కల్పింపఁబడెను. అభిప్రాయభేదములు ప్రకటించుట ఈసందర్భమున నిరుపయోగము. ప్రణాళిక చర్చింపవలసియుండఁగా లేఖములనుబట్టి వాదములల్లుట సమంజసముగాదు.

ప్రయోగములనుజూపు గ్రంథపట్టికలోని గ్రంథములన్నిటినుండియు ప్రయోగములు మాదిరిపదములలో

కవఁబడలేదనెడి యాక్షేపము నిరాధారము. కొన్ని చోట్ల గ్రంథములలోని పద్యసంఖ్యలు మాత్రముండి పద్యపాదములు లేకపోయినంతమాత్రాన హానియేమి? సంఖ్యనుదాహరించుట దోషముకానేరదు. ఇప్పటివ్యవహారము సమగ్రము కాదుగదా!

అంగపడి, అంగలార్చు, అంగవించు, అగుడెంచు మున్నగుమాటలనుగుఱించిన ఆక్షేపములు బలముగలవి కావు. ఇందు అభిప్రాయభేదము లుండనోపును. చేయక, చేయమి-లలో క, మి, వ్యతిరేకార్థబోధకములని వైయాకరణులందురు. కావ్యలను ప్రమాణముగ గొనమి తప్పుగాదు.

అంచుక, యించుక, అంగదట్టము, రిల్వర యేని మున్నగుపదములపై చర్చలు నిష్ఫలములు. అర్థచ్ఛాయలు కడపటి నిర్ణయములో తేలవలయును.

ఉపకారకముకాని ప్రసంగములు బాధించును. ఆర్జవము, గుణపక్షపాతము వ్రాతలకుఁ బెంపుఁ దెచ్చును.

జరుగుచున్న మహాకార్యమునకు విజ్ఞులు సాయపడుట యుక్తము. విత్తమును మహారాజాగారు విపులముగ ధారాళముగ నొసంగుచున్నారు. పెక్కండ్రు పండితులుచేరి చర్చించి నిర్ణయించుచున్న యీగ్రంథము గుణవంతముగ నుండుట న్యాయముగాదా!

ముద్రణమునకు ముందుగ విఖ్యాతపండితులను —నిఘంటునిర్మాణమున పాల్గొనని వారినిగూడ— చేర్చి సందేహములను నిర్ధారణచేయుట యుక్తము. ఈమహా నిఘంటువులో ఆంధ్రవ్యవహారమున మాత్రముండుమాటలకుఁ దావు లేకుండుట ఒకగొప్పలోపము. ఇది తీరునది కాదుగదా! విమర్శించువారు విశాలహృదయములతో విమర్శించుట న్యాయము. దోషారోపణమునకయి విమర్శించుట శోచనీయము.

గరిమెళ్ల సోమన్న.

సారంగధర వ్యాఖ్యానము

చేమకూరవాని సారంగధరచరిత్రో యను శీర్షిక క్రిందనే వ్రాసిన 'ఉప్పునైనట్టి చక్కెర లప్పలీడ' యనుపద్యమునకు వ్యాఖ్యానమును గుఱించి శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు వైశాఖమాస భారతీ పంచిక యందు గొంత విమర్శనమును వ్రాసిరి. అట్లు నాయుద్దేశమును జర్చించినందులకే నెంతయు గృతజ్ఞుడను. కాని యీపద్యమునందుగల 'చక్కెరలప్పలు' నా కిప్పటికిని గటువుగనే యున్నవనిన మన్నింపదగును. లప్పయనిన శబ్దరత్నాకరమున 'రాశి'యనియు, ప్రాంత్యమున 'ముద్ద' యనియు నర్థములుంటనే నెఱుగకపోలేదు. శ్రీ శాస్త్రిగారిచ్చిన పరిమాణార్థ మప్పుడు నిప్పుడు నాకనువగునట్లు గానరాకున్నది. శ్రీ శాస్త్రిగారీయర్థమును మిగుల జక్కగ సాధించిరనుట కించుకయు సందేహము లేదు. వారు సూచించినయట్లు లప్ప పరిమాణము లగుటచేతనే చక్కెరలప్పలని వాడుకపు రాజెల్లును. కాని పద్యమునందలి చక్కెరలప్ప లుప్పి చేయునదియుండి, యన్యపదార్థసమ్మేళనము నపేక్షించుచున్నవి. ఈకష్టము నాకు బోలె శ్రీ శాస్త్రిగారికిని గలిగెననుట నిశ్చయము. కావుననే, యెత్తికొనుటలో 'ధర్మారావుగారు స్వయముగ వ్రాసిన టీకగూడ దప్పుగానున్నదని చెప్పవలసి వచ్చినందుకుఁ జింతిల్లుచున్నాను' అని యారంభించి పరిమాణార్థకమగు 'పెడు' ను మిగుల సంభావించి, తుట్టతుదకు 'చక్కెరలప్ప లనగా చక్కెరప్రధాన ద్రవ్యముగానుంచి (ఉప్పి చేయునదిగాన చక్కెరమాత్రమే యగునేని ద్రవించిపోవును.) ముద్దపదనుగా జేసిన మధుర భోజ్యపు లప్పపరిమాణములని యర్థమగు' నని శ్రీ శాస్త్రిగారే వ్రాయక తప్పినదికాదు. వారొసగిన యీయర్థమునకును, నేజెప్పిన 'భక్ష్యవిశేషము'లను నర్థమునకును భేదము, తొలుత తాము సెప్పినట్లు జింతిల్లవలసినంత యెక్కువగాక యీషన్మాత్రమయి యుంటయు వారే గుర్తించిరి. అందువలననే 'ప్రకరణసాహచర్యాదులనుబట్టి యింతయర్థమిక్కడ పుట్టుచున్న'దని వ్రాసి తాము తొలుత నుగ్గడించిన నాతప్పును సాధించి తమ పరిమాణార్థమునకు ప్రాధాన్యము నొసగనెంచిరి. సంకల్పమెంతవఱకు సిద్ధించెనో యారయునది.

భక్ష్యమనిన నన్నుగావని తాము భోజ్యమనిరి. ఇట భేదపాఠములను గూర్చి పెనగులాడుట యేల?

సాహచర్యమువలన చోష్యమో, పానీయమో యయిన మఱియు సంతసింతును. భోజ్యమేయందము—అట్లనుటకు నాకభ్యంతరమేమియు లేదు; ఉప్పుట కనువుగ నుండుటకే భక్ష్యమంటిని—కాని, చక్కెరలప్పనెప్పుడు మనము భోజ్యముగ నంగీకరించితిమో యప్పుడే తన పరిమాణార్థమునకు ప్రాధాన్యము నశించునుగదా! ప్రక్రమమునుబట్టి చూచినను పరిమాణార్థమున నేమి స్వారస్యమున్నది? ఇంక శాస్త్రిగారిచ్చిన యర్థముతో నాపాదమునకు దండాన్వయము చూడు డెట్టులుండునో: ఉప్పునైనట్టి చక్కెరలప్పలీడేయునిన 'ఉప్పిచేయుటచేతనగు చక్కెర ప్రధానద్రవ్యముగా నుంచి ముద్దపడనుగా జేసిన మధురభోజ్యపు లప్పపరిమాణములు (తీయనగు వాటెలకు) సరియగునా' యని యగునుగదా! ఇదిలెస్సయో, 'ఉప్పిచేయనయినభక్ష్యములో, లేక భోజ్యములో సరియగునా' యనుట లెస్సయో చదువరు లెఱుంగకపోరు. ఇట మాధుర్యమే ప్రధానముగాని పరిమాణ మావంతయు గాజేరదు. పద్యభావమును బోషించుటయే వ్యాఖ్యాతకు గర్తవ్యముగాని పాండిత్యముతో బాధుచేయుట కానేరదు. కర్ణాభరణమును బుగడయాకారముచే గలిగిన 'చక్కెరబుగడ' లను భక్ష్యవిశేషములం దాకారప్రాధాన్య మంతరించిపోవును. ఆకార మాబుగడయట్లు లేకున్న నాభక్ష్యములవారగింప మానుదుమా? అట్టులనే పరిమాణమువలననే యా పేరు వచ్చినను రాగిడబ్బంత చక్కెరలప్పయు బాగుగ నున్నదనుచు భుజింపగలము.

ఇట్లు ప్రక్రమ సాహచర్యాదులచే బట్టుచున్నట్టియు, మప్ప ననునగునట్టియు, స్వారస్యమును బోషించునట్టియు, వేయేల తప్పని చెప్పకలంచినను దప్పించుకొనజాలనట్టియు, నా'టీకగూడ దప్పుగానున్న' దని శ్రీ శాస్త్రిగారు వ్రాయనెంచుట, తప్పనిచెప్పుట తగదుగాన నొప్పదనిదైన వ్రాయవలసి వచ్చినందుకు నే నెంతయు జింతిల్లుచున్నాడను.

లప్పలవిమర్శను లంకించుకొని, విమర్శవిషయమునకప్రస్తుతమైనను శ్రీ ప్రభాకరశాస్త్రిగారు దమవులభించిన నైషధాముక్తమాల్యదాదుల యందలి చక్కని పాఠభేదములలో గొన్నింటిని గూర్చి ముచ్చటించి నాకును, నన్నుబోలిన యాంధ్రపాఠకులకును నందనీయులైరి. అప్రస్తుతమనుటకేల సాహసించితినన, నన్న పాఠమున కర్థముచెప్పుట ప్రస్తుత విమర్శనవిషయము: పాఠభేదములు చిక్కకపోవుటచే భావముపొసగుట వారు ముచ్చటించిన విషయములు. ఏదెట్టులయినను, దమకందుబడిలోనుండు నిట్టి యమూల్యపాఠముల నాంధ్రజనంబున కనతికాలంబున నందజేయుతలంపు శ్రీ ప్రభాకరశాస్త్రిగారికి గలుగుగాత! భాషాసేవ కావించుట కభిమాన మత్యంతరము గావుండుగాక! బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగా రింతకుముందే యిట్టి వానిని శెక్కెంటి నాకళించియు నింతకాలము నూరకుండుట యాంధ్రుల దురదృష్టమునకే తప్పదు. ఇప్పుడయినను వానిని ముద్రింపించి వెల్లడింపనున్నారనుటకు మిగుల సంతసము.

ధీమంతులకైనను బ్రమాదంబు లటనట దప్పనను వారోక్తి సర్వజనసమాదరణీయంబుగ నుండ, శ్రీ ప్రభాకరశాస్త్రిగారేటికో మఱియొక్క యనవసరవిషయమును దమవ్యాసమున జొప్పించిరి. విజయవిలాస సారంగధరచరిత్రల వ్యాఖ్యానంబుల గానగు లోపంబులకు సమాధానరూపంబుగ దమతో శ్రీ వేంకటరాయశాస్త్రిగారుచెప్పిన వాక్యములని "శ్రీ (వేంకటరాయ) శాస్త్రిలవారు విజయవిలాస సారంగధరచరిత్రలకు టిప్పణులను దమయొద్దఁ బనిచేయుచున్న రొకగ్రంథకర్త, అప్పయపంతులగారి ప్రాఁతటీక ననుసరించి వ్రాసికొనివచ్చి యిచ్చిన లఘుటీకను సరిపఱచి, రచించిరట. అట్లు సరిపఱుచుటలో నాలఘుటీకలోని ప్రమాదములు గొన్ని యపరిశీలితములుగా నట్టె విడువఁబడియుండునని శాస్త్రిలవారు నాతో ననిరి" అని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వ్రాసిరి. ఈసమాధానము నేడు గేవల మనవసరముగుటయేకాక, "స్వవిరచితవ్యాఖ్య" యనియు, "మద్విరచితవిపులవ్యాఖ్య" యనియు శ్రీ వేంకటరాయశాస్త్రిలవారు వ్రాసిన యనేకవాక్యములతో సమన్వయము నేసికొన నలవికానిదియు నైయున్నది. అంతియకాక, యీవాక్యంబు లవరదాయకంబులగు ననేకాపోహలకు దావునొసంగుచు శ్రీ శాస్త్రిలవారి వ్యాఖ్యానముల కట్టి

కళంకములైన గూఢార్థ పదార్థంబు లనుచున్నవి. కావున నే యీవాక్యంబు నాకత్యంతవిషాదమును గలిగించుచున్న దనిన నన్ను శ్రీ వేంకటరాయ శాస్త్రిగారును, శ్రీ ప్రభాకరశాస్త్రిగారును మన్నింతు రని తలచెదను. ఇట్టి సమాధానముల నడుపుచు గాలయాపనము సేయుట కన్న, నవకాశముగల యాంధ్రపండితులు శ్రీ వేంకట రాయశాస్త్రిగారియెడ నమ్రితములై యున్నవని చెప్పు చున్న యనేకామోఘవిషయంబుల నాంధ్రజనుల కనతి కాలంబున నందజేయ నుద్యమించిన జాలమేలగునని విన్న వింతును.

అవకాశము గలిగినంత నాకడనున్న నాలుగా శ్వాసముల సారంగధరసంపుటమును శ్రీ ప్రభాకరశాస్త్రి గారికి జూపగలుగుదునని నమ్ముచు, వారు దీనిని సాధించి సాయమొనర్చెంచినందుల కభివందనము లర్పిం చుచున్నాడను.

తాపీ ధర్మారావు

ఆత్మస్తుతి

మండా సూర్యప్రకాశ రావుగారు

ఆశాబద్ధకమై, దురాగ్రహమదవ్యాళోరు సంచారమై,
క్లేశానీకతమంబు కారుకొనఁగ, నక్షీణోగ్రసంసార యా
త్రాశుంభద్గహనాంతరస్థలిని సంక్రాంతుండనై, ఇన్నతన్
గాసిం జెందని యంతరాత్మకు నమస్కారంబుఁ గావించెదన్.

తూలన్ లేదు ప్రపంచకార్యఘనవాతూలౌఘ లోలన్మహా
భీలోద్వృత్తికి నేను; నాశిరము దీపించున్ సగర్వంబుఁగా
నాలోకోగ్రదురంత దుర్ఘటనకూటాసిప్రఘాతంబులన్
గీలాలంబు స్రవించుచుండియు నధోక్షిప్తంబు గా కెన్నఁడున్.

అతికోపాకులితంబు, తీవ్రనయనాంభోనీక గంభీర మీ
క్షితి; అద్దానిని దాఁటినన్ బలలమస్తిష్కాస్థిదుర్గంధదూ
షితకాలానల తీవ్రతప్తనరకక్షేత్రంబు; రెండింటికిన్
మతి భీతిల్లక ధిక్కరించెద మదాత్మస్థైర్య శౌర్యోద్ధతిన్.

నాకద్వారపథంబు తిన్ననయగున్! వక్రంబె యౌ!! దాని నా
లోకింపం బని యేమి? ఈవసుధ నాలోపంబు లెన్నైనవో!
నాకర్మంబున కేన కర్తను గదా! నాయాత్మ శాసింపఁగా
నాకన్నన్ బరుఁ డెవ్వఁడున్ గలఁడె విజ్ఞానంబుమైఁ జూచినన్.



భారతీయ మహిళామణులు

ప్రముఖములగు ప్రజోపయోగోద్యోగములలో నున్నవారు

స్త్రీలు రాజకీయ, పౌరస్వత్వపు హక్కులను సంపాదించుకొనుటకు మిక్కిలి తోడ్పడినది 'విమెన్స్ ఇండియన్ ఎసోసియేషన్' (భారతీయ మహిళాసమాజము). ఆ సంఘముయొక్క రెండు ముఖ్యోద్దేశములు:—స్త్రీలకు పురుషులతో సమానముగా పురపాలక సంఘములలోను, శాసనసభలలోను వోటుచేయు అధికారముకలుగునట్లు చేయుటయు; అన్ని పురపాలకసంస్థలలోను, శాసనసభలయందును స్త్రీలు సభ్యురాండ్రుగా నెన్నుకొనబడు హక్కును సంపాదించుటయును.

ఈ దిగువ పట్టికలో కొలదిమాత్రపు మినాయింపుతో నందరును భారతమహిళాసమాజపు సభ్యురాండ్రే.

వారు వారు నియమింపబడిన తేదీలవరుసను వారి పేరులు వ్రాయబడినవి. ఇందు కొందరు మాత్రము నాచిత్రములను పెక్కు కారణములపైని రాజీనామాల నిచ్చియున్నారు.

శాసనసభాసభ్యురాండ్రు

డాక్టరు ఫూనెన్‌లాఖాన్ (తిరువాంకూరు) రెండు సంవత్సరములు ఆరోగ్యశాఖామంత్రి; శ్రీమతి మాధవీఅమ్మ (కొచ్చిను); డాక్టరు ముద్దులక్ష్మిరెడ్డి (చెన్నపురి) శాసనసభోపాధ్యక్షురాలు; రాజకోట సంస్థానమున నిద్దరు స్త్రీలు.

పురపాలక సభ్యురాండ్రు

దేవదాసుపతి (చెన్నపురి); హాస్కిన్‌సన్‌పతి (బొంబాయి); శ్రీమతి సరోజినినాయుడు; గోఖలేపతి; లోట్‌వాలాకన్య; మెక్కెంజీపతి; హాచెన్ పేంజిలోపతి (చెన్నపురి); యస్. బి. దాసుకన్య (పాట్నా); లక్ష్మణఅయ్యరుపతి (సైదాపేట); కాశీయాబాయిదేవధర్‌కన్య (పూనా); శ్రీమతి అన్నపమ్మగారు (గుంటూరు) మేక్లియాడ్‌కన్య (వేలూరు, కలకత్తా) శ్రీమతి క్రిష్ణవేణమ్మ (కాకినాడ); శ్రీమతి రమణాబాయి నీలకంఠ్ (అహమ్మదాబాదు); శ్రీమతి పి. సుశీలాబాయి (బళ్లారి); శ్రీమతి భాపాయమ్మ (రాజమండ్రి); అన్నాథామస్‌పతి (తిరునెల్వేలి); జానకీకన్య (కాలికట్); లక్ష్మిఅమ్మాళ్‌కన్య (వేలూరు); ఆదిశేషయ్యపతి(వేలూరు); సైనియురెపతి (రంగూను); చార్లెట్టోపతి (తంజావూరు); రజక్‌పతి (తంజావూరు); అబ్రహామ్‌పతి (ఉదకమండలము); అచ్యుత మీనన్‌పతి (మధుర); దొరైకన్ను మదలియార్‌పతి(మధుర); జ్ఞానముత్తైపతి(తిరుచినాపల్లి); శేషునొరైపతి (తిరుచినాపల్లి); శ్రీమతి బుడ్డి సుబ్బమ్మ (నెల్లూరు); శ్రీమతి సుగుణార్ (కడలూరు); డాక్టరు కింగ్‌స్లీపతి (రంగూను); యస్. సుబ్బారావుపతి (కుంభకోణం.)

జిల్లాబోర్డు సభ్యురాండ్రు

శ్రీమతి యస్. కన్నమ్మాళ్ (ఉత్తరఆర్కాటు); శ్రీమతి జయలక్ష్మికుమార్ (చిత్తూరు); డాక్టర్ హాట్టపతి (చిత్తూరు); ఆస్టిన్ బాస్‌పతి (తెలిచ్చెరి); ఇ.రాబర్ట్సుకన్య (దిండిగల్); ప్యారిస్‌పతి (తిరువూరు); శ్రీమతి

ద్రౌపది అమ్మాళ్ (తిరుచూరు); డి. క. మిస్త్రీ సతి (కన్ననూరు); శ్రీమతి ఆచంట రుక్మిణిఅమ్మ (చెంగల్పట్టు); శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ (గుంటూరు.) శ్రీమతి భాగీరధి శ్రీరామ్ (చెంగల్పట్); శ్రీమతి ఆర్. శాంభవీబాయి, బి.యే., (మంగళూరు మహిళాసభనుండి దక్షిణకనరాజిల్లా విద్యాసంఘమునకు)

తాలూకాబోర్డు సభ్యురాండ్రు

శ్రీమతి పద్మాసని (మదనపల్లి); శ్రీమతి జయలక్ష్మి (మదనపల్లి); జూలియ నేథనీల్ సతి (వేలూరు); ఫిలిప్స్ సతి (శివగంగ.)

ఆనరరీ స్త్రీమేజిస్ట్రేటులు

కజిన్సుసతి (చెన్నపురి), సదాశివయ్యరుసతి (చెన్నపురి; స్టాండ్ ఫర్డు సతి (చెన్నపురి), వి. పాండురంగారావుసతి (చెన్నపురి); బీస్లి సతి (చెన్నపురి); హాడ్కిన్సన్ సతి (బొంబాయి); కావజ్జిజహాంగీర్ సతి (బొంబాయి); జె. తాతాసతి (బొంబాయి); త్యాబ్జీసతి (బొంబాయి); యస్. బి. దాసుకన్య (పాట్నా); బర్డ్సువి కన్య (చెన్నపురి); శ్రీమతి జయలక్ష్మి (మదనపల్లి); గురుమూర్తిసతి (మదనపల్లి); లలితాక్రిష్ణస్వామిసతి (చెంగల్పట్టు); దేవసహాయంసతి (మధుర); మద్గాకరుసతి (బొంబాయి); ఇంజనీరుకంట్రాక్టరుగారిసమార్తె (బొంబాయి); పుష్పనాథంసతి (కడలూరు) ఉపాధ్యక్షురాలు; బొంబాయిరాజధానినుండి మరి 10 మంది స్త్రీలు (పేర్లు తెలియరాలేదు); శ్రీమతి అలమేలు మంగతాయారమ్మాళ్ (చెన్నపురి); శ్రీమతి మాలతీపట్వర్ధనుసతి(చెన్నపురి.) శ్రీమతి కేసరిక్ సుబ్బారాయమ్మ (బెజవాడ)

విశ్వవిద్యాలయ సెనెటుభ్యురాండ్రు

సుబ్బరాయనుసతి (చెన్నపురి); హజ్రాకన్య (పాట్నా); జెకర్రై కన్య (చెన్నపురి); యస్. బి. దాసుకన్య (చెన్నపురి); ప్రభుత్వనియోజితులును, ఉద్యోగరీత్యా ఇచ్చిన సభ్యత్వము గలవారు నగు పెక్కుమంది సభ్యురాండ్రును.

స్త్రీబ్యారిష్టరులు, లాయరులు

కార్నీలియా సొరాబ్జీకన్య (కలకత్తా); మిథన్ తాతాకన్య (బొంబాయి); హజ్రాకన్య (పాట్నా); ద్యామే మే ఖిన్ కన్య(రంగూను); సాంక్లాకన్య (పూనా); బి. ఆనందబాయికన్య (చెన్నపురి); దేవదాసుకన్య (చెన్నపురి) శ్యామకుమారి నెహ్రూకన్య (అలహాబాదు.)

మన పొగాకు వ్యయము

గాంధీమహాత్ముడు 'యంగ్ ఇండియా' పత్రికలో నిట్లు వ్రాసెను:—

బహువిధ సంస్కారములయందు ప్రియము కల యొక విలేఖరి మన భరతదేశము పొగాకునకై ఎంత వ్యయము చేయుచున్నది తెలియగోరుచున్నాడు. సంవత్సరమునకు నట్టిపొగాకునకును, సిగరెట్లకును కలిపి 213 లక్షల రూపాయలగుచున్నవని నాకు తెలియుచున్నది. ప్రతియేటాటికిని మొత్తము ఎక్కువగుచున్నది. 1923 వ సంవత్సరములో 1 $\frac{3}{4}$ మిలియను పౌను లయియుండిన దిగుమతి 1927 వ సం॥లో 5 మిలియనులకు హెచ్చెను. సిగరెట్ల దిగుమతియందును దీనికి తగుహెచ్చుదల యుండెను. నేను చూచిన సంఖ్యావివరణము నమ్మకమైన దైనయెడల మనదేశమునుండి యేమాత్రము పొగాకును ఎగుమతి యగుచుండుటలేదు. అందుచేత మనదేశపు పొగాకుపంట యొక్క విలువయు పై సంఖ్యలకు చేర్పబడవలయును. పొగాకుచుట్టలు, బీడీలు, సిగరెట్లు కాల్చు ప్రతివాడును నీ యసహ్యపు దురభ్యాసమును మానివేసి, తన నోటిని చెడువాసనకు నిలయముచేయక, తనపండ్లను పాడుచేసికొనక, రుచులను వేడిని గ్రహించు జిహ్వేంద్రియమునకు నష్టమొనర్పక, ఈ దురభ్యాసమును మానుటవలన మిగులు సొమ్మునేదైన నొక జాతీయోద్యమమునకు దానముగ నిచ్చునెడల, నతడు తనకును తన దేశమునకు కూడ మేలొనగూర్చిన వాడగును.

క్షౌరకర్మ



అమరావతికోటరాజులు

శ్రీయుతులు భావరాజు వెంకటకృష్ణరావు పంతులు (బి. ఏ., బి. యల్.) గారు ఆంధ్ర హిస్టారికల్ రీసర్చి సొసయిటీ త్రైమాసికపత్రిక (రెండవ సంపుటము 3-౪ సంచికల సంపుటి) యందు వెనుక తాము అమరావతికోటరాజులనుగూర్చి వ్రాసినపుడు రెండుమూడుముఖ్యములైన విషయములను పొరపాటువలన నందు చేర్పక విడిచితిమనియు, ఆవిషయముల నిపుడు వివరించుచుంటిమనియు నొకచిన్ని వ్యాసమును ప్రకటించిరి. అందు మొదటిది: కోటరాజులయింటిపేరు పొలెవారనియు కోట వంశమునకు మూలపురుషుడయిన ధనంజయుని యొక్క జాతి, పేరు, ఇంటిపేరు తెలుపుపద్యమొకటి పెదముక్కల భూతమహాదేవి శాసనమున గలదనియు చెప్పి యాపద్యము నుదాహరించినారు. ఆపద్యమిది:

చ. అమలపయోధిఁ జంద్రుఁ డుద

యం బగునట్లనెపొలె వారిజా

తమున విరించి పుట్టిన వి

ధంబునఁ గాంచనధారుణీధరేం

ద్రమున సురావనీజ ముది

తంబయి యొప్పగతిం జతుర్థసం

శమున జనించె నుగ్రరిపు

సైన్యజయుండు ధనంజయుం డిలన్.

ఈపద్యము మొదటిపాదమున 'పొలె' అనుపదము 'వారి' అను 'వారిజాత' పదైక దేశమును నొక్కచో నుండగాంచి వెనుక నీకోటవారు కర్ణాటకులని సూచించిన శ్రీకృష్ణరావుగారు ఈపద్యముయొక్క అర్థమునుగాని, సమన్వయమునుగాని పరిశీలింపకయే 'పొలెవా'రనువాని నేకపదమని విశ్వసించి కోటవారు 'పొలెవా'రను నింటిపేరు గలవారని నిశ్చయించినారు. కోటవా రాంధ్రులేయను క్రొత్తసిద్ధాంతమును నెలకొలుపబూనిన వీరి యుత్సాహపరవశతయే యీప్రమాదమునకు గారణమని తలపదగును. పైపద్యమునకు సమన్వయము:

అమలపయోధిని (నిర్మలమైన (పాల) సముద్రమునందు) చంద్రుడు ఉదయము అగునట్లనె పొలె (అనునట్లు వలెనే), వారిజాతమున (తామరపూవున) విరించి (బ్రహ్మ) పుట్టినవిధమున, కాంచనధారుణీ ధరేంద్రమున (బంగారుకొండ_అనగా మేరుపర్వతము_అందు) సురావనీజము (దేవతల్రమాను_అనగా కల్పవృక్షము) ఉదితమయి (పుట్టి) ఒప్పుగతిని, చతుర్థవంశమునందు ఉగ్రరిపుసైన్యజయుండు (భయంకరులయిన శత్రుసేనలను జయించినవాడు) అయిన ధనంజయుడు ఇలను జనించెను.

పైపద్యము నొక్కసారి స్థూలదృష్టితో జదివినంతనే స్ఫురింపదగు నీయర్థమును పునరుక్తిగ నిట్లు వ్రాసినందుకు పాఠకులు మన్నింపవలెను.

ఇయ్యది కేవల మాంధ్రభాషయందే ప్రకటితమై యుండినచో నీయల్పప్రమాదమునుమాట తలపెట్టవలసిన యావశ్యకత లేకుండెడిది. అట్లుగాక ఆంగ్లపత్రికయందు ప్రకటింపబడినది. ఆంధ్రభాషానభిజ్ఞులందరు నీప్రమాదమునే ప్రమాణముగాగొని తప్పుదారులు తీయువచ్చును. ఇట్టివి మనకు క్రొత్తకాదు. పూర్వచరిత్రకారులు కావించిన పొరపాటుల నెన్నిటినో తరువాతివారు సవరించుచుండుట మనయను

భవములో నున్నవిషయము. కావున శ్రీ కృష్ణరావుగారే ఈవిషయమును గుర్తించి యీ త్రైమాసిక పత్రికయొక్క రాగలసంచిక యందు తమప్రమాదమును సవరించి ప్రకటించుట సముచితము; చరిత్రకు మహోపకారము.

ఆంధ్రమహాజనులకు విన్నపము

కీర్తిశేషులగు శ్రీ ఆంధ్రరత్న రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిచే స్థాపింపబడిన శ్రీమదాంధ్ర విద్యాపీఠ గోష్ఠివారు శ్రీగోపాల కృష్ణయ్యగారి జీవితచరిత్ర, రచనలు, ఉపన్యాసములు, ఇష్టాగోష్ఠి, హాస్యపల్లాపములు, చాటు పద్యములు, లేఖలు మొదలగువానిని గ్రంథరూపమున ఆంధ్రమందును, ఆంగ్లమునందును, వేలు వేలుగ సచ్చొత్తించి ఆంధ్రమహాజనులకు సమర్పించుకొన సంకల్పించియున్నారు. శ్రీగోపాల కృష్ణయ్యగారి జీవితమునందలి మహదాశయములను ఆంధ్రలోకము పరువపడుటకీయత్నమెంతయు నవసరమెా మేము వేరుగ తెలుప నక్కరలేదు. కాని యీ యుద్యమము నెరవేరుట శ్రీ గోపాలకృష్ణయ్యగారితో నేదోవిధముగా పరిచయముగల ఆంధ్రమహాజనులు బహుమంది యొక్క తోడ్పాటుపై నాధారపడియున్నకతమున, ఆంధ్రమహాజను లెల్లరును పై నుదహరించిన విషయములనూర్చి, వారివారికి తెలిసిన యావద్వృత్తాంతమును, శ్రీవారి స్వహస్తలిఖిత లేఖలు (లేక అందుకు సరియగు నకళ్లు), రచనలు, ఛాయాపటములు మొదలగునవి యీ దిగువ చిరునామాకు పంపించి మాకు తోడ్పడ గలందులకు ప్రార్థించుచున్నాము. అట్లు పంపించిన లేఖలు, ఛాయాపటములు తిరిగి కావలయునని కోరినచో త్వరలో వారికి వాపసు చేయబడును.

ఉత్తరప్రత్యుత్తరము లన్నియు యీ దిగువ చిరునామాకు పంపదగును.

గుమ్మిడిదల వెంకట సుబ్బారావు, ఇండియన్ బ్యాంకు, బెజవాడ.   ఇట్లు విన్నవించు,

౧. నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు,
౨. అబ్బూరి రామకృష్ణారావు,
3. గుమ్మిడిదల వెంకటసుబ్బారావు.
ఆంధ్రవిద్యాపీఠగోష్ఠి, బెజవాడ, ౨౮-౭ ౩౮.



కీలు బొమ్మలు

వ. రా.

గోవా వీరగల్లు

విజయనగరాధీశుడగు రెండవ హరిహరరాయల కాలమునాటిది

మిథిక్ సొసయిటీ త్రైమాసిక పత్రికలో రెవరెండ్ హెచ్. హీరాసు, (యస్. జే., యం.ఏ.,) గారు ఈ వీరగల్లును గూర్చిన విమర్శముగా నొక పెద్దవ్యాసమును వ్రాసినారు. అందలి ముఖ్యాంశములు కొన్ని యీక్రింద నుద్ధరింపబడినవి.

ఈ వీరగల్లు ప్రాతగోవా [Old Gao (Velha Gao] మ్యూజియమున నున్నది. ఇది ఒకటే నల్లరాతిపై చెక్కబడినది. దీనిపొడవు అ. ౫ అం. ౧౧; వెడలుపు అం. ౨౧. ఈ రాతిపై ఆరు వరుసలు చిత్రములు, పంద్రెండుపంక్తులు శాసనమును చెక్కబడియున్నవి. చిత్రములవరుసలు పైనుండి క్రమముగా నొకదానికన్న నింకొకటి పెద్దదిగా నున్నవి. మొదటి రెండువరుసలయందును నాయకుని కుటుంబములోని స్త్రీలుకాబోలును చెక్కబడియున్నారు. మూడవవరుసయందు పాలకిపై నొకడు పోవుచున్నట్లున్నది. అతడు నాయకుడు కానోపును. నాల్గయిదు వరుసలయందు గుఱ్ఱపురౌతులు చెక్కబడియున్నారు. ఆరవ వరుసయందు శిరస్త్రాణములు, డాళ్లు, కటారులు, ధరించినయోధులు బాహాబాహిని పోరాడుచున్నారు. బొమ్మలన్నియు మోటుగా చెక్కబడియున్నవి.

శాసనము ప్రాతకన్నడభాషనున్నది. పంక్తులలోని కొన్నియక్షరములు మాసిపోయినవి. మొదటి నాలుగుపంక్తులు ఒకటిరెండు బొమ్మలవరుసలకు నడుమ నున్నవి. తరువాతి అయిదుపంక్తులు మూడునాలుగు వరుసలకు నడుమనున్నవి. చివర మూడుపంక్తులు, నాలుగు అయిదు వరుసలకు నడుమ నున్నది. అక్షరములు క్రీ.పదునాల్గవ శతాబ్దమునకు చెందినవి. శాసనవిషయము యొక్క సారాంశము:

"మహారాజాధిరాజ, రాజపరమేశ్వర హరిహరరాయలు రాజ్యమేలుచుండగా 'హైవె' రాజ్యముపై నధికారము నెరపుచుండిన మహాప్రధాని మల్లప్పొడయరు రౌద్రిసంవత్సర భాద్రపద బహుళ చతుర్దశినాడు యుద్ధమునకు వెడలినాడు. మడియాగాంబు వద్ద యుద్ధము జరిగినది. రాణువచెంతనున్న ముద్దకళ్ల తిమ్మనాయకుడు– మల్లప్పొడయరు కుటుంబమునకు చెందినవాడు–యుద్ధమున మృతుడయ్యెను. అతని కొడుకులు ముద్దనాయక, వీరనాయక, కుమణ్ణనాయకులు ముగ్గురు నీ వీరగల్లును చెక్కించి ప్రతిష్ఠించినారు. అనమందాచార్య దీనిని చెక్కినాడు."

ఈశాసనమున శకసంవత్సరము లేదు. ఇందు చెప్పబడిన రౌద్రిసంవత్సరము శా. శ. ౧౩౦౨ సం.కు సరిపోవుచున్నది. దీనికి క్రీ. శ. ౧౩౮౦ సం. సమానము. రెండవ హరిహరరాయలు క్రీ. శ. ౧౩౭౭ మొదలు ౧౪౦౪ వరకు రాజ్యమును పాలించెను. కావున నీ వీరగల్లు అతని కాలమునాటిది.

హీరాసుగారు ఇతరచారిత్రక శాసన ప్రమాణములను బెక్కింటిని పురస్కరించుకొని పై కాలనిర్ణయము సరియైనదని నిరూపించినారు. తరువాత–శాసనమున నుదాహృతుడయిన మల్లప్పొడయరును గురించి, చాలా చర్చించినారు:

రెండవ హరిహరరాయల మంత్రులు, మూడుతెగలుగ విభజింపబడినారు. (౧) రాజకుటుంబమునకు జేరనివారు తొమ్మండుగురు; (౨) తనకుమారులు ఆర్గురు; (౩) ఒకటవబుక్కరాయల కొడుకులు ఎనమండుగురు. మూడవతెగకు జేరినవాడీమల్లప్పొడయరు. ఇతడు రెండవ హరిహరరాయలకు తమ్ముడు. ఈవీరగల్లు శాసన మీతడు 'హైవె' రాజ్యమును పరిపాలించుచుండెనని తెలుపుచున్నది. ఇతడు ౧౩౮౦ వ సం. గోవాపై దండెత్తియుండును. కాన నాచేరువ నీవీరగల్లు ప్రతిష్ఠింపబడి యుండును. రెండవబుక్కరాయల కీకనిష్ఠాతు



గోవా వీరగల్లు



మద్రాసు-మైలాపూర్

శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి భవనము

నిమిత్తమై, చాలవఱకు భారతదేశపు సరిహద్దులయందు, 111 కు తక్కువకాకుండ యుద్ధములు, ముట్టడులు, దండయాత్రలు సలిపియుండెను. ఇంచుమించ చన్నియును, మూర్లే గారు వివరించినట్లు, హింసాప్రయుక్తములు. బ్రిటిషువారుఅంతకునుపసాకులు పన్నినను— పొరుగురాజు పేచీకోరనియో, అల్లరిపెట్టువాడనియో, హిందూదేశమున అక్రమప్రవేశము చేయుటచేదండార్హుడనియో,హిందూదేశమునకింకను మంచిసరిహద్దు లేర్పఱుపవలెననియో, ఏదోయొకమిష కనబఱిచి సమర్థించుకొనచూతురుకాని—వారి ఆశయముమాత్రము క్రొత్తరాజ్యభాగము సంగ్రహించుకొనుటకే. ఆంగ్లేయరక్తముకంటె భారతీయరక్తము చౌకయని భావించి బ్రిటనుదేశము భారతీయులకే యీ యుద్ధాదికములయందు రక్తము దారపోయుభార మప్పగించెను. ఆంగ్లేయాగమనమునకుపూర్వము భారతదేశమంతవైరములతో నిండియుండినను, భారతీయరాజ్యములలోను, భారతీయరాజన్యులలోను గల విద్వేషములు తప్పి బయల్పడినప్రజలు తత్స్థానమున బ్రిటిషువారి నిమిత్తమై యిరుగుపొరుగుజాతులపై ఎడతెగని దండయాత్రలు, కయ్యములు సాగించుచు, కోట్లకొలది ప్రాణము లాహుతి సేయుటకు_అదియువిదేశీయ విజేతలరాజ్యము విస్తరించి బలము పెంపొందించుటకుగాను— బలాత్కృతు లగుట భారతదేశమున కొక గొప్పమేలా యని ప్రశ్నించి, డాక్టరుగారు 1859 మొదలు 1900 ప్రాంతమువఱకు, చాల భాగము భారతదేశపు ఎల్లలకడను, కొన్ని సుదూరదేశములందును, బ్రిటిషువారు భారతీయులచే మెడలు విరిచి చేయించిన యుద్ధములును, దాడులును ఈ క్రిందివిధమున పేర్కొన్నారు—ఇదియు పూర్తియగుజాబితా కాదట:

చైనాలో 1860, 1900 సం.ల రెండుయుద్ధములు; 1864-65 న భూటానుయుద్ధము; 1868 న అబిసీనియనుయుద్ధము;1878-79 సం. ఫ్రుఆఫ్ఘనుయుద్ధము; కాబూలుమిషనుసంహారానంతరము,1879-80న రెండవఆఫ్ఘనుయుద్ధము;1882 సం. ఈజిప్టుయుద్ధము; 1885 న బర్మాయుద్ధము;1886 లో ఉత్తరబర్మా ఆక్రమణముతో అంతమైనది;సితానాపై 1858న చిన్నదాడి,1863 న పెద్దదండయాత్ర 'సితానా దండయాత్ర'; 1859 న నేపాల-సిక్కిము దండయాత్ర; 1864 న సిక్కిము దండయాత్ర; 1868 న పశ్చిమోత్తరప్రాంతమున గొప్పకలహము; 1871-72 న 'లూషాయీల'మీదికి దాడులు; 1875 న 'నాగుల' మీదికి; 1877 న 'ఆఫ్రిడీల'మీదికి; 1879 న 'రంపా'లను కొండజాతివారిపైకి; 1881 న 'వూజీరిజుల'పైకిని, 'నాగుల'పైకిని; 1884 న 'ఆఖుల'మీదికి; 1884 న ఝూబ్ లోయమీదికి; 1884 న అచ్చటికేమఱియొకసారి;సిక్కిమునందు 'ఆకజాయిల' మీదికిని ('నల్లకొండదాడి'), ప్రాగ్వోత్తరపర్వతజాతులమీదికిని' 1888-89 న దాడులు; 1890 న ఇంకొక 'నల్లకొండదాడి'; 1892 న మఱొక్కటి; 1890 న మణిపురముమీదికి దండయాత్ర; 1891 న 'లూషాయీల'పయి నింకొకదాడి; 1891 'మిరాంజలు' లోయలోనికొకటి;1897-98 న 40,000మంది తో గొప్పదను'టిరా' దండయాత్ర'; 1901 న 'మహ్సూదుల'పై కొక దాడి; 1902 న కాబల్టామీదికొక దండయాత్ర; 19.4 న టిబెటుదండయాత్ర. ఇవిగాక సుదూరములగు మాల్టా, సైప్రస్ దీవులకు భారతీయదళముల బంపుటయు, ప్రసిద్ధమైన 'రష్యన్ మెనేస్' (రష్యాభీత్యర్థ)నపేర్కొనుటకై సైన్యవ్యాపారముల నిమిత్తము 10,000,000 డాలర్ల వ్యయపఱుచుటయు పేర్కొనదగును.

ఈజాబితా నమ్మ వీలు లేనంత పెద్దదయ్యు, 1859 సం.కు పూర్వమును, 20-వ

శతాబ్దమునను జరిగిన యుద్ధములును, దండయాత్రలును ఇందు లేనేలేవు: ఈయన్నిటను, (1914-18) ఐరోపామహాసంగ్రామమునను భారతీయులు ఘోరముగ, సార్థకముగ పోరియుండిరి. బ్రిటనుదేశము తన భారతీయేతిహాసము పొడుగునను ఎడతెగక స్వార్థపరములగు యుద్ధములు సాగించిన విధమును తెలియజేయుటకీజాబితా చాలి యున్నది.

మృత్యుకాల మహత్త్వము

శాస్త్రదృష్టి లేనిపక్షమున మనుజుఁ డంధుఁ డనియే చెప్పవచ్చును. మనయింద్రియములు మిగుల ప్రబలములు. శాస్త్రదృష్టివలన మనకర్తవ్యాకర్తవ్యముల విచారణ చేసికొనకపోవుటవలన నెంతేని హాని కలదు. ప్రకృతి యీశ్వరసంబంధమయినమాయ. మనశరీరముల కదియే ఉపాదానము. అమాయకూడ మిక్కిలి ప్రబలయే. కాఁబట్టి, మనశరీరమునుగూడ మనయధీనమునం దుంచుకొనుటకై శాస్త్రదృష్టివలన మనవిచారములను సర్వదా నిర్మలములుగాను, శుద్ధములుగాను ఉంచుకొనుటకు ప్రయత్నించవలయును. అట్లు చేయనిపక్షమున ఇంద్రియములు, ప్రకృతి యేకమయి, బండిని పెంకెద్దులు ఏప్రకారముగా ఇచ్చవచ్చినచొప్పున లాగి గోతఁ బడఁద్రోయునో అదేప్రకారముగా మనుజుని అథోగతి మార్గమునకుఁ దీసికొని పోవుచుండును. సాధారణ మనుజునియందును, శాస్త్రదృష్టిగల మనుజునియందును గుర్తింపఁదగినభేద మొకటి గలదు. సాధారణ మనుజుఁడు ప్రియాప్రియరూపమయిన వలలోఁ బడియుండిపోవును. కాని, శాస్త్రదృష్టిగల మనుజుఁడో సిద్ధాంతశాస్త్రముల-పరిశీలనవలన బుద్ధిని పవిత్రముగఁ జేసికొని విచారణపూర్వకముగా ఆత్మకల్యాణము విషయమున ప్రవర్తించువాఁడగుచుండును. "ఇది నాకు బాగుగా నున్నది, ఇది నాకు చెడ్డదిగా నున్నది" అను నిట్టి విచారణయు, "దీనివలన నాకు మేలు గలఁగును, శ్రేయస్సాధనమగును, లేక, అశ్రేయస్సాధన మగును" అను నిట్టి విచారణయు నొకటి కాదు. రెంటింటిలోను భూమికిని ఆకాశమునకును ఉన్నంత అంతరము గలదు. కేవలము ఇంద్రియతృప్తిపరాయణులయిన మూర్ఖులింద్రియవృత్తులను సార్థకముగా చేసికొనుటకై ప్రియాప్రియముల ననుసరించుచుందురు. కాని, పరమార్థమును కోరుకొనువారలో ప్రియాప్రియరూప మయినవలలోఁ జిక్కుకొనక ఆత్మకల్యాణమునిమిత్తము శ్రేయస్సంగ్రహతత్పరులగుచుందురు.

ఏమనుజుఁడు మరణాసన్నుఁడయి యుండునో వానిని గూర్చి ప్రస్తుతకాలములో చేయఁబడుచుండెడిచేఁతలు మిక్కిలి చెడ్డవి యనియును, శాస్త్రదృష్టినిబట్టి కాని, జ్ఞానదృష్టినిబట్టి కాని, ఆలోచించినపక్షమున మరణించుచున్నవాని కమంగళకరము లగుటవలన సర్వవిధములచేతను హేయములు-అనఁగా, విడిచిపెట్టఁదగినవనియును చెప్పకతప్పదు. సిద్ధాంతశాస్త్రజ్ఞానాభావము వలనను, బుద్ధిభ్రష్టతవలనను మన మట్టిచేఁతలు చేయుచుందుము. మరణించుచున్నవానికి జీవము శరీరముతో విచ్ఛేదమును పొందుసమయ మెంతేని మహత్త్వము గల దనువిషయమున నెంత చెప్పినను హెచ్చు కాఁజాలదు. విచారశీలుఁడు, జ్ఞాని యగువానికి బ్రదికినబ్రదు కంతయు నొకవిధముగా తపము లేక యజ్ఞము. మృత్యుసమయ మీతపస్సు లేక యజ్ఞమునకు ఫలప్రాప్తిసమయము. ఇటువంటిసమయము దురుపయోగ మగుటవలన వానియావజ్జీవపుతపము తొలఁగుట లభింపవలసినఫలప్రాప్తిలో విఘ్నము ప్రాప్తించుటయు, చేసినతపస్సంతయు నష్టప్రాయమగుటయు సంభవించెడిని. మనసిద్ధాంతశాస్త్రములలో ఈవిషయమునఁ జేయఁబడినయుపదేశ మేదేని ధర్మవిశేషమునకొఱకుఁ గాదు. ఆయుపదేశము వ్యాపక మగుటవలన సార్వజనీన మనవచ్చును. ఇది యేప్రకారముగా బ్రాహ్మణులు, శైవులు, శాక్తేయులు, వైష్ణవులు మొదలగువారివిషయమున నిర్విశేషరూపముగ సంబంధపడియున్నదో మతాంతరానుయాయులవిషయమునను ఆప్రకారముగానే సమానరూపమున సంబంధపడియున్నది. వారు ముసల్మానులగుదురు గాక, క్రైస్తవులగుదురు గాక, లేక, యితరమతముల నంగీకరించువారే యగు

నురుగాక. ఈయుపదేశము మనప్రాచీనధర్మశాస్త్ర ముల ప్రాశస్త్యముతోలాఁకును, మనపూర్వాచార్యుల తత్త్వదృష్టితోలాఁకును గాంభీర్యముయొక్కయు, విచా రముయొక్కయు ఆసంకీర్ణతకు పరిచాయకమగుచున్నది. ఇటువంటి ఉచ్చకోటిని చెందినవిచారము లున్నప్పటికిని మనలోనుండి వేలకొలఁది, లక్షలకొలఁదిసంఖ్యలో అన్య ధర్మమును గ్రహించియున్నారు. ఇప్పుడును కొంచెము కొంచెము గ్రహించుచునే యున్నారు. దీనిని గుఱించినదోష మీప్రకారముగా అన్యధర్మమును గ్రహించినవారి యందుఁగాని, వీరిని తమలోఁ గలుపు కొన్నవారియందుఁ గాని లేదు. ఏమా? ధర్మాంతరగ్రహ ణము చేయువారు శాస్త్రజ్ఞాన రహితులయిన అంధ విశేషులు. దీనిదోష మంతయు దేశమును, సమాజ మును సంరక్షించువారిపయిననే యున్నది. బిడ్డలు అశిక్షితులును, మూర్ఖులును అయినపక్షమున, వారి తలి దండ్రులేకదా పూర్తిగా దోషులగుదురు. ఆప్రకారము గానే ఒకధర్మమును విడిచి యెవరేని ధర్మాంతరమును గ్రహించినపక్షమున, అందునుగురించి, ఆధర్మమును సంరక్షించువారు బదులుచెప్పవలసినవా రగుచున్నారు. ఏమా? వారు స్వమతానుయాయులలో స్వధర్మతత్త్వ ముల జ్ఞానప్రచారమునకు తగిన యేర్పాటు చేయనివా రును, వారిలోనుండి జాఱిపోయినవారి శారీరిక మానసికా త్మక క్షుధానివృత్తికి ప్రయత్నమేనియు చేయనివారును అగుచున్నారు. కనుక సత్యము నపలపింపకున్న పక్షమున, ఎవరైతే ఆహారము లేక చనిపోవుచున్నవారి కాహార మిచ్చియు, అనాశ్రయుల కాశ్రయ మిచ్చియు తమవా రినిగాఁ జేసికొనుచున్నారో వారు ధన్యవాదములకు పాత్రు లనకతప్పదు. కాని, మనము—ఇటువంటిదుః ఖితులనిమిత్త మేమియుఁ జేయనిమనము, ఈప్రకార ముగా మన-అంగములనే కోసివేసి యితరుల-అంగ ములతోఁ గలుపుట కవకాశ మిచ్చినమనము—మనయా కర్తవ్యభ్రష్టతను విచారించి యాత్మగ్లానివలన తలలు వంచుకొనవలసియున్నది. మనదోషముల నితరులశిరము లపై నుంచుప్రయత్నమును విడువవలయును.

ఈశరీర మాత్మ సుఖదుఃఖముల ననుభవించు టకై నయంత్రము. వ్యాధివలన నైననేమి, మఱియేయి తరకారణములచేత నైననేమి యేసమయమున ఈశరీ రము దుర్బలము, శక్తిహీనము నగుచున్నదో, ఏసమయ మున నీదుర్బలతయు, శక్తిహీనతయు చరమదశనుపొం దునో ఆసమయమున జీవుఁడీశరీరమును వ్యర్థము అనఁగా నెందులకును ఉపయోగింపని దని యాలోచించి విడిచిపె ట్టుచున్నాఁడు. వెంటనే భోగయోగ్యమయిన యితరశ రీరమును గ్రహించుచున్నాఁడు. ఈభావమునే గీతలో— “వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి, తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ” (గీ. ౨—౨౨) అనఁగా, మను జుఁ డేప్రకారముగా ప్రాఁతవస్త్రములను విడిచిపెట్టి క్రొత్తవస్త్రములను ధరించుచుండునో, జీవుఁడును అదే ప్రకారముగా ఒకశరీరము జీర్ణమయిపోయినపిమ్మట దానిని విడిచిపెట్టి క్రొత్తశరీరమును ధరించుచుండును. ఆసమయమున బహిర్ముఖమయిన జీవునిప్రసారమంతయు నంతర్ముఖ మగుట కుపక్రమించుచుండును. ఇంద్రియ ములు తమవిషయములను విడిచిపెట్టి తమసూక్ష్మరూప మువలన ప్రాణవాయువులోనికి ప్రవిష్టము లగుచుం డును. ప్రాణ మింద్రియముల సూక్ష్మతత్త్వమును స్వీక రించుచునే హృదయమునందు ప్రవేశించును. హృదయ మునందే పురుషుఁ డనఁగా, జీవుఁడు నివసించుచుండును. అపుడు హృదయముతోలాఁకు ముందుభాగము ప్రదీప్త మగుచుండును. ఆవెలుఁగుసాయముననే జీవుఁడునయముందు మార్గమును చూచుకొనుచు శరీరమునుండి ముఖాదులలో నేదేని యంగమునుండా బయలుదేఱును. దానివెంబడినే ప్రాణము బయలుదేఱును దానితోఁగూడ నింద్రియ ములు, శుభాశుభములగు కర్మములు, ఆర్జితమయిన విద్య, జ్ఞానములు మొదలయినవన్నియు సూక్ష్మరూపమున బయలుదేఱును. ఈవిషయమునే గీతలో సంక్షేపముగా నిట్లు చెప్పినాఁడు కృష్ణభగవానుఁడు“శ్లో. శరీరం యద వాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః, గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధా నివాశయాత్” (గీ. ౧౫-౮) అనఁగా, జీవుఁడు మనసును, ఇంద్రియములను గ్రహిం

చుకొనునునే జన్మమును పొందుచుండును. దేహమును త్యజించిపోవునపుడు దీని నల్లే వాయువు పుష్పాదిస్థానములనుండి గంధమును తీసికొనిపోవునట్లు తీసికొనిపోవుచుండును. "పూర్వజన్మార్జితా విద్యా పూర్వజన్మార్జితం ధనమ్, పూర్వజన్మార్జితా భార్యా చాగ్రే ధావతి ధావతి" అనఁగా, ఇవన్నియు జీవుని వెంబడించుచుండు నమట. పై నుదాహరించిన గీతాశ్లోకములో నీశ్లోకమును కలిపి సమన్వయించుటవలన నీవిషయమున బృహదారణ్యకములోని వాక్యముల—అర్థము స్పష్టము కాఁగలదు. ఏసమయమున జీవుఁ డీశరీరమునుండి బయలుదేఱి పైని చెప్పఁబడినప్రకారము పోవుచుండునో, ఆసమయమున వానివిచార మెట్లుండునో దాని ననుసరించియేఆజీవునిగతి ముందుజన్మములోననుండు. కనుకనే "యాంతే మతి స్సాగతిః" అని పెద్దలన్నారు. జీవుని భావిజన్మకల్యాణమును ధ్యానమం దుంచుకొనియే మనమంత్రద్రష్టలు మాటిమాటికిని మృత్యుకాలమునందలి మాహాత్మ్యమును వర్ణించినారు. "అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్" (గీ. ౮-౫.) "యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కళేబరమ్" (గీ. ౮-౬) "స్థిత్వాస్యామన్తకాలేఽపి బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి" (గీ. ౨-౭౨) "యథాచ మరణం ప్రాప్య ఆత్మా భవతి." (కఠ. ౫-౬) "ఏతద్వై పరమం తపః. యద్వ్యాహితః తప్యతే" (బృ అ ౫-౫౦ ౧౧. మ ౧) "జన్మజన్మ ముని యతన కరాహీం, అంత రామ కహి ఆవత నాహీం. (తులసీ రామాయణము.) ఇత్యాదులు

ఇఁక నీవిషయమున ఆలోచింపవలసిన సంగతి యేమనఁగా? మరణావస్థలోనున్న వాని నలువయిపులను గుంపుగూడి బంధుగులు నెత్తి నోరు మొత్తుకొనుచు నెన్నోవిధముల నేడిచి యల్లరిచేయుచుందురు గదా! అట్లు చేయుట వానివిషయమున తగునా తగదా? ఈరోదనాదుల ప్రభావము వాని కేమిటి కలిగించును? అనునదియే. జీవుఁడు బ్రహ్మమువంటి వాని "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" (. ౧౫-౭) అను గీతావచనమువలనను, "జీవో బ్రహ్మైవ నాపరః" అను శ్రీశంకరభగవత్పాదుల వాక్యమువలనను, "ఈశ్వర జీవహీ నహీ కఛు భేదా" యను తులసీరామాయణవాక్యమువలనను పరమసిద్ధాంత మగుచున్నది. ఆజీవుఁడు స్వభావమువలననే శుద్ధబుద్ధస్వరూపుఁడు. అతఁడు స్ఫటికమువలె నిర్మలమయిన జలమువలె స్వచ్ఛుఁడు. శుద్ధమయిన స్ఫటికమునెదుట నేవస్తు వుంచఁబడునో దాని ప్రతిబింబము దానియందు ప్రతిఫలించును. శుద్ధమయిన జలము నేపాత్రమునందుఁ బోయుదుమో అది తదాకారమును పొందును. జీవునివిషయమునను సరిగా నట్లే యని తెలియఁదగును. జీవునియెదుట నేవిషయమున నేవృత్తి యుంచఁబడునో అతఁ డద్దానియాకారమునే గ్రహించుచుండును. దీనినే పాతంజలయోగశాస్త్రములో వృత్తిసారూప్య మన్నారు. ఈపరమార్థతత్త్వమునే మన సిద్ధాంతులు క్రిందివిధమున వర్ణించినారు. "శ్రద్ధామయోఽయం పురుషః" (గీ. ౧౭-౩.) "కామమయోఽయంపురుషః (బృ౪-౪-౫)"క్రతుమయోఽయంపురుషః" (ఛా. ౩-౧౪-౧.)" మనోమయోఽయం పురుషః" (బృ. ౫-౬.) ఇత్యాదులు.

జీవుఁడు మనస్సుతోలాగున అధ్యక్షతక్రిందను ఇంద్రియములద్వారా విషయముల ననుభవించుచుండును. "ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః" (కఠ ౩-౪.) అనఁగా, ఇంద్రియములతోను, మనస్సుతోను కూడిన ఆత్మయే భోక్త యని పండితు లన్నారు. ఈయింద్రియములే బయటివిషయములను జీవునినిమిత్తము మనస్సునొద్దకు పంపుచుండును. ఏవిషయమేని యింద్రియగోచర మగునేని, అది మనస్సుద్వారా జీవుని యొద్దకు చేరును. ఎంతవఱకు శరీరమందు శక్తియుండునో అంతవఱకును మనస్సు, ఇంద్రియములవిషయములనుండి మంచిచెడ్డలను గమనించుచుండును. శక్తి తగ్గుచున్నకొలఁదిని మనస్సుతోలాగు ఆవిచారశక్తియు తగ్గుచుండును. తుదకు ఫలిత మే మగుచున్న దనఁగా, మంచిగానీ, చెడ్డదికానీ యెట్టిదయినను ఇంద్రియములు తమవిషయములను మనస్సుద్వారా ఆత్మ కందించుచుండును. ఇపు డేమనుజుఁడు తన బ్రదుకంతయు పరివారముతోలాగు మేలుకొఱకును దానిభరణపోషణముల కొఱకును దారపోయుచున్నాఁడో అట్టివాని

కట్టి శక్తిహీనమయిన దశలో వానిపరివారమంతయు చుట్టును గుంపుగూడి నెత్తి-నోరు మొత్తుకొనుచు ఏడిచి అల్లరిచేయుచున్నపుడు ఇఁక వానిమనోదుఃఖమున కేమయినను హద్దుండునా? అట్టిస్థితిలో వాఁడు తనపరివారము నోదార్చువిషయమున నేమియుఁ జేయఁజాలఁడు సరిగదా! తుదకు మాటలయినను ఆడఁజాలఁడు. పరివారమునకు సానుభూతిచూపుటకు ఏవిధమైన ఉపాయమును వానియొద్ద సిద్ధముగా నుండదుగదా! అటువంటి యసహ్యావేదనను సహింపలేనికారణమున వాఁడు కేవలము కన్నుల నీరు పెట్టుకొనుచు పరివారము నోదార్చును. కాని, ఈఘటనతాలూకు ప్రభావము వానివిషయమున నేమగునో ఆసంగతియు నందఱికిని విచారింపవలసియుండును. తనయావజ్జీవము ప్రాణములకు సయితము తెగించి పరివారమునకు చేసినసేవకు బదులుగా పరివారము వానిభావిజీవనమంతయు దుఃఖమయము నగునట్లు చేసివేయుచున్నది. ఏమా? శరీరమునుండి బయలువెడలునపుడు జీవుఁడు దుఃఖమయమయిన దృశ్యమునే తోడ దీసికొనిపోవుచున్నాఁడు. దీనినే నిష్ఠురదయ యందురు. జడభరతుఁడు ఆత్మచింతనలో నేవిధమయినవిఘ్నమును కలుగకుండుఁగాక యనియే తనయావజ్జీవము వనవాసము చేసినాఁడు. ఏజడభరతుని స్త్రీపుత్రాదుల ప్రేమమయబంధనము సంసారములో బంధించి యుంచుటకు సమర్థము కాఁజాలకపోయినదో ఆయనకే అసహాయమయిన ఒక్క లేడిపిల్లయందలిస్నేహము లేడిజన్మము నెత్తించుటలో సమర్థమయినది. ఇది యెట్టివిచిత్రమయిన సంగతియో కదా! ఏమా? అతఁడు మరణించుసమయమున—ఈలేడిపిల్లను నే నసహాయావస్థలో విడిచిపెట్టి పోవుచున్నానే, ఈనిర్జనారణ్యములో నింకొకమనుష్యుఁడయినను ఉండినపక్షమున దీనిభరణపోషణముల భారమును వానికప్పగించి పోదును గదా—అనియే యాలోచించుచుఁ జనిపోయినాఁడు. ఈప్రకారముగ లేడిపిల్లభరణపోషణములనుగుఱించి చింతించుచుండఁగానే యతనికి దేహత్యాగము తటస్థించినందున యావజ్జీవము తాను చేసిన ఆత్మచింతనమునకు కలుగవలసిన ఫలమునకు బాధయేర్పడినది. తుద కాతనికి హరిణజన్మమెత్తక తీఱినదికాదు.

ఇంతే కాదు. తా నెంత నిష్కామకర్మమును చేసినవాఁ డయినను, ఎంతటి యోగాభ్యాసము చేసినవాఁ డయినను, ఎటువంటి జపతపములు చేసినవాఁ డయినను దేహికి దేహముతో వియోగము కలుగునప్పుడు వాని ధ్యానము తనదృశ్యవస్తువుపయి నుండనిపక్షమున, మనస్సు సచ్చిదానందచింతన చేయుచుచేయుచు బయలుదేరనిపక్షమున, ఇతరవిషయములతో సంబంధము గలిగియుండినకారణమున మరల జన్మమును పొందకతీరదు. వాని నిష్కామకర్మమంతయు సకామకర్మముక్రిందను పరిగణింపఁబడియు మానదు, దానిని వాఁ డనుభవింపకయుఁ దప్పదు.

మఱొకవయిపు దృష్టిని ప్రసరింపఁజేసి చూచెదము గాక. ఎటువంటిదుష్కర్మములు చేసినవాఁ డయినను దేహదేహివియోగము కలుగునప్పుడు వానిబుద్ధిలో సాత్త్వికభావము కలిగి వానివిచారములు పవిత్రములయినపక్షమున వాని కుత్తమగతి లభించితీరును. ఏమా? అజామిళునకు లభించినది గాదా? యావజ్జీవము పాపకర్మములు చేసినవానికి మరణసమయమునఁ బరమార్థభావము కలుగఁజాలునా యనువిషయము సందేహింపవలసినదే. కాని, పూర్వజన్మసంస్కారమువలన, ఒకవేళ నీవిధముగా నయినను పరమార్థభావము కలిగినపక్షమున వానిసద్గతివిషయమున సందేహింప నక్కఱలేదు ఏమా? ఇది ముమ్మాటికిని సత్యము. ఇందులకుఁ గారణము లేకపోలేదు. జీవుఁడు స్వభావమువలననే శుద్ధబుద్ధముక్తస్వరూపుఁడుగదా! వానికి తనశుద్ధస్వరూపము ధ్యానములోనికి వచ్చినతోడనే సుకృతదుష్కృతరూపమయిన వాని యావరణము తనంతనే తొలఁగిపోవును. పుణ్యపాపములన్నియు అగ్నికణముపడిన దూదిరాశిమాదిరిగా నష్టమయిపోవును. ఈవిషయమును మనస్సునందుంచుకొనియే—"యదా సత్త్వే ప్రవృద్ధేతు ప్రళయం యాతి దేహభృత్, తదోత్తమవిదాం లోకానమలాన్ ప్రతిపద్యతే" (గీ. ౧౪. ౧౪.) అనఁగా, సత్త్వగుణము వృద్ధియయిన సమయమున జీవుఁ డీశరీరమును విడిచిపెట్టినపక్షమున ఉత్తమతత్త్వమును తెలిసికొన్నవారినిర్మలలోకములు వానికి లభించును—అని కృష్ణపరమాత్మ వచించియున్నాఁడు.

కాఁబట్టి, మనము చేయఁదగినది యేమనఁగా, ఏ మనుజుఁడయినను మరణశయ్యయందు పడియున్నపక్షమున సాంసారికభావములు పూర్తిగా వానిస్థానమునుండి తొలఁగింపబడవలయును. వానిలోపలను ఉత్తమోత్తమములయిన భావములు కలుగుటకుఁ దగినప్రయత్నములు చేయవలయును. వానియొద్దను మంచిమంచి విషయములనే చర్చించుచుండవలయును. వానిస్థానమును పవిత్రముగ నుంచవలయును. వానికి భగవద్గుణములు వినిపించుచుండవలయును. ధార్మికమయిన దృశ్యమును చూపించుచుండవలయును. అట్లు చేసినపక్షమున వానిలోపలనుండి దుర్భావనలు వీలయినంతలో వెంటనే నాశమగును. వాఁడీశ్వరచింతన చేయుచునే ఉత్క్రమించును. ఒకవేళను, పరివారము తనకుఁ జేసిన సేవకు బదులుగా వాని క్షేమయినను చేయఁగలిగినపక్షమున నిదియే. అంతేకాని, పరివారము, వాఁడు తనకుఁజేసిన సేవారూపమయిన పురస్కారమునకు బదులుగా ప్రకృతకాలములో జరుగుచున్నట్లు తిరస్కారము చేసి వానియధోగతికి మార్గము చక్కఁజేయుటయా? జీవుఁడు శరీరమునుండి బయటికి వెడలిపోయినతర్వాతను తల పగులఁగొట్టుకొనుటను, గుండెలు పగుల బాదుకొనుటను కాని, వానికిటువంటి దృశ్యములు చూపించుట మాత్ర మాలోచించి చూడఁగా, వాని మంచిమార్గములో కంచెలు కొట్టుటయే యగును. కాఁబట్టి జీవకారుణ్యముగల ప్రాజ్ఞులీసంగతులను జ్ఞప్తియం దుంచుకొని మూర్ఖుల క్షేమమునకై యథాశక్తి పాటుపడుదురుగాక. "యాన్తే మతి స్సా గతిః" అన్న పెద్దల యథార్థవాక్యమును మఱవకుందురుగాక. (మాధురి)

[పు. సూ. నా.]

ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము, చెన్నపురి

(Government Oriental Manuscripts Library)

ఈ భాండాగారమున తెలుగుభాష నున్న వ్రాతపుస్తకముల నన్నిటిని ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు చెన్నపురప్రభుత్వమువారిని తమవశము చేయ కోరిరనియు, ప్రభుత్వమువా రందుల కంగీకరించిరనియు, ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు గ్రంథములను త్వరలో గొనిపోవ నున్నారనియు పత్రికలు ప్రకటించినవి. ఇది ఎంతవఱకు విశ్వసింపదగినదని యూహింపవలసియుండగా అట్లు 'చేయరా'దని కరపత్ర *మొకటి పుట్టినది. ఇది తగనిమాట. ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు గ్రంథములను గొనిపోవుట సత్యమే యగునేని యది ప్రత్యాంధ్రహృదయమును పల్లవింపజేయు శుభవార్త.

ఈభాండాగారమున ఎక్కువగా సంస్కృతాంధ్రద్రావిడభాషలను, తక్కువగా కర్నాటమలయాళాదిభాషలను వెలయుచున్న గ్రంథములును, స్థానికచరిత్రములును, ప్రాచీన శాసనముల నకళ్లును— తాళపత్రములయందును, కాగితములయందును వ్రాయబడినవి— లెక్కకుమిక్కిలిగ నున్నవి. అన్నియును దేశభాషావాఙ్మయములకును, చరిత్రకును నత్యంతోపకారకము లయినవి. ప్రభుత్వమువారు తమకు దేశీయులపట్లను, దేశభాషలపట్లను గల సహజానాదరభావముచే నా వ్రాత సంపుటముల సమ్యక్పరిపోషణమునకు చాలినంత సొమ్మును వ్యయించి సముచిత సౌకర్యములను గలిగింపకుండుటచే నవి నానాటికి జీర్ణించి చీకిపోవుచున్నవి. ఇట్లే కొంతకాల మిందునేని యవి నామమాత్రావశిష్టములు కావచ్చును. పదపడి దేశీయులు తమ యమూల్యభాషాచారిత్రక వాఙ్మయములను గోలుపోయి వాపోవ

* విద్వాన్ మంకాల శ్రీపతిగారు వ్రాసినది.

వలసినవా రగుదురు. అట్టిగతి పట్టకమునుపే ప్రజలు మేలుకాంచి ఎవరెవరి మాతృభాషకు చెందిన సంపుటములను వారువారు తమ వశము కావించుకొని జీర్ణము లగుచున్న వానికి పుత్రికలు వ్రాయించి అన్నిటిని సరియైనస్థితిలో నుంచుకొనుట లెస్సయే యగును. కాబట్టి ఆంధ్రవిశ్వవిద్యాలయమువారి ప్రయత్నము ఆంధ్రవాణికిని, ఆంధ్రదేశమునకును శ్రేయస్కరము. బొత్తిగా లేకపోవుటకంటె నెక్కడనేని చక్కగా నుండు టెల్లరకును సంతోషావహముగదా!

తెలుగుపుస్తకముల మాట యటుండుగాక! తక్కినభాషలయందలిపుస్తకములమాట యేమికావలెను? దేశభాషలు పరస్పరసంబంధము గలవి. కావున అన్నిభాషలలో గ్రంథములు నందఱకు భాషావాఙ్మయచారిత్రపరిశోధనమున కేమి, దేశచారిత్రపరిశోధనమున కేమి మిగుల నుపకరించునవి. వీనియెడ ప్రభుత్వమువారి కనాదరము తగనిది. ఈభాండాగారపోషణనిర్వహణములు సంతృప్తికరములుగ లేవని కొంతకాలము క్రింద పత్రికలయందు కొందరు భాషాభిమానులు వ్రాసిప్రకటించియున్నారు. ఈపోషణనిర్వహణవిషయమై భాండాగారమున నిటీవల కొన్ని చిన్నిమార్పులు, కూర్పులు జరిగినను అవి యంత సంతృప్తికరములుగ జూపట్టవు. పాలకజాతికి చెందినవారే యగు శ్రీబ్రౌనుదొరగారొక్కరే దేశభాషావాఙ్మయములయందలి స్వారస్యమును లెస్సగ గ్రహించి, అపారమగు వ్యయమును, ప్రయాసమును బరిగణింపక, ఆయాభాషల గ్రంథములను బెక్కింటిని సేకరించి, వానికి పుత్రికలు, వ్యాఖ్యానములు, టీకలు, శబ్దసూచికలు మొదలయినవి వ్రాయించి కావించినమహోపకార మేనాటికిని దేశీయులకు మరవదగనిది. విదేశీయుడగు నా యుదారాశయునికి కడుంగడు ప్రేమపాత్రములై వెలసిన యీ సంపుటములు నానాటికి శిథిలములై నేలపాలగుచుండుట గాంచి భాషాభిమాను లంగలార్చకుండుట దుర్ఘటము. ఇంతయేల? ఈనాడు భాండాగారమునగల యెల్ల పుస్తకములకు సరియైనయొకపట్టికయైన లేకున్నది. ఇట్టిపట్టున భాండాగారపర్యవేక్షకు లగువారు భాండాగారముయొక్క యీ దుస్థితిని తొలగింప బూనకుండుట వింతగా నున్నది. ప్రభుత్వమువారికి భాండాగారముయొక్క సత్యస్వరూపమును దెలుపుట వారి పని; ప్రభుత్వమువారివలన చాలినంత ధనసహాయమును జేకూర్చుట వారిపని; ఆసొమ్మును వెచ్చించి భాండాగారము నభివృద్ధికి దెచ్చుట వారిపని. కావున వా రీపనులను నెరవేర్చుటకు వెంటనే గట్టిప్రయత్నములను చేయవలెను; అచిరకాలమున భాండాగారము నుద్ధరింపవలెను.

ఈభాండాగారమునందు తెలుగున ముద్రితములు, నముద్రితములు నగు గ్రంథములయొక్క వ్రాతప్రతులు—తాటాకులపైనను, కాగితములపైనను వ్రాసినవి—కలవు. దక్షిణభారతదేశప్రాచీనచరిత్ర నిర్మాణమున కుపకరింపగల శాసనలేఖనముల యొక్కయు, స్థానికచరిత్రములయొక్కయు వ్రాతప్రతులును పెక్కులున్నవి. చరిత్రసంపుటములందు ఆంధ్రద్రావిడకర్ణాటమహారాష్ట్రదేశములకు సంబంధించిన విషయములు గలవు. ఇదికాక తెలుగులిపిని వ్రాసిన సంస్కృతభాషాగ్రంథములు చాల గలవు. ఇన్నింటిలోను జాలవాటికి శిథిలప్రాయములగుచున్న యొండు, రెండు, మూడు, నాల్గు ప్రతు

లును ఉన్నవి. కొన్ని ఏకైకములుగ నున్నవి. మెకంజీదొరగారు తొలుత వ్రాయించినస్థానిక చరిత్రసంపుటములు శిథిలము లగుచుండ శ్రీ బ్రౌనుదొరగారు వానికి ప్రతికలను వ్రాయించిరి. అవియు నిపుడు జీర్ణదశకు వచ్చుచున్నవి. కావున వానికి మరల ప్రతికలు పుట్టవలసిన యావశ్యకత కల్గినది. వెనుకటి కొన్ని సంపుటములలోని కాగితములేమి, తాటాకులేమి తాకినంతనే తునాతునక లగుచున్నవి. మరి కొన్ని సంపుటములలోనివి కీటదష్టము లయి భ్రష్టము లయినవి. కాన జీర్ణము లగుచున్న వానికి త్వరలో ప్రతికలు పుట్టవలెను. అవి సురక్షితముగ నుండు నేర్పాట్లు జరుగవలెను. ఇట్టివిధముననే యెల్లభాషల సంపుటములకును ఉద్ధారణ సంరక్షణములు జరుగవలెను. 'భారతదేశ సంరక్షణము కొఱ' కను నెపమున కోట్లకొలదిగ భారతదేశ ధనమును విదేశములందలి సైనికులకు ఏటేట ధారాళముగా వ్యయించుచున్న ప్రభుత్వమువారికి భారతీయుల దేశభాషా వాఙ్మయ పోషణము కొరకు ఇంచుకంత సొమ్మును వ్యయించుట వ్యయముక్రింద లెక్కపెట్టవలసినది కాదు.

ఇక ఆంధ్రవిశ్వవిద్యాలయము వారికి తెలుగుపుస్తకముల నిచ్చువిషయము: చెన్నపురి చెన్నరాష్ట్రమునకు రాజధానీ నగరము. ఇటభాషాపరిశోధకులకు, చరిత్రపరిశోధకులకు, ఇతరపరిశోధకులకు పెక్కుసౌకర్యములు, నవకాశములు గలవు. కళాశాలలు, పరిశోధనాలయములు, ముద్రితగ్రంథభాండాగారములు నెక్కువగా గలవు. ఎల్లదేశములనుండియు, ఎల్లరాష్ట్రములనుండియు, ఎల్లమండలముల నుండియు పెక్కు రిచ్చటకు పరిశోధనములు సలుప నిరంతరము వచ్చుచుందురు. వారి యితరకార్యములతోపాటు పరిశోధనలును తిన్నగా నిక్కడ జరుగుచుండును. మఱియు నీ నగరముననే భాషా, చరిత్రపరిశోధకులు పలువు రున్నారు. ఇందఱకును ప్రత్యేక మిం కొకచోటికి బరిశోధనలు సలుపబోవుట దుష్కరముగ నుండును. కాక, ఆంధ్రవిశ్వవిద్యాలయము ప్రత్యేకింపబడినమాత్రమున, చెన్నపుర విశ్వవిద్యాలయమునకును చెన్నపురము వారికిని, తత్ప్రాంతమండలములవారికిని తెలుగుతో పని తీరిపోయెనని తలపజనదు. తెలుగుపై నభిమానము గలిగి, తెలుగుతెన్నుల నరసి తెలుగు వెలుగున మెలగగోరువా రీపురమున నిప్పుడును లెక్కకుమిక్కిలిగనే యున్నారు. ఇది యట్లుండ, నిట్లు తెలుగు తొలగ నున్నట్లె ఇతరభాషలును తొలగగలవేని ప్రభుత్వమువారికి కొంతదండుగ వ్యయముయొక్కబరువుతగ్గెనని చూపిరాజ్యకొనవచ్చును. కాని అట్టి సూచన లేవియు కానరాకుండుటచే నీభాండాగారభారమును ప్రభుత్వము దించుకొనజాలదు. కాబట్టి తెలుగుసంపుటములనన్నింటిని ఆంధ్రవిశ్వవిద్యాలయమువారికిచ్చివేయక—ఇచ్చుట వాస్తవమైననే—ప్రతిసంపుటమునకును నొక్కొకప్రతిమాత్రము—ఒక్కప్రతియే యున్నచో ప్రతికను వ్రాయించియైన—యొసగదగును. ఇది యుచితమయిన కార్యము; ఉభయసమ్మతమును. అన్నిటి నిచ్చివేయుడని వా రడుగుటయు, వీ రిచ్చివేయుటయు నెంతమాత్రము సహింపదగినది కాదు. ఈవిషయములను ప్రభుత్వమువారుచక్కగాపర్యాలోచించి అందఱకు ననుకూల మగుమార్గము నవలంబించి భాండాగారమునభివృద్ధికి దెచ్చుట సమంజసము.



సీమలోనుండు ఆంధ్రులు

విభవ సంవత్సరాదిపండుగ దినమున లండనునగరమున తీయబడిన ఛాయాచిత్రము

పైనుండి మొదటి వరుస:—(1) యస్. సుందరం గారు, బి. ఏ., యల్. యల్. బి., బారట్లా. వీరి నివాసము చిత్తూరుజిల్లా. ప్రస్తుతం రంగూను సెక్రటరి యేటువం దున్నారు. (2) రావాది వెంకటరత్నంగారు, కృష్ణాజిల్లా చేరికల్లపూడి గ్రామనివాసులు; లండను నగరమున ఇంజనీరింగు చదువుచున్నారు. (3) శేషమల్ల వెంకాటేశగారు, బి.ఎ., యఫ్.సి.యస్.; రాజమహేంద్రవర నివాసులు. కాగితపుపరిశ్రమనుగూర్చి ప్రత్యేకముగా నేర్చుకొనుటకు మదరాసు గవర్నమెంటువారు విద్యార్థి వేతనమిచ్చి వీరిని ఇంగ్లాండుకు పంపియున్నారు. వీరు ప్రస్తుతము బ్రిటనులోని పేపరుమిల్లులో పనిచేయుచున్నారు. (4) చలవాది నాగయ్యాచౌదరిగారు; వీరిది గుంటూరుజిల్లా పెదపూడి. యం. బి. అండ్ బి. యస్. బి. పరీక్షలయందు ఉత్తీర్ణులై మ్యాంచెస్టర్ వైద్యాలయమందు పనిచేయుచున్నారు. (5) ఉప్పద్రష్ట వెంకటలక్ష్మయ్యగారు, బి. ఏ., యల్. యల్. బి., తెనాలి నివాసులు. అక్కౌంటెన్సీపరీక్ష(యఫ్. యస్. ఎ. ఏ)కు లండనులో చదువుచున్నారు. (6) కన్నేపల్లి లక్ష్మీనరసింహంగారు, గంజాంజిల్లా బ్రిటిషుగ్రహారము వీరి నివాసస్థలము. ఘట్టుగోరు ప్లీడరుగారైన వెంకటప్పయ్యగారికుమారులు; ఐ. సి. యస్. కు చదువుచున్నారు. (7) పి. రామచంద్రరెడ్డిగారు, బి. ఎ., హైదరాబాదు వాస్తవ్యులు, యం. ఆర్. సి. యస్. అండు యల్. ఆర్. సి. పి. పరీక్షలకు లండనులో చదువుచున్నారు.

రెండవ వరుస:—(1) నాయని గోపాలకృష్ణ రెడ్డి గారు, (బి. ఎ) మునగాల; లండనులో రసాయనశాస్త్ర మందు యం. యస్. సి. పరీక్షకు చదువుచున్నారు. (2) కాకర్లమూడి కృష్ణమూర్తిగారు. యం. యస్. సి. (కలకత్తా) రసాయన శాస్త్రమందు డి. యస్. సి. పట్టము నొందుటకు మద్రాసు గవర్నమెంటు వారు పంపియున్నారు. (3) హనుమద్రి శ్రీరామకృష్ణశాయాశిరావు గారు, కృష్ణాజిల్లా పెదయ్యేరు వాస్తవ్యులు. ఇంజనీరింగు బి. యస్. సి. పరీక్షకు చదువుచున్నారు. (4) గోగినేని వెంకటప్పయ్యచౌదరిగారు;విద్యుత్‌బోలు; బారిష్టరు పరీక్షకును, అర్థికశాస్త్రమందు బి. యస్. సి. పట్టమును పొందుటకును లండనులో చదువుచున్నారు. (5) ఐ. జె. పీటర్సు గారు; యం.ఏ., యల్. టి.,మద్రాసు, లండనులో పి. హెచ్.డి. (సాహిత్య) పట్టమునకు చదువుచున్నారు. (6) నల్లభజోస్యుల నాగభూషణంగారు; గుంటూరు. లండనులో వర్తకము చేయుచున్నారు. (7) కన్నేపల్లి బలరామమూర్తిగారు; ప్రస్తుతం లండనులో ప్రాక్టీసు చేయుచున్న బారిష్టరు వెంకటలక్ష్మీనరసింహంగారి; కుమారులు. లండనులో ఇంజనీరింగు చదువుచున్నారు. క్రికెట్ ఆట యందు మిగుల ప్రవీణులు. (8) కన్నేపల్లి లక్ష్మీనరసింహంగారు, వీరును బారిష్టరు నరసింహంగారి కుమారులు ఐ. సి. యస్. కు చదువుచున్నారు. క్రికెట్టునందు ప్రవీణులు. (9) బి. పుల్లారెడ్డిగారు, హైద్రాబాదు. లండనులో యం. ఆర్. సి. యస్.,యల్. ఆర్. సి. పి. పరీక్షలకు చదువుచున్నారు. (10) చావలి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, బి. ఏ., తెనాలి. లండనులో అక్కౌంటెన్సీ డిగ్రీకొరకు చదువుచున్నారు. ఆర్టిస్టు నాగేశ్వరరావు (బొంబాయి)గారి సోదరులు.

మూడవవరుస (కుర్చీలపై కూర్చున్నవారు):— (1) కన్నేపల్లి గోపాలకృష్ణమూర్తిగారు, బారిష్టరు నరసింహంగారి కుమారులు. లండనులో సొలిసిటరుగా పని చేయుచున్నారు. (2) ఆదిపూడి సోమనాథరావుగారి కుమార్తె. శ్రీమతి వసుంధరాదేవి(కన్య)గారు; లండను విశ్వవిద్యాలయమునందు రసాయనశాస్త్రమున బి. యస్. సి. పరీక్షకు చదువుచున్నారు. మద్రాసు యూనివర్సిటీయందీమె యం. ఏ. పరీక్షలో ఉత్తీర్ణురాలైనది. మద్రాసు విశ్వవిద్యాలయమువారు ఈమెకు విద్యార్థివేతనము నిచ్చుచున్నారు. (3) బారిష్టరు కన్నేపల్లి లక్ష్మీనరసింహం గారి భార్య సుభద్రమ్మగారు, గా. వేపారామేశం పంతులుగారి సోదరి. (4) కన్నేపల్లి లక్ష్మీనరసింహంగారు, యం. ఏ., యల్. యల్. బి., గంజాంజిల్లా ప్రిటూగ్రహోరము వీరిది; కొంతకాలం మద్రాసు హైకోర్టులో ప్రాక్టీసు చేసిరి. ప్రస్తుతం ప్రివీకౌన్సిలునందు ప్రాక్టీసు చేయుచున్నారు. (5) బారిష్టరు కన్నేపల్లి వెంకటలక్ష్మీనరసింహంగారి కుమార్తె కేసరీదేవిగారు; బారిష్టరు పరీక్షకు చదువుచున్నారు. ఈతయంగు ప్రవీణరాలు. (6) గుంటూరు వాస్తవ్యులు ఫులుగూరు వెంకటసుబ్బారావుగారు, బారిష్టరు. ప్రివీకౌన్సిలునందు ప్రాక్టీసు చేయుచున్నారు.

నాల్గవవరుస–క్రిందకూర్చున్నవారు:—(1) పల్లంపాటి గోపాలకృష్ణయ్యగారు, సికింద్రబాదు వాస్తవ్యులు. వ్యవసాయ విద్యయందు ప్రత్యేకవిద్యను నేర్చి హిందూదేశమునకు మరలివచ్చిరి. (2) వ్యాసరగాము శేషగిరిరావుగారు, బి ఏ., యం. బి. బి. యస్; లండనులో యఫ్. ఆర్. సి. యస్. కు చదువుచున్నారు. (3) లంకా సుందరంగారు, బందరు వాస్తవ్యులు; ఐ. సి. యస్. కును,అర్థికశాస్త్రమునందు పి. హెచ్. డి. పట్టమునకును చదువుచున్నారు వీరు మల్లాది సత్యలింగం నాయకరుగారి విద్యార్థివేతనమును పొందుచున్నారు. (4) యర్రమిల్లి దీక్షితులుగారు; బి. ఏ., యల్. యం. అండ్ యస్., తెణుకు వాస్తవ్యులు. నేత్రరోగముల చికిత్సనుగూర్చి ప్రత్యేకముగా నేర్చుకొనుటకు లండనులో నున్నారు. (5) టి. జె. పీటర్సుగారు, బి. ఏ., యల్. టి., మద్రాసు; సాహిత్యమందు పట్టము పొందుటకై లండనులో నున్నారు

క్రిందివరుసలో (కుడివైపు) తుదిని కూర్చున్న వారిని గూర్చిన వివరణము తెలియరాలేదు.



శ్రీ దాసు త్రివిక్రమరావు గారు

శ్రీ దాసు త్రివిక్రమరావు గారు, యల్. యల్. బి., బారిష్టరు, బెజవాడ. హాలెండునందు జరుగనున్న అంతర్జాతీయ యువజనమహాసభకు వెడలిన ఆంధ్రప్రతినిధి. వీరు జర్మనీ, రషియా మొదలైన దేశములందలి గ్రంథాలయోద్యమమునుగూడ పరిశీలించివత్తురు.

కృష్ణావతారము

తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు

లోకాపవాదంబుఁ బోకార్పఁ దని తెల్పఁ దివిరి రత్నంబును దెచ్చినావు
మిత్రవాత్సల్యంబు మేలటం చని తెల్ప మించి కుచేలుఁ బోషించినావు
కడఁగి గోసంరక్ష కర్తవ్య మని తెల్పఁ గాపవై మందల మేపినావు
ఆపన్నులను బ్రోచుటే పాడి యని తెల్ప నింపారఁ బెనుఁగొండ నెత్తినావు
చెప్ప నేటికి స్వైర నీచెయువు లెల్ల - జగతి కాదర్శములు గావె? చర్చ సేయ
నీరహస్యంబుల నెఱుంగ నేర్తు మయ్య - పావనాచార! బృందావనీ విహార.

పీల్చినాఁడవు దానవీ ప్రాణవాయువుల్ త్రుటిలోనఁ జనుఁబాలతోడఁ జేర్చి
చూపినాఁడవు యశోదాపురంధ్రీమణి కఖిలప్రపంచంబు నాస్యసీమ
ఎత్తినాఁడవు భువనైక విక్రమశక్తి దివిజు లౌ నన ధరిత్రీధరంబు
త్రొక్కినాఁడవు జగద్ద్రోహిఁ గాళీయుని పడగలపై నిల్చి పాటవమున
వెలసినాఁడ వహో! పదార్వేల యిండ్ల-వివిధ రూపాలతో నేకవేళ యందు
నీమహత్త్వంబు లెల్ల వర్ణింపఁ దరమె! - పతితపావనరూప, గోపకులదీప!

ఆచార్యపీఠంబునందు నధిష్ఠించి ధర్మోపదేష్టవై తనరినావు
అర్జునాదులచేత నఖిలధర్మంబులఁ జేయించినావు సాక్షిత్వ మూని
స్వయముగా మానవాచారంబు లివి యంచు నోపికతోఁ జేసి చూపినావు
ధర్మేతర ప్రవర్తనుల నెల్లరఁ గూల్చి బలితంపు ధర్మంబు నిలిపినావు
గురుతర సుషుప్తినుండి మేల్కొలిపినావు - సలిపినాఁడ వమానుషచర్య లెన్నొ
సర్వశక్తిస్వరూప, విశ్వప్రదీప,- దళితసంతాప, సద్గుణోద్యత్కలాప!

భారతీయ మహిళామండలి

శ్రీమతి పద్మావతి కనకరత్నంగారు,
బి. యే., యల్. టి., బి. యస్ సి.



ఈమె కాశీ హిందూవిశ్వవిద్యాలయమునందు చరిత్రోపాధ్యాయగను, స్త్రీల కళాశాలకు సూపరింటెండెంటుగను నియమింపబడిరి.

మిస్. రంగారావు (రంగారావుగారి కుమారిత)



ఈమె చెన్నపురి మేరీకళాశాలయందు ఉపాధ్యాయ. ఇంగ్లాండులో ఉన్నతవిద్యను [illegible] కడచిన జూలైలో తిరిగి మదరాసు చేరిరి.

శ్రీ సి. రామసుబ్బనుగారి సతీమణి



ఈమె కడపజిల్లా విద్యాసంఘమున సభ్యురాలిగ నియమింపబడెను.

అలీ కురియను కన్య



ఈమె బి. యే. పట్టమును పొంది అమెరికాలో ఉన్నతవిద్య బడయుటకు వెడలుచున్నది.

డాహ్మాహ్మాకిన్ బి.ఏ., బి.యల్.



ఈమె రంగూను హైకోర్టునందు అసిస్టెంటు రిజిష్ట్రారుగ పనిచేయుచుండెను. ఇపుడీమె రంగూనుకోర్టు జడ్జిగ నియమింపబడినది. న్యాయాధిపత్యము వహించిన స్త్రీలలో నీమెయే మొదటిది.

శ్రీమతి కె. కె. కురు[illegible], బి.యే.



కొట్టాయం నివాసియగు నీమె తిరువాంకూరు శాసనసభాసభ్యురాలుగ నియమింపబడెను. ఈమె కొంతకాలము కలకత్తాయందును, మదరాసునందును క్రైస్తవ యువతీసంఘములకు కార్యదర్శిగనుండెను. కొన్ని యేండ్లక్రిందట వీవాలో జరిగియుండిన ప్రపంచమహిళాసభకు ప్రతినిధిగ బోయియుండెను.

చంద్రబాయి పాంటేకన్యగారు



పూనాలోని స్త్రీవ్యాయవాదిని; మహారాష్ట్రము, నీన్య నియం దీమెయే ప్రథమురాలు. కీ. శే. గోపాలకృష్ణ గోఖలేగారి మేనకోడలు.

పి. చెల్లమ్మాళ్ కన్య, బి. యే., (ఆనర్సు)



వాంగివాడు వెల్లాల తెగకు చెందిన యీమె చెన్నపురి విశ్వవిద్యాలయమున పట్టభద్రరాలైనది. ఈమె యిప్పుడు సిలోను ద్వీపమునందలి జాఫ్నాలోని రామనాథం కళాశాలయందు అధ్యాపికగ నియమింపబడి యున్నది.

ఇక్కావు అమ్మ, బి. యే. (ఆనర్సు)



ఈమె తిరువాంకూరు రాజవంశములోని యువతి. తిరువనంతపురమందు రాజకుమార్తెల ఉన్నతపాఠశాలయందు ఉపాధ్యాయినిగ నియమింపబడెను. రాజవంశమువారు ఉద్యోగము చేయుట కిదియే ప్రథమము.

దిద్దుబాట్లు

విభవ జ్యేష్ఠమాఘ భారతులలో నేను ప్రకటించిన 'లక్ష్మీపుర, అహాదనకరశాసనము'లందీ క్రింది సంస్కారములు చేర్చుకొనవలెను.

లక్ష్మీపురశాసనము

4, 7, 11, 12 పంక్తులలో 'ష్డ' గాఁ బడిన యక్షరమును 'ణ్డు' గా దిద్దుకొనవలెను.

అహాదనకరశాసనము

19, 31 పంక్తులలో, దష్డు, కొష్డును దణ్డు, కొణ్డు, లనుగా దిద్దుకొనవలెను. పదపదార్థవివరణము: (కూ విశ్లే దిద్దుకొనవలెను.

వే. ప్ర.

భావస్ఫురణ

పిశిపాటి వెంకటరమణయ్య గారు

ఎదియేనిన్ రచియింపఁగాఁ దలఁచి నే నెంతేఁ బ్రయత్నించినన్
హృదయం బెండి ఘనీభవించి శిల యై యేపారి సద్భావ మె
య్యదియుం బుట్టఁగఁ దావు నీక రసబాహ్యం బై విలంబింపఁగా
మదిఁ జింతించుచుఁ జిత్తశాంతికయి హర్మ్యం బెక్కి కూర్చుండినన్.

ననుఁ గని మందహాసమున నల్లని యంబరసీమ వజ్రపుం
దునుకలువోలె జీవకళ తొట్రిలఁ బూచిన మల్లెలుం బలెన్
మినమినలాడు తారకలు మింట మధూక్తులఁ గేలిసేయ ధూ
మినియుఁ జలింప కట్టె కను మీటక చూచుచు నుండె నత్తఱిన్.

తఱిఁ గొని నిద్రవోవు వనితాతతి సంభ్రమవిభ్రమ భ్రమల్
చెలఁగునటంచు నంబరవశీకృతముం దగఁ బాము సేయ నె
వ్వరి యవి వారి కీవలసి వచ్చు నటంచు నమర్చినట్లుగా
మెఱయఁ దొడంగెఁ దారకలు మింట మనోజ్ఞవిలాసవైఖరిన్.

నీలపు టంబరంబును వినిర్గత పుష్పవిలాస తారకా
జాలముఁ గేళికాగృహపు శయ్య నమర్పఁగఁ బశ్చిమాద్రిపై
బాలశశాంక దీపిక విభాసిల సర్వదిగంతరాళముల్
జోలలు పాడఁ గన్మొగుచు శూరుఁ డొకండు నిశానమేతుఁ డై.

అతఁడు రచియించినట్టి కావ్యంబునందు-నిగ్గు దేరిన సరసార్థ నిహిత పదవి
తానముంబలె తారకా తతి వెలింగె - మినుకుమినుకున భావగంభీర మగుచు.

దారుణాలపనిష్ఠా నిధానగరిమఁ - బ్రకృతిసౌందర్యమునకునై ప్రాఁకులాడు
వనలతాజాలముల సౌరు వాడఁ జేయు - వెలుఁగు కన్నను నిసిరె సంప్రీతికరము.



గ్రంథములు

దాంపత్యరహస్యములు

ఇది 'సారథి' చే వ్రాయబడి, యస్.వి. గోపాల్ అండ్ కో, మదరాసు వారిచే ప్రకటింపబడినది. క్రౌను సైజు; 258 పుటలు. వెల తెలుపబడలేదు.

గ్రంథముయొక్క పేరును, ప్రకరణముల శీర్షికలును ఆకర్షకములుగ నున్నవేకాని లోపలివిషయముల విశేషమేమియు కానరాదు. ఉపయోగకరమగు సలహాలుగాని, క్రొత్తగా తెలియదగు విశేషాంశములుగాని యిట్టి లేవు. లెక్కకు మిక్కిలిగనున్న యచ్చుతప్పులు, భాషావిషయికమగు నసందర్భములు పెక్కుచోట్ల నపార్థములకు దావొసగుచున్నవి. కొన్నివిషయములను వివరించుటలో క్షంతవ్యములుకాని తప్పులు జరిగియున్నవి. ఉదాహరణమునకు:'ప్రతివారును సురాపానము చేయవచ్చునని హిందూదేశమందలి కొన్ని శాస్త్రములయందుండియున్నది' అని వ్రాసిరి. ఈ విషయ మెట్లునిర్ధారింపబడినది? ఈవిషయమునకు 'దాంపత్యరహస్యముల'కును ఏమిసంబంధముకలదు! ఋతుదినములయందు స్త్రీలు వేరుగానుండి యింటిపనులయందు పాల్గొనకుండుట మన సంఘమం దాచారమై యున్నది. దానికి తగు కారణము లుంచికపోలేదు. ఈవిషయమును 'స్వార్థపరులు శాసించిరి' అనియు, తగుకారణములు చెప్పక యిట్లు వేరుగా నుంచుట 'స్వార్థము వాంఛించి కపట తంత్రమును పాలించుటగాక వేరేమి?' యనియు వ్రాసిరి. ఈవాక్యము లెంత యసందర్భముగను, అర్థము లేనివిగను నున్నవి! ఇందు పురుషుల స్వార్థము, కపటతంత్రమేమి యున్నది? 'స్త్రీల కథమను ప్రాథమిక విద్యావిధానమును నిర్బంధము గావింపవలయును' అని యొకచో వ్రాసి, ఆ ప్రకరణమందే యింకొకచో 'లాభము లేకయున్న అట్టి విద్యల నేర్పి అనవసరముగ బాలికలకు లేనిశ్రమ నేల కల్పింపవలయును?' అని వ్రాసిరి. ఈ రెండు వాక్యముల సమన్వయ మేమో! హిందూదేశమందలి వితంతువుల సంబంధమున వ్రాయుచు నొక్క ప్రకరణమున మూడు చోటులయందు వేరువేరుగా నిట్లున్నది 'ప్రస్తుతము హిందూదేశమున రెండు కోట్ల వితంతువులు గలరు', 'హిందూసంఘమునందు రమారమి 20 కోట్ల వితంతువులున్నారు', 'హిందూసంఘమునందు 24 కోట్ల వితంతువులున్నారు', 'వీనియందు అధికసంఖ్యాకులు తమ శిశుప్రాయమునందే భర్తలను గోల్పోయిరి'... ఇంత యసంగతపు వ్రాతలున్నప్పుడు ఈ గ్రంథముయొక్క విలువ నేమనవచ్చును! 'వివాహముయొక్క ప్రధానాశయము వివాహమని ... చేర్చనియుంటిమి' ఈ వాక్యములో నేమి యర్థమున్నది? 'శిశుసంరక్షణ' యను ప్రకరణమున పవుడరు, బోరాక్సు, మెత్తనిటవ్వల్లు కాలికో టస్సిషు బట్టలు, ఫ్లానెలు రుమాళ్లు, సైంపెరు, వియల్లాగౌనులు, హుడ్ మున్నగునవన్నియు నవసర సామగ్రిగా చేర్కొనిరి. ఇవన్నియు భారతదేశసాంప్రదాయములకు వస్తువులేవా? ఇంతవరకును ఆరోగ్యమును బలమును గలిగి హిందూసంఘమున పుట్టి పెరిగిన బిడ్డలు వీటి నుపయోగింపనిదే పెద్దవారు కాలేదా? పాశ్చాత్యనాగరికత

యనుకొనబడు దానిలో నిదియే మనకు పట్టుబడుచున్నది. 'ప్రపంచమందలి జనసంఖ్య విపరీతముగ పెరిగిపోవుట యే పాపముపండుట' యట. అందుకొఱకు కృత్రిమసంతాన నిరోధోపాయము నవలంబింపవలయునట. సంతాననిరోధక నీతిమార్గములు రవీంద్రుని యనుమతిని బడసి యున్నవట. రవీంద్రు డీవిషయమున నేసందర్భమున నే వాక్యములు వ్రాసియున్నాడో వ్రాసియుండిన బాగుండెడిది. ఆమహనీయుని వాక్యముల కజ్ఞానముచే నపార్థకల్పనము కావించిరేమో యని యనుమానింప వలసియున్నది.

అనుకూలదాంపత్యము గూర్చి టాల్‌స్టాయి, అరిస్టాటల్, సోక్రటీస్, గాంధీమహాత్ముల యభిప్రాయము లిందు పొందుపరచుచున్నామని యొక ప్రకరణమున వ్రాసి తుది యిరువురి యభిప్రాయముల నుదాహరింప మరచి కాబోలు ముద్రింపలేదు. ఇట్టి గ్రంథములు స్వతంత్ర మానవాభ్యుదయముల కుపకరింపక పోవుటయే కాక మిరుమిక్కిలి యపకరింపక పోవునని కానిచెప్ప సాహసించినందుకు విచారముగుచున్నది. 'రావు'

ఆంధ్రవచన భారతము: సభాపర్వము

కవిజన విరరాజప్రణీతము: ౧౭-వ శతాబ్దపు వచనగ్రంథము. ప్రకాశకులు: యస్. కే. వెంకటేశం పంతులుగారు, ఆంగ్ల వాఙ్మయ ప్రధానబోధకులు, గవర్నమెంటు ఆర్ట్సుకాలేజి, రాజమండ్రి. డెమ్మీసైజు ౩౬౮ పుటలు. వెల రు ౨-౮-౦.

ఇం దెన్నదగిన కుమారుల అనంతభూపాలుడు రచించిన భాగములు గలవు. ఇందలిశైలి అతిస్నిగ్ధముగను, మనోజ్ఞముగను నెలయుచున్నది. పునరుక్త్యాదులు లేకుండ శబ్దప్రయోగమున ప్రౌఢవము కరు నిండియున్నది. శ్రీ వెంకటేశం పంతులుగారు, ఆకాలపు భాషాస్వరూపము చెల్లడించు నభిలాషతో, తాళపత్రగ్రంథమున నున్నరీతినే దీనిని బ్రకటించిరి. వారు దీని కొక విస్తృతమగు మంచిపీఠిక నాంగ్లమున వ్రాసిరి. అందు వారు 'ఈ అద్భుతమగురచన ౧౭-వ శతాబ్ది చివరను, ౧౮-వ శతాబ్ది మొదటను కర్ణాటదేశమున విలసిల్లిన ఆంధ్రప్రతిభ కొక శాశ్వతమగుచిహ్న'మని నుడివినది సత్యము.

ఇందలి శైలికి మచ్చు:—

అంత నా రామకృష్ణులు, బాల్యంబు నతిక్రమించి యేడేండ్లప్రాయంబు వార లగుచు, నీలపీతాంబరంబులు ధరియించి, యరుణ ధవళవర్ణంబులగు దివ్యగంధంబు లలందికొని, చిక్కంబును, నలాబుపాత్రయును బూని, వనంబున గోవులకు మేపుచు గుమ్మరు సమయంబున నెమలిపింఛంబులు కర్ణావతంసంబుగ ధరియింపుచుం గెంజిగురాకుగుత్తులను, బద్మమాలికలును, చిప్పకూంకటులం జుట్టుకొనుచు, వనమాలికలు ధరింపుచు, వస్త్రబంధ సూత్రంబుల యజ్ఞోపవీతంబులుగ వైచికొనుచుం, బర్ణవాద్యంబులు గావింపుచుం, బిల్లంగ్రోవు లూదుచు, మఱియు నొకొక్కరొకఁడ నవ్వుచు, గ్రీడింపుచు, నొకొక్క రొకఁడం జిగురుంబొన్నలం బన్నలించుచు, నేలఁగొక్క రొకఁడ నిద్రించుచు, ఫలంబుల నుపయోగించుచుం బూదేనియలు గ్రోలుచు, నెందెందులం దిరుగుచు, మహాభుజంగ యుగ్మంబు చందంబున వనంబునం ద్రిమ్మరుచునుండి యంత నొక్కనాఁడు బృందావనంబునకుం జని గోగణంబుల మేపుచు నిజకేళీరథాయలనలవ వనంబు బ్రకాశింపం జేయుచు విహరింపుచుండిరి.

ఆర్యమత తత్త్వబోధిని (వచనము)

క్రౌను, ౬౪ పు. వెల రు ౧-౪-౧.

గ్రంథకర్త: వేదం సుందరరాజ శర్మగారు, హిందూ థియాలజికల్ స్కూల్ తెలుగుపండితులు; విలాసము; నెం. ౨౪౬-౧౫౬ టంకశాలవీథి, మద్రాసు.

ఈగ్రంథముపేరే దీనియందు వర్ణింపబడిన విషయముల స్వరూపమును సూచించుచున్నది. గ్రంథము ప్రశ్నోత్తరరూపమున నున్నది. ఆర్యమత వాఙ్మయ తత్త్వములను జిజ్ఞాసువులుగ దెలిసికొనుటకిది యుపయోగించును. వచనరచనము. శైలి సరళముగానే యున్నది. వేదములను పరివర్తింపరాదు, విష్ణువే ఊర్ధ్వపుండ్రపము అను నిట్టి కొన్ని పరంపరాగత మూఢవిశ్వాసజనితములగు నభిప్రాయము లిందు కాన్పించుచున్నవి. ఇట్టియూహలు తొలగినచో భారతీయులకు మేలు గలుగును.

శృంగార భల్లాణచరిత్ర

గ్రంథకర్త: చితారు గంగాధరకవి. ప్రకాశకులు జి. యస్. శాస్త్రి అండుకో. వరపాలుచెట్టి నెం. 110, మద్రాసు. క్రౌను ౨౧ పుటలు. ఫైదర్ వేటు కాగితము. సుందరమైన అచ్చుపూర్పు, బైండు. వెల ౩-౧-౧.

ఈపుస్తకము శృంగార గ్రంథమాలలో నాల్గవ సంఖ్యగలది. శివభక్తాగ్రేసరుడగు భల్లాణరాజు విటజంగముగా వచ్చిన పరమేశ్వరునకు భార్యను వేశ్యగా నర్పించి శివసాయుజ్యమును బొందినకథ ఆశ్వాసత్రయగ్రథితమగు నీద్విపద ప్రబంధమున వర్ణితమైనది. శివభక్తి పారమ్యమును చాటుచున్న యీగ్రంథమున వేశ్యాశృంగారము సరసముగా సంతరింపబడినది. దోషభూయిష్ఠమయినను కవిత్వము దేశితెనుగునుడి కారపు సొంపుగలిగి పామరజన సుబోధముగ నున్నది. గ్రంథకర్త పదునేడవ శతాబ్దమునకు జెందినవాడు కావచ్చును. అచ్చుతప్పులు హెచ్చుగనున్నవి.

ప్రభవ

గ్రంథకర్త: శ్రీ. శ్రీనివాసరావుగారు, కవితా సమితి, విశాఖపట్టణము. క్రౌను సైజున ౫౮ పుటలు గలవు. వెల రు ౦-౭-౦.

ఇది కవితాసమితి గ్రంథావళిలో మొదటిది. ఇందు ప్రకృతిగీతములు, ప్రణయగీతములు, ప్రకీర్ణగీతములు అను వేర్వేఱువిభాగముల పదునాఱు ఖండకావ్యము లున్నవి. శైలియందు సార్థకతకంటె సమాసతత్పరత యెక్కువగ గోచరించుచున్నది. ఇంకను విషయానుగుణ్యముగ శైలియందు మార్పులు కన్పడవలెను. తెనుగు వాడుకము చాల తక్కువగనున్నది. ఒక్కొకచో బడలించు సమాసభూయిష్ఠత యున్నను మొత్తము మీద శైలి బాగుగ నున్నది. భావములందును గాంభీర్యమున్నది. భావములకును, భాషకును సామరస్యము సంధించుట కీకవి యింకను ప్రయత్నింపవలెను. ఇది చదివిన వారికి కాలక్రమమున ఈకవి కవిత యింకను సంపన్నము కాగలదను ఆశపొడమును. భావస్వాతంత్ర్యమును, భాషాసౌష్ఠవమును మెచ్చదగియున్నవి. ప్రకృతిపథముల తత్త్వాన్వేషణము సలుప సమకట్టిన యీకవి కిశోరమానసము ఉత్సాహరంజితమై యొప్పుచున్నది.

The Torch of Learning by Mr. Benaiah Cole, Master, Christian Line, Cuddapah.

'వాచకపుస్తక'మట. చిన్నచిన్న ఆంగ్ల పదములకును, వాక్యములకును ఉచ్చారణములు, అర్థములు ఉన్నవి. క్రౌనుసైజు ౮౭ పుటలు. వెల ౫ అ.

ఆంధ్రాక్షరములు

రాజా పానగంటి పార్థసారథిరాయణింగారు రచియించిన వ్యాసము; డెమ్మిసైజు ౨౮ పుటలుగలవు.

శృంగారసావిత్రి

తంజాపూరి రఘునాథరాయలు రచించినదట. క్రౌనుసైజు ౧౩౭ పుటలు. వెల రు ౨. ఇది శృంగార గ్రంథమాల ౫వ కుసుమము. ప్రకాశకులు: జి. యస్. శాస్త్రి అండుకో., మద్రాసు.

పశువైద్యచింతామణి

గ్రంథకర్త: యేలేశ్వ శ్రీరాములుచౌదరిగారు, అంగలూరు (పోస్టు), కృష్ణాజిల్లా. క్రౌనుసైజు ౧౫౮ పుటలు. వెల రు. ౧-౮-౦.

కాంతాపహరణము (సాంఘికనాటకము)

గ్రంథకర్త: పుల్లేటికుర్తి కృష్ణమాచారిగారు, డెమ్మిసైజు ౧౬౭ పుటలు. వెల రు ౧-౭-౦.

ప్రకాశకులు: వేగుజుక్క గ్రంథమాల, పూడిపెద్దివారివీథి, బరంపురము (గంజాము).

శ్రీమద్రామానుజీయము (నాటకము)

గ్రంథకర్త: ముడుంబై రామానుజాచార్యులుగారు; డెమ్మిసైజు ౧౮౬ పుటలు. రాజమండ్రి శ్రీరంజన్ ముద్రాక్షరశాలయందు ముద్రితము. వెల రు ౧-౦-౦.

తెనుగు అభ్యాసబోధిని ౧ భాగము

సంపాదకుడు: రా. వెంకటసుబ్బయ్యగారు. క్రౌనుసైజు ౨౧ పుటలు. వెల ౦-౧-౬.

శ్రీరామశతకము

గ్రంథకర్త: సత్యవోలు రాధామాధవరావుగారు, కాకినాడ, వెల ౨ అణాలు.

విషనివారిణి

ప్రకాశకులు: యేలేశ్వ శ్రీరాములు చౌదరిగారు, అంగలూరు, వెల ౮ అణాలు.

సాభిప్రాయ విశేషములు

యూరపురాజ్యముల విషమస్థితి

ప్రాగ్దేశములందు ప్రవర్ధమానం బగుచున్న ప్రబోధము పాశ్చాత్య రాజ్యతంత్రజ్ఞుల కసహ్యమై వారి ప్రవృత్తియందు విచిత్రమైన పరివర్తనమును గలుగజేయుచున్నది. పాశ్చాత్య రాజ్యాధికారులు రాజ్యనీతిని, రాజ్యధర్మమును, మానవధర్మమును విసర్జించి రాజ్యతంత్రమును మాత్రము పరిగ్రహించుచు మహాప్రళయము నారాధించుచున్నారు. ప్రపంచ మంతయును తెల్లవారికి సేవను జేయుటకే ఏర్పడినది. మృగములు వారి మృగయావినోదమున కేర్పడినవి. నల్లజాతులు తెల్లజాతులకు బానిసతనమును జేయుటకై ఏర్పడినవి. సృష్టిలోని మంచివస్తువు లన్నియును తెల్లవారి విలాసమున కేర్పడినవి. వారితృష్ణకు మితిమేరలు లేవు. దానిని పూరించుకొనుట యసాధ్యమని వారు గ్రహింపజాల కున్నారు.

ఐరోపామహాసంగ్రామము గలుగజేసిన మహాదుఃఖమైనను పాశ్చాత్యరాజ్యములకు జ్ఞానోదయమును గలుగజేయలేదు. సకలరాజ్యములును వారితృష్ణాపూరణమునకై సంగ్రామసన్నాహములను జేయుచు మహాప్రళయము నాశ్రయించుచున్నవి. సంగ్రామ సన్నాహముల కపారమైన వ్యయమును జేయుచున్నవి. ఫ్రాన్సు రాజ్యమును పట్టి పీడించిన వైరసాధనపిశాచము నిశ్చేష్టతను బొందినను ఫ్రాన్సుకలవరము మాత్రము తగ్గలేదు. ఫ్రాన్సుకు జర్మనిని సాధించుట సాధ్యమైనను ఆత్మవిశాసము సాధ్యము గాలేదు. దురాశాపిశాచము శాంతిని బొందలేదు. యూరపుఖండమునందు రాజ్యాధిపత్యముగాని, ఆర్థికాధిపత్యముగాని ఫ్రాన్సునకు లభించలేదు. ఫ్రాన్సును సంగ్రామము కృశింపజేసినది గాని బలియజేయలేదు. ధనసంపద, జనసంపద లేని రాజ్యాధిపత్యము నిరర్థకమని ఫ్రాన్సు గ్రహించినది. జర్మని పరాజితమైనను జనసంపదను గలిగి వికసించుచు ఫ్రాన్సునకు హృదయశల్యమగ నున్నది. ఈ దురవస్థనుండి తప్పించుకొనుటకు ఫ్రాన్సుకు మార్గాంతరము గనుపడకున్నది. బ్రిటీషు రాజ్యనీతిజ్ఞు లెప్పటివలెనే రాజ్యతంత్రమును లోకమునం దంతటను వ్యాపింపజేయుచున్నను నది నిష్ఫలముగ నున్నది. బ్రిటీషు రాజ్యాధికారము విశ్వవ్యాప్తమైనను శిథిలమై సారహీన మగుచున్నది. లోకమునం దంతటను శిథిలమగుచున్న బ్రిటీషు ప్రాబల్యమును పునరుద్ధరణము చేయుటకు బ్రిటీషు రాజ్యతంత్రజ్ఞులు పన్నుచున్న మాయోపాయములు నిరర్థకము లగుచున్నవి.

బ్రిటీషురాజ్యము వాణిజ్యవ్యాపనమును జేసి, రాజ్యలాభమును, రాజ్యవ్యాపనమును జేసి

ఆర్థికాధిపత్యమును బడసినది. బ్రిటీషుసామ్రాజ్యమునకు దేశాధిపత్యము నిలిచియున్నను వాణిజ్యప్రాబల్యమును, ఆర్థిక ప్రాబల్యమును తగ్గిపోయినవి. తగ్గుచున్న వాణిజ్యార్థిక ప్రాబల్యములను బలపరచుటకు బ్రిటీషు రాజ్య నిర్వాహకు లవలంబించుచున్న వామ మార్గము నింద్యమై ప్రపంచశాంతికిని, మానవకల్యాణమునకును ప్రతిబంధకముగ నున్నది. చీనాయందును, ఇతర ప్రాంతములందును వా రవలంబించుచున్న రాజ్యతంత్ర మసహ్యముగ నున్నది. అమెరికా చీనా కార్థిక రాజకీయస్వాతంత్ర్యము నంగీకరించినది. సర్ ఆస్టిను చేంబర్లిను చీనా స్వాతంత్ర్యము నంగీకరించుట కభ్యంతరములను జెప్పుచున్నారు. గ్రేటుబ్రిటను ఎన్ని యభ్యంతరములను కల్పించినను చీనా స్వాతంత్ర్యము స్థిరపడినది. అమెరికా, రుష్యా రాజ్యములు చీనాస్వాతంత్ర్యమునకు జూపుచున్న సానుభూతి బ్రిటీషు రాజ్యనీతిని నిరర్థకము చేసినది. చీనాస్వాతంత్ర్య మాసియాదాస్యవిమోచనమునకును, భారతీయదాస్యవిమోచనమునకును సహాజముగ వినియోగ పడగలదు. చీనాపరిస్థితు లైనను బ్రిటీషు రాజ్యతంత్రజ్ఞులకు గుణపాఠమును నేర్పజాలకుండుట విచిత్రముగ నున్నది. అమెరికారాజ్యము కెల్లోగుగారి ద్వారా నిర్ణయించిన సానాజాతీయ సంధి నిర్ణయములపట్ల గ్రేటుబ్రిటను చూపిన సంశయహృదయమును బ్రిటీషు రాజ్యనీతిజ్ఞుల సంకుచితలక్ష్యమును వ్యక్తము చేయుచున్నది.

* * * *

ఆర్థిక రాజ్యయుగము

మానవచరిత్రయందు చిరకాలమునుండియును దేశాధిపత్య మార్థికాధిపత్యమునకు సాధనముగ నేర్పడినది. పరదేశములను పశుబలసాధనమున నాక్రమించుకొని దేశవాసుల సంపదలను హరించుట లోకమునకు పరిపాటియైనది. ప్రజలనుండి నయముననో, భయముననో ద్రవ్యమును గైకొనుచు ప్రభువులును, వారి యనుచరులును సుఖపడుట యాచారమైనది. రాజ్యసంపాదనమునందును, రాజ్యపాలనమునందును ప్రభుత్వములకు స్వార్థముమూలబీజముగాని ప్రజాహితము మూలబీజముగాదు. నిరంకుశ రాజ్యములందు రాజులు రాజ్యాదాయమును దుర్వినియోగము చేసినపుడు ప్రతిఘటనము లేకపోయినను నియమిత రాజ్యములందు ప్రతిఘటనము ప్రబలుచున్నది. నియమిత రాజ్యములందు రాజ్యాదాయమును ప్రజల యనుమతి లేక వ్యయము చేయుట దుర్లభమైనది. నియమిత రాజ్యములం దైనను స్వదేశమునందు గల నియమిత వ్యయము పరాధీన దేశములం దవలంబింపబడకున్నది. పరాధీన రాజ్యములందు రాజ్యాదాయమును యథేచ్ఛముగ నిర్ణయించుటయును, ఖర్చుపెట్టుటయును సామాన్యవిషయముగ నున్నది. కాని రాజ్యాదాయము స్వాధీన దేశములందును, పరాధీన దేశములందును సహజమైన స్వయంపోషణమునకును, అపారమైన సైన్యవ్యయమునకును చాలకున్నది. ఇట్టి విషమావస్థయందు స్వాధీన రాజ్యములకును, పరాధీన రాజ్యములకును లోకవ్యవహార

ములందు ప్రాబల్యము గలిగి భాగ్యభోగములననుభవించుటకు ఆర్థికప్రాబల్యము ప్రధానసాధనముగ నున్నది.

ఆర్థికసామ్రాజ్యము, రాజ్య సామ్రాజ్యము నతిక్రమించి ప్రపంచవ్యాపకత్వమును గలిగియున్నది. రాజ్యాధికారము లేకపోయినను పరదేశముల సంపదలు శ్రమలేకుండా స్వాధీనమగుచున్నపుడు ప్రపంచమునందు రాజ్యభ్రాంతి నశించుచున్నది. బ్రిటీషుసామ్రాజ్యము పూర్వమువలెనే రాజ్యాధిపత్యమును గలిగియున్నను, ఆర్థికాధిపత్యమును గోల్పోవుచున్నది. గ్రేట్బ్రిటనునందు పరిశ్రమల నుద్ధరణము దుస్తరముగ నున్నది. ప్రధానములైన బట్టలపరిశ్రమయును, ఇనుముపరిశ్రమయును దుర్దశయం దున్నవి. గ్రేట్బ్రిటను వ్యాపార మమెరికా, జపాను, జర్మని, ఇటలి, ఫ్రాన్సు మొదలగు దేశముల పోటీకి నిలువజాలక సన్నగిలుచున్నది. సకల రాజ్యములును ఆర్థికవికాసమును గోరుచున్నవి. ఆర్థికవికాసమునకు సకలజాతులును మహాసంరంభమునకు ప్రయత్నములను జేయుచున్నవి. బ్రతుకు తెరువున్నగాని శుభములు సాధ్యములుగావు. బ్రిటీషుప్రజలకు వారిజీవయాత్రను సౌఖ్యప్రదముగ నడుపుకొనుటకు పరదేశాక్రమణము, పరదేశవాణిజ్యము, పరదేశపీడనము సహజధర్మములైనవి. వారి నిర్మాణపదార్థములతో ప్రపంచమును నింపి బ్రతుకుట బ్రిటీషుప్రజలకు సహజమైనది. చిరకాలాభ్యస్తమైన సహజావస్థ కిపుడు ప్రబలమైన ప్రతిఘటన మేర్పడినది.

ఆర్థిక సామ్రాజ్యాధిపత్యము అమెరికాకు సంక్రమించినది. అమెరికా, జపాను, జర్మని మొదలగు దేశములు పారిశ్రామిక వాణిజ్యాధిపత్యమును సంగ్రహించుచున్నవి. రుష్యా రాజ్యము బ్రిటీషు రాజ్యప్రాబల్యమునకు ప్రబలమైన ప్రతిఘటనము వహించుచున్నది. రుష్యా ప్రతిఘటనమును నిర్మూలము చేయుటకు బ్రిటీషు ప్రభుత్వము సంగ్రామ సన్నాహములను జేయుచున్నది. బ్రిటీషు సామ్రాజ్యాంతర్భాగములు స్వయం పోషణమును స్వయం వికాసమును గోరుచు ప్రాతికూల్యమును వహించుచున్నవి. ఆస్ట్రేలియా, కనడా, ఆఫ్రికా దేశము లార్థిక స్వాతంత్ర్యమును గోరుచున్నవి. భరతవర్షమునందును చల్లగా ప్రతిఘటన మేర్పడుచున్నది. దూది యంత్రాలయములు, రాటములు బ్రిటీషు దూదిపరిశ్రమను స్తంభింపజేయుచున్నవి. కాంగ్రెసునిర్ణయించిన బ్రిటీషువస్తుబహిష్కారము చల్లగా బ్రిటీషు వ్యాపారమును స్తంభింపజేయుట సహజము. భారతీయుల హృదయమునందు ప్రవర్ధమానం బగుచున్న బ్రిటీషువస్తుబహిష్కారాభిలాషను సభలు, సంభాషణలు, సంకల్పములు విశదము చేయుచున్నవి. లోకమునందంతటను సంకుచితమగుచున్న బ్రిటీషు ప్రతిష్ఠను, ఆర్థికాధిపత్యమును భరతవర్షమునందు వ్యాపింపజేసి బ్రిటీషు పాశబంధములను స్థిరతరముచేయుటకు బ్రిటీషు ప్రజలు పరిత

పించుచున్న విధమును వారి భావములు విశదము చేయుచున్నవి. బ్రిటీషు ప్రజలకును, బ్రిటీషువ్యాపారమునకును, బ్రిటీషు వస్తువులకును హిందూ దేశమును రంగభూమిగ నుంచుటయే బ్రిటీషుప్రజల సంకల్పమని వారి సంభాషణలువిశదము చేయుచున్నవి. బ్రిటీషుప్రజలేమి చేసినను వారి ప్రాబల్యమితరభాగములందువలె భరతఖండమునందును క్షీణించుట సహజము. ఇది కాలప్రభావము ప్రజాప్రబోధమును నిరోధించుటకు బ్రిటీషురాజ్యాధికారులు చేసెడి ప్రయత్నము లన్నియును నిరర్థకములని సకల దేశముల పరిస్థితులును విశదము చేయుచున్నవి. భారతీయుల వికాసమువలన బ్రిటీషు సామ్రాజ్యమునకు ప్రయోజనము గలదుగాని భారతీయుల శోషణమువలనను బ్రిటీషు సామ్రాజ్యమునకు కొంచెమైనను ప్రయోజనము గలుగదు. బలసంపదలుగల భరతవర్షము బ్రిటీషుప్రజలను పోషించగలదుగాని శుష్కించిన భరతఖండము బ్రిటీషుప్రయోజనములకు వినియోగపడజాలదు. బ్రిటీషురాజ్యనీతిజ్ఞులును, బ్రిటీషుప్రజలును నీధర్మమును గ్రహింపకుండుట సంతాపకరముగ నున్నది.

* * * *

భారతీయ పారతంత్ర్యము

ముప్పదిమూడుకోట్ల భారతీయుల పారతంత్ర్యస్థితి వారికేని, బ్రిటీషుసామ్రాజ్యమునకును, లోకమునకును పరమానర్థములకు మూలముగ నున్నది. సకలాంగములు కృశించిన మానవు లెవరికిని మేలుచేయజాలరు. మానవులకు శక్తివికాసములు స్వేచ్ఛాస్వాతంత్ర్యములవలన గలుగుచున్నవి గాని నిర్బంధ పారతంత్ర్యముల వలనను గలుగుట లేదు. బ్రిటీషురాజ్యాధికారులును బ్రిటీషు ప్రజలును కోరెడి స్వీయప్రతిష్ఠకును, స్వలాభమునకును, స్వప్రయోజనమునకును నైనను చైతన్యము గల భారతీయులు వినియోగపడ గలరుగాని చైతన్యములేని భారతీయులు వినియోగపడజాలరు. ఆంగ్లేయు లెవరు వేసినను నొకతాళముచే వేయుచున్నారు; ఎవరు పాడినను నొకపాటనే పాడుచున్నారు. అన్ని సందర్భములందును ఆతాళగీతములే ప్రత్యక్షము లగుచున్నవి.

పౌరసేవోద్యోగులను హెచ్చరించుటకు భారతీయుల యసమర్థత, బ్రిటీషు ప్రజల సమర్థత గోచరం బగుచున్నది. రాయలు కమిషనును నియమించుట యందు భారతీయుల యంతర్విభేదములు, బ్రిటీషుప్రజల ఏకత్వము గోచరం బగుచున్నవి. దేశసంరక్షణమునందు భారతీయుల నిస్సహాయత్వము, బ్రిటీషుప్రభుత్వ ప్రాబల్యము ప్రత్యక్ష మగుచున్నవి. ఆర్థికస్థితియందు భారతీయుల పారతంత్ర్యము, బ్రిటీషుప్రజల స్వాతంత్ర్యము గనుపడుచున్నది. ఇర్విను బర్కెనుహెడు వింటరుటను ప్రభువులును, రామ్సె మెక్డొనాల్డు ఫిలిపుస్నోడను గారలును సర్ మైకేలు ఓడ్వాయరు పాడిన పాటనే శ్రుతినిమార్చి పాడుచున్నారు.

ఈ పాటలందు భేదము శ్రుతియందు గనుపడుచున్నది గాని భావరాగ తాళము [illegible]దించుకైనను గనుబడదు. భారతీయుల నిస్సహాయస్థితి శ్రీనివాసయ్యంగారు, జిన్నా, సప్రూ, బెజంటమ్మ, చమనులాలు మొదలగువారలకు గ్రేటుబ్రిటనునం దనుభవవేద్యమైనది. భారతీయులస్థితి సర్కసులలోని జంతువుల వలెనున్నది. నిర్బంధింపబడిన గజసింహ శార్దూలాదులాయుధపాణియైనయజమానికిగడగడలాడునటులున్నది. ఈదైన్యస్థితి భారతీయులస్వయంసహాయమువలన పోగలదు గాని బ్రిటీషు ప్రజల దయాదాక్షిణ్యము వలనను పోజాలదు. సైమనుకమిషను లెన్నియైనను వచ్చిపోవచ్చును; స్వరాజ్యవిధానము లెన్నియైనను సిద్ధముగావచ్చును. సాధనములనెన్నిటినైనను ప్రచురింపవచ్చును; ప్రత్యక్షాచరణమున కవసరమైన శక్తిసామర్థ్యములు లేనంతవరకును భారతీయుల మనోరథము లన్నియును రిక్తమనోరథములైయుండెడి విధమును స్వదేశ విదేశ వ్యవహారములు విశదము చేయుచున్నవి.

*　　*　　*　　*

సైమనుకమిషను

సైమనుకమిషను విషయమై బ్రిటీషు రాజ్యాధికారు లవలంబించుచున్న వామమార్గము లసహ్యమైనను భారతీయుల నిస్సహాయస్థితికి నిదర్శనములుగ నున్నవి. సైమను కమిషనును బహిష్కరించుటయందు నాయకులకును, ప్రజలకునుగల దృఢసంకల్పము సర్ జాన్ సైమనుకును, కమిషను సభ్యులకును, భారత బ్రిటీషు ప్రభుత్వములకును విశదమై యున్నది. గతాగమనమునందు సైమను కమిషనుకు గుంటూరు పురమునందు గలిగిన పరాభవము ప్రజాహృదయమునకు ప్రమాణముగ నున్నది. అయినను సైమను కమిషను పట్ల ప్రజల కాదరణము గలదని చాటుటయును, దానిని సార్థకము చేయుటకు మాయోపాయములను పన్నుటయును పారతంత్ర్యము గలుగజేసెడి దైన్యమును చాటుచున్నది. సైమను కమిషను స్వార్థారాధకులకును, దేశారాధకులకును నవకాశములను గలుగజేసినది. స్వార్థారాధకులు సహకార ఫలమును, దేశారాధకులు సహకార నిరాకరణ ఫలమును ననుభవించుచున్నారు. కులభేదములు, మతభేదములు, జాతిభేదములు ప్రభుత్వమునకెప్పటివలెనే భేదతంత్రము నారాధించుట కవకాశములను గలుగజేసినవి. ఉత్తరమున హిందూమహమ్మదీయ విభేదములును, దక్షిణమున బ్రాహ్మణ బ్రాహ్మణేతర విభేదములును ప్రభుత్వతంత్రమున కవకాశములను గలుగజేసినవి. పంజాబు, బెంగాలు, బొంబయి, సంయుక్తరాష్ట్రములందలి శాసనసభలయందు సహకారభావ మామోదమును బడసినది. చెన్నరాష్ట్రమునందును సహకారమార్గ మామోదింపబడునని పరిస్థితులు విశదము చేయుచున్నవి. వెనుకను సైమను బహిష్కారము నామోదించిన చెన్నరాష్ట్ర శాసనసభ తిరిగి సహకారము నామోదించుట తలవంపులుగ నుండుట సహజము. కాని సహా

కారవాదులును నచిరకాలములోనే వారి కన్నులను తెరువవలసియుందురు. స్వార్థపరత్వము చిరకాలము మనజాలదు. స్వార్థపరత్వమునందు గల విషబీజములె దాని వినాశనమునకు సాధనం బగుచున్నవి. సకలధర్మములను నతిక్రమించిన సైమనుకమిషనుకు దోడ్పడుట మహాపరాధముగ నుండగలదు. ఆ యపరాధమును జేసెడివారెవరైనను దానిఫలము ననుభవింపవలసి యుందురు. మహమ్మదీయులందును, బ్రాహ్మణేతరు లందును నీవిషయముపట్ల భేదాభిప్రాయము లేర్పడుటయే దాని యధర్మస్వరూపమును చాటుచున్నది.

సర్ కె. వి. రెడ్డి, సర్ ఎ. పి. పాత్రో, ఎ. రామస్వామి మొదల్యారు, పానుగల్లు రాజా, మునిస్వామినాయుడు గారులు మొదలగువారు భిన్నాభిప్రాయములను గలిగి స్వపక్షమునకు విఘాతమును గలుగజేయుచున్నారు. స్వల్పప్రయోజనముల కాశపడి దేశప్రయోజనములను చెడగొట్టుట యనుచితము. గ్రామసీమలందును, పట్టణములందును సామాన్యజనులు పడుచున్న కష్టములు వర్ణనాతీతములు. వారికష్టము లుద్యోగములవలన తీరునవి కావు. నలుగురు మంత్రులైనను, పదుగురు జడ్జీలైనను, కలెక్టరులైనను ప్రజల కష్టములు గట్టెక్కజాలవు. ప్రజలను వారి కష్టములనుండి గట్టెక్కించుటకు స్వరాజ్యమే శరణ్యముగ నున్నది. సాంఘికవిభేదము లున్నపుడు వాని నెదుర్కొనుట భావ్యముగాని విడనాడుట భావ్యము గాదు. వెనుకబడియున్న సంఘములకు ప్రత్యేకమైన సౌకర్యముల నొసంగుటయే సాంఘికసమస్యలను నిర్ణయించుటకు సాధనముగ నుండగలదు. ఏసంఘమునకును ప్రత్యేకలాభములు చిరకాలము నిలువజాలవు.

వివిధపక్షముల నాయకులనులకొన్నియందు సమావేశము గానున్న సభయందు సాంఘికసమస్యను సమదృష్టితో నిర్ణయించి స్వరాజ్యసౌధమును దృఢమైన పునాదులమీదను నిర్మించుటకు భగవదనుగ్రహము గలుగునని నమ్ముచున్నాము. చెన్నరాష్ట్రీయము నందలి బ్రాహ్మణేతర నాయకులను దూరదృష్టిని గలిగి పూర్వమువలెనే సైమను బహిష్కరణమునకు వారిపక్షబలమును సమర్పించుట శ్రేయస్కరము. ప్రజాస్వామ్యమునందు స్వరాజ్యము బ్రాహ్మణేతర స్వరాజ్యము గాగలదు గాని బ్రాహ్మణ స్వరాజ్యము గాజాలదు. బ్రాహ్మణబ్రాహ్మణేతర నాయకు లీరహస్యమును గ్రహించి స్వల్పప్రయోజనములను విసర్జించి స్వరాజ్యసిద్ధికై పాటుపడుదురుగాక! స్వరాజ్యసంపాదనమునకు ప్రత్యక్షాచరణ మవసరమైన విధమును బార్డోలి ప్రస్థానము విశదము చేయుచున్నది.

* * * *

బార్డోలి సత్యాగ్రహము

బార్డోలిసత్యాగ్రహ మొక సామాన్యవిషయమని ప్రాజ్ఞులు గ్రహించవలసియుందురు.

సత్యప్రియులైన గాంధిమహాత్ములు బార్డోలి సమస్య రైతులకు సంబంధించిన సమస్య యని యును, పన్నులనిరాకరణ ప్రస్థానము గాదని యును గట్టిగ జెప్పుచున్నను ప్రభుత్వాధికారులు విపరీతార్థమును జేయుట యనుచితము. బొంబయిగవర్నరు శాసనసభయందు జేసిన యుపన్యాసప్రసంగమును బ్రిటీషు నిరంకుశత్వమునకు నిదర్శనము గాని వారి ధర్మపరీక్షణమునకు నిదర్శనము గాదు. ప్రభుత్వనిర్ణయములను నిరభ్యంతరముగ ప్రజలు శిరసావహింపవలయు ననుట కేవల మన్యాయము. నిరంకుశాధికారమయమైన దేశమునం దిది మిగుల నన్యాయము. మాంటుఫర్డుసంస్కరణ ప్రణాళిక యందు భూమిపన్నును శాసనసభల యామోదమును బడసి నిర్ణయింపవలయు నని సూచింపబడినను నిరంకుశవర్గము దీనిని నిరాకరించినది. వింటుర్టనుప్రభువు సూరత్ప్రతినిధులు శాసనసభ యం దీవిషయమును నిర్ణయించుటకు వీలు గలదని పార్లమెంటునందు దెలుపుట కేవల మసత్యముగ నున్నది. బార్డోలిసమస్య సిస్తు సమస్య యనిమాలవ్య, మోతిలాలునెహ్రూ, తేజబహద్దరు సప్రూ, మహాత్మా గాంధిగారులు మొదలగు వారలు చాటుచున్నను నిరంకుశవర్గము విపరీతార్థమును కల్పించుట యన్యాయము.

గాంధిమహాత్ముని సత్యాగ్రహముయొక్క శక్తిసామర్థ్యములను బార్డోలిసత్యాగ్రహము విశదముచేసినది. బార్డోలియందు ప్రభుత్వాధికారులవలంబించిన భీభత్సవిధానమును, బార్డోలీప్రజల శాంతిప్రస్థానమును, సత్యాగ్రహప్రస్థానమును విశదము చేసినవి. బార్డోలిసమస్య దేశమంతను నాకర్షించినది. ఈ సమస్యయందు బ్రాహ్మణ బ్రాహ్మణేతర భేదములు, హిందూ మహమ్మదీయ భేదములును నంతరించినవి. వివిధ రాజకీయ పక్షములును, వివిధసంఘములును బార్డోలిసమస్యను సమదృష్టితో సందర్శించి బార్డోలిప్రస్థానమును జయప్రదము చేసినవి. సర్దారు వల్లభభాయి పటేలుగారును, ప్రజలును కోరినది స్వతంత్ర విచారణగాని పన్నులను తొలగించుట గాదు. ఈసమస్య ప్రజాభీష్టమున కనుకూలముగ నిర్ణయింపబడుట ప్రశంసనీయమై స్వరాజ్య ప్రస్థానమునకు మార్గదర్శకముగ నున్నది. బార్డోలిప్రజలును, వారినాయకులును, ముఖ్యముగ సర్దారు వల్లభభాయి పటేలుగారును భారతీయుల కృతజ్ఞతకే కాక నిరంకుశాధికారుల కృతజ్ఞతకును పాత్రులు. ఈ స్వల్పారంభము హైరాకారమును దాల్చక పూర్వమె ప్రభుత్వము మేలుకొనుట సమంజసముగ నున్నది. బార్డోలి సత్యాగ్రహపాఠమును ప్రజలును, ప్రభుత్వమును నిరంతరమును మననముచేసి కృతార్థులగుదురు గాక! వెనుకను పన్నుల నిరాకరణప్రస్థానము నుపక్రమించిన యాంధ్రప్రజానాయకులకు, ముఖ్యముగ గుంటూరు మండలవాసులకు, బార్డోలివిజయము పరమానందమును గలుగ జేయ గలదు.

* * * *

ఆంధ్రమహాసభలు

జులై మాసాంతమునందు గుంటూరునందు గూడిన ఆంధ్రమహాసభ లాంధ్రహృదయమునందు గలిగిన సంచలనమునకు నిదర్శనములుగ నున్నవి. ఇన్ని సభలను జయప్రదముగ నడిపిన శ్రీయుతులు నడింపల్లి నరసింహారావుగారును, గూడూరు రామచంద్రరావుగారును, వారి యనుచరులును ప్రజాభినందనములకు పాత్రులు. అసహాయోద్యమము నారంభించిన తరువాత నిన్నిసభలు గుంటూరునందేకకాలమునందు మొదటిసారి గూడినవి. సభలు జయప్రదముగ ముగిసినను ప్రయోజనము మాత్రము విచారయోగ్యముగ నున్నది. సభలయందు తీర్మానములను జేసి సంతృప్తిని బొందవలసిన కాలము సహాయనిరాకరణోద్యమముతో సంతము నొందినది. ఆడంబరమువలన కాలహరణమును, ధనవ్యయమును గలుగుచున్నది. దేశమున కించుకైనను ప్రయోజనము గలుగుట లేదు. దేశము సకల రంగములందును వికాసమును గోరుచున్నది. దేశవికాసమున కన్ని రంగములందును పని కేయగల కార్యదక్షులు గావలసియున్న విధమును దేశపరిస్థితులు విశదము చేయుచున్నవి. దృష్టి నేరంగమునకు మరల్చినను కార్యసేతూపరాయణులు లేరను నార్తనాదము బయలు దేరు చున్నది. అన్ని రంగములందును కార్యదక్షులను సిద్ధముచేయుటకు ఆంధ్రసేవాసంఘమును స్థాపించుట సమంజసముగ నున్నది. ఈ సేవాసంఘము భారతీయ సౌభాగ్యమునకు మూలాధారమైన రాజకీయార్థికసాంఘికాది సమస్యల సమదృష్టితో నవలోకించి నిర్ణయించి, కార్యరూపమున వ్యాపింప జేయుటకు సార్థక మగునని నమ్ముచున్నాము. పరావలంబనమునకును, పారతంత్ర్యమునకును నలవాటుపడిన భారతీయుల లక్ష్యమును స్వయం సహాయము నందును, సహాయ నిరాకరణమునందును సత్యాగ్రహమునందును లగ్నముచేయుటకు సేవాపరాయణులు పాటుపడి వారిసేవను సార్థకముచేయుదురు గాత!

Printed and Published by K. NAGESWARA RAO at the Andhra Patrika Press, No.2, Thumbu Chetty Street, G.T, Madras.

విషయానుక్రమణిక

చిత్రములు

ఏరా జాదయుక్తైల మెలమి విక్షేపించెఁ
  గపటాహితమదాంధకార మడఁగ
గజపతి సురధాణి గడిదుర్గముల కెల్ల
  నేరాజు వజ్రంపు బోరుతల్పు
మహిమచే నేరాజు మఱపించె నలభగీ
  రథ పృథు...రామ రఘురమణుల
నట్టిగుణశాలి తిమ్మరాయనికుమార
వీరబసవక్షమాచక్రవిభు నిచేత
మన్ననలు గాంచి మించినమహితుఁ డితఁడు,
మనుజమాత్రుండె గంగయామాత్యవరుఁడు.

ఈ బసవరాజునొద్ద ప్రధానసచివుఁడుగా నుండిన చెందలూరి గంగయామాత్యుఁడు పెసరువాయువంశీయుఁడు. ఈయన యవిసెలలో నాసికేతూపాఖ్యానము కృతి పొందిన విషయ మీప్రబోధచంద్రోదయమునఁ గూడ సూచింపఁబడినది.

"ప్రఖ్యాతనాచికేతూ
పాఖ్యానమహాకవిత్వపరిమళితసుధీ
వ్యాఖ్యానశ్రేణ్యోచిత
సౌఖ్యా సంఘటితచిత్త శంకరసఖ్యా."

ఈ మంత్రీశ్వరుఁడు రాజనీతియం దసమానప్రజ్ఞ గలిగి యుదయగిరి రాజ్యమును దమకుఁ బ్రబలశత్రువు లైన విజయనగర రాజులకు లోఁబడకుండఁ గాపాడుటయే కాక యారాజుల దండనాయకుఁడైన సాళువ నృసింహ రాయలను దనకు వశునిగాఁ జేసికొనెనఁట. "నృసింహ నృపతి వశీకరణయువిద్యాకరణ" అని ప్రబోధచంద్రోదయమునఁ జెప్పఁబడినది. ఈ వశీకరణవిధాన మేదో యిద మిత్థమని గ్రంథమున లేదుకాని సాళువనృసింహరాయ లొకానొకసమయమున యుద్ధములో జీవగ్రాహముగా పురుషోత్తమ గజపతికిఁ జిక్కినట్లు గ్రంథాధార ముండుటచేతను, రాజనీతికోవిదుఁ డగు గంగయ్య తన నయ నైపుణ్యమున నిట్లు నృసింహరాయలను పట్టించెనేమో యని యూహింపఁదగియున్నది. ప్రతాపరుద్రగజపతి రచించిన "సరస్వతీవిలాసము" అను ధర్మశాస్త్రగ్రంథములో,

మిత్రం శేషధరస్య దాక్ష్యపరిష
  ద్యస్సైవ సూనో స్స్వయం
సాంసర్గ్యాతిశయాదశక్తి ర్తిసమతా
  న్నత్యేతు నై వాపరః;
జీవగ్రాహ మరిం ప్రగృహ్య సమరే
  కర్ణాటభూమీధవం
దీనో క్త్రిప్రవణం నృసింహమనుజా
  ధీశం పున స్త్యక్తవాన్.

ఈశ్లోకమందలి విషయము ప్రతాపరుద్రుని తండ్రియగు పురుషోత్తమ గజపతినిగుఱించియై యున్నది. దీనినిబట్టి నృసింహరాయలు పురుషోత్తమగజపతిచే జీవగ్రాహముగాఁ బట్టుపడెననియు, తరువాత విడువఁబడెననియు స్పష్టపడుచున్నది.

మ. రా. రా. శ్రీ. వీరేశలింగంగారు యీవిషయమునుగుఱించి వేఱభిప్రాయమును గనుపఱచినారు. ఆయన తమయాంధ్రకవుల చరిత్రములో నందిమల్లయ్య, ఘంటసింగయ్యలను గుఱించి వ్రాయుచు, "నృసింహనృపతివశీకరణయువిద్యాకరణ" అను విశేషణమును గుఱించి యీక్రిందివిధముగా నూహించినారు: "గంగయామాత్యుఁడు ముందు జైమినిభారత కృతిపతియైన సాళువ నృసింహరాయలయొద్ద సచివుఁడై యుండినట్లు తెలియఁగ వచ్చును." ఈయూహ సరికాదని నాకుఁ దోఁచుచున్నది. ఏలయన, గజపతులయొద్ద మంత్రిగా నున్నకాలములోఁ గృతినందిన గ్రంథములో శత్రురాజునొద్దఁ దాను మంత్రిగా నుండినట్లు వ్రాయించుకొనునని యూహించుట యసంగతమని తోఁచుచున్నది. కనుక నృసింహరాయలను జీవగ్రాహముగాఁ బట్టించుటయే గంగమంత్రియొక్క వశీకరణవిద్యాకరణమహత్త్వమని నిర్ణయింపవచ్చును.*

---

*పురుషోత్తమగజపతి సాళువనరసింహరాయలను యుద్ధములోఁ బట్టుకొనఁగా అతఁడు అభయయాచనాంజలితో నుదయగిరిరాజ్యము నిచ్చివేయఁగా నతనిని విడిచిపెట్టినట్లు కొడుకగు ప్రతాపరుద్ర గజపతి తనయనంతవరము శాసనములోఁ బ్రకటించినట్లు శ్రీయుత వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రీసంవత్సరాంధ్రపత్రిక ఉగాది

గంగమంత్రి మహాశివభక్తుఁడును, నిత్యవైదికసంప్రదాయాచరణుఁడును నని యిదివఱకే మనకుఁ దెలిసినది. ఆయనచిత్తవృత్తి తాను కృతినందిన రెండుగ్రంథములఁ బట్టియుఁ గొంతవఱకు గ్రహింపవచ్చును. నాసికేతూపాఖ్యానము శాంతరసప్రధానమై, యాధ్యాత్మికవిషయప్రపూర్ణమై, పుణ్యపాపలక్షణనిరూపణమై, స్వర్గనరకవివరణద్యోతకమై జ్ఞానోపదేశకగ్రంథములలో నగ్రస్థానము నలంకరించుచున్నది. ప్రబోధచంద్రోదయము గూడ నటువలెనే యాధ్యాత్మికతత్త్వప్రభావకలాపమును గథారూపముగాఁ బ్రవర్తించుచున్నది. ఈ రెండుగ్రంథములు కేవల మాముష్మికదృష్టితో జీవయాత్ర గడపుచు ముముక్షుమార్గము నవలంబించెడువారికే యభిరుచియు, నభినివేశమును గలిగించుచుండును. వానిఁ బ్రత్యేకముగాఁ గృతినొందుటఁ బట్టి గంగయ్యమంత్రి కాధ్యాత్మికవస్తువిచారము మెండుగా నుండియుండవలెను.

ఈ బుద్ధివిశేషము నుద్దేశించియే కాఁబోలు, ప్రబోధచంద్రోదయమున నీమంత్రిపుంగవుగుఱించి తదాశ్రితకవిపండితలోక మిట్లు పల్కెనఁట:

సీ. "సరిలేని నీతిచాతురిచేత రాజ్యతం
త్రంబును నడపిన నడపుఁ గాని
యనిశంబు పుష్పనందనవనితాదిసౌ
ఖ్యంబుల నందినయందుఁ గాని
సంగీతసాహిత్యసరసవిద్యావినో
దంబులఁ దగిలినఁ దగులుఁ గాని
స్వామిహితాసక్తి సవనవాసనముశా
సనలీల జరపిన జరపుఁ గాని
నీళ్ల లోపలి సరసిజనీదళంబు
సరవి నిర్లేపుఁడైన సంసారయోగి
సందియము లేదు ప్రత్యక్షశంభుమూర్తి,
యీయనంతయ గంగమంత్రీశ్వరుండు."

కాఁబట్టి యీ యనంతయ గంగమంత్రీశ్వరుం డపారరాజకార్యనిర్వహణలౌకికప్రవాహములో మునిఁగి తేలుచుండిన వాఁడైనను, నీటిలోని తామరాకువలెఁ బ్రాపంచికవిషయానురక్తి యంటకుండ నిర్లిప్తుఁడై సంసారయోగివలె మనుచుండెనఁట. ఇట్టినియతాత్ముఁడు నిజాత్మతేజఃపుంజంబున నజ్ఞానతిమిరంబును విచ్ఛేదంబు చేసి ప్రబుద్ధుఁడైనకతన "ప్రబోధచంద్రోదయ" మను గ్రంథ మీతని కెక్కుడు సులభముగా బోధపడఁగలదు. కాన నాగ్రంథమును సత్కవులచే నాంధ్రీకరింపించి కృతినందఁదగినవాఁడని యాశ్రితాశేష శేముషీ భూషణబృంద మాశీర్వదించినదఁట:—

ఉ. ఈదృశవర్తనంబునను
నెక్కుడు బోధముగన్ బ్రబోధచం
ద్రోదయ మాంధ్రభాష నతి
యోగ్యకవీంద్రులచేత నంకితం
బై దిశలం బ్రసిద్ధముగ
నందిఁ గస్తురితావి సైఁడికిన్
మేదుర హేమకాంతి ధర
జేసి మృగనాభికిఁ గల్గులాగునన్.

అట్లు బుధాశీర్వాదపురస్కృతుఁడై యీయమాన గ్రంథము కృతినంద నుద్యోగించి దరినున్న పండితావళి నిట్టి మహనీయగ్రంథము నాంధ్రీకరింప సమర్థు లెవ్వరైన నున్నారా యని ప్రశ్నింప వారీకవిస్వయమును జేర్కొనిరఁట.—

సీ. కలరు కాశికగోత్రకలశాంబురాశిసం
భారంబు సంగీతనంది నంది
సింగమంత్రికిఁ బుణ్యశీల పోచమ్మకు
నాత్మసంభవుఁడు మల్లయమనీషి
యతని మేనల్లుఁ డంచితభరద్వాజగో
త్రారామ చైత్రోదయంబు ఘంట

సంచికలో వ్రాసినారు. శాసనములో నీశ్లోక మిట్లున్నది:
"యస్మై నిత్యతరప్రతాపదహన జ్వాలాయమానధ్వజ, స్తంభా బద్ధమకుంభ రక్తనసన ప్రేషావిభగ్నద్విషే;
సంధాయాభియ మంచనాంజలిమహో గ్రతోద్వదయాద్రింధయా, దాత్మానం మము చేవ్య సింహనృపతిః కర్ణాటదేశాధిపః."

నాగధీమణికిఁ బుణ్యచరిత్ర యమ్మలాం
బకుఁ గూర్మితనయుండు మలయమారు
తాహ్వయుఁడు సింగనార్యుఁడు సమ్మతివాక్ప-
తీశ్వరారాధకులు శాంతు లిలఁ బ్రసిద్ధు
లుభయభాషల నేర్పరు లుపమరులు స
మర్థు లీకృతిరాజ నిర్మాణమునకు.

ఆమాటలు విని సంతోషవికసితవదనారవిందుండై యీతలంపు నాతలంపు నేకంబయ్యె నిదియ పరిశీలని శుభనిమిత్తం బని వెంటనే యాకవిపుంగవుల నిరువురఁ రావించి, చిత్రవర్ణాసనంబున నాసీనులం జేసి, శివపూజావిధాన విలిప్తసుగంధపరిమిళితంబైన హస్తంబున కర్పూరతాంబూలంబు లిచ్చి,

క. నేరుపరి పోషణించిన
హారము నెల రొమ్ముఁ గీల నతిశయముగ నా
పేరఁ దెలిఁగింపవలయును
సారపుఫణితులఁ బ్రబోధచంద్రోదయమున్.

అని యాకవిద్వితయమును సవినయముగాఁ గోరెనట. అందులకు వా రంగీకరించి కృష్ణమిశ్రునిచే రచింపఁబడిన ప్రబోధచంద్రోదయమను గీర్వాణనాటకరాజమును ప్రబంధరూపముగాఁ దెనిఁగింపఁ బూనిరి.

నందిమల్లయ్య, ఘంటసింగయ్య

ఈ జంటకవుల వంశాదివిషయముల గూర్చి వారు రచించిన రెండుగ్రంథములే మనకు ముఖ్యాధారములు. మొదటఁ బ్రబోధచంద్రోదయమును వ్రాసి గంగయామాత్యునికిని, దరువాత వరాహపురాణమును రచియించి తుళువనరసనాయకునకును నంకితముచేసిరి. ఆగ్రంథముల యవతారికలలో తమకులగోత్రముల గుఱించి యిట్లు చెప్పికొనిరి.

ప్రబోధచంద్రోదయమున వీరిని గుఱించి చెప్పిన పద్యము పైన నుదాహరించితిని. వరాహపురాణమున వీరిని గుఱించి యిట్లు చెప్పఁబడినది:

సీ. అపుడు సభావేదికాగ్రస్థితులమైన
మమ్ము వాగీశ్వరీమంత్రరాజ
సిద్ధపారగులఁ గౌశికభరద్వాజగో
త్రుల మహాదేవాంఘ్రిజలజభక్తి
పరతంత్రమతుల నాపస్తంబసూత్రుల
గురుదక్షిణామూర్త్యఘోరశివుల
శిష్యుల నతిశాంతచిత్తులఁ దనకునా
శ్రితులభాషాద్వయ కృతినిరూఢ
శేముషీధూర్వహుల నందిసింగనార్య
తనయు మల్లయకవికులోత్తముని ఘంట
నాగధీమణి కూర్మినందనుని మలయ
మారుతాంకితు సింగయమంత్రిఁ జూచి.

క. మీరిరువురు నెప్పుడును శ
రీరప్రాణముల క్రియఁ జరింతురు మిగులం
గూరిమిఁ గృతిఁ బ్రతిపద్యముఁ
జారుఫణితిఁ జెప్పఁగలరు చాటువుగాఁగన్.

పైపద్యములఁబట్టి వీరినిగుఱించి తెలిసినసారాంశములు:—

నందిమల్లయ్య కౌశికగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు; తండ్రి సింగన్న; తల్లి పోచమ్మ; శివభక్తుఁడు, వాగీశ్వరమంత్రోపాసకుఁడు, దక్షిణామూర్తిశిష్యుఁడు. ఘంటసింగన్న భారద్వాజగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు; తండ్రి నాగన్న; తల్లి అమ్మలమ్మ; శివభక్తుఁడు; వాగీశ్వరీ మంత్రోపాసకుఁడు; అఘోరశివశిష్యుఁడు.

ఈఘంటసింగయ్యకు మలయమారుతకవి * యని ప్రత్యేకబిరుదాంకము గలదు. ఈతఁడు నందిమల్లయ్యకు

* మలయమారుతకవి యని బిరుదు బహుశః ఈతనికవిత్వమందలి గుణవిశేషములవలన వచ్చియుండును. మలయమారుతమందు శైత్యము, సౌరభ్యము, మృదుత్వమునున్నట్లు తెలిసిన విషయమే. ఈతని కవిత్వమునందు నీగుణవిశేషములే యుండుటచేత ఈ బిరుద మీయఁబడినది. మొత్తముమీఁద ప్రబోధచంద్రోదయ వరాహపురాణములలోని కవిత్వము చాలమృదువుగాను, సమరసభావపూరితముగాను నుండుటచే హృద్యమై, యీబిరుద నామమున కీతఁడు తగినవాఁడని చెప్పవచ్చును.

మేనల్లుఁడు కాఁబట్టి యీయిద్దఱు కవులు నొక్కకుటుంబములోనివారు.

* వీరిద్దఱును ఎల్లప్పుడును శరీరప్రాణములవలె అభేదాధ్యవసాయమున నుండిరి. వీరు రచించిన గ్రంథముల యాశ్వాసాంతగద్యములలో నైతే యిద్దఱిపేళ్లను చెప్పికొనిరి: "ఇతి శ్రీమదుమామహేశ్వరప్రసాదలబ్ధసారసారస్వతాభినంది నందిసింగయామాత్యపుత్రమల్లయమనీషితల్లజ మలయమారుతాభిధాన ఘంటనాగయప్రధాన తనయ సింగయ కవిపుంగవ ప్రణీతంబైన..."

కృష్ణదేవరాయలకాలములోనివాఁడైన నందితిమ్మన్న లేక ముక్కుతిమ్మన్న అను కవీశ్వరుఁడు తాను రచించిన "పారిజాతాపహరణము" అను కావ్యమును కృష్ణదేవరాయల కంకితముఁ జేసి తన కులగోత్రములఁ జెప్పికొనుచు 'మలయమారుతకవి' యని బిరుదనామముకల యీఘంటసింగయ్యకుఁ దాను మేనల్లుఁడనని చెప్పికొనెను:

సీ. కౌశికగోత్రవిఖ్యాతుఁ డాపస్తంబ
సూత్రుఁ డార్వేలపవిత్రకులుఁడు
నందిసింగామాత్యునకును దిమ్మాంబకుఁ
దనయుండు సకలవిద్యావివేక
చతురుఁడు మలయమారుతకవీంద్రునకు మే
నల్లుఁడు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధనవచతురంతయా
నమహాగ్రహారసన్మానయుతుఁడు
తిమ్మయార్యుండు శివపరాధీనమతి య
ఘోరశివగురుశిష్యుండు పారిజాత
హరణ మనుకావ్య మొనరించె నాంధ్రభాష
నాదివాకర తారాసుధాకరముగ.

కాఁబట్టి యీకవులవంశము పండితవంశమై పెక్కండ్రు కవిపుంగవులచే శోభితమైయుండెను. నంది సింగయ్య, ఘంటమల్లయ్యయను కవులుకూడ నుండినట్లు తెలియవచ్చుచున్నది.

ప్రబోధచంద్రోదయము

ప్రబోధచంద్రోదయ మను గీర్వాణనాటక మొక ప్రత్యేకమైన విచిత్రగ్రంథము, సామాన్యముగఁ గావ్యనాటకములయందు మానవజాతులలోని స్త్రీపురుషులో, లేక నిలింపవర్గములలోని స్త్రీ పురుషులో పాత్రములుగా నుండి కథాక్రమమును జరిపింతురు ఈగ్రంథమందట్లుగాక మానవస్వభావమందుండెడు సుగుణదుర్గుణములే పాత్రములుగా నుండి, మనుష్యుని యాధ్యాత్మికజీవితనాటకము ప్రదర్శింపఁబడుచున్నది. కావున నీగ్రంథమందలి పాత్రములు ప్రతిపురుషుని యందును, ప్రతిస్త్రీయందును స్వాభావికముగా గోచరించుచున్నవియే. ఈనాటకము గ్రహించుటకు మనుష్యస్వభావము తప్ప మఱే గ్రంథములను బరిశీలింప నక్కఱలేదు. మహాభారతమందుఁ గౌరవులకును పాండవులకును, శ్రీమద్రామాయణమందు రామరావణులకును ఘోర యుద్ధము జరిగినట్లుగ నీప్రబోధచంద్రోదయమందు మానవప్రకృతియందలి సుగుణదుర్గుణములకు నిత్యము జరుగుచున్న సంకులసమరము నిరూపింపఁబడినది. ఇట్టి యాధ్యాత్మికయుద్ధమును సమస్త దేశములవారును దమతమ మతగ్రంథములయందు వాక్రుచ్చుట తఱచు కానంబడునుగాని రసప్రధానములగు కావ్యనాటకములయం దిట్టి విలక్షణపాత్రములచేఁ బరస్పరవిజిగీషాసంఘట్టనము నిరూపించుట చాలఁ దరుదు.

ఆంగ్లేయభాషలో 'బనియను' అను మహామేధావి యొకఁడు "యాత్రికుని పర్యటనము" (Pilgrim's Progress) అను వచనగ్రంథము వ్రాసెను. ఆయాత్రికుఁడు క్రైస్తవుఁడు. అతనియాత్ర భూలోకమునుండి స్వర్గలోకమునకు. ఆదారిలో నతనికి సంభవించిన యానుకూల్యాంతరాయములను, సుఖదుఃఖములను బహువిధ

* కవులు కవలుగానుండుట యొక్క ప్రతిభాగౌరవవిశేషమని తలంపఁబడుచుండిన యీకాలమున జంటకవుల కృతినిర్మాణపద్ధతులు సులభగ్రాహ్యములు. ఈకాలమున విడికవులకంటె జంటకవుల పేళ్లే లెక్కకుమిక్కిలి యున్నవి. తిరుపతి వెంకటేశ్వరకవులు సుప్రసిద్ధులు. వారిఁ బడి కొన్ని యేని జంటలు పెరిఁగినవి. రామకృష్ణకవులు శేషాద్రి రమణకవులు, వెంకటపార్వతీశ్వరులు, కొప్పరపుసోదరకవులు ఇత్యాదులు.

రతతో వర్ణింపఁబడినది. జర్మనీభాషలో "గేటే" అను సుప్రసిద్ధ కవిపుంగవుఁడు 'ఫౌస్టు' అనెడు లోకోత్తర మైన నాటకరాజమును తనయుపపాద దిశేయంగఁ బూర్తిచేసి మానవజీవిత మంతయు సత్తరోత్తరాభివృద్ధి సూచకముగాను, మహాదాదర్శలక్షితముగాను సర్వాప దేశకర్త్రికముగాను జిత్రించెను.

సంస్కృతభాషయందే యీ ప్రబోధచంద్రోదయమునకు, బోటీగా "సంకల్పసూర్యోదయ"మను పేర శ్రీవైష్ణవమత పరివ్రాజకవర్గములో నొకరగు వెంకటనాథవేదాంతదేశికులవారు రచించినారు. ప్రబోధచంద్రోదయమం దద్వైతమతము నిర్ధారింపఁ బడినట్లు సంకల్పసూర్యోదయమున విశిష్టాద్వైతమతము స్థాపింపఁ బడినది.

పైఁ జేర్కొనఁబడిన ప్రసిద్ధగ్రంథములతో సమానముగాఁ జెప్పఁదగిన మఱియొక గ్రంథ మాంధ్రవాఙ్మయమందే యున్నది. అది పింగళి సూరనార్యుఁడను కవిశిఖామణి రచించిన "కళాపూర్ణోదయము" ఇందు మనుష్యుని ఆధ్యాత్మిక జీవితచరిత్రము సామాన్యశృంగారరస ప్రధానమగు కథలో సంకీర్తనము చేయఁబడి యతిచతురముగాఁ గూర్చఁబడినది. దీనిలో సైతము మనుష్యుని ఆధ్యాత్మికతత్త్వమందలి సుగుణదుర్గుణముల పోరాటము ఛాయారూపముగాఁ జిత్రింపఁబడినది.

కాని పైఁ జేర్కొనఁబడిన అంతరర్థకథాగ్రంథము (allegories) లన్నిటిలో కథా విస్పష్టతలోను, పాత్రరసపోషణములోను, క్రమనిర్వక్రతలోను అపార జ్ఞానవిజ్ఞానసంపత్తిలోను బ్రబోధచంద్రోదయము మిన్న యని చెప్పక తప్పదు. ఈనాటకమందుఁ జరిత్రాత్మకమైనవిగాని, సాంఘికమైనవి గాని అన్యోపదిష్టభావము లంతర్నిబద్ధము లగుట లేదు. కావున కథానిర్మాణము చాలవిశదముగాను, నిరాడంబరముగాను గల్పింపఁబడినది.

కృష్ణమిశ్రుఁడు

అసమానమైనదియు, నద్వితీయమైనదియు నగు నిట్టి నాటకరాజమును కల్పించిన మహామహుఁడు కృష్ణమిశ్రుఁడను కవివర్యుఁడు. ఈకవిపుంగవుఁడు క్రీ.శ. పదునొకండవ శతాబ్దమ్యంతమున నుండినట్లు కానఁబడుచున్నది. ఈతనిగుఱించిన కాలనిర్ణయాదుల కాధారము లీగ్రంథమందే కొంతవఱకుఁ గాన్పించుచున్నవి. ఈనాటకమందలి ప్రస్తావనభాగములో నటీసూత్రధారు లీనాటక రచనమును గుఱించియు, నాటకప్రయోగమును గుఱించియు సవిస్తరముగా, సవిశేషముగాఁ బ్రస్తావించియున్నారు. వారి సంస్కృతసంభాషణాదికముచేఁ దెలియవచ్చిన చరిత్రాంశము లేవన:—

చంద్రవంశపురాజైన కీర్తివర్మయను నృపాలుఁడు చేదిదేశప్రభువైన కర్ణునిచే పరాజితుఁడై రాజ్యమును గోల్పోయెను. పదంపడి కీర్తివర్మ మహీపాలుని సేనానియైన గోపాలుఁ డనుభూసురోత్తముఁడు కర్ణుని నోడించి కీర్తివర్మను మరల రాజ్యస్థాపితునిఁ జేసెను. ఈగోపాలుఁడు బ్రాహ్మణుఁ డగుటచే యుద్ధానంతరమునఁ దన సహజమైన శాంతరసమును పొందినవాఁడై, క్షత్రియకులహంతయైన పరశురామునివలెఁ దనయుజ్జ్వలకోపాగ్నినిఁ జల్లార్చుకొని శాంతజీవితమును స్వీకరించెను. ఆయన యాజ్ఞానుసారముగా నతని గురువగు కృష్ణమిశ్రునిచే నీనాటకము రచింపఁబడి కీర్తివర్మ భూపాలుని సముఖమునఁ బ్రదర్శింపఁబడవలసివచ్చినది.

ఈకీర్తివర్మ చాండిల్యవంశస్థుఁ డైనట్లును, క్రీ.శ. 1098 సం. ప్రాంతములో రాజ్యము చేయుచుండినట్లును కొన్ని శాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. అంతియకాక ఈతని శత్రువైన కర్ణుఁడు పడమటిచాళుక్య రాజులలో నొకఁడగు త్రిభువనమల్లుఁడు, లేక విక్రమాంకదేవుఁ డను పేరుగల నృపాలునకు సమకాలికుఁ డైనట్లు బిల్హణ చరిత్రమువలనఁ దెలియవచ్చుచున్నది:

కాలః కాలంజరగిరిపతే ర్యః ప్రయాణే ధరిత్రీం
తుక్షారాణాం ఖురపుటరవైః తుష్మపన్యాంచకార,
శ్రీడాహాలక్షితిపరివృఢః సోఽపి యం ప్రాప్య వృత్తిం
కర్ణః కర్ణామృతరసధియాస్వాద మంతః స్మితేన.

(బిల్హణ—విక్రమాంకదేవచరిత్ర)

అనఁగా బిల్హణుఁడు డాహళదేశపురాజైన కర్ణునికడకు వెళ్ళి సన్మానమును బొందెను. ఈబిల్హణుఁడు

విక్రమాంక దేవుని యాస్థానకవియై తనవిక్రమాంక దేవ చరిత్రమును ఆరాజున కంకితముచేసెను. విక్రమాంక దేవుఁడు క్రీ. శ. 1076 మొదలు 1126 వఱకు రాజ్యము చేసినట్లుగాఁ దెలియవచ్చుచున్నది. కాఁబట్టి కర్ణుఁడు, విక్రమాంక దేవుఁడు, కీర్తివర్మ వీరుమువ్వురు సమకాలికు లగు ప్రభువు లని యేర్పడుచున్నది.

ఇట్లుండఁగా కీర్తివర్మ నరపాలుని యాస్థానకవి యగు కృష్ణమిశ్రుఁడు బహుశః విక్రమాంక దేవుని యాస్థానమునకును బోయి యాతనివలన రాజపోషణాది సత్క్రియలను బొందెవాయని సంశయము గలుగుట కొక యాధారము కానఁబడుచున్నది.

శ్రీవిక్రమాంకో జగతీతలే౽స్మిన్
జీయాన్ మనుప్రఖ్యయశా నరేంద్రః,
ప్రహోష యం కోటిసువర్ణతో వా
నబాంధనం సప్తతివత్సరాణి.

(కృష్ణమిశ్ర-ఫలరత్నమాల)

అని యొకానొక కృష్ణమిశ్రుఁడు తన ఫలరత్నమాల యనుజ్యోతిషగ్రంథమున వ్రాసికొనెను. ఆకృష్ణమిశ్రుఁడును, మననాటకకర్తయగు కృష్ణమిశ్రుఁడును ఒకఁడా, కాదా యని నిర్ణయింపఁదగినది.

ప్రబోధచంద్రోదయ నాటకనిర్మాతయగు కృష్ణమిశ్రుఁ డొకమహాపండితుఁడైన సన్న్యాసియనియు, అతనికనేకులు శిష్యులుండిరనియు, వారిలో నొకశిష్యుఁడు వేదాంతవిషయములను జదువనొల్లక, కావ్యనాటకాది గ్రంథముల మాత్రమే చదువుచుండెననియు, అతనికి వేదాంతమార్గ ముపదేశించుటకుఁ గృష్ణమిశ్రుఁడు వేదాంతసారము నీప్రబోధ చంద్రోదయ నాటకరూపముగా రచించినాఁ డనియు, నొకవిద్వత్సంప్రదాయక్రమాగత గాథ కలదు. మొత్తముమీఁదఁ గృష్ణమిశ్రుఁడు చోత్తరాహుఁడును, గౌడదేశస్థుఁడును నగు కవివర్యుఁడు క్రీ. శ. పదునొకండవ శతాబ్దాంతమున నుండినవాఁడు; అతఁడు విష్ణుభక్తుఁడు; వేదవేదాంతాభ్యాసకుఁడు; నిర్మలయశస్కుఁడు, వైదికాచారతత్త్వకోవిదుఁడు, మృదుమధురకావ్యరచనానిపుణుఁడు, వాణీవిశారదుఁడు,అప్రతిమభావభావనావిచక్షణుఁడునై గీర్వాణ వాఙ్మయమం దక్షీణకీర్తి సంపదల గడించెను.

కథాసారము

జ్యోతిర్మయంపుఁ గోటలును, అమృతంపుఁ బరిఖలును, నైర్మల్యంపు మేడలును గల చిదానందనగరియందు ఈశ్వరుఁ డనురాజు రాజ్యపాలనము చేయుచుండెను. అతనికి మాయయనెడు పట్టమహిషివలన మనస్సు అనెడు తనయుఁడు కలిగెను. ఆరాజకుమారునకుఁ బ్రవృత్తి యనియు, నివృత్తియనియు నిద్దఱుభార్యలు గలరు. ప్రవృత్తిదేవివలన మహామోహుఁడు మున్నగు సుతులును, నివృత్తిదేవివలన వివేకుఁడు మొదలగు పుత్రులును జనించిరి.

ఈ యిరువురు సపత్నులపుత్రులయందును సమానముగు రాజ్యకాంక్ష యుద్భవించినకతనఁ గౌరవపాండవులకు రాజ్యవిషయమునఁ బోరు కలిగిన ట్లీయుభయపక్షములవారికిని భువనైకాధిపత్యముకొఱకు నిరంతరము తగవు గలుగుచుండెను. జ్యేష్ఠవర్గమగు మహామోహాదులయందు జనకునకుఁ బక్షపాత ముండుటచే వివేకాదులు సమరమున నిలువలేక చెల్లాచెదరై పాఱిపోవలసివచ్చెను.

మహామోహుఁడు రాజ్యమును స్వీకరించి సాపత్న్యులగు వివేకాదులను నిర్మూలనముచేయ నుద్దేశించి వా రెక్కడెక్కడ దాఁగియుండిరో వెదకించుటకుఁ జారులను బంపెను. వారు విశ్వంబునంగల పురంబుల నన్నిట వెదకి, యచ్చటచ్చట వివేకాదులు చాటునాపుట వినినవారై తమ యేలికకు విన్నవించిరి. మహామోహుఁ డుగ్రుఁడై పేరోలగంబునఁ దనతమ్ముల విలోకించి వివేకాదుల నెట్లు ఖండింపవలయునో తగు నుపాయంబులఁ జెప్పుఁడని, సోదరామాత్యవర్గంబుల కాజ్ఞాపించెను. అందుఁ గాముఁడు తన యద్భుతప్రాభవంబునఁ బ్రకటించుకొనుచు వాసంతిక నవమల్లికావికసితవల్లీమతల్లులవలె నుల్లసిల్లెడు పల్లవాధరలు దన బలానీకంబులో నుండ వివేకాదు లెట్లాహవంబున నిలువనోపుదురు? గని యుత్కటగర్వంబునఁ బ్రగల్భించెను.

మహామోహమహారాజు సభాంతరమున రహస్యాలోచనము చేయుచున్న సమయంబున దుర్గుణుం డను వేగులవాఁడు వచ్చి వివేకమహారాజు ఉపనిషద్దేవిని పునఃపరిగ్రహించుటకును, ఆ యిరువురిసంయోగమువలన విద్యాప్రబోధచంద్రుఁడు ఉదయించుటకును పలు ప్రయత్నములు జరుగుచున్నవనియు, నవి నిర్విఘ్నముగా నెఱవేఱుటకు శమదమాదులు సకల పుణ్యతీర్థంబులకుఁ బోయి దేవతాప్రార్థనంబులు చేయ నడుకట్టియున్నారనియు పిడుగువంటివార్త వినిపించెను. మహామోహుఁడు భయవిహ్వలుఁడై తన ముఖ్యసచివుఁడైన దంభుని జూచి, "మిత్రమా, పుణ్యతీర్థంబులలోఁ బ్రశస్తమగు కాశీనగరంబునకుఁ బోయి వివేకుని ప్రయత్నంబులకు భంగము గావింపవలయు" నని చెప్పి పంపెను.

మహామోహుఁ డొనరించిన యాలోచనంబును, దంభాదులకు నియోగించిన యాజ్ఞావిశేషంబులును రహస్యముగాఁ గనిపెట్టి సదాచారుఁ డను చారుఁడు తద్వృత్తాంతము పూసగ్రుచ్చినట్లు వివేకమహారాజునకు నివేదించెను. ఆమహీవల్లభుఁడు చింతాకులుండై తన యగ్రమహిషియగు మతిని రావించి యాయుదంతము సర్వంబు నామెకు విన్నవించెను. విద్యాప్రబోధచంద్రు లెట్లుద్భవింతురని యామె ప్రశ్నింపఁ దనతోఁ గలహించి చిరవియోగానలమునఁ గృశించుచున్న యుపనిషద్దేవికిఁ దనతోఁ బునఃసమాగమము గలిగించిన విద్యాప్రబోధచంద్రులు ప్రభవింతురని చెప్ప నాసాధ్వీలలామ సపత్నీపునరాగమమున కియ్యకొనెను

మహామోహునిచే నాజ్ఞాపితుఁడై దంభుఁడు వారణాసీపురవరంబున కేఁగి, యచ్చట నివాస మేర్పఱచుకొని రాజకార్యనిర్వహణదీక్షితుఁడై యుండెను. కొండొక దివసమున నొకానొకపురుషుఁడు వానియింటికి యాదృచ్ఛికముగా నేతెంచి, యాతిథ్యమును గ్రహింపనొల్లక దురహంకృతి గనుపఱుప, వారి కిరువురకు జరిగిన సంభాషణక్రమమున నా యాగతపురుషుఁ డహంకారుఁడని తెలియవచ్చినది. అప్పుడు దంభుఁ డహంకారునకు మ్రొక్కి, తనను లోభునికుమారుఁ డనియుఁ, గావున నహంకారునకు మనుమఁ డనియు బాంధవ్యమును చెప్పికొనెను. పిమ్మట నిరువురును దమతమ యాచరణీయవిషయములను దెల్పుకొని మహామోహుని యాజ్ఞానుసారముగ నర్థియులును కాశీక్షేత్రమునకు వచ్చిన ట్లెఱింగికొనిరి.

ఇట్లుండ మహామోహమహారాజు నసమయమున కాశీపురంబున సపరివారంబుగఁ బ్రవేశించెను. దంభాదిబంధువర్గమును, శైవశాక్తబౌద్ధకాపాలికాది పరివారనికరమును నామహారాజును బట్టికొని సంతోషసంభ్రమకోలాహలంబునఁ దెలతేఁగిరి. మహామోహమహారాజు బంధుమిత్రానుచరులకుఁ దన నాస్తికమతప్రకారమును సర్వంబు నుపన్యసించి శరీరము వేఱనియు, నాత్మ వేఱనియుఁ జెప్పు వేదవాక్యము లబద్ధములనియుఁ, బంచభూతపరిపాకప్రాప్తచైతన్యమగు నీదేహమే యాత్మయనెడు సిద్ధాంతము సత్యమనియు వాక్రుచ్చి, వేదచోదితకర్మాచరణంబులను విఫలములను గావింపవలసినదని మేఘనిస్వనితగాంభీర్యమునఁ జెప్పుచుండ, నన మతాచార్యవర్యుఁడగు చార్వాకుఁడు శిష్యసహితుఁడై విచ్చేసి, మహారాజును దీవించి, సమస్తము దేవరపంపున సాధింపఁబడెనని నివేదింప, మహామోహాదిసమస్తరాజవర్గము గడుంగడు సంతసించె. విష్ణుభక్తి యను కల్లరిపిల్లమాత్ర మింకను లొంగకుండ పిలుగులు పెట్టుచున్నదని కొంతసంకోచముగాఁ జెప్పిన చార్వాకునిమాటలు విని మహామోహుఁ డించుక నిట్టూర్పు నిగిడించి, యాదుర్మార్గురాలు పట్టినపట్టు విడువదుగాని కామక్రోధాదులముందట నామె త్రుళ్లింతలు సాగవని యూఱడిల్లి, అయినను శత్రువర్గములోనిదైన శిశువునైనను నుపేక్షింపఁగూడదని రాజభృత్యవర్గమును హెచ్చరించెను.

ఆలోన నొకప్రతీహారి వచ్చి పురుషోత్తమ దేవాలయమున నున్న మదమానులు దేవరవారి కొకవిజ్ఞాపనపత్రికఁ బంపిరని చెప్ప, మహామోహమహారాజు పత్రికఁ గైకొని శ్రద్ధయును, ఆమెదుహితయగు శాంతియును గలసి వివేకమహీవల్లభునకును, ఉపనిషద్దేవికిని పొత్తు గలుగునట్లు దౌత్యము నడుపుచున్నారనియు, ధర్మము, వైరాగ్యము మున్నగు పెద్ద లీకార్యసంఘటననిమిత్తము సహాకారులుగా నున్నారనియును వ్రాసినసంగతులను జదివికొనెను. పిమ్మటఁ గామక్రోధలోభులను బిలిచి ధర్మ

మును గట్టిపెట్టుమని కామునికిని, శాంతిని బంధింపుమని క్రోధలోభులకును నానతు లిచ్చి శ్రద్ధను వశీకరించుటకు నాస్తికతి తప్ప వేతొరులు సమర్థులు గారని యూహించి, మిథ్యాదృష్టి పేరం బరగు నాస్తికతను తోడితెమ్మని విభ్రమావతి యను దాసిం బంపెను. ఆమె శీఘ్రముగ పోయి మిథ్యాదృష్టిని దోడ్కొనివచ్చెను. అంత మహామోహ భూకాంతుఁడు తన కత్యంతప్రియ విలాసినియయిన మిథ్యాదృష్టిని జూచి పరమానందభరితుఁడై యామెను గాఁగిట గ్రుచ్చిగ్రుచ్చి యాలింగనస్పర్శసుఖమునఁ జొక్కి-చొక్కి- కొంతసేపునకు నామెతో శృంగారలీలల నోలలాడి తుద కామెతోఁ దాను పనిపడి రప్పించిన కార్యమును జెప్పి శ్రద్ధ నేదో మాయోపాయంబున బద్ధురాలిం జేయఁగలసినదని నియమించి పంపెను.

అట్లు మహామోహుని యాజ్ఞానువర్తినియై మిథ్యాదృష్టి శ్రద్ధాలలనయొద్దకుం జని తనకపటోపాయంబులఁ నెఱపి యామెను వేదమార్గంబునం దప్పించి పాషండమత వశంవదం జేసి మఱుఁగుపెట్టిన, శాంతికన్య తనతల్లిని గానలేక విభ్రాంతినొంది తిరుగులాడుచు, విలపించుచు నామె పాషండసదనంబులనైన నున్నదేమో యని వెదకికొన నుద్దేశించి తనచెచ్చెలియగు కరుణతోఁ గూడ బోవుచున్న సమయంబున నొకవికృతాకారుఁడైన పురుషుఁ డాదారినే యెదురేఁగుచుండఁ జూచెను. వా రాతని వీక్షించి రాక్షసుఁడో పిశాచమో యని సంశయించి భయభ్రాంతులై కొంతసేపటికిఁ దప్పితెల్లి యామూతనపురుషుఁ డొకదిగంబర సన్న్యాసియని తెలిసికొనిరి. అప్పుడు శాంతి తనతల్లి యామనుష్యునియొద్ద నుండునేమోయని కనుఁగొనుట కచ్చటనే నిలువఁబడెను. ఇంతలో నాదిగంబరుఁడు "అర్హంత, అర్హంత" యని తనశ్రావకవర్గమును బిలిచి స్వమతోపదేశమును జేయుచు శ్రద్ధను రావించి వారికి నూడిగములు చేయుమని నియోగించెను. ఆవచ్చిన స్త్రీని శాంతి చూచి తనతల్లి యనుకొని భ్రమించెను కాని మఱికొంతసేపటికి తనతల్లి కాదనియు, తామసియనియు నిశ్చయించుకొనెను.

తరువాత బౌద్ధమందిరములనైన తనతల్లి యుండునేమో యని వెదకుటకుఁ దిరుగులాడుచుండ నంతలో బౌద్ధభిక్షు వొకఁడు చేతఁ బుస్తకములకట్ట పట్టుకొని యెదురుపడెను. అతనియొద్దనైనను తామసియే యున్నది గాని తనతల్లియగు నిజమైనశ్రద్ధ లేదని నిశ్చయముగా దెలిసికొనెను.

ఇట్లుండ నాదిగంబరుండైన జైనక్షపణకుఁడు బౌద్ధభిక్షువుతో మతవిషయమున వాదములాడ మొదలిడి తుదకు వాని దూషింపసాగెను. వీరిద్దఱు కలహమాడుచుండఁగా సోమసిద్ధాంతుఁ డొకఁడు చేతఁ గరవాలముఁ బూని యటఁ జేరెను. వీరుమువ్వురు మతాభినివేశమునఁ దమతమమతములఁ గూర్చి చర్చింపసాగిరి. కొంతకాలమునకుఁ గాపాలికుఁడు రోషరూషితనేత్రకోణుఁడై కరవాలముం ద్రిప్పుచు జైనక్షపణకునిఁ జంపుటకుఁ జేయిసాచెను. అంత బౌద్ధుఁడును, క్షపణకుఁడును బెగ్గడిపడి యాభైరవాకారుఁడగు సోమసిద్ధాంతిని క్షమింప వేడికొనిరి. అంతట సోమసిద్ధాంతుఁడు తాను గ్రోలుచున్న మదిరారసమును గొంత వారి కిచ్చి తనమతమునకు వారిని మార్చికొనెను. వారు మువ్వురిట్లు సఖ్యపడి, "అద్దిరా, మనచక్రవర్తియగు మహామోహుని యాజ్ఞను మఱచి యిచ్చోటఁ గాలవిలంబము చేయుచున్నాము. శ్రద్ధాదేవిని బట్టితెమ్మని మన కేనియూనతిక దా. ఆమె విష్ణుభక్తిచెంతను దాఁగియున్నది; కాఁబట్టి యామెను వెంటనే కొని తేవలయు" నని కాపాలికుఁడు తన భైరవీశక్తి నాకర్షించి పంపెను. ఇంతలో శాంతియుఁ, గరుణయు శ్రద్ధయొద్దకుఁ బోయిరి. వీ రిట్లుండఁగా రౌద్రరసావిష్టయగు భైరవీశక్తి భీకరాకారముతో గగనమున కెగసి, పావురమును డేగపట్టుకొనినట్లు, శ్రద్ధాలలనను బట్టికొని యెగిరి వచ్చుచుండఁగా విష్ణుభక్తి యడ్డుపడి భైరవిని బాఱఁద్రోలి శ్రద్ధను విడిపించెను.

విష్ణుభక్తిమహాదేవి శ్రద్ధను విడిపించి యామెతో నిట్లు వడికెను: "శ్రద్ధా, నీవు వేవేగ మేఁబోయి, వివేక మహారాజుతో నిట్లు చెప్పవలెను. మోహాదివిరోధవర్గమును నిర్జించుటకు సైన్యముల నన్నిటిని జేరఁ గూర్చుకొని యాయత్తపడియుండవలెను. విష్ణుభక్తిమహాదేవి కావలసినసాయ మొనర్చుటకు సిద్ధముగానున్నది" అమా

టలు విని శ్రద్ధాదేవి యవిలంబితముగా వివేకమహారాజును జేరి విష్ణుభక్తిదేవి నుడివినపలుకులు యథావిధిగా నివేదించెను. అంత వివేకనృపాలుఁ డెదిరిబలములన్నిటిలోఁ గ్రోధయుతు కాముని జయింప సమర్థుఁ డెవ్వఁడని యోచించి వస్తువిచారునకు వర్తమానముఁ బంపెను. అంత వస్తువిచారుఁడు వచ్చి కాము ననాయాసముగా జయింపఁగలనని ప్రతిజ్ఞ చేసెను. క్రోధుని ఖండించుటకు క్షమను, లోభుని నిరోధించుటకు సంతుష్టిని నియోగించి, తదితరబలానీకంబులనెల్లఁ గలయఁజూచి యందఱును త్వరితముగఁ గాశికానగరంబునకు సమరోత్సాహంబునఁ బ్రయాణ మగుఁడని యాజ్ఞాపించి జయభేరిని మ్రోఁగింప శాసించెను.

వివేకపృథ్వీశుఁడు మహానీకసమేతుఁడై కాశీనగరంబుఁ జొచ్చి యాదికేశవుం దర్శించి స్తుతించి ధర్మయుద్ధమునకు సిద్ధముగా నుండెను.

మహామోహాదివీరులును సంగ్రామమునకుఁ దమతమ సేనలను గూర్చుకొని చేర్చి కాశీనగరంబునను విడిసి యుండిరి. ఇట్లుభయసైన్యంబులును జయధ్వానంబులతో దిక్కులు పిక్కటిల్ల నార్చుచు సమరకోలాహలమున సంభ్రమించుచుండిరి. రుధిరధారాసిక్తమగు నాహవభూమిని జూడనోల్లక విష్ణుభక్తిమహాదేవి "శ్రద్ధా! యుద్ధానంతరమున జయాపజయముల వర్తమానము సత్యముగా నాకుఁ జెప్పు"మని యాజ్ఞాపించి, శాంతితోఁ గూడ సాలగ్రామశిఖరసమీపమున నున్న చక్రతీర్థంబునకుఁ బోయెను.

యుద్ధము ప్రారంభించెను. వివేకాదియోధులయెదుర మహామోహాదివీరులు నిలువలేక పరాజితులై పికాపికలై చెదరి పాఱిపోయిరి.

మహామోహుఁ డెక్కడ నణఁగెనో యెఱుకపడలేదు. వివేకమహారాజు జయధ్వానములతోఁ గాశీనగరంబుఁ బ్రవేశించెను. ఈవృత్తాంతమంతయు శ్రద్ధాదేవి చెచ్చెరఁ బోయి విష్ణుభక్తిమహాదేవికి నివేదించెను.

మహామోహాదులపరిభవమువిని తండ్రియగు మనస్సు పలువిధముల శోకించి పలువరించుచున్న సమయమున విష్ణుభక్తిమహాదేవి వ్యాససరస్వతిని బంపి మనస్సునకు వైరాగ్యము గలుగునట్లుగా నుపదేశముచేయుచుండ నియమించెను. వ్యాససరస్వతియు నట్లే మనస్సునకు ననేకవిధముల బోధించి భావంబు లనిత్యములనియు, పాంచభౌతికములగు శరీరములు నశ్వరములనియు, బ్రహ్మమే నిత్యమనియుఁ, దక్కినవన్ని యుపకల్పితవికృతులనియు నిత్యాదివేదాంతవిషయములను జక్కఁగాఁ దెలియఁజెప్పి విచార ముడుగుమని యుపదేశించెను. కాని యామె యెంతచెప్పినను మనస్సునకు దుఃఖ ముపశమింపలేదు. వేదాంతసరస్వతిమాత్రము విసువు చెందక సకలలోకరక్షణదక్షుఁడగు నిందిరాధవునిఁ గాని, యిందుధరునిఁ గాని పొందుగ సదా తలంచియుండుమనియు, మోహపాశబంధంబులు తమంతట తామే సడలి విడిపోవుననియుఁ జెప్పిన, మనస్సుల్లసిల్లి కృతార్థుఁడనైతినని వ్యాససరస్వతీదేవి పాదంబుల కెఱఁగిన, నామె మనస్సును జూచి, "వత్సా! నీహృదయం బుపదేశక్షమం బయ్యెను గాన మఱియొకరహస్యము చెప్పెద" నని "జడునకసార సంసారవిభ్రాంతి కలుగును గాని వివేకవంతునకుఁ గలుగదు. వివేకున కిదియంతయు విరక్తికారణంబే" యని వేదాంతపరమరహస్యము దెల్పెను. ఇంతలో వైరాగ్యుఁడు రాఁగా భారతీదేవి మనస్సుతో "వత్సా, నీ తనయుఁడు వైరాగ్యుఁడు వచ్చినాఁడు. అతనిసంభావింపు" మని కోరెను. అప్పుడు మనస్సు వైరాగ్యునిఁ గౌఁగిలించుకొనెను. అంత సరస్వతీదేవి మనస్సుతో నిట్లనియె—

ప్రథమభార్యయగు ప్రవృత్తిదేవి పుత్రశోకానలమున మరణించినది కావున విచారింపక రెండవపత్నియగు నివృత్తిదేవిని రావించి కూడియుండ వలసినదనియుఁ, దత్సంజనితులగు వివేకాదులను యౌవరాజ్య స్థాపితులఁ జేసి సామ్రాజ్యము వహింపుమనియు నుపదేశించి దీవించి, శ్రద్ధను జీవమహారాజునొద్దకుఁ బోయి చేయవలసిన కార్యంబుల ననుసంధింపుమనియు శాంతిని వివేకమహారాజుకడ కేగి యూడిగంబులు సలుపుమనియుఁ జెప్పి మిగిలిన కార్యములను సంఘటించుటకుఁ దా వెడలి పోయెను.

వివేకమహారాజు శాంతితోఁ దన ప్రేయసియగు నుపనిషద్దేవిని వెనకి తోడి తెమ్మని చెప్పి పంపెను. ఆమె యట్లు పోవుచుండఁగాఁ దల్లియగు శ్రద్ధను దారిలోఁ జూచి యానందభరితురాలై యామె యెచ్చటికి ససంభ్రమముగాఁ బోవుచున్నదని ప్రశ్నించెను. జీవేశ్వరుఁడు నిష్కంటకముగ సామ్రాజ్యమేలుచుండఁగ విచారమునకు హేతువేది యని మాఱుపల్కి మహామోహుఁ డట్లు యుద్ధమున నిర్జితుఁడైనను జీవపురుషుని వశీకరించుటకు మధుమతియను మోహినీ స్త్రీని బంప నామె తనయింద్రజాల విద్యను జూపి జీవేశ్వరుని మోహపాశ బద్ధునిఁ జేయుటకు నానావిధంబులగు నింద్రియ సుఖభోగంబులఁ గల్పించి, యాతనిఁ బరిభ్రమింపఁజేసి, తనవలలో వేసికొనినదని చెప్ప, శాంతి విషణ్ణహృదయయై, యింత శ్రమపడినను దునకు ఫలము గలుగ లేదని దుఃఖించి, యీపరిణామమునకుఁ బ్రతీకారవిధాన మెద్దియేని కలదో యని యడిగెను. అంత శ్రద్ధాదేవి శోకించుచున్న పుత్రికను సమాశ్వసించి, "తనయా, ఊరడిలుము, ఊరడిలుము. తర్కమునీశ్వరుఁడు జీవేశ్వరునియొద్దకుఁ బోయి, 'ఈశ్వరా, యిట్టి సంసారవిభ్రాంతిజ్వాలలఁ జిక్కుకొనియున్నావని' యడుగ జీవేశ్వరుఁ డదరిపడి, 'తర్కా, మేలు మేలు. నే నెంతమూఢుఁడనైతిని. నన్ను మేలు కొల్పితివి; మేలు చేసితివి' యని మెచ్చుకొనుచు, మధుమతిని చాల ధిక్కరించెను. కావున మనకు నిశ్శంకముగ నానంద దాయకంబులగు వైభవోత్సవంబులే కలుగుచున్న"వని శ్రద్ధ చెప్పి తాను వివేకుని జీవేశ్వరునికడకుఁ దెచ్చుటకుఁగాను బోవుచున్నా నని నుడివెను. అంత శాంతి తానుగూడ నుపనిషద్దేవిని వివేకునికడకుఁ దోడితెచ్చుటకుఁ బోవుచున్నా నని తల్లితో నుగ్గడించి తనదారిని బోయెను. అంత జీవేశ్వరుఁడు విష్ణుభక్తిదేవిమహిమకుఁ గడుసంతసించి తాను గష్టముల నన్నిటి నతిక్రమించి నిత్యనిర్మలసుఖమును బొందఁగలుగుట యాదేవికృపాకటాక్షముననే యని వాక్రుచ్చి సంతోషించు సమయమున వివేకమహారాజు శ్రద్ధాంగనా సమేతుఁడై జీవేశ్వరుని సన్నిధి కేతెంచెను.

వివేకమహారాజు జీవేశ్వరునకు మ్రొక్కి దీవనలు పొంది ప్రస్తుతించుసమయంబున నుపనిషద్దేవి శాంతిలలనను దోడ్కొని వివేకమహారాజుసముఖమునకు నొయ్యనొయ్యనఁ జనెను. అంత జీవేశ్వరుఁ డుపనిషత్తరుణిని సంభావింప నామె వివేకున కభివందనము లొనరించి యుపాంతస్థలమున నధిష్ఠించెను. జీవేశ్వరుఁ డుపనిషదంగనతో, "లలనా! నీవు భర్తవలన నెడఁబాటు నెంది, పెక్కుకడగండ్లు పడి, కాలము గడుపుచుంటివని మేమెఱుఁగుదుము. ఎచ్చటెచ్చట నేవిధములైన బాధల నొందితివో మాకుఁ దెలియఁ జెప్పు"మనిన నామె యిట్లు పల్కెను. "కృష్ణాజినాజ్యసమిదాదిగృహీతహస్తయైయజ్ఞవిద్యాదేవి నన్ను నొల్లక నాతోఁ బరుసించి వేలుపోటికి నన్నరుగుమని వెళ్లఁగొట్టెను. అంతటఁ గర్మమీమాంసాతరుణియొద్దకు నేఁ బోవ నామెయును యజ్ఞవిద్యాలలన వలెనే నన్నోర్వలేక పొమ్మని నాకు దారిఁజూపెను. తరువాతఁ దర్కవిద్యలచెంత నేఁ జేరగ వారు నానావిధ కర్కశభాషణంబుల రెచ్చఁగొట్టి చెలరేఁగి నన్ను బంధించుట కనుసంధించుచుండ నే భయభ్రాంతనై పాఱుచున్నఁ జూచి, విష్ణుభటులు వెఱవకు వెఱవకుమని నా కభయమిచ్చి యాకఠినహృదయులగు తర్కవిద్యలను మోఁది చెదరఁగొట్టిరి. అంత నా పుత్రియగు శ్రీగీత మచ్చికంబునఁ జేర వచ్చి కౌఁగిలించి నన్నాదరించెను. ఇట్లనన్యసామాన్యవిషమావస్థలను బొంది తిరిగి దేవరవారి ప్రాపుఁ జేరఁగలిగితి"నని యుపనిషద్దేవి పల్క, జీవేశ్వరునితో "నీవు పరమాత్మవు. నీకును బరమేశ్వరునకును భేదములే"దని చెప్పిన జీవేశ్వరుఁ డామాటలయర్థమును గ్రహింపలేక వివేకుని వంకఁ జూచెను. ఆమహానుభావుఁ డుపనిషద్దేవిమాటల యర్థము విశదముగా వినిపింప జీవేశ్వరుఁడు గ్రహించి సంతసించుచున్న సమయమున నిదిధ్యాసయను నొకకాంత దరి వారిని సమీపించి యుపనిషద్దేవికి సంజ్ఞ చేసి యిట్లు చెప్పె: "విష్ణుభక్తిమహాదేవివలన నీసందేశమును నీకుఁ గొనివచ్చితిని. వివేకమహారాజు సన్నిధానంబున నీ వుండిన మాత్రంబున సంకల్పజననివై విద్యాప్రబోధచంద్రుల నీగర్భంబున దాల్చితివి. నీవు నీతనూజయగు విద్యాకన్యను మనస్సునందుఁ బ్రవేశపెట్టి, ప్రబోధచంద్రునిఁ బురు

షునియందు నిల్పి నీవు వివేకుని దోడ్కొని యామె కడకుఁ జేరుమని యాయమ యాజ్ఞాపించినది" అని యిట్లు చెప్పి నిదిధ్యాసము శివేశ్వరునియం దంతర్ధానమయ్యెను.

తరువాత విద్యుల్లతాప్రభాసియగు విద్యాకన్యయు,నిర్మలసహజప్రకాశమానుఁడగు ప్రబోధచంద్రుఁడును నావిర్భవించిరి. శివేశ్వరుఁ డపారమగు సంతోషమును బొంది వారిని గౌరవించి కౌఁగిలించి యతిశయించుచున్న సమయంబున విష్ణుభక్తిమహాదేవి జనుదెంచెను. శివేశ్వరుఁ డామెకు వినమితోత్తమాంగుండై ప్రణమిల్లి దీవనలు పొంది, యామె యానతిచొప్పున వివేకుని మంత్రిగాఁ జేసికొని, శ్రద్ధ, మతి, శాంతి మున్నగునారీమణుల గౌరవవినతుల కాస్పదుండై, నిరుపమానవైభవంబున సదానంద సామ్రాజ్యంబు చేయుచుండెను. [సశేషము.]

ఋతుసంహారము

మోచర్ల రామకృష్ణయ్య గారు, బి. ఏ.

ప్రియురాలా పటుచండభానుకిరణోద్వేలంబు, చంద్రాంశు సం
చయ శోభా స్పృహణీయశర్వరి, సదా స్నానార్హశీతోదకో
చ్చయ సంయుక్తము, వాసరాంత సుమనోజ్ఞం, బస్తసూనాస్త్ర దు
ర్జయ సంరంభము—గ్రీష్మకాల మిదిగో! ప్రారంభమై యొప్పెడిన్.

హరిణాంక క్షతసాంద్రమేచకతమః ప్రాంచన్నిశావేళలన్
స్ఫురదుద్యజ్జలయంత్ర మందిరచయంబుల్, దివ్యరత్నంబులున్,
సరసంబౌ హరిచందనంబును, మహానందంబుగొల్పన్, జనో
త్కరసంసేవ్యములై చెలంగెడిఁగదా, కాంతా, నిదాఘంబునన్.

రమణీయంబు, సువాసితంబు నగు హర్మ్యం బందు గ్రీష్మంబునన్
శ్రమవాయుంగ నిశీథవేళలఁ బ్రియామోచ్ఛ్వాసప్రలోలంబు, మ
ద్యము నాస్వాదమొనర్చి, పుష్పవిశిఖ వ్యాపార లీలా సము
ద్యమవర్ధిష్ణు సుతంత్రి గీతముల సౌఖ్యంబందరే కాముకుల్?

స్నానసురభిళ కేశపాశములచేత-సమణి రశనా వసన నితంబములచేతఁ
జందనోదార హార కుచములచేతఁ-గాముకుల వెట్ట దీర్తురు కాంత లిపుడు.

అందియల్మ్రోఁత ప్రతిపద మంచరవళి-ననుకరింపఁగ లాక్షారసారుణమ్ము
లైన చరణంబుల నితంబినీనికరము-సంస్మర మొనర్చు జనతతిస్వాంతములను.

టేంకణాదిత్యుని కుమారసంభవము

పి. సర్వోత్తమాచారి (యువకవిమండలి)

౧

ఆంధ్రవాఙ్మయ సామ్రాజ్యమున కాదికవిరాజ శిఖామణి యని యీ రాజేంద్రుని కుమారసంభవ కావ్యమును, ౧౯౧౮ వ సంవత్సరమున మానవల్లి రామకృష్ణయ్య, (యం.ఏ.) గారు ప్రకటించిరి. వేయియేండ్లకు పైగా విస్మృతికుహరమున బడిపోయిన యీ కవిరాజ శిఖామణి కావ్యమణుని నాంధ్రులకు పంచిపెట్టిన కీర్తి కవిగారిది.

వారీకవికాలనిర్ణయము సేయుచు కొన్ని హేతువులు చూపి, యితడు క్రి. శ. ౯౪౦ నాటివాడనియు, తత్కారణమున నాంధ్రకవితా పిత యని పిలువబడు నన్నయకు నూరేండ్లు పూర్వుడనియు సిద్ధాంతీకరించిరి. నాటినుండియు నేటిదాక ఈ కవిరాజ శిఖామణి కాలమును గురించి యాంధ్రలోకమున పెక్కు వాదోపవాదములు జరిగెనవి. ఆంధ్రవాఙ్మయస్రష్ట యని తామ చెప్పుచున్న నన్నయ కిత డిటీవలివా డనియు, పూర్వుడగుట సంభవింపదనియు వీరేశలింగ ప్రభృతులు వాదించిరి. కాని యీవాదించిన బుర్రా శేషగిరిరావు, వీరేశలింగం, వీరభద్రరావు ప్రభృతు లెవ్వరును రామకృష్ణకవి గారు కాలనిర్ణయమునకు జూపిన యాధారముల సరిగా ఖండింపజాలకైరి. కొందరు తెలుగుమాటలు సంస్కృతీకరించియు, వాక్యమునకు గౌణార్థము లుపన్యసించియు నన్నయ్యయొక్క యాంధ్రకవితా ధాతృత్వమునకు నష్టము రాకుండ వాదించిరే కాని సత్యమునకు మాత్రము తొలగి తొలగియే పోయిరి. కొంత రిది యింద్రజాలమనియు, మాయాశక్తియనియు తమ వక్తృత్వ నైశిత్యము చూపుచు తక్తత్త లాడించిరి.

ఇది యిట్లుండ, జయంతి రామయ్య పంతులుగారు రామకృష్ణకవిగారు ద్వితీయ భాగమున ప్రశంసించిన పెదచేబూరి మల్లిదేవుని శాసనము నాధారముగా గొని యితడు నన్నయ్యకు ౧౦౧ సంవత్సరములు పిమ్మటివాడని సిద్ధాంతీకరించిరి. ఉపరినిర్దిష్టులగు వారివాద సామంజస్యమును నడకుదిటి వీరరాజు పంతులుగారు కొంతవరకు ఖండించిరి. మనమును వీరివాదముల భణితిని కొంత వివామాంసింతము.

౨

బుర్రా శేషగిరిరావుగారు సంవత్సరాది సంచికలో (౯౮.౩) చేసిన కాలనిర్ణయము వీరరాజుగారిచే చిద్రుపలైనది. వీరు సత్యాశ్రయకుల దీపకుడగు రాజనరేంద్రునే సత్యాశ్రయునిగా భ్రమించి, 'మనుమార్గకవిత' యను పద్యమునకు పెడయర్థము దీసినవారిలో ప్రథములు. వీరివాదమున మన మంత జోక్యము కలుగజేసికొన నవసరము లేదు.

ఇక వీరభద్రరావుగారు: వీరు తమయాంధ్రుల చరిత్రలో సామ్రాజ్య పరిపాలకుడు గాని సామాన్యుడగు చేట విజయాదిత్యుని కుమారుడగు సత్యాశ్రయుడే 'మనుమార్గకవిత' యను పద్యములోని సత్యాశ్రయుడనియు, కాన నన్నయ్యకు ౧౦౦ సంవత్సరములు పూర్వమునుండి తెలుగున గవిత్వ మున్నదనియు సెలవిచ్చిరి. వీరేశలింగం పంతులుగా రీపూర్వులవాదమును నమ్మి సత్యాశ్రయుడు కుబ్జవిష్ణువర్ధనుని యన్న గాకపోవుటచే కవిగారి కాలనిర్ణయము (౯౪౦) తప్పనిచెప్పుట నేమేమియెరో వ్రాసిరి. వీరేశలింగం పంతులుగారు వార్ధక్యమున వ్రాయుటచేత గాబోలు, స్వవచన వ్యాఘాతాంశములు ప్రొత్తహార్పు కవిచరిత్రలో బహుళముగ గనబడుచున్నవి. నన్నయ్య చరిత్రమున నీసత్యాశ్రయుని గురించి వ్రాయుచు నీతడు కుబ్జవిష్ణువర్ధనుని యన్న గాన తెలుగుకవిత నన్నయ కాలనూరేండ్లనుండి వర్ధిల్లుచున్నదని వ్రాసిరి.

వీరేశలింగం పంతులుగారు చూపిన 'మాబల', దీని వ్యాఖ్యానములును చాల దుర్బలములు. రామకృష్ణకవిగారు చూపిన కొన్నికొన్ని శబ్దములనే గ్రహించి, చోడుడు దీశబ్దముల గన్నడమునుండి దొంగిలించెనని వ్రాసినారు. ద్రావిడభాషలలో సమానపదములని కవిగారు చెప్పిన ముక్కకు దుర్బలసమాధానమొసంగినారు. శంభుదాస తిక్కనాదులనుండి ప్రయోగసహస్రములు చూపించుచున్న వాక్యమునకు సంజాయిషీయే లేదు. క్రౌంచపదము విషయమున గూడ వీరు వ్రాసినది నిరాధారము. చోడుడు కర్నాటకసంప్రదాయము ననుసరించి వ్రాసెనట! ఆధారమేమి? నన్నెచోడున కొక్క యీ క్రౌంచపదవృత్తమున మాత్రమే కర్ణాటకభాషాభిమాన మేల కలుగవలెను? ఇది దురూహ్యము. అతనిభాష తేనెతేటవంటి జానుదెనుంగు. అందములు పొదిగిన రతనపుమొలక లాతనిపలుకులు. చోడునికి కర్ణాటమున బాండిత్య మున్న దనుట కేమిప్రమాణము?

నన్నెచోడుని సర్వాత్మనా అనుకరించిన పాల్కురికి సోమన కన్నడమునగూడ గొప్పకవి. అతడు వ్రాసిన క్రౌంచపదము నన్నెచోడుని దానివలె లేదే. అది యర్వాచీన సంప్రదాయము గలది. కన్నడమున మహాకవియని పేరొందిన సోమనకులేని తద్భాషాభిమానము కన్నడము వచ్చునో రాదో యన్న చోడునికేల యుండవలయునో తెలియదు! నిష్కారణముగ చోడునికి కర్ణాటభాషా పక్షపాతిత్వము గట్టుట తొందరగలచేత.

రుద్రభట్టు వ్రాసినజగన్నాథవిజయమునుండి నన్నెచోడుడే భావము దొంగలించెనని వీరేశలింగము వారి వాదము. దీని కాధారము శూన్యము. ఈ పద్యముకంటె వేయిరెట్లు మనోహరములైన పద్యములు వ్రాసినమహాకవి చోడుడు. రుద్రభట్టు జగన్నాథవిజయమును, చోడుని కుమారసంభవమును బోల్చి చదివినచో, రుద్రభట్టు చోడునిపాదములవద్ద కొంత శుశ్రూష చేయవలసియుండునని గోచరించుచున్నది

అన్నిటికంటె విచిత్రమైన విషయ మొకటి గలదు. త్రైలోక్యమల్లుని(౧౧౫౩) కాలమునాటి జైనమతమున గల తెలుపురంగు వస్తువుల జాబితా గల శ్లోకముచూచి, నన్నెచోడుడు కుమారసంభవమున 'హారహీరసాకాశగంగా' యనుమహాస్రగ్ధరను వ్రాసినాడట! జైనులు శబ్దార్థచౌర్యమునకు వెనుదీయరని రామకృష్ణకవిగారు వ్రాసిన దానికి గప్‌చిప్! ఇంత చక్కని ప్రౌఢకావ్యము వ్రాసిన చోడునికి శ్వేతపదార్థముల జాబితాపద్యమున చౌర్య మొండి గట్టుట ద్రోహము!

వీరేశలింగముగా రెట్లయిన రామకృష్ణకవిగారి కారణము లన్నిటిని యెదురుగ నన్వయింపజూచిరే కాని, తదన్వయములు దుర్బలాధార గగనసౌధము లని గుర్తెఱుంగక పోవుట శోచనీయము.

3

జయంతి రామయ్యపంతులు గారు పెదచెఱుకూరి శాసనమును జూపించిరి. ఆశాసనము నన్నెచోడునిది గాదుగాని, యిందు చోడుడు తనతండ్రియని చెప్పుకొన్న చోడబల్లి కనబడుచున్నాడు.

చోళశాసనములలో చోడబల్లులు, నన్నెచోడులు పెక్కురున్నారు. వీరెవరో!—ఇది ఘుణాక్షరన్యాయముక్రిందకు వచ్చునేమో యని మాసంశయము!

వీరు నన్నెచోడుడు తనగురువని చెప్పుకొన్న కాలాముఖమల్లికార్జునుని గురించినదని చెప్పుచు శాసనము జూపించుచున్నారు. నన్నెచోడుడు తన కావ్యమున 'పూని మహోగ్రవీర' యను పద్యమున జంగమమల్లయ పేర 'సప్తసంతానముల నొప్ప నల్పెను'నని వ్రాసికొన్నాడు. అట్టి శాసనము లేవియు మనకు గన్పట్టుటలేదు. ఏవియోశాసనములు దెచ్చి అందొక మల్లికార్జునుని పట్టుకొని, యింకొకశాసనమున ఘుణాక్షరము గన్న చోడబల్లి కుమారుని నన్నెచోడుని లాగుకొనివచ్చి, అతడే మనకవి, ఆ బైరాగియే మనకవి గురువు—అని వాదించుట దుర్బలవాదము! నన్నెచోడుడు తన కావ్యమున స్పష్టముగ నొరయూరి కధిపతినని చెప్పుకొన్నాడు! అట్లు చెప్పుకొనుట చోళుల కాచారము సిద్ధాంతము ఎప్పటినుండి యాచారమను పూర్వపక్షము నెదుర్కొన

వలసియున్నది. నన్నెచోడుడు తన నివాస మురయూరని యబద్ధమేల చెప్పుకొనవలసి వచ్చినదో తెలియదు. మిత్రాన్వయకుల శేఖరుడను, వివిధయజ్ఞముల పవిత్రీకృత దేహుడనని చెప్పుకొన్న మహానుభావున కసత్య దోషము గట్టుట యవిమృశ్యకారిత్వము. చోళుని కాత్మస్తుతియం దిష్టమని కవిచరిత్రకారుడు తన మనోదౌర్బల్యమును బయలుపెట్టుకొనినాడు.

౩

వేంకటాదిత్యుని తొల్దొల్త పరామర్శించిన అథర్వణుని కాలమునుగూర్చి ఏమియు దెలలేదు. త్రిలింగ శబ్దానుశాసన కర్తయగు నథర్వణుడును, కారికావళి కర్తయగు నాతడును భిన్నులు వలె కన్పట్టుదురు. ఒకడే రెండు వ్యాకరణములు వ్రాయుట, అందొకదాని కింకొకటి సంబంధహీనమైయుంట, ఇవియన్నియు చూడ కారికావళీకర్తకు శబ్దానుశాసనకర్త పూర్వుడని తోచుచున్నది. అథర్వణునికి ద్వితీయాచార్యుడని తొల్త నామకరణము చేసిన అహోబలపండితు డాతని కారికావళిని బట్టియే చేసెను. కాని ఐతిహ్యము నన్నయాథర్వణులు సమకాలీనులని చెప్పుచున్నది. బలవంతమైన శాసనాది సాక్ష్యము లేనప్పు డీనృశైతిహ్యములే (tradition) ప్రమాణముగా చరిత్రజ్ఞు లంగీకరింతురు.

అథర్వణాచారి తొల్త వేంకటాదిత్యుని తన ఛందస్సులో పరామృశించెను. కాని మనకవి నన్నయాపూర్వుడే యగుననుట కిదియొండు చాలదు. అథర్వణుని కాలనిర్ణయము మనకవికాలనిర్ణయమునకు సహకారి యగును గాన, అథర్వణచ్ఛందమును రామకృష్ణకవిగారు ప్రకటించి, తత్కాలనిర్ణయమునకు తోడ్పడుదురు గాక యని కోరుచున్నాము.

౪

నన్నెచోళునికి వేంకటాదిత్యు డనునది మరియొక నామమనియు, అతడు పరాంతకుని కుమారు డగు రాజాదిత్యునికి పూర్వమున నున్న ఆదిత్యుడే యనియు, అతడు క్రీ. శ. 880–900 లో నొరయూరు పాలించుచుండెననియు వెంపరాల సుబ్రహ్మణ్యంగారు 'Andhra Historical Research Journal' లో వ్రాసియున్నారు.

చోళచరిత్ర పరిశోధింపగా నందు నాదిత్య నామధారు లిర్వురు గన్పట్టుదురు. ఆయిర్వురిలో మొదటి యాతడే మన వేంకటాదిత్యుడని సుబ్రహ్మణ్యంగారి వాదము.

ఇది మాకును సమంజసముగనే కన్పట్టుచున్నది. ప్రాచీనందరు మనచోళుని లక్షణగ్రంథములును, జనశ్రుతియుగూడ వేంకటాదిత్యు డని పేర్కొనుచున్నవి. కన్నడమున 1105 లో మల్లినాథపురాణము వ్రాసిన నాగచంద్రుడు చోళుని భావములు గ్రహించినాడు. తత్సమీపకాలీనుడైన రుద్రభట్టుగూడ వేంకటాదిత్యుని పెక్కుచోట్ల ననుకరించినాడు. ౧౧౬౭ లోని త్రైలోక్యమల్లుని మకమువీరాది శ్లోక మీకవిరాజశిఖామణి పద్యమునకు బ్రతిధ్వనియై తీరవలెను! కన్నడ విక్రమార్జున విజయము వ్రాసిన ఆదిపంపడు వేంగీవాస్తవ్యుడు. ఆతడు తన విక్రమార్జున విజయమునకు కృతిపతియైన అరికేసరికి, యర్జునునకు నభేదముగ నాశ్వాసాంతపద్యముల వ్రాసినాడు. ఆదిత్యుని కుమారసంభవమునగూడ నాశ్వాసాంత పద్యముల కృతిభర్తయగు జంగమమల్లికార్జునునకును, పరమునకును నభేదత్వము గల్పితమైనది. ఈసంప్రదాయము ప్రాచీనాంధ్ర కావ్యముల సంప్రదాయమని మన మనుమానింపవచ్చును. తెలుగువాడైన ఆదిపంప డీపద్ధతిని కన్నడమున దొల్దొల్త వ్యాపింప జేసినవాడు. కావున నీకవి కాలము చెలుకూరిశాసనము ప్రకారము ౧౨ శతాబ్దము కాజాలదు. ఇంకను, ఒరయూరు నేలిన ప్రాచీన చోళరాజుల తమిళశాసనములు పరిశోధించినచో మన కవి చరిత్ర చిక్కక పోదని మాయుద్దేశ్యము. కాన, బహుభాషావేత్తలగు పరిశోధకులీభారము బూని యాంధ్రభాషాసేవ జేతురుగాత!

ఈకన్నడకవులకు (రుద్రభట్టు, నాగచంద్రుడు మొ.) తెలుగు వచ్చునాయని ప్రశ్నించినచో రాదని

చెప్పుట కాధారము లేదు. తెలుగు వచ్చిన కన్నడ కవులు పెక్కురున్నారు; కన్నడము రాని తెలుగు కవులును పెక్కు రున్నారు; ఆకాలమున నాభాషల కంత యన్యోన్య ముండెడిది. నవీన విమర్శనల ప్రకారము, ప్రాచీన తమిళకావ్యముల సాక్ష్యమువను, కన్నడభాష తెలుగు తమిళముల మిశ్రణమని తెలియుచున్నది. 12 శతాబ్దములో ప్రసిద్ధ తమిళకవియగు జయకొండన్ కన్నడమును గురించి యిట్లు చెప్పెనని ప్రసిద్ధవిమర్శకులు వ్రాయుచున్నారు.—

'Jayəmkondan the prince of the poets of the early years of the twelfth century speaks of Kanarese being of jumble of some Telugu and much Tamil.'
'Tamils & Andhras' by Pandit Raghava Iyengar, *vide* Triveni, vol I, no. 2.

౬

నన్నెచోడుని గురించి వ్రాయునప్పు డింకొక విషయ మున్నది. అది చోడు డాంధ్రకవిత యెప్పుడు పుట్టినదో తెల్పియజేసిన పద్యమును గురించి. ఆపద్యమునగల 'సత్యాశ్రయునితొట్టి చాళుక్యనృపుల్' అను పాఠ మసత్పాఠమనియు, 'చాళుక్యరాజా మొదలుగా బూర్వుల్' అనునది సత్పాఠమనియు మన విమర్శకుల సిద్ధాంతము.

వారివ్యాఖ్యప్రకారము—లోకములో సంస్కృతకవిత ప్రచలితమై యుండ దేశికవిత (అనగా, కర్ణాటాంధ్రాదిదేశభాషల కవిత) పుట్టించి—ఆంధ్రవిషయమున తెలుగు నిలిపిరి—అనగా, తెలుగునకూడ కావ్యములు పుట్టించిరనుట.—ఎవరు?—రాజరాజనరేంద్రుడు మొదలుగాగల చాళుక్యరాజులు—అని యర్థమట!—

దేశికవితలో కర్ణాటకవితకూడ చేరునుగదా! లేక దేశికవిత బుట్టించి యనగా తెలుగుకవిత బుట్టించి యనియే యైన, నాంధ్రవిషయమున తెలుగు నిలిపిరని మరల చెప్ప నవసరము!—కాన దేశికవిత యన కర్ణాటకవితకూడ సంతర్భూతమగును! రాజరాజనరేంద్రుడు తెలుగుమాట యేమైనను కర్ణాటకవిత పుట్టించినాడనుట వట్టికల్ల. రాజరాజు తాతలనాటికే కన్నడమున అమోఘవర్ష నృపతుంగుని కవిరాజమార్గము (క్రీ. శ. 850) తత్పూర్వకవుల వాసేనల జేర్కొనుచున్నది. జైనవాఙ్మయ మాకాలమునాటికి దాభాషలో కావలసినంత యున్నది. దేశికవిత యన నింకేమి యర్థ మిచ్చెదరు?

ఇక తెలుగునుగురించి: తెలుగుకవితను రాజరాజనరేంద్రుడు పుట్టించి యంధ్రవిషయమున నిలిపెనా?—అని నన్నయ్య భారతములోగలదా! రెండవరాజరాజు శ్రీహర్మశాసనములో 'ఆంధ్రీదకార పర భారతసంశోవృత్తం' అనినాడేకాని యాదికావ్యమును రచియింపించెననినాడా? నన్నయ నాలుక భారతసంహితను తెనుగున రచియింపు మధికధీయుక్తిమెయి నని నేకాని, యాంధ్రకవిత పుట్టించి యాదికావ్యము వ్రాయు మనినాడా? నన్నయ్యయు తా నోపినకొలది భారతభారతీ సముద్రము నీదుదు ననాడు: కాని యాంధ్రకావ్యము లొల్లొత్త పుట్టించుచున్నానని చెప్పుచున్నాడా? లేదే!

తత్సమకాలీనుడైన నారాయణభట్టు, సంస్కృతకర్ణాటప్రాకృత పైశాచికాంధ్రభాషలలో కవిరాజశేఖరుడని నన్నయ్యయే తాను స్వయముగ వ్రాసినాడే. వీరిద్దరు కేసురువువద్ద ప్రాచీనాంధ్రవాఙ్మయము నభ్యసించిరో కదా!—సత్యమరాధిపాచార్యుడ వని తన్ను గురించి వ్రాసుకొన్నవాడు కావ్యవిధాతయేయైన కావ్యముఖమున నేల ప్రశంసించుకొనడు?

నన్నయ్యకు రెండువందల యేండ్లనుండి పద్యములు గలిగిన శాసనములు గన్పట్టుచున్నవి. కాని అవి దేశీయచ్ఛందోబద్ధములనియు, సంస్కృతవృత్త కవిత నన్నయయే ప్రారంభించినాడనియు నింకొక పుల్ల వేసినారు. అసలు, శాసనముల యుద్దేశ్యము దానధర్మముల ప్రశంస. అది యందఱకు తెలియునట్లుండవలెను కాన సుపరిచితచ్ఛందములలో మన ప్రాచీనకవులు వానిని వ్రాసినారు. నన్నయ్యభారతము పిమ్మట పుట్టిన సోమలదేవి శాసనము సీసపద్యములో నుండుటయేమి? సంస్కృతచ్ఛందోబద్ధమగు రచన లేకయా? దీర్ఘాసి శాసనము మాట యేమి? కాన నిట్లు వాదించువారితో మనకు పనిలేదు.

కాన 'సత్యాశ్రయకులతిలక చాళుక్యాభరణ' అనునదియే సత్యాశ్రయునివలె గన్పట్టుచున్నది. దీనివలన నన్నయ్య కాలమునకు రేండ్లనుండి తెలుగుకవిత యుండె నని తెలియుచున్నది. ఇది కవి చరిత్రకారులును నొప్పు కొనియున్నారు. కన్నడ కవితయు నీకాలముననే పుట్టి యుండును. నృపతుంగుడు పూర్వులగు వారి పేరులను పేర్కొనియున్నాడు.

మన వేంకటాదిత్యుడు నృపతుంగునికి సమకాలీనుడును గావచ్చును. ఈకాలముననే పండరంగని యుద్ధంకి శాసనము పుట్టినది. అందు తరువోజ గలదు. వేంకటాదిత్యుడును దన కావ్యమున తరువోజలు వ్రాసియున్నాడు. మధ్యాక్కర లిటుపిమ్మట ప్రచారమునకు వచ్చినవై యుండవచ్చును. పండరంగని శాసనములో యతి లద్విత్వ మున్నట్లే కుమారసంభవమున గూడ నున్నది.

నాటి పెక్కుశబ్దములు నన్నయనాటికి లుప్తములై పోయినవి.

ఇతని గురువు జంగమ మల్లికార్జునుడుగూడ గొప్పకవి. ఇతని కృతులకు కాలము తన పొట్టను బెట్టుకొన్నది. ఆమహాసాగరమునుండి యేతరంగము వానిని ఒడ్డున కీడ్చునో తెలియదు.

* * * * *

మన యాంధ్రకవిత నన్నయ్యయే పుట్టించినాడని పొరబడినాము! నన్నయ్యకు పూర్వము కావ్యములున్న వన్నవారిమాట లింద్రజాలములనుచేసి మాయని వేటూరివారు జోస్యము చెప్పుచున్నారు. కాని కాలమే యెవరివి ఇంద్రజాలములో తెలిపెట్టగలదుగదా! ఎక్కడికొంగలక్కడే! సంగములనాటి తొలకాప్పియరను తమిళగ్రంథకర్త కాలమున తెలుగు తమిళముతో సరిసమానముగా నున్న దని, ప్రఖ్యాతతమిళ విమర్శకులు చెప్పుచున్నారు.

"Kakkaipadiniyar,also an ancient Tamil poet, mentions distinctly that Vadugu,the land where the Telugu language is current, formed the northern limits of Tamil; it will thus be patent that long before Tolakapiyar's times, Tamil and Telugu had been current side by side as two independent languages. To judge by the Tamil literature now available, Telugu would seem to be entitled to an antiquity equal to that of Tamil.

Pandit Raghavaiyangar, 'Tamils & Andhras'—*Vide* Triveni, vol. I, no. 2.

మఱియు వీరు నన్నయ్యదే యాంధ్రకవితాద్యత యను వారికిట్లు సమాధాన మిచ్చుచున్నారు:

'The Yapparungala Vritti' a renowned commentary which must be attributed to the 10th or 11th century, A. D., cites an old prosodical work in the Andhra language said to have been written by one Vanchi. Though the reading in the printed books is 'Vanji' some manuscripts may be taken to yield the reading 'Avaranji'—(Aparanji).

The existence of so early a prosodical Treatise show that the Andhra literature must have been rich. Here, we have proof positive that the absence in the present day of Telugu works earlier than those of Nannayya Bhatta (11th century A. D.) cannot support the view that there was no Telugu literature prior to his days. —*I bid.*

తమిళములో 'యాప్పరుంగలవృత్తి' అను ప్రాచీనగ్రంథవ్యాఖ్యలో ఒక ప్రాచీనాంధ్ర ఛందస్సు పరామృశింపబడినది. ఆవ్యాఖ్య ౧౦, లేక ౧౧ వ శతాబ్దముది. ఆఛందస్సు వ్రాసినయాతడు అపరంజి యను వాడు. మన పండితులెవ్వరు నీతని స్మరింప లేక పోయిరి.

ఈ ఛందస్సాక్షియే 'మును మార్గకవిత' యను పద్యమున గల చాళుక్యరాజు రాజనరేంద్రుడు గాడని ముక్తకంఠముగ ఘోషించుచున్నది.

ముఖ్యపాత్రలు:—

పురుషులు

1. శ్రీకృష్ణుఁడు-ద్వారకానాథుఁడు
2. కుచేలుఁడు-అవంతీ నగరవాసి; శ్రీకృష్ణ భక్తుఁడు
3. నారదుఁడు-దేవర్షి
4. నావికబాలుఁడు, కావడివాఁడు } ఛద్మవేషధారి శ్రీకృష్ణుఁడు
5. బిచ్చగాఁడు-కుచేలుని సంగడీఁడు
6. సాత్యకి-శ్రీకృష్ణానుజుఁడు
7. రాముఁడు, భీముఁడు-దొంగలు
8. రోగి

స్త్రీలు

1. రుక్మిణీదేవి-ద్వారకరాణి
2. వామాక్షి-కుచేలునిభార్య
3. సన్న్యాసిని-ఛద్మవేషధారిణి రుక్మిణీదేవి
4. సుశీల

ప్రథమాంకము

దృశ్యము ౧.

రాజమార్గము

[కుచేలుఁడు పాటపాడుచుఁ బ్రవేశించును]

సురంటి(భైరవి)రాగము — ఆదితాళము

ప. జయజయ గోకులబాల — జయసకలాగమ మూల
దయయా మాం గోపాల — దీనం పాలయ బాల!

1. దేవ మయా చరిత మిదం — దీనధియా అపరాధం
శ్రీవసుధాధవ కృపయా — కేవల మిహ ధునీహి.

2. ఈక్షే తావక దేహే — ఈశ జగంతి నిరీహే
శిక్షాశిక్షితమోహే — వేదాంతాగమ గేహే.

3. జగదండకోటితనో — జగదుదరాంతరసుతనో
అగణిత సంజాతమనో — అపరిమితాశ్రిత ధేనో!

4. వితర మ ఖిలేశ్వర కరుణాం—విఘటయ మోహావరణం
సతతం మే భవ శరణం — సాధయ సంసృతితరణం.

5. ఇతివిధినా పరిగీతం — శ్రుతివచసా హరిచరితం
యతినారాయణకథితం—యదుకులభూషణ ముదితం.

గీ. నీకృపాపారమధురాబ్ధి నిండుఁదనము
తెలుఁగునా యొక్క బిందువు కొలఁతపడిన,
నిన్ను వేఁడెదఁ జేకోయి నిటలతలముఁ
జేర్చి, నందనందన, దరిఁ జేర్పు నన్ను.

[పాటపాడుచు బిచ్చగాఁడు ప్రవేశించును.]

ఎన్ని జన్మము లాయెనో
నేటి కిందెందు జన్మించినానో,
నన్ను దరిఁ జేర్పఁగదవే
యిఁకనైన నాతండ్రి నారాయణా!

బిచ్చగాఁడు

కుచేలా, హరిప్రేమామృత పానమున నున్మత్తుఁడవైతివి. నీముఖమున దివ్యతేజము స్ఫురించుచున్నది. నిక్షేపధనము దొరికినదా ఏమి? నీవంటిభక్తునికి హస్తగతము కాకుండిన మఱి యెవ్వరికి లభించును!

కుచేలుఁడు

తమ్ముఁడా, అది నిక్షేపధనము కాదు; అది యొక యమూల్యరత్నము. ఆరత్నమూల్యము బ్రహ్మరుద్రేంద్రాదులకైన గణింప నలవికాదనిన నావంటి యధమునకు గణింపఁదరమా?

నిజముగా శ్రీహరి నాయెడ దయాప్రసన్నుఁడై యాయనితర సులభసాధ్య ధనమును బ్రసాదించునా?—

(భావావేశమున) ఓబృందావనచంద్రా!

గీ. విశ్వవేదాంత వీథుల విహరణంబు
సలుపు నతులుఁడమ్మలకుఁ, బ్రశాంతి;(?)
భరిత, త్రిభువనాధార, శుభప్రసార
లోచనములకుఁ గృష్ణ! శ్రద్ధోయి మ్రొక్కు.

గీ. మునులు కన్నులు మోడ్చి కాంచినయట్టి
కాంతి, గోపకామినులు నిరంతరంబు
హృదయముల నింపుకొను కమనీయకాంతి,
కనులు చల్లఁగ నెన్నఁడు గాంచఁగలనో.

బిచ్చగాఁడు

(స్వ) హరీ, హరీ! యని రాత్రింబగళ్లు నఱచు వీనివెఱ్ఱికి మేరయున్నదా? వీథిలో హరి, సంతలో హరి, ఎల్లప్పుడు నెల్లచోటుల హరిశబ్దమే! ఇట్టివెంగలితో నాకెట్లు సరిపడును? వీనికి హరిచింత; కడుపుచింత నాకు. ఆలుబిడ్డల నెట్లు పోషింతును, ఇల్లు వాకిలి నెట్లుపరిపాలింతును, అనుచింత నాది; వీనికో రాత్రింబగళ్లు హరిచింత. ఇట్టివానితో మాటలాడుచుండిన మూట నిండునా? ఈరోజులలో మాటతోఁ బనియేమియును లేదు; మూటయే సర్వస్వము. మూట నిండునదుపాయము వెదుకనివాఁడు నిరర్థకజీవి. నేనింక మసలరాదు. ప్రొద్దెక్కినది. (రెండడుగులు నడచి) ఈకుచేలుఁడు నితాంత దరిద్రుఁడయ్యు మహనీయ త్యాగమూర్తి. పెక్కుసారు లీవిశాలనగరమున రిక్తహస్తములతో గృహోన్ముఖుఁడనై పోవునపుడు, మహోదారమూర్తి యీకుచేలుఁడు తన ముష్టి గింజలను నాచెంగున ముడివేసి శ్రీహరీ! యనియానందతాండవ మొనరించి యుండెను. తనకడుపునిండకుండినను, పరులయాకలి చూచి సహింపలేని దయాశీలుఁడు; పరోపకారపరాయణుఁడు.

(ప్రకాశముగా) కుచేలా! హరినామరసాస్వాదనమున నాఁకలి మఱచితివా?

కుచేలుఁడు

తమ్ముఁడా, జన్మజన్మాంతరములనైన నా కీయాఁకలి తీరునా? ఓ పురుషోత్తమా! అనంత కల్యాణగుణాభిరామా!

బిచ్చగాఁడు

(స్వ) వీనితో నిట్లు మాటాడుచుండిన ముష్టిగింజలు మునుఁగుటయే కాని మఱియెట్టి లాభమును లేదు.

(ప్రకాశముగా) కుచేలా! నీవు హరినామ స్మరణముఁ జేయుచుండుము. దాత బిచ్చగానికై యెదురుచూచుచుండు ననుకొంటివా? మన పొట్టనిండకుండిన వానికిఁ గొఱంత వాటిల్లునా? నేఁబోయి వచ్చెదను.

కోఁతికి జలతారు కుళ్లాయి యేటికి,
విరజాజిపూఁదండ విధవకేల?

(నిష్క్రమించును.)

కుచేలుఁడు

నన్ను సుస్థిరనిర్వాణపదవీచ్యుతు నొనరింప నెందఱెందఱు నిష్ప్రయోజనప్రయత్నము లొనరించుచున్నవారలు! ఈనడివీథిలో నాగోకుల

చూడామణిని స్మరించుటకు నా కధికారము లేదా? నానయన చకోరచంద్రుని, నాముద్దుల గోపబాలుని, నాచిన్ననాఁటి చెలిమికానిని, నాహృదయమున నారాధించు భాగ్యమునాకు జన్మజన్మాంతరములఁగూడ లభించుఁగాక! ఓ యదువంశరత్నమా, గోపాలచూడామణీ!

సౌరాష్ట్రరాగము - ఆదితాళము

ప. శరణం భవ కరుణాం మయి కురు దీనదయాళో,
కరుణారస వరుణాలయ కరిరాజకృపాళో!

అ. అధునా ఖలు విధినా మయి సుధియా సురభరితం,
మధుసూదన మధుసూదన హర మామక దురితం.

1. వరనూపురధర సుందరకరశోభితవలయం
సురభూసురభయవారక ధరణీధర కృపయా,
త్వరయా హర భర మీశ్వర సురవర్య మదీయం
మధుసూదన మధుసూదన హర మామకదురితం.

[నిష్క్రమించును.]

దృశ్యము. ౨

[నిజకుటీరాంతరమున కుచేలుఁడు]

2. ఘృణిమండలమణికుండల ఫణికుండలశయన
అణిమాది సుగుణభూషణ మణిమంటపసదన,
వినతాసుత ఘనవాహన మునిమానసభవన
మధుసూదన మధుసూదన హర మామకదురితం.

3. అరిభీకర హలిసోదర పరిపూర్ణ సుఖాబ్ధే
నరకాంతక నరపాలక పరిపాలిత జలధే,
హరిసేవక శివనారాయణతీర్థ పరాత్మన్
మధుసూదన మధుసూదన హర మామకదురితం.

గీ. ఎవని యున్నరూపెఱుఁగక బుధులు సురలు
సర్వవిదుఁడని యెలుఁగెత్తి చాటినారొ,
యెవఁడు దుఃఖౌఘహంతని యెఱుఁగఁజేయు
శ్రుతులు, వతని సద్గతిని సన్మతినిఁ దలఁతు.

గీ. యదుకుల మణిదీప మగుచు నవతరించి,
పార్థసారథియై ధరాభర మణంచి,
యే ప్రవీణుఁడు ధర్మసంస్థాపనంబు
సెఱపె; నాచిరంజీవి నేమఱకతలఁతు.

(వామాక్షీ ప్రవేశించును)

వామాక్షి

(స్వ) ఆహా! పేదఱికంబుకంటెఁ గరంబు భరంబైన దురితంబు గలుగునే?

గీ. రూపమును మాపు; కొఱలేని పాపచింతఁ
గలుగఁజేయు; మరోగ్యముఁ దలఁపనీదు;
మానముఁ గృశింపఁగా బ్రతిమాలిపించు;
లేమికంటెను దుర్గతి లేదు జగతి.

అనంతదారిద్ర్య పీడాగ్రస్తులమై యెన్నాళ్లిట్లు దురపిల్లువారము! విపులసంసారమున సుఖాభావయోగమునకు మా పేదకుటుంబమే నిర్దేశింపఁ బడినదా? జీవనసుఖానుభవము మాకు గగనకుసుమప్రాప్తియేనా? సాందీపఋష్యాశ్రమంబున మేము గడపిన దినములు మఱచి పోవుదమన్నను మఱపునకు రావు. ఆహా! ఆదివ్యాశ్రమనివాస మెంత శాంతిదాయకము! ఇప్పు డీబిడ్డలతో నియ్యాశ్రమవాస మెంత విపరీతముగా నున్నది! (భర్తనుజూచి) రాత్రింబగళ్లు శ్రీహరీ! శ్రీహరీ! యని యీ మహాత్ముఁడు బాహ్యజగంబు మఱచియుండును. ఈతని యనూనపదవీ ప్రాప్తికై సంతోషింతునా? చిఱుతప్రాయంపు బిడ్డల పేదఱికంబునకై దుఃఖింతునా? సాందీపమునిచంద్రుని యాశ్రమోపాంతమున నే శ్రీపదములసందర్శనమయ్యెనో, యాశ్రీపదముల నాశ్రయించిన దుఃఖాంధకారము దూరముకాకుండునే? అబ్బం

దావనవనధిపూర్ణచంద్రుని సందర్శించి సిరులు వేఁడినఁ గరుణింపఁడా? లక్ష్మీనిలయుని యను కంపాతిశయమున సకలకళ్యాణములు చేకూరఁ గలవు. అతఁడు భక్తవరదుఁడు; మేమాశ్రితు లము. విశేషించి నాప్రియభర్త కాతఁడు కడుం గడుఁగూర్చు నెచ్చెలికాఁడు. అవశ్యము మా మొఱాలించును.

(ప్రకాశముగా) నాథా! ఇదియేమి? నిరం తరధ్యాన మగ్నులరైయుండిన సంసారచక్ర మెట్లు దిరుగును? ఆలుబిడ్డలు లేనివారు తపోనియమంబుఁ బాటించినఁ జెల్లుఁగాని, గృహస్థుల కీ యప్రతిమానప్రతిభ చెల్లు నే? తల్లిదండ్రులఁ గలిగియు లేనివారైరి మన యీ చిఱుతప్రాయంపు బిడ్డలు! వీరి దుర్దశ కణుమాత్రమైనఁ జలింపరేమి! మనము బ్రతికి యుండఁగనే మనబిడ్డలు దిక్కుమాలిన వార లగుదురా? కడుపుతీపి యెఱుంగని మిమ్మే మనంగనేర్తు? శిశువులగోడు గమనింపని పితృ హృదయము దోషభూయిష్ఠమని యార్యులు వచింపరే? నాథా, పిల్లలముద్దు చెల్లింపలేక పోయితిని కదా యని నాగుండె నీరయి చలించు చున్నది. ఆఁడుదానను; అబలను; పవిత్రవిప్ర కులమున జనించినదానను; పరమపవిత్రుల రగు మీచేయిఁ బట్టినదానను; పుత్త్రవతిని. నే నెట్లు దేహియని నడివీథిలోఁ దలచూపఁ గలను? పురుషుఁ డుద్యోగనిపుణుఁడు; స్త్రీ యాలేని యన్యాశితప్రాణి. మి మ్మాశ్రయించి మీ పౌరుషభంగమెట్లు కావింప నేర్తును? మహాత్మా, నా యలజడి దైవమెఱుంగు! (కన్నీ రుదుడుచుకొనుచు)

సీ. సారగోచు లేకాని నాజెంపుఁగోకలు
బుడుత లేనాఁడైనఁ దొడుగుకొనిరె?
పాలపూస లేకాని బంగారు నగలు నా
బిడ్డ లేనాఁడైనఁ బెట్టుకొనిరె?
పేఁడగంజి యొకాని పితికినపాలు నా
తనయు లేనాఁడైనఁ ద్రాగినారె?
ఆఁకులందు నేకాని యపరంజిగిన్నెల
నిడుపు లేనాఁడైన మెసవినారె?
పేఁదవారలు లేరె? ఇవ్విధము యుగను
గతులు గాంచినారె? మఱి సుఖంబు నవను
విధి లిఖింపలేదె?—సిరుల విఱ్ఱవీఁగు
సారుగు వారలు చేసిన పుణ్యమేమి?

కుచేలుఁడు

అబలా, నీ వెడఁగుమాటలు మానవుకదా? అజ్ఞానజనితదుఃఖము నుపసంహరింపుము. జగ ములు నిర్మింప, రక్షింప నిర్వాణదాయకుం డగు శౌరియే కర్త. మృగములకు మేఁత బెట్టినవాఁడు, నట్టడవుల నృత్తములకు నీళ్లుపోసినవాఁడు, ఱాతి లోఁ గప్ప కాహారమిడినవాఁడు మర్త్యులకుఁ బట్టెఁ డన్న మిడఁడా?

వామాక్షి

నాథా, ఈ రిక్తవేదాంతములవలనఁ గడుపు నిండునా? దైవమానుషములు సమములని యెఱుంగరే! పంచభక్ష్యాన్నములు పళ్లెర మున నిడి భుజింపకున్నఁ గడుపు నిండునా? మీరు శ్రీహరిని నమ్మిన నిష్కాములు; మేము మిమ్ముల నమ్మితిమి. మమ్ము రక్షించుట మీకుఁ బరమధర్మము. మా 'కన్యథా శరణం నాస్తి!'

శ్రీకృష్ణుఁడు మీ చిన్ననాఁటి నెచ్చెలి. ఆతని నర్థించిన బహులైశ్వర్యములు బ్రసాదించును.

కుచేలుఁడు

(సవితర్కముగా) వామా, నీ మృదువచనములు నాహృదయమును సంతోషతరంగములఁ దేల్చివేయుచున్నవి. నీ యీ యుపదేశమునఁ దీర్థమును స్వార్థమును ఘటిల్లును.— కాని,

(మౌనమూనును.)

వామాక్షి

నాథా, ఊరకుంటి రేల?

కుచేలుఁడు

వామా, సర్వనదీనదాంబువులకుఁ బట్టయిన వారాశికే మంచు బిందువులు బరితోషమును గూర్చునా? సర్వసంపన్నుఁడగు హరికిఁ గానుక లీయ మనమెంతటి వారము! ఇచ్చినను, అది లాభమే యతనికి? కాని చంద్రునకు నూలు పోఁగన్న సామెత వినలేదా?

వామాక్షి

(స్వ) సాందీపఋష్యాశ్రమంబున మేము వసించిన దినములందు నందానందుఁడు నన్నుఁ జేరంజీరి, "అమ్మా, నీవిచ్చిన యడుకులు దినుటకు నా కెంతయో యభిలాష" అని యడిగి పుచ్చుకొనెడువాఁడు. మా పేదకుటుంబమున నాతనికిఁ బ్రియమైన వస్తు వేమికలదు. నేఁడు నేనుపవసించి, ధాన్యములు మిగిల్చి యడుకులు దంచి, ప్రేమోపహారముగా శ్రీకృష్ణదేవున కంపెదను. ఆతఁడేల నిరాకరించును? మా పేదఱికము జగద్విఖ్యాతమే కదా?

(ప్రకాశముగా) నాథా! నిజము, మన మాతనికేమైన నీయకున్న మన కాతఁడేల సంపదలిచ్చును? ముంజేయి యాడినఁ గదా మోచేయి యాడును. ఆ జగదానందమూర్తి కొఱకు నివ్వరియడుకులు సేకరించెదను. మీ చేలమున ముడిచికొని పొండు.

కుచేలుఁడు

మగువా, నీవొసంగ నెంచిన కానుక కేమిగాని, నీ యుదారహృదయమునకు ధన్యవాదము! నీవు లోనికరుగుము. నేను పూజావిధానము ముగించి భోజనమునకు లేచెదను.

[నిష్క్రమింతురు.]

దృశ్యము. 3

ద్వారకారాజసౌధము

[చింతానిమగ్నుఁడై శ్రీకృష్ణుఁడు ప్రవేశించును]

కృష్ణుఁడు

కుచేలా, నీపేదఱికము నా యేకాంతహృదయమును గలంచివేయుచున్నది. ఈ రాజ్యభోగము విషతుల్యమై పొడకట్టుచున్నది. నీ వంటి బ్రాహ్మణుఁడే కదా నా యిష్టదైవము; నా యిలువేల్పు. నీదారిద్ర్యదుఃఖభంజనమునఁ గదా నా సుఖసర్వస్వము. భక్తుని సామాన్యదుఃఖమున నాదుఃఖ మసామాన్య మగును. సఖా, నీ యాశీర్వాదమున నీ దుఃఖమోచనముఁ గావించెదను.

(రుక్మిణీదేవి ప్రవేశము)

రుక్మిణి

నాథా, మీానరసవదన మేటికి విరసంబై చూపట్టుచున్నది? ఎవ్వని యార్తస్వరము హృదయకుహరమునఁ బ్రతిధ్వనించు చున్నది? ఆర్తత్రాణపరాయణా! ఎవ్వని కెట్టి యాపద సంభవించెను?

కృష్ణుఁడు

ప్రేయసీ, ఆపదకాదు; సంపద!

రుక్మిణి

ధన్యుఁ డాభాగ్యవంతుఁడు! సంపత్సమయమునఁగూడ మిమ్ము స్మరించుచుండెనా?

కృష్ణుఁడు

ఆమహాపురుషుఁ డొకదరిద్రబ్రాహ్మణుఁడు; నా చిన్ననాఁటి నెచ్చెలి.

రుక్మిణి

దరిద్రుఁడు సంపన్నుఁడయ్యె నెట్లు?

కృష్ణుఁడు

ఎవ్వాఁడు నిష్కాముఁడై నాధ్యానమున నీరవ నిశ్చలుఁ డగునో, యాతఁడు దరిద్రుఁడయ్యు సంపన్నుఁడే యగును.

రుక్మిణి

ఆమహనీయుఁ డెవఁడు?

కృష్ణుఁడు

మగువా, నీవాతనిఁ జూచియుండలేదు. కొలఁది దినములలో మన కాతని దర్శనభాగ్యము లభింపఁగలదు.

(పాటపాడుచు నారదుఁడు ప్రవేశించును)

ముఖారిరాగము - ఆదితాళము

గోవర్ధనగిరిధర గోవింద,
గోకులపాలక పరమానంద.
శ్రీవత్సాంకిత శ్రీకౌస్తుభధర,
భావకభయహర పాహిముకుంద. గో.

కృష్ణుఁడు

దేవర్షీ, త్రిభువనముల నెట్టి యలజడియును లేదుకదా?

నారదుఁడు

ప్రభూ, నీకరుణాతిరేకమున జగంబుల నిత్యకల్యాణ మగును.

కృష్ణుఁడు

మీారాకకుఁ గారణమేమి?

నారదుఁడు

దేవా, ఉద్దేశపూర్వకముగా నీ సమక్షమున కరుదెంచుటలేదు. చాలకాలమునుండి మర్త్యభువనమునకు వచ్చియుండలేదు. ఆకారణమున మనంబు నిలకడలేనిదయ్యె. జగత్పిత వగు నిన్నును, లోకమాతయగు రుక్మిణీదేవినిఁజూచి పోదమని వచ్చితిని. (రుక్మిణి నుద్దేశించి)అమ్మా, ఎన్నాళ్లిట్లు ద్వారద్వారములఁ దిరుగ నాకు విధించితివి?

రుక్మిణి

శూన్యహృదయుండవై తిరిగిన బాధలేదు. నీ వడుగిడినచోటఁ గలహబీజములు వెదచల్లుచుందువు. నారదా, నిన్నుఁజూచిన నా కెంతయో భయమగుచుండును.

కృష్ణుఁడు

అవును. ఆనాఁడు పారిజాతకుసుమము నర్పించి మాయింట శాంతిభంగముఁ గలిగించితివి. చక్కఁదనములసీమ యైన సత్యభామయు, సాధుశీల రుక్మిణీదేవియు నా లతాంతము కారణమున నెట్టి యలజడి వడిరో, నే నెన్నఁటికిని మఱవఁజాలను. నారదా, నిజముగా నిన్నుఁ జూచిన నాకుఁగూడ భయమగుచుండును.

నారదుఁడు

ఆహా! నేధన్యుండ నైతిని! ఎవ్వాని నామస్మరణమాత్రమున సమస్తభయములు దూరమగునో యాతఁడు నన్నుఁజూచి భయపడునేని, నా యౌన్నత్యము వర్ణనాతీతముగదా? తల్లీ, భయకారణ మేమియును లేదు. నే నూరక యేయిట కరుదెంచితిని. దాసునిపై నీలాపనిందలు మోపఁదగునా?

కృష్ణుఁడు

(నవ్వుచు) మునికులనాయకమణీ, చాలదినములకు మఱల మాద్వారకకు వచ్చితివి. కొన్ని దినము లీసౌధమున విశ్రాంతి నొందుము. నేనిప్పు డొక మహత్తరకార్య నిర్వహణమునకై పోవుచున్నాను. జాగుసేయరాదు

నారదుఁడు

నీముఖమున నావేగము స్ఫురించుచున్నది. నీవు సంకల్పించిన కార్యము నిశ్చయముగా గురుతరమై యుండును.

కృష్ణుఁడు

కార్యము నిశ్చయముగా గురుతరము. నీవు స్వర్గ మర్త్య పాతాళముల నిరంకుశభ్రమణ మొనరింతువు. నీకు గోచరింపని దుర్లభపదార్థ మేదియును లేదు; గాని నీవెన్నఁడును గని విని యెఱుంగని యపూర్వవస్తుప్రదర్శనము గావించెదను. ఆకారణమున నేఁ జింతయుస్థిరమనస్కుఁడ నైతిని.

నారదుఁడు

దేవా, స్వర్ణముహూర్తమున నేను బయలు దేరితిని!

ఆనందామృత వారిధిఖేల,
అలఘుపరాక్రమ అనుపమలీల,
శ్రీనందాత్మజ శ్రితజనపాల,
శ్రీకరకీసలయ బాలవలోల. నో.

(నిష్క్రమించును.)

కృష్ణుఁడు

ప్రేయసీ, రమ్ము పోదము.

[నిష్క్రమింతురు.]

ద్వితీయాంకము

దృశ్యము. ౧

నదీతీరము

(పథిక వేషధారి కుచేలుఁడు ప్రవేశము)

కుచేలుఁడు

ప్రళయ సమయ సముద్రగర్భమువలెఁ దరంగములు విశ్వమును గబళింప నెగయుచున్నవి. వినీలమేఘమాలిక లాకసమును గప్పివేయుచున్నవి. ఆహా! యెట్టి భయంకరదృశ్యము! నే నెట్టి విపదంధకారమునఁ బడిపోయితిని. స్త్రీ బుద్ధి ప్రళయకారణము గాకుండునే?

ఈ వృక్షమూలమున క్షణకాలముఁ గూర్చుం డెదను; నావికుఁ డెవ్వఁడేని కానవచ్చునేమో. (కూర్చుండి) ఆహా! ఈ సెలయేఱు దాఁటుటే యింతకష్టముగదా! సుదీర్ఘమును, గభీరమును నగు భవనది నెట్లు దాఁటనగును! ఆ చెలిమి కానికే గోచరము. కృష్ణా, వసుదేవనందనా! (జపతత్పరుఁడగును.)

(నావికబాలునివేషము ధరించి కృష్ణుఁడు ప్రవేశించును)

నావికబాలుఁడు

అలుబిడ్డలును అన్నదమ్ములును
అప్పటి కప్పుడె సుమీ,
కాలకర్మమున గాటికిపోయిన
కలిసిరారు నీ వెంట!

కుచేలుఁడు

ఆహా! ఈ లోకోత్తర మధురగాన శ్రవణమున నా ప్రాణము శాంతిసంతోషములలో మునిఁగి పోవుచున్నది.

నావికబాలుఁడు

సారహీన మీసంసారాంబుధి
పారెదు మునిగెద వేలా?
తీరము సేరెదు కోరిక లుడిగిన,
తెలివి తప్పితివె ఛీ!

కుచేలుఁడు

ఆహా! ఇట్టి మనోమోహనగీతము నే నెన్నఁడు నాలించియుండ లేదు.

నావికబాలుఁడు

బాబయ్యా, దణ్ణాలు! దణ్ణాలు! నది దాటా ల్నా ఉంటే బేగిరా.

కుచేలుఁడు

ఈ దుర్దినమున, నీజడివానలో, నీవఱదలో నీ వెట్లు సాహసించి పడవ నడుపుచున్నావు! నీచిఱుత ప్రాణమునకు భయము లేదా! మహా నందమూర్తివై పాటలుకూడ పాడుచున్నావు!

నావికబాలుఁడు

బాబయ్యా, బయపడితే మాపని నేసేవా ళ్లోరు? ఎండావానా, గాలీముసురూ, అని ఇంటికాడ కూకుంటే పొట్ట నిండుతాదా? తాతలనాటి మాటుంటే హాయిగా తిని కూకోమా?

కుచేలుఁడు

నీయిల్లెక్కడ? నీపేరేమి?

నావికబాలుఁడు

నాపేరు "అనాది;" నా యిల్లా?—

కుచేలుఁడు

ఇల్లా? యని యూరకుంటివేమి? నీ కిల్లులేదా?

నావికబాలుఁడు

నేనెక్కడుంటే అక్కడే నాయిల్లు.

కుచేలుఁడు

ఇదేటిమాట! నీతలిదండ్రు లున్నారా?

నావికబాలుఁడు

నాకామాట తెల్దు. నాకోరు నేను.

కుచేలుఁడు

ఇది మఱియు నాశ్చర్యముగా నున్నది. నీవు స్వర్గమునుండి జాఱిపడితివా?

నావికబాలుఁడు

ఏమో, పుట్టినప్పుడు గ్యానం ఉంటాదా బాబయ్యా!

కుచేలుఁడు

(నవ్వి) బాలకుఁడు వెఱ్ఱివాఁడా ? లేక నా యీ జరాజీర్ణ కళేబరమునుగాంచి హాస్యము లాడు చుండెనా?

(ప్రకాశముగా) నీవు నన్ను నదిదాటింపఁ గలవా?

నావికబాలుఁడు

రా బాబయ్యా, కన్నుమూసి తెరిసినంతలో ఆవలి ఒడ్డు సూపిత్తాను. పెద్దపెద్ద జాలారోళ్లు నాతో పందెమేసి ఓడిపోయారు ఓడనడప డంలో. వరదొత్తే బయమేటి-జగమంతా సంద్ర మైనా బయంలేదు.

కుచేలుఁడు

బాలకా, ధన్యము నీసాహసము!—కృష్ణా, నీ భక్తుఁడను; నిన్నే నమ్మితిని. నిన్ను నమ్మి యెవఁడు తరింపలేదు!

నావికబాలుఁడు

ఏటాలోసిత్తున్నావు? బేగిరా బాబయ్యా!

కుచేలుఁడు

(నావయెక్కి) చావో, బ్రతుకో! నుదుట నెట్టి వ్రాఁత కలదో!—కృష్ణా, కృష్ణా!

నావికబాలుఁడు

(నావనడుపుచు) బాబయ్యా! వణుకుతా వేటి?— నాకు నాలుగుడబ్బులు దొరుకు తాయా?

కుచేలుఁడు

ఏమిరా, డబ్బనుచుంటివి? దరిద్రబ్రాహ్మణుఁ డను. నాదగ్గర డబ్బెక్కడ?

నావికబాలుఁడు

(నవ్వుచు)

దగ్గర నేదు డబ్బు
నాకెక్క దాని సబ్బు!

కుచేలుఁడు

కాసుకు బదులుగా నిన్నాశీర్వదించెదను. నేను గర్భదరిద్రుఁడను; బ్రాహ్మణుఁడను; నీకు దయ కలుగదా ?

నావికబాలుఁడు

చరే! మంచి ఆచీర్వాదం చెయ్యి, జాలారి పిన్నోడు మంచి మేడకట్టాలని.

కుచేలుఁడు

(సహర్షముగా) బాలకా, భగవానుఁడు నీ మనోవాంఛను పూర్ణ మొనరించును గాక! నీ కశేష మంగళప్రాప్తి యగునుగాక! (నావ మునుఁగనుండుటఁ గాంచి) బాలకా, బాలకా, నావ కదలుచున్న దేమి? అయ్యో ! అయ్యో! మునిఁగిపోవుచున్నది !—

నావికబాలుఁడు

బాబయ్యా, మఱి నాచేతకాదు. తెడ్డు నడిపి నడిపి నాసెయ్యి ఇరిగిపోయింది. నువ్వే చనం లో నా వెక్కావో! నాపుట్టిమునిగింది.

కుచేలుఁడు

నిజమా! నిజమా! నీ పుట్టిమునుఁగుటే కాదు; నాపుట్టికూడ మునిఁగినది. ఇంట సురక్షిత

ముగ నున్న మా వామాత్మి పుట్టికూడ మునిఁగినది! —బాలకా, మఱే మెట్టి యుపాయమును లేదా?

నావికబాలుఁడు

మఱి నేదు బాపనయ్యా, మఱిదారి నేదు. నీ దేవుణ్ణి తలుసుకో, బాపనయ్యవు కదా. ఏమో పిలుస్తే దేముఁ డినఁడా?

కుచేలుఁడు

నా దైవము శ్రీకృష్ణభగవానుఁడే! ఆతని దయతప్ప విముక్తిమార్గ మింకేమియును లేదు. ఓ కృష్ణా, ఆపద్బాంధవా! మమ్ము రక్షింపుము. (నావ సమముగా నడచిపోవును.)

నావికబాలుఁడు

బాబయ్యా, మఱి బయం నేదు. అదిగో, ఒడ్డు కనపడుతోంది.

నమ్మిన వోళ్లూ నమ్మని వోళ్లూ
నన్ను చేరగలరు,
నమ్మి నమ్మనివాయ నమ్మలు
నన్నెఱుంగ లేరు.

[నిష్క్రమింతురు.]

దృశ్యము. ౨

అడవిదారి

(ప్రవేశము—కుచేలుఁడు)

కుచేలుఁడు

ఆఁడుదానిమాటవిని నే నీ విపదంధకారమునఁ బడిపోయితిని. ఆగోపాలబాలుని యవ్యాజ కారుణ్యమునను, ఆనావికబాలుని యద్భుత సాహసప్రదర్శనమునను నాకు జలగండము తప్పినది. (నలువైపులు పరికించి) ఒత్తుగాఁ బెరిఁగినవృక్షలతాగుల్మముల దట్టంపునీడ లీవన ప్రదేశమున సూర్యకిరణములకుఁ దావొసంగుట లేదు. అంతయు నంధకారమయము. ముం దడుగిడుదమన్న దారికనబడదు. ఇప్పు డేమి సేయుదును?—హా! శ్రీహరీ! (కూర్చుండి) కృష్ణా, రుక్మిణీవల్లభా,

సీ. శరదిందు చంద్రికా సమమైన మృదుహాస
కాంతితో మకరకుండలములతోడ
శ్రుతిసౌఖ్యసంధాన సుకుమారవేణువి
స్వనముతో కరుణారసంబుతోడ
మణికాంతి జిగిపెంపు నిరుపమంబగు ముక్కు
తావితో చందురుతావితోడ
భువనమోహనవేష భూషణరూపవి
భ్రమముతో నీలగాత్రంబుతోడ
దేవకీవసుదేవుల జీవరత్న
మనుల మతిరుక్మిణీహృదయాబ్జమిత్రుఁ
డఖిలలోకాధినేత, నాయాత్మసఖుఁడు
కృష్ణదేవుఁడు సాక్షాత్కరించుఁగాత!

(కన్నులుమూసి ధ్యాననిమగ్నుఁ డగును)

(రాముఁడు భీముఁడు—ప్రవేశింతురు)

రాముఁడు

భీమా, బెబ్బులి యుబ్బునడంచిన నాదెబ్బ చూచితివికదా?

భీముఁడు

(ఆశ్చర్యానందముల నభినయించి) రామా, చూడు, ఆచెట్టుక్రింద దట్టంపునీడలో నెవ్వఁడో ముక్కుమూసికొని కూర్చున్నవాఁడు. వానిపెడతక్కలు విఱిచికట్టి—

రాముఁడు

(పరికించిచూచి) సెబాస్; భీమా, పిల్లివలె, గ్రుడ్లగూబవలె చీకటిలో నీచూపు లానఁగలవు!

(కుచేలుని సమీపింతురు.)

కుచేలుఁడు

(కన్నులువిప్పి, తస్కరులఁజూచి స్వ.) కృష్ణా! నీమధుమయరూపమును జూపుమని ప్రార్థించినందుకు నాపైఁగోపమా! ఆహా! ఎట్టిభయంకర హ్రాత్కంపమాన ప్రళయాభీలదృశ్యము! సంపత్కుబేరులగు బేహారులు ధనరాసులు సంగుప్తముఁ గావించుకొని ప్రయాణము సేయుదురు. వారివలెనే నేనుగూడ నవరత్నములు మూటగట్టుకొని పోవుచున్నానని వీరుభావించి నానిలువెల్లఁ బరికించుచున్నవారలు. ఆహా! వీరి విశ్వాసమునకును, అవిశ్వాసమునకును దారతమ్యము లేదుకదా?

(ప్రకాశముగా) అయ్యలారా, నావద్ద హరినామముతప్ప, శ్రీహరిపై నచలవిశ్వాసముతప్ప-నొండుధనం బేమియును లేదు. విరాళేటికి వ్యర్థసందేహమున నూఁగులాడెదరు?

రాముఁడు

(మొలనుండి చూఱకత్తిదూసి) ఇచ్చెదవా, చచ్చెదవా?

భీముఁడు

సగము చచ్చితివి; ఇచ్చెదవా, లేదా! విచ్చుకత్తితో నీకీక నుత్తరించెదము.

కుచేలుఁడు

పౌరుషమింకేమికలదు? హా! శ్రీహరీ! కృష్ణా! ఆపదుద్ధారకా!

(రాముఁడు కుచేలు నాక్రమించి, యటుకుల మూట కీసికొని)

రాముఁడు

భీమా, ఈరూకలమూట విప్పి లెక్కపెట్టుము.

భీముఁడు

కాసైన లేదని బాసచేసిన వేసగాఁడు.

(మూటతో నడిచిపోవును.)

(రాముఁడు కుచేలుని నిరీక్షించి చూచుచుండును.)

భీముఁడు

రామా, రామా, మోసము, మోసము!

రాముఁడు

(పరుగెత్తిపోయి, భీముని గలిసికొని) ఏమిరా రూకలు లెక్కిడుమన్న మోసము మోసమని కేకవేసెదవు?

భీముఁడు

ఇవి రూకలు కావు, నూకలు!

రాముఁడు

అబ్బా! దొంగల మొకిమీఁడనైన నాయెదుట కపటనాటకమా? రూక లీయకున్నఁ బీక నులిమి వేసెదను!

భీముఁడు

(భయముతో) ఆఁ! ఆఁ! నేను రూకలు చూడలేదు!

రాముఁడు

ఇచ్చెదవా, చచ్చెదవా! ముచ్చెమటల్పుగ్రమ్మిన నీమొసలుచీల్చి వెచ్చని పచ్చినెత్తురు దోరలించెదను—జాగ్రత్త!

(భీముఁడు భయభ్రాంతుఁడై పారిపోవును. రాముఁడు వాని వెన్నంటి పరుగెత్తును.)

కుచేలుఁడు

(అడుకులు మూటగట్టి) ఈ మూర్ఖులు వృథా కలహకారణమున దూరమైరి.—ఆహా! నికృష్టులగు నీ దొంగలకుఁ బనికిమాలిన యీ యడుకులు లోకోత్తర మహారాజగు శ్రీకృష్ణున కెట్లుపహారయోగ్యంబు లగును! వామా, నీవు నాపాలిటి విధివై నన్ను నడపుచున్నావు!

[నిష్క్రమించును.]

దృశ్యము. 3

ద్వారకా నగరమున నొకవీథి

(ప్రవేశము కుచేలుఁడు)

కుచేలుఁడు

ఆహా! ఈ సౌధముల యున్నత్యము, నీ పూఁదోఁటల పచ్చందనము, నీ మాణిక్యవేదులు, నీ తిన్ననివీథులు, ఎంత మనోహరముగా నున్నవి! అదె, శ్రీకృష్ణభగవానుని సౌధరాజము. నటీనటుల కాటపట్టగు రంగస్థలంబులు, మృగమద కాశ్మీర సిక్త శృంగాటకములు, మరకత ముక్తామణిమండితతోరణములు గలిగి యీ సౌధరాజము కన్నుల పండువుగా నున్నయది. ఓ సౌధాగ్రకేతనమా!

గీ. రాత్రియుఁ బగలు పులకిత గాత్రనగుచు,
స్తోత్రమొనరింతు నీరదగాత్రు జయము;
అంచనంతేపి కాద సౌధాగ్రసీమ
నిలిపినాఁడు, భక్తులయాత్మ నిలుచువాఁడు.

(ఉపక్రమించి)

ఓ ద్వారపాలకులారా! బ్రాహ్మణుఁడను; శ్రీకృష్ణభగవానుని సందర్శింపవచ్చితిని. ఆ దీనబాంధవుని సముఖమునకు దారిచూప వేఁడెద.

ద్వారపాలకులు

(కుచేలునకు నమస్కరించి) మహాత్మా! "బ్రాహ్మణో మమ దేవతా", యని మా చక్రవర్తి నిరంతరము నిండుమనంబునఁ బల్కుచుండును. బ్రాహ్మణులు శపింపఁ గలరు; శాపంబులు గ్రమ్మరింపఁ గలరు. మహీపతుల రాజ్యభోగవైభవములు బ్రాహ్మణాధీనములు! మా రాజ్యమున బ్రాహ్మణుఁడే గురువు; బ్రాహ్మణుఁడే దేవర; బ్రాహ్మణుఁడే యఖిలధర్మార్థ నిర్ణయదక్షుండు. ఓ ధన్యాత్మా! మీ యధీనుండగు భగవానుని సందర్శింప వచ్చితిరా? మీ స్వర్గీయ మహోదారబుద్ధి కంజలిఘటించి మ్రొక్కుచున్నాము.

కుచేలుఁడు

ఓ పుణ్యాత్ములారా!

గీ. శౌరిసామీప్యవాసము, శౌరిభజన
శౌరిసందర్శనార్చనల్, శౌరికొలువు
ఎంతపుణ్యము చేసి సాధించినారో
మీకు మీరలేసాటి ముల్లోకములను.

౧ ద్వారపాలకుఁడు

భూసురోత్తమా, మీజన్మస్థానమేది?

కుచేలుఁడు

అవంతీనగరము.

మీకు మేలైన సువాసనగల అత్తరులు కావలెనా?

అటులైన అత్తరులకు రాజని పిలువబడు ఆటోదిల్‌బహార్‌ను వుపయోగించుడు



కొన్ని బిందువులను మీ చేరుమాలుపై చిలికినతోడనే యింపగు, పుష్పసంబంధమగు సువాసన నీచుట్టుపట్లవ్యాపించును.

ఇంతటిరమ్యమైన, మనోహరమైనవాసనను నీవు బజారులోకొను యితర అత్తరులలో పొందజాలవు.

'ఆటోదిల్ బహార్' అను పేరును యిప్పుడే జ్ఞాపకమునకు తెచ్చికొనుడు. దానిని ఒకమారుపయోగించుడు. దాని మనోహరమైన, శాశ్వతమైన సువాసనకులోనమ్మయత్వమునుచెందుదువు.

½ ఔన్సు	బుడ్డి	వెల	రు.	?–0–0
¼ ,,	,,	,,	రు.	1–4–0
1 డ్రాము	,,	,,	రు.	0–12–0
మాదిరిసీసా		,,	రు.	0–2–0
సువాసనగలకార్డులు			రు.	0–1–0

వి. పి. చార్జీలు ప్రత్యేకము

కొనునపుడు దయచేసి 'ఆటోదిల్ బహార్' అను పేరును జాగ్రత్తగా పరిశీలించి కొనుడు. అన్నిచోట్లను అమ్మబడును.

సోల్ ఏజంట్లు:—

అంగ్లో యిండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదు బజారు, బొంబాయి.

నొప్పులుగాని, తీపులుగాని, ఏవైననుసరియే తొలగింపవచ్చును



మీరు ఏల నొప్పులవలన బాధపడవలెను. ఆ నొప్పులు తలయందైననుసరే, దేహమున యితరచోట్లనైననుసరియే, నడుమునొప్పి, వాయువునొప్పులు, పడిశెము, గొంతురాపిడి, కాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, నాడినొప్పులు, బెణుకునొప్పులు, మొదలగు నొప్పులైనను సరియే, తప్పక త్వరలో

'ఆడమేన్స్ సైప్రెన్ సాల్వ్'

అనువానిచే మాన్పవచ్చును. ఇది వుపశాంతికర మగు అంజనము కాదు. ఇది చాలా మేలైన తైలము. ఇది చాలా విలువగల ఓషధులచే తయారుచేయబడినది. దీనిచే నొప్పులుమొదలంటపోయి తక్షణమే నిన్ను ఆనొప్పియొక్క బాధనుండి తొలగించును. వేలకువేలు దీనివల్ల లాభపడిరి.

వెల బుడ్డి 1 కి రు. 1–0–0. వి. పి. చార్జీలు ప్రత్యేకము.

ఈ అత్యద్భుతమగు బాధనివారిణి ఫలమును కనుగొనుటకు యీ క్రింద పేర్కొనిన అంగడినుండి 2 అణాలకు శ్యాంపిలుడబ్బీ తెప్పించుకొనవచ్చును.

మెస్సర్సు:—ఎ. బి. పారెక్, 259, చైనాబజారు, మద్రాసు.

సోల్ ఏజంట్లు:—ఆంగ్లో యిండియన్ డ్రగు అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదుబజారు, బొంబాయి.

నాల్గవజాము సగము గడిచింది. అప్పుడు ముని కళ్లు తెరిచాడు. లేచాడు. అది కనిపెట్టి మే మాయనకు నమస్కరించాము. ఆయన కను రెప్పపాటుతో మానమస్కార మందుకొన్న ట్లు తోచినది. నక్షత్రకాంతిలో ఆయన మా ముఖములు పరిశీలించి చూచాడు. ఒక్కనవ్వు నవ్వాడు. నవ్వి స్నానార్థమై బయలుదేరాడు. మే మాయన వెంట బడ్డాము.

3

ఒక తాళముల నూతిలో ఆయన ప్రవేశించి స్నానము చేస్తున్నాడు. మేము నూతి గుమ్మము దగ్గర నిలబడ్డాము. ఆయన స్నానము చేస్తూ స్నానము చేస్తూ బయటికి వచ్చి నాస్నేహితుణ్ణి ముట్టుకొన్నాడు. ముట్టుకొని వింటున్నావా అన్నాడు నాతో.

"చిత్తం, వింటున్నాను" అన్నాను.

అతడు మావాడిని ఈవిధముగా ప్రశ్నించాడు:

"మీది ఏ దేశం?"

"ఇంగ్లాండు."

"నీకు ఉద్యోగ మేమిటి?"

"మంత్రివర్గములో ఉన్నాను."

"హిందూదేశపు విషయాలు నీకు బాగా తెలుసునా?"

"ఆవిషయమై నేను కృషిచేసి బాగా చదువుకొన్నాను."

"వాళ్లు స్వరాజ్యానికి అర్హులేనా?"

"ఆసంగతి నేను చర్చించను."

"పోనీ, వాళ్లకు స్వరాజ్యం ఇవ్వడానికి నీకేమైనా అభ్యంతరం ఉందా?"

"ఉంది."

"ఏమిటది?"

"మా దేశక్షేమము ముందు చూచుకోవడం మావిధి. మా దేశక్షేమానికి భంగకరం కాబట్టి స్వరాజ్యం వాళ్లకు ఈయ వీలులేదు."

ముని నావైపు తిరిగి చూశాడు. ఆమాట్లాడుతున్నది మావాడేనా అని సందేహం తోచింది నాకు.

"అమాట్లాడుతున్నది మీవాడే. మీ వాడిప్పుడు భారతీయుడు గాడు. ఆంగ్లేయుడు" అన్నాడు ముని.

"అయితే మీమహాత్మ్యంవల్ల ఆలాగున మాట్లాడించా రన్నమాట."

"ఇందులో నామహాత్మ్య మేమీ లేదు. అతని మనస్సు నేను మార్చలేదు. దేశము మాత్రము మార్చాను" అన్నా డాముని.

నాస్నేహితు డిట్లా మారుతాడని నే నెప్పుడూ అనుకోలేదు.

ఇంతట్లోకే ముని వచ్చి మావాడిని మళ్లీ ముట్టుకొన్నాడు. ముట్టుకొని ఈరీతిగా ప్రశ్నించాడు:

"ఏ ఊరు నీది?"

"అమెరికా."

"ఏమిటి నీ ఉద్యోగం?"

"ప్రజాసభలో సభ్యుడను."

"హిందువులకు పౌరస్వత్వము ఇచ్చుటకు నీ కేమైనా అభ్యంతర మున్నదా?"

"ఆ."

"ఏమి టది?"

"అది మా దేశముకు క్షేమకరము కాదు."

ఏరంగు చిమ్నీ పెట్టితే ఆరంగు దీపకాంతి వచ్చినట్లు నా స్నేహితుడు మారిపోవడం చూచి నే నాశ్చర్య పడ్డాను.

"చాలునా?" అన్నాడు ముని నావంక తిరిగి.

"చాలును" అన్నాను.

"అయితే వెళ్లండి. నీవూ నీస్నేహితుని వంటి వాడవే. ఈవిషయములో నిజమైన హిందూత్వమే మీలో ఉంటే ఎక్కడ నున్నా ఒక్కటే పలుకు పలికేవారు. వెళ్లండి. దిగులుపడకండి. ఈదేశంలో మీవంటి వా ళ్లనేకు లున్నారు. మానవభ్రాతృత్వం అంటే ఏమిటో తెలిసిన మీగురువును బాగా అర్థముచేసుకోండి." అని ఆయన నాస్నేహితుణ్ణి వచ్చి ముట్టుకొన్నాడు. నాస్నేహితుడు నిద్రలోనుండి మేల్కొన్నాడు. మే మిద్దరమూ ఆయన్ని మళ్లీ పలకరించాలని ప్రయత్నము చేశాము గాని ఆయన పలకలేదు. మేము తిరిగివచ్చాము.

౪

నే నడిగాను నాస్నేహితుణ్ణి—"ఏమి జరిగిందో నీ కేమైనా జ్ఞాపక మున్నదా" అని.

"నాకేమీ జ్ఞాపకము లేదు. అంతా స్వప్న ప్రాయముగా ఉన్న" దన్నాడు. "స్వప్న మేమై నా జ్ఞాపక మున్నదా" అన్నాను.

"ఏమీ లేదు కాని, ఈ నాబానిసత్వము పోయి నట్లూ, స్వాంతంత్ర్య మదముతో నే నున్నట్లూ అనుకొన్నాను. ఆ ఉత్సాహవాసన ఇప్పుడిప్పుడే క్రమంగా నామనస్సును విడిచిపోతూ ఉన్నది."

"సరే కాని, నేను నిన్ను రెండుప్రశ్న లడుగుతాను, సమాధానం చెప్పు."

"అలాగే."

"నీవే ఇంగ్లీషువాడ వై, వాళ్ల మంత్రివర్గంలో నీవే ఉన్నట్లయితే మన దేశానికి స్వరాజ్యం ఇప్పించడానికి ప్రయత్ని స్తావా?"

"ప్రయత్నించడమా! రేపటికే వచ్చేలాగ చెయ్యనూ?"

"సరే, అగు. నీవే అమెరికాదేశస్థుడ వై ప్రజా సంఘములో సభ్యుడ వైనట్లయితే హిందువులకు పౌరస్వత్వము ఇప్పిస్తావా?"

"తప్పకుండా."

డాక్టర్ సన్‌యట్‌సేనుగారి జాతీయపునర్నిర్మాణవిధానము

ప్రతివాది భయంకరం రంగాచార్యులుగారు

ఈ క్రింది యిరువదియైదు కార్యక్రమములను చీనాదేశమున జాతీయపునర్నిర్మాణము గావించుటకై డాక్టరు సన్‌యట్‌సేనుగారు కాంటను ప్రభుత్వమున కధ్యక్షుడుగ నుండినప్పుడు, వారిచే నిర్ణయింపబడినవి.

డాక్టరు సన్‌యట్‌సేను తన జీవితసర్వస్వమును భక్తిపూర్వకముగ దేశమాత పాదములకడ నర్పించుకొనగల్గిన సన్యాసులలో నొకడు. ఇరువదియేండ్లయిన నిండక మునుపే యతనికోమల హృదయమున స్వదేశపారతంత్ర్యము ప్రళయతాండవ మొనర్చెను.

ఇంక నాహృదయమునకు విశ్రాంతి యెక్కడిది! చీనాదేశమున నింగ్లీషువారు, అమెరికనులు మున్నగు విదేశీయుల ప్రాబల్య మధిక మయిపోయినది. చీనాదేశపు రాజవంశములోనివారే, యెవరో యొకరు సింహాసనమున గూర్చుండుట సాంప్రదాయికముగ జరుగుచునేయున్నను, నిజముగ బరిపాలనాధికారమంతయు విదేశీయుల యధీనమునందే యున్నది. క్రమముగ చీనాదేశపు సౌభాగ్యమంతయు నంతరించుచున్నది. సన్‌యట్‌సేను కీయవస్థ దుర్భర మయ్యెను.

ఈదురవస్థ నంతరింపజేయు టెట్లు? ఎల్లవిధముల జాతీయాభివృద్ధియే పరమాశయముగ గల ప్రజాప్రభుత్వమును నెలకొల్పి, తన్మూలమున స్వార్థపరులగు విదేశీయు లయధికారమునకు లోబడియున్న ప్రభుత్వము నడుగంట జేయవలయునని సన్‌యట్‌సేను ఉద్దేశించెను. అటుపై తన 19 వ యేడు మొదలుకొని నిరంతరముగ నతడు తన యాశయమును సఫలము గావించుకొనుటకై ప్రయత్నముల గావించుచునే యుండెను. తుదకు 1922 సం. న నెడతెగక నిర్దయముగ దన్నెదుర్కొనుచున్న పరాజయ పరంపరలే మార్గదర్శకములుగ గలిగిన యాధీరుడు తనయాశయమునకు చీనాదేశమున నిలువ నీడ గల్పింపగలిగెను.

సన్‌యట్‌సేను కాంటనునగరమును ముట్టడించి యందు తన ప్రజాప్రభుత్వమును నెలకొల్పెను. రిత్వాంతములనున్న తిరుగుబాటుదారుల నణచివైచెను. తన ప్రయత్నముల ప్రారంభదశలో నొకసారి యతడు యూరపు ఖండమున సంచార మొనర్చుచున్న కాలమున సాన్‌మిన్‌సిద్ధాంత మనునొక ప్రజాప్రభుత్వ సిద్ధాంతమును గనిపెట్టెను. దీని ననుసరించియే యతడు చీనాదేశమున ప్రజాప్రభుత్వవిధానము నేర్పరచెను.

సన్‌యట్‌సేను తనయాశయము పూర్ణముగ ఫలింపకుండగనే యరువదియవయేట—1926 సం.న— నీలోకమును విడిచిపోయెను. ఐన మహాత్ముల మహాసంకల్పములుగదా! డాక్టరు సన్‌యట్‌సేను స్థాపించినయాప్రజాప్రభుత్వమే నేడు చీనాదేశమున విజృంభించి సంపూర్ణసాఫల్యము నందుచున్నది. చీనాదేశపు బానిసతనము శీఘ్రముగ నంతరించి పోవుచున్నది.

కార్యక్రమములు

౧

సాన్‌మిన్‌సిద్ధాంతము ననుసరించియు, ప్రభుత్వములో ఐదుప్రత్యేకములైన స్వతంత్రములైన శాఖ లుండవలయునన్న పద్ధతిని బట్టియు ప్రజాప్రభుత్వమువారు చీనాదేశములో జాతీయ పునర్నిర్మాణము గావించెదరు.

[సాన్‌మిన్ సిద్ధాంతము, ప్రజాప్రభుత్వము అను పదములనుగూర్చి పైయుపోద్ఘాతమున తెలుపబడియున్నది. జాతీయ పునర్నిర్మాణము అనగా ధనము లేకపోవుటచేతను, ప్రజలలో వ్యాపించిన యితరదురాచారములచేతను, చదువు లేకపోవుట చేతను, ప్రజలజీవనమునకు

సించుచున్నది. ఇట్టిలోపమున కవకాశము లేకుండునట్లు చేసి, ప్రజలయిష్టము ననుసరించి ప్రభుత్వపుటుద్యోగులు నడచుకొనియే తీరవలయును, లేకున్న నధికసంఖ్యాకు లగు ప్రజలు కోరినప్పుడు వారు తప్పక రాజీనామా నొసగవలయును అనుటయే పైన చెప్పిన నాల్గవహక్కున కర్థము.]

౪

మూడవది ప్రజలలోనిసంఘములకు సంబంధించిన సమస్య. దేశములో వెనుకబడియున్న సంఘములవారికి ప్రభుత్వము సాయపడి వారిని తమ్ము దాము పరిపాలించుకొనుటకు-తమవ్యవహారములను దాము నడపించుకొనుటకు-దగినవారినిగా జేయును. చీనాదేశముపై విరోధము గలిగియుండు దేశములకు చీనాదేశమున నెట్టి సౌకర్యములను గలుగనీయకుండ ప్రభుత్వమువారు చేయుదురు. చీనాదేశము ఇతరజాతులతో సమానముగ నుండునట్లు చేయుటకై యింతకుమున్ను విదేశములతో గావింపబడిన రాజీనామాలలో తగువిధమున సవరణ కావింపబడును.

౫

జాతీయపునర్నిర్మాణ కార్యక్రమమునకు మూడు మెట్లు: (1) సైనికప్రభుత్వకాలము (The Period of Military Government); (2) ప్రబోధక ప్రభుత్వ కాలము (The Period of Educative Government); (3) శాసనమూలక ప్రభుత్వకాలము (The Period of Constitutional Government.)

[వీనిలో మొదటిదాని కర్థము: ప్రజల నందరి నొక్కప్రభుత్వముక్రిందికి దీసికొనివచ్చుటలో అవసరము వచ్చినప్పుడు సైనికబలము నుపయోగించుట. రెండవ దాని యభిప్రాయము: ప్రజలకు ప్రభుత్వమునకు నుండ వలసిన పరస్పరసంబంధములను గురించియు, హక్కు-ధర్మములను గురించియు బోధనము మూలమునను, క్రమముగ ప్రజలకు ప్రభుత్వములో చాలాసంగతులచేరను ప్రజలనుభవములోనికి దెచ్చుకొనునట్లు చేసి, వారిని స్వపరిపాలనమునకు సంసిద్ధపరచుట. మూడవదానిభావము: ఇట్లు ప్రజల నందరను క్రమముగ నొక్కప్రభుత్వము క్రిందికి దీసికొనివచ్చి, ఆప్రభుత్వము నడుచుటకు దగినశాసనములను, పద్ధతులను ఏర్పాటుచేసి, ప్రజల యిష్టము ననుసరించి పరిపాలనము నడుపుట. ఈవిధాన మంతయు క్రమక్రమముగ మెట్లములలో నుంచవలయునో యీక్రింద విశదముగ వర్ణింపబడినది.]

౬.

సైనికప్రభుత్వ కాలములో సాధనములన్నియు సైనికప్రభుత్వముయొక్క ప్రత్యక్షాధికారముక్రింద నుంపబడును. దేశములోని తిరుగుబాటులను అణగద్రొక్కుటకై ప్రభుత్వము తనసైనికశక్తి నుపయోగించును. దీనితోపాటుగ ప్రజలందరును తుదకు ఒకేయధికారముక్రిందికి వచ్చుటకు తగుమార్పును సంఘములో గలుగజేయుటకు ప్రజలలో ప్రబోధము కలుగజేయబడును.

[అనగా, ప్రజలు తమకు స్వాధీనము కానప్పుడు ప్రభుత్వమువారు తమసైనికబలమును ప్రయోగించి నిర్బంధమున ప్రజలను లోబరచుకొందురు. ప్రజలకు తమయభిప్రాయములను, ఆదర్శములను బోధించి, స్వాధీనపరచుకొనుటకుముందు ప్రయత్నించెదరు. ఇట్లు తమబోధనలకు లొంగనప్పుడు సైనికబలమును ప్రయోగించుటకు ప్రభుత్వమువారు వెనుదీయరని దీనియభిప్రాయము.]

౭

ఏరాష్ట్రమయినను సంపూర్ణముగ సైనికాధికారముక్రిందికి వచ్చినప్పుడు సైనికప్రభుత్వకాల మయిపోయిన దన్నమాట. అటుపై ప్రబోధకప్రభుత్వకాల మారంభించును.

[దేశము కొన్నిరాష్ట్రములుగాను, ఒక్కొక్క రాష్ట్రము కొన్నిజిల్లాలుగను విభజింపబడును. పైనియమమునుబట్టి, ౭ వ పేరాలో సూచింపబడినపద్ధతి మొట్టమొదటనే దేశమందంతటను ప్రవేశపెట్టబడదని యెరుంగవలయును. ముం దేదియో యొకరాష్ట్రమును దీసికొని ప్రజాప్రభుత్వము దానిలోనిజిల్లాల నన్నిటిని సంపూర్ణముగ వశపరచుకొనును.]

౮

ప్రబోధక ప్రభుత్వకాలములో ప్రభుత్వమువారు ప్రజలను స్వపరిపాలనకు సంసిద్ధులనుగా జేయుటకై వారిలో ప్రబోధము గలిగించుటకు అర్హులైన యుద్యోగులను ప్రతిజిల్లాలోనికిని బంపుదురు.

[ఈ ప్రచారకులు ప్రతిజిల్లాలోనికిని బోయి, స్వపరిపాలనముయొక్క ఫలములను గురించియు, పద్ధతులను గురించియు ప్రజలకు బోధింతురు.]

ఒకజిల్లా యీక్రిందిలక్షణములను గలిగియున్నప్పుడే సంపూర్ణముగ స్వపరిపాలనమును బొందినదని చెప్పవచ్చును. ఆలక్షణము లివి: జిల్లామొత్తముపై జనాభాలెక్క తీసికొన బడవలయును. భూముల కొలతలు నిర్ణయింపబడవలయును. ప్రజలలో శాంతిని కాపాడుటకై పోలీసుపద్ధతి యేర్పడవలయును. రహదారీలు జిల్లాయందంతటను నిర్మింపబడవలయును. ప్రజలలో తమ నాలుగుహక్కులును అనుభవములోనికి దెచ్చుకొనుటకు దగుజ్ఞాన ముండవలయును. జిల్లాను పరిపాలించు నొకయధికారి నెన్నుకొనుటకును, జిల్లాలో ప్రభుత్వపద్ధతులను నిర్ణయించు ప్రతినిధుల నెన్నుకొనుటకును ప్రజలు తగినవారై యుండవలయును.

[ప్రతినిధు లనగా ప్రజలపక్షమున వారియిష్టము ననుసరించి పరిపాలనము నడుపునట్లు ప్రభుత్వమునకు సలహాలొసంగు వారు ప్రజలచే నెన్నుకొనబడినవారే ప్రజాభిప్రాయమును సరిగ ప్రభుత్వమునకు దెలుపగలరు. ప్రజలచే నెన్నుకొనబడినవారు కాక ప్రభుత్వముచే నియమింపబడినవారుగూడ నేడు మనదేశమున కొన్నిసంఘముల ప్రతినిధులుగ నుండుట మనము చూచుచున్నాము. వారు నిజముగ ప్రజాభిప్రాయమును దెలుపజాలరు. ఇదియే యెన్నికలయొక్క యభిప్రాయము. అందులకే ప్రభుత్వమువారి నామినేషనులపద్ధతి- అనగా వారు ప్రత్యేకముగా కొందరిని నియమించుపద్ధతి - యంతరింపవలయునని మనదేశములో రాజకీయనాయకు లనుచుందురు.]

౯

సంపూర్ణ స్వపరిపాలనము గలిగినజిల్లాలోని ప్రజలు పైన 3 వ పేరాలో దెలుపబడిన నాల్గుహక్కులను గలిగియుండవలయును.

౧౦

స్వపరిపాలనమునకు తయారగుచున్న జిల్లాలలోని భూము లన్నిటికిని విలువ ముందుగ నిర్ణయింపబడవలయును. ఈ విషయమును భూమిఖామందులు ప్రభుత్వమువారికి దెలుపవలయును. అప్పుడు ప్రభుత్వమువారు పన్నులను విధించుటకాని, యవసరమైన చో పైన నిర్ణయింపబడిన విధమున విలువ నిచ్చి ఖామందులవద్దనుండి భూములను కొనుటకాని చేయుదురు. రెజిష్ట్రేషన్ అయిపోయిన తరువాత రాజకీయ స్థిరత్వముచేత (Political Stability)గాని, సంఘముయొక్క అభివృద్ధిచేత (Social Progress) గాని భూముల విలువ పెరుగవచ్చును. ఇట్లు పెరిగినవిలువయంతయు జిల్లామొత్తముపై గల ప్రజలకందరకును జెందునే కాని యేభూమిఖామందు యొక్కయు ప్రత్యేకముగ నాస్తిగ నుండజాడదు.

[రాజకీయస్థిరత్వముఅనగా, పరిపాలనపద్ధతులలో గాని, దేశమున ప్రబలియున్న శాంతిలోగాని యెట్టిమార్పును కలుగకుండుట. సంఘముయొక్క అభివృద్ధియనగా జనసంఖ్య హెచ్చుట; ఐశ్వర్యము, విద్య మున్నగునవి వృద్ధిబొందుట. పైకారణములను బట్టి భూములవిలువ పెరిగినప్పుడు భూమిఖామందులు వారివారికిగల ప్రత్యేకములైన ఆస్తులతో క్రొత్తగభూములనుగొనియు, ఎక్కువకుకీడులకు భూముల నమ్మియు, ప్రత్యేకముగ నెవరికివారు ఎక్కువ ధనవంతులు కావలయునన్న యాశలతో దేశమున నలజడి గలిగింపవచ్చును. ఇట్టి స్వార్థపరత్వమునకు అవకాశము లేకుండ పైవిధమున పెరిగిన విలువలను ప్రభుత్వమువారు వశపరచుకొని జిల్లామొత్తముపై ప్రజలందరకును ఉపయోగపడుకార్యములలో వినియోగింతురు. ఇందుచే దేశముమొత్తముపై పేదవాండ్రకు గూడ లాభము గలుగ జేయుటయే యీనియమముయొక్క యుద్దేశము.]

౧౧

ఈ క్రింది యాదాయములన్నియు స్థానికప్రభుత్వమునకు_అనగా జిల్లాప్రభుత్వమునకు_జెందును: (స్థానిక, ప్రధానప్రభుత్వములను గురించి ౧౩వ పేరాలో వివరింపబడును.) భూములపై ఏటేట వచ్చు పన్ను, పెరిగిన భూములవిలువ, సార్వజనికములగు భూముల (public lands గనులు, కొండలు, అడవులు, నదులు) ఆదాయము. ఇట్టి యాదాయము బాలవృద్ధులను, నిరుపేదలను, కరవుచే బాధపడువారిని రక్షించుటకొరకును, ప్రజలక్షేమమునకై యాసుపత్రులు మున్నగుసార్వజనిక సంస్థల (public institutions) నేర్పాటుచేయుట కొరకును వినియోగింపబడును.

[సార్వజనికములగు భూములు: అనగా ప్రత్యేకముగా నేవ్యక్తియొక్క_పోషణపైనను ఆధారపడక ప్రకృతివల్లనే వృద్ధిబొందుచుండు స్థలములు కొన్ని యుండును. అవి కొండలు, అడవులు, గనులు, నదులు మున్నగునవి. వాని నుపయోగించుకొను నధికారము జిల్లామొత్తముపై గల ప్రజల కందరకు నుండును. అందుచే నివి సార్వజనికములగు భూములు అనబడును. ఇట్టిభూములవిషయమున ప్రభుత్వమువా రేమియు జోక్యము కలుగజేసికొనకున్నచో, ప్రజలలో బలవంతులైన వ్యక్తులు వానిని తమ సొంతమగు స్వాస్తిగ జేసికొని, యితరులకు వానిపైగల యధికారము దొలగించుటకు, వానిపై వచ్చువాదాయము దాము స్వయముగ ననుభవించుటకు బ్రయత్నింపవచ్చును. కావున నట్టిదాని కవకాశము లేకుండ ప్రభుత్వమువారే వానిని వశపరచుకొందురు. జిల్లామొత్తముపై గల ప్రజలందరిపక్షమునను జిల్లాయొక్క_ పరిపాలనము నడుపువారు ప్రభుత్వమువా రగుటచే జిల్లామొత్తముపై గల ప్రజలందరకును జెందువాస్తిని స్వాధీనపరచుకొనుటకు ప్రభుత్వమువారి కధికారము కలదు. సార్వజనిక సంస్థలు అనగా మొత్తముపై ప్రజలకందరకును ఉపయోగపడు ఏర్పాటులు: విద్యాలయములు, ఆసుపత్రులు, పత్రములు మొదలయినవి. ఇట్లు మొత్తముగ ప్రజలకందరకును జెందు ఆస్తిపైవచ్చు ఆదాయము మొత్తముగా ప్రజలకందరకును ఉపయోగపడు కార్యములయందే వినియోగింప బడవలయును కాని ప్రత్యేకముగా నెవ్వరికిని చెందగూడదు. ప్రభుత్వమువారైనను దమసొంతఖర్చుల నిమిత్తము అట్టియాదాయము వినియోగించుకొనరాదు. ఇదియే పైనియమములయొక్క_యర్థము.]

౧౨

ప్రకృతిసంపదలను ఉపయోగములోనికి దెచ్చుటయు, మరియుతరములగు గొప్పగొప్ప యేర్పాటులను జేయుటయు ప్రత్యేకవ్యక్తుల సామర్థ్యమునకు అసాధ్యమైపోయి పైసాయము కావలసివచ్చినప్పుడు అట్టిపనులకు ప్రధానప్రభుత్వమువారు సాయ మొసంగెదరు. ఇట్టి ప్రయత్నములవలన వచ్చుఆదాయమును స్థానికప్రభుత్వమువారును (Local Government), ప్రధానప్రభుత్వమువారును (Central Government) సమానముగ బంచుకొందురు.

[ప్రకృతిసంపద లనగా గనులు, నదులు మున్నగునవి. స్థానికప్రభుత్వము అనగా నొకప్రత్యేకస్థానమునకు జెందినప్రభుత్వమని అర్థము. అందుచే నీసందర్భమున స్థానికప్రభుత్వము అనుమాటకు జిల్లాప్రభుత్వము అని యర్థము. అట్లే దేశమునంతను బరిపాలించు ప్రభుత్వము ప్రధానప్రభుత్వము. ప్రధానప్రభుత్వము దేశము మొత్తముపై అన్నిజిల్లాలకును సమానముగ సంబంధించియుండు వ్యవహారములను జక్క_బెట్టుచుండును. స్థానికప్రభుత్వము ప్రత్యేకముగ దనక్రిందనుండు వ్యవహారములను- అనగా ప్రత్యేకముగ దనపరిపాలనలోగల ప్రదేశమునకు సంబంధించిన వ్యవహారములను_పరిష్కరించుచుండును. ఉదాహరణార్థముగ మనదేశములోగల స్థానికస్వపరిపాలనసంస్థలు అను నేర్పాటులను దీసికొనవచ్చును: ఇవి గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలు, తాలూకాబోర్డులు, జిల్లాబోర్డులు. గ్రామపంచాయతీ ఆగ్రామమునకు సంబంధించినంతమట్టుకు విద్య, ఆరోగ్యము, పారిశుద్ధ్యము, రాకపోకల యేర్పాట్లు మొదలైన వ్యవహారములను నిర్వహించుచుండును, అట్లేమునిసిపాలిటీ తనపట్టణమునకు ప్రత్యేకముగా సంబంధించిన వ్యవహారమును నడుపుకొను చుండును. తాలూకాబోర్డు తన తాలూకావ్యవహారములను జిల్లా బోర్డు

తన జిల్లావ్యవహారములను నిర్వహించుచుండును. ఇంతకు ఉదాహరణమునకై మన దేశములోని స్థానికస్వపరిపాలన సంస్థలను చూపితిని. అంతేకాని మనయీసంస్థలు నిజమైన యధికారము గలిగియున్నవని కాదు. మనదేశములోని యీసంస్థలు చేతిబీరకాయ సంస్థలని యెల్లరకు దెలిసినయంశమే.]

౧౩

ప్రతిజిల్లాయును తనయాదాయమునుండి నూటికి పదికి తక్కువకాకుండగను, ఏబదికెక్కువ కాకుండను గల సొమ్ముతో ప్రధానప్రభుత్వమునకు తప్పక సాయపడవలయును. సరియైన లెక్క దేశీట ప్రజలయొక్క ప్రతినిధులచే నిర్ణయింపబడును.

[ప్రతినిధులన నేమో 8-వ పేరాలో వివరింపబడినది.]

౧౪

స్థానికప్రభుత్వము స్థాపింపబడిన తరువాత ప్రతి జిల్లాయును ప్రతినిధిసభలో పాల్గొని ప్రధానప్రభుత్వమునకు సాయపడుటకై యొకప్రతినిధి నెన్నుకొనవలయును.

౧౫

ప్రభుత్వములో పదవులను గోరి వచ్చువారు ప్రభుత్వముచే నియమింపబడు పదవులకైననుసరే, ప్రజలచే ఎన్నుకొనబడు పదవులకైనను సరే, స్థానికప్రభుత్వమునకైనను సరే, ప్రధానప్రభుత్వమునకైననుసరే ప్రధానప్రభుత్వమువారు నిర్ణయించిన యర్హతలను (qualifications) గలిగియుండవలయును.

౧౬

ఒకరాష్ట్రము (Province)లోని జిల్లాలన్నియు స్వపరిపాలనమును బొందినప్పుడు ఆరాష్ట్రము శాసనమూలకప్రభుత్వకాలమున బ్రవేశించుచున్నది. ప్రతినిధిసభ రాష్ట్రముయొక్క స్వపరిపాలనము నడిపించుటకై యొక యధికారి నెన్నుకొనును. ప్రభుత్వములోని జాతీయసమస్యలకు సంబంధించినంతవరకు రాష్ట్రప్రభుత్వము ప్రధానప్రభుత్వముయొక్క యాజ్ఞల ననుసరించును.

[రాష్ట్రము, స్వపరిపాలనము బొందుట, శాసనమూలకప్రభుత్వము, అను మాటలు వరుసగా 7, 8, 9 పేరాలలో వివరింపబడినవి. రాష్ట్రప్రభుత్వము అనగా, ప్రత్యేకముగా నొకరాష్ట్రముయొక్క పరిపాలనమును నడుపుప్రభుత్వము. జాతీయసమస్యలు అనగా, జాతిమొత్తమున దేశమునందంతటను గలప్రజలకు సంబంధించిన సమస్యలని యర్థము. ఇట్లు జాతిమొత్తమునకు సంబంధించిన సమస్యలను నిర్వహించుటలో రాష్ట్రప్రభుత్వము తనరాష్ట్రమునకుమాత్రమే లాభము గలుగునట్లు చూచుకొనక ఇతరరాష్ట్రములకు జేనికిని దనమూలమున నష్టము రాకుండ, ప్రధానప్రభుత్వము చెప్పినవిధమున వ్యవహారము నడుపవలయునని యభిప్రాయము. రాష్ట్రీయప్రధానప్రభుత్వములకు గలసంబంధము ముందు వచ్చు పేరాలో వివరింపబడును.]

౧౭

ఈ కాలములో పరిపాలనాధికారములు రాష్ట్రప్రధానప్రభుత్వములకు రెంటికిని సమానముగ విభజించి యొసంగబడును. జాతిమొత్తమునకు సంబంధించిన పరిపాలనసమస్యలన్నియు (administrative problems) ప్రధానప్రభుత్వమునకు వశపరుపబడును. ఆయారాష్ట్రములకు ప్రత్యేకముగ సంబంధించిన వ్యవహారములన్నియు రాష్ట్రప్రభుత్వముక్రింద నుండును. ప్రత్యేకముగ సంయోజనపద్ధతి (Centralisation) కాని, ప్రత్యేకముగ విభజనపద్ధతి (De-centralisation) కాని యవలంబింపబడదు.

[సంయోజనము అనగా దేశముయొక్క పరిపాలనపద్ధతుల నన్నిటిని గూడబెట్టి ప్రధానప్రభుత్వముచేతిలోనే యుంచుట. ఇట్లుచేయుటవలన ప్రధానప్రభుత్వమునకు భారమెక్కుడగును. అంతేకాక, ఒకరాష్ట్రముయొక్క ప్రత్యేకస్థితిగతుల ననుసరించి యారాష్ట్రమునకే ప్రత్యేకముగ జక్కబెట్టవలసిన వ్యవహారములనేకము

లుండును. అట్టివానిని నిర్వహించుటకు, ఎప్పుడును విడువకుండ రాష్ట్రములలోని పరిస్థితులను గనిపెట్టుచుండుట దగుటవలన, రాష్ట్రప్రభుత్వమే తగియుండును. ప్రధానప్రభుత్వ మాపనిని జేయజాలదు. ఒకరాష్ట్రముయొక్క ప్రత్యేకపరిస్థితులను గనిపెట్టుచుండుటకు దానికి తీరుబడియుండదు. అందుచే సంయోజనపద్ధతిగూడను, ఇంక, ఇదియది యను భేదములేకుండ నన్నిసమస్యలను రాష్ట్రప్రభుత్వముల కప్పగించివేయుట విభజనపద్ధతి. అప్పటికి ప్రధానప్రభుత్వముయొక్క అక్కరయే లేదు. ఒక్కొక్క రాష్ట్రము తనలాభమునే చూచుకొని ఇతరరాష్ట్రముల కన్యాయము గలుగచేయుట కవకాశమున్నది. అందుచే సంపూర్ణముగ విభజనపద్ధతియు బనికిరాదు. కావున పైనవివరింపబడినరీతిని, రాష్ట్రప్రధాన ప్రభుత్వములకు రెంటికిని పరిపాలనసమస్యలను సమానముగ బంచిపెట్టుటయే యుక్తమని నిర్ణయింపబడినది. ఉదాహరణమునకై మనదేశములోని ప్రధాన రాష్ట్ర ప్రభుత్వములను దీసికొనవచ్చును. పోస్టుఆఫీసులు మున్నగుదేశమునకంతకును సంబంధించిన వ్యవహారములు ప్రధానప్రభుత్వము (ఢిల్లీవైస్రాయ్‌గారి ప్రభుత్వము) క్రింద నున్నవి. విద్య మొదలగునవి, ప్రత్యేకముగ నాయా రాష్ట్రములకు సంబంధించినసమస్యలు, రాష్ట్రప్రభుత్వములచేతులలో నున్నవి.]

౧౮

జిల్లా స్వపరిపాలనమునకు పరిమాణము (unit)గా నుండవలయును. రాష్ట్రప్రభుత్వము జిల్లా ప్రధానప్రభుత్వములకు రెంటికిని మధ్యస్థముగ నుండి రెంటికిని బలీయముగ పరస్పరసహాయమును సమకూర్చుచుండును.

[పరిమాణము అనగా కొలత. స్వపరిపాలనమునకు పరిమాణము అనగా స్వపరిపాలనము ఎచ్చటనుండి యారంభింపబడుచున్నదో ఆమొదటిమెట్టు. మనదేశములో గ్రామము పరిమాణము. గ్రామపంచాయతీయొక్క యేర్పాటులో నర్థమిదియే. ఇచ్చట జిల్లా పరిమాణము. జిల్లా ప్రభుత్వము మొదటిమెట్టు, ప్రధానప్రభుత్వము పైమెట్టు; రాష్ట్రప్రభుత్వ మీరెంటికిని మధ్యస్థముగ నుండి, ప్రధానప్రభుత్వము పరిపాలించెడి దేశము మొత్తమునకంతకును సంబంధించిన సమస్యలలో, తనజిల్లాల కన్నిటికిని ఇతర రాష్ట్రములలోని జిల్లాలతోపాటు సమానముగ న్యాయమును గలుగజేయుచు, ప్రధానప్రభుత్వమునకు తనజిల్లాలు సాయపడవలసినరీతిని దప్పకుండ జూచుచు, రెండు ప్రభుత్వములతోడను సమానముగ సంబంధమును గలిగియుండి, ఇటు వ్యక్తులసౌకర్యములను, అటు జాతీయతాభావమును వృద్ధి పొందించునదిగ నుండవలయునని పైనియమముయొక్క యుద్దేశము.]

౧౯

శాసనమూలక ప్రభుత్వకాలమున ప్రధానప్రభుత్వము తాను చక్కబెట్టవలసిన యైదు కార్యముల కొరకును ఐదుప్రత్యేకములైన శాఖలను గలిగియుండవలయును. (1) పరిపాలన పద్ధతులను అమలులో బెట్టునది (కార్యనిర్వాహకశాఖ); (2) పరిపాలనపద్ధతులను నిర్ణయించునది; (3) ప్రజల నేరములను విచారించి న్యాయము గలుగజేయునది; (4) సివిల్ పరీక్షలను జరుపునది; (5) ప్రజల యాదాయమునుబట్టి పన్నులను విధించునది.

౨౦

పైశాఖలలో మొదటిశాఖయందు ఈ క్రింద సూచింపబడిన మంత్రివర్గము లుండవలయును: (1) దేశములోని అంతరంగిక వ్యవహారములను చక్కబెట్టునది; (2) విదేశములతో సంబంధించిన వ్యవహారము నిర్వహించునది; (3) యుద్ధకార్యములను చక్కబెట్టునది; (4) ప్రభుత్వముయొక్క ఆదాయవ్యయములను పరిచూచునది; (5) వ్యవసాయముయొక్కయు గనులయొక్కయు వ్యవహారమును నెరవేర్చునది; (6) కూలివాండ్రయొక్కయు, వర్తకముయొక్కయు వ్యవహారమును నిర్వర్తించునది; (7) విద్యావిషయములను నిర్వహించునది; (8) రాకపోకలకు సంబంధించిన వ్యవహారము నడుపునది.

౨౧

ప్రభుత్వవిధానము నమలులో బెట్టుటకు ముందొక యధ్యక్షుడు ఆయాశాఖల యధికారులను నియమించి,

తనయధికారమున నుంచికొని తొలగింపవలయును.

[అనగా ప్రధానప్రభుత్వము ప్రజలచే నెన్నుకొనబడక పూర్వము ప్రధానప్రభుత్వములోని యుద్యోగులను నియమించుపద్ధతి యీవిధమున నుండవలయునని యర్థము. ప్రధానప్రభుత్వముయొక్క యెన్నికనుగూర్చి ముందు పేరాలలో వివరింపబడును.]

౨౨

పరిపాలనపద్ధతులయొక్క నిర్ణయము జాతీయ పునర్నిర్మాణముయొక్క పద్ధతులపైనను, ప్రబోధక శాసనమూలక ప్రభుత్వకాలములలో జరిగినపనిమీదను ఆధారపడియుండును. ఈపరిపాలనపద్ధతులను శాసననిర్మాణ శాఖవారు (19 వ పేరాలో సూచింపబడిన రెండవ శాఖవారు) తయారుచేయుదురు. ఇట్లు తయారుచేయబడిన ప్రభుత్వవిధానము క్రమక్రమముగ - తుదియంగీకారము బడయువరకు - ప్రజలయెదుట నుంచబడుచుండును.

[శాసననిర్మాణ శాఖవారు ప్రధానప్రభుత్వముయొక్క పద్ధతులను నిర్ణయించునప్పుడు, రెండుసంగతులను దృష్టియందుంచుకొందురు:(1) జాతీయపునర్నిర్మాణమునకు మనము తయారుచేయు ప్రభుత్వపద్ధతి యెంతవరకనుకూలముగ నున్నది? (2) దేశముమొత్తముపై ప్రజలుస్వపరిపాలనమున కెంతవరకు తగియున్నారు? అని. ఇట్లు తాము నిర్ణయించెడి ప్రభుత్వపద్ధతిని ఆయాసమయములందు ప్రజలకు దెలియజేయుచు, వారియభిప్రాయములను దెలిసికొనుచు, ఆవశ్యకములయిన మార్పులను జేయుచు, తుదకు తమపద్ధతులను ప్రజ లంగీకరించువరకిట్లే చేయుచుందురు. ప్రజలయనుమతి లేక తాము తయారుచేసిన పద్ధతుల నమలులో నుంచరు.]

౨౩

దేశములోని రాష్ట్రములలో నధికసంఖ్యాకములు శాసనమూలక ప్రభుత్వకాలమును జేరినప్పుడు, అనగా ఆయారాష్ట్రములలో బలీయములైన రాష్ట్రప్రభుత్వము లేర్పడినప్పుడు, పరిపాలనపద్ధతిని నిర్ణయించి యమలుజరుపుటకుగాను ఒకమహాజనసభ సమావేశము చేయబడును.

[ఒకరాష్ట్రము శాసనమూలక ప్రభుత్వకాలమును జేరుట యనగా నేమో 11 వ పేరాలో వివరింపబడినది. దేశములోని ప్రజలలో నధికసంఖ్యాకులు స్వపరిపాలనమునకు సంసిద్ధులైనప్పుడు ప్రధానప్రభుత్వము ప్రజలయెన్నికకు వదలివేయబడును. అంతవరకును ఒక్కొక్క జిల్లానే, యొక్కొక్కరాష్ట్రమునే పైపేరాలలో వివరింపబడినపద్ధతిని స్వపరిపాలనమునకు సంసిద్ధముగ నొనర్చుటకు ప్రజాప్రభుత్వమువారు పాటుపడుచుందురని యభిప్రాయము.]

౨౪

ప్రధాన ప్రభుత్వముయొక్క పరిపాలనవిధానములు అమలులో నుంచబడినతరువాత ప్రధానప్రభుత్వముయొక్క అధికారము మహాజనసభకు స్వాధీనపరుపబడును. ఈమహాజనసభకు ప్రధానప్రభుత్వములోని కార్యనిర్వాహకుల నెన్నుకొనుటకును, తొలగించుటకును (Suffrage & Recall), పరిపాలనపద్ధతులను నిర్మించుటలో ప్రజలపక్షమున పద్ధతులను సూచించి నిర్ణయించుటకును (Initiative), ప్రభుత్వమువారిచే సూచింపబడు పద్ధతుల మంచిచెడ్డలు నిర్ణయించి యమలులో బెట్టుటకును (Referendum) అధికారము లుండును.

[కార్యనిర్వాహకు లనగా పరిపాలనపద్ధతుల నమలు జరుపునుద్యోగులు.

ఈనాలుగధికారములును 8 వ పేరాలో వివరింపబడినవి.]

౨౫

పరిపాలనపద్ధతి నమలులో బెట్టినదినముననే శాసనమూలకప్రభుత్వ మారంభమగును. జాతిమొత్తముపై నెన్నికలు జరుగును. ఎన్నికలు జరిగిన మూడునెలలకు ప్రజాప్రభుత్వము తనపరిపాలన బాధ్యతలను పరిత్య

జించును. అటుపై నా బాధ్యత ప్రజలచే నెన్నుకొనబడిన ప్రభుత్వమున కప్పగింపబడును. ఇంతటితో జాతీయపునర్నిర్మాణ కార్యక్రమము సంపూర్ణమగును.

[మొదట నొక జిల్లాలోని ప్రజలను నయభయములచే ప్రజాప్రభుత్వము నేర్పరచుకొని తనస్వపరిపాలన సిద్ధాంతములను దానిలో నడుపుజరుపును. అటుపై నా స్వపరిపాలనపద్ధతి క్రమముగ రాష్ట్రమంతట వ్యాపింపజేయబడును. అనంతరమున దేశము మొత్తముపై రాష్ట్రము లించుమించుగ నన్నియు స్వపరిపాలనమునకు సంసిద్ధములయినప్పుడు, దేశమంతటను ప్రజలయనుమతితో ప్రధానమగు నొక ప్రభుత్వము నిర్మింపబడును. అనునదియే ప్రజాప్రభుత్వముయొక్క కార్యక్రమము. ఈ కార్యక్రమము నడుపుటలో (1) జాతీయపునర్నిర్మాణము, (2) ప్రజలను తమ్ము దాము పరిపాలించుకొనుటకు దగినవారినిగా జేయుట, (3) దేశములోని ప్రజలందరలోను జాతీయత దృఢముగ నాటుకొనునట్లు చేయుట. అను నీమూడుఆదర్శములను ప్రజాప్రభుత్వమువారు ఏమరకుండ పాటించుట గమనింపదగిన యంశము.]

కవిప్రబోధము

మంగిపూడి వేంకటశర్మగారు

(వెనుకటిసంచిక తరువాయి)

ఈదివ్య భరతఖండము - నాదిసుమీ దీని కేను నాథుడను జుమీ
నా దేశముపై నొరులకు - లేదుసుమీ హక్కనుచు చలింపక నిలుడీ.

నీరిచ్చును గాలిచ్చును - కోరినభోగముల నెల్ల గూర్చును సౌఖ్యా
గార మగుజన్మదేశము - కూరిమి విడనాడు నరుడు క్రూరుడు గాడే.

భారత దేశమునకు తగు - తీరున గల్పించె గాంధిధీరు డశాంతో
దార సమరంబు దానిని - నేరుపుతో నెరపి జయము నెరయగ రండీ !

ప్రేతాన్నము దిను కాకుల - రీతిని వేయేళ్లు బ్రతికి రిత్తగ జావక
ఖ్యాతియగునో నీతియగునో - బాతిగ మనవలయు ప్రజలు బళియనవలయున్.

అదిగో నిద్రాణంబై - నది దేశము వారె దొంగ లాయాసిరులన్
గదిసి హరించుచునుండిరి - పదిలంబుగ మేలుకొలుపవలదే ప్రజలన్.

లెండయ్యా దీక్షితులై - రండయ్యా దేశభక్తి రతులు ప్రజకి
య్యండయ్యా శూరు లగుచు - పొండయ్యా స్వేచ్ఛ వేగముగ తెండయ్యా!

వెండ్లూరుశాసనము

వంగోలు వెంకటరంగయ్యగారు

నెల్లూరుజిల్లా రాపూరుతాలూకాలో వండ్లూరను అగ్రహారము గలదు. ఇది కండ్లేరు నాబరగు కణ్వనదీతటమున నున్నది. విజయనగరవంశీయులలోని విజయదేవరాయలు మల్లినాథుడను విద్వాంసుని కీయగ్రహారమును "శాకాబ్దే వసురామవహ్ని శశభృత్ సంఖ్యే గతే మన్మథే, వర్షే కార్తికశుక్ల విష్ణుదివసే సోమస్య వారే శుభే" దాన మిచ్చినటు లున్నది. దీనివలన ఈ దానము శాలివాహనశకవర్షములు ౧౩౩౮ ది యందు జరిగినది. ఇది క్రీస్తుశకము 1416 నకు సరియగుచున్నది. దానము జరిగి 511 సంవత్సరము లయినవి. విష్ణుదివస మనగ ద్వాదశి: కాలామృతమున ప్రథమబింబ ద్వితీయశ్లోకము వలన దెలియుచున్నది. కార్తికశుక్ల ద్వాదశీ పుణ్యదినమున జేసినదానము లనేకములు గలవు. బట్టరువర్తు వేణుగోపాలశెట్టిగార్లు ప్రకటించిన నెల్లూరుజిల్లాశాసనములలో పోలేపల్లి,యసెపల్లి, మామిడిపూడి లోనగు గ్రామదానశాసనములు ద్వాదశీతిథియందే జరిగినవి.

ఈ దానశాసనము మూడురాగిరేకులపై నున్నది. ఒక్కొకరేకును $7\frac{1}{2}$ అంగుళముల పొడవును, $5\frac{1}{2}$ అంగుళముల వెడల్పును గలిగి యున్నది. ఈ మూడురేకులును దిట్టముగు నొకరాగికడియమున గూర్పబడియున్నవి. ఈ కడియముమీద రాగిరువ్వ యంతటి దిమ్మ యున్నది. ఈ దిమ్మమీద వరాహాకృతి చెక్కబడియున్నది. ఈ శాసనమున కది రాజముద్ర.

ఈ శాసనము నందినాగరాక్షరములలో చెక్కబడియున్నది. ఈ మూడురేకులలో మొదటిరేకు రెండవ ప్రక్కన పదునెనిమిదిబంతులు, రెండవరేకు ఇరుప్రక్కల ప్రక్కకు పదునెనిమిదిబంతులు, మూడవరేకు మొదటి ప్రక్కన పదమూడుబంతులు గలవు. మూడవరేకు కడను "శ్రీవిరూపాక్ష" యను నక్షరములు కన్నడమోడిగల తెలుగున నున్నవి.

ఈ శాసనము సామాన్యముగ జదువ వలవియగుచున్నది. కాలగతివలనను, శిల్పిలోపమువలనను కొన్ని యక్షరములు స్ఫుటములుగ గన్పడవు. చెక్కడమునకై శిల్పి కీబడిన వ్రాతప్రతియందు లేఖక ప్రమాదములు మెండుగ నుండినట్లు తోచుచున్నది. అవి శిల్పితప్పులు కాజాలవు. వానిలో కొన్నిటి నీక్రింద జూపుచున్నాను: ఈస్థాలిత్యములలో 2, 3, 4, 5, 6, 9, 10, 11, 12, 13 ల వలన ఛందోభంగము గలుగుచున్నది:

రేకు	ప్రక్క	పంక్తి	చెక్కబడియుండు అక్షరము	ఉండవలసిన యక్షరములు
౧	౨	౧	సైవ్య	సేవ్య
...	...	...	వక్ర	వక్త్రి
...	...	౨	జన	జన్మ
...	...	...	నిత్య	నిత్యం
...	...	౩	కలప	కలాప
...	...	౪	నృపేశే	"శే"అధికాక్షరము
...	...	౯	సిద్ధః	సిద్ధిః
౨	౧	౫	అఘుండ	అఖండ
...	...	౧౧	ముఖ	ముఖ్య
...	...	౧౪	రాజాధిరాజ	"ధి"అధికాక్షరము
౨	౨	౪	గుండలూత్తర	గుండలూరుత్తర
...	...	౧౩	సరయుంతో	సంయుతో
...	...	౧౮	కండ్లురు	కండ్లేరు
౩	౧	౮	స్రగదిభిః	సగరాదిభిః
...	...	౯	త్రిబువన	త్రిభువన

ఈ శాసనమున "థ"కార "ధ"కారములు విచ్చలవిడిగ నొండొరు స్థలముల నాక్రమించుకొని యున్నవి. ఈస్ఖాలిత్యమున కుదాహరణములు వేరుగ నీయ నక్కరలేదు. శాసనము చదువుచుండ నెన్నియైన గోచరింపగలవు. ఇట్లు వర్ణక్రమలోపములు ఇంకను కొన్ని గలవు: "అమర్త్య" అనుటకు "అమర్త్యా" యనుట; "య

స్మిక్” అనుటకుగాను “యస్మింక్” అని అనుస్వారము చేర్చుట; “గుండ” ను “గుండ్డ” యనుట; “ధర్మ”మును “ధర్మ్మ” యనుట ఇత్యాదు లున్నవి. రేఫసంయోగము వచ్చుచోట్ల ప్రాయికముగ వలపలిగిలకకు సరియగు నాగరచిహ్నము (అనగ నక్షరముపైన రేఫముయొక్క పొర్లు) చూపబడియున్నది. అక్షరదుష్టములను కొన్ని శ్లోకములు చక్కగ నన్వయమగుట లేదు. మొట్టమొదటిశ్లోక మిందు ఉదాహరణము కాగలదు.

ఈ శాసనమునందో ఆద్యంతముల ముప్పదియొక్క శ్లోకము లున్నను పదునెనిమిదివరకే శ్లోకసంఖ్య వేయబడియున్నది. శాసనలిపి నాగరమయినను శ్లోకసంఖ్య తెలుగుఅంకెలలో నున్నది. ఏపొరపాటున నాల్గవసంఖ్య నాల్గవశ్లోకాంతమున బడక శ్లోకమధ్యమున బడినది.

శాసనమున దాతృవంశావళి యిటు లున్నది:—

చంద్రుడు
※
యదువు
※
సంగమమహీపతి
|
బుక్కనృపతి = మైలాంబా
|
హరిహర రాయలు = మెలాంబిక
|
దేవరాయలు = దేమాంబిక
|
విజయదేవరాయలు = నారాయణాంబ

ఈ వంశావళి సూయల్ గారు నిర్ణయించిన వంశవృక్షమునకును, Sources of Vijaynagar History అను విద్యానగరచరిత్రాకర గ్రంథములోని వంశవృక్షమునకును సరిపోవుచున్నది. బట్టరువర్తి వేణుగోపాలశెట్టిగార్లు ప్రచురించిన నెల్లూరుజిల్లా శాసనగ్రంథమున లింగంపాడుశాసనములో బుక్కని మహిషి గౌరాంబిక యనియు, వీరికి హరిహరుడు కలిగెననియు, దేవరాయని భార్య హేమాంబికయనియు నున్నది. హేమాంబికయే ఈ వండ్లూరుశాసనమున “దేమాంబిక”గ వ్రాయబడినది కాబోలు. ఈవంశవృక్షములోని బుక్కడు ప్రథమబుక్కడుగను, హరిహరుడు ద్వితీయహరిహరుడుగను, దేవరాయడు ప్రథమదేవరాయడుగను నుండవలెను. విజయదేవరాయలు తనతల్లియగు “దేమాంబ” పేర ఈ అగ్రహారదానము చేసినటులు “దేమాంబాపుర మగ్రహారమపిన గ్రామం విధాయాఖ్యయా” యను పదునేడవ శ్లోకములోని వాక్యమువలన స్ఫురించుచున్నది. ఈ గ్రామమునకు వాడుకపేరు “వెండ్లూరు” అని శాసనమువలన తెలియుచున్నది. ఇప్పటి వాడుకపేరు “వండ్లూరు” అయినది. దేమాంబాపురాగ్రహార మను పేరు వాడుక తప్పినది.

ఈదానము మల్లినాథుడను విద్వాంసునికి చేయబడినది. ఈతడు వసిష్ఠమునిగోత్రజుడు. ఈతనివంశానుక్రమణిక ఇందు లేదు. “తుమ్మెర్లాలయ మల్లినాథవిదుషే” యని పదునెనిమిదవ శ్లోకమున నున్నది. దీనివలన ఈతడు తుర్మెళ్లగ్రామ వాస్తవ్యుడగునో, లేక వీరియింటిపేరు తుర్మెళ్లవారో తెలియ వలనులేదు. రాపూరు తాలూకాలో తురిమెర్ల అను గ్రామ మిప్పటికిని కలదు. ఈ యగ్రజన్ముడు వేదార్థవిచ్ఛ్రేష్ఠుడని శాసనమున గలదు.

దానమీబడిన గ్రామము ఉదయశైలరాజ్యతిలకమగు రాంపూరిసీమాస్థలములోనిది. దానప్రశంస గల పదునేడవశ్లోకమున “కృత్వా దాన మనుత్తమం తిలగిరే వెండ్లూరు నామాంకితం” అని యున్నది. “తిలగిరేః” యనుటలో నేమిభావమో తెలియలేదు. తిలదానాంగముగ ఈగ్రామము దానము చేయబడిన దనియా? లేక ఆగ్రామప్రాంతముల తిలగిరి యనునది యున్నదియా?

గ్రామసీమానిర్ణయము ఆకాలపు దేశ్యనామములతో నున్నది. శ్రీగుండవలూరు (గుండవోలు?)న కుత్తరప్రాచ్యదిక్కున కణ్వనదీ తటమున నుండు నీగ్రామము భోగాష్టకముతోడ దానమియ్యబడినది. గ్రామమునకు తూర్పుఎల్ల “బొల్లిరాళ్లు” అనియున్నది. బొల్లియనగ తెలుపుబట్టలు గలది యని యర్థము. సంస్కృతాక్షరమాలికయందు హ్రస్వఒకారము లేనందున ఈస్వరము వచ్చు

టకు "బొల్లి రాళ్లు" అనుటకు మారుగ ముందొకఅకారమును జేర్చి "అంబొల్లి" అనియు, "అబొల్లి" యని యీ శాసనమున వ్రాయబడియున్నది. ఈఎల్లలలో ననేకములు ఇప్పటికిని శాసనములోని పేళ్లనే కలిగియున్నవని తెలియుచున్నది. సీమానిర్ణయము బొల్లి రాళ్ల కడ బయలుదేరి నలుదిక్కులు తిరిగి తుదకు తిరుగ ఆబొల్లి రాళ్ల కడనే సమాప్తమైనది. ఎల్లలవిషయమున రెండవ రేకు రెండవప్రక్క 12 వ బంతిలోని యక్షరములు బాగుగ తెలియ లేదు.

రెండవరేకు రెండవముఖమునందలి పదియారవ బంతి మొదలు శాసనాంతమువరకు దానఫలమును, దానభంగములని దోషములను దెలుపు వాడుకశ్లోకములు గలవు. మాంధాతా చేత్యాది చాటుశ్లోకమును దీనిలోని కెక్కినది.

శాసనాంతమున నందు మంగళవాక్యము "మంగళమహాశ్రీశ్రీశ్రీం జేయును" అని తెలుగుమాటలతో విలసిల్లుచున్నది.

అగ్రహారికులలో నొకరగు బ్రహ్మశ్రీ పెనగవరపు వెంకటసుబ్రహ్మణ్యముగా రీతామ్రశాసనమును దెచ్చి నాకు జూపిరి. వారిసమ్మతివడసి దీని సైక్లోయచ్చొత్తి తెలుగున వ్రాసితిని. దీనియందు అశ్రుతపూర్వములగు చరిత్రాంశము లేమియు లేవు. అయినను శ్రుతపూర్వమగు శ్రీవిద్యానగరరాజవంశావళి నిది రూఢి చేయుచున్నది.

మరియు ఆకాలపు రాజులు మూలమూలలలో నుండువిద్వాంసుల కనుగొని సన్మానించి విద్యాపోషణము జేయుచుండుటయు తెలియగలదు. ఇంతియ కాక యేమహాపురుషుని ప్రాపున మాధవసాయణులు వేదభాష్యముల రచించి ప్రకటించిరో, అట్టివాని పవిత్రవంశము నలంకరించిన విజయదేవరాయలును వేదాభిమానియై వేదార్థవిచ్ఛ్రోత్రియుని పోషణకై ఆచంద్రార్కముగు సీధూదానము జేసెను. భరతఖండము మహోన్నతదశకు రావలయుననిన వైదికమార్గావలంబనమే పరమసాధనమని శ్రీవిద్యారణ్యులు విద్యానగరరాజ్యస్థాపనావాల స్తంభముగ నెలకొల్పిరి.

నాగరాక్షర విన్యాసభేదముల నభ్యసించుటకీ శాసనము మిక్కిలి ప్రయోజనకారిగ నుండగలదు. శాసనము చిన్నదైనను అక్షరస్వరూపభేదములు మెండుగ గలవు.

ఈశాసన మిదివఱకెచటను ప్రచురము కాలేదని యగ్రహారికు లొకరు చెప్పినందున దీని బ్రకటింప సాహసించితిని. దీని జదువుటయందును, తెలుగక్షరముల పరివర్తనము చేయుటయందును నే నొక్కరుడ స్వతంత్రప్రవర్తనము బూననొల్లక హితపరులును, ఇచటి సంస్కృతశాస్త్రపాఠశాల (Sanskrit College) లో శిరోమణితరగత్యుపాధ్యాయులును, తర్కసాహిత్యమీమాంసావిచక్షణులును నగు శ్రీమాన్ కవితార్కికసింహ గోవిందాచార్యులవారియొక్క సహాయమును విశేషముగఁ బొందితిని.

మొదటి రేకు : రెండవప్రక్క

౧ అవిఘ్నమస్తు। అగజోద్ధమపిప్రసైవ్యమానంగజవక్త్రిహారిణా
౨ హ్యజననిత్య శివజంశివజన్మహేతుభూతంవలయేపారిష
౩ ద్రాగగణ్యామిడ్యం। ౧। సదాపగాచంద్రజటాకలపంసదానవంవి
౪ త్రిదివారిమారం। నదారదేహార్ధమనంతహారంసదావిరూపాక్షమహంభ
౫ జేహం। ౨। అస్తిప్రశస్తచరితోయదురిందువంశేవంశేస్వసంగమమహీప
౬ తిరావిరాసీత్। తస్మాదశేషధరణీధరణాహబాహుర్వీర
౭ రబుక్కనృపతిర్నృపతిందురాసీత్। ౩। యస్మిం స్తదత్యవనిపే శేబహుహేమరా
౮ శిదానాన్నిభూసురగణాయదినేదినేపి। ౪। మాధ్యాశ్వకర్ణాఇవ

౯ యత్పితేః ప్రసిద్ధస్సనోఽజగత్సుధనదః కిమితిస్తువేతం। మహిషీ
౧౦ తస్యామైలాంబాతస్యాముత్పాదితస్సుతః। రాయో హరిహరశ్చ్యుతయ
౧౧ శో హరో రాపహారకః। ౫। యత్ పాణిదత్తబహుదానజలస్రవంతీ
౧౨ సంయుక్తదీర్ఘతరభంగకరో మహాబ్ధిః। లావణ్యమాంమృగయత
౧౩ హరిదశ్వభావాద్యన్నామభీతఇవతీక్ష్ణకరోఽస్తమేతి। ౬॥
౧౪ మేలాంబికాయాంతేన మోస్యజాతస్సంక్రందనాభోభువి దేవ
౧౫ రాయః। యస్మిన్ ధరాం శాసతినాకలోకాద్భూమిం విశంతీవసుదే
౧౬ వరాయః। ౭। యస్మిన్ క్షితీశేస్ఫృథివీభుజంగరాజాస్యదంష్ట్రా
౧౭ గ్రవిజోద్ధదుఃఖం। విస్మృత్య ఖేలత్యతులే భుజాంసే సద్భిత్తిలాబా
౧౮ ద్ధ్రుథమస్యహృష్టా। ౮। యద్విద్వస్మణిమందిరాంగణగతప్రో

రెండవరేకు : మొదటిప్రక్క

౧ న్మత్తదంతిక్షరద్దానాంభఃపరిపూర్ణక్ష్మాత్రిమనదీస్తత్తుంగంతదా
౨ బంధనం। సేవాయాతమృగీదృశస్తనతటీవిన్యస్తకస్తూ
౩ రికాలేఖైః రేవహితస్వతేసబలవాన్ రాయఃకథం వర్ణ్యతే।
౪ ౯। యస్యాగ్రగణ్యమహిషీకులశీలయుక్తా దేమాంబికాభవ
౫ దమర్త్యవరాంగనాభా। తస్యామఘుండమహిమాభిజయో జయశ్రీక
౬ న్యావరః కమలనాభఇవావిరాసీత్। ౧౦। జితాన్యనగరే భద్రే
౭ తుంగభద్రాసమన్వితే। విద్యాఖ్యనగరే ప్రాపత్ పితృసింహాసనం శు
౮ భం। ౧౧। యస్యాస్థాననికేతనాంగణభువి ప్రాతర్యథా శర్వరీ
౯ మధ్యాదిస్సమయో విభాతి సతతం ప్రాన్పృడ్యథాన్విక్రమా। సేవా
౧౦ యాతనృపేంద్రహైమమకుటబద్ధప్రభాజాలకైస్సన్మత్తద్విపముఖదా
౧౧ నసుమహాసారాతిపాదైర్ఘనైః। ౧౨। నారాయణాంబా మహిషీ
౧౨ సురూపా యస్యాభరచ్ఛ్రీరిరచక్రపాణేః। తత్త్రైవసోఽయం రమ
౧౩ తేసుశీలశ్చైతోభిలాషం జగదేకవీరః। ౧౩। రాజాధిరా
౧౪ జపరమేశ్వర ఏష రాయో। భాషాతిలంఘ్యనృపవారవధూ
౧౫ భుజంగః। విఖ్యాతమువ్వరపదాన్విత రాయగండః ప్రఖ్యాత
౧౬ శౌర్యపరరాయభయంకరోఽసౌ। ౧౪। ఇందురాయసురత్రాణః
౧౭ సోష్టదిగ్రాయభీకరః। రాజాధిరాజో వితరణే మార్గకైః
౧౮ పరికీర్త్యతే। ౧౫। కదాచిత్పంపాసరసస్తీరే విక్రమ

రెండవరేకు : రెండవప్రక్క

౧ భూమణః। విరూపాక్షస్య పురతస్సుగతో దానవాంఛయా। ౧౬।

౨ శాకాబ్దేవసురామవహ్నిశశభృత్సంఖ్యేగతేమన్మథేవర్షేకార్తి

౩ కశుక్లవిష్ణుదివసేసోమస్యవారేశుభేకృత్వాదానమనుత్త

౪ మంతిలగిరేర్వేంట్లూరునామాంకితం దేమాంబాపురమగ్రహారమపిచగ్రా

౫ మంవిథాయాఖ్యయా। ౧౭। ఆచంద్రార్కమదాద్వశిష్ఠమునిగోత్రాయా

౬ గ్వేదార్థవిచ్ఛ్రీస్థాయోదయశైలరాజ్యతిలకేరాంపూరిసీమాస్థలే।

౭ తుమ్మిర్లాలయమల్లినాథవిదుషేశ్రీగుండ్లజలూత్తరాప్రాచ్యాంత

౮ ణ్వానదీతఉసుకుచిరేభోగాప్టకేనాన్వితం। ౧౮। అథగ్రామ

౯ స్యసీమాయామాలిఖ్యంతేవథినిర్ణయాః। ప్రాచ్యాంత్సేయంబోలి

౧౦ రాలుస్థలస్తమ్మనకుంటికా। తతోపిపలుంగురాయశ్చరాలగు

౧౧ ట్టస్థైవచ। అతిప్యగ్రాద్రాళ్లగుట్టాస్థలఃప్రభృతికేవనం। త

౧౨ దగ్రాంవహ్నిదిగ్భాగేతతఃపశ్చాదదుగ్నతుః। ఉడ్డదిప్పాశ్చయామ్యేతువాంగుః

౧౩ కుంటశ్చనయుంతో। నామ్నాకాల్లతిభక్తస్యప్రసిద్ధాతావుభా

౧౪ వపి। నపేపవాంగుర్నైఋరుత్యాంయత్రశాణ్వసరిద్గతః। కంద్లరుః

౧౫ పశ్చిమేభాగేదితుశేషాసుసానదీ। అబోల్లరాళ్లపర్యాం

౧౬ తంవద్యాదక్షిణతస్తటాత్ ॥మత్కృతస్యాస్యధర్మస్యవి

౧౭ రోధంయోనరాథమః। కరోతిబ్రహ్మహత్యాదిపాతకైఃఫలమ

౧౮ శ్నుతే॥సామాన్యోయంధర్మసేతుర్నృపాణాంకాలేకాలేపాలనీయో

మూడవ రేకు : మొదటి ప్రక్క

౧ భవద్భిః॥సర్వానేతాన్భావినఃపార్థివేంద్రాన్ భూయోభూయోయాచతేరామభద్రః।

౨ దానపాలనయోర్మధ్యేదానాచ్ఛ్రేయోనుపాలనం। దానాత్స్వర్గమవాప్నోతిపాలనా

౩ స్వదత్తాద్ద్విగుణంపుణ్యంపరదత్తానుపాలనం। పరదత్తాపహారేణ [దచ్యుతంపదం

౪ స్వదత్తంనిష్ఫలంభవేత్ ॥బహుభిర్వసుధాదత్తారాజభిస్సగరాదిభిః

౫ యస్యయస్యయదాభూమిస్తస్యతస్యతదాఫలం॥స్వద

౬ త్తాంపరదత్తాంవాయోహరేతవసుంధరాం। షష్టివర్షసహస్రాణి

౭ విష్ఠాయాంజాయతేక్రిమిః॥ఏకైవభగినీలోకేసర్వేషా

౮ మేవభూభుజాం। నభోగ్యానకరగ్రాహ్యావిప్రదత్తావసుం

౯ ధరా॥మాంధాతాసమహీపతిస్త్రిభువనాలంకారభూతోగ

౧౦ తస్సేతుర్యేనమహోదధావిరచితఃక్వాసౌదశాస్యాంతకః

౧౧ అన్యేచాపియుధిష్ఠిరప్రభృతయోయాతాదివంభూపతేనైకేనా

౧౨ పినమంగతావసుమతీమూనంత్వయాయాస్యతి॥

౧౩ లక్ష్మీనారాయణాభ్యాంనమః॥ మంగలమహాశ్రీశ్రీశ్రీంజేయును

౧౪ శ్రీవిరూపాక్ష



౧. మొదటి రేకు- రెండవ ప్రక్క

వెండ్లూరుశాసనము-మూలము




౨. రెండవ రేకు-మొదటిప్రక్క



3. రెండవ రేకు - రెండవ ప్రక్క

వెంగ్లూరుశాసనము-మూలము



౪. మూడవరేకు-మొదటిప్రక్క

కళింగదేశములోని శాసనములు-తేదీలు

గో. రామదాసుగారు

(౫ న సంపుటము ౪ వ సంచిక తరువాయి)

శ్రీ కూర్మదేవాలయములోని శాసనములు

నెం. 1200

పంక్తి 1 స్వస్తి శకవరుషంబులు ౧౨౬౮ గు నేంటిప్రతాప

2 వీరనరనారసింహ్యదేవస్య ప్రవర్ధమానవిజయరా

3 జ్యసంవత్సరంబులు ౨౭ క్రాహికుంభశుక్ల ప్రతిపద

4 బుధవారము...

క్రీ. వె. 1346 లో జనవరు ది 25 నుండి ఫిబ్రేవరు ది 23 వరకు కుంభమాసము. జనవరు ది 24 మాఘ శు. ౧ మి. ఫిబ్రేవరు 21 మాఘాంతము. ఫిబ్రేవరు ది 22 నుండి ఫాల్గుణమాసారంభము. కాన కుంభ శుద్ధ ప్రతిపత్తు అంటే మాఘ శు. ౧ దైనా గావచ్చు, ఫాల్గుణ శు. ౧ దైనా గావచ్చు. కాని మాఘ శు. ౧ మంగళవార మైనది. ఫాల్గుణ శు. ౧ బుధవార మైనది. ఈ పైశాసనములో చెప్పినది ఫాల్గుణ శు. ౧ దే. కాన శాసనపు తేదీ

=క్రీ. వె. 1346 ఫిబ్రేవరు ది 22 బుధవారము.

నెం. 1201

1 శ్రీశకే వేదశైలేత్రిశశిపరిమితే [మా]ఘ-

2 వీమః శశిథ్యాం పంచమ్యాం భానువారే|

=క్రీ. వె. 1453 జనవరు ది 23 ఆదివారము.

నెం. 1202

1 శ్రీశాలివాహనశక సంవత్సరములు

2 వెయ్యేడు మాటముప్పదారు ... వెళ్ళగను ప్ర మోదూ

3 తహాయన వైశాఖ శుద్ధ తృతీయార్క- శుభది

4 నమున మృగశీర్ష నక్షత్ర మేషలగ్నమందు-

వెయ్యేడు మాటముప[దా]రు సరి కాదు. వెయ్యే డుమాటముప[ది]రు అని యుండవలెను. ప్రమోదూత సంవత్సరమునకు సరియైన శాలివాహన శక వర్షరము 1732 గాని 1736 గాదు. కాన ఈశాసనపు తారీఖు

=క్రీ. వె. 1810 మేయి ది 6 భానువారము.

రోహిణి వెళ్లగా మృగశిర. మార్త్యోదయమైన ౧౨ విఘ. మీనలగ్నము; తదుపరి మేషలగ్నము.

నెం. 1203

1 స్వస్తిశ్రీ [॥] శాలివాహనశకే గతాబ్దాః ౧౬౮౫ కాంగ్గా

... ...

7 ... ... శ్రీమత్సర్వభౌమ్య(ం) హ్య దే [।]

8 వర్షే మాసి చ జేష్ఠ సంజ్ఞని సితే చిత్రాఖ్య ఋక్షే శుభే

9 శ్రీమత్పద్దశమీ దినే శుభకరే వారే చ సోమ స్య సై ॥౨॥

= క్రీ. వె. 1763 జూన్ ది 20 సోమవారము.

ఆరోజున చిత్రా నక్షత్రము 35 ఘ. 24 విఘ. లవర కుండె.

నెం. 1204

1. స్వస్తిశ్రీ శాకవర్షే మణిశశివిగే శ్రావణే శుక్లపక్షే ప-

2. ంచ్చమ్యాం జీవవారే ... ...

... ...

12. ... ... ॥స్వస్తిశ్రీ [॥]

13. శకవరుషంబులు ౧౨౯౧ గు నేండు వీరశ్రీ నరసింహ్యదే-

14. [స] స్య ప్రవర్ధమానవిజయరాజ్య సంవత్స రంబులు ౨౩ ను

15. శ్రావణకర్కాటక శుక్ల ౫ గురువారమున

... ...

= క్రీ. వె. 1297 జూలై ది 25 లక్ష్మీవారము.

కర్కాటక ప్రవేశము జూన్ ది 28 వ. కర్కాటకాంతము జూలై ది 28. శ్రావణశుద్ధము జూలై 21 నుండి ప్రారంభము. అందుచే కర్కాటక శు. ౫ = శ్రావణ శు. ౫.

☞ ఈశాసనము గంగవంశపురాజైన వీర శ్రీ నరసింహ్మదేవుగారి రాజ్యకాలములో 23 వ సంవత్సరమంది. ఈ 23 వ సంవత్సరము శాలివాహన శక సం. 1219 కి సమానము.

నెం. 1205

1. స్వస్తిశ్రీ [॥] శాకాబ్దేరవి బాణసాగరయుతే పౌషాదిశుక్లే దినే వీరశ్రీ-

2. నరభానుదేవ నృపతి[ః] శ్రీ హమ్మీరావాఢ యశాః[।] వీరశ్రీ నరసింహ్మదేవ

3. నృపతేశ్చాయాంచ గంగాంబికా [।] ఛాయాందీపకశాధరార్పితకరాం ప్రాదా-

4. త్ప్రతాపోన్నతః॥ వీరశ్రీ భానుదేవస్య ప్రవర్ధమాన విజయరాజ్యతృతీ

5. యాంకే మకరస్థే రవౌ పౌషే శుక్ల ప్రతిపది భృగువారే ...

... ...

శాలివాహన శక 1275 పుష్య శు. ౧ శుక్రవారము మకరమాసము. క్రీ. వె. 1353 సం. లో మకరప్రవేశము డిశంబరు ది 26 వ సూర్యాస్తమయమైన తర్వాత గావున ది 27 వ సంక్రాంతి దానధర్మములు. ఆదినము ప్రతిపత్తు సూర్యోదయాది 7 ఘ. 48 విఘ. ఉన్నది. కాన ఈశాసనకాలము

= క్రీ. వె. 1353 డిశంబరు ది 26 శుక్రవారము.

ఈశాసనమువల్ల వీరశ్రీ నరసింహదేవ నృపతియొక్కయు, ఆయన భార్య గంగాంబిక గారియొక్కయు రూపములుగల రెండు ప్రతిమలు దీపాలు పట్టుకొనేటట్లు ఉండిన చేతులు గలవి (దీపకశాధరార్పితకరాం) స్వామికి సమర్పించినట్లు తెలియుచున్నది. ఆవిగ్రహము లిప్పుడు ఆయాలయములోనే యుండియున్న యెడల ఆ యాలయాధికారులతో చెప్పి వానిని జాగ్రత్తపరచుట దేశాభిమానులకెల్లరకును ముఖ్యమైనపని. లేని యెడల అవి యేమైపోయినవో చర్చచేసి వాటిని తిరుగ సంపాదించుట గూడ పట్టికే.

నెం. 1206

ఇందు తేదీ యివ్వలేదు.

నెం. 1207

1. స్వస్తిశ్రీ [॥] శకవర్షంబులు ౧౨౦౧ అగు నేంటి కార్తిక కృష్ణదశమి

2. వి గురువారమున ... ...

= క్రీ. వె. 1279 అక్టోబరు 6 గురువారము.

నెం. 1208

1 స్వస్తిశ్రీ [॥] శాకవర్షంబులు ౧౨౦౧ అగునే...

2 నరసింహ్మదేవ నృపతేస్తా త్రీయాబ్యకేంకే ఘటామాసి బ్రహ్మదినే ... ...

... ...

4 ... వీర... ...

5 సింహ్మదేవస్య ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సర......

6 ం కే చిహ్న్యమాసే కుంభ శుక్ల ద్వితీయాయాం గురువారే......

శాలివాహన శకవర్షములు 1201 లో కుంభప్రవేశము జనవరు ది 25 వ 54 ఘడియలకు. అవగా కుంభమాస ప్రారంభము ది 26 నుండి. ఫిబ్రేవరు ది 7 నుండి

ఫాల్గుణ శుక్ల పక్ష ప్రారంభము. కాన సంఖ్య శుక్ల 3 అంటే ఫాల్గుణ శు 3 అవిరే.

=క్రీ. వె. 1380 ఫిబ్రవరు ది 9 గురువారము.

ఈరోజున తదియతిథి 28 ఘ. 48 విఘ. లవర కున్నది.

నెం. 1209

1 స్వస్తిశ్రీ శాకవర్షే మునినయన కరశ్మామితే క్యేష్ఠపక్షే శుక్లే ప్రా-

2 దా తృతీయాయాంత గురుదినే

=క్రీ. వె. 1305 మేయి ది 27 గురువారము.

ఈరోజున తృతీయా తిథి 28 ఘ. 48 విఘ. లవర కుండె.

నెం. 1210

1 స్వస్తిశ్రీ [॥] శకాబ్దే శశిసింధు నేత్రధరణీ సంఖ్యాన్వితే ద్వంద్వకేమ-

2 నే శుక్ల దినే దశే శుభయమే పక్షే గవాం భార్గవే।

=క్రీ. వె. 1319 నవంబరు ది 23 శుక్రవారము.

నెం. 1211

1 శ్రీమత్తుత్కళ నృసింహ్య బాలాకపతే చాతు ర్థక కేం కే ఘటామా

2 సేద సితపంచమీ గురుదినే... ...

... ...

6 ... । స్వస్తిశ్రీ [॥] శకవర్షాంబులు ౧౩౦౩ అనుసేంటి (!) వీర శ్రీ నరసింహ్య

7 దేవరా ప్రవర్ద్ధమాన విజయరాజ్య సంవ్వా త్సరంబులు ౪౦ కన్యాసింహం

8 ధకృష్ణ ౫ గురువారాన

=క్రీ. వె. 1381 ఫిబ్రవరు ది 14 గురువారము.

నెం. 1212

1 శాలివాహన శకశరదంబులను సెయిబ్నాట త్రిపలకం బెలమ

2 రెండు వర్ప్రవర్తమాన సంవ్వత్సర వైశాఖ మాస కు-

3 క్లతదియు మరియు భౌమవారము మృగశిర

4 నక్షత్రంబు రాశి మేషంబున ... ...

ఈ శాసనము నెం. 1202 శాసనమును విపుల ముగా జేసినది.

నెం. 1213

1 శాకాబ్దే శశనేత్ర బాణనాయ నేత్యాషాఢకృ

2 ష్ణే తిథౌ సప్తమ్యాం ...

... ...

7 ... । ప్రతప శ్రీవీరవర వారసింగ్ఘ-

8 దేవంక్కూర విజయరాజ్య సంవత్సర త్రా-

9 —యిని కక్కటక కృష్ణ ౭ రవివారే.

శాలివాహన శకవర్షంబులు 12౫2 లో కర్కా టకప్రవేశము జూన్ ది 28 వ; సింహప్రవేశము జూలై ది 29 వ. జూన్ ది 28 మొదలు జూలై ది 29 వరకు కర్కాటక మాసము. జూన్ ది 16 మొదలు జూలై ది 16 వరకు ఆషాఢము. అందుచే కర్కాటక కృష్ణపక్షము ఆషాఢ కృష్ణపక్షమునకు సరిపోవును. ఈశాసనము తేదీ

= క్రీ. వె. 1330 జూలై ది 8 ఆదివారము.

నెం. 1214

1 స్వస్తిశ్రీ శాకవర్షే శశిగుణరవిగే చాశ్వయు-

2 క్శుక్ల పక్షే మాసేకాం లేయతిథ్యాం గుర

3 గురుదివసే ... ...

... ...

10 ... ... । స్వస్తిశ్రీ [॥] శకవర్షం

11 బులు 1231 గుసేం [ట్టి] శ్రీజగన్నాథ దేవర విజయరాజ్య సంవ్వత్సరంబు

12 లు 3 గు ద్రామీకశక్య శుక్ల ౫ యు గురు వారమున ...

శాలివాహన శకవర్షంబు ౧౨౩౧ లో కన్యా మాసము ఆగస్టు ది 29 మొదలు సెప్టెంబరు ది 28 వరకు,

ఆశ్వయుజ శుద్ధము సెప్టెంబరు ది ౯ నుండి ది 20 వరకును. ఇదియే శకాబ్ద మాసములో వచ్చిన శుద్ధపక్షము. కాన ఈ శాసనము లేదీ

=క్రీ. వె. 1309 సెప్టెంబరు ది 10 బుధవారము.

కాని గురువారము గాదు. పంచమీతిథి ఆరోజున సూర్యోదయాది 18 ఘడియలకే పోయినది.

నెం. 1215

1 స్వస్తిశ్రీ॥ ॥శాకే గ్రహేంద్రియ తమాయు
2 తి హేమశంక్రా (!) వర్షే విజృంభతి మఘావక
3 మాసిరాఖే॥ రాకాతిథౌ గురుదినే విలక్షేత...
... ...
23 శకవర్షంబులు ౧౨౧౫ అగునేటి హేమళంబి
24 సంవత్సర వైశాఖ శుద్ధ ౧౫ గు॥

=క్రీ. వె. 1597 ఏప్రెల్ ది 21 గురువారము.

ఈ ది 21 వ గురు తిథి సూర్యోదయముతో పోయెను. అప్పటినుండి పౌర్ణమి తిథియే. ఇది ది 22 వ సూర్యోదయాది ౦ ఘ 22 విఘ. వర కుండెను. రాత్రిగల పౌర్ణమి ది 21 నే కాన ఈశాసనములో చెప్పిన వ్రతములు ది 21 నే జరిగియుండవలెనని భావము.

నెం. 1216

1 రసాగ్ని సూర్యాన్విత శాకవర్షే ఆషాఢ మాసేకృష్ణ దినేద
2 శమ్యాం॥ ... ...

=క్రీ. వె. 1314 జూన్ ది 23 ఆదివారము.

నెం. 1217

స్వస్తిశ్రీ [॥] శకవరుషంబులు ౧౨౧౨ గు నేంటి ప్రతాపవీ
2 ర శ్రీనరసింహదేవరు ప్రవర్ధమాన విజయ రాజ్య-
3 సంవత్సరంబులు ౧౨ గు క్రాహిమకర శుద్ధ ౧౦
4 యు గురువారము ... ...

=క్రీ. వె. 1291 జనవరు ది 11 గురువారము.

మాఘ శు. ౧౦ ఆరోజున సూర్యోదయాది 41 ఘ. 24 విఘ. లకు పోయెను.

నెం. 1218

1 స్వస్తిశ్రీ [॥] శాకాబ్దే శరసింధు నేత్ర ధరణీ సంఖ్యాన్వితే
2 ఫాల్గునే మాసే మీనసితే తిథౌ ప్రతిపది శ్రీ చంద్రవారే
3 శుభే॥ ... ...
... ...
5 ... ॥ శకవరుషంబులు ౧౨౭౫ గు నేంటి మీనశుక్ల ప్ర-
6 తిపదా సోమవారాన శ్రీవీరభానుదేవర విజయరాజ్య-
7 సంవత్సర 3 అంక క్రాహిని......

నెం. 1205 వలెనె యిదియు శ్రీవీరభానుదేవు రాజ్యకాలములో 3 వ సంవత్సరమందు వ్రాయబడినదే.

= క్రీ. వె. 1354 ఫిబ్రేవరు ది 24 సోమవారము.

ఈసంవత్సరములో మీనప్రవేశము ఫిబ్రెవరు ది 23 న సూర్యోదయాది 59 ఘ. 24 విఘ. కాగా_అందుచే మీనమాసములో ప్రథమదినము ఫిబ్రేవరు ది 24. ఫాల్గున శు. ౧ కూడా యారోజునే సూర్యోదయాది 46 ఘ. 24 విఘ. వర కున్నది.

నెం. 1219

1 శ్రీప్రతాప వీరాది వీరవర నారసింహ దేవరు
2 ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబులు
3 ౭ క్రాహిసింహ్య శుక్ల ౭ గురువారమున ...
... ...

ఇందులో శకవర్షంబు లివ్వలేదు. రాజాగారి రాజ్యకాలపు సంవత్సర మిచ్చినారు. కావున ఈ రాజాగారి కాలపు ఇతరశాసనములను బట్టి యీశాసనపు సంవత్సరము శకవర్షములలో తీయవలెను.

ఈశాసనపుతేది

= క్రీ. శ. 1332 జూలై 30 గురువారము.

ఈ సంవత్సరములో సింహప్రవేశము జూలై ది 29 వను; కన్యాప్రవేశము ఆగష్టు ది 29 వను; శ్రావణశుద్ధము జూలై ది 23 నుండియు; భాద్రపదశుద్ధము ఆగష్టు ది 23 నుండియు; గాన శ్రావణ శు. ౭, భాద్రపద శు. ౭ గూడ సింహశుద్ధములోనే వచ్చినవి. జూలై ది 30 శ్రావణ శు. ౭ అయినది; భాద్రపద శు. ౭ ఆగష్టు ది 28 అయినది. కాని జూలై ది 30 గురువారమైనది. ఆగష్టు ది 28 శుక్రవారమైనది. కావున శ్రావణ శు. ౭ గురువారమునకు సరియైన క్రీ. శ. తారీఖు తీసుకొంటిమి. క్రీ. శ. 1332 శాలివాహన శకవర్షము 1254కు సమానము. ఇది రాజాగారు రాజ్యమునకు వచ్చిన 7 వ వత్సరము. అందుచే ఈశాసనములో జెప్పిన రాజాగారి శాసనములే నెం. లు 1181, 1191, 1195, 1200, 1213 లో నిచ్చినవి చూడ. ఈశాసనములలో నిచ్చినరాజ్య సం. లను, శాలివాహన శక సం.లను పరిశీలించి చూచిన రాజ్యకాలవర్ష గణనము విపరీతముగా గన్పించును. ఇట్లే ఈగంగవంశపు రాజులయొక్కయు, వారితర్వాత పాలించిన సూర్యవంశపు రాజులయొక్కయు గణన యుండును. దీనివిషయమై ప్రత్యేకముగా నొకవ్యాసము వ్రాయుదు

నెం. 1220

1 శకవర్షంబులు ౧౨౮౩ నేంట్టి మాఘ శుద్ధ ద్వితీయా-

2 ను గురువారన... ... ...

= క్రీ. శ. 1361 డిశంబరు 30 గురువారము.

ద్వితీయా తిథి సూర్యోదయాది 6 ఘ. 36 విఘ. వర వుండెను.

నెం. 1221

1 శాలివాహన శకవర్షంబులు ౧౭౩౧

2 శాగాను శుక్ల సంవత్సర వైశాఖ శు ౧౫ స్థిర

3 వారం ... ...

= క్రీ. శ. 1809 ఏప్రిల్ 29 స్థిరవారము.

పౌర్ణమి తిథి ఈ రోజున సూర్యోదయాది 59 ఘ. 24 విఘ. ల వర కున్నది.

నెం. 1222

1 స్వస్తిశ్రీ [॥] శాకాబ్దే రవిలోకసాగరయుతే సంఖ్యాన్వితే వత్సరే

2 మాఘే మాస్యసితే భృగోః సుదినసే శ్రీపంచమీ సంయుతే॥

మాఘ శు. ౫ శ్రీపంచమి. 'మాఘే మాస్యసితే' యని యుండుటచేతను శ్రీపంచమీయన్న ప్రయోగమునకేమీ యర్థమున్నట్లు దోచదు. ఈ శాసనపుతేదీ

= క్రీ. శ. 1322 జనవరు 8 భృగువారము.

నెం. 1223

1 స్వస్తిశ్రీ [॥] శాకాబ్దే సింధురుకుభినోన్మాత్రవోర్థమ గణాన్వితే [।] రుమ ఫేమాసి

2 శుక్లేస్మిన్పక్షే వారే విధో శ్శృభే॥

శాలివాహనశకాబ్దము 1267లో బుమఫేమాసము ఏప్రెల్ ది 25 మొదలు మే ది 27 వర కుండె. వైశాఖ బహుళము ఏప్రెల్ 18 మొ॥ మే ది 2 వరకు. జ్యేష్ఠ శుద్ధము మేయి ది 3 మొ॥ 17 వరకు. 'శుక్లేస్మిన్పక్షే వారే విధో శ్శృభే' యని చెప్పుటచే తిథివారములు 'పౌర్ణమీ సోమవార'మని-చతుర్దశి మే ది 16 న సూర్యోదయాది 9 ఘ. 36 విఘ. లవర కుండె, తరువాత పౌర్ణమి ప్రవేశించి ది 17 న 8 ఘ. 24 విఘ. లవర కుండె, రాత్రిగల పౌర్ణమి ది 16 నచే- ఆరోజే సోమవారము గాన-

= క్రీ. శ. 1345 మే 16 సోమవారము.

నెం. 1224

1 స్వస్తి [॥] శకవర్షంబులు ౧౩౩౮ నేటి అధిక శ్రావణ బహుళ చతుర్థీ శని-

2 వారము నాడు.

= క్రీ. వె. 1356 జూలై ది 17 శనివారము.

నెం. 1225

1 స్వస్తిశ్రీ [॥] సఖవరు శంబ్బులు ౧౨౭౧ కం డ్డగునేంట్టై శ్రీవీరా-

2 ధివీరనరనారసింహ్యదేవ ప్రవర్ద్ధమాన విజయ రాజ్య సంవత్స

3 ౨౭ శ్రావణమాన శుక్ల ౧౧ సౌరివారము ...

శకవర్షంబులు ౧౨౭౧ లో మీనమాసము క్రీ. వె. 1350 ఫిబ్రేవరు ది 23 నెం॥ మార్చి 25 వర కున్నది. ఫాల్గుణ బహుళము ఫిబ్రేవరు ది 22 నుండి మార్చి ది 10 వరకు. తరువాత చైత్రశుద్ధము. కావున శాసనపు గేదీ

= క్రీ. వె. 1350 ఫిబ్రేవరు ది 20 శనివారము.

ఈ తిథి యారోజున సూర్యోదయాది 2 ఘ. 24 విఘ. ల వర కున్నది.

నెం. 1226

1 స్వస్తిశ్రీ శకవత్సరే మునిరసుశ్శ్నేత్రేందు సంఖ్యాన్వితే వాసే

2 శ్రావణశబ్దితే ప్రతిపది శుభ్రాం శువారే శుభే॥

అనగా శకవర్సరములు 1267 శ్రావణమాస శుద్ధ ప్రతిపత్ సోమవారము-

= క్రీ. వె. 1345 ఆగష్టు ది 22 సోమవారము.

ఇది నిజభాద్రపద శుద్ధపాడ్యమి సోమవారము. శ్రావణ శు. పాడ్యమి శనివార మగుచున్నది.

నెం. 1227

1 ... శాకాబ్దే రామతర్కక్షితి శ్రేణశశియుతే జ్యేష్ఠ శుక్లేచ

2 పక్షే పంచమ్యాం జీవవారే అభిజితి శుభదినే...

... ...

13 శకవరు[ష]ంబులు ౧౨౬౩ నున్నేంటి జ్యేష్ఠ శుక్లపంచమి గురువారమునా

14 ందు ... ...

= క్రీ. వె. 1341 మే 21 సోమవారము.

శాసనములో జెప్పినట్లు గురువారము గాదు.

నెం. 1228

1 ... శకవర్షంబులు ౧౪౨౫ అగు

2 న్నేటి వీరశ్రీ గజపతి శ్రీప్రతాపరుద్రదే-

3 వ మహారాజ్యనను రుధిరోద్గారి సంవత్సర కార్తిక

4 శుద్ధ పౌర్ణమి శుక్రవారానను ......

= క్రీ. వె. 1503 నవంబరు 4 శుక్రవారము.

ఈరోజున సూర్యోదయాది 36 విఘ. లే పౌర్ణమి యుండెె. ఈరుద్రదేవుగారు, శాసనము నెం. 1161 లో చెప్పిన రుద్రదేవుగారు ఒక్కరు గారు. ప్రస్తుతము పూరీరాజులు పూర్వపు ఒరిస్సారాజుల సంతతివారే. కాని పూర్వపురాజ్యము పోయినా ఈబిరుదులు మసల లేదు. ఈశాసనములో జెప్పిన రుద్రదేవుగారు విజయ నగరరాజైన కృష్ణదేవరాయలతో పోరాడినవారు.

నెం. 1229

1 ...శకవర్షంబులు ౧౪౧౭ అగు

2 న్నేటి వీరశ్రీ గజపతి ప్రతాపపురుషో

3 త్తమ దేవరాజ్య విజయ శుభ సంవత్సరంబు

4 లు ౩౭ అగు ప్రమా రాక్షస సంవత్సర కార్తిక

5 శుద్ధ ౧౩ మందవారానను...

= క్రీ. వె. 1495 అక్టోబరు 31 శనివారము.

ఇది వీర శ్రీ గజపతి ప్రతాపపురుషోత్తమదేవు అనే రాజుయొక్క 37వ రాజ్య సం. లో వ్రాయబడినది. నెం. 1152 క్రింద నిచ్చిన శాసనము ఈశాసనమునకు ఒక్క సంవత్సరమే పూర్వము. అది రాజుగారి రాజ్య కాలములో 35వ వత్సరమని యున్నది.

నెం. 1230

1 ...శాకవర్షేజలధిగిరిసుధాధామధాత్రీసమే-

2 తే షోడేంద్రా శంగభీమ క్షితిపతి తిలకాత్.

మాసము, తిథి వారములు మరేమీ యివ్వలేదు. సంవత్సరము క్రీ. శె. 1252.

నెం. 1232

1 శాకాబ్దే గోత్రనాదక్షితి శశిగణితే...

... ...

ఇందులోనూ మాస తిథి వారము లివ్వలేదు. ఈ సంవత్సరము క్రీ. శె. 1255.

నెం. 1233

1 ...శాకాబ్దే లోకరత్నావని శశిగణితే

2 వృశ్చికం యాతిభానౌ శుక్లే కందర్పతిథ్యాం

= క్రీ. శె. 1271 నవంబరు 8 ఆదివారము.

వృశ్చికమాసము అక్టోబరు ది 28 నుండి నవంబరు ది 26 వరకు. అందులో అక్టోబరు 28 మొదలు నవంబరు ది 4 వరకు కార్తిక కృష్ణపక్షము. తరువాతి మార్గశిర శుద్ధము నవంబరు ది 19 వరకు. కావున వృశ్చిక శు. ౫ అంటే మార్గశిర శు. ౫.

నెం. 1234.

ఎపిగ్రాఫియా ఇండికా vol. V, pp. 31 ff లో ప్రకటించియున్నది.

నెం. 1235

... ...

6 ......। శాకాబ్దే శైలరత్నక్షితి శశిగణి-

7 తే కార్తికే శుక్లపక్షే సౌమ్యే వారే దశమ్యాం...

= క్రీ. శె. 1275 అక్టోబరు 30 బుధవారము.

నెం. 1236

1 ... శకవర్షంబులు ౧౧౯౯ నేటికన్యా శుక్ల పౌర్ణమావాస్యయు

2 సౌరివా [ర] మున శ్రీమార్కనాథుని కుమార పున్నమ ఉత్సవము ......

శాలివాహన శకవత్సరము 1199 లో కన్యా మాసము ఆగష్టు ది 29 నుండి సెప్టెంబరు ది 28 వరకు. అందులో ఆగష్టు ది 31 నుండి సెప్టెంబరు 14 వరకు ఆశ్వయుజశుద్ధము. ఆశ్వయుజ శుద్ధ ౧౫ కుమార పౌర్ణమి. ఈశాసనపు తేది

= క్రీ. శె. 1277 సెప్టెంబరు 14 మంగళవారము

నెం. 1237

1 శాకాబ్దే రవిసాగరా(అ)క్షి (ం)సహితే పౌషే

ద మాసే తిథౌ స-

2 ప్తమ్యాం శుక్ల [పక్షే] సితిసుతస్థితే ...

... ...

4 ... ...। శకవరుషంబులు ౧౨౭౨ అగునే-

5 ంటి శ్రీవీరాధివీర నరనారసింహదేవ ప్రవ ర్ధమాన విజయరా-

6 జ్య సంవత్సరంబు ౨౯ గునేటి ఇ పుష్య సు[క్ల] సప్తమిని భానువా-

7 రన ... ...

= క్రీ. శె. 1350 డిశంబరు 6 ఆదివారము.

సప్తమితిథి ఆరోజున సూర్యోదయాది 48 ఘ. 36 విఘ. వరకున్నది. ఇది వీర నరనారసింహదేవుగారి రాజ్యకాలములో 29 వ సంవత్సరములోనిది.

నెం. 1238

1 ... శకవరుషంబులు ౧౨౦౧ గునేంట్టి ప్రతాపవీ-

2 ర నరసింహ్యదేవరు ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్స

3 రంబులు 3 గు శ్రాహి చైత్ర క్రిష్ణ ౧౩ యు గురువారము

... ...

= క్రీ. శె. 1280 ఫిబ్రేవరు 29 గురువారము.

(పూర్ణిమాంత చైత్రము.) ఈ ప్రతాపవీర నరసింహ్యదేవుగారు నెం. 1150, 1151, 1173, 1178, 1185,

1204, 1217 లలో చెప్పినవారే. వీరి రాజ్యకాలములో 8 వ వత్సరములో ఈశాసనము చేయబడినది.

నెం. 1239

1 ... సకవరుషంబులు ౧౩౪౧ అ_

2 గునేంటి ఫల్గుణ శుక్ల ౩ సోమవారాన

... ...

= క్రీ. వె. 1419 ఫిబ్రేవరు 27 సోమవారము.

నెం. 1240

1 ......శకవర్షాంబులు ౧౨౬౭ గున్నేంట్టి ప్రతాప-

2 శ్రీ వీరవరనార సింహ్యదేవరు ప్రవర్ధమాన విజ-

3 యరాజ్య సంవత్సరంబులు ౨౨ గు శ్రాహిని జ్యేష్ఠకృ-

4 ష్ణ ద్వితీయయు మంగళవారము నాండు...

= క్రీ. వె. 1345 ఏప్రేల్ 19 మంగళవారము.

(పూర్ణిమాంత జ్యేష్ఠము.) ఈ రాజుగారు పైన నెం. 1237 శాసనములో జెప్పినవారే. ఇది యీయన రాజ్య కాలములో 22వ వత్సరమున పుట్టినది.

నెం. 1241

ఎపిగ్రాఫియా ఇండికా vol. V, p. 34 f. లో ప్రకటితమైనది.

నెం. 1242

1 ...శకవర్షాంబులు ౧౩౨౭ అగు (o) నే

2 వైశాఖ శుద్ధ ఏకాదశి భృగువారాన

... ...

= క్రీ. వె. 1405 ఏప్రెల్ 10 భృగువారము.

నెం. 1243

1 శాకాబ్దే శశిరత్న భానుగణితే చైత్రే సితే చాష్టమీ

2 పుణ్యాహే......

= క్రీ. వె. 1369 మార్చి 16 శుక్రవారము.

శాసనములో వార మివ్వలేదు.

నెం. 1244

1 వీర శ్రీ నరసింహ్య దేవర విజయరాజ్యసం-

2 వ (o) త్సర ౩౩ అంక స్రాహి చైత్ర శుద్ధ పౌర్ణమీ

3 రవివారే......

= క్రీ. వె. 1405 మార్చి 15 ఆదివారము.

నెం. 1245

1 ...శకవరుషంబులు ౧౨౧౫ గునేండు శ్రీవీ-

2 ర నరనార సింహ్యరావుతు దేవరు ప్రవర్ధమానవిజ-

3 యరాజ్య సంవత్సరంబులు ౧౭ గు శ్రాహి వృషభ

4 శుక్ల ౧౩ యు శుక్ర వారమున...

= క్రీ. వె. 1293 మే 19 మంగళవారము.

ద్వాదశి-మరునాడు త్రయోదశి ఏమ్యము: చతుర్దశితిథి; ది 21 న పౌర్ణమియు- లక్ష్మీవారము, అందుచే ౧౩ శుక్రవార మన్నమాట తప్పు. ముందు నెం. 1249 చూడుడు.

నెం. 1246

1 శాకాబ్దే శశిరత్న భానుగణితే వైశాఖమాసే-

2 సితే పంచామాం గురువార పుణ్యదివసే

... ...

= క్రీ. వె. 1369 ఏప్రేల్ 12 గురువారము.

నెం. 1247

1 ... శకవరుషంబులు ౧౩౯౨ అగు

2 నేంటి పతాప విజయపురుషోత్తమదేవరా-

3 జ్య సంవత్సరంబులు ౬ శ్రాహి ఆశ్వీజ

4 శుద్ధ ప్రతిపదా మంగళవరానను ... ...

= క్రీ. వె. 1470 సెప్టెంబరు 25 మంగళవారము.

ఆరోజు సూర్యోదయాది 57 ఘ. ల వరకు ప్రతిపత్తిథి.

నెం. 1248

1 ...... శకవర్షంబులు ౧౩౯౩ అ-
2 గు నేంటి ఖరసంవత్స చైత్ర బ ౧౧ ఆదివా-
3 రవ ... ...

= క్రీ. వె. 1471 మార్చి 16 ఆదివారము.

(పూర్ణిమాంత చైత్రము.)

నెం. 1249

1 ... శకవరుషంబులు ౧౨౧౫ గు నేందు పీర శ్రీన-
2 రవారసింహ్యదేవరు విజయరాజ్యస[ం]వ్వత్స రంబు (ల)
3 లు ౧౫ గు శ్రాహి రివథి శుక్ల పౌర్ణమియు గురువా-
4 రమున

పైన నెం. 1245 వ శాసనము జూడుడు. ఈరెండింటి శాసనకాలపు ప్రభువు ఒక్కరే. ఇదియే నిజమైన శాసనమునలె నున్నది.

= క్రీ. వె. 1293 మే 21 గురువారము.

నెం. 1250

1 ... శకవర్షంబులు ౧౩౭౩ అ[గు]నేంటి ఖర
2 సంవత్సర శ్రావణ బ ౧౦.

= క్రీ. వె. 1451 ఆగష్టు 22.

(వార మివ్వలేదు.)

కుమారుఁడు

పండిత పురాణం సూర్యనారాయణ తీర్థులుగారు

(వెనుకటిసంచిక తరువాయి)

దొంగతనము చేయుట యె
ఘ్నుం గల్లలు పల్కుటయుఁ గడు నీచులతో
సంగాతము సేఁతే యొక
ఘ్నుం గూడ దటంచుఁ దలఁపు బుద్ధిఁ గుమారా.

కోపమునకంటె నెక్కువ
తాపముఁ బాపమును గూర్పఁ దగినది యిలలో
రూపింప లేదు కావునఁ
గోప మణఁచుకొంటమంచిగుణముకుమారా.

తనకంటె హెచ్చువారిని
కనుఁగొని దుఃఖించుకంటెఁ గనువారలలోఁ
దనకంటె లొచ్చువారిని
గని సంతోషించుచుంట ఘనత కుమారా.

పేదల నాక్షేపింపకు
సాదులతో నెదులకును జగడింపకుమా
వాదింపకు పెద్దలతో
నాది యనకు మన్న! పరధనమ్ముఁ గుమారా.

పరధనమున కాసింపకు
పరుషమ్ములు పలుకఁబోకు పాపపుఁబనులన్
జరపింపఁ బోకు నిన్నుం
దలు మెత్తురు మేలు గలుగు దానఁ గుమారా.

పొగచుట్ట కాల్చునోటను
సిగరెట్టులు పీల్చునోటఁ జెడుమాటలు ప
ల్కఁగఁ బూనునోటఁ జదువుల
మగువ నిలువ దనుచు నమ్ము మదిని కుమారా.

నరజన్మ మెత్తినందుకుఁ
బురుషార్థ మ్మొక్కఁడేనిఁ బూర్ణముగాఁ దా
నెఱవేర్పఁ జాల కుండిన
నరుఁ డనఁగాఁ దగఁడు పశువునమ్ముకుమారా.

చలిచీమ మొదలయిన ప్రా
ణులయెడ దయ గలిగి వాని నొప్పింపక యే
మెలఁగునతఁడు నరుఁడా? భూ
తలదేవుం డనుచు నమ్మఁ దగును కుమారా.

హెచ్చు గలవారిఁ గనుఁగొని
మచ్చరము వహించునట్టి మానిసి నెవరున్
మెచ్చరు కావున నెపుడును
మచ్చరపడఁబోక తెలిసి మసలు కుమారా.

ఆయువు కర్మము ధన వి
ద్యాయోగమ్ములును చావు ననువీని నజుం
డీయాత్ముఁడు గర్భగతుం
డై యుండినయపుడ వ్రాయునంట కుమారా.

భయ తంద్రలు కోపము ని
ద్రయు సోమరితనము మఱి చిరక్రియతయు దు
ర్ణయ మాదిగఁ జెడుగుణముల
నయమునకై విడుచు టొప్పునండ్రు కుమారా.

హితమును గోరెడిమిత్రుల
హితవచనమ్ములను విననిహీనునకు విపద్
గతి చేరువ యగు నని పం
డితు లందురు తెలిసి మెలఁగు నీవు కుమారా.

దీనజనుల బాధింపకు
హీనుల నెన్నఁటికి నాశ్రయింపకు మెపుడున్
జ్ఞానులసంగతి మానకు [రా!
మానకు మహదాశ్రయము కుమార! కుమా

ఒక్కఁడవు దారి నడవకు
పెక్కండ్రు పరుండియున్న వేళను నట నీ
వొక్కఁడవును మేల్కొనకుము
చిక్కు దటస్థించు నని వచింత్రు కుమారా.

మాసిన బట్టలు కట్టకు
భూసురులను నింద సేయఁ బూనకు చెడు సా
వాసములు చేయకుము పలు
దోసములు తటస్థమగును తుదకుఁ గుమారా.

నలుగురు గుమిగాఁ గూడిన
స్థలమునకుం బోయి యందుఁ దగులుకొనకు చి
క్కులు గలుగవచ్చు వానిని [రా.
దులుపుకొనుట కష్ట మగును తుదకుఁ గుమా

కొండెములు చెప్పఁ బోకుము
దుండగులను జేరఁబోక దూరముగా నే
యుండుము ధనము వృథాగా
దండుగులకు వెచ్చఁబెట్టఁ దగదు కుమారా.

నినుఁ జూచి తోడిబాలురు
వినయాదిగుణములు నేర్చువిధమున నీవ
ర్తన మలవఱుచుకొనినచో
నిను మెత్తురు సకలజనులు నిజము కుమారా.

చిన్నతనమ్మునుండియు
నెన్నఁ డసత్యమ్ము పలికె యెఱుఁగనివానిన్
మన్నింతు రన్ని యెడలను
కన్నారం గనుము సత్యగరిమ కుమారా.

చీఁకటిలో నొంటిగఁ బోఁ
బోకుము రిపునింటఁ గుడువఁబోకుము నీ వే
కాకిగ నాలోచింపం
బోకుము వడినీట నుఱుకఁ బోకు కుమారా.

ముందుగ నాలోచింపక
తొందరపడి పనులు సేయఁ దొడరితివేనిన్
పొందెది వాపద లందునఁ
గుందవలసివచ్చుఁ జుమ్మ కొనకుఁ గుమారా.

ఉదయించునపుడు నస్తముఁ
గదియునపుడు గగనమధ్యగతుఁ డయినపు డ
భ్యుదయాకాంక్షులు సూర్యుని
కెదురుగఁ దమదృష్టిఁ బఱుప రెప్డుఁ గుమారా.

పలుపలుకులు పలుకుము గా
ని లిఖింపకు మన్న! యొకటి నీచేవ్రాలున్
పలుకులు పొల్లు లనియు వ్రాఁ
తలు ప్రాణము గలవి యనియుఁ దలఁచి కు.

గురులను దేవుని వృద్ధుల
ధరణీపతిని గర్భవతిని తగ బాలకులన్
దరిసింపఁ బోవునప్పుడు
కరమున నేమయినఁ గొనుమ కాన్క కు.

వర్ణాశ్రమధర్మమ్ముల
నిర్ణయము లెఱింగి వానిని నిత్యమ్మున్
పూర్ణమ్ముగ నెఱవేర్పని
దుర్ణయులకుఁ గలదె సుఖము తుదకుఁ గు.

ఏ దేశపుమానవులకు
నాదేశపుమందె తప్ప నన్యము హిత మిం
కేదియుఁ గా దనునాయు
ర్వేదపువచనమున మనసు పెట్టు కుమారా.

హిత మయినవస్తు వయినను [యినన్
మితముగ భుజియింప వలయు మిక్కుట మ
మతి చెడుఁ గాక దేహ [మారా.
స్థితియుఁ జెడును తుదకుఁ దానుఁ జెడును గు

ఏ బాసఁ దొలుత నీ'క
మ్మా! బాయే' అనెడిపలుకు లలవడెనో నీ
వా బాసను ప్రేమింపని
చోఁ బసు వనిపించుకొందు సుమ్మ కు.

"తింటే గారెలె తినవలె
వింటే భారతమె యెపుడు వినవలె" ననుచున్
ఘంటారవముగ బుధు లను
చుంట గలదు దీనఁ జిత్త ముంచు కుమారా.

తమ ప్రాణము తమ కెంత ప్రి
యమొ తక్కినభూతములకు నట్ల యనుచుఁ జి
త్తమునఁ దలంపని యా దు [రా.
ష్టు మనుష్యుఁడు గాఁడు రాక్షసుండె కుమా

సర్వంసహ లగువారును
సర్వ మయినహింస విడుచుసాధులు మఱియున్
సర్వాశ్రయభూతులుఁ దుది
స్వర్వాసము చేయుచుండువారు కుమారా.

ఏపడినపండో ఆకో
సాపడినన్ కడుపుమంట చల్లాఱుఁ గదా!
ఈపాడుపొట్టకొఱకే
లా పాపము చేయవలయు నయ్యా కుమారా.

మొనగాఁ డయి పోఁగూడదు
పని యగునే నందఱకును ఫలము సమం బౌఁ
బని చెడినను పరు లడ్డిన [రా.
మొనగాఁడే చంపఁబడును మొదటఁ గుమా

తమ కోరిక లేకుండఁగఁ
దమకు సుఖము వచ్చునట్టి తన యంతన దుః
ఖమునయితము వచ్చును దై
న్యము దీనను తలఁగు టొప్పనయ్యకుమారా.

సేవించి ధనముఁ గొనియెడి
సేవకు లొనరించుకొన్న చెడుగిదె తమకర్మ
దైవ మొసంగిన హక్కు ల
కోవిదులై యొరుల కమ్ముకొనుట కుమారా.

ఎద్దాన వృత్తి జరుగు నిఁ
కెద్దానను మెచ్చుదురు మనీషులు తనుఁ దా
నద్దానిన చూ ప్రాజ్ఞుఁడు
పెద్దగ నొనరించుకొనును బెంచి కుమారా.

మనసున నాలోచించిన
పని ప్రకటన చేయఁబోకు పరు లెఱిఁగిన నా
పని నెఱవేఱుట కష్టము
విను మిదినాయనుభవమున వెలసెఁ గుమారా.

రోగులు వైద్యుల కుపసతి
త్రాగుడు మొదలయిన వున్న ధరణీపతి కుదు
ద్యోగులకుఁ బామరులు వి
ద్యాగురులకుఁ జేతిపెట్టు లంట కుమారా!

తనయెడ ద్రోహము చేసెడి
మనుజులవిషయమున నెవఁ డమాయికమగువ
ర్తనమును జూపునో వాఁ డెం
దును పరిభవ మందుచుండును జుమ కుమా.

తొలిగుణము గొడుగుగా నా
వలి రెండును పాదుకలుగ వర్తించునతం
డిల లోకాతీతుం డని
తెలిసికొనుము ముదము వానిది సుమ కుమా.

నో రొకటి మంచి దగునే
నూరంతయు మంచి దగుచు నుండును వినుమీ
కాఱులు పలికినచో నీ
నోరే పీఁకుపనకుఁ దెచ్చునుజుమ కుమారా.

నరునకు నరుఁ డెప్డును నౌ
కరు గాఁడు ధనమ్మునకున కాని ధనము చే
గురులఘుతలు గలుగుట సం
సరణముధర్మమ్మ యనఁగఁ జనును గుమారా.

శ్రీకిం బాసిరి పుణ్య
శ్లోకులు నల ధర్మసుతులు జూదమువలనన్
పేకయు జూదము కావునఁ
బేకాడకు మదియ యగును పిడుగు కుమారా.

చదువుకొనువయసునను సం
పద లార్జన సేయఁ దగినవయసున నెపుడున్
చదరంగ మాడఁబోకుము
అది మరగిన మరలనీయ దయ్య కుమారా.

యుద్ధమునఁ జచ్చునట్టిసు
బుద్ధిని స్వర్గమ్ముఁ బొఱిపోయి బ్రదుకు దు
ర్బుద్ధిని నరక మెదుర్కొన
సిద్ధముగా నుండు నని వచింత్రు కుమారా.

అర్ధనారీశ్వరుడు

లింగం వీరభద్రయ్య చౌదరిగారు, బి. ఏ. (ఆక్స్‌ఫర్డు); బారిస్టర్-ఎట్-లా

కొలదిదినములక్రితము నామిత్రుడొకరి యింట నొకబ్రాహ్మణుడు స్త్రీధర్మమును గుఱించియు, పాతివ్రత్యమాహాత్మ్యమును గుఱించియు నితిహాసపూర్వకముగా నింటిస్త్రీల కుపన్యసించుచుండెను. నేనందుకొని, "స్త్రీలకు మాత్రమే మీరు ధర్మములను శాసించుచున్నారు. మీరు చెప్పుచున్న గాథనుబట్టి భార్య భర్తను గుష్ఠయినను, పాపియైనను దేవునివలె బూజింపవలెను. అతని కితర స్త్రీలను దార్చుటగూడ తప్పుకాదు. మఱి మీరు భర్తల విధ్యుక్తధర్మములనుగుఱించి మాట్లాడరు. స్త్రీలజేరి పురుషులకంటె దేవుళ్లు వేరులేరని చెప్పుటకంటె, బురుషులనుజేరి వారికి భార్యల నెట్లాదరించి ప్రేమించవలసినది బుద్ధులుగరపిన, వివాహమున నెక్కుడు సౌమనస్యము, సౌఖ్యము కలుగు"నంటిని. అందుల కాయన స్త్రీలు పురుషుల నెట్లు చూడవలెనో, యట్లే పురుషులును స్త్రీలను జూడవలెనని శాస్త్రములు చెప్పుచున్నవనియు, వివాహకాలమందు బురుషుడు 'నాతిచరామి' మొదలైన ప్రమాణములు చేయుచున్నాడని యని జెప్పెను. ఇంగితజ్ఞుడైన యాబ్రాహ్మణునిమాటల కానందించి,యిక నట్లయిన,మీరు వెంటనే మీయుపదేశములను బురుషుల కిప్పటినుండియైన గరపుడని కోరితిని.

సదభిప్రాయయుతుడైన యాబ్రాహ్మణునివలె మన మప్రయత్నముగ, నలవాటు చొప్పున, స్త్రీల కొకధర్మము, బురుషుల కొకధర్మము నున్నట్లు వ్యవహరింతుము. పురుషునకు జెడునడవడియందుగూడ గొంత స్వేచ్ఛ యిత్తుము. స్త్రీకిమాత్రము, మంచివర్తనయందైనను స్వాతంత్ర్యమీయము. మనము చెప్పుమాట లెట్లున్నను, నడవడియందు మనము స్త్రీని పురుషున కుపయోగపడు భోగవస్తువువలె, అతని సంతోషవిలాసముల కక్కఱకు వచ్చు ఆటవస్తువువలె చూచుచున్నాము. ఆమె మనబంగారుబొమ్మ; మన మోహంపు బరిణె; మనముద్దులగుమ్మ; మనమురిపాలపేటి; అలంకారవస్తువు; ప్రియమైనధనము; మోహకామములదీర్చుయంత్రము. అంతియే. ఆమెకు వ్యక్తిత్వము లేదు; కష్టసుఖంబులు లేవు; కోర్కెలు, ఆశలు, ఆశయములు లేవు; మనకు బూర్తిగ లోబడి మన కష్టనష్టములకు లోనై, మన మెట్లాడించిన నట్లాడవలెను. మనము రమ్మనిన రావలెను; పొమ్మనిన పోవలెను. మనము చిరునవ్వునవ్విన నుప్పొంగవలెను; మనము కండ్లెఱ్ఱజేసిన భయపడి యొకమూల నొదిగియుండవలెను. మన కిష్టమువచ్చిన దగ్గరకు దీసికొని లాలింతుము; ముచ్చటైన మల్లెపూవువలె నాఘ్రాణిం

తుము, గులాబిపూవునువలె పెదవులతో స్పృశింతుము; కష్టమైన లాగి చెంపపెట్టు పెట్టుదుము. దగ్గరకు దీసికొని కౌగిలించుకొందుము; లేదా తన్ని త్రోసి వేయుదుము. మనము నిరంకుశరోమకసమ్రాట్టులము; వారు దిక్కుమొక్కులేని బానిసలు: మనదయాదాక్షిణ్యములమీద, మనయిష్టానిష్టముల మీద నాధారపడి యుందురు. మానవుని హృదయమున నున్న స్త్రీసంబంధమైన తృష్ణ, మదము, ఆవేశము-కసిదీరునట్లు, పగదీర్చుకొను విధముగ-దీయు మామిడి పండును రసవిహీనముగజీకి, నిస్సారమైన టెంక నవతలికి బారవేయునట్లు- లేత మొక్కజొన్న కండెను పండ్లతో గీరి గింజలను నమిలి బొందును దూరముగ విసరివేయునట్లు, మనము మనస్త్రీలయెడ వర్తింతుము. మఱియు, మానవహృదయమున డాంబికము, అధికారతృష్ణ యున్నవి. తనకంటె నితరవ్యక్తిని దక్కువగా జూచుటకు, నావ్యక్తిని దనయాటవస్తువుగా జేసికొనుటకు, దనదయాదాక్షిణ్యములమీద నాధారపడి, తనయధికారమునకు లోబడి యావ్యక్తి యుండుటకు మానవస్వభావము గోరును. పురుషున కాకోర్కెల దీర్చుకొనుటకు స్త్రీ సాధనమైయున్నది. మెత్తని మల్లెపూవువలె నామె యతని క్రూరహస్తముల నిమిడియుండును. మల్లెపూవును వలె నామె నతడు నలిపివేయగలడు. అన్నెము పున్నెము నెరుగక, సహజభీరువైన లేడికూనను శార్దూలమువలె నతడు భయపెట్టగలడు; నిర్దయుడగు కృషీవలు డెద్దులనువలె నిరంతర మామెచే సేవజేయించుకొనగలడు. ఈవిధముగ నామెనుజూచి, ఆమెయెడ వర్తించి, పురుషుడు స్త్రీవ్యక్తిత్వమును జంపివేసినాడు. ఆమె భారతీయవైభవమునకు, బ్రపంచనాగరికతకు జేయవలసిన సేవ, సాయము, అర్పించవలసిన అర్పణమును అణచివేసినాడు వ్యక్తిత్వమును జంపుట ప్రాణఘాతకంటె ఘోరమైనది. స్త్రీవ్యక్తిత్వమును జంపి, పురుషుడు మహాపాతకము నొడిగట్టుకొనినాడు. ఈహేయప్రవర్తన వలన మనకు గలిగిన ప్రతిఫల మేమన, మనము ప్రపంచమున మిక్కిలి యనాగరికులముగ నెంచబడుచున్నాము. ఆధునికసంఘములు మనలను జీవరహితమైన యస్థిపంజరములుగ జూచుచున్నవి. మనలోని యున్నతగుణములు నశించిపోయినవి. మనజాతి నిస్సారమై పరాధీనమై పోయినది. మన మవివేకముచేత, నహంకారముచేత, మాతృద్రోహము చేసినాము. ప్రాచీనకాలమునుండియు బలువురచేత గౌరవమును, మెప్పును బొందిన మనదేశజనని యిక్కాలమునకు దిక్కులేనిదై యపకీర్తిపాలై పోయినది.

మానవజీవితమున భార్యస్థాన మెట్టిదను ప్రశ్న వచ్చినప్పుడు, మనపండితమ్మన్యులు విపరీతవాదములు చేయుదురు. "ప్రజాయై గృహమేధినాం" పూర్వకాలమున ప్రమాణవాక్యమై యుండవచ్చును. "అపుత్రస్య గతి ర్నాస్తి" యను సిద్ధాంత మేకారణమున వాడుకలోనికి

వచ్చినదో యాకారణముచేతనే, బిడ్డలను గనుటకొఱకే వివాహముచేసికొనుట యను భావము పూర్వకాలమున బ్రబలియుండును. అనగా, గొప్పవైశాల్యముగలిగి, మిక్కిలిసారవంతమై, యనార్యజాతులతో నిండియుండిన యిక్కాలపుహిందూదేశమున దగినంతజనమార్యసంఘమున లేకపోవుటయే. మహాభక్తులగు నారదాంజనేయులు "అపుత్రస్య గతిర్నాస్తి" సిద్ధాంతమును తునాతునకలు జేసినారు. ప్రపంచచరిత్ర, మానవస్వభావము "ప్రజాయైగృహమేధినాం" సూత్రమును కటికబొంకును జేసివైచినవి. స్త్రీలు బిడ్డలను పొదుగు పెట్టలుమాత్రమే యని తలంచుబుద్ధిమంతులు, పెట్టలు పొదుగకుండ బిల్లను జేయు యంత్రములతో దృష్టినొందుదురేమో తెలిసికొనవలసియున్నది. పిల్లలకొఱకే పెండ్లములయిననో, బిడ్డలనుసంపాదించు వెరవున్న, పెండ్లములపోరు తప్పించుకొనుట కెంతమంది ప్రయత్నించెదరో చూడవలసి యుండును. 'బిడ్డలు, బిడ్డలో' యని ఘోషించెడు వేదాంతార్థముల, గీతారహస్యముల నుపదేశించు మనయార్యశ్రేష్ఠుల కేపాశ్చాత్యపండితుడో యుపకరించకపోడు. (?) పై వాదముకంటె నసంబద్ధమైనవాద మింకొకటున్నది. దానిప్రకారము స్త్రీ క్షేత్రము; పురుషుడుబీజము. క్షేత్రము నిష్కల్మషముగా నుండనిది బీజము ఫలించదు. కాన నల్లరేవటిపాలమువలె స్త్రీ కదలక మెదలక; ముక్కక, మూల్గక; అతియనక, పతియనక; మంచియనక, చెడనక; కష్టమనక, సుఖమనక; 'నీవు చేయవలసిన దుర్మార్గమంతయు జేయు' మనునట్లు మత్తుగా పడియుండవలెను. పురుషుడు బీజముగదా. బీజమునకు చలన మున్నది. ఒక్కచోట నుండవలసినయవసరము లేదు. ఈరోజున రాసిలో నుండును; రేపు బస్తాలోని కేగును; ఎల్లుండి పాతరల గాపురము చేయును; ఆవలెల్లుండి పురిలో నివసించును; ఒంటెద్దులబండిమీద షికారువెళ్లును; రెండెడ్లబండిమీద బరుగులిడును; దర్జాగా రైలుబండిమీద దేశయాత్రజేయును; వీలుగానున్న విదేశములకు గూడ స్టీమరులో నేగును. అట్టిచో బీజమునకు హద్దుపద్దుల గట్టుబడి యుండవలసిన యవసర మేమియున్నది? క్షేత్రమున కుండవలసిననైర్మల్యము బీజమున కక్కరలేదు. క్షేత్ర మస్వతంత్రము; బీజము స్వతంత్రము. పండితు లిక్కడ పొరపడిన ట్లున్నారు. పురుషుడు బీజమని చెప్పుటకూడ, వారి యుద్దేశ్యముప్రకారము సాదృశ్యము సరిగా లేదని తోచుచున్నది. సాదృశ్యము సరిగా నుండవలె ననిన, స్త్రీయను క్షేత్రమును నిష్టము వచ్చినట్లు దున్ని, సంస్కరించి, బీజము నాటు కృషీవలుడు పురుషు డని చెప్పవలెను. నేను పైన వ్రాసిన గుణములు బీజమున కున్నవియాయని కించిజ్ఞులు శంకింపవచ్చును. అట్టి శంకకు పురుషుడు పురుషుడే; స్త్రీమాత్రము జడస్వరూపమైన మాగాణిభూమియని చెప్పుట సరియైన సమాధానము. స్త్రీని క్షేత్రముగా జెప్పి సృష్టికెందు

నుపమానకాళిదాసులు చక్కగా దున్ని, మంచి యెరువువేసి, శ్రేష్ఠమైన విత్తనములు నాటిన, నేకృషీవలుడైన సరిపోవునని చెప్పక, ఒకటి కుంటిది, రెండవది గ్రుడ్డిది యగు రెండు బక్కయెద్దులను గట్టి, సగ మరిగిపోయిన కఱ్ఱుతో నెక్కడి కలుపుమొక్కల నక్కడనే యుంచి,దున్ని యుదున్న నట్లు దున్నినను, రెండు తట్టల చెత్త చెదారమైన నెరువు వేయుటకు శక్తి లేకపోయినను, సగము ముక్కిపోయి మిక్కిలి నీరసములైన గింజలను చల్లినను సరియే, 'యీ క్షేత్రము నాది' యనిచెప్ప వ్యర్థ, క్షుద్రకృషీవలుడే యాక్షేత్రమున పైరును బెంచ సర్హు డని చెప్పుదురు. వారికి గావలసిన దారోగ్యవంతము, దార్ఢ్య యుతము, తేజోవంతము శౌర్యోపేతమునయి జాతిగౌరవమును నిలువబెట్టగల సుసంతానము కాదు. చచ్చో, పుచ్చో నాలుగుపిందెలు పడిన జాలును. ఈతత్త్వమును బరిశీలించి చూడగా నిజమున కీమహానుభావులు గోరు నది సుసంతానముకొఱకు వివాహముగాక, క్రొత్తగా సాగునకువచ్చు సారవంతమైన భూమివంటి, చక్కని యారోగ్యవతులైన కన్యలును, తామిష్టము వచ్చినట్లు వ్యభిచరించుటయును, భార్యలుమాత్రము నియమము గలవారై యుండి, తమ దుర్బలము, రోగ భూయిష్ఠమునయిన శరీరములకు నర్పితలయి బలిగా నుండుటయు నని తేలుచున్నది.

ప్రతిస్త్రీకిని ప్రతిపురుషు డర్హుడుకాడు. "శ్రీయును, కులమును,రూపును,ప్రాయము, శుభలక్షణంబు, బాంధవ విద్యాశ్రేయము గలవరునకు" గన్య నీయవలెను. స్త్రీ సహజముగ శిరీషకుసుమపేశల; మిక్కిలి సున్నితమైన స్వభావము గలది; అతి మృదులహృదయ; వికసించుచున్న మల్లెపువ్వు వంటిది; సౌందర్యోపాసకురాలు. అట్టి యామెకు గటికి మొరకుని, మూర్ఖుని, అవినీతిపరుని, దుర్మార్గుని, కుత్సితుని, ముదుసలిని గట్టిపెట్టుట మాతృగర్భచ్ఛేదనముకంటె మహాఘోరము. ఆమె ప్రేమింపదగినది; గౌరవింపదగినది; పూజింపదగినది; తలలో నాలుకవలె పోషించవలసినది; హృదయమున నత్తుకొనవలసినది; తలపై నెక్కించుకొనవలసినది. ఆమె ప్రణయిని, మనము ప్రేమించవలెను; ఆమె గృహలక్ష్మి, మనము గౌరవించవలెను; ఆమె మన బిడ్డలతల్లి, మన మాదరించవలెను; ఆమె మన సహవాసిని, మనము మైత్రిని జూపించవలెను; ఆమె మనక్రీనీడ, మన మాంతర్య మీయవలెను; ఆమెమన కేడుగడ, మనము పూజించవలెను.

విష్ణువు హృదయమున బెట్టుకొనినాడు; బ్రహ్మ సదా స్మరించుచున్నాడు; ఇక శివుడో, యర్ధశరీర మిచ్చి యర్ధనారీశ్వరుడైనాడు; నెత్తిమీద బెట్టుకొని పూజించినాడు. దక్షయజ్ఞమున నామె నశింపగా, నామెకొఱకు సన్న్యాసియైనాడు. మనోవేదనచే బూడిదబూసుకొని దిగంబరుడైనాడు. ఆమెను కీర్తించుటకు దనయొకనాలుక చాలక ఫణి

దానిని మీకొరకే వినియోగింపుడు

మా మహిళా పోషకులకు

మీరు నిలువచేయగలిగిన స్త్రీధనము—
మీ తండ్రి—సోదరుడు—భర్త—పుత్రుడు—
వీరిలో నెవరివద్ద మీ రుంచినను సరే, దానిని
మీకొరకే వినియోగింపుడు.


ఆ ధనముతో నగలుకొని వానిని
మీరు ధరింపుడు.

పురుషు లెల్లప్పుడును..........
ఈ సంగతి మీకు బాగుగా తెలిసియే
యున్నది. కావున మీకు హక్కు-
గల స్త్రీధనము బాంకిలోను నమ్మ
కములేని వాటాల్క్రిందను నిలువబడి
యుండనీయకుడు.

ఆధనము లెల్లప్పుడును మీకంటి
యెదుటనే మీ వంటిమీదనే యుండ
వీలగునట్లు, దానితో మీ కొరకు
సొగసైన నగలను కొనుడు.

మేము తయారుచేయించిన నగల
విలువ యెన్నటికిని తగ్గిపోదు. నగ
లను అందముగా చేయించుటయే
ప్రత్యేకాభిమతము. ఈవిషయమున
మేమే అగ్రగణ్యుల మనికూడ సవి
నయముగ తెలుపుచున్నాము.

మీరు మొదట మావద్ద కొను
నట్టి అలంకారము మీకు మిక్కిలి
సంతృప్తికరముగా నుండుటకే
మేము ప్రయత్నించెదము. అటు
పిమ్మట మీ రెల్లప్పుడును మావద్దనే
కొనుచుందురు. మీ మిత్రులకు
కూడ సిఫారసు చేయుచుందురు.



ఉమ్మిడి రామయ్యశెట్టి గురుస్వామిశెట్టి కంపెని,

బంగారు వెండి నగలను తయారుచేయువారు,

25, చీనాబజారు రోడ్డు — చెన్నపురి. — 62, గోవిందప్పనాయక వీధి

సమూహముయొక్క నాలుకల నెరుపుచెప్పుకొనినాడు. ఆమెను కన్నులారజూచి యానందించుటకు రెండుకండ్లుచాలక మూడవకన్ను ధరించినాడు. ఆమెయందు వలపుచే దెల్లబారిపోయినాడు. ఆమెయందుండు ప్రణయముచే, మోహముచే నామెవేషము సగము వేసినాడు ఆమె ప్రేమభిక్ష నపేక్షించుటకై భిక్షుకుడైనాడు. అర్ధనారీశ్వరుడగు మహేశ్వరుడు మనము, మనభార్యలయెడ నడుచు నడవడి కాదర్శముగ నుండవలెను. అప్పుడే మనము తేజశ్శాలురు, వీర్యవంతులు నగు సంతతిని గందుము. జాతికి, దేశమునకు గీర్తి తేగల కవులు, గాయకులు, నటకులు, చిత్రలేఖకులు, శిల్పులు, కళాప్రపూర్ణులు, విద్వాంసులు, శాస్త్రజ్ఞులు, రాజకీయజ్ఞులు, యోధులు, విజ్ఞానధనులు, భక్తులు, భాగవతులు నుద్భవించుదురు. ఆరోగ్యము, దీర్ఘకాలజీవితము, ఐశ్వర్యము, దయ, దాక్షిణ్యము, సుహృదయత్వము, ఔదార్యము, త్యాగము, ప్రేమ దేశమున తాండవించును.

స్త్రీ కేమాత్రము మనస్సునకుఁ గష్టము కలిగినను మనకు జయము కలుగదు. "కలకంఠకంట గన్నీ, రొలికిన సిరి యింట నుండ నొల్లదు." ఆమె చిరునగవులు మనకు సిరు లిచ్చును. ఆమెయానందము, మనకు నందనోద్యానసౌఖ్యము నిచ్చును. ఆమెతృప్తి మనకు ముక్తి నిచ్చును.

ప్రేమ

వఝ్ఝల వేంకటేశ్వర కవిగారు

బాలరో, యుంచు మొకముద్దుఁ బల్లెరమున,
నింక నాహారమనునది యిచ్చగింప;
హృదయసంభూతమగు దాహ మిపుడుమిపులఁ
గూర్మిఁ బ్రణయామృతముఁ గ్రోలఁ గోరుచుండె;
యుష్మదధరామృతమునకు యువతి, యింద్రుఁ
డమృతము నొసంగనేని వద్దనెదువాఁడ.

* * * *

ము నొక్కగులాబి నీ కంపియున్నవాఁడ;
పరగ నొకసారి దాని వాసన గ్రహించి
ప్రీతి వెండియు నాకుఁ బంపితివిగాదె?
అంత నొక దివ్యవాసన యంకురించె,
నొక్క భవ్య నవ్య విలాస ముద్భవించె;
నా విలాసవాసనలు నీవగును బాల!

నా నెల్లూరుమండల యాత్ర

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు

౧

రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచికలో 'ప్రాచీనాంధ్రభాషా స్వరూప' మనువ్యాసం వ్రాసినప్పటినుంచీ ఆవిషయమును గురించి యింకా ఎక్కువ కృషి చేయవలెననే అభిలాష బలమైంది. అందువల్ల ప్రాచీనాంధ్ర భాషాశాసనాలు పరిశీలిస్తూ ఉండడమూ వాటిలోని విశేషాలు గమనిస్తూ ఉండడమూ జరుగుతున్నది. ఇట్లా ఉండగా ఒకమారు నామిత్రులైన శ్రీయుత వేమూరి విశ్వనాథశర్మగారిని కలుసుకోవడం సంభవించినప్పుడు ఆయాశాసనాలలో నాకు పొడగట్టిన భాషావిశేషాలూ, శబ్దవైచిత్ర్యాలూ మొదలైనవాటిని గురించి ప్రసంగవశమున వారితో కొంత ముచ్చటించాను. దానిమీదట వారు, ఇటువంటి పరిశోధన చేయడానికి ముందు అటువంటి ప్రాచీనాంధ్రభాషా శాసనాలను సంగ్రహించి సరియైన పాఠాలు నిర్ణయించుకోవడం అవసరమని చెప్పినారు. ఇందులో ఉండే యథార్థం కొంత కాలముక్రిందట భారతిలో నేను అద్దంకి, ధర్మవరం శాసనములను ప్రకటించినప్పుడు నాకు గోచరించింది. అందుమీదట నెల్లూరుమండల శాసన సంపుటాలలోని ప్రాచీనాంధ్రభాషా శాసన పాఠాలు సరియైనవి అవునా కాదా అని సందేహం కలిగి, వాటికి సరియైన ప్రతిబింబాలు సంపాదించి సరియైన శాసనపాఠాలు నిర్ణయించడం యుక్తమని తోచింది. ఈవిషయమును గురించి దేశోద్ధారక శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారితో ప్రసంగింపగా వారు సహజౌదార్యంతో నాకు తోడ్పడి నన్ను నెల్లూరిమండల పర్యటనానికి పంపినారు. నాపర్యటన విశేషాలు తెలపడమే ఈవ్యాసంయొక్క ఉద్దేశము.

నేను ముందు కోవూరుతాలూకాకు వెళ్లినాను. కోవూరుతాలూకా విడవలూరులో నాస్నేహితులు డాక్టరు కే. యస్. ప్రసాదరావుగారున్నారు. ఆచుట్టుపట్ల గ్రామాలలో శాసనాలు ఉన్నట్లు తాను విన్నాననీ నేను అక్కడికి వచ్చేటట్లయితే ఆచుట్టుపట్ల గ్రామాలకు తానుకూడా వస్తాననీ ఆయన నాకు ఉత్తరం వ్రాశారు. అందుచేత కొడవలూరుస్టేషనులో రైలుదిగి విడవలూరికి వెళ్లాను.

నెల్లూరుజిల్లాలోని చాలాగ్రామాలలో ఉన్నట్లే ఈ గ్రామంలోకూడా ప్రాచీన విగ్రహాలూ మొదలైనవి చాలాఉన్నవి. విడవలూరు గ్రామంనుంచి రెండుమైళ్ల దూరంలో ఊటుకూరికి పోయేరోడ్డుకి ఎడమపక్క మారెళ్లమ్మ, కుడిపక్క వెలగలమ్మ అని రెండు శిలావిగ్రహాలు ఉన్నవి. వెలగలమ్మ, మారెళ్లమ్మ అనేపేర్లు ప్రజలు ఇటీవల పెట్టినవిగా కనబడుతవి. ఎందుచేతనంటే ఆవిగ్రహాలను చూచినట్లయితే అవి పౌరాణిక సంబంధమైన శక్తులుగానో తాంత్రికసంబంధమైన శక్తులుగానో కనిపిస్తవి కాని పట్టి గ్రామదేవతలవలె కనబడవు.

వెలగలమ్మ విగ్రహం చిన్నది. రాయి పొరలు లేచి పోయి శిథిలావస్థలో ఉంది. మారెళ్లమ్మ విగ్రహం పెద్దది. అయితే యిది సగంవరకు భూమిలో పూడిపోయింది. పైకి చేతులూ, తలా మొదలైనవి మాత్రమే కనబడుతున్నవి. వెలగలమ్మ విగ్రహం అంతగా చెడిపోలేదు. ఇప్పుడు లేదుకాని మారెళ్లమ్మకు పూర్వం కొంతప్రభావమూ, మహత్తూ ఉండేదంటారు. అందుకు తార్కాణంగా ఒకకథ చెప్పుతారు. అది ఏమనంటే:

వెనుక ఎప్పుడో ఒకమాటు లంబాడీలు తండాలుగా వచ్చి ఆశక్తిఉన్నస్థలంలో దిగుతుండేవారట. ఎవరైనా వాళ్లను అమ్మకానికి ఏం సరకు తెచ్చారని అడిగితే తెచ్చిన అసలుసరకు చెప్పక మరొకసరకుపేరు చెప్పుతుండేవారట. ఇట్లా చెప్పుతుంటే ఆమరునాటి ఉదయానికి ఆ లంబాడీవాళ్లు తమసంచులు విప్పిచూచుకొనేసరికి తాముతెచ్చిన సరకుకాక చెప్పినసరకే వాటిలో ఉండే

దట. అందుమీరట వారు భయపడి అదంతా తాముదిగిన స్థలప్రభావం: అమ్మవారి ప్రభావం అని ఆయమ్మకు [మొక్కుకొని దీపారాధనలూ మొదలైనవి చేస్తూఉంటే తిరిగి తాము తెచ్చినవరకే సంచులో ఉండేదట. ఇట్టి కథలు చాలాచెప్పుతారు అక్కడివారు. మారేళ్లమ్మప్రభావం పూర్వం అటువంటిదట.

ఇంకా కొంచెందూరం ముందుకుపోతే పడమటివైపు పోయేపుంతలో రోడ్డుకి కొంచెం సమీపంగానే 'పెండి రాయి' అనే శిలాఫలకం ఉంది. దానిని అక్కడివారు 'కుంకుమాలక్ష్మి' అంటారు. ఈరాతిపలకమీద విగ్రహం ఏమీ లేదు కాని అదికూడా ఒక శక్తి అనీ, దానికికూడా పూర్వం కొంత ప్రభావం ఉండేదనీ అంటారు. 'కుంకుమాలక్ష్మి' క్రింద ధనం పూడ్చిపెట్టి ఉన్నదని కొంతకాలం క్రితం మాలవాడొకడు దానిని తవ్వినాడనీ, కొంత లోతు తవ్వగా వాడు రక్తం కక్కుకొని చచ్చిపోయినాడనీ చెప్పుతారు. 'కుంకుమాలక్ష్మి'రాయి భూమిలో చాలావరకు పూడిపోయి ఉంది. ఆరాతిమీద తూర్పువైపు వ్రాతఏమీ కనిపించలేదు కాని పడమటితట్టు దిగువభాగంలో అక్షరాలు కనిపిస్తే నామిత్రులు ప్రసాదరావుగారినీ, ఉత్సాహంగల ఆడపాల లక్ష్మీవరసారెడ్డిగారు మొదలైన మరికొందరు యువకులనూ తీసుకువెళ్లి ఆరాతిని తవ్వించినాను. తవ్వించి రాతిదిగడిగి చూడగా అక్షరాలు స్పష్టంగా ఉన్నవి. అదొక పెద్దశాసనమే అంతా అరిగిపోయింది. ఇక్కడ ఒకొ అక్షరమూ అక్కడ ఒక అక్షరమూ కనిపిస్తున్నది. అవి చాళుక్యలిపిలో ఉండడముచేత శాసనం నన్నయభట్టారకునికి పూర్వపు దన్నమాట వాస్తవమే. కాని ఏం ప్రయోజనం! నన్నయభట్టారకునికి పూర్వపు తెలుగుశాసనం ఒకటి కొత్తది కనిపించిందన్న సంతోషం తాత్కాలికమే అయింది.

ఈ రాతికి దక్షిణంవైపు ఒకపాటి దిబ్బఉంది. ఆ దిబ్బ నెవరో యిదివరకే తవ్వినట్లు కనిపిస్తుంది. అక్కడ ఇటికలపేర్పులూ, గుట్టలూ ఉన్నవి. అవికాకుండా అక్కడ పూడిపోయిఉన్న లింగంతాలూకు ఊర్ధ్వభాగం ఇంచుమించుగా ఒక అడుగువరకు పైకి కనిపిస్తున్నది. అక్కడ తవ్వితే ఏదైనా ప్రాచీన శివాలయంతాలూకు శిథిలాలేవైనా కనబడుతవేమో.

విడవలూరు ఊళ్లో 'పోలేరమ్మ మిట్ట' అని ఉంది చిన్నదిబ్బఒకటి. అక్కడ ఒకరాయిఉన్నది. దానికి పసుపురాసి కుంకంపట్టీలుపెట్టి 'పోలేరమ్మ' అని పేరు పెట్టి అక్కడివాళ్లు పూజలుచేస్తున్నారు. దానికొక చిన్నతాటాకుల గుడిసె వేశారు. ఆరాతిదగ్గర రామపటాలు కాబోలు పెట్టినారు. దానిమీద ఏవో అక్షరాలు ఉన్నవని చెప్పితే,అది పరిశీలించాను. తీరాచూస్తే అది పోలేరమ్మాకాదు ఏమీకాదు; పెనుగొండ రాజధానిచేసుకొని కర్ణాటకరాజ్యం పరిపాలించిన రంగరాయదేవ మహారాయలవారి శాసనం క్రీ. శ. ౧౫౮౫ నాటిది. కర్ణాటరాజాలు కట్టించిన చెరువొకటి ఉంది విడవలూరికి. అది చాలాపెద్దది. దానిక్రింద ఇప్పటికీ చాలాభూమి సేద్యమవుతున్నది. అది రంగరాయదేవమహారాయలవారి నాటికి ఖిలపడివుంటే విడవలూరు ప్రాంతానికి అప్పుడు ప్రభువులుగాఉన్న కోనేటి చినతిమ్మానాయనింగారు ఆచెరువు తిరిగి బాగుపడేటందుకు తగు కట్టుబాటులు చేసి ఒకధర్మశాసనం వేయించారు. ఆశాసనం యిది: ఇప్పుడు పోలేరమ్మగా మారి గ్రామస్థులవల్ల బలినైవేద్యాలు మొదలైనవి పుచ్చుకొంటున్నది. ఆయన చేసిన కట్టుబాటులుగల శాసనభాగ మిది:

"గ్రామానకుపుండిన నానాధాన్యానకు నగరికమతాలమలువులను భటవృత్తి మాన్యాలనునహా వి త్తిన పుటికల పుట్టికి కుంచెడు పేర సాగిం స్తిమి మాన్యంచెరువు కిందను బాడవలోని దక్షిణం మారుకుంటలు ఇస్తిమి మాన్యం వల్లను పుట్టి కుంచాలవల్లను యీట వచ్చినవి యీంట చెరువుమీంద పని శేయుటకు ఇట్లని యిచ్చినధర్మశాసనం"

ఈ శాసనంవల్ల విజయనగరాధీశులనాడు వ్యవసాయానుకూల్యములైన చెరువులూ మొదలైన నీటివసతులు ఎట్లా కాపాడేవారో తెలుస్తుంది. అప్పుడు 'డి.పి. డబ్ల్యు. డిపార్టుమెంటు' ఉండేదికాదు. ఒక్కొక్క గ్రామంలో ఉండే చెరువులూ, బావులూ మొదలైన

వాటిని సంరక్షించడమూ, ఆ నీటిని సరాసరి రైతులకు వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా పంచులుకట్టి యిస్తూ ఉండడమూ ఈ మొదలైన అధికారాలన్నీ గ్రామస్థులకే ఉండేవి. ఏ గ్రామంలో ఉండే యిబ్బందులు ఆ గ్రామంవారికే బాగా తెలుస్తవి. అందువల్ల అటువంటి అధికారాలు వారికిందే ఉంటే తమకనుకూలమైన రీతిని నీటిని ఎట్లా సర్దుకోవాలో వారే చూచుకొంటారు. చెరువు కింద బాడవలో ఇచ్చిన మాన్యంవల్లనూ, గ్రామంలో వసూలయిన పుట్టికుంచాలవల్లనూ తిమ్మనంగారు వేయించిన ధర్మశాసనప్రకారం చెరువు మరమ్మతుచేసుకొని విడవలూరు గ్రామస్థులు సేద్యం చేసుకొంటూ సుఖాన ఉండేవారు. ఇటువంటి స్థానికవిషయాలలో పై అధికారులకు గ్రామస్థులమహాజర్లు లేవు, అధికారుల నిగ్రహానుగ్రహాలు లేవు

కొత్తగా బయలుపడ్డ శిలాశాసనాలు ఉన్నవని ఎవరో కబురుచెప్పితే విడవలూరినుంచి అల్లూరు వెళ్లినాము. అవూళ్లో కొంతకాలంక్రితం పాటిదిబ్బలు తవ్వుతుండగా లింగం, పానవట్టం, ఇంకా ఏవో కొన్ని విగ్రహాలూ, రాళ్లూ మొదలైనవి బయలుపడ్డవట. అక్కడ శిలాశాసనాలు ఏవైనా కనబడుతవేమో అని చాలా వెదకినాముకాని కార్యం లేకపోయింది. ఒక పాటిదిబ్బకు కొంచెందూరాన్ని ఒక పెద్దరాతి పలక కనబడింది. అది నేలమీద పడివుంది. దాని పైభాగమున వ్రాత ఏదీలేదు. రెండోవైపు వ్రాత ఏదైనా ఉన్నదా అని గ్రామస్థుల నడిగితే 'ఏమో ఎవరికీ తెలియదు. అనాదికాలంనుంచీ అది అట్లే ఉన్నదని జవాబు చెప్పినారు. రెండోవైపు ఏమున్నదో తిరగదీసి చూదామని ప్రయత్నం చేస్తే గ్రామస్థులు బ్రాహ్మణులూ మొదలైనవారు 'అది మంచిపనికాదు. రక్తం కక్కుకొని చస్తారు. ఇటువంటి పూర్వపురాళ్లు తవ్వడమూ తిరుగవేయడమూ చాలా ప్రమాదకర'మని వారంతా దూరదూరంగా తొలగి నుంచున్నారు. నాతో ప్రసాదరావుగారూ మరికొందరూకూడా విడవలూరినుంచి వచ్చారు. గ్రామస్థు లేమన్నాసరే అని నాతో వచ్చినవారి సాయంతో ఆరాతిని తిరగదీయించాము. మేము తిరగదీస్తూ ఉండగా అవూళ్లో సంసారులు—నెల్లూరుమండలంలో చతుర్థవర్ణం వారిని సంసారులంటారు—కొందరు 'తెగించి' మాకు తోడు పడ్డారు.

రాతిని తిరగదీసి చూస్తే దానిమీద శాసనము ఏదీ కనిపించలేదుకాని చక్కగా చెక్కిన ఏడు శక్తి విగ్రహాలుమాత్రం కనబడ్డవి. (చిత్రాలు ౧, ౨) ఆచెక్కడపుపని బాగున్నదికాని ముఖాలు కొన్ని అరిగీ, కొన్ని—పిల్లలవల్లనో ఏమో—చెక్కులు తినీ ఉన్నవి. ఆవిగ్రహాలుచూస్తే వాటిని చాలాకాలంక్రితమే చెక్కి ఉండాలని తోచింది. (బహుశా ఒకటిరెక్క) అవి అన్నీకూడా పీఠాలమీద ఎడమకాలు ముడుచుకొని, కుడికాలు కిందికి వేలాడవేసి సుఖాసనమున కూర్చున్నవి. ప్రతీశక్తికీ నాలుగేసి చేతులు: రెండు కుడిచేతులూ, రెండు ఎడమచేతులూను. ప్రతీశక్తికీ ఒక కుడిచెయ్యి అభయమిస్తున్నట్టూ (అభయహస్తం), ఒక ఎడమచెయ్యి ముడుచుకొన్న ఎడమకాలి తొడమీద పెట్టుకొన్నట్టూ చెక్కినారు. మిగిలిన చేతులలో ఆయాశక్తులకుండే ఆయుధాలూ మొదలైనవి ఉన్నవి. ఈయేడు శక్తులకూ 'సప్తమాతృక'లని పేరు. హిరణ్యాక్షుని కొడుకైన ప్రహ్లాదుడు పరమభాగవతోత్తముడై సర్వసంగపరిత్యాగం చేసినమీదట అంధకాసురుడనేవాడు రాక్షసులకు రాజై చాలాకాలం హిరణ్యాక్షాదులవలెనే ఘోరతపస్సుచేసి బ్రహ్మవల్ల అనేక వరాలుపొంది దేవతలను హింసించడం మొదలుపెట్టితే వారంతా కైలాసానికిపోయి శివునితో తమబాధలన్నీ విన్నవించుకొన్నారట. అందుమీదట దేవహితం కోరి శివుడు అంధకాసురునిపైకి వెళ్లి ఘోరయుద్ధంచేసి అతనిని సంహరించాడు. ఆయుద్ధంలో శివుని బాణాలు తగిలి అంధకాసురుని వొంటినుండి రాలి నేలమీదపడ్డ ప్రతీరక్తపుచినుకులోనుంచీ మళ్లీ ఒక్కొక్క అంధకాసురుడు పుట్టేవాడట. ఇట్లా వందలూ వేలూ కొత్తగా అంధకాసురులు తయారయ్యేవారట. ఇదంతా చూసి శివుడు అంధకాసురరక్తం నేలమీద పడకుండా ఆపడానికి తననోటి మంటలోనుంచి 'యోగేశ్వరి' అనే శక్తిని పుట్టించాడట. బ్రహ్మాది ఇతరదేవతలున్నూ ఇందునిమిత్తమే

తమతమ శక్తులనుకూడా పంపినారట:—(౧) బ్రాహ్మి (బ్రహ్మశక్తి), (౨) మాహేశ్వరి (మహేశ్వరశక్తి), (౩) కౌమారి (కుమారస్వామిశక్తి), (౪) వైష్ణవి (విష్ణుశక్తి), (౫) వారాహి (వరాహస్వామిశక్తి), (౬) మాహేంద్రి (ఇంద్రునిశక్తి), (౭) చాముండి (యమశక్తి), అని వాటిపేర్లు. ఇవే సప్తమాతృకలు. కొందరు యోగేశ్వరినీ, కొందరు మహాలక్ష్మినీ కలిపి వీటిని అష్టమాతృకలంటారు. ఏవరెవరి శక్తులు వారు వారు ధరించే ఆయుధాలూ, ఆభరణాలూ ధరించి, వారువారు ఎక్కే వాహనాలే ఎక్కుతవి. బ్రాహ్మికి హంసా, మాహేశ్వరికి వృషభమూ, కౌమారికి నెమలీ, వైష్ణవికి గరుత్మంతుడూ, వారాహికి దున్నపోతూ, మాహేంద్రికి ఏనుగూ, చాముండికి శవమూ వాహనములట. సాధారణముగ ఈ సప్తమాతృకా విగ్రహాలు అన్నీ ఒకే శిలాఫలకంమీద చెక్కుతుంటారు. కొన్ని కొన్ని చోట్ల ఈ సప్తమాతృకా విగ్రహాలతోపాటు ఆఫలకంమీదనే భైరవవిగ్రహమున్నూ చెక్కడము కలదు. ఈసప్తమాతృకా విగ్రహాలు సాధారణంగా శివాలయాలలోనూ, కొన్ని కొన్నిచోట్ల గ్రామదేవతల గుళ్లలోనూ కూడా కనుబడుతవి. చెక్కడములో ఈవిగ్రహాలవరుస ఒక్కొక్కచోట ఒక్కొక్కవిధంగా ఉంటుంది. బ్రాహ్మీశక్తి మధ్యగా ఉంటే గ్రామానికి క్షేమమనీ, శత్రునాశనమనీ అంటారు, చాముండి మధ్య ఉంటే గ్రామంలో ప్రజాభివృద్ధి ఉంటుందంటారు. ఆర్లపాటిలో కనబడ్డ సప్తమాతృకా విగ్రహాలలో వారాహి మధ్య ఉన్నది. సప్తమాతృకలచేత, అభివృద్ధిపొందినవారమని తమశాసనాలలో చాళుక్యవంశపు రాజులు చెప్పుకొంటూ వచ్చారు. సప్తమాతృకాదులకు సంబంధించిన గాథలు వారికాలంనుంచే భాగావాడుకలోనికి వచ్చినవేమో.

ఆర్లపాటి కయ్య (చేను)లో ఒకచోట ఒకశాసనశిల కయ్యగట్టున నేర్లబెట్టి ఉంది. దానిమీద 'నెల్లూరి మనుమకేశవనాథదేవర నిధి, పెదపొర్లపల్లి' అని ఉంది. ఈ తెలుగుఅక్షరాలు విజయనగరంరాజుల కాలంనాటివి: పదహారవ శతాబ్దిలోవి కావచ్చు.

ఆర్లపాటినుంచి బిడవలూరు పోతూఉంటే ముదివర్తిగ్రామం వెట్టివాడు ఒకడు కనబడి అన్నవరప్పాడు, అలగనంపాడు 'సంఘు'లో ఒకశిలాశాసనం ఉందని చెప్పినాడు. ఆమరునాటిఉదయం వెంకనపాళెం, చౌకచర్ల మొదలైన గ్రామాలకు వెళ్లాలని ఉండడంచేత ప్రసాదరావుగారినీ వారిమిత్రులనూ తీసుకొని ఆరాత్రే భోజనంచేసి అన్నవరప్పాటికి వెళ్లినాను. అన్నవరప్పాటి కాపులుకూడా మాకు కొందరు తోడుగా వచ్చారు. ఇంతమందిమీ పోయి అక్కడ చూస్తిమికదా అది 'సర్వేరాయి' కాని 'శాసనశిల' కాదని తేలింది. ఆశోపహతులమై మేమంతా వచ్చినదారినిబట్టి పోయినాము.

ఆమరునా డుదయం మిత్రులైన ప్రసాదరావుగారిని తీసుకొని వడ్డిపాలెం, ముసలారెడ్డిగుంట మీదుగా వెంకన్నపాలెం వెళ్లినాను. ఆవూళ్లో మహాలక్ష్మమ్మగుడి అని ఉన్నది. ఆగుళ్లోనే శాసనశిల ఉంది. ఆశిలకు పసుపురాసి కుంకంపెట్టి దేవతగా భావించి దాన్ని పూజచేస్తున్నారు. ఆశాసనశిలతోపాటు ఆగుళ్లో అమ్మవారి ఉత్సవవిగ్రహమున్నూ, ఒకయంత్రమున్నూ ఉన్నవి. ఈ శాసనశిల ఊరికి తూర్పువైపు ఎక్కడో ఒకకయ్య(చేను)లో ఉండగా దానిని వెంకనపాలెం కాపులుఊళ్లోకి తీసుకువచ్చి ఇప్పుడు మహాలక్ష్మమ్మ దేవళానికి సమీపాన్ని ఉన్న బావిదగ్గర పడవేసి కపిలకు ఉపయోగిస్తుండేవారట. ఇట్లా చేసేటప్పటికి కపిలకుకట్టేయెద్దులు రెండూ చనిపోయినవట. ఆశిలను కపిలకు వాడినందువల్లనే ఈఉపద్రవం సంభవించిందని అప్పటినుంచీ దానిని బావిదగ్గర నుంచి తీసి నడివీధిలోకి తీసుకొనివచ్చి అమ్మవారుగ భావించి పూజిస్తున్నారు. అటుతరువాత మహాలక్ష్మమ్మగుడి కట్టడమూ, ఈశిల అందులో చేరడమూ సంభవించింది. ఇప్పటికీ ఆ'మహాలక్ష్మమ్మ' విగ్రహానికీ ఈశాసనశిలకూ పూజాపురస్కారాలు చేస్తూ వడపప్పు పానకాలు నివేదిస్తూ ఆరాధిస్తున్నారు. శాసనశిలే ముందువచ్చిందనీ, పిదపనే 'మహాలక్ష్మమ్మ' ఉత్సవవిగ్రహమూ, యంత్రమూ వచ్చినవనీ తెలిసింది. ఆశాసనశిలమీది అక్షరాలు చదువవలసియున్నదని నేను చెప్పగా అర్చకులు స్నానంచేసి మడి

కట్టుకొని మంత్రపూతంగా ఆశాసనశిలను కడిగి నన్ను దానిమీది అక్షరాలు చదువుకోవచ్చునని చెప్పినారు. ఆశాసనశిలకు ప్రతిబింబములు కూడా తీసుకొంటానని వారితో చెప్పినాను. అప్పుడు అర్చకులు సూరం సుబ్బరామయ్యగారు—చాలా సాధువులు, దైవభక్తి పాపభీతీ కలవారు; ఆచారపరులు, మంచివారు—ఈయమ్మవారు మహత్తువల్లనే ఆగడ్డను విషూచీ, మసూచీ యేవిన్నీ రావడము లేదనిన్నీ, ఆశిలమీదవి బీజాక్షరాలని నమ్ముతున్నామనిన్నీ, ప్రతిబింబం తీసుకోకతప్పనిసరి అయితే మైల బట్టతో కాకుండా స్నానంచేసి మడికట్టుకొని తీయవలసిందనిన్నీ చెప్పినారు. వారిమనస్సు నొచ్చకూడదని వారు కోరినప్రకారమే దగ్గరఉన్న బావిదగ్గరకుపోయి స్నానంచేసి వారిచ్చిన మడిబట్టలుకట్టుకొని ఆశాసనాలకు ప్రతిబింబాలుతీశాను. కపిలలో వాడుక చేసినందువల్ల రాయి చాలా చెడిపోయింది. దానికొకవైపున అరవ శాసనం ఉన్నది. క్రీ. శ. పదమూడో శతాబ్దిలో కూడా నెల్లూరుమండలం తంజావూరు చోళరాజుల పరిపాలనలో ఉండడంచేత నెల్లూరుమండలంలో అరవశాసనాలు కనబడుతుంటవి. ఈ శాసనం కొంచెమించు ఆ నా టి దే; కాని బాగా అ రి గి పో యిం ది. శాసనానికి ఎగువభాగాన శంఖచంక్రాలు— అనుకొంటాను—చెక్కబడిఉన్నవి. రెండోవైపున విజయనగరం రాజులనాటి తెలుగుశాసనం ఉంది. అదికూడా చాలా అరిగిపోయింది. అంతేకాకుండా శాసనశిల ఆవైపున గంట్లూ గుంటలూపడి చాలా ఎగుడుదిగుడులుగా ఉంది. అందువల్ల తెలుగుశాసనానికి ప్రతిబింబం తీసుకోవడానికి వీలూ, తీసుకొన్నందువల్ల ప్రయోజనమూకూడా లేక పోయింది. ఊరికి తూర్పువైపు ఎక్కడనో దేవాలయం ఉండేదనీ, ఈశాసనశిల అస్థలంలోనుంచే ఊళ్లోకివచ్చిందనీ పెద్దలు చెప్పేవారని సుబ్బరామయ్యగారు చెప్పినారు.

ఆపూట్లో భోజనంచేసి చౌకచర్లలో శాసనమున్నదంటే అక్కడికి వెళ్లినాము. చౌకచర్ల తలమంచినుంచి సుండ్లపాలెంవైపు పోయేరోడ్డుమీద ఉన్నది. చౌకచర్ల గ్రామందగ్గర రోడ్డుకు దక్షిణంవైపు ఒకచెట్టుక్రింద ఒక విగ్రహం ఉంది (చిత్రం 3). అది సగంవరకూ పూడిపోయి ఉంది. అక్కడివాళ్లు దానిని 'చౌకచర్ల అయ్యపనాయడు' అంటారట. ఆశిలమీద యోధుడైన అయ్యపనాయని విగ్రహము చెక్కబడిఉన్నది. అయ్యపనాయడు ఎవరినో పొడవడానికి ఈటె నెత్తినట్లున్నది. అతని మెడలో కుడివైపుకైజారు ఉంది. ఎడమవైపు ఏదో (?) ఆయుధం ఉంది. అతనికి కుడి, ఎడమవైపుల స్త్రీవిగ్రహాలుఉన్నవి. ఎడమవైపున్నవిగ్రహం కొంచెం స్పష్టముగా ఉన్నది. కుడివైపున్నది చాలా అరిగిపోయినది. అయ్యపనాయడియొక్క శిరోవేష్టనమూ, దుస్తులూ మొదలైనవి చూస్తే అది మూడు నాలుగువందలేళ్ళ కిందట ఉన్న అమరనాయకుడియొక్కకాని, పాళెగాని యొక్కకాని విగ్రహమై ఉంటుందని తోచింది.

నేను పట్నం వచ్చిన తరవాత ఆవిగ్రహం ఫోటో తీసి పంపవలసిందని మిత్రులు ప్రసాదరావుగారికి వ్రాశాను. ఆయన అక్కడికి వెళ్లి ఫోటో తీయడానికి ఆవిగ్రహాన్ని వైటికి తీస్తూఉంటే ఆచౌకచర్ల గ్రామస్థులు ఆవిగ్రహం క్రింద ఏవో నిధినిక్షేపాలు ఉన్నవనీ, అవి తీసుకుపోవడానికి ఆయన వచ్చినాడనీ చాలా గందరగోళంచేసి ఆయనను తిట్టి తుదకు ఆవిగ్రహాన్ని కదిపినందుకు మేజస్ట్రీటుగారికి ఆయనమీద కంప్లెయింటు దాఖలుచేసినారట! పూజాపురస్కారాలు లేకుండా, ఆలనాపాలనా లేకుండా ఉన్న ఈవిగ్రహముపట్ల వారికీసందర్భమున కలిగిన ఆదరాభిమానములకు ఎంతో మెచ్చుకోవలసిందే, కాని అట్టి అభిమానం వారికి ఎప్పుడూ ఉంటేనే అది నిజమైనదని అనుకోవడం తటస్థిస్తుంది. పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారు ప్రసాదరావుగారిని కలుసుకొని సంగతి సందర్భములు విచారించిన పిదప కేసు కొట్టివేశారు. చరిత్ర తెలుసుకోవాలనే సదభిలాషతోనే పరిశోధన సాగించినప్పటికీ కొన్నికొన్నిచోట్ల ఇటువంటి చిక్కులు తటస్థిస్తూ ఉంటవి.

చౌకచర్ల అయ్యపనాయని విగ్రహం క్రీ. శ. పదిహేను, పదహారు శతాబ్దాలలో ఉండే తెలుగు యోధుని వేషమూ మొదలైనవి తెలియజేస్తూ ఉండడముచేత అది జాగ్రత పెట్టవలసిందగును. అభిమానవం

తులైన చౌకచర్ల గ్రామవాసులు ఇప్పటికైనా దాని మీద అభిమానముంచి దాని రక్షణకు తగిన ఏర్పాటులు చేస్తే మేము చేసిన కృషి వ్యర్థం కాలేదని సంతోషిస్తాము.

అటుతరువాత ఊళ్ళోకి వెళ్లి శాసనం చూచినాము. అది శాసనంకాదు. బీజాక్షరాలు చెక్కిన కలరాయంత్రము. నెల్లూరు మండలంలో కొంచెమించుగ ఏ గ్రామానికి వెళ్లినా ఈయంత్రాలు కనబడుతుంటవి. వీటిని సాధారణంగా కర్రపలకలమీదగాని, రాళ్లమీదగాని చెక్కుతారు. ఇవి ఊరిగవిడి (మొగదల)లో పాతివేసి ఉంటవి. ఈయంత్రాలున్న ఊరికి విషూచి, మశూచికాదులు రావని వాడుక కాని ఇవి ఉన్నప్పటికీ అటువంటి జాడ్యాలు రావడం మామూలే అవుతున్నది. కొన్నికొన్ని చోట్ల వీటిని 'శీతలయంత్రా'లని కూడా అంటారు. చౌకచర్లలో ఇంతకు తప్ప వేరే శాసనం లేదు.

అక్కడనుంచి తుమ్మగుంట వెళ్లాము. ద్రావిడులలో కొందరికది కాణాచి. అందువల్లనే వారికి తుమ్మగుంట ద్రావిడులని పేరు. ఇప్పటికీ ఆవూరినిండా ఉన్నవారు ద్రావిడులే. ఆవూళ్లో కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో గర్భగుడిగుమ్మం తవాటీరాళ్ల మీద రెండుశాసనాలున్నవి. కాని అవి చెక్కిఉన్న రాయి పొట్లిపోతున్నది. రాతికి ఏమాత్రము అదుముదుతగిలినా అది పొడిపొడి అయి పొసిరాలిపోతున్నది. అందువల్ల శాసనాలుండీకూడా ప్రతిబింబాలు తీయడానికి వీలులేకపోయింది. రాయి చాలా అరిగిపోవడంచేత శాసనాన్ని రాతినుంచి చదవడానికైనా వీలులేకపోయినది. వెనక ఎప్పుడో కొంతకాలం క్రితం కొన్ని రాగిశాసనాలు దొరికినవనీ, అవి దొరికిన తరువాత, దొరకినవారికి ఏవో అరిష్టాలు సంభవించినవనీ, అందుమీదట వారు వాటిని ఒకనూతిలోనో ఎక్కడో పారవేశారనీ చెప్పుతారొక కథ అక్కడివారు. అదికథో: నిజమో! దాని నిజంసంగతి ఏమిటో తెలుసుకోవాలని ప్రయత్నిస్తే నిజం తెలిసిందికాదు కాని పాఠాంతరాలు కొన్ని దొరికినవి. ఆశోపహతులమై మళ్లీ విడవలూరు చేరుకొన్నాము.

ఈపర్యటనంలోనే చరిత్రప్రసిద్ధమైన ఉదయగిరి దుర్గమునూ, ప్రాచీనప్రసిద్ధికలిగిన 'దుగ్గిరైరవుడికోన' గుహాలయములనూ చూడవలెననుకొన్నాను. ఈవిషయం ప్రసాదరావుగారికి చెప్పేటప్పటికి ఒకటిరెండు రోజులు ఆయనకూడా నాతో వస్తానన్నారు.

మే మిద్దరమూ విడవలూరిలో రైలుదేరి కొడవలూరికి వచ్చి అక్కడ రైలెక్కి సాయంత్రం నాలుగు నాలుగున్నర గంటలకు కావలి చేరుకొన్నాము. రైలు దిగేసరికి ఉదయగిరి వెళ్లే 'బస్సు' సిద్ధంగా ఉన్నది. వెంటనే 'బ'స్సెక్కి ఉదయగిరికి రైలుదేరినాము.


కావలికి ఉదయగిరి అరవై మైళ్ల దూరమున ఉన్నది. దారిలో జమ్మలపాలెం, జలదంకి, చిన్నక్రాక, కొండాపురు, పోలంపాడు, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు మొదలైన ఊళ్లు చాలా తగులుతవి. వీటిలో జలదంకి, వింజమూరు, కలిగిరి మొదలైనకొన్ని ఊళ్లలో మంచి చెరువులు ఉన్నవి. నెల్లూరుమండలములో ఉండే చెరువులలో కందుకూరు తాలూకాలోని మాచవరం, పొన్నలూరు చెరువులూ, కావలితాలూకాలోని జాటూరు, మోపాడు ప్రాజెక్టు చెరువులూ, కోవూరుతాలూకాలోని కనిగిరి జలాశయమూ, నెల్లూరు తాలూకాలోని సర్వేపల్లి నెల్లూరు, మనుబోలు చెరువులూ, ఆత్మకూరుతాలూకాలోని అనంతసాగరం, కలువాయి చెరువులూ, గూడూరు తాలూకాలోని కోటపెంక గూడూరు రేవూరు చెరువులూ చాలా గొప్పవి. మొత్తము మీద నెల్లూరు మండలంలో చెరువులు చాలా ఎక్కువ. చిన్నవైతే నేమి, పెద్దవైతే నేమి మొత్తంమీద ఈమండలంలో ౬౩౪ చెరువులు ఉన్నవి. వీటిలో కొన్నిటికి నీరు నదులలోనుంచి వచ్చినప్పటికీ వర్షాధారపు చెరువులే అనేకములుగా ఉన్నవి. ఇటువంటివి ప్రతీ తాలూకాలోనూ కనబడతవి. కాని నీటిసప్లైకాలువలు చాలా చెడిపోవడంచేత కొన్నికొన్ని చెరువులు మంచిస్థితిలో లేవు.

నెల్లూరుమండలంలో చెరువులను కట్టుతారు కాని గోదావరి, కృష్ణా డెల్టాలలోవలె తవ్వరు. చెరువు లెట్లా

కట్టవలెనో, ఎట్టిప్రదేశాల కట్టవలెనో, మంచిచెరువుకు వుండవలసిన లక్షణాలేమిటో, ఉండగూడని దోషాలేమిటో-ఇవిఅన్నీ ఒకశాసనంలో వ్రాయబడి ఉన్నవి (చూడుడు: నా 'ఆంధ్రదేశము: తటాకములు' అను వ్యాసము-చిత్రాడ, ఆంధ్రపరిశోధక మహామండలి పంచమవార్షికోత్సవ సంచిక). సాధారణంగా ఇటువంటి చెరువులన్నీ కొండలకు పరిసరమున ఉంటవి. కొన్నికొన్ని చోట్ల కొండలే చెరువుయొక్క పోతగట్టులుగా కూడా ఏర్పడుతవి. ఒకవేళ కొండలు ఒకదాని కొకటి ఎడమెడముగా ఉన్నప్పటికీ వాటిని పోతగట్టుపోసి కలిపివేస్తారు. ఇట్లా రెండుమూడు వైపుల కొండలుంటే నాలుగోవైపు పోతగట్టుఉండి అదొక పెద్దచెరువుగా ఏర్పడుతుంది. కొండలమీదకురిసిన వర్షమంతా చెరువుగా ఏర్పాటయిన పల్లంలోకి చేరుకొంటుంది. కొండలమీద కురిసినవర్షపు నీరు ప్రవహించేమార్గాలే చెరువులకు నీటివనరులుగాను సప్లైకాలువలుగాను ఉంటవి. ఇటువంటి వర్షాధారపు చెరువులవల్ల నెల్లూరుమండలంలోని కొన్నికొన్ని తాలూకాలు కృష్ణా, గోదావరిడెల్టా ప్రదేశాలవలె పచ్చని వరి పైరుతో కలకల లాడుతుంటవి. కావలినుంచి ఉదయగిరి పోయే మార్గమంతా_అది అసలు రాతిప్రదేశమైనా_ చక్కని వరిపంటలతో చూడ ముచ్చటగా ఉంటుంది. ఈచెరువుల ఆధారమున రైతులు రెండవపంట(దాళవా) కూడా పండిస్తారు.

ఈచెరువులలో చాలాభాగం విజయనగరంరాజులనాడు కట్టించినవే. నెల్లూరు మండలంలోని విజయనగరం రాజులనాటి శాసనాలు తిరగవేస్తే వాటిలో చెరువు ధర్మశాసనాలే ఎక్కువగా కనబడుతవి_ కొత్తగానిర్మించిన చెరువులకు సంబంధించినవో, లేక ఖిలపడివున్న చెరువులను 'పూర్జితం' చేయించడమునకు సంబంధించినవో. తటాకనిర్మాణం సప్తసంతానాలలో ఒకటి గనుక పుణ్యం కలుగడానికి పూర్వులు ధర్మచింతతో చెరువులు కట్టించేవారు. కట్టించిన చెరువులన్నీ సురక్షితంగా ఉంటవనీ, పూడిపోకుండా ఉంటవనీ ఎవరు చెప్పగలరు? ఇటువంటి నీటివసతులు కాపాడడానికి ఇప్పటివలె డి. పి. డబ్ల్యు. డిపార్టుమెంటు ఉండేది కాదు. అందువల్ల వాటిరక్షణ ప్రజలమీదను అది కట్టించిన వారిమీదను పడేది. ఏవిధమైన ప్రతిఫలమూ లేకుండా వాటిని సంరక్షిస్తూ ఉండవలసినదని ఎవరినడిగితే ఎవ రంగీకరిస్తారు? అందువలననే ఇట్టి సందర్భాలలోనే 'దశబంధంమాన్యం' అనే మాన్యంపుట్టింది. ఇది ఈనాము. చెరువులు పూడిపోకుండా జాగ్రత పెట్టుతుండే కొరకును, వాటిని అవసరమయినట్టయితే మరమ్మతులు చేసేటందుకును ఆచెరువునీటి ఆధారమున సాగయ్యే ఆయకట్టు పరిమితంలో సాధారణంగా పదవ వంతుభూమిని ఈనాముగా ఇచ్చేవారు. దీనికే 'దశబంధంఈనాం', 'దశబంధంమాన్యం' అని పేరు. తరువాత తరువాత ఈనాంగా ఇవ్వబడే భూమిపరిమితం కొన్ని కొన్నిచోట్ల ఆయకట్టుపరిమితంలో నాలుగవవంతు వరకూ, అయిదవ వంతువరకూ కూడా పెరిగినది. చెరువు మరమ్మతు సరిగా జరుగుతున్నదీ లేనిదీ తనిఖీచేసే అధికారము గ్రామస్థుల కుండేది. దశబంధం ఈనాందారు తనపనిని తాను చక్కగా నిర్వహిస్తూ ఉండకపోయినట్టయితే గ్రామస్థులు ఆ యీనాందారును తప్పించి ఆ మాన్యమును మరొకరి కిచ్చి పనిచక్కగా నిర్వర్తింప జేసుకొనేవారు. ఈవిధంగా చెరువులను పూర్వం సంరక్షించేవారు. ఇట్లే నూతులు (బావులు) కూడా కాపాడేవారు. ఇట్టివాటికి దశబంధం చెరువులనీ, దశబంధం నూతులనీ కూడా పేరు. ఇటువంటియేర్పాటు చాలాపూర్వకాలం నుంచి ఉన్నది. పూర్వం చెరువులనూ, నూతులనూ సంరక్షించే పద్ధతులలో ఇదొకటి. కొండప్రదేశాలలోనూ, రాతినేలనూ ఎంతెంతడబ్బు ఖర్చుపెట్టి ఇటువంటి చెరువులుకట్టించేవారో. ఇటువంటి ధర్మకార్యాలవల్లనే, రాతిప్రదేశములనుకూడా ఇట్లా సుక్షేత్రములుగ మార్చివంగువల్లనే 'రాయలవారి' పరిపాలనమీద ప్రజలకు భక్తిగౌరవాలు కుదురుకొని ఉండడానికి కారణము. విజయనగరం రాజులకు నరపతులని పేరు. సైన్యంలో జనమే ఎక్కువగా ఉండేవారు కనుక వారికి నరపతులు (నరబలం ఎక్కువగాగలవారు) అని పేరు కలిగిందంటారు. కృష్ణదేవరాయలవద్ద ఎల్లప్పుడూ పదిలక్షల సైన్యం సిద్ధంగా వుండేదనీ, అవసరమైతే అతడు ఇరవైలక్షలజనా


*నా నెల్లూరుమండల యాత్ర



చిత్రము ౧,(అ) సప్తమాతృకలు(కుడివైపు)



చిత్రము ౧,(అ) సప్తమాతృకలు(ఎడమవైపు)




చిత్రము ౨, సప్తమాతృకలు


* ఈ ఛాయాచిత్రములు డాక్టరు కే. యస్. ప్రసాదరావుగారు తీసినవి.



చిత్రము 3, చౌళచెర్ల అయ్యపనాయుడి విగ్రహము



చిత్రము ౪, భైరవునికోన



చిత్రము ౫, ఉదయగిరిదుర్గము

నైనా నా యుద్ధానికి సిద్ధంచేయగలదనీ పేయస్ చెప్తు న్నాడు. ఆశ్చర్యమేమున్నది దేశం సుభిక్షంగా ఉండేటట్టు ఇటువంటి ధర్మకార్యాలు చేసిన విజయ నగరం రాజులకు నరపతులని పేరు రావడానికి? ఇటు వంటి ధర్మకార్యాలు చేసి ప్రజల హృదయం చూర గొన్న కర్ణాటరాజుల సైన్యాలలో పదాతిసైన్యం ఎక్కువగా ఉండేదంటే మాత్రం ఆశ్చర్య మేమున్నది? తిన్నగా చూస్తే పూర్వపు కర్ణాటరాజ్య వైభవాన్ని నుండె రాయిచేసుకొని దేశమే వర్ధిస్తుంది.

వింజమూరు కావలికీ ఉదయగిరికీ మధ్యమార్గంలో ఉన్నది. ఈవూరు తమలపాకులకు చాలా ప్రసిద్ధట. ఇక్కడ తమలపాకుల తోటలు చాలా ఉన్నవి. ఇక్క డినుంచి ప్రతిదినమూ బండ్లకొద్ది తమలపాకులు నిజాంరా ష్ట్రానికి ఎగుమతి అవుతుందంటారు. ఈతమలపాకులతో టలకన్నిటికీ వింజమూరు చెరువే ఆధారము.

వింజమూరికి సమీపమునందే ఈమధ్యనే కొత్త గా రాగిగనులు దొరకినవట. అందు ఇక్కడ దొరకే రాగి చాలా ప్రశస్తమైనదనీ, గనిలో రాగిపాలే చాలా ఎక్కువగా ఉన్నదనీ చెప్తూఉంటారు. అప్పుడే విదేశీయులు దొరలువచ్చి భూమి పరిశోధన చేయడమూ, ఆప్రదేశము కొలుచుకు పుచ్చుకొని యంత్రాలు తెప్పించి పనిచేయడ మూకూడా జరుగుతున్నది. కావలినుంచి మాబస్సులోనే మైనింగ్ ఇంజనీరుకూడా వచ్చాడు. సాంకేతికవిద్య లపట్ల ఆంధ్రులకుగల విరాదరణకు ఫలిత మిది. ఆదరణ ఉన్నప్పటికీ కార్యంలేని ఈకోజాలలో అసలే ఆదరణ లేకపోవడం ఇతరులకు మరింత మేలుకాదా? ఎప్పటికీ కూలిమాత్రం మనదీ లాభం ఇతరులదీని. మన మొకరి క్రింద పనిచేసి కూలి సంపాదించుకోవడానికి మాత్రం దండుగ ఉంచుకుంటాను.

మేము ఉదయగిరికి వెళ్ళేటప్పటికి— దారిలో అయిన ఆలస్యాలవల్ల రాత్రి పదిన్నరగంటలో పదకొం డుగంటలో అయినది. దారిలోనే 'దుగ్గిభైరవునికోన' సందర్శించి వాకబులు చేశాము. చివరకు అది మేమను కొన్నట్లు ఉదయగిరికి పది పన్నెండు మైళ్ళలోగాక రమారమి ఇరవై మైళ్ళో, ఇరవై అయిదుమైళ్ళో దూరా న్ని ఉన్నట్లు తేలింది. ఎట్లయినా మొదట దానికే చూడరాదలెననీ, పిదపనే ఉదయగిరిని చూడవలెననీ నిశ్చయించుకొన్నాము. కావలినుంచి ఉదయగిరికి మోటా రువేసినవారే సీతారాంపురంనుంచి బద్వేలు (కడపజిల్లా) కూ, బద్వేలునుంచి సీతారాంపురానికికూడా మోటారు వేశారు. కడప, నెల్లూరుజిల్లాలను 'వెలిగొండలు' వేరు చేస్తున్నా మోటారు 'బస్సులు' వాటిని కలిపి ప్రయాణీ కులకు సౌకర్యం కలుగజేస్తున్నవి. ఈ మోటారులు కను మల (కొండత్రోవల) గుండా 'వెలిగొండ'లలోనుంచి పోతవి.

వెలిగొండలు ఉత్తరమునుంచి దక్షిణానికి వ్యా పించి నెల్లూరుమండలానికి పడమటిసరిహద్దుగా ఉన్నవి. ఇవే కడప, కర్నూలు మండలాలనుండి నెల్లూరుమండ లమును విడదీస్తున్నవి. ఈపర్వతపంక్తి వెంకటగిరి దక్షిణ మునుంచి శ్రీశైలందాక కొంచెం మించుమించుగ వాయవ్య దిశగా కంభం (కర్నూలుజిల్లా)వరకు పోతవి. సాధార ణంగా ఇవి సముద్రమట్టమునకంటె రెండువేలు మొదలు మూడువేల అడుగులవరకు ఎత్తు ఉంటవి. కడపమం డలంవైపు ఈకొండలమీద గొప్ప అడవులు ఉన్నవి. నెల్లూరు మండలంవైపు అట్టి గొప్ప అడవులు లేవు. ఈ కొండలను బద్దలుకొట్టుకొనే పెన్నానది సముద్రంలోకి వస్తుంది. ఈ 'వెలిగొండల' లోయలలోనే 'దుగ్గిభైరవుని కోన' ఉన్నది.

మేము ఉదయగిరి చేరేటప్పటికి బద్వేలునుంచి సీతారాంపురం పోయే మోటారు అదివరకే వచ్చి, పోవ డానికి సిద్ధంగా ఉన్నది. సీతారాంపురం, బద్వేలు మోటారులు ఉదయగిరిమీదుగానే పోతవి. మాసామా నుకొంత మోటారు యజమానుల స్వాధీనంలో ఉంచి వెంటనే సీతారాంపురం మోటారెక్కి 'దుగ్గిభైరవుని కోన'కు బైలుదేరినాము. ఆకోన సీతారాంపురమునకు దగ్గరగా ఉన్నదట. అర్ధరాత్రివేళ ఆకరకురాతి ఎగుడు దిగుడు మేము చిన్నవాగులలోనుంచీ చిట్టడవులలోనుంచీ వెనుకుంటే మోటారు పెద్దలెట్లు పొలుతురువ దేశం

చాలాచిత్రంగా కనిపించినది. మేము క్రమంగా ఉదయగిరి, గుర్రప్పల్లి, బసినేనిపల్లి మొదలైన ఊళ్లు దాటి అయ్యవారిపల్లికి వచ్చాము. ఉదయగిరికీ అయ్యవారిపల్లికీ పన్నెండుమైళ్ల ప్రయాణము. 'భైరవకోనకు' పోదలచినట్లయితే సీతారాంపురం పోనవసరం లేదనీ, అయ్యవారిపల్లినుంచే వెళ్లవచ్చుననీ, ఒకవేళ సీతారాంపురం వెళ్లినా దిగువకు మళ్లీ రావలసే ఉంటుందనీ బస్సులోని ప్రయాణీకులు చెప్పినందువల్ల అయ్యవారిపల్లిదగ్గరే మేము దిగినాము అయ్యవారిపల్లికి మోటారు 'రోడ్డు'కూ అరమైలులోపు. బహుశా అప్పటికి ఒంటిగంట అయివుంటుంది ఆరాత్రి అయ్యవారిపల్లెలో ఎవరో ఒకరి అరుగుమీద పరుండి ఉదయమునసే లేచి దారి చూపడానికి ఒకమనిషిని కుదుర్చుకొని 'దుగ్గిభైరవునికోన'కు బైలుదేరినాము. దారిలో సింగారెడ్డిపల్లి, దేవిశెట్టిపల్లి, పోకలింగాయపల్లి మొదలైన గ్రామాలు గడచినాము. నాగరికత కింకా ఈవూళ్లున్నట్టు తెలియలేదు. ఊళ్లన్నీచాలా 'పూర్వోత్తరం'గా ఉంటవి. ఈ వూళ్లలో మంచినీటికేమిటి, సేద్యానికేమిటి దిగుడుబావులే ఆధారం. వాటివల్ల ఆరికెలూ,వరిగెలూ,కొర్రలూ మొదలైనవి పైరవుతవి. ఆప్రాంతాల 'స్కూళ్లు' చాలాఅరుదు. ఉంటే ఎక్కడో అయిదారేసి గ్రామాలకొక్కొక్కటి. పోకలింగాయపల్లి దాటిన దగ్గరనుంచి అంతా అడవే. అయ్యవారి పల్లికి 'భైరవునికోన' బరువుగా రెండు పరుగు లుండనీ, తేలికగా మూడు పరుగు లుండనీ అక్కడివా రన్నారు. ఆప్రాంతమంతా 'పరుగుల లెక్క' వాడుకలో ఉన్నది. పరుగంటే రెండున్నర మైలు. కాని మాకు మాత్రం నడచిచూస్తే కోన రమారమి పదమూడు పదునాలుగు మైళ్ళదాకా ఉన్నట్టుతోచింది. వాళ్లు ఎప్పుడూ తిరుగుతూ ఉండడమూలాన్నీ, ప్రదేశాలు పరిచయమైనవి అవడంమూలాన్నీ ఎక్కువదూరం ఉన్నా కొంచెం ఉన్నట్టు కనబడడం సహజం. వాళ్లు చెప్పిన మాటలనూ, దూరాన్నీ నమ్మి మేము మధ్యాహ్న భోజనానికి ఏవిధమైన ప్రయత్నాలూచేసుకోకుండా తిరిగి రావచ్చుననే ఉద్దేశంతో వెళ్ళినాము. అదిన్నీగాక కోనకు చేరువనే రెండుపరుగుల లోపున కృష్ణంపల్లె, రాచవారిపల్లె అనే ఊళ్లున్నవనికూడా అన్నారు. ఈకారణాలవల్ల భోజనానికి ఏమీ ఏర్పాటులు చేసుకోకుండా వెళ్లినాము. అందుకు శాస్తి అనుభవించినాము. ముందుముందు అక్కడికి పోయేవారికి మా అనుభవమే ఒక హెచ్చరిక. ఆ యడవులలో ప్రక్కపక్కల ఉన్నకొండ లెక్కి వెళ్లితే కోనకు దగ్గరదోవ ఉన్నది దప్పున చేరుకొంటామని మాకూడా వచ్చిన మనిషి చెప్పినాడు. కాని కొండ లెక్కడమూ దిగడమూ వచ్చినదంటే అలిసిపోయి కోనలో తీసుకోదలచిన శాసనాలూ, ఫోటోలూ తీయడానికైనా ఓపిక ఉంటుందో లేదో అని కొంచెం చుట్టయినా బాటతోవనే పోయినాము. అడవి ఎంత నడచినా తరగనట్టు కనిపించింది. 'ఎర్రచెలకల' తరువాతనుంచి పరాసరికోనలోకి అడవిగుండా అడ్డము పడిపోవచ్చు నన్నారు దారిలో కనబడ్డ పొరుగూళ్ల గొల్లబోయలు. తువకట్లయితే కొండవాగులుదాటి కోనవంకలు దాటి, కారడవులుగడచి చిలపరాళ్ళతో గువ్వరాళ్ళతో చాపరాళ్ళతో కత్తెరరాళ్ళతో బొమ్మరాళ్ళతో పెద్ద నల్ల బండలతో నిండిఉన్న దారిని నడచినడచి కోనకు ఉదయం పదిన్నరకో పదకొండు గంటలకో చేరుకొన్నాము. దర్శనీయమైనది 'దుగ్గిభైరవుడికోన'. (చిత్రం ౪) ముండ్ల పొదలతోను నల్లరాతి నిలువుబండలతోను కప్పబడి ఉన్న ఆ దారికానిదారిలో నడవవలసివచ్చినందుకు నిట్టనిలువుగ పెరిగిన ఆచెట్లు ఒకదానినొకటి పెనవేసుకొని నీడే ఇవ్వక పోయినట్లయితే ఆ ఎండ దెబ్బకు మా ప్రాణాలు గిలగిలలాడేవే.

ఇటువైపునుంచి ఒకకొండ, అటువైపునుంచి ఒక కొండ—అయిమూల వాటంలోవచ్చి ఒకదాని నొకటి కలుసుకొంటవి. ఈఅంతః ప్రదేశానికే కోనఅని పేరు. ఈకోనలోనే కొండకొమ్ములు కలుసుకొనే ప్రదేశములో కొండనే మనపూర్వశిల్పులు ఆలయాలూ, విగ్రహాలూ, స్తంభాలూ మొదలైనవాటికింద చెక్కివేశారు. ఇది దుగ్గిభైరవులస్థానము: అందువల్లనే దీనికి 'దుగ్గిభైరవుని కోన' అని పేరువచ్చినది. 'దుగ్గి' రూపమే యిక్కడ వాడుక. ఈఆలయాల ముందునుంచి ఆకోన నడిమిగా

ఒక్క సెలయేరు ప్రవహిస్తుంది. మేము వెళ్లినది వేసవికాల మవడంచేత అంతవిశేషం నీరులేదు. పైనుంచివచ్చే సెలయేటినీరంతా ఆలయాలముందుండే దొన (గుండమువంటి దొనము)లో చేరుకుంటుంది. ఆప్రదేశం కుడివైపు ఆలయాలతోనూ, ఎడమవైపు ఆలయాలతోనూ, వీటిమధ్య సెలయేటి నీటిపడియతోనూ చూడడానికి చాలా ముచ్చటగా ఉంటుంది.

ఎంతకష్టపడ్డా రమణీయమైన కోన చేరుకొన్నాము. దాని దర్శనము చేసుకొన్నాము. పడ్డ కష్టమంతా ఉప్పున ఊదేసి మేము ధన్యుల మనుకొన్నాము. పడిన దెంత కష్టమో మేము పొందిన దంతటిసంతోషము. అంతటి ఆనంద మిచ్చింది కోన. అందమంతా అక్కడ పోగువేసుకొని కూర్చున్నట్టున్నది కోన. ఓహో! ఆవిగ్రహ శిల్పకళానైపుణ్య మేమిటి? కొండనే నక్కని ఆలయాలుగా మలిచివేసిన మనపూర్వశిల్పుల ఆప్రజ్ఞావైభవమేమిటి? చూచాము చూచాము; అనైభవమును అనిమిషులమై చూచాము; తన్మయుల మైనాము; కొంతసేపటికి తేరుకొన్నాము.

ఆసిద్ధహస్తుల సంతతివారమే మనము. మనకే వా రీయమూల్యనిధి- ఈశిల్పసంపదను విడిచిపెట్టి పోయినారు. కాపాడుకో గలుగుతున్నామా మనం దీనిని? వారి సంతతివారమైన మనము ఆశిల్పకళాతంతువు తెగిపోకుండ సాగింపగలుగుతున్నామా? పోనీ తుదకు గుర్తింపనైనా గుర్తించి ఆరాధింప గలుగుతున్నామా ఆకళావైభవమును? తమప్రాచీన సంపద్విశేషాన్ని తెలుసుకొని ఆరాధింపలేని జాతికి అభ్యుదయ మెక్కడ? నాగార్జున కొండ, గుమ్మడిదొర్రు మొదలైనచోట్ల ఉన్న తమ అమూల్య నిక్షేపము—శిల్పసంపద—రాష్ట్రాంతరములకు తర్లి పోతుంటే వేదవ్యాఘోషము పొంగులుదేరి ఇంకా చెవికి వినబడనిజాతికి అభ్యుదయ మెక్కడ? సర్వతోముఖమైన అభివృద్ధి యెక్కడ? ఎట్టిస్థితి! అని కన్నీ రొడ్చి వనలక్ష్మి సింగారించుకొనే అట్టిస్థలాలలో మనకు కళాసంపద నిక్షేపించి కీర్తిశేషులైన ఆశిల్పాచార్యులకు నమస్కరించి, ఆ సెలయేటి లేటనీరింత దాహము పుచ్చుకొని అక్కడ రాతిబండలమీద సంకులములైన కలపులతో దిక్కులు కలియజూస్తూ అట్లే కూర్చుండి పోయినాము.

ప్రతీశివరాత్రికి గొప్ప ఉత్సవం జరుగుతుందట అక్కడ. తిరునాళ్లు సాగుతుందట. యాత్రికులు తండోపతండాలుగా వస్తారట. ఆ శివరాత్రిదాటితే మళ్లీ అక్కడికి కివ్వడూ రాడు.

ఆలయాలు దాటి ఇంకా ఎగువ మిట్టప్రదేశానికి కొండమీదుగా సెలయేటిజాలు ననుసరించి పోతే పెద్ద రాతిగోడవలె నిట్టనిలువుగా లేచిన కొండదరికి పోతాము. ఆ కొండమీద బుగ్గలున్నవి. అక్కడనుంచి ఆకాశధారలు పడుతూ ఉంటవి. వేసవిలోనైనా ఈధారలకు కొదవలేదు. ఆధారలనీరు ఆకొండ మొదలనున్న దొనలో చేరుకొని అక్కడనుండే సెలయేరు ప్రారంభమవుతుంది. నేలమట్టమునుంచి పాతికముప్పై అడుగుల యెత్తుమీద నిట్టనిలువుగా ఉన్నకొండలో సొరంగముగా దొలిచిన ప్రదేశమున్నది. ఆప్రదేశంలో లింగమూ పానవట్టమూ కొన్ని విగ్రహాలూ ఉన్నవి. కొండమీదనుండి పడే నీటిధారలు అభిషేకము చేస్తున్నమాదిరి బొట్లు బొట్లుగ ఆ లింగముమీదా ఆవిగ్రహాలమీదా పడుతూ ఉంటవి. ఎక్కడానికి సాధ్యముకాని ఆనిట్టనిలువు కొండగోడను అంతయెత్తున ఎట్లా దొలిచారో, అక్కడికి విగ్రహాలూ మొదలైనవి ఎట్లా చేర్చారో? ఆకాశధారలు వాటిమీద పడేటట్టు వాటి నక్కడ అమర్చడం ఆశ్చర్యంకదా!

ఈ దుగ్గిశ్వరవునికోన ఆలయాలను గురించి వేరొకపర్యాయము వ్రాస్తాను. అక్కడ శాసనాలకు ప్రతిబింబాలున్నూ, కొన్నికొన్ని దృశ్యాలకు ఫోటోలున్నూ తీసుకొనేసరికే మధ్యాహ్నము రెండో రెండున్నర గంటలో అయినది. కడచినరాత్రి వింజమూరిలో చేసిన భోజనము. రాత్రి నిద్రలేదు. మధ్యాహ్నము మళ్లీ భోజనం లేదు. ఇంకా అక్కడ చేయవలసినపని ఎంతైనా ఉంది. కాని ఏమిచేయను? అక్కడ ఒక్కరోజు కాదు కదా ఒక్కపూటయినా ఆగడానికి తయారై వెళ్లలేదు. ఆప్రదేశముయొక్క స్వభావమెట్టిదో, అక్కడ చేయవలసిన పని ఎంతఉండునో కూడా అంతకుపూర్వము తెలియదు.

మాతో దారిచూపడానికి వచ్చినవానికిహూడా భోజనము లేదు. అరణ్యప్రాంతము: నిర్జనప్రదేశము. ఇట్టి సందర్భాలలో పని సంపూర్తిగా కాకపోలేమాత్రము ఎట్లా ఆగగలము? మరునాడు వద్దామనుకొన్నా చేరువా చెంతా కాదు. ఇంతదూరము నడచి మళ్లీ రావలెను. సీతారాంపురంనుంచి అయితే ఒంటెద్దుబండో రెండెడ్లబండో కోనకు కడతారట. కాని కిరాయి చాలాజాస్తి. ఇంక చేసేది లేక మిగిలిన పనికి మళ్లీ ఎప్పుడో ఇంకొక మారు వద్దామని పని దిగడిపోయిందే అన్న విచారంతోను, ప్రశాంతమైన ఆసౌందర్యావాసం విడిచిపెట్టి వెళ్ళిపోతున్నామే అన్న మనస్సుకలకతోను కోనకు అధిదేవత అయిన భైరవునికి నమస్కారం చేసి అలయాలవంక చూస్తూనే 'తిరుగుముఖం' పట్టినాము.

అక్కడికి చేరువలో కృష్ణంపల్లీ, రాచవారిపల్లీ కలవట; కాని మరునాడింక అచ్చటికి మళ్లీ రావలచుకోలేదు. అటిస్థితిలో ఆపల్లెలకు వెళ్ళడమెందుకు? తిన్నగా అయ్యవారిపల్లెకే వెళ్లినట్టయితే ఉదయగిరిపోయే 'బస్సు' దొరుకుతుందని అక్కడికే ప్రయాణమైనాము. పొద్దున్న పదునాలుగు మైళ్లు నడక: మళ్ళీ పదునాలుగు మైళ్లు నడక: దారి చూపడానికి మాతోవచ్చిన అతనుకూడా మాతో సమానంగా తిండిలేక మాడినాడు.

ఆలయాలకు చేరికగానే ఉన్న ఒకగుహనుకూడా చూచి మళ్ళీ మాదారి క్షేమం మందుకొన్నాము. నడచాము: నడచాము చాలాదూరం నడచాము. మంచివేసవి ఎండ: తీక్ష్ణమైన గాడుపు:ఉనూరుమనే ఘటాలు:కోనలోతాగిన నీళ్లేకాని ఎక్కడా మరి నీళ్ళచుక్క లేదు: వాగులూ,వంకలూఅన్నీ ఎండిపోయినవి. ఆస్థితిలో ఎంత నడచినా తరగని దూరం. విపరీతమైన దాహం. కూర్చుంటూ లేస్తూ మా మూటా ముళ్లతో ఉస్సు రస్సురంటూ ఒక్కఅడుగు పెట్టినా పెట్టడమే అని నడిచాము. పోకలింగాయపల్లికి పోలేకాని-నడుమ గ్రామమేమీ లేదు- నీళ్లు లేవు. ఆవురుమంటున్నవి ప్రాణాలు: తడి యార్చుకుపోతున్నది గొంతుక. ఏమిటి సాధనము? ఏమిటి చేయడము? పరుగులలెక్క మాప్రాణాలు తీసింది. మిత్రులైన ప్రసాదరావుగారు—కాన్పైతే డాక్టరుగారే—చెట్టుక్రింద కూలబడ్డారు—నేనూ చతికిలబడ్డాను.ఆయన పరకాయించి చూశాడు: దాహానికి మంచిమందు కనిపెట్టినాడు: బాగకేతమునుపళ్లు మాకాసమయాల్లో అమృతఘుటికలైనవి. అవే మమ్మల్ని పోకలింగాయపల్లి వరకూ చెట్టినవి. అక్కడ కడుపునిండా పట్టినన్ని మంచినీళ్లు తాగినాము. ప్రయాణం మంచిపాఠం నేర్పిందనుకున్నాము—అంలేకదా: అనుభవంతో మనిషి బుద్ధిమంతుడూ అవుతాడు:ప్రాజ్ఞతా వస్తుం దతనికి. ఇక ఇటువంటి ప్రయాణా లెట్లా చేయవలెనో తెలిసింది. రాత్రికి అయ్యవారిపల్లి చేరుకొన్నాం. అక్కడ భోజనంచేసి రాత్రి కక్కడనే శయనించి ఉదయాన్నే ఉదయగిరి మోటారెక్కినాము.

అవిద్య ప్రబలమున్న,విద్యతక్కువా అనడముచేత ఊళ్లుకొంచెం మోటుగా ఉంటవి. జనసంఖ్య కూడా చాలా పలుచన. ఈఉదయగిరి తాలూకాలో చదరపుమైలుకు నూరు—నూట యాభైమంది జనం ఉంటారు. ఇది ఎంతవిపరీతమో గోదావరిడెల్టా ప్రదేశాలతో పోల్చిచూస్తే తెలుస్తుంది. గోదావరిడెల్టా తాలూకాలలో చదరపుమైలుకు ఆరువందల యేభై మొదలు వేయిమంది వరకూ ఉంటారు. తెనాలితాలూకాలోనూ ఇదే లెక్క. గుంటూరు, గుడివాడతాలూకాలు ఇంకాకొంచెం వెనకపడునవి. అక్కడ చదరపుమైలుకు అయిదు వందలు మొదలు ఆరువందలయాభైవరకూ ఉంటారు. వీటితో పోల్చిచూస్తే ఉదయగిరితాలూకా ఏమూల? చదువుకొన్నవారి సంఖ్య చూస్తే గవర్నమెంటువారి లెక్కప్రకారం మొత్తంమీద ఈమండలంలో నూటికి ఎనిమిదిమందో పదిమందో-ఇంతే. అది అటుండగా ఈతాలూకాఅంతా వర్షాధారంమీద ఆధారపడిఉండే దేశం: ఒకయేడు పండితే రెండవయేడు ఎండుతుంది. దారిద్ర్యం అధికం. ఇట్టిస్థితిలో కొన్నికొన్నిచోట్ల దొంగతనాలు ఎక్కువ! కూనీలే జరుగుతుంటవి అంటే ఆశ్చర్యమేమున్నది? మేము అయ్యవారిపల్లె చేరినరాత్రో ఆమరునాటిరాత్రో బత్తెలను కొనుక్కునేటందుకు పోయేఒకణ్ణి సీతారాంపురం ఉదయగిరిబాటమీద చంపున్నదనిఅనమా



విశ్వేశ్వరభూపతి—విన్నకోట పెద్దన

(ధర్మలింగేశ్వరాలయశాసనము)

విశ్వేశ్వరభూపతి యొక్కయు, అతని యాస్థాన కవియు, కావ్యాలంకార చూడామణి కర్తయు నగు విన్నకోటపెద్దన యొక్కయు కాలమును నిర్ణయించుటకు పూనుకొనువారి కెల్లరకు పంచధారిలలో ధర్మలింగేశ్వరస్వామి ఆలయములోని విశ్వేశ్వర భూపతియొక్క శాసనమే కొంచె మించుమించుగ ప్రధానాధార మగుచున్నది. ఆశాసనముయొక్క శుద్ధప్రతి ఇంతవర కెచ్చటను ప్రకటింపబడక పోవుటవలన అందలి విషయములు సరిగా తెలియక పెద్దనాదుల కాలనిర్ణయాదికములు చేయుటలో తబ్బిబ్బులు కలుగుచున్నవి.

ఇప్పు డాశాసనమును మొట్టమొదటిసారి ఎపిగ్రాఫియా ఇండికా ౧౮-వ సంపుటము ౧౬౪-వ పుటలో జర్మనీ విశ్వవిద్యాలయపు కే. నోబెల్ (పిహెచ్. డి) దొరగారు ప్రకటించియున్నారు. ఇది విశ్వేశ్వర భూపతియొక్కయు, తద్ద్వారమున విన్నకోటపెద్దన కవియొక్కయు సరియైన కాలమును తెలుపుటయే కాక అందలి చాళుక్యవంశావతార పరిక్రమమును గురించిన యపోహములనుగూడ తొలగింపగలదని అందలి విషయములను పైపత్రికలో ప్రకటితమైన శాసనమునుండి గ్రహించి తెలుపుచున్నాను.

అందు తెలుపబడిన చాళుక్యవంశావతార క్రమ మిది: ఎట్లనిన—

విష్ణువు
|
బ్రహ్మ
|
అత్రి
|
చంద్రుడు
|
బుధుడు
|
పురూరవుడు

పురూరవవంశమున
పాండురాజు
|
అర్జునుడు
|
అభిమన్యుడు
|
పరీక్షిత్తు
|
జనమేజయుడు

జనమేజయుని వంశములో చాళుక్యపర్వతము మీద తపోజీవితమును గడపిన విష్ణువర్ధనుడు: ఈ విష్ణువర్ధనుని చాళుక్యాన్వయములో చాళుక్య భీమేశ్వరు డుదయించెను. ఈతఁ డీశాసనమున నిట్లు వర్ణింపబడినాడు:

ఆసీదింద్రకులాగ్రణీర్జనపతిః చాళుక్యభీమేశ్వర
స్తస్యాష్టౌ త్రి పవిత్రశైవపదవీ వృత్తం విచిత్రం భువి;
లేనై వాప్పితరసై భవాత్ ఖలుసదా చాళుక్యభీమేశ ఇ
త్యాఖ్యా మాపస పూర్వికా మిహా కుమారా
[రామభీమేశ్వరః.

ఈ చాళుక్యభీమేశ్వరుని వంశములో
విమలాదిత్యుడు
|
రాజమహేంద్రుడు అను నామాంతరముగల
రాజనరేంద్రుడు
|
కులోత్తుంగచోడకేసరి

ఈ కులోత్తుంగచోడభూపతి వంశములో
విజయాదిత్యుడు (భార్య) చందాంబిక
|
(మొదటి) మల్లపదేవుడు (భార్య) లక్ష్మి
|
(మొదటి) ఉపేంద్రుడు (భార్య) గంగాంబ
(ఈ ఉపేంద్రునికి కరవాలభైరవ ధరణీవ
రాహబిరుదములు కలవు)
|
(రెండవ) మల్లపదేవుడు (భార్య) చోడాంబిక
|
(రెండవ) ఉపేంద్రుడు (భార్య) మల్లాంబిక
(ఈ రెండవయుపేంద్రుడు పితృపరితృప్తికై
చోడమల్లపురమను అగ్రహారమును
ప్రతిష్ఠించెను.) ఈతనికి
|
పరగండభైరవ నామాంతరముగల
కొప్పభూపతి (భార్య) గంగమాంబ
|
(మూడవ) ఉపేంద్రుడు (భార్య) బింబాంబ
(ఈ యుపేంద్రుడు రాజనారాయణ
బిరుదాంచితుడు.)
|
మనుమోపేంద్రుడు (భార్య) లక్కాంబిక
|
విశ్వేశ్వరభూపతి

ఈ పై వంశావతారక్రమము ననుసరించి విమలాదిత్యుడు చాళుక్యభీమేశ్వరుని కొడుకు కాడనియు, విజయాదిత్యుడు (విమలాదిత్యుడు కాదు) కులోత్తుంగచోడ భూపతి కొడుకుకాడనియు స్పష్టపడగలదు. వంశావతారక్రమము వున్నంతవరకు సరిగనే ఉన్నది.

ఈ శాసనమువనే విశ్వేశ్వరభూపతి మండపము కట్టించిన సంవత్సరముకూడ దెలుపబడినది. ఆశ్లోకమిది:

శాకాబ్దే నవబాహురామ శశిసంఖ్యాతేకుచా భాసితే
సప్తమ్యామినవారభాజి మహితఃసంస్థాపితో మండపః
కల్యాణోత్సవ సిద్ధయే సవిభవః శ్రీపంచధారాపురీ
ధర్మేశస్య చళుక్యవిశ్వధరణీభర్త్రా విచిత్రాస్పదం.

ఈ పై శ్లోకము ననుసరించి విశ్వేశ్వరభూపతి యీ మండపమును శకవర్షములు ౧౩౨౯-వ జ్యేష్ఠ శుద్ధసప్తమీ ఆదివారమునాడు కట్టించినట్లు విస్పష్టమగుచున్నది. అందువలన విశ్వేశ్వరభూపతి క్రీ. శ. ౧౪౦౭-వ సంవత్సరప్రాంతమున రాజ్యమేలుచుండినట్లు నిర్ణయ మగుచున్నది. చిన్నకోట పెద్దనకూడ ఈకాలమున నున్నవాడే.

ఈకవి కావ్యాలంకారచూడామణి నెప్పుడు రచించెననుటకుగూడ గొంతయాధారము కలదు. శాసనమున విశ్వేశ్వరనృపతి సర్వసిద్ధిప్రాంతమున ఆంధ్రసైన్యము నోడించినట్లు తెలుపబడియున్నది. ఆశ్లోక మిది:

గతిబాహుశక్తి భూమితిమపి గణయ
త్స్వర్వసిద్ధి పథభగ్నం,
పతిచిత్రభాను సాక్షిణి ధరణీ
వరాహోదధావ దాంధ్రబలం.

ఈ పై శ్లోకములోని కట్టుకడపటిభాగము దొర గారు సంస్కరించిన పాఠము. "ధరణీవరాహోదధావదంధ్రబలం" అని అసలుశాసనపాఠము. ఈ శ్లోకమునకు సరిగా సరిపోవు తెలుగుపద్యమే కావ్యాలంకార చూడామణి ఏడవయుల్లాసమున నిట్లు కలదు:

చతురుపాయ బాహుశక్తి క్షమావలిఁ
బాఱ విడిచి చిత్రభానుసాక్షిఁ
బాఱె సర్వసిద్ధిపథ మేలి ధరణీవ
రాహమునకు నోడి రాచకదుపు.

ఈ పద్యము కావ్యాలంకార చూడామణిలో కలదనియే మనకు దెలియును గాని ఇంతవర కిందలివిశేషమేమియు మనకు తట్టలేదు. నోబెల్ దొరగారు పైశాసన శ్లోకములోనుండి విశ్వేశ్వరభూపతి సర్వసిద్ధి (పట్టణ) పథ (తెలుగుపద్యములోకూడ ఇది 'పథ' అనియే యుండవలె ననుకొందును) ప్రాంతమున ఆంధ్రసైన్యమును గతి (౫) బాహు (౨) శక్తి (౩) భూమి (౧) విలోమగణనమున నేర్పడిన శకవత్సరములలో అనగా ౧౩౨౫-వ శకవర్షమున చిత్రభాను సంవత్సరమున నోడించెనని చిత్రముగ దేల్చియున్నారు. ఇది ఎంతయు చక్కగ నున్నది. కవి

కేవలము నూతనముగ నుపలబ్ధమయిన నాట్యదర్పణమును గూర్చి వ్రాయుచు నందు ముద్రారాక్షసనాటకకర్తయగు విశాఖదత్తుడు రచియించిన దేవీచంద్రగుప్తమను నాటకమునుండి లక్ష్యములుగా గైకొన్న ఉదాహరణములను బ్రకటించి వానినిబట్టి యీ నాటక నాయకుడగు చంద్రగుప్తుడు రెండవచంద్రగుప్తుడే యని వ్రాసినారు. ౧౯౨౪వ సంవత్సరమున శ్రీ ఆర్. డి. బెనర్జిగారు కాశీ విశ్వవిద్యాలయమున నొసగిన యుపన్యాసములలో గుప్తరాజుల చరిత్రమునను ఉదాహృతనాటక భాగములను పురస్కరించుకొని కొన్ని నూతన విషయములను సమకూర్చి చెప్పినారు. 'లెవి'గారి ప్రకటనము భారతదేశమున కంతగా దెలిసియుండదు. బెనర్జిగారి యుపన్యాసము లింకను నముద్రితములు. కావున పైయాధారములను, ఇంకను ఇటీవల నుపలబ్ధములైన ఇతరాధారములను బురస్కరించుకొని ప్రాచీనగుప్తరాజుల చరిత్రమును ఇట్లు వివరించుచున్నాను. ఈగుప్తరాజుల పరిపాలనకాల మింతవఱకు సరిగా నిశ్చయింపరాకున్నది. మొదటి చంద్రగుప్తుని రాజ్యప్రారంభము— గుప్తశక మీతని రాజ్యపరిపాలన ప్రారంభ సం. తోనే ప్రారంభమయినచో— క్రీ.శ. ౩౧౯-౩౨౦ కంటె పూర్వమునకుబోజాలదు. రెండవ చంద్రగుప్తుని పరిపాలనకాలము క్రీ. శ. ౪౧౩-౪౧౪ వఱకు గలదని చెప్పుట కాధారము గలదు. ఇట్లయినచో మొదటి ముగ్గురి (మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, రెండవచంద్రగుప్తుడు) కాలము ౯౩ సంవత్సరము లగును. దీనితో తరువాతివాడగు కుమారగుప్తుని కాలమును జేర్చుకొన్నచో నీనలుగురికాలము ౧౩౦ సంవత్సరములకు ఇంచుమించుగా జేర్పడును. క్రొత్తగా దొరకిన ఆధారములనుబట్టి సముద్రగుప్తునికి తరువాత రామగుప్తుడొకడున్నట్లు తేలుచున్నది. ఆయాధారము లివి.

రామచంద్ర, గుణచంద్రులు విరచించిన నాట్యదర్పణమున 'దేవీచంద్రగుప్తము'లోనివిగా నుదాహృతములయినవని యీ క్రిందియా ఉదాహరణములను యం. లెవి గారిచ్చినారు.

౧. భిన్నస్య ప్రస్తుతాదన్యస్య త్రిగత మనేకార్థగతం త్రిశబ్దస్యానేకార్థత్వాత్తేన దవ్యర్థమపి. యథా "దేవీచంద్రగుప్తే" ద్వితీయేఽంకే ప్రకృతీనా మాశ్వాసనాయ శకస్య ధ్రువదేవీసంప్రదానే అభ్యుపగతే రాజ్ఞా రామగుప్తేన అరివధనార్థం ఇయాసుః ప్రతిపన్నధ్రువదేవీనేపథ్యః కుమారచంద్రగుప్తో విజ్ఞాపయన్నుచ్యతే: యథా:

ప్రతి ష్ఠోత్తిష్ఠ నఖల్వహం త్వాం పరిత్యక్తుముత్సహే.

ప్రత్యగ్రయౌవనవిభూషణ మంగ మేతత్
రూపశ్రియంచ తవ యౌవనయోగ్యరూపామ్;
భక్తించ మయ్యనుపమా మనురుధ్యమానో
దేవీం త్యజామి బలవాం స్త్వయి మేఽనురాగః.

అన్యస్త్రీశంకయా ధ్రువదేవీ—

యది భత్తిం అవేక్ఖసి తదో మ మందభాఇణి పరిచ్చయసి.

రాజా:—అపిచ,

త్యజామి దేవీం తృణవ త్త్వదన్తరే,

ధ్రువదేవీ:—అహంపి జీవిదం పరిచ్చయంతీ అజ్జఉత్తం పఢమమపకందేయ్యేవ పరిచ్చయిస్సం.

రాజా:—త్వయా వినా రాజ్య మిదం హినిష్ఫలమ్;

ధ్రువదేవీ:—కుమది సంపదంనిష్ఫలో జీవలోఓ సుహపరిచ్చయణీఓ భవిస్సది.

రాజా:—ఉపైతి దేవీంప్రతి మే దయాలుతా,

ధ్రువదేవీ:—ఇయం అజ్జఉత్తస్స ఈదిసీ దయాలుదా జం అణవరద్ధోజణో అణుగాదో ఏవం పరిచ్చఇయది

రాజా:—త్వయి స్థితం భావనిబంధనం మనః.

ధ్రువదేవీ:—అదో య్యేవ మందభాగా పరిచ్చఇయామి.

రాజా:—త్వయ్యుపారోపితప్రేమ్ణాత్వదర్థేయశసాసహా,
పరిత్యక్తా మయా దేవీ జనోఽయం జనవీవమే.

ధ్రువదేవీ:—హంజే, ఇయంసా అజ్జఉత్తకరుణదా,

సూత్రధారీ:—దేవి పసంతి చందమండలా దూసణీ కిమేత్థ కరియ్యది

రాజా:—దేవీవియోగదుఃఖార్తాం త్వేవ మస్మాక్ రమయిష్యసి.

ధ్రువదేవీ:—వియోగదుంఖంపి దే అకరుణాస్స అత్థి జ్జేవ.

రాజా:—త్వద్దుఃఖస్యాపనేతుం శక్తాం శేనాపి నస్సహా. ఇతి.

ఏతత్ స్త్రీవేషధారీ చంద్రగుప్తబోధనార్థ మభిహితమపి విశేషణసామ్యేన ధ్రువదేవ్యా స్త్రీవిషయం ప్రతిపన్నం ఇతి భిన్నార్థాభియోజకమ్.

౨. అత్రైః ఖేదో వ్యసన మిష్టా ద్వియోగః. యథా "దేవీచంద్రగుప్తే" రాజా చంద్రగుప్తమాహ:

త్వద్దుఃఖ స్యాపనేతుం సా శక్తాం శేనాపి నస్సహా,
ధ్రువదేవీ సూత్రధారీ మాహ:

హంజే, ఇయం సా ఈదిసీ అజ్జఉత్తస్స కరుణా పరాహీణదా

సూత్రధారీ:—దేవి, పసంతి చందమండలాఉ వి చుడ ఆలిఉ కిం పీడుకరిష్యా.

రాజా:—త్వ య్యుపాలోపిత్రపేమ్ణా త్వదర్థే యశసా సహ
పరిత్యక్తా మయా దేవీ జనో౽యం జనవీవమే.

ధ్రువదేవీ:—"అహంపి జీవిదం పరిచ్చయం తీ పఢమ పరం య్యేవ తుమం పరిచ్చయిస్సం.

అత్ర "స్త్రీవేషనిహ్నుతే చంద్రగుప్తే" ప్రియవచనై స్త్రీప్రత్యయా ధ్రువదేవ్యా గురు మనుసంతాప రూప వ్యసనస్య సంప్రాప్తిః.

3. భావానాం పాన్యఫలోచితానాం రతిహర్షోత్సవాదీనాం యాచనం ప్రార్థనా. తథా "దేవీచంద్రగుప్తే చతుర్థేఽంకే:"

చంద్రగుప్తః—ప్రియే, మాధవసేనే, త్వ మిదానీం మే బధ మాజ్ఞాపయ,

కంఠే కిన్నరకంఠి బాహులతికా
పాశః సమాసజ్యతాం
హారస్తే స్తనబాధకో మమ బలాత్
బధ్నాతు పాణిద్వయమ్
పాదౌ త్వజ్జఘనస్థలప్రణయినీ
సందానయోః శ్శృంఖలాం
పూర్వం త్వద్గుణబద్ధమేవ హృదయం
బంధం పున ర్నార్హతి.

అత్ర రతేః ప్రార్థనా.

౪. తథాన వేశ్యాయాం నాయికాయాం వినయరహితమపి చేష్టితం నిబధ్యతే, యథా "విశాఖదత్తకృతే" దేవీచంద్రగుప్తే మాధవసేనాం సముద్దిశ్య కుమారచంద్రగుప్తస్యోక్తిః:

ఆనందాశ్రుజలం సితోత్పలరుచో
రాబధ్నతా నేత్రయోః,
ప్రత్యంగేషు వరాననే పులకిషు
స్వేదం సమాతన్వతా,
కుర్వాణేన నితంబయో రుపచయం
సంపూర్ణయో ర ప్యహో
కేనా ప్యస్పృశతా ప్యథో నివసనగ్రంథి
స్తవోచ్ఛ్వాసితః—ఇతి.

౫. యథా "దేవీచంద్రగుప్తే" పంచమేంకే

ఏసో సియకరవిత్థరపణాసియాసేసవేరతిమిరోహో,
నియవిహివసేణచందో గయణంగహాలంఘియోవిస ఇ.

ఇయం స్వాపాయశంకినః కృతకోన్మత్తస్య కుమారచంద్రగుప్తస్య చంద్రోదయవర్ణనేన ప్రవేశప్రతిపాదికేతి.

అంకాంతే అంకమధ్యే వా సనిమిత్తం రంగాత్పాత్రస్య బహిర్నిస్సరణం నిష్క్రామః. తత్ప్రయోజనానుకీర్తికారే రాకృతిగణత్వాత్ కన్ప్రత్యయపద వృద్ధౌ నైష్క్రామికీ; యథా "దేవీచంద్రగుప్తే పంచమాంకాంతే:"

బహువిహకజ్జవిసేసం అఇగూఢ నిఅవావేఇ మయణాసో వీక్లలయి ఖుద్దుచిత్తా ఉరస్సా...... త్తింమ నోరిఉణో.

ఇయ మున్మత్తస్య చన్ద్రగుప్తస్య మదనవికార గోపనపరస్య మహాక్ శత్రుధితస్య రాజకులాగమనార్థం నిష్క్రమమాచికేతి.

౬. భావస్య పరాభిప్రాయ స్యాథవా భావ్యమాన స్యార్థస్యోహ ప్రతిమాదివశా న్నిర్ణయో యథావస్థితరూపనిశ్చయః క్రమః బుద్ధి స్తత్రక్రమతే వ ప్రతిహన్యత ఇత్యర్థః: యథా "దేవీచంద్రగుప్తే" ధ్రువదేవీం దృష్ట్వా స్వగత మాహ, ఇయమపి సా దేవీ తిష్ఠతి, యైషా

రమ్యాం చారతికారిణీంచ కరుణా
శోకేన నీతాదశాం
తత్కాలోపగతేన రాహుశిరసా
గుప్తేవ చాంద్రీకలా;
పత్యుః క్లీబజనోచితేన చరితే
నానేన పుంస స్సతః
లజ్జాకోపవిషాదభీత్యరతిభిః
క్షేత్రీకృతాతామ్యతే.

అత్ర ధ్రువదేవ్యభిప్రాయస్య చంద్రగుప్తేననిశ్చయః.

ధారానగరాధీశ భోజకృత మనబడుచున్న శృంగార రూపకమునం దుదాహృతములయినవని శ్రీ ఆర్. సరస్వతిగారు (ఇండియన్ ఆంటిక్వరి 1923 p 181.)లో ఈదేవీచంద్రగుప్తనాటక భాగములను మూటిని ప్రకటించినారు. అవి ఈక్రిందివి:

౭. "స్త్రీవేషనిహ్నుత శ్చంద్రగుప్త శ్శత్రో స్స్కంధావార మరిపురం శకపతివధా యాగమత్.

౮. దేవీచంద్రగుప్తే బిమావకం ప్రతి చంద్రగుప్తః:
పద్వంశా స్స్పృథుపంశే విక్రమబలా
స్సృష్టోద్ధుతా ద్దన్తినః,
హాసస్యేవ గుహాముఖా దభిముఖం
నిష్క్రామతః పర్వతాత్;
ఏకస్యాపి విధూతకేసర జటా
భారస్య భీతా మృగాః,
గంధాదేవ హరే ర్ద్రవన్తి బహవో
వీరస్య కింసంఖ్యయా.

౯. దేవీచంద్రగుప్తే వసంతసేనా ముద్దిశ్యమాధవో క్తిః:
ఆనందాశ్రుజలం సితోత్పలరుచో
రాబధ్నతా నేత్రయోః
ప్రత్యంగేషు వరాననే పులకిషు
స్వేదం సమాతన్వతా,
కుర్వాణేన నితంబయో రుపచయం
సంపూర్ణయో రప్యసౌ,
కేనా ప్యస్పృశతా ప్యథో నివసన
గ్రంథి స్తవోచ్ఛ్వాసితః.

రాజశేఖరుడు తన 'కావ్యమీమాంస' యందు 'ముక్తకకథోత్థ' మను 'వస్తుస్వరూప' భేదమున కుదాహరణముగా నీక్రిందిశ్లోకము నిచ్చినాడు.

౧౦. దత్వా రుద్ధగతిః ఖసా( )శకాధిపతయే
దేవీం ధ్రువస్వామినీం,
యస్మా త్ఖండితసాహసో నివవృతే శ్రీ
శర్మ (v. l. సేన) గుప్తో నృపః;
తస్మిన్నేవ హిమాలయే గురుగుహా
కోణ క్వణత్కిన్నరే
గీయంతే తవ కార్తికేయ నగర
స్త్రీణాంగణైః కీర్తయః.

---

795 వ శకవత్సరమునాటి ఒకటవ అమోఘవర్షుని 'సంజన' తామ్రశాసనమున (E. I. Vol. XVIII P. 248) ఒకగుప్తరాజు వితరణమున అమోఘవర్షుని మిగిలినవాడు కలడని వర్ణించుశ్లోక మున్నది. అదియీ క్రిందిది:

౧౧ హత్వా భ్రాతర మేవ రాజ్య మహరే
ద్దేవీంచ దీన స్తథా
లక్షం కోటి మలేఖయ కిల కలౌ
దాతా సగుప్తాన్వయః;
యే నాత్యాజి తను స్స్వ రాజ్య
మసకృద్బాహ్యార్థకైః కా కథా

క్రీ. శ. పోర్వన్నతి రాష్ట్రకూట
తిలకో దానేతి కీర్త్యాన్ మపి.

ఈ శక ధ్రువదేవుల విషయమునుగూర్చిన పైపదు నొకం డుదాహరణములు కాక బాణుని హర్ష చరితమున నొక యుల్లేఖనము గలదు. ఇది చిరకాలమునుండి ఎటి గిన దేదైనను చరిత్రకారులదృష్టి నాకర్షింపకుండెను. అది యిట్లుకలదు:

౧౨. అరిపురేచ పరకళత్రకాముకం కామినీవేషగుప్త శ్చంద్రగుప్తః శకపతి మశాతయత్.

ఈ హర్ష చరితవ్యాఖ్యాకారుడగు శంకరార్యు డీ విషయమునే యింకను వివరించి యిట్లు వ్రాసెను:

౧౩. శకానామాచార్యః శకాధిపతిః చంద్రగుప్తభ్రాతృజాయాం ధ్రువదేవీం ప్రార్థయమానః చంద్రగుప్తేన ధ్రువదేవీవేషధారిణా స్త్రీవేషజనపరివృతేన వ్యాపాదితః.

ఈ యుదాహృతభాగముల * నన్నిటిని యుక్తికి సమన్వయింపగా నిట్లు తేలుచున్నది:

రామగుప్తుడను భీరువు, అసమర్థుడు నయిన రాజొకడుండెను. తత్కాలీనుడును, బలవంతుడును నగు శకరాజొక డాతనిరాజ్యముపై దండెత్తెను. తన్ను, తన రాజ్యమును, ప్రజలను కాపాడుకొనుట కాతడు తనపట్టమహిషియగు ధ్రువదేవిని శత్రురాజు కామతృష్ణ తీర చేయ నంగీకరించెను. ధీరుడు సాహసి యగు నాతని తమ్ముడు చంద్రగుప్తుడు తనకుటుంబగౌరవమును కాపాడుకొనగోరి ధ్రువదేవి వేషమున శత్రుశిబిరమున ప్రవేశించి కామాతురుడయిన యాశకుని జంపెను. స్త్రీవేషధారులయిన కొందఱు భటుల నాతడు తనవెంట గొనిపోయెను. తాను కావించుకొన్న సంధి ననుసరించి అనుక్షణమును ధ్రువదేవిరాకకై నిరీక్షించుచున్న శకరాజు పరీక్షింపకయే వారిని శిబిరములోనికి రానిచ్చెను. అంత శకరాజు చంద్రగుప్తుని చేరరాగా నాతడు వానిని పైబడిచంపెను. చంద్రగుప్తుడు రాజ్యమునకు తిరిగివచ్చిన కొలదికాలమునకే—ఏకారణమువలననో కాని—యాతనికి రామగుప్తునితో విరోధము కలిగెను. చంద్రగుప్తుడు తన ప్రాణములకు భీతిల్లుచుండెను. తన్ను కాపాడుకొనుటకు తనకామోన్మాదమును కప్పిపుచ్చి(?)అన్నను జంపుట కవకాశమునకయి వేచియుండెను. తుదకు రామగుప్తుడు హతుడయ్యెను. తరువాత చంద్రగుప్తుడు రాజయి అన్నభార్య యగు ధ్రువదేవిని పెండ్లాడెను.

ఇట్లేర్పడిన కథాభాగమున కాధారములయిన పైయుదాహృతభాగము లెంతవఱకు విశ్వాస్యములగునో! పదునాఱుదాహరణములలో మొదటిదియగు నాట్యదర్పణములోనిది. నాట్యదర్పణకర్తలగు రామచంద్ర గుణచంద్రులు C 1143-1178 లలో నుండిన 'అణహిలపాటక' చాళుక్య వంశీయుడగు కు మా ర పా ల ని కి స మ కా లి కు డు ను, సుప్రసిద్ధుడును నగు హేమచంద్రుని శిష్యులు. ఈదేవీచంద్రగుప్తకర్త విశాఖదత్తు డని తెలియవచ్చుచున్నది. ఈతడు ముద్రారాక్షసకర్త యగు విశాఖదత్తుడే యగును. చాణక్యునిచే తల్లక్రిందు కావింపబడిన రాజ్యముయొక్క చరిత్రమును నాటకముగా రచియించిన విశాఖదత్తు డంతకన్నను భావోద్రేకజనకమగు నీచంద్రగుప్తగాథను వినియో, స్వయముగ కనియో యిట్లు నాటకముగ రచియించియుండును. కాని విశాఖదత్తునికాలము సైతము నిశ్చయము కాలేదు. ఇతడు క్రీ ౫ వ శతాబ్దమునగాక, ౬, లేక ౮ వ శతాబ్దములయందున్నవాడయినను దేవీచంద్రగుప్తముయొక్క ప్రధానేతివృత్తము చారిత్రకమనుట కాధారములు గలవు. విశాఖదత్తుడు రెండవచంద్రగుప్తునికి సమకాలికుడని పలువురు చరిత్రజ్ఞు లంగీకరించియున్నారు. అట్లయిన నీనాటకమందలిగాథ నాతడు కనియేయుండును. లేక ౬, ౮ శతాబ్దులలోనివాడయినను చంద్రగుప్తుని కాలమునకు చాలా కాలము తరువాతివాడు కానిచో చరిత్రాంశముల నన్య

---

* ఈ సంస్కృత ప్రాకృత భాగములందు తప్పు లున్నవి.

భాకరించియుండు నన జనదు. బాణ, శంకరాచార్యుల గ్రంథభాగములు, సంజన్ శాసనము నీయభిప్రాయమునకే తోడగుచున్నవి. శ్రీరంగస్వామిసరస్వతి, కృష్ణస్వామి అయ్యంగార్, స్మిత్తుగార్లన్నట్లుగాక బాణ శంకరాచార్యులయొక్క గ్రంథస్థోదాహరణములు విశ్వసింపదగినవే.

తరువాతివగు శృంగారరూపకమునందలి మూడుదాహరణములలో నొకటి నాట్యదర్పణమునందలి యుదాహృతభాగమునకు సరిగా సరిపోవుచున్నది. మీదుమిక్కిలి తద్గ్రంథ కర్తయగు భోజుడు కేవలమాలంకారికుడే కాక స్వయము మహారాజు; గొప్పరాజనీతిజ్ఞుడును. ఇట్టియాతడు అప్రమాణములగు చరిత్రాంశములుగల గ్రంథములనుండి లక్ష్యములను స్వవిరచితలక్షణ గ్రంథములోనికి గైకొనియుండడు. సంజన్ శాసనము పేర్కొన్నగుప్తరాజు స్కందగుప్త విక్రమాదిత్యుడని డాక్టరు భండార్కరుగారు చెప్పియున్నారు. కాని ఆతడు రెండవ చంద్రగుప్తుడేయగును. (ఇందుకు పెక్కుకారణములను నీ వ్యాసకర్త పేర్కొన్నాడు.)

పదవ ఉదాహరణము రాజశేఖరుని కావ్యమీమాంసలోనిది. ఇందు శర్మగుప్తుడని కలదు. చంద్రగుప్తునకు దేవగుప్తుడను నామాంతరమున్నట్లే రామగుప్తునకును శర్మగుప్తుడను నామాంతరముండియుండవలెను. లేక మాతృకలోని 'రామ' అను పదమును పొరపడి 'శర్మ' అని చదువుటవలన నిట్లు పొసగియుండవలెను. ఇందీగుప్తునిభార్యపేరు 'ధ్రువస్వామిని' అనియుండుటచేత అక్షరములను పొరపడిచదువుటయే నిశ్చయముగా తలపవచ్చును. మఱియు నిందు 'ఖస'రాజు అని కలదు. కవి తాను వర్ణింపదలచిన యంశమున కనుకూలముగ నుండునట్లు స్వతంత్రించి చరిత్రవిషయము నించుకమార్చి యుండవచ్చును; లేక 'శక' అనుటకు మారుగ 'ఖస' అని పొరపాటు చదువుటచేత నీపాఠముపుట్టియుండవచ్చును. రెండవదియే ఉపపన్నముగదోచుచున్నది.

నీనిపై నాక్షేపణలు-సమాధానములు.

౧. ఉపలబ్ధములయిన గుప్తరాజుల శాసనములన్నిట నెందును ఈరామగుప్తునిపేరే కానరాదు. సమాధానము. ఆంధ్రరాజులశాసనములలో కృష్ణరాజు పేరు శాసనమును పేర్కొననంతమాత్రమున నాతనియునికిని కాదందుమా? ఇందు పౌరాణికాదులగు నితరగాథలను ప్రమాణములుగా నంగీకరింపలేదా! ఇట్లే ఈరామగుప్తుని యునికియు విశ్వసింపదగినది. మరియు సముద్రగుప్తుని 'ఈరాను' శాసనమునను ముద్రగుప్తునికి కొందఱు పుత్రులున్నట్లు కలదు. ఈరామగుప్తుడు వారలలో నొక్కడో లేక సర్వజ్యేష్ఠుడో కాదగును.

౨. అన్న పెండ్లామును రెండవ చంద్రగుప్తుడు పెండ్లాడెననుట నమ్మదగినదికాదు. సమాధానము. ధ్రువదేవి చంద్రగుప్తుని పట్టమహిషియనుట కాధారములు గలవు. వైశాలిలో నీధ్రువదేవిముద్రికలు లభించినవి. వానియం దీమె మహారాజాధిరాజ చంద్రగుప్తునికి పట్టమహిషియనియు, మహారాజశ్రీ గోవిందగుప్తునికి తల్లియనియు నున్నది. దేవీచంద్రగుప్తమువలన నీమె చంద్రగుప్తుని అన్నయగు రామగుప్తునకును భార్యగా నుండెనని తెలియవచ్చుచున్నది. ఈవిషయమునే శంకరాచార్యుని వ్యాఖ్యానమును, సంజన్ శాసనమును రూఢిపరుచుచున్నవి. వీనివలన చంద్రగుప్తుడు అన్నను చంపుటయేకాక ఆతని భార్యను పెండ్లాడెననికూడ తేలుచున్నది.

శకరాజెవ్వరు?

భారతదేశచరిత్రమునకెక్కిన శకక్షాత్రపరాజులు రెండుశాఖలకు చెందియున్నారు: ౧. మథురశకులు; ౨. ఉజ్జయినిశకులు. వీరిలో ధ్రువదేవిని అప్పగింపకోరినయాతడు పశ్చిమక్షాత్రపుల (మథురశకుల)లోని రెండవ రుద్రసేనుడు కాదగునని నేను తలతును. ఈతని నాణెములు క్రీ. 348 మొదలు 378 వఱకు ముద్రితములయినవి కలవు. ఆకాలమున నీతడే గుప్తులకు ప్రబలశత్రువుగా నుండియుండును. చంద్రగుప్త డీతనిని సప్రతిపనిగా జంపుటచేతనే యితని లోబట్టువుకొడుకు సింహసేను డీతనితరువాత రాజ్యమునకు వచ్చియుండును.

ఇట్లు సువిపులముగను, సోపపత్తికముగను జర్చించి తుదకు వ్యాసకర్త యీక్రిందిసిద్ధాంతములను తేల్చినారు:

(౧) సముద్రగుప్తునికి తర్వాత రాజ్యమునకువచ్చినవాడు రామగుప్తుడుకాని రెండవ చంద్రగుప్తుడుకాడు

(౨) రామగుప్తుడు దుర్బలుడు; పిఱికి; అసమర్థుడు; కావున నీతని కాలమున నుండిన శకరాజు (పశ్చిమశకక్షాత్రపుడు) గుప్తసామ్రాజ్యముపై నెత్తివచ్చి తనకతని పట్టపుమహిషియగు ధ్రువదేవి నప్పగింప నిర్బంధించెను.

(౩) రామగుప్తుని తమ్ముడు చంద్రగుప్తుడు ధ్రువదేవి వేషమును వేసుకొని శకరాజునొద్దకుబోయి యాతని జంపి యాయుపద్రవమును తొలగించెను.

(౪) చంద్రగుప్తుడు మరలివచ్చినపిదప నాతడో, నాతనిచే ప్రేరితులయినవారో రామగుప్తుని జంపిరి.

(౫) మృతుడయిన అన్నయొక్క పెండ్లామును చంద్రగుప్తుడు వివాహమయి యామెను పట్టపుదేవిని జేసికొనెను.

ఈవ్యాసకర్తయొక్క పరిశోధన సిద్ధాంతములు సంశయగ్రస్తముగనున్న గుప్తవంశచరిత్రమున కెంతవఱకు తోడ్పడగలవను విషయమును చారిత్రజ్ఞులు పరిశీలింతురుగాక !

[X. సు.]

డాక్టరు సుధీంద్రబోసుగారు

డాక్టరు సుధీంద్రబోసుగారు ఒకపాతిక శతాబ్దము విడిచియుండినపిదప తమ మాతృదేశమును సందర్శింపవచ్చి కొలదికాలముమాత్రమే యిచట నుండగల్గిరి. వారిచట నెవ్వరికి నెగ్గ నేయలేదు. అమెరికానుండి అభ్యాగతుడుగా నేతెంచి భారతదేశమున నున్నంతకాలము వీరపాయకరముగ వర్తించినట్లు 'నిరంకుశ'వాదులలో పెద్దమొదలు చిన్నవఱకు నొక్కడును తలంపలేదు. అయినను వీరు తమ్మికముం దీదేశమునకు యాత్రికుడుగగాని, నిత్యనివాసిగగాని రానిత్తురను నిశ్చయత యేమియు నిప్పు 'దేవతల'నుండి పడయలేదు.

వీరిని బ్రిటిషు, ఇండో బ్రిటిషు నిరంకుశప్రభుత్వము విసిగించుట వీ రేమహాపరాధములు, దుష్ప్రవర్త



నలు గావించిరనియో తెలియదు. యుద్ధసమయమున వీరు అమెరికాయందు పౌరస్వత్వము బడయుటయే వీరిమహాపచారమని యొకప్పుడు వదంతి ప్రబలెను. కాని అట్లు చేసు లైరోపీయులును, అం దెందఱో బ్రిటనులు పైతము ను అచట పౌరస్వత్వము బడసియుండిరి. అట్టివా రెవ్వరు నిప్పువచ్చినపుడు తమ జన్మదేశముల సందర్శించుటనుండి కాని, అచట నివసించుటనుండికాని నిషిద్ధులైనట్లు తెలియరాలేదు. కావున డాక్టరుబోసుగారు గౌరవర్ణము గాక బూడిదరంగు దేహమువా రగుట చేతనే యిట్లు శిక్షాపాత్రులైరనుట తెల్లము; అదికాక వారు బ్రిటిషు ప్రజగా జనించు దుర్భాగ్యమునకు పాల్పడుటచే, అమెరికను లయి విముక్తులగుటకు సంకల్పించియుందురు. కాని బ్రిటిషుప్రభుత్వమునకును, బ్రిటిషువారికిని కులవిశ్వాసమున్నది—ఒక్కసారి (బ్రిటిషు)ప్రజ లైనవారు ఎప్పటికిని (బ్రిటిషు) ప్రజయే. భారతదేశపు బ్రాహ్మణోత్త

ఆంధ్ర గ్రంథమాల

నెం. 7 తంబుశెట్టివీథి, మద్రాసు.

ఈ గ్రంథమాలయందు విజ్ఞానాభ్యుదయమునకు సాధనములై వివిధ విషయములకు సంబంధించిన గ్రంథములు రెండుమాసముల కొకగ్రంథము వంతున బ్రచురింపఁబడును.

వెలువడిన గ్రంథములు

1. శతకమంజరి (భక్తిసంపుటము): వృషాధిప, సర్వేశ్వర, దేవకీనందన, ఒంటిమిట్టరఘువీర, నారాయణ, కాళహస్తీశ్వర, దాశరథి, రంగశాయి, రామతారక, రామచంద్ర శతకములు పది యిందు గలవు. ఒక్కొక్క శతకమునకు పీఠికయు, పాఠభేదములును గలవు. (ఈ శతకములు విడిగను దొరకును.) ౧-౮-౦
2. బసవపురాణము (ద్విపద): పాల్కురికి సోమనాథుఁడు. అనేక తాళపత్రమాతృకలను బరిశీలించి కూర్చిన మూలము. పాఠభేదములు సూచింపబడినవి. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసిన విపులమగు పీఠిక గలదు. ౨-౮-౦
3. గాంధిమహాత్ముని బెల్గాము కాంగ్రెసు అధ్యక్షోపన్యాసము ౦-౪-౦
4. కమలాక్షి (చిన్న విచిత్రకథ): శ్రీ రాయసం వేంకటశివుడుగారు, యమ్.ఏ., యల్.టి. ౦-౮-౦
5. నీతినిధి: ఇది యొక యుత్కృష్టనీతిగ్రంథము. ఇది తొలుదొల్త రెండువేలేండ్లకు ముందొక భారత పండితునిచే టిబేతుభాషయందు రచియింపబడి పదపడి యనేకభాషల బరివర్తితమై వ్యాప్తిని గన్నది. అనువాదకులు: శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ౧-౪-౦
6. త్యాగరాజస్వామిచరిత్రము (పద్యకావ్యము): శ్రీ పసుమర్తి కృష్ణమూర్తిశాస్త్రి కృతము. శ్రీరామభక్తాగ్రణియు, గాయకపితామహుడు నగు శ్రీ త్యాగరాజుగారి చరిత్ర మిందు సరసముగ వర్ణింపబడినది. సందర్భానుసారముగ త్యాగరాజుగారు రచియించిన కృతులును నిందుఁ జేర్పబడినవి ౦-౧౦-౦

7. ధమ్మపదము (వచనము): బౌద్ధమత ధర్మప్రబోధక గ్రంథ మగు ‘త్రిపిటకము’ నందలిది. బౌద్ధమతధర్మతత్త్వము లిందు చక్కగా ప్రతిపాదింపబడినవి. అనువాదకులు: శ్రీ కిళాంబి రంగాచార్యులుగారు, యమ్.ఏ., యల్.టి. ౦-౧౦-౦

8. భీష్ముడు (అయిదంకముల నాటకము): నార్వే దేశపు కవిశిఖామణి యగు ఇబ్ సను గారి బ్రాండు అను నాటకమున కనువాదము. అనువాదకులు: శ్రీ పొణకా పిచ్చిరెడ్డిగారు, బి.యే. (ఆనర్సు) ౧-౦-౦

9. జీర్ణవిజయనగరచరిత్రము: శ్రీ కుంకూరి ఈశ్వరదత్తుగారు, బి.యే. శ్రీ కృష్ణదేవరాయ సామ్రాజ్యలక్ష్మీపీఠ మగు విద్యానగరము (హంపిశిథిలముల)యొక్క ప్రాచీనచరిత్రము, ప్రకృత జీర్ణస్థితియు నిందు వర్ణితము లైనవి. ౧-౮-౦

కాశీనాథుని నాగేశ్వరరావు, వ్యవస్థాపకుడు.

ఆంధ్ర దినపత్రిక

ఆంధ్రదినపత్రిక	పొరుగూరివారికి	చెన్నపట్నంవారికి
సంవత్సరమునకు	౨౪-౦-౦	౨౦-౦-౦
ఆరుమాసములకు	౧౨-౦-౦	౧౦-౦-౦
మూడుమాసములకు	౬-౪-౦	౫-౪-౦
మాసమునకు	౨-౨-౦	౧-౧౨-౦

వార పత్రిక

వారపత్రికకు సంవత్సరచందా ౪-౦-౦

వారపత్రిక సంవత్సరమునకు తక్కువ కాలమునకు పంపబడదు.

విభవ సంవత్సరాదిసంచిక వెలువడినది

త్వరలో ఆర్డరులను పంపుకొనుడు.

దినపత్రిక చందాదారులకు	౧-౧-౦
వారపత్రిక చందాదారులకు	౧-౪-౦
చందాదారులు కానివారికి	౨-౦-౦
పాతసంచికలు సంచిక ౧ కి	౧-౩-౦
సంచికల సంపుటకు తపాలఖర్చులు ప్రతి ౧ కి	౦-౪-౦


ఆంధ్రపత్రికాకార్యాలయము, నెం. 6, 7 తంబుశెట్టి వీథి, మద్రాసు.

ములు శూద్రకులజాతుడు బ్రాహ్మణుడు కాజాలడని విశ్వసించినట్లే బ్రిటను దేశపు గౌరబ్రాహ్మణులు భారత దేశపు రాజకీయశూద్రుడు ఐరోపా అమెరికాల రాజకీయబ్రాహ్మణజాతికి చెందరాదని విశ్వసించుచున్నారు.

[మాడరన్ రివ్యూ ఆగస్టుసంచికనుండి]

మట్టునుండి పైమెట్టునకు

డాక్టరు ఆనీ బెసంటమ్మగారి కుమారుడును, సుప్రసిద్ధ గ్రంథకర్తయగు సర్ వాల్టరు బెసంటుగారి భ్రాతృవ్యుడు నగు ఆర్థర్ డిగ్బీ బెసంటుగారు ఇరువదివత్సరములకాలము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్చుఅరీస్ (జనన మరణముల సంఖ్యలు మొదలగువాని గూర్చిన లెక్కల తయారుచేయు కార్యాలయము)న కధ్యక్షులుగనుండి మానుకొనినవారు.



వా రింకను క్లెరికల్, మెడికల్ అండ్ జనరల్ లైఫ్ అస్యూరెన్సు సొసైటీకి జనరల్ మేనేజరును, ఆక్చుఅరీయునై, ఆసంఘమునొక్క చరిత్రమును గ్రంథముగ వ్రాసినవారు. ముందుకు మంచి యవకాశము లుండును ఫస్టుగాను సివిల్ సర్వీసులో చేరుతలంపుతో వీరు పోర్ట్స్‌మత్ లోని రెయొక్‌స్కూలునుండి లండనులోని యూనివర్సిటీ కళాశాలకు వచ్చిరి. వారు లండను విశ్వవిద్యాలయమున బి. ఏ. పట్టము నందుకొనునప్పటికి సివిల్ సర్వీసునం దొకవిరామము కలిగినందున వీరిని భీమాకంపెనీలయందు వృత్తి నారంభింపు మని పెద్దలు సలహాల నొసగిరి. వీరి ప్రస్తుత కార్యాలయముయొక్క అప్పటి నిర్వాహకునితో పరిచయముకలిగెనపైని, వారమున కొక పౌండు వేతనముగొన్న తాత్కాలికోద్యోగము వీరికి లభించెను. మరికొన్నాళ్లకే చిన్నగుమాస్తాయొకడు జబ్బుపడిపోయి యాతనిస్థానము ఖాళీగా నుండుటచే బెసంటు గారు ఆయుద్యోగమునకు సంబంధించిన చిల్లరపనుల న్నియు తాను చేయగలుగుదునని నొక్కిచెప్పుటచే ఆయుద్యోగము వీరి కీయబడెను. మరికొన్నినెలలకే వీరు యాక్చుఏరియల్ శాఖకు మార్చబడి, కొలదికాలములో దాని ముఖ్యోద్యోగియైరి. తొమ్మిదేండ్లపిమ్మట వీరు అసిస్టెంట్ యాక్చుఅరీగా నియమింపబడి 1906 సంవత్సరములో, నప్పటి యాక్చుఅరీ తనయుద్యోగము చాలించుకొనిన పిదప, నతని పదవికి వీరిని హెచ్చించిరి. ఆరోగ్యభీమాకు సంబంధించిన యన్నిసమస్యలను పరిశీలించుటకై ప్రభుత్వము వారు హెల్తుకమిషనును నియమించినప్పుడు, ఈ బెసంటుగారి నాసంఘమునం దుద్యోగము స్వీకరింప నాహ్వానించియుండిరి.

['స్ఫియరు'-14-7-28]

దేశభాషలు—విశ్వవిద్యాలయము

శ్రీయుత గోపాల హల్దారుగారు 'వెల్ఫేర్' అను వారపత్రికయందు బోధనమున దేశభాషను ద్వారభాషగ త్వరలో నేర్పఱుపవలెనను విషయము చర్చించుచు చివరను సమంజసమగు ఈక్రిందిసూచనను గావించిరి: మన విశ్వవిద్యాలయ సదస్యు లిది గమనింప దగుదురు:

మనము మన విద్యాశాలలనుండి యాంగ్లమును బ్రాత్రిగ తొలగింపగోరుటలేదు. ఉన్న పరిస్థితులయందు సర్వకాలమునకు గాకున్న కొంతకాలమునకైన అది సెకండరీ విద్యాభ్యాసకులు చాలినంత జ్ఞానము గల్గియుండదగిన ముఖ్యవిషయముగ నుండవలెను. కాని నిర్విశేషముగ దేశభాషల సర్వతోజ్జీవనము మనము వాంఛింతుము; దానికై తపమునరింతుము. దానినే మనము ముఖ్యముగ నుపాసింపవలెను; వెలుపటియాశయప్రపంచమునకు మనల సంబంధించుకొనుటకు ఆంగ్లము నొకయుపకరణముగ మనము గావించుకొనవలెను. ప్రతిభారతీయ విశ్వవిద్యాలయమునను, తద్రాష్ట్రీయమున నిత్యనివాసులును, చిరనివాసులునగు ప్రతివిద్యార్థియు దిగవిడుపులేకుండ,

తి(ద్రావిడ)భాషయందు తగినంత పరిజ్ఞానము గల్గియుండ వలెనను నియమ ముండవలెను. ఇట్లు కలకత్తా విశ్వవిద్యాలయము వంగీయులను, వంగేతర భారతీయులను, ఆంగ్లో ఇండియనులను, ఐరోపీయులను—అందఱను వంగభాషా పరీక్షకు కూర్చుండ జేయవలెను. పరిశోధనమునకై బయటనుండి యేతెంచిన విదేశీయ విద్యార్థుల విషయ మునమాత్రమే యీనియమము సడలింప జెల్లును.

డెన్మార్కునందు
కోఆపరేటివు ఉద్యమము

'సరస్వతీ' (హిందీ) పత్రిక జూలై సంచిక యందు శ్రీయుత రమేశప్రసాదు, బి. యస్. సి. గారు వ్రాసిన వ్యాసమునుండి:

డెన్మార్కు దేశమున కోఆపరేటివు సంస్థలు మిక్కిలి వ్యాప్తిలోనికి వచ్చినవి. క్రీ. ౧౯౧౯ సం.న డెన్మార్కునందు ౧౮౬౧ కోఆపరేటివు సంస్థలుండెను. క్రీ. ౧౮౬౬ సం దచట నొక్క సహయోగ (కోఆపరేటివు) సంస్థ నెలకొనెను. ఈసమితి సంయుక్తసమితుల కావశ్యకములగు వస్తుజాలమును కొనుటయేకాక, అను దినము నుపయోగపడు వస్తువుల గొన్నిటి దయారు చేయుటకై యొక కర్మాగారమునుగూడ తెఱచెను. దీని యొక్క వపేరులు గ్రామములందు గలవు; ఎక్కువ మెంబర్లు రయితులు. డెన్మార్కు తన యభ్యున్నతి నిట్లు సహయోగమువలన నెక్కువగ గావించుకొన్నది.

డెన్మార్కునందు అప్పిచ్చు సహయోగసమితుల ప్రచారము జరుగలేదు. ఇందులకు గారణ మచ్చట రైతులకు ధన మావశ్యకము గాకుంటయు గాదు, అప్పిచ్చు సంఘముల సంస్థాపనమున వారు కృతకృత్యులు కాకుం టయు గాదు. డేనిషు ప్రభుత్వము రైతులకు వేరొండు రీతిని ధనసహాయత గావించుటయే యిందులకు ప్రధాన హేతువు. భూమిని దున్నువాడే భూమికి ఖామందు గా వలెనను నుద్దేశముతో డేనిషుప్రభుత్వము చిన్నచిన్న భూఖండములను గొనుటకుగాను రైతులకు సొమ్మిప్పి చ్చుచుండును. క్రీ. ౧౯౧౧ సం.న డెన్మార్కునందు ఒక కోఆపరేటివుబ్యాంకు స్థాపితమయ్యెను. దీనిషే రులు కోఆపరేటివు సంఘములు మాత్రమే కొనవలెను. ౧౯౫వ సం.న ౧౪౧౦ కోఆపరేటివు సంఘములు ఈబ్యాంకుతో సంబంధ మేర్పరచుకొనెను.

...ఇంకనేకవిధములగు సంఘములు డెన్మార్కునందు గలవు. ఇంచుమించు వ్యవసాయ విభాగము లన్నిటను, రైతుల సర్వకార్యము లందును సహయోగ సిద్ధాంతమననుకరించి డేనిషు రయితులు తమ యార్థి కొన్నత్యము గావించుకొనిరి. తొలుకొల్త సహయోగో ద్యమప్రచారము గావించిన వారి యాశయ మేమన, ప్రతివ్యక్తియు పూర్ణ వికాసమునందు విధమున సహయో గముద్వారా సాంఘికస్వాస్థ్యము గావించుటయే. ఈయాశ యముయొక్క సాఫల్య మింకను చాలదూరమునవున్నను, ఈసహయోగప్రచారము వలననే డెన్మార్కు రయితుల యందాత్మశక్తి యుద్భవించినది. దేశసంబంధములైన కార్యములన్నిటియందును డేనిషురయితులు పాల్గొను చున్నారు. వారిమూలముననే డెన్మార్కుదేశము నేటి యీపదమున నారూఢమైనది. ఈదేశపురయితులును డెన్మార్కు రయితులనుండి శిక్ష గఱచి తమకును, తమదే శమునకును ఔన్నత్యము ఘటియించుకొందురు గాక!

శిక్ష—జీవనసమస్య


'సరస్వతీ' (హిందీ) పత్రిక జూలై సంచిక యందు శ్రీ హరిశంకరద్వివేదిగారు వ్రాసిన వ్యాసమునుండి:

శిక్షాప్రణాళిని సరసమును, హృదయంగమము నొనర్చుటకు పెక్కుపాయములు గావింపబడినవి. హెచ్. క్రిస్లే జాన్సనుకన్య చెప్పిననాటకపద్ధతిని శిక్ష గఱపుట యన్నిపద్ధతులను మించినది. 'The Dramatic Method of Teaching' అను తనగ్రంథమున నామె నాటకమూలమున నెల్లవిషయములను బోధింపవలెనని

నుడివినది. నాటకముద్వారా సాహిత్యమును, ఇతిహాసమును చక్కగ బోధింపవచ్చునుగాని తక్కినవిషయముల బోధించుట యెట్లో యాలోచనీయము. 'పార్సుస్కూలు' ఉపాధ్యాయులగు కాల్డ్వెల్ కుక్కుగారు విద్యార్థులకు బోధనతోపాటు మనోరంజనము గూర్చుటకు నాటకమే కాక యింక ననేక పద్ధతుల నేర్పఱచిరి. తమకళాశాలయందు తమసామర్థ్యము సంపూర్ణముగ ప్రదర్శించుటకు విద్యార్థు లెంతయు సుత్సాహులగుచుందురు. వారొక్కొకపుడు తమలో దాము వాదవివాదములు గావించుకొందురు; ఒక్కొకప్పుడు చిన్నచిన్న యుపన్యాసము లిచ్చుచుందురు; ఒక్కొకపుడు కవిత్వము చెప్పుచుందురు; వేరొకప్పుడు తోచినచిత్రములు గీయుచుందురు.

ఇట్టిబోధనపద్ధతు లనేకములు కనిపట్టి పాశ్చాత్యలోకము శిక్షావిషయమున నొక నూతనయుగము సిద్ధపఱచినది. ఇందధికశ్రేయ మమెరికా గడించినది. అచటి యధ్యాపకులు ప్రజాతంత్ర పక్షపాతులు; స్వాతంత్ర్య ప్రేమికులు. కనుకనే వారు శిక్షణయందును స్వాతంత్ర్య ప్రచారమునకే కడంగుదురు. ఆ యాశయధార అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రముల విశాలవక్షముల భేదించుకొనియింగ్లండునందును,ఆసియాలోనికొన్ని భాగములందు నైతము నలజడికూర్చినది. కాని యింకను నది భారతదేశమును చేరినదో లేదో సందేహాస్పదము. చేరినను ఇచ్చటి నివాసులు తమసహజమాంద్యమునలనను, ఔదాసీన్యమువలనను తగినంతగ దానికి స్వాగత మొసంగజాలకున్నారు. నేటివఱకు వారు తమప్రాచీన గౌరవస్వప్నముల గాంచుచున్నారు. ప్రపంచమున నింతవేగముగ జరుగుచున్న పరివర్తనమునకు తా మెంతదూరమున నున్నారో అదికూడ వారికి దెలియదు. నిజమునకు మనప్రాచీనగౌరవమునెడ శ్రద్ధ వహించుట మంచిమాటయే; కాని మనవర్ణాశ్రమములను, జ్ఞానపిపాసను, సంఘీభావమును, ధార్మికభావములను తిరిగి యుజ్జీవింపజేయు నాలోచన యేమైన జరుగుచున్నదా? వైజ్ఞానిక సిద్ధాంతముల ననుసరించి ప్రతివారును పూర్వజన్మ సంస్కారములతో జనింతు రనునది సత్యమని యంగీకృతమైనది. ప్రతిమనుజునికిని సంస్కారానుసార మెట్లొకవ్యక్తిత్వ మున్నదో యట్లే ప్రతిజాతికిని సంస్కారగతమగు నొక ధర్మమున్నది. ఒకబాలకుని స్వతంత్రప్రకృతి నుపేక్షించుటచే నెట్లతని వ్యక్తిగత జీవనమునకు సంగ్రథనము లేకపోవునో యట్లే జాతీయవిశేషత నుపేక్షించుటచే సాంఘికజీవనమునకును సంగ్రథనము సాధ్యపడదు. ఈజాతీయసత్త్వ మనునది జాతీయాచార విచారములకంటె పూర్తిగ వేఱైనది. ఆచారాదులు జాతికి బహిరంగరూపములు; జాతీయసత్త్వము జాతికి అంతరాత్మ. జాతిఅంతరాత్మ అక్షయము, అమరము, సనాతనము. ఆచారాదికమందన్ననో, దేశకాలపాత్రభేదముల ననుసరించి మార్పులు గలుగుచుండును. దేశాచారము, లోకాచారము, యుగధర్మము మున్నగు శబ్దములే యిందులకు ప్రమాణములు. కాని యీజాతీయ సత్త్వము నేడును స్థాయియే. భారతదేశపు మతము, దర్శనము, సాహిత్యము, కళ మున్నగువానియందు జాతీయసత్తయే ప్రతిఫలించుచున్నది.

మనదేశమున శిక్షాపద్ధతి సఫలము కాకుండుటకు ముఖ్యకారణ మేమన, జాతీయసత్తకు తగిన సమ్మానమును, శ్రద్ధయు లభింపకుంటయే. మనశిక్షానౌక కెవ్వరు కర్ణధారులో, ఎవరు మనదేశమున నేటిశిక్షాపద్ధతిని ప్రచారము చేసి శిక్షానీతిని నియంత్రణము సేయుచున్నారో, వారిజాతీయ సంస్కారములు మనజాతీయ సంస్కారములకంటె నెల్లవిధముల భిన్నములు. కనుకనే వారు శుభచింతన గల్గియు మనజాతీయ శిక్షయందలి విశేషతను గుఱుతింపజాలకున్నారు. మనజాతీయసంగ్రథనమున కేశిక్ష యుపయోగకర మనునదియు వారు నిర్ణయింపజాలకున్నారు. ఈవిషయమున శిక్షితసమాజము ఉదాసీనత వహింపక, అమెరికా, ఐరోపాలయందలి యుద్యోగశీలురైన యధ్యాపకులవలె జాతీయశిక్షనున్నతమొనర్చు ప్రయత్నముల గావించినచో, జాతీయశిక్షాప్రవాహము నేను వేఱుమార్గమున నుండెడిది. సంఘసంస్కర్తలును, దేశనాయకులును ఇక శిక్షామూలమున సంఘసమస్యలను, దేశసమస్యలను సాధింప సమకట్టవలెను. అప్పుడే వాస్తవౌన్నత్యము లభించును.


తన్నామన్నా బయ్యరన్నా
తన్నామన్నా బయ్యరన్నా
తన్నామన్నా నా నా నా
తన్నామన్నా
తన్నామన్నా సిగరెట్లు అగ్గాకు రెండు పాకెట్లు
తలనొప్పిగా ఉంది కొంటాను తన్నామన్నాం జనము రుద్ధమన్నారా?
తలిశెట్టి రామారావు

భారతనారీమణులు-శాసనములందు వారికి గల స్థానము

'డక్కా' విశ్వవిద్యాలయమున న్యాయశాస్త్రపండితులగు శ్రీ నిర్మలచంద్రపాల(యం. ఏ., బి. యల్.)గారు ఆగస్టు మాడర్న రివ్యూ పత్రికయందు భారతదేశమున స్త్రీలకు ప్రతికూలములగు శాసనములవలన కలుగుచున్న ఇబ్బందులనుగూర్చి చర్చించుచు నొకవ్యాసమును ప్రకటించినారు. అందాయన ప్రాచీనకాలమునుండియు ప్రపంచమున స్త్రీలు కేవలము దాసీజనముకన్న నికృష్టముగ పరిగణింపబడుచున్నారనియు, వారికి పురుషులపై నెట్టి యధికారమును లేకపోవుట యటుండ తమ శరీరములయెడను, తమస్వత్వముయెడను నైతమింతయైన నధికారము లేకున్నదనియు, తరువాత క్రమముగా నేర్పడిన శాసనములు కూడ వారి కేయనుకూలమును కలిగించి యుండలేదనియు నుడివిరి. ఇటీవల నితరదేశములయందు కొన్ని శాసనములు పుట్టి స్త్రీల నిర్బంధములను సడలించుచున్నను భారతదేశముమాత్ర మున్నచోటనే కదలక యున్నదనిరి. మన దేశమున నెల్లజాతుల స్త్రీలకును పట్టినగతి యిట్టిదే యగుననిరి. మొదటినుంచి దిఙ్మాత్రముగ నీచరిత్రనంతయు చెప్పి చివర కిట్లు చెప్పిరి.

భారతదేశమున... భార్యయైనను, తల్లియైనను, కూతురయినను, సోదరియైనను-స్త్రీకి కుటుంబమున నెప్పుడు, నెట్టియధికారమును లేదు. ఇందువలన మనకు స్త్రీలయెడగల గౌరవప్రతిపత్తులు ఏయితర జాతికంటెను ఇంత లేని కొంతవఱకనుట సత్యముకాదు. ప్రత్యుత, ప్రాచీనకాలమునుండియును స్త్రీలు గృహములకు అధికారిణులుగ నున్నారు. స్త్రీలయెడ గౌరవభావము గలిగియుండుట ఆర్యావర్తనివాసులకుగల గొప్పగుణములలో నొక్కటియై యున్నది.

మనువు ఇట్లు చెప్పినాడు:

శ్లో. యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః;
యత్రైతాస్తు నపూజ్యన్తే సర్వా స్తత్రాఫలాః
క్రియాః.

[ఏయింట స్త్రీలు పూజింపబడుదురో ఆయింట దేవతలు తృప్తిగాంతురు. ఎచ్చట వారు పూజింపబడరో అచ్చట (దేవతా ప్రసాదాభావముచే యాగాది) సర్వక్రియలు నిష్ఫలము లగును.]

"శతాపరాధములు గలదయినను స్త్రీని పూవుచే నయినను కొట్టరాదని" మఱియొక మహనీయుడు నుడివెను. మనకు స్త్రీలయెడ గల గౌరవము గాఢమేయగు గాక! ప్రతికూలశాసన నిర్బంధములచే వారిని మనకన్న నికృష్టమయిన స్థితియందుంచుట అనుచితము. స్త్రీని గాని, పురుషుని గాని, కేవలసాంఘికశక్తులుపేక్షించినపుడు వారిని రక్షింపబూనుట శాసనముల ముఖ్యకృత్యము. మనుజుడు పిచ్చివాడు, మూఢుడు, బాలుడు అయినపుడు—అనగా సామాన్యమానవునికంటె బుద్ధియందుకాని, ఈడునందుకాని కొరవడినపుడు—శాసనప్రతిబంధము వలన బాధచెందును. ఈనాటి పురుషుడెవ్వడు నాతుకను తెలివితేటలయందు గాని, ఏయితరగుణములయందుగాని పురుషునికంటె తక్కువయని నిరూపింపడు. ఒక్క స్త్రీని, పురుషుని ప్రత్యేకము పరిశీలింతము. పెక్కుఱు మగవారికంటె నసంఖ్యాకులను నాడువాండ్రే యెల్లవిషయముల చాల నుత్తములుగా నున్నారు. ఇక భారతదేశమున స్త్రీలకు ప్రతికూలశాసనవిధాన మేల? ప్రపంచమునందలి యెల్ల నాగరకజాతులును స్త్రీలకు పురుషులతో సమానాధికారము నంగీకరించినవి. భారతీయులుమాత్ర మాలసించి వెనుకబడియున్నారు. ప్రపంచమున మనముమాత్రమే యింకను మధ్యయుగము

వారి కనుకూలములయియుండిన శాసనములతో తృప్తి చెందియున్నాము.

మనకుటుంబమునందలి స్త్రీలకు మనతో సమానముగు హక్కులను, బాధ్యతలను మనమొసగనంతవఱకు విదేశీయులు మనలను తిరస్కారదృష్టితో జూచుచుందురు. మఱియు ప్రపంచమునందలి యితర నాగరక జాతులతో సమాన పదభాజనులనుగ మనల నామోదింపగోరుట యన్యాయము. మన మీవిషయమున దేశకాలముల ననుసరించి చాలమార్గము ముందుకు పోవలసియున్నాము. ఇపుడు భారతదేశమున స్త్రీలకు కొంత స్వాతంత్ర్యము లభించినది. కాన తమశక్తిని వినియోగించి తమకు పురుషులతో సమానముగ హక్కు బాధ్యతల నొసగుటకయి శాసనములను నిర్మింప శాసననిర్మాణసంస్థలను కోరవలసిన బాధ్యత వారిపైననే కలదు.

పురుషులు స్త్రీలయెడ న్యాయైకదృష్టితో ప్రవర్తింపనపుడు స్త్రీలు తమ యభ్యుదయము కొఱకు తాము ప్రయత్నించు టావశ్యకమే యగును.

జీవిత దశాపట్కము

భావప్రకటనముల యొక్కయు, వేషధారణాదులయొక్కయు చోద్యమైన అనుశీలము.

భారతదేశ వ్యవసాయమును గూర్చిన రాయల్ కమిషనుం దొక సభ్యుడుగనుండిన డాక్టరు నగేంద్రనాథ గంగోలీగారి సోదరుడు శ్రీ సురేంద్రనాథ గంగోపాధ్యాయగారు మానవుని జీవిత దశాపట్కమును ప్రకటించుటకై తెల్చిన రూపముల చిత్రముల నిందుతో ప్రచురించుచున్నాము.

జీవితకాలపు వివిధవయస్సులందలి మనోవృద్ధిని నిరూపించుటయు, ముఖ్యైఖరుల పరివర్తనములను ప్రదర్శించుటయు, సామాన్యప్రతిభ కతీతమైన కార్యములు. భావప్రకటనరీతుల మార్పులను చేయుటయందు శ్రీ గంగోపాధ్యాయగారసామాన్యప్రజ్ఞ గలవారు.



25 వ సంవత్సరమున



35 వ సంవత్సరమున



55 వ సంవత్సరమున



65 వ సంవత్సరమున



75 వ సంవత్సరమున



95 వ సంవత్సరమున

బంగాళీనాటకరంగమునందు ప్రత్యేకగుణయుత మగు భారతీయహర్షాంతనాటకములను ప్రవేశపెట్టి తమప్రయత్నములందు విజయవంతులైనవారిలో నీతఁడే ప్రథము డనదగును.

1919 వ సంవత్సరమున నితడు ఇండో బ్రిటిషు ఫిల్మ్ కంపెనీని స్థాపింపజేసెను. జయప్రదము లగు పెక్కు ఫిల్ములను తయారుచేసిన లోటస్‌ఫిల్మ్ కంపెనీ కితడు సర్వాధిపతి.

నాటకరంగమున శ్రీగంగోపాధ్యాయగారు భారతీయ హర్ష నాటకనటులలో కెల్ల గొప్పవాడని పేరుగడ సెరి. యద్భుతనటనాకౌశలమును, గుణానుభవప్రదర్శనములును, అతనియత్యున్నత కళావాసనలను బహిరంగ పరచుచున్నవి. అతనిసర్వతోముఖ కౌశలమును నిరూపించు ననేకచిత్రముల సంపుటములు నేను అమ్ముడు పోవుచున్నవి.

సినిమావిచారణ సంఘమునెదుట నతనిసాక్ష్యము బంగాళములోని ఫిల్మ్‌పరిశ్రమకు గొప్పమరుపనమును కలుగజేసినది. అతనిసూచనలును, సలహాలును ప్రభుత్వోద్యోగవర్గమునందును మంచియామోదమును, సాంగత్యను గాంచినవి.

అతడు బంగాళమున ఫిల్ములుతయారుచేయు కంపెనీ నొకదానిని పెద్దయెత్తుమీద ప్రారంభింప ప్రయత్నములు సాగించుచున్నాడని తెలియవచ్చుచున్నది.

(ఇండియన్ డెయిలీ మెయిల్, ఆగష్టు, 2.)

బరోడా సంస్థానము—అనువత్సరవిద్యాభివృద్ధి

"బరోడాసంస్థానమున కడచిన సంవత్సరమునందు సమకూడిన విద్యాభివృద్ధిని వివరించు నుపదేశప్రాయమ యిన యీక్రిందివాక్యములను బ్రిటిషు భారతదేశ ప్రభుత్వము గుర్తించి తాను భారతీయులకు సమకూర్చిన విద్యాభివృద్ధి మార్గములతో పోల్చి చూచుకొనదగును.

'సంస్థానమందలి పట్టణములయు, పల్లెలయు సంఖ్యనుబట్టి చూచుచేని సరాసరి ప్రతిపట్టణమునకును, ప్రతి పల్లెకును ఒక్కొక్క పాఠశాల గల దనవచ్చును.

పురుషుల జనసంఖ్యలో సరాసరినూటికి పదునేడుగురు బాలురు చదువుకొనవలసినవయసులోనివారున్నారని నిశ్చయింతుమేని పాఠశాలలలో గతసంవత్సరమున నూటికి ౭౭.౮ బాలు రుండగా నీసంవత్సరమున ౭౯.౫ గలరనియు, అట్లే స్త్రీల జనసంఖ్యలో నూటికి పండ్రెండుగురు బాలికలు చదువుకొనవలసినవయసులోనివా రున్నారని నిశ్చయింతుమేని గతసంవత్సరమున నూటికి ౫౫.౧ బాలికలుండగా నీసంవత్సరమున ౫౬.౬ గలరనియు లెక్కలు తేల్చుచున్నవి.

పంచమబాలురకు ౨౭౯ విద్యాశాలలుగలవు. వానిలో నాలుగుబాలికలవి. వానియందు ౯,౫౭౧విద్యార్థులు చదువుచున్నారు. ఇదిగాక సాధారణ గుజరాతి పాఠశాలలలో ౪,౭౬౩ పంచమ విద్యార్థులు చదువుచున్నారు. అస్పృశ్యతాపిశాచముయొక్క పట్టు సడలుచున్నది. ఉన్నతజాతులవారు మనుకొను హిందువులపాఠశాలలయం దుపాధ్యాయులుగను, పరీక్షాధికారులుగను ప్రవేశించుచున్నారు. బరోడా, అమ్రేలి, పటాను, నవసారులలో నాలుగు అంత్యజవసతిగృహము లున్నవి. వాని యాశ్రయపోషణములనుబడసి ౧౩౭ పంచమబాలురు చదువుకొనుచున్నారు.

పట్టణ, మండల పుస్తకభాండాగారము లచ్చట ౭౫ గలవు. గ్రామపుస్తకభాండాగారములు ౧౮౮ గలవు. పుస్తకభాండాగారశాఖకు చెందిన భిన్నభిన్న విభాగములు—స్త్రీ, శిశుపుస్తక భాండాగారములు మొదలయినవి—తమవిధులను తృప్తికరముగ నిర్వహించుచున్నట్టు చూపట్టుచున్నది.'

[మాడరన్‌రివ్యూ, ఆగస్టు]

యువకుల కొకసందేశము

శ్రీయుత టి. యల్. వాస్వానిగారు 'స్కాలరు' అను పత్రికయందు ప్రకటించిన 'యువకుల కొక సందేశ' మను వ్యాసము

మానవుఁడొకమహత్ప్రయోజనము నుద్దేశించి ఆత్మసమర్పణము కావించువిధానమును తార స్వరమున గానము చేయుచున్నది.

ఉత్పాదనశీలురు కండు. అనుకరణశీలురు కాకుడు.

సులభములయిన అనుకరణమార్గములు సాధనమార్గములు గావు.

భారతదేశమును క్రొత్తగావించుటకయి పలసిన సామగ్రికొఱకు రష్యావంకకు జూడకుడు; ఇటలీవంకకు జూడకుడు; ఇంగ్లాండువంకకు జూడకుడు.

ప్రతిజాతియొక్క అనుభవములను దెలిసికొనుడు. దేనిని అనుకరింపకుడు.

అనుకారులు కాకుండుడు; మీరు మీరుగ నుండుడు.

ప్రతిజాతియు తన యాదర్శములందును, ధీశక్తియందును నడుగియున్న పరిణామసిద్ధాంతమునకు తల యొగ్గవలెను.

అనుకరణము ఆత్మహననము; స్వాతంత్ర్యము ఆత్మవ్యక్తీకరణము. (Self Realization)

భారతదేశము తానుగ నుండవలెను; కేవలము తనదిగనే యుండవలెను.

గాఢక్షోభను జెందియున్న భారతదేశ మాకాంక్షించుచున్నదానిని రష్యనుల సాంఘికవాద మొసగజాలదు; బ్రిటిషువారి పారిశ్రామికవాద మొసగజాలదు; దుస్సాహసమునకు, కలహములకు మూలమయిన పాశ్చాత్యనాగరకత యొసగజాలదు.

భారతదేశము విశ్వోపదేశక మయినది.

కాబట్టి మీరు మహర్షులయు, మహాసిద్ధులయు పవిత్రసందేశముల నాలకింపుడు. సనాతనజ్ఞానముయొక్కయు అధునాతనవిజ్ఞానముయొక్కయు శక్తులను మేళగించి భారతదేశమును బలవంతుల దేశముగను, స్వతంత్రుల దేశముగను క్రొత్త నిర్మింపుడు.

కీ. శే. డేము ఎల్లెను టెర్రీ



ఆంగ్ల నాటకరంగమున పెద్దపేరు కన్న నటకురాలు. ఈమె 8 యేండ్ల వయసునుండి పెక్కురకముల స్త్రీపాత్రలనుధరించి కీర్తినిగాంచినది. షేక్స్పియరు మహాకవినాటకములయందలి నాయికల పాత్రములను ఈమె అద్వితీయముగా ప్రదర్శించెడిది.

వ్యాయామము

శ్రీయుతులు స్వామి సత్యదేవపరివ్రాజకులు జర్మనీయందలి వ్యాయామమునుగూర్చి

యొక మంచి సచిత్రవ్యాసమును 'సరస్వతీ' (హిందీ) పత్రిక జూలై సంచికయందు ప్రకటించిరి. అందు వారు పాశ్చాత్యదేశము లెన్నియో దుర్వర్తనములకు లోనయ్యు పతనము నొందకుండుటకు బాలబాలికలును, యువతీయువకులును నిత్యము వ్యాయామము సల్పుచుంటయే కారణమని ప్రసంగించుచు నిట్లు వచించిరి:

సమూహాలును, మల్లులయు, వీరులయు మూర్తులును నేడును వారి యానిర్మలకీర్తిని దలపించుచున్నవి. ఏజాతి తనపిల్లలను వ్యాయామశాలలకు పంపుచుండునో, ఏజాతి చాలినంతయుత్సాహము, నుత్తేజనయు నొసంగి తనవీరుల వర్ధిల్ల జేయునో, ఏజాతి తనస్త్రీలను పురుషులవలె నారోగ్యవతులు, వికాసవతులు, చురుకుదనముగలవారు నగుటకై వారిచే వ్యాయామము చేయించుచుండునో, అది సర్వదా స్వతంత్రమును, బలయుతమునై విలసిల్లును. జర్మనీ ఆతత్త్వము నధిగమించినది. బాలురు నాట్యశాలలకు పోవుదురు; బాలికలు నాటకాదిప్రదర్శనములందు తమ ప్రియులతో గలియుచుందురు; మద్యమాంసములు మస్తుగ జెల్లుచుండును: స్త్రీపురుషులు దండిగ సిగరెట్లు త్రాగుచుందురు: ఇన్నియు చేయుచున్నను వారు తమ దేహమును, వ్యాయామశాలను మఱవరు. జీవనరసము నుత్పన్నము చేసికొనుటకు వారు నిరంతరము యత్నించుచుందురు.



పరస్పరచింత జర్మనయువకులు మాతృభూమిధ్యానము చేయుచు వ్యాయామము చేయుచున్నారు.

సత్యమై సుఖదమై యొప్పు సాత్వికాదర్శమును బడసి, అఖండజీవనదీప్తి జాడలు గనిపట్టి, జీవనరసామృతాస్వాదనము గావించి, విశుద్ధమార్గము ననుగమించి, తా నాదివ్యప్రవంతి వంకకు ఐరోపాఖండపు పరమపురుషార్థమునుగూడ వెంట గొంపోవు దేశ మేదేని యున్నచో మహాభాగ్యమే. పవిత్రాశయసంకలితు లగు బాలబాలికలు, ఆధ్యాత్మిక భావము లగ్గుగా పెరిగిన నాగరికులు వేలకొలదిగ ప్రాతస్సాయములు వ్యాయామశాలలనుండి వెలువడునపుడు, దేశోన్నత్యపు జయనాదములతో ఆవీరులును, వీరాంగనలును నలుదెసల మారుమ్రోగించునపుడు, లోకమున నొక నూతనమగు— అభయదాయకమగు—

'వ్యాయామము! వ్యాయామము!' నిజముగ నిది జాతియొక్క జీవన రసప్రవాహము. ఆరోగ్యమున కిది భీమా. అరుగ్ణభావముల కిది మిత్రము. నిర్భయత కిది ఖజానా. జీవనానందమున కిది మంత్రము. గ్రీకులు వ్యాయామప్రియులై యుండినకాలముననే కళావిజ్ఞానదర్శనాదులకు పునాది వైచికొనిరి. వారి ఆనాటి లక్ష్యమే నేడు ఐరోపాకు స్ఫూర్తి నిడుచు నాటి ప్రాచీననామముల నమరముల గావించుచున్నది. గ్రీసుదేశపు చెక్కడపు


యుగము ప్రాదుర్భవించిపోవును. ఫ్రాన్సు విప్లవముత్ప న్న మొనర్చిన జాతీయతాయుగము భీకర భూకంపగ



బాలికలు వ్యాయామక్రీడ గావించుచున్నారు.

తికి పరిణామము. అందు సామ్రాజ్యలోలుపత, ఇంద్రియసుఖలాలస, ప్రకృతివాదము నిండియున్నవి. ప్రపంచము పాశ్చాత్యకస్వరూపము గల జాతీయత కెదురుచూచుచున్నది. పశ్చిమదేశములందలి లక్షలకొలది స్త్రీపురుషులు ఆ నూతనయుగపు ఆధ్యాత్మిక జాతీయవాదమునకై కొట్టుమిట్టాడుచున్నారు.

జాతీయశక్తియొక్క జీవనరసస్థాయి స్రోతపు దివ్యదర్శనమును భావిభారతజాతి యొక్కటియే చేయింపగలదు. మనకు ఐరోపాఖండపు పరమపురుషార్థము కావలెను. ఐరోపాలో జర్మనీ ఆపరమపురుషార్థమున శిరోమణి యైయున్నది. ఐరోపామహాసంగ్రామము జర్మనీఅహంకారమును భగ్నపరిచినది: మంచిపని యైనది. జర్మనులు తమ్ముగాక యింకెవరిని గణించెడివారే కారు. ఇప్పటికిని కొంతవఱకు దా స్వార్థాధిక్య సంస్కారము మిగిలిపోయియున్నది. మహాసంగ్రామానంతరము జర్మనులయందు నడకువ జనింపసాగినది. పరమపురుషార్థమున వారు యూరపున కంతకును ముందంజ యిడుచున్నారు. కావుననే జర్మను బాలబాలికల చిత్రములు నాదేశవాసులకై యిందు ప్రకటించుచున్నాను. నేడీభారతీయ సంగ్రహణ యుగమున మనము జర్మనీదేశపు పరమపురుషార్థమును మనోగత మొనర్చుకొనవలయును. ప్రతిగ్రామమునను, ప్రతి జనపదమునను, ప్రతినగరమునను వ్యాయామశాలల సంస్థాపించి బాలబాలికల నెల్లర నటకు పంపుచుండవలెను. భూమిలో పాతుకొన్న ధనముల వెలువతీచి నేడు జాతీయశక్తి జీవనరసము నుప్పతిల్లఁ జేసికొనుట యుచితము. బాలికారత్నములను నగలతో నడపక వికాసవతులు, నిర్భయురాండ్రును నగుచుండునట్టి వీరాంగనల గావింపుడు లంపటుల బానిసలయి పగలుగునట్టియు, విదేశప్రవేశము



బెర్లినునందలి సుప్రసిద్ధవ్యాయామశాలయందు బాలికలు రెక్కలు అడుగులఎత్తునుండి నీటియందు దుముకుట

లనిర్బంధవివాహశాసనము పగలబట్టియు బాలికల పయూరుచేయును. మనయాధ్యాత్మ వాదములును, వనయుపనిషత్తులును వ్యాయామశాల లనువాలయములు లేకున్న వట్టి శబ్దాడంబరములు మాత్రమే యగును.


ప్రథమ భారతీయ వైమానికుడు

యస్. ఏ. అణ్ణామలై శెట్టిగారు

మిస్ మేయోగారి దేశపు వివాహనీతి

న్యాయాధిపతి శ్రీ బి. లిండ్సేగారును, వెయిన్ రెయిట్ ఇవాన్సుగారును "రివోల్టు ఆఫ్ మాడరన్ యూత్" అని యొక గ్రంథమును రచించిరి. ఆ గ్రంథమునుండి కల్పద్రుమ పత్రిక గైకొనిన భాగమునకు అనువాదము:—

"1920, 1921 సంవత్సరములలో డీనీవరు జువెనల్ (పిల్లలు చేసిన నేరములను విచారించుట కేర్పడిన) కోర్టువారు ఉన్నతపాఠశాలల (హైస్కూల్సు)లో చదు



ఇతడు నాటుకోటశెట్టి తెగవారిలో గొప్ప ధనవంతుడు. జర్మనీ, ఇంగ్లాండులందు విమానమును నడపించుటకు అభ్యసించెను. జర్మనీనుండి 'జంకర్ ఏ' అను 110 గుఱ్ఱముల వడిగల విమానమును 80 వేల రూపాయలకు కొని తెప్పించినాడు. ఈ విమానమున ముగ్గురు కూర్చుండవచ్చును. అణ్ణామలైశెట్టిగారీ చిత్రమున నున్నవారే.

వుటకు తగినవయస్సులో ఉన్న దోషులయిన 769 మంది ఆడపిల్లలను విచారించినారు. ఈపిల్లలందఱును 14 మొదలు 17 సంవత్సరముల వయసుగలవారలు. వీరిలో 465 గురు ఇప్పుడు పాఠశాలలలో లేరు. 804 రు ఇంకా చదువుచున్నవారే. ఈ 769 మంది ఆడపిల్లలమీద వచ్చిన నేరములలో అధమము 2000 మంది మగపిల్లలకైనా ప్రత్యక్షసంబంధ మున్నది. ఇంతమంది ఆడపిల్లలలోను 365 గురిని గురించి ప్రత్యేకము వారిసంగతి సంద

ర్షములను విచారించి తెలుసుకొన్నారు. వీరిలో 313 గురు 11, 12 సంవత్సరము లప్పుడు-అందు చాలమంది ముఖ్యముగా 11వ యేటనే-రజస్వలలయినారు. ఈ 313 రిలో 285 గురు 11, 12, 13 సంవత్సరముల వయస్సులో రజస్వ లయిరి. 28 గురు మాత్రము 14, 15, 16 సంవత్సరముల వయస్సులో రజస్వలలయిరి. ఆలస్యముగ రజస్వలయగువారికంటె శీఘ్రముగ రజస్వలయగువారే సంపర్కదోషములో తగులుకొనునట్టి అపాయస్థితిలో నున్నారు. ఇట్టి బాలికలగాంచిన మగపిల్లలు వారిని బాగా ప్రేమింతురు. అట్టి యాడపిల్లలకు సంభోగమునుగురించిన జ్ఞానమేర్పడును. పరిణతమయిన బుద్ధినికూడ అతిక్రమించి కోర్కెలు పరుగులెత్తుచుండును. అవయవవికాసమును గురించిన తర్కము మున్నగునవి వారి కప్పుడేమియు తోచదు. 11, 12 సంవత్సరములప్పుడే అట్టి పిల్లలకు 18 సంవత్సరములు అంతకెక్కువ వయస్సుగల ఆడపిల్లలకుండే కోర్కెలు, అక్కరలు ఉండును. పెద్దవారికి ఉండే యుక్తాయుక్త పరిజ్ఞానము సహజముగా ఉండని ఆవయస్సులో నిగ్రహము లేకపోవుటవలన రజస్వలయగుట వినాశకరముగా పరిణమించుచున్నది. మగపిల్లలతో రహస్యసంబంధముగలదని ఒప్పుకొన్న 495 గురు ఆడపిల్లలలో 20 మంది కొక్కొక్కరు చొప్పున గర్భిణులయినారు. ఈరీతిని చూచినయెడల నూరుమంది గర్భిణులు కలరన్నచో 1900 లమంది అయినా గర్భస్థితి దాటినవారు కలరన్నమాట. అనగా 3 లక్షల జనసంఖ్యగల నగరములో 200 మంది అక్రమగర్భిణులు ఉన్నారన్నచో 3800 మంది అయినను గర్భము గలుగకుండా దాటినవారు కలరనియు అందు వీరందరు పాఠశాలలో ఇంకా చదువుచున్నవారుగానో, చదువు మానినవారుగానో, ఉన్నతపాఠశాలలో చదువుచుండిన వయస్సు గల వారుగానో ఉన్నారనియు తెలియుచున్నది. ఇంతకు ఈ సమస్య అంతయు ఇంటినిబట్టి యున్నది. ఒకానొక రకము యిండ్లలో నుండివచ్చే మంచి సంప్రదాయము కలిగి, సంపన్నములయిన మంచి కుటుంబములకు చెందిన పిల్లలు తమతోడివారిలో ఉన్నప్పుడు సాధారణముగా ప్రలోభములలోను, స్వేచ్ఛలలోను అంతగా చిక్కుకొనరు; కాని దురదృష్టవశమున మంచివంశములనుంచి వచ్చే వారిలో కూడా అటువంటివారు చాలతక్కువగ నున్నారు. ఇది విచారకరమయిన విషయము. అమెరికా నగరము లెట్లున్నవో తెలుసుకొనుట కుదాహరణముగా గైకొనదగిన డినేవరువంటి నగరములోనే ఎన్నెన్ని వివాహము లగుచుండునో కొంచె మించు మించుగా అన్నన్ని వివాహవిచ్ఛేదములును, వేఱుపాటులును ఉన్నప్పటికి మనము దేశాభిమానముతో అమెరికా కుటుంబముయొక్క ఘనతనుగురించి దొరక పొగడుకొనుచుందుమని నాకు తెలియును. కాని పిల్లలకు తగిన ఆధ్యాత్మిక వైజ్ఞానిక వాతావరణముగల కుటుంబములు మాత్రము-న్యాయము చెప్పవలయునన్న-తప్పిదారియుండునేమోకాని సాధారణముగా లేవనియే చెప్పక తప్పదు. ఇటువంటి చిక్కులలోపడని పిల్ల లెవరైన ఉన్నయెడల వారికి సరియయిన కుటుంబశిక్షణ కలదన్నమాటే. సరియైనపాఠశాలాశిక్షణమునుగూర్చి చేసిన్నీను చెప్పవలేదు. ఎందుచేతననగా ఎక్కడనో కొద్దిప్రైవేటు స్కూళ్ళలోను, పల్లెకుస్కూళ్ళలోను తప్పినాకొన్నిటిలోను తప్ప ఇతరవిధములు పాఠశాలాశిక్షణము రెంత అద్భుతమయిన దున్నప్పటికిన్నీ స్త్రీపురుషజాతి సంబంధమయిన విషయమున మాత్రము సరియయిన శిక్షణమున్నట్లు కనబడదు...1922 సంవత్సరములో డినీవరులో జరిగిన ఒక్కొక్క వివాహమునకున్నూ ఒక్కొక వివాహపు వేర్పాటుకలదు. ఇచ్చిన ప్రతిరెండు వివాహపు పట్టాలకు (License) ఒక్కొకవివాహ విచ్ఛేదపు (Divorce) కేసువచ్చినది. ఈయంకెలు ఒక డినీవరునగరమునకు మాత్రమే చెందినవి కావు. అమెరికా సంయుక్త రాష్ట్రములలోని చాలనగరములకివి కొంచె మించుమించుగ సరిపోవును. పైనుదహరించిన సంవత్సరమున వివాహవిచ్ఛేదములు (Divorces) ను, వేర్పాటులు (Separations) ను మొత్తము 2992...డినీవరులో 1922 లో 1842 వివాహవిచ్ఛేదములును; 3008 వివాహములును జరుగగా 1921 సంవత్సరములో 1497 వివాహవిచ్ఛేదములును 3626 వివాహములును జరిగినవి. అనగా 1922 సం. లో వివాహవిచ్ఛేదములు 45 వంతున వృద్ధి

అయినవనియు వివాహములు 613 రద్దినవనియు తేలుచున్నది. 1920 వ సంవత్సరమున డెన్వరులో ఇవ్వబడిన వివాహపుపట్టాలు 4002. 1922 సంవత్సరములో చికాగోలో 39000 వివాహపు పట్టాలు (License) ఇవ్వగా వివాహవిచ్ఛేదములు 13000 బహిరంగముగా లెక్కకు వచ్చినవి. ఈవివాహముల గురించియు, విచ్ఛేదముల గురించియు యునైటెడు ప్రెస్సు వార్తలనుబట్టి:

1924 సంవత్సరమునందు:

నగరము	వివాహము	విచ్ఛేదము
అట్లాంటిక	3350	1845
లాస్ ఏంజిలీసు	16605	7882
కన్సస్‌నగరము	4821	2400
ఓహియోరాజ్యము	53300	11885
డెన్వరు	3000	1500
క్లీవులాండు	10132	5256

కలవని తెలియుచున్నది. బాధ్యతలేకుండా పిల్లలను స్వేచ్ఛగా డబ్బు ఖర్చుపెట్టనిచ్చుటయే ఇట్టిపరిస్థితులు కలుగుటకు కొంతవఱకు కారణము. అట్టిస్వేచ్ఛ యుండుటవలన తమతమ ఉద్దేశములు నెరవేర్చుకొనుటకు వారికి కొంతబలము అవకాశము కలుగుచున్నది. అట్టి స్వేచ్ఛలేనియెడల ఇట్టిపాటుల కవకాశము లేదు.

[స్వధర్మ]

గోవా వీరగల్లు

హీరాసుపండితుని మాధవ మంత్రియు, మల్లప్ప వొడయరు నొక్కరే అను నభిప్రాయము సరియైనదికాదు. అస్మత్కృత విజయనగరసామ్రాజ్యచరిత్ర*మునుండి యీ క్రింది యాధారముల నిచ్చుచున్నాను.

ఈమాధవమంత్రి పండితపుంజరుఁడు. పెక్కు గ్రంథములను రచించెను. అంగీరసగోత్రుఁడు. తండ్రి పేరు చౌండప్ప. ఉపనిషన్మార్గప్రతిష్ఠాపకుఁ డని ప్రఖ్యాతిగాంచిన పురుషవరేణ్యుఁడు; కాశీవిలాసుని ప్రియశిష్యుఁడు; వీరశైవుఁడు; త్ర్యంబకనాథ సేవాపరాయణుఁడు. శైవమతములన్నియు కర్ణాటకశాసనసంపుటములందలి షికార్పూర్ శాసనములలో నొక్క దానియందు వివరింపఁబడెను. (Epigraphia Carnatica, Vol. VII, Shikarpur-)281 ఈశాసనమునకలం సాదగ్గఱనున్నది. అదియంతయు నుదాహరించుట అనవసరమని యెంచితిని. ఈమాధవమంత్రియే గోవానగరమును మహమ్మదీయులకడనుండి పట్టుకొని విజయనగరసామ్రాజ్యములోఁ గలిపివైచెను. ఇతఁడు క్రీ. శ. 1391 సంవత్సరమునఁ బరమపదము నొందెను. (J. B. Br. R. A.S. Vol. IV, 107-115) ఈమాధవమంత్రియే హరిహరరాయల సోదరుఁడగు మారపరాయలకు మంత్రిగ నుండెను; బుక్కరాయలకు సామంతుఁడుగ బనవాసినేలెను.

మల్లినాథ వొడయరు రెండవ హరిహరరాయల సోదరుఁడు. బుక్కరాయలకు జెమ్మాదేవియందు జనించిన కనిష్ఠపుత్రుఁడు. ఇతఁడు అరగరాజ్యమును రాజప్రతినిధిగఁ బాలించెను. రెండవబుక్కరాయలకూఁతు రొకతె యితనికి భార్యయైన విషయము హాస్యాస్పదముగ నున్నది. రెండవ బుక్కరాయలకు మల్లపవొడయరు పినతండ్రియగును. తనకూఁతును పినతండ్రి కిచ్చిన నేటి వరుస యగును? రెండవ బుక్కరాయల కూఁతురిమగఁడు మఱియొక మల్లపవొడయరు కావలెను.

మల్లపవొడయరు తండ్రికాలములో, బొమ్మటనకల్లు ప్రాంతమును రాజప్రతినిధిగఁ బాలించెను. (Epi. Colls. for 1901, Nos. 132, 139, 141) సోదరుఁడగు హరిహరరాయల కాలములో అరగరాజ్యమును శా. శ. 1312 ప్రాంతములందు బరకూరు రాజధానిగ రాజ్యమేలుచుండెను. (Epigraphical Colls. for 1901, Nos. 154, 156 and 164)

కావున మల్లపవొడయరు, మాధవమంత్రి యొక్కఁడేయని చెప్పుట సాహసము.

[కుందూరి ఈశ్వరదత్తు]

---


* ఇది యముద్రితము కానోపును. —సంపాదకుఁడు.

మిస్. యం. గన్ గారు



ఈమె ఆంగ్ల యువతి. లండనులో జరిగిన నిఖిల ప్రపంచ స్త్రీ వ్యాయామసంఘపు పోటీపందెములందు 18 అ. 7¾ అం. మేర దుమికి మొదటి బహుమతిని గాంచినది.

మిస్ కె. హిటోమి



ఈమె జపాను యువతి. పై పందెములందు 18 అ. 4 అం. మేర దుమికి రెండవ బహుమతిని పొందినది.

ఊరుముచు నున్నవల్లవె, మహోత్సుకతన్ జయదుందుభుల్ దిగం
తరములు దద్దరిల్ల, ముదితాజనముల్ జయగీతికా పుర
స్సరముగ హారతుల్ దగనొసంగిరి; కౌతుకపూర్ణచంద్రికా
భరితమనోజ్ఞమూచు నల బార్డొలి భూతలస్వర్గమయ్యెఁబో!

కెరటాల్ గొట్టుచు రింగురింగురని పక్షిస్వామియో నాఁగ నం
బరమధ్యంబునఁ దేలియాడెడు నదే పర్ణత్రయోత్ఫుల్ల సుం
దరమై యొప్పుపతాక పూర్ణవిజయోత్సాహ ప్రభూతోచ్చ సు
స్వరులై గాంధికి జే పటేలునకు జైజై యంచు ఘోషింపఁగన్.

రణ మొనరింపలే దటు ఫిరంగులు ఘొమ్మని ప్రేల్చలేదు, దా
రుణముగ బాంబుగుండ్లు పయిరువ్వఁగలేదు, విమానముల్ దిశాం
గణములఁ దేలుచున్ విసపుగాలులు పైపయిఁ బంపలేదు, సై
రణయొకఁడే మహాస్త్రమయి రాజిలె నవ్యజయోపలబ్ధికిన్.

రవి యస్తమయమునొందని - యవనీరాజ్యంబునకు నియంతలు రణమ
ర్మవిదులు నృపనీతినిపుణు - లవురవురా, లొంగిపోయిరా యాంగ్లేయుల్!

చిట్టపురాయియే బ్రిటిషు సింహము పట్టినపట్టు, నట్టిమే
ల్పట్టు ప్రతిష్ఠనై పుణిబలంబును జేవయు, నంగవస్త్రమున్
గట్టెడు గాంధియున్, *బిరుసుగడ్డముఁ బెంచెడు నాపటేలు న
ట్టిట్టుగఁ జేసి, రద్దిర! కడిందితపోబల సంప్రయుక్తిమై.

కనుఁగొన గాలిమేడలను గట్టెడు వట్టికబుర్లపో, గహిం
సనె పలుమారుఁ జెప్ప నొకఛాందసుఁ డెప్డురణంబు నేఁతకున్
గొనకొనవట్టి యా పిఱికికోమటియా, నల గోఁచిపాతరా
యని వెడమాటలే పిడుగులయ్యెను, మేకులు మేకులయ్యెనాన్.

కోపములేని యాపిరికికోమటి, గడ్డము బూచివాని సే
నాపతిగా నొనర్చుచు, ననాగరికుల్ రణభీరులు న్నవ

* ఈ పటేలుగారు గడ్డమును బెంచుకొనియున్నట్లు గాన్పింపదు. (సంపాదకుడు)

జ్ఞాపరులన్న పామరులఁ గైకొని, శ్వేతమహీశు సంగరా
టోపము నాఁగఁజాలుట కడుంగడుఁ జిత్ర మహో విచిత్రమా.

అభినవప్రహ్లాదులనఁగఁ - ద్రిభువన దుర్లభము నాతితీక్షమెయి మహా
రభసమున కోర్చి నవజయ - విభవాస్పదులగుట మిగుల వింత గొలిపెడిన్.

చేసినదానికిన్ బదులుచేయఁగ నొల్లము, మృత్యువైన సం
త్రాసము గొల్పఁజాల దీక ధర్మమునందును, దైవమందు వి
శ్వాస మొకండె చాలును, దిశల్ వడికింపఁగఁ జాలుమేటి స
న్న్యాసమె సంప్రదాయముగ నందితినంచును జాటినా రహో!

నొచ్చియు నొవ్వఁ జేయని మనోజయమే జయమిచ్చుమాకు, మా
నచ్చిన మార్గమద్ది, నవనాగరికుల్ విరసోక్తులాడినన్
వచ్చినలోటు లేదు, దిగివచ్చిరివారును గొండనుండి, యీ
పిచ్చియె యచ్చివచ్చినది పిచ్చి యుగంధరజాతివారికిన్.

చంగునపైకి దూకు రభసంబుమెయిన్ ఝుళిపించు నాంగ్లపున్
సింగముజాలు, మాతపముఁ జేసిన గడ్డము, బోరియున్న యీ
రంగమె రక్తికెక్కెను; స్వరాజ్యముమాట యటుండనిండు, పై
సంగతిఁ జూచుకొండ మదిచాలును దత్త్వము బోధసేయఁగన్.

జడనిధి గర్భములోపల - బడబానల మున్నయట్లు బార్డోలియందున్
బడుగులును బక్కలును గడు - జడులగు జనులందు సత్త్వసారము వెలిఁగెన్.

అంతర్వాహినియై యత-లాంతరమున నడఁగియున్న యార్యత్వం బా
క్రాంతమహీతల గగన ది-గంతరమై వెలయు సుప్రకాశముఁ దాల్చెన్.

శరములఁ దాల్చి రక్కసులచందమునన్ నరరక్తతృష్ణమై
దురమున వ్రాలు టత్యధికదోషము, మృత్యువె మేలు, మేలునా
గరికత గోరువారల కఖండ యశోధనమబ్బు దాన నీ
వరవడిఁ బెట్టియిచ్చి రల బార్డొలివా రిది దిద్దుఁడందఱున్.

ధాత్రి మహాత్ముఁడౌచు నవతారముఁ దాల్చెను కృష్ణుఁ డాఁ పృథా
పుత్రుఁడు వల్లభాయి యనఁ బుట్టెను, బార్డొలిభూమియే, కురు
క్షేత్రముగాఁగఁదోఁచె, నవగీతలు వెల్వడె; ప్రేమధర్మస
త్సూత్రమరంద మింత చవిచూడుఁ డిహంబుఁ బరంబుఁగోరినన్.

ఫ్లీటు దొరగారు ప్రకటించిన ప్రతిబింబములఁబట్టియే జరపికొంటిని. నాపాఠముల వానిఁబట్టియే గ్రహించితిని. శాసన విమర్శాంతమున నేను శ్రీశర్మగారిని సీమనుండి వచ్చిన ప్రతిబింబములఁగూర్చి యడుగుట మొదలగు విషయములనెల్ల వ్రాసితిని. భారతీకార్యాలయమున నాశాసన విమర్శము కొంత ముద్రితమయ్యెను. ఇఁక బ్లాకులు చేయింపవలసి యుండెను. అందుకై ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని యిండియన్ ఆంటిక్వరీ ౧౩-వ వాల్యుమును ఎరవుగాఁ దీసికొని నేను భారతీ కార్యాలయమునకుఁబోయి అక్కడ ప్రధానోద్యోగులగు బ్రహ్మశ్రీ సుబ్బరామయ్యగారి కా పుస్తకమందలి ప్రతిబింబములఁ జూపి బ్లాకులు చేయింపఁగోరితిని. వారు తోడనే వ్రాయరు తెఱచి రెండు కాఁగుల శాసనప్రతిబింబములనెత్తి "ఇవేకావా మీరు తెచ్చిన పుస్తకములోనున్నవి" అనిరి. అవి రెండును అహదనకర శాసనప్రతిబింబములే. ఒకటి ఫోటో; రెండవది రాగిరేకు లకచ్ఛాప్రతి యెత్తినది. వానిఁజూచుట నాకు వింతయ్యెను. ఇవి యెక్కడివంటిని. వారు శ్రీశర్మగారొకటి న్నర వత్సరమునకు ముందు నాకొసఁగిరనిరి. 'నేను ఇదే మొదలు తెలియఁజాలకున్నాను. శర్మగారి నడుగఁగా వానిఁ దామొసఁగమనిరి. ఎందుకివి? ఫ్లీటుదొరగారి పుస్తకములోని ప్రతిబింబములఁబట్టియే బ్లాకులఁజేయింపుఁడు. కాని యీపుస్తకము దొరతనమువారిది. కాగితములు చెడకుండ ఫోటోలు తీయవలెను. జాగ్రత్తసుమండీ' అంటిని. వారు 'ఈవిషయము శర్మగారు మఱచియుందురు. మీపుస్తకమును గొనిపొండు. నే నీప్రతిబింబములఁబట్టియే బ్లాకులఁ జేయింతును." అనిరి. వారు చూపిన రెండుపెట్ల ప్రతిబింబములఁ జూచితిని. అచ్చుతీసిన ప్రతిబింబములు కొంత స్పష్టముగా నున్నవిగాని అవి సిరా ఒలికి చెడిపోయినవి. బ్లాకులు చేయింపఁ బనికిరావు. ఫోటోప్రతిబింబములు అస్పష్టముగా నుండెను. ప్రాచ్యలిఖితపుస్తకశాలాపుస్తకమున కపాయము కలుగునన్న భీతిచే అస్పష్టముగా నున్నను ఆఫోటో ప్రతిబింబములనే మరల ఫోటోతీసి బ్లాకులు చేయింప నంగీకరించితిని. ఇది యెల్ల మేమక్కడ చర్చించుకొంటిమి. మఱి రెన్నాళ్లకు శ్రీసుబ్బరామయ్యగారు మాయింటికివచ్చి శాసనాంతమున నేను వ్రాసిన వాక్యముల మార్చియామార్పు నంగీకరింపఁగోరిరి. అప్పటికే నేను తొలుత వ్రాసిన వ్రాఁతను తొలియచ్చుచిత్తులోఁ గొంత మార్చి ప్రతిబింబముల సుబ్బరామయ్యగారిచ్చినట్లు వ్రాసియుంటిని. శర్మగారి నడుగుటను దీసివేసితిని. సుబ్బరామయ్యగారు ప్రతిబింబములను ముద్రణసమయమున శర్మగారే యొసఁగినట్లు మార్చిరి. నిజముగానే నీప్రతిబింబములు బయల్పడ్డపిదప వానిఁగూర్చి మరల శర్మగారితో నేమియు ముచ్చటింపను లేదు; వారు వానిని నాకొసఁగను లేదు. అయినను నాకందు అభినివేశము లేదుగాన మీయిష్టము-చొప్పున మార్పునంగీకరింతును అంటిని. శ్రీసుబ్బరామయ్యగారు మార్చిన వాక్యము పూర్వోత్తరములఁ జూచుకొని రచనలో నించుక మార్పేదో చేసితిని. అంతేకాని భారతిలో ప్రకటితములయిన శాసనప్రతిబింబములను గాని, వానిమూలములగు సీమనుండివచ్చిన ప్రతిబింబములనుగాని, నేను శాసనవిమర్శము వ్రాయుకాలమునఁ జూడనేలేదు; ఉపయోగించుకొననేలేదు. భారతిలోని ప్రతిబింబములను నలుగురుంబోలె నేనును భారతి ముద్రితమై వచ్చినతర్వాతఁ జూచితిని. అవి మిక్కిలి అస్పష్టములు. మూలప్రతులను బట్టి తీసిన ఫోటోలఁబట్టి మరలఫోటోతీసి, వాని సైజుకంటె మిక్కిలి తగ్గించిన సైజుతో చేయఁబడిన బ్లాకులఁబట్టి ముద్రితములయినవి. అవి సరియైయిన పాఠనిర్ణయమునకుఁ బనికిరావు. ఫ్లీటు దొరగారి ప్రతిబింబములే పనికివచ్చును. అవి మిక్కిలి స్పష్టముగా సరిగానున్నవి. వానినే నేను జూచితినని మరల విన్నవించుకొనుచున్నాను. నేను ప్రకటించిన పాఠములను స్పష్టముగాఁ బరిశీలించుట కివియే యెల్లను కోర్కొనవలసెను. భారతిలోఁ బ్రకటితములయిన ప్రతిబింబము లెంత యస్పష్టములయినను నవిగూడఁ గొంతవఱకు లిపిభేదనిర్ణయమున నుపకరింపవచ్చును.

ఇఁక పాఠభేదములఁ జెప్పెదను. 19 పంక్తిలో 'దడ్డు' అని నేను ప్రామాదికముగా వ్రాసితిని. భారతి ప్రకటితముకాఁగానే నాపొరబాటును శ్రీ శర్మగారికిని విన్నవించుకొంటిని. కడచిన భారతిలో ఈతప్పును దిద్దుకొంటిని. శర్మగారు 'దణ్డు' అని చదువుట యుక్తమే.

21, 22 పంక్తులలో "రేణ్డునడల ఏలేముపరులే ములఁ జేసినది" అని పాఠకము. "రేణ్డునడల ఎలెవు పరులెము లలసినది" శర్మగారిపాఠము.

ఇక్కడ శర్మగారు 'ఎలె' తర్వాతి యక్షరము 'వు' కాఁదగునుగాని 'ము' కాదనిరి. భూతద్దము నుప యోగించినను వారికది 'వు' గనే కనుపడెనట! 'ఎలెవు' శ్రోత్రపదముట!

దీనికిఁదోడు వెంకటరమణయ్యగారు శాసనభాషను జే విన్నవచ్చినట్లు సంస్కరించితి మనిరి. అది 'ము' కాక పోవుట స్పష్టమనిరి. అర్థము కుదురదని యిట్లు మార్చి వైచుటా యనిరి. అర్థముకాని యపూర్వపదములను చిత్తానుసారము మార్చి చదువుకొని చేతనయిన ట్లర్థము 'పరియూరువు' అనుచోటను, 23 పంక్తిలో పర్థవుల్ 'అను చోటను, 29 పంక్తిలో 'పసుకేవుల' అనుచోటను 'వు' లు గలవు. వానికిని ప్రస్తుతాక్షరమునకును సంబంధ మేమయినఁ గలదేమో ప్రాజ్ఞులు పరిశీలించి చూడఁగ గుదురు! మఱియు శర్మగారును, వెంకటరమణయ్యగారును గోరినట్లు 15,16 పంక్తులనడుమ 'ప్రముఖాన్', 18 పంక్తిలో 'ప్యామల్', 21 పంక్తిలో 'లెముల', 22 పంక్తిలో 'ముళ', 27 పంక్తిలో 'పషిణ్డిముద్లు', 32 పంక్తిలో 'మూర్ధకళ్ప' యను చోట్లఁగల 'ము' లతో ప్రస్తుతాక్షరమునకు సంబంధము లేదేమో కూడ పరిశీలించిచూడ దగును. అది 'వు' అని చదువువారి హృదయ మిట్టిదని నే నూహింపఁజాలకున్నాము.



ఇది ఇండి. ఆన్. 18 వాల్యూంలోనిదానిఁబట్టి చేసిన ప్రతిబింబపు తునుక. ఇందలి మూడవపంక్తి "రు రేణ్డునడల ఏలేమ్మువరులేములన్త్రే" అని నేను జదివినది. క్రింద గీతగలవి తగాయిదాగల యక్షరములు.

చెప్పవలసినదేనా యనిరి. ఈవిధమున ఏపదమునకైన నేయర్థమైన చెప్పవచ్చుననిరి.

శిరుథయములు దానిని 'వు'గా చదువుట నాకు అచ్చెరువు గొల్పుచున్నది. స్పష్టమయిన యాయక్షరమును గుర్తించుటకు బూతద్దమేల? నిర్వికారమైన కన్నుని చూపున్నఁ జాలును. పైయిద్దరును ఆయక్షరమును శాసనమునఁగల తక్కిన 'ము'లతోఁ బోల్చి చూడుఁడనిరే కాని, తక్కిన 'వు'లతోఁ బోల్చిచూడుఁ డనరైరేలో కదా! 18వ పంక్తిలో 'నావురకు' అనుచోటను, 20వపంక్తిలో

మఱియు శర్మగారు 21 పంక్తిలోని లేయను కడపటి యక్షరము 'ల' యనుచున్నారు. వెంకటరమణయ్యగారును పైపలుకునే ప్రతిధ్వనించుచున్నారు. విస్పష్టముగా క్లీటుదొరగారి ప్రతిబింబములో నది 'లే'గాఁ గలదు. ఇంక నెవ్వరేని దానిని 'లె' గాఁ జదివినను జదువవచ్చునుగాని 'ల' గాఁ జదువుట యాశ్చర్యము గొల్పును. భారతిలోఁ బ్రకటితమయిన ప్రతిబింబములో నాయక్షరము సగపాలు ఫోటోలోనికి ఎక్కలేదు— శర్మగారు అనేకపర్యాయములు ఇండియన్ ఆంటిక్వెరీని


పరిశోధించుచుఁగూడ నేను 'ఇండియన్ ఆంటిక్వరీ'లోని ప్రతిబింబములనుబట్టి పాఠమును బ్రకటించితినని స్పష్టముగాఁ జెప్పినను గూడ, "చేసినదియు దన్నా" అనుటలో నర్థసంగతి గమనింపవలసియున్నను గూడ "దానిని 'లో' గాఁ జదువుదుముగాని 'తో'గాఁ జదువము" అన్నచో నేనేమి యనఁగలను! ప్రాజ్ఞులన్నారని యూరకుందును. శ్రీశర్మగారిక్కడ నిట్లు పాఠమును మాత్రమాక్షేపించిరి. శ్రీవెంకటరమణయ్యగారు నేఁజెప్పిన యర్థనిర్వచనమును గూడఁ జిందఱవందఱ చేసిరి! నే నీపట్టున నర్థము చెప్పుటలో నొక్క యక్షరమును 'శే' అనుదానిని దొలఁగించు టావశ్యకమయ్యెను. అట్లు దానిని దొలఁగించుటకు సరియయిన కారణము తెలిపితిని. 'దీనికి వక్రంబు వచ్చిన గచ్చురు రెణ్డువసల ఎళే మునరు శేముల చేసినదియు దన్నా;' 'శిరిపయి వాడునరు గల్గిన ఏళే ముళ్ చేసిన సేయుండు-సమ.' అని రెండువాక్యము లొకదాని తర్వాత నొకటిగాఁ గలవు. 'ఎళే-మునరు-శేముల-చేసినది-దన్నా-'తో సరివచ్చు పదసంవిధానమే తర్వాతి వాక్యమునఁ గూడ 'ఏళే-ముళ్-చేసిన-సేయుండు-సమ.' అని కలదు. 'రెండువాడల గ్రామమును ఏలునటువంటి ముగ్గురు గ్రామాధికారులు చేసిన చేఁత చెల్లును.' అని తొలివాక్యమున కర్థము చెప్పితిని. 'ఆముప్పురిమీఁదఁగూడ నష్టకష్టము లాడువారుండుకేని వారియెడఁగూడ నా గ్రామాధికారులు చేసినచేఁత చెల్లును' అని రెండవవాక్యమున కర్థము చెప్పితిని. ఇందు గ్రామాధికారులని యర్థమిచ్చుపదము 'ముళ్'. ఆశబ్దపు నిష్పత్తినిగూర్చి కొంత చర్చించితిని. తొలివాక్యమున "ఏళే శేముల చేసినది" సరియయినచో రెండవవాక్యమున "ఏళే ముళ్ చేసిన చేయుండు" అనుచోట, 'ఏళే' తర్వాత నొక 'శే' చేర్పవలసియుండును. 'ఏళే ముళ్ చేసిన చేయుండు' సరియగుచో మొదటి వాక్యమున 'ఏళే శేముల చేసినది' యనుచో 'ఏళే' తర్వాతి 'శే' తొలగింపవలసి యుండును. మొదటివాక్యములో 'శే' తొలగించుట యుక్తమా, రెండవవాక్యములో 'శే' చేర్చుట యుక్తమా యని విచారించితిని. 'శేముల'కు అర్థము వ్రాయఁ గుదురలేదు; 'ముళ్'కు అర్థము గుదిరినది. రెండవ వాక్యమున "శే" చేర్చుట సరిగాదని మొదటివాక్యమున 'శే' తొలఁగించితిని. రెండు వాక్యములందును పదసామ్యము స్పష్టముగాఁ గానవచ్చుచున్నదన్న నమ్మకము నాకుఁగలదు. సామ్యమును బట్టి తొలివాక్యమున 'శే'ను దీసివేయుదున్నచో రెండవవాక్యమున 'శే'ను జేర్పవలసియేవచ్చునుగదా! రెండువాక్యములకును బదసామ్యము లేదని నిరూపించి నేఁజెప్పిన యర్థముకంటె సరిగా సరిపోయిన యర్థమును సంస్కార నిరపేక్షముగా నెవ్వరేని సాధింతురేని ధన్యులు! అట్టిదేదియుఁ జేయకుండఁ బదసామ్యము గలదని మొదట (సామ్యము స్పష్టముగాఁ గానవచ్చుచుండఁగా) నిరూపింపవలసినదని, రెండును జేర్చియుపదములేల కారాదని, కావునటకు నిదర్శనము లేమి యని సంస్కరించుట సాహసమని చేయు నాక్షేపములకు నే నేమని బదులు చెప్పఁగలను! ఈ 'శే' ప్రభాకరశాస్త్రిగారిచే పూర్వాక్షరముతో జేర్పఁబడుటచే, ముళ్పద మస్పష్టమైనది. ఒకవేళ 22 వ బంతిలోని పదము 'శేముళ్' అగునేమో' ఇత్యాదిగా వెంకటరమణయ్యగారు వ్రాసిన పదునొకండు బంతుల వ్రాఁతకునుం బదులా? దశరా-మళేరా-కథ స్మృతికి వచ్చుచున్నది.

20 వ బంతిలో నేను 'కాయసేసి' అని చదివిన దానిని శ్రీ శర్మగారు 'కాయసెసి' యనియు, 23 వ బంతిలో నేను 'సరాలోక' అని చదివిన దానిని 'సరాలోక' యనియు, 22 వ బంతిలో నేను 'పీరిపయి' అని చదివినదానిని 'పిరిపయి' అనియు నిట్లే 'ఇ-ఈ, ఎ, ఏ, ఒ ఓ, స్వరములలో సర్వత్ర హ్రస్వరూపములనే పఠించిరి. కాని వారు ఈశాసనమునఁ దైస్వరములలో హ్రస్వదీర్ఘ భేదము పాటింపఁబడలేదని యంగీకరించిరి. అట్టిచో హ్రస్వముఁబోలె దీర్ఘముగూడఁ బాఠార్హమే యగునుగదా! నేను శాసనమున కర్థము చెప్పఁ బూనితిని గావున హ్రస్వదీర్ఘములు రెండును బాఠార్హములే కావున హ్రస్వముగాఁ బఠించినచో నర్థము పొసఁగనేని హ్రస్వముగానో, దీర్ఘముగాఁ బఠించినచో నర్థము గుదిరెనేని, దీర్ఘముగాను బఠించితిని. నాయర్థము నింకెవ్వరేని దుష్టముగా నిరూపించి హ్రస్వముగానే చదివి యర్థము చెప్పినప్పుడే

సామాన్యమా క్షేపార్హ మగును. హ్రస్వదీర్ఘ ములకు లిపిలో భేదము లేనప్పుడు శబ్దరూపమును, అర్థమును తన్నిర్ణయమునకు సాధకము లగును. ఈవిధమున నేను శాసనమున హ్రస్వముగనున్న కొన్ని 'హ'లను దీర్ఘములఁగా బఠించితిని. హ్రస్వదీర్ఘస్వర సంస్కారమును జేయక విడిచితిని.

24 వ బంతిలో నేను 'పెడ్ల' అని చదివినదానిని శ్రీశర్మగారు 'పెల్ల' అని చదివిరి. ఇది మహత్తరమయిన చర్చగల లిపి. దీని చర్చ నికమీఁద విపులముగాఁ గావింప నున్నాఁడఁగాన యిక్కడ నుపేక్షించుచున్నాను.

25, 26 బంతులలో నేను 'వద్యోటి' యని చదివిన పదములను శ్రీశర్మగారు 'వద్యో తి (ష్టి) యని చదివిరి. "ఇది 'టి' యంగాదు. 'తి' యంగాను." అని వారు వ్రాసిరి. నాకుఁ బూర్వ మీశాసనమును జదివినవారు ఫ్లీటుదొరగారు, బర్గెస్‌దొరగారు 'వద్యోతి' అని చదివిరి. లక్ష్మణరావుగారు 'వద్యోటి' అని చదివిరి. దీనినిగూర్చి నేను శాసనవిమర్శనమున నిట్లు వ్రాసితిని. "ఈయక్షరము 'తి' యనికాని, 'టి' యని కాని స్పష్టపఱుప శక్యము కాకున్నది. 18, 20 బంతులలో గల 'తి'కిని దీనికిని సంబంధము లేకున్నది. 'టి' ఈశాసనమం దితరత్ర రాలేదు. అది "తి' అనుటకంటె 'టి' అనుట సంగతము" అని. ఇతరశాసనములందుఁ గొన్నిట నిట్టి యక్షరము 'తి' గాఁ జదువఁబడెను. కాని యిందు 'తి' వేఱువిధముగాఁ గలదు గాన యట్లు చదువుట సంగతముగాఁ దోఁపలేదు. 'టి' లిపితో దీనికిఁ గొంతపోలిక గలదుగాని, 'టి' యేయని సరిగాఁ జెప్పఁదగియుండలేదు. ఈశాసన మున 'టి' లిపికి పోలిక యితరత్ర గానరాలేదు. 'టి'గాఁ జదివిన నర్థము కుదురుచున్నది. ఆపదము మహాత్ములు వచ్చినది. అది గ్రామనామమని నేనర్థము చెప్పితిని. శర్మగారు చదివినట్లు 'వద్యోష్ఠి' కూడ తృప్తికరముగాదు. టి యక్షరము అడ్డుగీతలేని బండిఱాకు గుడియే. దాని యడుగుకట్టున 'ద' 'ట' 'త' ల కున్నట్లు లోనికిఁ జొచ్చిన పృష్ఠముండును. ఇందది లేదు. ఇది సరిగా నేటి మనవ్రాఁతలిపిలోని 'తి' వలెనున్నది. నేను 'టి' గాఁ జదివినను, దాన నాకు అతృప్తియే కలదని స్పష్టముగాఁ జెప్పితిని. 'తి', 'టి' 'ష్ఠి' పఠనములు మూఁడును, అతృప్తిని గొల్పుచున్నపుడు 'టి' యని చదివిన నర్థసంగతి గానవచ్చెను గాన నేను దాని గ్రహింపవలసెను.

26 వ బంతిలో నేను 'మరల' అని చదివినదానిని శ్రీశర్మగారు 'సకల'అని చదివిరి. ఇట్టి యాక్షేపమునకు నే నెట్లు సమాధానము చెప్పవలెనో యెఱుఁగఁజాలకున్నాను. ఇందు మొదటియక్షరము 'మ' యగుట నిరాక్షేపమై నెగడవలసినది. చిరకాలమునుండి శాసనపఠన ప్రకటనాది కార్యములందు నిష్ణాతులయిన శ్రీ శర్మగారు దీనిని 'స' గాఁ జదువవలెననుట, దానికి నేను బదులు చెప్పుకొనవలసి వచ్చుట దైవదోషమే. ఈశాసనమందలి 'స' లిపికి నేటి మనవ్రాఁతలోను, అచ్చులోను నున్న 'స' లిపికి భేద మత్యల్పము ఈశాసనమందు 'స'  ఇట్లు గలదు. 'మ'  ఇట్లు గలదు. సకారము నడ్డిమీఁదనుండి తలకట్టున కొక నిలువుగీటు గలదు. ఇదియే మన నేఁటి 'స' కును, ఈశాసనమందలి 'స' కును భేదము. మకారము తలకట్టు నుండి నిలువుగీఁత కొంత క్రిందికి సాగి డాఁపలితట్టుగా మీఁదికి మెలికతిరిగి తలకట్టునుండి క్రిందికి వచ్చిన తన మీఁదుగా వలపలితట్టునకు సాగి కొంత యూర్ధ్వ ముఖముగాఁ బోయి నిలుచును. మన తెలుఁగునాలుగంకె డాఁపలికొనకుఁదలకట్టిచ్చి యించుక వలపలితట్టుకు వ్రాల్చి నచోఁ గొంచె మించుమించుగా నిట్టియక్షర మేర్పడును. ఇందుఁ దలకట్టునుండి క్రిందికి సాగినగీఁత మెలికతిరుగుటలో నొకసున్న యాకృతియు, నాగీఁత వలపలికి సాగి యూర్ధ్వముఖముగాఁ బోవుటలో కొమ్ము నాకృతియు నేర్పడినవి. నేఁటి మనలిపిలోని 'మ' కుఁ గల మొదటిసున్న యాకృతియు కొమ్మునాకృతియు వీని పరిణామములే. 'స' కు అట్టిసున్న యాకృతి లేదు. నాఁడును లేదు; నేఁడును లేదు. నాఁడు తలకట్టునుండి క్రిందికిసాఁగినగీఁత 'స' కారపు 'నడ్డి'మీఁదికి మాత్రమే వచ్చి నిలిచినదిగాని క్రిందికి సాఁగి మెలికతిరిగి సున్నయా

కృతిని గల్పించుట గానరాదు. ఈలిపిరీతు లింతవిస్పష్ట భేదము గలవై యుండఁగా, నీశాసనమందలి యిక్కడిలిపి నిస్సంశయముగా 'మ' కారమై తెలియవచ్చుచుండఁగా, నిందలి యన్నిమకారములు నిట్లేయుండఁగా, షకారములతో దీనికి సంబంధములేమి స్పష్టముగాఁ గానవచ్చుచుండఁగా — ఇఁక దీనిఁగూర్చి నేనేమి వ్రాయుదును — మకారము నడుగునున్న పెద్దదిగా నుండవలెనని, తలకట్టున నున్నకు నడుమ నిలువుగీటు చిన్నదిగా నుండవలెనని, కొమ్ము, సాగారినట్టుగాక, ముడిచిన ట్లుండవలెనని, ఇవి మకారలక్షణములని, ఏతం విధముగా శ్రీశర్మగారు వ్రాసినవ్రాఁతలోని యాచితిని ప్రాజ్ఞులు పరిశీలించి నిశ్చయింపవలెను. ఈపట్టున వెంకట రమణయ్యగారి వాగ్ధోరణిని గూడ యారయవలసినది. ఆయక్షరము 'మ' కాఁజాలదట; 'ష' యనుటే నిశ్చయమట!

ఇఁక మఱియు 'మ' తర్వాతియక్షరమును నేను 'ర' గాఁ జదివితిని. అది 'క' కాదని నాతలఁపు. దానిగూర్చి నాశాసనవిమర్శమున నిట్లు వ్రాసితిని. "తలకట్టు క్రిందియక్షరముతో సంధింపుటకు నిలువుగీఁత కకారమున కుండును. ఈయక్షరమున నట్టులేదు. అక్షరముతో నొట్టియుండవలసిన తలకట్టుకు స్థలముచాలక లేఖకుఁ డించుక యెడముగాఁ జెక్కెను" అని. ఈశాసనమున రకార కకారములకు భేద పెట్టినఁగా:— చింతాకు నాకారముననే రెండక్షరములును గలవు. రకారమునకు రెండువైపులకుఁ గొంచెము హెచ్చుగాసాగి తలకట్టు ఆయక్షరముతో నొట్టియున్నది. కకారమున కాయక్షరము వలపలితలయందునుండి, పయికొక్క గీఁత సాగి దానిమీఁద వలపలిత్తట్టువకు మొగ్గనలగల తలకట్టున్నది. ప్రస్తుతాక్షరమును రకారముగాఁ జదువుటలోను నాక్షేపము గలదు. రకారముగాఁ జదువుటలోను నాక్షేపముగలదు; కకారముగాఁ జదువుటకుఁ దలకట్టు దూరముగానుండు టాక్షేపవిషయము. కకారముగాఁ జదువుటకుఁ దలకట్టుతో నొట్టియుండవలసిన నిలువుగీటు లేకుండు టాక్షేపవిషయము. దీనిఁగూర్చి నేను జాలఁ గాయోజించితిని. 'ర'గాఁ జదువగా 'మరల' అని యర్థముగల పదమగును. వాక్యార్థము పొసఁగును. 'మకల' నాకర్థముగాలేదు. అపర్థకపక్షముకంటె అర్థవత్పక్షము గ్రాహ్యముగాన 'మరల' యని పఠించుటే సముచితమయ్యెను. అయినను 'క' కారముగాఁ జదివికూడ నెంతెంతో యోజించి చూచితిని. ఇక్కడ నొకక్రొత్త గానవచ్చెను. శాసనమందింక నెక్కడను లేని యిఱుకుపల యీయక్షరస్థానమునఁ గలదు. ఈశాసనమునఁ దక్కిన యక్షరములన్నిఁ దగినంత యెడముండునట్లు చెక్కఁబడినవి. ఈయొక్క యక్షరమే మిక్కిలి యిఱుకుగాఁ జెక్కఁబడినది. శాసనలేఖకుఁడు దానినిఁ దొలుతఁ జెక్కమఱచి తర్వాత 'మ', 'ల'లకు తక్కిన యక్షరములకన్నింటికిఁబోలె నడుమనున్నయెడమున నిఱికించి చెక్కియుండునని తోఁచెను. అట్లు చెక్కటలో రకారపుఁ దలకట్టుకూడఁ జెక్కినను రెండుప్రక్కలను అక్షరము తలకట్టు నుండవలసిన చిమ్ములకుఁ జోటు లేదుగాన దానికై తలకట్టును మరల నెడముగాఁ జిమ్ములువచ్చునట్లు చెక్కియుండునని గోచరించెను. ఆవిషయమునే శాసనవిమర్శమున వ్రాసితిని. రకారముగాఁ జదువుటలో నున్నట్లే కకారముగాఁ జదువుటలోఁ గూడ స్పష్టముగా నత్యాప్తియుండఁగా నాయక్షరము రకారము కానేకాదు. నిశ్చయముగా కకారమేయని సిద్ధి చెప్పుట యొప్పునా? ఈపట్టున వెంకటరమణయ్యగారు చేసిన ప్రసంగమును పరికింపుడు: దానిని 'ర' గ చదువుట తప్పట! 'క' గనే చదువవలెనట. మరల_నది 'క' అయినను కాకపోయినను 'ర' మాత్రము కాదట!" నేను కుస్తీపట్టితినట! ఢీటయిపోయితి నట! ఏ భీతియు లేనప్పు డేమన్న ననవచ్చును!

మఱియు 27 వ బంతిలో 'నరునయ్య' అని నేను జదివినదానిని శ్రీశర్మగారు 'నరునయ్యణ' అని చదివిరి. అక్కడ యకారపుఁ దలకట్టు సూఁదిమొనయంత నిలువు మొగమైనది. అది రేఫవ్యంజకముగాఁ దలఁచి దలఁపవచ్చును. 33 వ బంతిలో 'దివక తీరవలసియున్నరయ్య' యనిరేఫ కలదు గావునను; నిక్కడ యకారమునకు సూఁదిమొన యంతగానున్న యీయూర్ధ్వముఖత యస్పష్టమగుటచేతను నేను 'నయ్య' యని చదివితిని! శర్మగారు చదివినట్టుకూడఁ జదువవచ్చును. కాని యది నిర్విశేషము.

మఱియు 28 వ బంతిలో 'గజ్ఝ సెడ్లల' అని నేను జదివినదానిని శ్రీ శర్మగారు 'గజంబు సెడ్లల' అని చదివిరి. తాము చూచినంతవఱకు 'జ' క్రింద 'ఝ' లేదనిరి. 'జ' తోఁగలసి దా ని పి ద ప నొక యక్షరమును దానికి సొమ్మును గలవనిరి. ఆయుత్వము నే 'జ' తరువాతి యక్షరముయొక్క రెండవపై పు నిలువు గీటుగఁ బోనిచ్చినట్లున్నదనిరి. అట్లేయగునేని దాని 'బు' గ చదువవగు ననుకొంటి మనిరి. ఈపట్టున నేను శాసన విమర్శమున నీక్రింది యర్థముగల వాక్యముల వ్రాసితిని. "23, 24 బంతులలో "గజ్ఝంబుసెడ్ల నడుపుల్" అన్న పదము లున్నవి. అవియే మరల 28, 29 బంతులలోఁ గూడ "గజ్ఝ సెడ్లలనడుపుల్" అని వచ్చినవి. ఈ రెండు చోట్లను అక్షరవ్యత్యయముగలదు. శాసనము ముగియఁ జెక్కనుజెక్కను లేఖకున కజాగ్రత్త యెక్కువగుట యిందు స్పష్టముగాఁ గానవచ్చుచున్నది. శాసనము మొదటఁగల యక్షరముల సౌందర్యము పోవఁపోను మిక్కిలి చెడుచువచ్చినది. ఇందు 23, 24 బంతులలోని లేఖనము 28, 29 బంతుల లేఖనముకంటెఁ బ్రామాణికముగాఁ గొందును." ఇట్లు నేను వ్రాయుటకుఁ గారణముల నిక్కడ వివరించుచున్నాఁడను. 23, 29 బంతులలో ని"గజ్ఝంబు సెడ్లనడుపుల్"కు నే నర్థముచెప్పితిని. 28, 29 బంతులలోని పదములుఁగూడఁ గొంచెపు భేదముతో నట్లే చదువను, అర్థము చెప్పను దగియుండెను. ఆకొంచెపు భేదము లేవనఁగా:—23 బంతిలో 'గజ్ఝ' అని 'జ' కారముక్రింద ఝ కారము స్పష్టముగాఁ గలదు. 28 వబంతిలో 'జ'కారముక్రింద నుండక 'ఝ' కారము దాని నంటికొనియే దానిప్రక్క నున్నది. శాసనప్రతిబింబమును బరిశోధింపఁదగును. శాసనవిలేఖకుఁడు దాని నట్లు ప్రక్కగా వ్రాయుటకుఁగూడఁ గారణముగలదు. సరిగా నీయక్షరమునకుఁబలమీఁద మీఁదిబంతిలోని 'ష్ణు' అను ద్విత్వాక్షరములోని ణకారము క్రిందిబంతి కందఁ దగినచోటును గొంతయాక్రమించుకొనెను. అట్లు క్రింది బంతిస్థలమాక్రమించుకొన్న యా 'ష్ణు'కు సరిగా నీక్రిందిబంతిలో మరల ద్విత్వాక్షరముగు నీ 'జ్ఝ' చెక్కవలసివచ్చెను. ఈబంతికిఁ గ్రింద నింక నొకబంతి చెక్కవలసియున్నది. ఇక్కడ జకారముక్రింద ఝకారము చెక్కుచో క్రిందిబంతిచెక్కడమున కడ్డంకి కలుగును. ఈకారణముచే శాసనము చెక్కినవాఁడు 'ఝ'ను జతో నంటించి ప్రక్కగాఁ జెక్కియుండునని నాయనుమానము. 17 వ బంతిలో 'ఆజ్ఞాపయతి'లోని 'జ' క్రింది 'ఞ' కును, 28 బంతిలో 'జ' క్రిందనున్న 'ఝ'కును, నిక్కడ 'జ' నంటి ప్రక్కగానున్న యక్షరమునకును సారూప్యము చక్కఁగాఁగాన వచ్చుచున్నది. కాని 17, 28 బంతులలో నాయక్షరము నిలువుగీటుకు నడుమ నడికట్టునకు మాత్రమేయున్న యడ్డుగీటు ఇక్కడఁ గుడికట్టునకును నెడమకట్టునకును గలదు, ఇది కొంచెము భేదము. దీనిని జదువుటలో నేను మిక్కిలి చిక్కుపడి యిట్లు నిర్ణయించితిని. జకారముతర్వాతి యీయక్షరమును 'ఝ'కారముగాఁ జదువుటే చాల సంగతముగా నుండునుగాని యింకే యక్షరముగా జదువుటయు స రి గా దు. అక్షర స్వరూపముచేతనే యిది యిట్లు చదువఁదగియుండఁగా నిక 23 బంతిలో 'గజ్ఝంబు' ఇత్యాది పదములతో నిక్కడిపదములకు సంగతిగూడ నున్నప్పు డిట్లు చదువుట కాక్షేప ముండరాదనియే నేనందును. శ్రీశర్మగారిక్కడ కుడికొన నొకచుక్క గలదనిరి. అంగీకరించుచున్నాను. 'గజ్ఝం'అని చదువుదును. శ్రీశర్మగారు 'సెడ్ల' అని చదువగా నేను 'సెడ్ల'అని చదువుటకుఁ గారణమిది. 28,29 బంతులలో శర్మగారు'సెట్ల'గాను నేను'సెడ్ల'గాను జదివినపదమే యిదియని నావిశ్వాసము. 29 వ బంతిలో నాద్విత్వాక్షరమునకుఁ బొట్టలో నడ్డుగీత గలదు; ఇక్కడ లేదు. లేఖకుఁ డజాగ్రత్తచే దానినిక్కడ విడిచినాఁడని నేను దలఁచితిని. 23, 24 బంతులలోని లిపికంటె, ఈ 28, 29 బంతులలోని లిపిలో శాసనవిలేఖకుఁడు చేసిన లిపివ్యత్యాసములివి:—'జ' క్రింద 'ఝ' చెక్కకుండుట, 'ఝ'కు అడ్డుగీటు ఎడమతట్టునకుఁగూడఁ బోనిచ్చుట 'ళ్లి' 'డ్లి' అక్షరములో నడ్డుగీటు చెక్కకుండుట,—ఈవిషయము నే నేను శాసనవిమర్శమున సంగ్రహముగాఁ జెప్పితిని.

మఱియు 31 వ బంతిలో నేను 'జనుప' అని చదివినదానిలో శ్రీ శర్మగారు తొలియక్షరము 'జ'

యగునాయని సందేహించిరి. ఈశాసనమున నితరస్థలములవచ్చిన 'జ'లకును దీనికిని గొంచెము భేదము గలదనిరి. దీనికిఁ గుడితట్టున (కుడితట్టునకు అగ్రములుగల మూఁడు అడ్డగీఁతలున్నవి.) ఎగువగీటును, దిగువగీటును కలవనందువలనఁగాని, లేనిచో 'ఘ'గగాని, 'ఱ'గగాని దానిఁజదివి యుండుదురనిరి. శాసనము చెక్కుటనఁగా అచ్చుపోఁత యక్షరములఁగూర్చుట గాదు. చేతివ్రాఁతలోఁ గూడ అక్షరములను సర్వత్రసమానాకారముతోఁ వ్రాయుట గుదురదు. అక్షరముల నిర్మాణరీతిలోని భేదములను జూచుకొనవలెనుగాని పొంకములోని భేదములను లెక్కింపఁ బూనినఁ గుదురదు. ఇక్కడ నీయక్షరమును 'జ' కారమునుగాఁ జదువ వగునుగాని యింకొకదానిఁగాఁ జదువఁ గాదు.

మఱియు 33 వ బంతిలో నేను 'దివకరయ్య' యని చదివినదానిని శ్రీ శర్మగారు 'టివకరయ్య' యని చదివిరి. ఆయక్షరమునకుఁ దలకట్టుతోఁగూడిన గుడి లేదనిరి. ఇట్లున్నను గొన్ని శాసనములందది 'ద' గాఁ జదువఁబడెననిరి. దీనిగుడి తలకట్టుతోఁ గూడియున్నట్టుఁ గూడ గుర్తింపఁదగియే యున్నది. ఇట్టి లేశాతిలేశమయిన లిపిభేదమును నిశ్చయించుటకు శబ్దార్థసంగతి సాధకము. 'దివకరయ్య' యనఁగా నర్థము చక్కఁగా పరిపోవును. 'టివకరయ్య' యట్టిదిగాదు. ఇంతకు నిక్కడ తొలియక్షరము నాదృష్టికి 'ది' గాఁ జక్కఁగాఁ జదువఁదగియే యున్నది.

శ్రీ శర్మగారు పేర్కొనిన శాసనపాఠభేదములను చెక్కింటినిగూర్చి నాకు న్యాయ్యమని తోఁచిన సమాధానముఁ జెప్పికొంటిని. శ్రీ శర్మగారికిని నాకును ముఖ్యముగాఁ జర్చావిషయము గానున్నది:— సెథ్ల, కొసుథక, గసథు, అని ఫ్లీటుదొరగారు, బర్గెస్‌దొరగారు, లక్ష్మణరావుగారు చదివినట్టి శబ్దములలోని థకారమే. నేను దానిని డకారముగాఁ గాని, ఢకారముగాఁ దర్వాతఁ బరిణామమంది యుత్పన్నమైపోయిన యొక యింతపూర్వలిపిగాని యనుచుంటిని. శ్రీ శర్మగారది బండి 'ఱ' యనిరి. ఇక్కడమాత్రము 'థ' గాఁ జదివిరిగాని యితరత్ర దీనిని ప్రాచీనులు బండి ఱ గానే చదివిరి. శ్రీ శర్మగారును పెక్కు సాధనములతో నాతలఁపును దప్పఁ జెప్పి ప్రాచీనులు ఇతరత్ర చదివినట్లే చదువవలెననిరి. ఈ యక్షరమునుగూర్చి చర్చ పత్రికలలోఁ బడక పూర్వము నేను శ్రీశర్మగారితో నీవాదపు సాధకబాధకములఁ జర్చింపఁ గోరితిని. నాయుద్దేశములనెల్లఁ జెప్పికొంటిని. నాశాసన విమర్శము ముద్రితము గాకపూర్వమును, ముద్రితమగుచున్నప్పుడును దానిఁజూచి మంచి చెడ్డలఁ జెప్పఁగోరితిని. నాకోరిక నెఱవేఱలేదు. వారు నావాదమునకు సాధకములుగా నే నుదాహరించు శాసనాదులకు స్పష్టముగా అకరములను దెలుపవలసినదనియుఁ దర్వాత వానిని దాము పరిశోధించుకొనవలసి యుండుననియు నాతోఁ జెప్పిరి. మే మిరువురము ఆప్తమిత్రులమేకావ పత్రికకెక్కి ప్రతివాదము జరిగినను నది సరసముగానే సాగునని నే విశ్వసించితిని నావిమర్శమున నే నుదాహరించిన శాసనాదులకు స్పష్టముగా నాకరములఁ దెలుపుకొంటిని. నన్నట్లు కోరినవారయ్యు శ్రీ శర్మగారు తమ ప్రతివిమర్శమునఁ దాముదాహరించిన శాసనములలో దేనికిఁగాని అకరము దెలుపకైరి! వారింతవఱకు అనేకశాసన విమర్శములఁ బ్రకటించినవారు. వానిలో ననేకప్రాచీనశాసనముల నుదాహరించినవారు. ఎన్నఁడుగాని, ఎక్కడగాని వారు తాముదాహరించిన శాసనములకు అకరములఁ దెలుపకుండుట గానరాదు. ఈప్రతివిమర్శమున నే వీరిట్టి యపూర్వపద్ధతి నవలంబించిరి. వా రుదాహరించిన శాసనములు పెక్కులు అప్రసిద్ధములు, అముద్రితములు. అవి యెక్కడెక్కడ నున్నవో వెదకి పట్టుకొనవలసి వచ్చెను. శ్రీ శర్మగారివలెనే నేనును నింతకుఁబూర్వమే కొన్ని ప్రాచీనశాసనములను ఎపిగ్రఫీఆఫీసువారి శాసనసంచయమునఁ బ్రతిబింబములఁజూచి ప్రతులు వ్రాసికొనియుంటిని గాన వానిలోఁ గొన్నింటిని వెదకి గుర్తించితిని. ఇంకఁ గొన్నిటికై రెంటాలు పడవలెను. ఆయాఫీసులోని ప్రాఁత తెలుఁగు శాసనముల ప్రతిబింబములను చెక్కింటి యీనడుమ శ్రీ జయంతి రామయ్య పంతులుగారు తెప్పించికొనిరట. శర్మగారుదాహరించినవి కొన్ని యందుండును. వానిపాఠములను, లిపులను జూచుకోవలసి యున్నది. మఱియు నావాదము

నకు సాధకములయిన శిలాశాసనములకుఁ గొన్నింటికిఁ బ్రతిబింబములను దీసి యచ్చుదిమ్మలు చేయింపవలసియున్నది. ఇవియెల్ల నెఱవేర్చుకొనుటకుఁ గొన్నాళ్లగును. వలయు పరికరములనెల్ల సమకూర్చుకొని శ్రీ శర్మగారివాదమును జక్కఁజూచుకొని నావాదమునకుఁ గూడఁ బునరాలోచనము చేసికొని న్యాయ్యమని నేను నమ్మినదానిని రాఁబోవు భారతిలోఁగాని దాని తర్వాతి భారతిలోఁగాని వెల్లడించుకొందును. నావాదము సరిగాదని తోఁచెనేని దానిఁదప్పక వెల్లడింతును. ఈచర్చ కొంతప్రాచీనాంధ్ర భాషాస్వరూపమును, ప్రాచీనలిపి స్వరూపమును బ్రవ్యక్తపఱుపఁగల్గుటతోఁ బర్యవసన్నమగునేని శ్రీ శర్మగారును, నేనును ధన్యుల మగుదుము.

శ్రీ శర్మగారు పయియక్షరమునుగూర్చి పత్రికలలో జర్చింపఁ దలపెట్టుట నాకు సమ్మతమే. ఆచర్చవలన నపూర్వశాసన భాషాపరికరము గొంత బయల్పడఁగలదు. కాని నిక్కముగా నిలువఁజాలని యసందర్భపుటాక్షేపముల నిప్పుడు నేను బదులుచెప్పినవానినిఁ బత్రికలోఁ బ్రకటించినందుకే యావంతనావంతి. వారు తమపాఠభేదములగూర్చి నాతో ముచ్చటించియుండఁదగును. నేను సమాధానము చెప్పియుండఁదగును; పరస్పరము మామాపాఠముల గుణదోషములనిర్ణయించుకొని యుండఁదగును. అట్లుజరిగియుండెనేని శ్రీశర్మగారికిఁగాని నాకుఁగాని, నడుమ వెంకటరమణయ్యగారికిఁగాని యీ యాయాస మక్కఱలేకపోయెడిది. శర్మగారును, నేనును బరస్పరము సందిగ్ధవిషయములనుగూడఁ బలుకుకొనుట చాలఁగాలమునుండి సాగుచున్న సంప్రదాయమేకాని క్రొత్తగాదు. అయినను శర్మగా రేలో ఆత్రపడి ప్రభాకరశాస్త్రిగారికి ప్రాచీనచాళుక్య లిపి చదువుటే చేతకాదన్న సిద్ధాంతము పుట్టఁదగినన్ని యాక్షేపములఁ బ్రోదిచేసిరి.

మఱియు శ్రీశర్మగారు నాశాసనపదపదార్థవివరణములఁగూర్చి అక్షరముల మార్చి చేర్చి తీసివేసి, శాసనమున కర్థము చెప్పితినని, అది చాలవరకు సందేహింపవలసి యున్నదని సందేహగ్రస్తసంస్కార ఫలితముగఁ గుదిరిన లిపినిర్ణయమును, అర్థమును సందేహగ్రస్తమే యని తేలుచున్నదని సూత్రప్రాయముగఁ జెనకఁగా వెంకటరమణయ్యగారు దానికి భాష్యప్రాయముగా బహుభావములాడిరి. పయిశాసనము లిపిదోషబహుళము. విడివిడిగాఁ బెద్దపెద్దగాఁ బ్రక్కకై దేసిబంతులచొప్పున వ్రాసిన మొదటి రెండుప్రక్కలలోను నిర్వదియేనుదోషములు గలవు. అందు సంస్కృతభాష గలదుగాన యాదోషములు స్పష్టములు. నేను వాని నిష్టమువచ్చినట్లు తీర్చి మార్చి చేర్చి నాయభిప్రాయమును జొప్పించి దిద్ది సంస్కరించితినని తెగడ శక్యముగాదు. 'ప్రసాదపదసమాసాదిత' అని కలదు. ఇందు 'పద' తీసివేయవలెను. 'భాస్వానితోష' అనికలదు. 'భాస్వా' తర్వాత 'నివ' చేర్పవలెను. 'రిపునృపాగ్రపుపవనః' అని కలదు. 'రిపునృపాభ్రపవనః' అనిమార్పవలెను. యిట్టివే యాతప్పులెల్లను. తెలుఁగుభాగమును ప్రక్కకేడేసి బంతులచొప్పున లేఖకుఁడు చెక్కినాఁడు. అక్షరములు చిన్నవి. బంతులు వంకర. లిపి చిక్కిలి అజాగ్రత్తగాఁ జెక్కినది. ఇట్టిచోఁ దప్పులుండక పోవునా? అయినను నేను సంస్కృతభాగమునఁ జేసిన సంస్కారములకంటెఁ జాలఁదక్కువగా నే తెలుఁగుభాగమున సంస్కారములను జేసితిని. వానిఁగూడ సకారణముగాఁ జేసితిని. వానినెల్ల నిక్కడ మరలఁ జేర్కొనఁజాలను. చేఁతలోఁ జెడిపోవచ్చునుగాని భావమునఁ బ్రామాణికత కొఱకే బాధపడితిని. ఆదరబాదరగా నేవో యందనిచోందని యర్థముల మనసులో నుంచుకొని 'పసిపూసి చేరెడుపండు' విధముగా మాఱుఁ జేయలేదు. నేఁ జెప్పిన యర్థవివరణాదులు నిర్దుష్టములేయని నేనన లేదు. ప్రాజ్ఞులింకను బరిశోధించి విశేషముల వెల్లడింపవచ్చును. మఱియెవ్వరేని యీసంస్కారములఁగూడఁ జేయనుండ యర్థము గుదిర్చినచో జోహారులు. అట్లేమియుఁ జేయక యాక్షేపించుట యర్హ లక్షణముగాదు. శ్రీ శర్మగారును పెక్కుశాసనములఁ బ్రకటించిరిగదా. వానిలో దాము గావించిన సంస్కారములనుగూడ స్మరించిచూచుకొనవలదా!

నాయీశాసనవిమర్శమునసే కీ. శే., కె. వి. లక్ష్మణరావు పంతులుగారు పరిశోధించినట్టియు, వారి యనంతరము శ్రీశర్మగారు పరిమాచి పూర్తిచేసి ప్రకటించినట్టియు సాతలూరి తామ్రశాసనమునుండి యొకశ్లోక

ముదాహరించుకొంటిని. ఆశ్లోకమును శ్రీలక్ష్మణరావు పంతులుగారు ఆంధ్రపరిశోధకమండలి వార్షికోత్సవాధ్యక్షోపన్యాసమునఁగూడఁ జేర్చినిరి. ఆయుపన్యాసమునను, భారతి ఒకటవ సంపుటమున ఒకటవసంచికలో సప్రతిబింబముగాఁ బ్రకటించిన తచ్ఛాసన విమర్శనమునను వాశ్లోకచరణము "పరకరిగల్ల భూపతి భూజాసి రిపౌజిభువి ప్రహాసతే" అని కలదు. 'ప్రహాసతే' అని సంస్కృతమునఁ గ్రియారూప ముండదు. 'ప్రహసతి' అని యుండును. 'ప్రభాసతే' అని యుండు నేమోయని యనుమానముతో భారతిలోని ప్రతిబింబమును జూచితిని. అందులిపి 'ప్రభాసతే' యని చదువఁదగియున్నది. పంతిచివర భాయక్షరము గలదు. భస్పష్టముగానున్నది. దాని దీర్ఘమున కక్కడ చోటు చాలక లేఖకుఁ డాయక్షరము క్రిందుగాఁ జెక్కెను. క్రింద నొకదీర్ఘపుగీటు గలదు. 'భ' స్పష్టముగానున్నప్పుడు, 'భాసతే' అర్థవంతమును, నిర్దుష్టమును నగు పద మయినపుడు ఇట్లే చదువఁదగును. 'ప్రహాసతే' అనురూపము సాధువు గాదు; లిపియు నట్లు లేదు; అర్థమును గుదురదు. నేనీవిషయమునెల్లఁ జేరుకొనక 'ప్రభాసతే'అనియే యుదాహరించుకొంటిని. మఱియు నాశాసన ప్రతిబింబములను బాఠములను జూడఁగా నిట్టి వింకను గానవచ్చెను. ప్రతిబింబములనుబట్టి ౮ వ పంతిలో 'మగిదొగరాజః' ౩౧ వ పంతిలో 'చతురాశ శ్చక్ర వరహాలాఞ్ఛన' అని కలవానిని 'మగిదొశ(ఫుట్ నోటులో శ స్పష్టముగ లేదు 'గ' కావచ్చును' (గ స్పష్టముగనే కలదు.) అని) రాజః' అని; చతురాశశ్చకే(?) వరహాలాఞ్ఛన' అని చదివిరి. ఇట్టివి గాన వింకముగలవు.

శ్రీశర్మగారిప్పటికిఁ బ్రకటించిన శాసనములలోఁ గడపటిదగు చాళుక్యభీమరాజు సీసపద్యశిలాశాసనమునఁ గూడ సందేహస్థానములు గలవు. "జడలిన భోయల పడరిపా[స్థ్రి]...... కన్నరాభూపతి పెన్నాజిలో జూపె సంకిలా (ల) ద్దాను తేని బింకముడిచె...చోల నింకేకొని కాచె భూలోకంబెఱుంగ..."

ఇత్యాది విధముగానున్న సీసమున వాక్యముల కెల్ల కర్తృపదము 'పండరంగు'అనునది. 'కన్నరాభూపతి పెన్నాజిలోఁ జూపె' అని శర్మగారి పాఠముచొప్పునఁ జూడఁగా వాక్యాన్వయము, అర్థము పొసఁగదు. తక్కిన వాక్యములకెల్ల విరుద్ధముగా 'కన్నరాభూపతి తనపెన్నాజిలో పండరంగనికిఁజూపె' నని యర్థము చెప్పరాదు. కనుక "కన్నరా భూపతి పెన్నాజిలోఁ జూచె" అని యుండవలెనని నేను నిశ్చయించుకొని శాసనశిలను బరిశీలించితిని. అం దాయక్షర మస్పష్టముగానున్నను 'పె' అని చదువుటకుఁగాక 'చె' అని చదువుటకే యానుకూల్యము గల్గియున్నది. శర్మగారు తమవిమర్శమున లిపిరీతియే తమకుఁ బ్రధానముగాని యర్థపదన్వయముతోఁ దమకుఁ బని లేదని వ్రాసిరి. నేఁడు జిలుగువ్రాఁతగల కాగితములను జదువుటలోఁగూడ లిపిసంకేతములతో పాటు పదపదార్థసంగతికూడఁ బాఠపరిజ్ఞానమున ముఖ్యమగుట సర్వవిదితము. ఇంచుమించుగా శాసనలిపియు నిట్టిదే. అర్థసంగతియు, నారయకున్నచో సర్వత్ర స్పష్టముగాఁ బాఠనిర్ణయము లిపిమాత్రజ్ఞానముచే సాధ్యము గాదు. అర్థయోజనము సాధు లిపిస్ఫురణమునకు సాధకము.

[నేలటూరి ప్రభాకరశాస్త్రి]

ఆంధ్రాభ్యుదయము

శ్రీయుతులు
డాక్టరు నేలటూరి వేంకటరమణయ్య గారు,
యమ్. ఏ., పి హెచ్. డి.



వీరు పురమారు ద్రావిడశాఖీయులు; నేలటూరి సుబ్బయ్యగారి కుమారులు. జననము ౧౮౯౭ ప్రాంతము. స్వకాయకష్టమువలను, స్వయంసహాయమువలనను నెల్లూరు అమెరికన్ బాప్టిస్టు మిషన్ హైస్కూలులో ప్రాథమికవిద్య ముగించుకొని, పిదప మదరాస్ క్రిస్టియన్ కాలేజిలో ఇంటర్మీడియెట్, ఆనర్సు పరీక్షలందు తీర్ణులైరి. ౧౯౨౧ లో బెంగుళూరిలో 'వెస్లియన్ మిషన్ కాలేజీ'లో ఆర్థికశాస్త్రోపన్యాసకులు (Economics Lecturer)గ పనిచేసి, ౧౯౨౨ లో మదరాసు 'క్రిస్టియన్ కాలేజీ'లో తెలుగుపండితులుగ ప్రవేశించిరి. ౧౯౨౩ లో వీరి వసట చారిత్రకశాఖలోనికి మార్చిరి. అప్పటినుండి యిప్పటివరకు ఆశాఖయందే ఉపన్యాసకులుగ పనిచేయుచున్నారు. 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' (పి హెచ్. డి.) బిరుదమునకై వీరు ౧౯౨౬ లో దక్షిణహిందూదేశ దేవాలయోత్పత్తి (The origin of the South Indian temple) అను వ్యాసమును మద్రాసువిశ్వవిద్యాలయమువారికి బంపిరి. వారు దీని యోగ్యతను, ప్రాశస్త్యమును బరీక్షించి వెంకటరమణయ్యగారికాబిరుదమును ౧౯౨౭ మార్చిలో నొసంగిరి. కడచిన నెల ౨౩ వ తేదీని జరిగిన పట్టప్రదాన సభలోనే వీరు 'డాక్టరు' పట్టమునందిరి.

శ్రీయుతులు
డాక్టర్ వంగల శ్రీరాముగారు



వీరు లక్నో విశ్వవిద్యాలయ రాజనీతిశాస్త్రశాఖా ప్రధానాధికారులు; సుప్రసిద్ధాంధ్రులు, కృష్ణాపత్రికా సంపాదకులు నగు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారి యల్లుండ్రు. వీరు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయము నందు బి.ఏ. (ఫస్టుక్లాసు ఆనర్సు) అందు తీర్ణులైనవారు; రాజనీతిశాస్త్రమునందలి నైపుణికి బెస్నెట్ బహుమానము బడసినవారు; హార్వర్డు విశ్వవిద్యాలయమున యమ్. ఏ., పి హెచ్. డి. పట్టములను పొంది అంతర్జాతీయ న్యాయశాస్త్రమునందు బౌడీన్ బహుమతిని బడసి, 1917-18 సం.ల యందు యూనివర్సిటీ స్కాలరుగను, 1919-19 సం.లలో గూడ్విన్ మెమోరియల్ ఫెల్లోగను, 1919-20 సం.లలో పార్కర్ ట్రావెలింగ్ ఫెల్లోగను నుత్తమవిద్యల నభ్యసించినవారు; కేంబ్రిడ్జివిశ్వవిద్యాలయమున ఎమ్మాన్యూల్ కళాశాలయందు అంతర్జాతీయ న్యాయశాస్త్రమున పరిశోధనలగావించినవారు; 1924-25 సం.లయందు పాట్నా విశ్వవిద్యాలయమున రీడర్‌షిప్ లెక్చరుల నుపన్యసించినవారు. ఇంతకుపూర్వము వీరు కలకత్తా విశ్వవిద్యాలయమున ప్రధానోపన్యాసకులుగపనిచేసి యుండిరి. అంతర్జాతీయ న్యాయశాస్త్రమునందు కార్నెగీ ఫెల్లోషిప్‌ను పొందిన ప్రథమ భారతీయులు వీరే.

భారతీయమహిళామండలి

శ్రీమతి వైదేహీకన్య



ఏడేండ్లు వయస్సుగల ఈబాలిక హైందవ లక్ష్మీ విలాస సభ (తిరువళిక్కేణి)కు అధ్యక్షురాలైన శ్రీమతి యం. లక్ష్మీఅమ్మాళు మనుమరాలు. ఈబాలిక తన మూడవసంవత్సరమునుండి నాట్యమునందు పేరుగాంచి పెక్కురచేత పెక్కు బహుమతులను బడసినది. మఱియు 'బాలవటి' యను బిరుదమును 'టాడ్ హంటరు పతి'వలన బొందినది. ఈబాలిక లక్ష్మీవిలాససభవారి యాదరణమున నిటీవల రుక్మిణీకల్యాణ హరికథను కాలక్షేపము చేసినది. ఈమె తలిదండ్రులు ఉన్నతవిద్యావతినిగా జేయుట పరమావశ్యకము. విద్యావతియగు చేని యీమెకీర్తి మున్ముందు బహుధా పెంపొందగలదు.

శ్రీమతి ఎ. సి. దేవకీకన్య, చెన్నపురి




ఈమె చెన్నపురి మేరీరాణీ కళాశాలయందు చదివి బి. ఏ. పరీక్షయందీ రాజధానిలో ప్రథమస్థానము నలంకరించినది. ప్రొఫెసరు కాండేత్రుపండితులవారి మేనకోడలు.

శ్రీమతి ఇ. జార్జికన్య



వేదాంతశాస్త్రమున యం. ఎ. పట్టపరీక్షయందు రాజధానిలో నెట్టమొదటిస్థానము నలంకరించినది. ఈమె చెన్నపురి క్రైస్తవకళాశాలయందు విద్య నభ్యసించినది.

అన్నపూర్ణాదేవి బాలికాపాఠశాల, ఏలూరు.



ఈపాఠశాలను శ్రీ. శే. మాగంటి అన్నపూర్ణాదేవి స్మారకసంఘమువారు నడుపుచున్నారు. ఇందు విద్యతోపాటు చేతిపనులుకూడ నేర్పుచున్నారు. ఇయ్యది పాఠశాలయొక్క వార్షికోత్సవ చిత్రము.

శ్రీమతి అమృతమ్మాళ్



ఈమె చిదంబరం పురపాలక సంఘమునకు సభ్యురాలుగా నియమింపబడిన మొదటి ఆదిద్రావిడయువతి; విద్యావతి.

శ్రీమతి కాథరైను సుబ్బరాయుడుగారు,
బెజవాడ.



ఈమె బెజవాడయందు గౌరవన్యాయాధిపతిపదమున నియమింపబడిన మొదటి ఆంధ్రయువతి.

శ్రీమతి రుక్మాబాయిగారు



పరశురామరావుగారి సర్కసునందు వ్యాయామప్రదర్శనము గావించుచుండ తీసిన ఛాయాచిత్రము. ఈమెనుగూర్చి భారతి నాల్గవ సంపుటము మూడవసంచికయందు చూడదగును.

మాధవయ్యగారికుమార్తె, యం.బి.,బి.యస్.



ఇంగ్లండుకు పోయియున్నది.
మాధవయ్యగారు సుప్రసిద్ధ గ్రంథకర్త.

సంభాషణయం దధికాభిలాష.





హీరాసుపండితకృత అర్వీటివంశకృతి విమర్శనము

(ARAVIDU DYNASTY)

ఆంధ్రదేశచరిత్రరచన మిదివఱకును, అఱవసోదరు లొక్కరియు, ఆంగ్లపండితులయొక్కరియు హస్తగతమై యున్నది. అందు వారు పెట్టినదియే భిక్ష. ఆంధ్రదేశ చరిత్ర నిబంధనమునకు ఆంధ్రభాషా పాండిత్య మత్యంతా వశ్యకము. అట్టి పాండిత్యము లేక ఆంధ్రదేశ చరిత్రము వ్రాయఁబూనుట నేలవిడిచి సాముచేయుటవంటిది. ముఖ్యముగా విజయనగర సామ్రాజ్య చరిత్రము వ్రాయుటకు, కృష్ణదేవరాయల కాలమునాఁటికవులకృతు లెంతయుఁ దోడ్పడఁ గలవు. ఆంధ్రభాష మన అఱవసోదరు లెట్లు తెలిసికొనెదరు? ఆంగ్లచరిత్రకారు లెట్టిపరిశ్రమ చేసిరి? ఒకచిన్న ఉదాహరణము మిచ్చెదను. కృష్ణస్వామి అయ్యంగారు తాము సవరించి Sources of Vizianagar History అను గ్రంథమునందు 'హర్మత్తున' అనే పదమున కర్థము తెలియమిచే నీక్రింది యసందర్భపు వ్రాఁతలు వ్రాసిరి. "According to this manuscript hurmattu appears to be the name of a fortress near Udayagiri. But in the Krishnarayavijayam, the word occurs in the phrase ఒక్క హర్మత్తున meaning in one hurmattu and refers to the conquest of Sivasamudram. It therefore appears to be an adverb. The proper meaning of hurmattu is not known and there is no fort of that name near Udayagiri. (Sources of Vijianagar History, P. 114). హర్మత్తున అనే పదము కృష్ణరాయవిజయమునం దీవిధమున నుపయోగింపఁ బడినది. "వ. అనంతరం బొక్క హుర్మత్తున నుమ్మత్తూరు శివసముద్రస్థలంబుల నొఁపంగు" పుట 62. ఆ 'హుర్మత్తు' అనే పదము నామవాచకమో అవ్యయమో తెలియక సింజాకొనెను అఱవపండితుని ఆంధ్రదేశ చరిత్ర మెట్లుండునో చదువరు లూహించుకొనెదరుగాక.

నేను విజయనగరసామ్రాజ్యము రచించుటకు మొదలిడితిని. నేఁటివఱకు ప్రచురింపఁబడిన ఆధారము లన్నిటిని బురస్కరించుకొని సప్రమాణముగ వ్రాసినాఁడను. తుళువ వంశముగూర్చి వ్రాయుటకుఁ బ్రారంభించితిని.

విజయనగరసామ్రాజ్య చరిత్రకుఁ దోడ్పడు గ్రంథములలో హీరాసు పండితుని 'Aravidu Dynasty of Vizianagar' అను ఆర్వీటి వంశ చరిత్రము చాల ముఖ్యమైనది. వీరు Journal of Mythic Society of Bangalore కు కొన్ని వ్యాసముల నీవిషయమై యిదివఱకు వ్రాసి, వాని నన్నిటిని చేర్చి విపులముగా నిట్లు గ్రంథ నిబద్ధముగావించిరి. వీరి గ్రంథమునందలి విశేష మేమన పోర్చుగీసువారు వ్రాసియుంచిన చరిత్రలనుండియు,ఆకాలపు నాఁటి పోర్చుగీసు ప్రభుత్వమువారిదగ్గఱ నున్న రికార్డులనుబట్టియు, మారివాంశముల గ్రహించి, చరిత్రమును విపులమొనర్చిరి. కాని ఆర్వీటివంశమునుగూర్చి చక్కటి ఉద్రేక

పూర్వకమగు చరిత్రము వ్రాయుటకు ఆసంశీయమందలి రాజులు వ్రాసిన కృతులు, వారు కృతినందిన ఆంధ్ర కావ్యములును ముఖ్యముగా సహకారులుగాఁ గలవు. వసుచరిత్ర, రామరాజీయము, బాలభాగవతము, వరహ పురాణీయము మొదలగు గ్రంథములు సమగ్రముగాఁ బఠించినచో నార్వీటి వంశముయొక్క కథావిశేషము పూర్తిగా తెలియఁగును. హీరాసు పండితునకు ఈకావ్యములఁ గూర్చి తెలిసికొనుటకు అజునఅయ్యంగారి గ్రంథమే ఆధారమయినది. గ్రంథముయొక్క Foct Notes లో కృష్ణస్వామి అయ్యంగారి నామమే యెక్కుడుగఁ గన్పించుచున్నది. దానికిఁ గారణము వారు ఆంధ్రసంస్కృత కావ్యములు పఠించి వీని నన్నిటిని జేర్చి 'Sources of Vizianagar History' అని యొక గ్రంథమును ముద్రించుటయే. హీరాసుపండితుని గ్రంథమునందు మన ఆంధ్రకావ్య కృతికర్తల నామములు మేఘచ్ఛన్నమగు రాకాశారదచంద్రికవలె మఱుఁగుపడియున్నవి. దీని కంతకును గారణము మన ఆంధ్రచరిత్ర అమ్మల హస్తగతములగుటయే. 'Literary Activity' అని పేరు పెట్టి ఒక్క అధ్యాయము 20 పుటలలో పూర్తిచేసిరి. ఆర్వీటివంశమునుగూర్చి వ్రాయుచు నందు సారస్వత పరిణామమును గూర్చి వ్రాయుననుచు నే యాంధ్ర పండితుఁడైన నేవేయిపుటల గ్రంథమైనను వ్రాయనగును. వసుచరిత్రమునుగూర్చి రెండు పేరాలు వ్రాసి వదలివేసిరి. తెనాలి రామలింగకవిఁగూర్చి ఒక్క పేరా వ్రాసి వదలివేసిరి. వ్రాసినదంతయు నసందర్భముగానే యున్నది.

ఆంధ్రకావ్యములందు బిజాపురీ నవాబును 'సపాదు'డని వర్ణింపఁబడినది. ఈవిషయము వసుచరిత్రాది గ్రంథములు చదివినవారికిఁ దెలియఁగలదు. కాని హీరాసునకు సపాదుఁ డెవరో తెలియలేదు.

19 వ పుటలో "Bukka's son RamaRaya who expressed Lakkambika, is called a great warrior, and conqueror of Sapada's army. Sapada is understood to be the Sultan of Golkonda." మన తెలుఁగు కావ్యములందు గోలకొండ నవాబు కుతుబుషాహియనియు, కుతుబునమల్కనియు వర్ణింపఁబడెను. ఇది హీరాసుగారి కెట్లు తెలియును! ఆగ్రంథమునందే 78 వ పుటలో "The Vasucharitram states that the Nizam, Kutubshahi, and Sapada (Adil Saha of Bijapur) fled to the forests before his march" అని వ్యాఖ్యానింపఁ బడినది. దీనికాధారములు కృష్ణస్వామి అయ్యంగారి వ్రాతయే (Sources of Vizianagar History).

ఆర్వీటివంశచరిత్రమును గూర్చి వ్రాయుచు ఆర్వీటిపుర మెక్కడిదో, వీరి మొదటి నివాసస్థల మెక్కడనో దొరగారు నిర్ణయింపలేదు. దీనికి గారణము వారు దానికిఁ దగినకృషి యొనర్పక పోవుటయే.

ఈ గ్రంథమునందు ముఖ్యముగా మనకుఁ దెలిసిన నూతనవిశేషము తల్లికోట యుద్ధమునుగూర్చి. ఈ యుద్ధవృత్తాంతము దొరగారు చంద్రచూడుగారి 'The Destruction of Vizianagar—Account of the Second Conference of the Bharata Ithibasaka Samsodhaka Mandala, Poona 1914' నుండి గ్రహింపఁ బడినది. మొదటినుండి చివరవరకుఁ జదివినచోఁ బ్రతియాంధ్రుఁడును, ఆర్వీటివంశ ప్రాబల్యమును గూర్చి గర్వపడక మానఁడు. ఇందులకు దొరగారి చరిత్ర పరిశోధనయుఁ గృషియుఁ గారణములు. ఆయన కాంధ్రులు కృతజ్ఞులు.

విజయనగర సామ్రాజ్యచరిత్రము వ్రాయుచుంటిని గాన, తద్విషయమందు ఈగ్రంథము నాకుఁ జాల సహాయకారిగ నున్నది. నాకాంగ్లమునందే రచింపవలెనని యుత్సాహము కల్గి, నామాతృభాషలోనే వ్రాయుచుంటిని. గ్రంథమధ్యమున నాంధ్రకవుల పద్యములు ప్రమాణములుగ వ్రాయుచున్నప్పుడు, చదివినఁ గలుగు ఆహ్లాదము, అన్యభాషలో భాషాంతరీకరించి, వ్రాసిన దానిని జదివిన గలుగ లేదు. అందుకనే ఒకచీనా (China) పండితుఁడు 'Translation is transformation. అన్నాఁడు. త్వరలోనే నాగ్రంథము గూడ ఆంధ్రప్రపంచమునకు సమర్పించెదను.

కుందూరి ఈశ్వరదత్తు

పశువైద్యచింతామణి

గ్రంథకర్త: యేలేశ్ల శ్రీరాములు చౌదరిగారు, అంగలూరు (కృష్ణాజిల్లా). క్రౌను సైజు 194 పుటలు; వెల 1-4-0.

భారతదేశ సౌభాగ్యము పూర్వకాలమునను ప్రస్తుతమునను, భావికాలమునను కూడ పాడిపంటలపైననే యాధారపడియున్నది. మన మాతృదేశము ముఖ్యవ్యవసాయ జీవనముగల ప్రజతో నిండియున్నది. ఈవిశాల దేశమున నేకొద్దియో పట్టణము లున్నవిగాని నూటికి తొంబదిభాగములు పల్లెటూళ్లేయని యందరకును తెలియును. పాశ్చాత్యనాగరికత, పట్టణవాస గౌరవము నెంత హెచ్చయిపోవుచున్నను దేశక్షేమ మెన్నటికైన గ్రామసౌభాగ్యముననే యాధారము చేసికొని యున్నది. 'గ్రామపునర్నిర్మాణము చేయుడు', 'మరల గ్రామములకు మరలుడు' అను హెచ్చరిక లెచ్చటజూచినను వినవచ్చు నీదినములలో పాడిపంటలకు రెంటికిని, శిశు ఆరోగ్యమునకును, వస్తువుల రవాణాలకును నన్నింటికి నత్యవసరమైన బలమును, నారోగ్యకరమగు పశువుల సంపదయొక్క తప్పని యవసరమును గూర్చి చెప్ప బనిలేదు. నిత్యకృత్యములవలెనే నప్పుడు మనకు పశువుల యారోగ్యాభివృద్ధులకు తగు మార్గములు తెలియుట, వాని రుగ్మతలను తెవుళ్లను కుదిర్చి మరలసౌభాగ్యము నొడగూర్చుటయు తెలియుట యత్యావశ్యకము. ఈగ్రంథకర్తగారు మిగుల శ్రమకోర్చి పశువులు, గుఱ్ఱములు, కోళ్ళు మొదలగు వానికివచ్చు జాడ్యలక్షణములను, వానికి ఆయుర్వేద, ఆంగ్లవైద్య పద్ధతుల ననుసరించిన చికిత్సలు మొదలగువానిని ఇందు సమకూర్చి మిగుల నుపకార మొనర్చిరనుటకు సందియము లేదు. చిన్నరోగము మొదలు పెద్దజాడ్యములకు సులభచికిత్స మొదలు అనేకతీవచికిత్సలను నిందు వివరముగ, సరళముగ దెలిపినందుకు వీరికి రైతు లెల్లరు, పశుసంపదగలవారెల్లరు కృతజ్ఞులై యుండవలయుదురు.

ఈపొత్తమునకు, ప్రొఫెసరు రంగనాయకులు (ఆక్సుఫర్డు) గారు పీఠికను వ్రాసి, దీని విలువనుగూర్చి చక్కగా వివరించిరి. వ్యవసాయముగూర్చి విద్యనభ్యసించిన పెద్దలు కొందఱును, పశువైద్య శాఖోద్యోగులు కొందఱుకూడ నీగ్రంథముపై తమ సదభిప్రాయము నొసంగియున్నప్పు డింతకంటె వేఱుగా వ్రాయుట యవసరము లేదు.

జ. బ్ర.

యువకులు — దేశము

ఇది యొక 13 పుటల చిన్ని పొత్తము. కాకినాడ శ్రీ సోదరసమితివారిచే ప్రచురింపబడిన మొదటి ప్రచురణము. యువకులపైననే భారతదేశభావిసౌభాగ్యమాధారపడి యున్నదను సాధువాస్వానీగారి యుద్బోధనము నాధారముగా గొని ప్రపంచములోని వివిధఖండములలోను, దేశములలోను యువకులు స్వాతంత్ర్యము గడించుట కెట్లు పాటుపడి విజయవంతులైరో వివరించుచు భారతీయులను కార్యకరణమునకు పురికొల్పుచున్నది. వ్యాయామము, బ్రహ్మచర్యము, దేశభక్తి, ఖద్దరుదీక్ష, గ్రామపునర్నిర్మాణము మున్నగున వన్నియు యువకుల కార్యక్రమములోనివే యని యుద్ఘోషించుచున్నది. ఇట్టి సమితులును, వాని ప్రచురములును, దేశసౌభాగ్యమున కెంతయు తోడ్పడగలవు.

జ. బ్ర.

మిస్ మేయో గ్రంథ ఖండనము

(తెలుగు వచనము)

ఇందు మేయోగ్రంథసారము, రంగయ్యగారి ఖండనము, దీనబంధు ఆండ్రూసుగారి ఖండన లేఖలును గలవు. క్రౌనుసైజు. ౨౦౦ పుటలు. వెల రు. ౧-౦-౦.

పరిష్కర్త: శ్రీ పురాణం సూర్యనారాయణ తీర్థులుగారు

ప్రకాశకులు: జి. యస్. శాస్త్రి అండు కో, పోస్టుబాక్సు నెం. 110 రు, చెన్నపురి.

పునర్జన్మ (తెలుగు వచనము)

గ్రంథకర్త: శ్రీ పంచకర్ల వెంకన్నగారు, రాజమహేంద్రవరము.

డెమ్మిసైజు. ౧౧౦ పుటలు. వెల రు ౦-౧౦-౦.

మహాభారతచరిత్రము (వచనము)

గ్రంథకర్త: పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, పిఠాపురము. డిమ్మీసైజు, ౨౩౬ పుటలు. వెల రు ౧-౪-౦

బాష్పాంజలి (వచనము)

గ్రంథకర్త: శ్రీ ఓంకారస్వాములు గారు. విలాసము: శ్రీ శాంతిఆశ్రమము, తోటపల్లికొండలు, శాంతి ఆశ్రమము పోస్టు, తూర్పుగోదావరిజిల్లా. ౬౪ పుటల చిన్నిపుస్తకము. వెల రు ౦-౫-౧.

ఆంధ్ర భగవద్గీతలు, (పద్యములు. మొదటి మూడధ్యాయములు మూడు ప్రత్యేక సంపుటములు)

గ్రంథకర్త: కే. బాబూరావునాయుడు గారు, బి. ఏ., బి. యల్., హైకోర్టు వకీలు, బరంపురము. ఈ యొక్కొక్క చిన్ని సంపుటము వెల రు ౦-౧-౦.

రసవాహిని (ఖండగీతములు)

గ్రంథకర్త: తుర్లపాటి గోవర్ధనరావు గారు. క్రౌనుసైజున ౬౨ పుటలు. విలాసము, వెల తెలియదు.

ధర్మసంగ్రహామునందలి ఆహ్నికకాండము-ద్వితీయభాగము (సంస్కృతమూలము, తెలుగు తాత్పర్యము)

గ్రంథకర్త: ముదిగొండ నాగలింగ శాస్త్రిగారు. విలాసము: శైవప్రచారిణీ, వరంగల్. డిమ్మీసైజు. ౧౩౧ పుటలు. వెల రు. ౧-౪-౧.

అభినవభారతచరిత్ర (తెలుగు వచనము)

గ్రంథకర్త: తూములూరి శివరామయ్య గారు. విలాసము: వాఙ్మయమండలి, గుంటూరు. ఈమండలిలో రెండవదగు నీ పుస్తకము క్రౌనుసైజున ౧౬౦ పుటలు గలది. వెల చందాదారులకు రు ౧-౧౨-౧; ఇతరులకు రు. ౧-౦-౮.

శ్రీకృష్ణచరిత్రము (వచనము)

గ్రంథకర్త: కోడాలి సత్యనారాయణరావుగారు, విలాసము: కే. శేషగిరిరావు అండ్ బ్రదరు, బుక్ సెల్లర్సు, ఏలూరు (పశ్చిమగోదావరిజిల్లా). క్రౌనుసైజు ౧౦౧ పుటలు. వెల రు. ౧-౧౦-౦.

వివిధకుసుమావళి (ప్రథమగుచ్ఛము)

గ్రంథకర్త: కవికొండల వేంకటరావుగారు, బి. ఏ., బి యల్. విలాసము: గ్రంథకర్త, నరసాపురము, పశ్చిమగోదావరి. క్రౌనుసైజు ౧౦౬ పుటలు. వెల విద్యార్థులకు రు ౦-౮-౦; ఇతరులకు రు ౦-౧౨-౦.

ముద్దుకృష్ణ (అయిదంకముల చిన్ని నాటకము)

గ్రంథకర్త: కొండపల్లి జగన్నాథదాసు గారు, విజయనగరము. క్రౌనుసైజు ౪౧ పుటలు. వెల రు ౧-౪-౦.

ఆంధ్రీకృత ప్రసన్నరాఘవనాటకము.

అనువాదకుడు: శ్రీరాజా మంత్రిప్రెగడభుజంగరాయకవి. డిమ్మీసైజు ౧౪౨ పుటలు. వెల రు ౧-౦-౧ విలాసము: రాజా భుజంగరాయ ప్రచురణాలయము, ఏలూరు, వెస్టు గోదావరీజిల్లా.



ఏసుక్రీస్తు

[ఆగస్టు నెల మాడర్ను రివ్యూ పత్రికయందు ప్రకటించిన శ్రీ మణీంద్రభూషణగుప్తగారి త్రివర్ణచిత్రమునుండి.]

ఆకస్మిక ఛాయాచిత్రములు

(SNAP SHOTS)



౧. ద్రాక్షారామ సప్తగోదావరి ప్రాంతము



౨. వరిమళ్లకు గూడలతో నీరు వేయుట



3. వరిమళ్లకు ఏతముతో నీరుతోడుట

ఛాయాచిత్రకారుడు: శ్రీ చక్రవర్తుల వెంకటరావుగారు, దంగేరు, ద్రాక్షారామంపోస్టు, తూ. గో. జిల్లా.

సాభిప్రాయవిశేషములు

సకలపక్షసమావేశము

ఆగస్టు మాసాంతమునందు లక్ష్మణపురమునందు గూడిన సకలపక్షసమావేశము భారత స్వరాజ్యసంరంభమునం దొక దివ్య ఘట్టముగ నున్నది. సకలపక్షసమావేశము బొంబయియందు మే నెల 19-వ తేదిని గూడినది. బొంబయి సభయందు స్వరాజ్యాంగ నిర్మాణమును తయారుచేయుట కొక యుపసంఘ మేర్పరుపబడినది. ఆయుపసంఘమునందు శ్రీయుత పండిత మోతిలాలునెహ్రూ, సర్ తేజబహదూరు సప్రు, సర్ ఆలిఇమాము, ప్రధాను షుయేబు క్వరీషు, సుభాసుచంద్రబోసు, మాధవరావు ఆనె, జయకరు, జోషి, సర్దారు మంగళసింగుగార్లు సభ్యులు. ఉపసంఘమునకు పండిత మోతిలాలునెహ్రూ గారధ్యక్షులు. బొంబయి సమావేశమునందు సకలపక్షసమావేశము నాటిన బీజమునకు ఉపసంఘసభ్యులు దోహదంబు నొసంగి స్వల్పకాలములోనే పల్లవకుసుమపరిశోభితము చేసిరి. దానిని ఫలవంతము చేయవలసిన భారము భారతీయులమీాదను, బ్రిటీషు రాజ్యాధికారుల మీాదను గలదు. ఆరంభమునకు బొంబయి వలెను సఫలత నొందించుటకు లక్ష్మణపురమును సకలవిధములను తగియున్నది.

బొంబయి నగరము పాశ్చాత్యనాగరికతకు చిహ్నమై నవయుగ పరిణామమునకు లక్ష్యముగ గోచరంబగుచున్నది. బొంబయి నగరమందలి విశ్రాంతిగృహములు, దుకాణములు, పొగయోడలు, రైలుబండ్లు, నౌకాశ్రయములు, వేషభాషలు, మోటారుబండ్లు, సంపదలు పాశ్చాత్యవిజయమును సహస్రముఖముల వెల్లడిచేయుచున్నవి. బొంబయి నగరమందు ప్రాచ్యసంస్కారము రూపమునందు కొంతవరకు కనబడుచున్నను, భావమునందు కృశించినది. అన్నిజాతులవారును, ధనార్జనమునకై నిరంతరము పాటుపడుచుండెడి విధమును బొంబయినగర పరిస్థితులు సువ్యక్తము చేయుచున్నవి. దేశమునకును, జాతికిని వ్యాపారపరిశ్రమములు గలుగజేసెడి లాభనష్టములను బొంబయి నగరము వేయినోళ్ళను చాటుచున్నది. ఒకప్రదేశమున దివ్యభోగముల ననుభవించెడి కోటీశ్వరులును, ఒకవైపున అష్టకష్టముల ననుభవించెడి దరిద్రులును ప్రత్యక్షమగుచుందురు. బ్రిటిషు రాజ్యప్రభావ మంతయు బొంబయి నగరమందు గోచరంబగుచున్నది. మూడువందల ఏండ్లలో బొంబయినగరమునకు పట్టిన మహద్దశవలన బ్రిటిషురాజ్యస్వభావము, బ్రిటిషురాజ్యబలము గ్రాహ్యములగుచున్నవి. చూపులకు సకల జనులకును సాహచర్య సంయోగములు గన్పట్టుచున్నను, కార్యములందు సంకుచితముగ పరిణమించుచున్నవి. నవయుగ నిర్మాణమైన బొంబయినగ

రమునందు గూడిన సకలపక్ష సమావేశము ప్రాచీనమైన లక్ష్మణపురమునందు సఫలమౌట సకలవిధములను ప్రశస్తముగ నున్నది.

లక్ష్మణపురము ఆర్యావర్తమందలి పుణ్యక్షేత్రము. హిందూయుగమునందు వలె మహమ్మదీయయుగమునందును లక్ష్మణపురము ప్రసిద్ధిని బడసినది. 1857 సం.నందు సంప్రాప్తమైన సిపాయిల తిరుగుబాటు సందర్భమునను లక్ష్మణపురము నాయకత్వమును వహించినవిధ మితిహాసప్రసిద్ధము. ఆపురమందలి దివ్యమందిరములు భారతీయకళా వైభవములను ప్రత్యక్షము సేయుచున్నవి. బ్రిటీషు రాజ్యాధికారము రూపమునందు ప్రత్యక్ష మగుచున్నను, భావమునందు భారతీయసంస్కార ప్రాబల్యమే గోచరించుచున్నది. లక్ష్మణపురము హిందూ మహమ్మదీయుల విభేదములకు వలె హిందూ మహమ్మదీయ సంయోగములకును నిలయముగ నున్నది. ఉత్తర హిందూదేశమందు హిందూసంఘటనము ముస్లింసమితిస్వీయసాంఘికులందు వెలుగజేయుచున్న ఆత్మవిశ్వాసమునకు లక్ష్మణపురమునందు కూడిన సకలపక్షసమావేశము ప్రమాణముగ నున్నది. సకలపక్షసమావేశము తాలూకుదారులసుందరమందిరమునందుగూడినది. స్వరాజ్యపతాకము మందిరముమీద విరాజిల్లినది. తాలూకుదారుల నాయకుడు మహమ్మదాబాదు మహారాజు సభ్యులకు స్వాగతము నొసంగిరి. సభను సకలపక్షనాయకు లలంకరించిరి. డాక్టరు బిసెంటమ్మ, ఆలీఇమాం, తేజబహద్దూరు సప్రూ, సి. పి. రామస్వామయ్యరు, మదనమోహన మాలవ్యా, షౌకతాలీ, చాగ్లా, బిపినచంద్రపాలు, చింతామణి, అబ్దులుకలం ఆజాదుగార్లు మొదలగువారలు చూపిన వ్యగ్రోత్సాహము సకలపక్షములవారలకు గల స్వరాజ్యకాంక్షను విశదము చేసినది. పన్నెండు సంవత్సరములకు పూర్వము పట్టిన అదృష్టమె ఇప్పుడును లక్ష్మణపురమునకు పట్టినది. నాలుగేండ్లనుండియు దేశమును కీలాభీలము చేయుచున్న హిందూ మహమ్మదీయ విభేదములు లక్ష్మణపురమునందు నమసిపోయినవి. డెబ్బదేండ్లు నిండిన పాలుగారును, ఎనుబదేండ్లు నిండిన బిసెంటమ్మగారును పూరించిన స్వరాజ్యనాదము దిగంతములందును వ్యాపించి బ్రిటీషు రాజ్యనీతిజ్ఞులకును, భారతీయులకును జ్ఞానోదయమును, స్వరాజ్యదీక్షను గలుగజేయుటకు సాధనముగ నుండగలదు. పాలుగారు దురహంకారపరాయణులైన బ్రిటీషు రాజ్యనీతిజ్ఞులకును, ప్రాజ్ఞులైన వివిధపక్షనాయకులకును, స్వతంత్రసంపాదనయందు కృతనిశ్చయులైన యువజనులకును, పరమేశ్వరునకును · సమర్పించిన వందనములు భారతీయుల ధర్మపరాయణత్వమును విశదము చేయుచున్నవి. వృద్ధులైన పాలుగారి భావములకును, యువకులైన జవాహరీలాలు నెహ్రూగారి భావములకును గల యంతరమును సకాలముననే బ్రిటీషు రాజ్యాధికారులు గ్రహించుట శ్రేయస్కరము.

* * * *

భారతరాజ్యాంగ నిర్మాణము

మాంటుఫర్డు నివేదికయందు బాధ్యతాయుత స్వపరిపాలనమును స్థాపించుట బ్రిటీషు రాజ్యాధికారుల విధ్యుక్తధర్మమని ప్రతిపాదింపబడినది. ఆ ప్రతిపాదనను సార్థకము గావించుటకు బదులు నిరోధించుటకే బ్రిటీషు రాజ్యనీతిజ్ఞులు వారి శక్తిసామర్థ్యములను గతించిన పదేండ్లయందును వినియోగించిరి. ఆ నిరోధక మార్గమునే సుస్థిరము చేయుటకు బ్రిటీషు రాజ్యాధికారులు సైమను కమిషనును నియమించిరి. బ్రిటీషు రాజ్యాధికారులు నియమించిన ఈ తెల్లకమిషను భారతీయుల కన్నులను తెరచినది. తెల్లప్రభుత్వము భారతీయులకు చూపుచున్న అవమానమును ఈ తెల్లకమిషను వెల్లడిచేసినది. అన్నిపక్షముల వారిని, అన్ని సంఘములవారిని ఈ అవమానము హృదయశల్యమై వేధించి కలుపుటకు దోడ్పడినది. న్యాయాంగమంత్రులై దేశభక్తులను నిర్బంధముల పాలుచేసిన సర్ ఆలీఇమాం, సర్ తేజబహద్దూరు సప్రూ, సర్ సి. పి. రామస్వామి అయ్యరు మొదలగు ప్రముఖులకు బ్రిటీషు రాజ్యనీతిజ్ఞుల దుస్తంత్రము సుసంగతమైనది. ద్వంద్వప్రభుత్వమందలి అసంగతములు మంత్రుల కనుభవవేద్యములైనవి. మాంటుఫర్డు సంస్కరణములు స్థాపించిన రాజ్యాంగవిధానము దేశబంధనమునకు వినియోగపడినవిధమున దేశమోక్షమునకు వినియోగపడని విధమును గడచిన పదిఏండ్లయనుభవము తెల్లముచేసినది.

దేశమునకు స్వరాజ్యమో పరరాజ్యమో కాని మధ్యమార్గము సాధ్యముగాదని గత కాలానుభవము విశదము చేసినది. రక్షణాధికారము, ధనాధికారము, న్యాయాధికారము లేని రాజ్యాంగసంస్కరణములు మాయాసంస్కరణము లని మంత్రులు గ్రహించిరి. బర్కెను హెడ్డుప్రభువు రాజ్యాంగవిధానమును తయారుచేయవలయునని చేసిన సవాలునకను రూపముగ భారతీయనాయకులు స్వరాజ్యవిధానమును తయారుచేసి బ్రిటిషు రాజ్యాధికారులకు విషాదమును, భారతీయుల కానందమును సమకూర్చిరి. బర్కెను హెడ్డుప్రభువునకు భారతీయుల విభేదములందును, బ్రిటీషు రాజ్యాధికారుల స్వాభిమానమందును గల విశ్వాసము భారతీయుల విజ్ఞానమునందును, మానవకల్యాణమందును లగ్నము కాకుండుట సంతాపకరము. ప్రపంచమునందు ఎన్నియో సామ్రాజ్యములు పుట్టి గిట్టినవి. చాల్డియా, అస్సిరియా, గ్రీకు, రోము, పారసీకము మొదలగు సామ్రాజ్యములు నామమాత్రావశిష్టము లైనవి.

భారతవర్షము పరాధీనమైనను వీర్యవంతమై వెలయుచున్నది. బ్రిటీషుసామ్రాజ్యమునకును, లోకకళ్యాణమునకును వీర్యవంతమైన భరతవర్షము ప్రయోజనకరముగాని, నిర్వీర్యమైన భరతవర్షము ప్రయోజనకరముగాదని బ్రిటీషు రాజ్యనీతిజ్ఞులు గ్రహించుట పరమధర్మము. పరాధీనస్థితియందున్న దేశవికాసము దుస్తరమని రాజ్యాంగ

నీతిజ్ఞు లంగీకరించుచున్నారు. రాజ్యాంగ నీతిజ్ఞు లంగీకరించిన సిద్ధాంతమును భారతవర్షమునకు వ్యాపింపజేయుట బ్రిటిషు రాజ్యనీతిజ్ఞుల విధ్యుక్త ధర్మమని వారుచేసిన ప్రతిజ్ఞలన్నియును మృతాతురములగుట వారి సంకుచిత హృదయమును విశదము చేయుచున్నవి.

హిందూదేశ రాజ్యాంగ నిర్మాణము సులభకార్యము కాదని తెలిసిన విషయము. దీనికి బాధ్యత వహించవలసినవారు బ్రిటిషు రాజ్యాధికారులుగాని భారతీయులు గారు. స్వరాజ్యనిర్మాణమునకు ప్రతికూల వాతావరణము బ్రిటిషు రాజ్యాధికారులు గలుగజేయుచున్న విధమును దేశపరిస్థితులు విశదము చేయుచున్నవి.

1. హిందూమహమ్మదీయ విభేదములు,

2. స్వదేశసంస్థానములు,

3. జాతి, కుల, మతభేదములు,

4. యూరపియను వర్తకుల, పౌరసేవోద్యోగముల ప్రయోజనములు,

5. దేశసంరక్షణభారము-

స్వరాజ్య స్థాపనకు ప్రతిబంధకము లని బ్రిటీషురాజ్య నీతిజ్ఞులును, రాజ్యాభిమానులును ప్రతిపాదించుట ఆచారమైనది. ఈ ప్రతిబంధకములను తొలగించుటకు బ్రిటిషురాజ్యాధికారులు గడచిన నూటఏబది ఏండ్లయందును చేసిన ఘనకార్యమును నిరూపించుట ప్రయోజనకరము. బ్రిటిషు రాజ్యాధికారులు శాంతిని స్థాపించినను, వ్యాపారపరిశ్రమలను వృద్ధిచేసినను, రైలుమార్గములను నిర్మించినను, రాజ్యాంగసంస్కరణములను నెలకొల్పినను, విద్యావ్యాపనమునకు తోడ్పడినను, భారతీయపారతంత్ర్యమునకు తోడ్పడినవిగాని భారతీయ స్వాతంత్ర్యమునకు తోడ్పడలేదు. బ్రిటిషు రాజ్యాధికారులు భరతవర్షమునందు బాధ్యతాయుత పరిపాలనమును స్థాపించుటకు ప్రతిజ్ఞను జేసిరి. కాని వారు బాధ్యతాయుత పరిపాలనమును నిర్వచనము చేయక మాయమాటలతో కాలహరణము చేయుచున్నారు. ద్వంద్వప్రభుత్వము బాధ్యతాయుత పరిపాలనము గాజాలదు. బాధ్యతాయుత పరిపాలనమును నిర్వచనము చేయవలసిన యవసరము లేదు. రాజ్యాంగవిషయములందు స్వల్పపరిజ్ఞానము గలవారలకుగూడ నీసంగతి తెలిసియున్నది. బ్రిటిషు రాజ్యాధికారులును, వారి యభిమానానుచరులును తెలియని వారివలె నటించుచు లోకమును వంచింపజాలరు.

బాధ్యతాయుత పరిపాలనము

ప్రజాలాభములకై ప్రజలు చేసెడి పరిపాలనము బాధ్యతాయుత పరిపాలనము. శాసనసభలు ప్రజాధికారమునకు లోబడుటయును, కార్యనిర్వాహకవర్గము శాసనసభకు లోబడుటయును బాధ్యతాయుత పరిపాలనమునకు లక్ష్యములని రాజ్యాంగములు వెల్లడిచేయుచున్నవి. ఈలక్ష్యములు సంపూర్ణ స్వతంత్రరాజ్యమునందే సాధ్యములుగాని పరా

క్షీణరాజ్యములందు సాధ్యముకాదని నిత్యానుభవము తెలుపుచున్నది. ఎంతమంచి సుపరిపాలనమైనను, స్వపరిపాలనముతో తులతూగదని రాజ్యాంగవేత్తలు ఘోషించుచున్నారు. స్వరాజ్యము సకలజాతులకును జన్మస్వత్వము. భారతజాతీయమహాసభ స్వరాజ్యము భారతీయుల గమ్యస్థానమని ప్రతిపాదించినది. చెన్నపురియందు గతసంవత్సరమున గూడిన జాతీయ మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యమే స్వరాజ్యసాధనమని నిర్ధారణచేసినది. ఈ సందర్భములందు బాధ్యతాయుత పరిపాలన నిర్వచనవిషయమై ప్రజానాయకులయందు భేదాభిప్రాయముల కవకాశము లేదు. అయినను నెహ్రూకమిటీ వలసరాజ్యముల పరిపాలనము బాధ్యతాయుత పరిపాలనమని నివేదికయందు నిర్వచనము చేసినది. ఈ ఉభయభావములును ఏకాభిప్రాయము తెలుపుచున్నట్లు నివేదిక సూచించుచున్నది. సంపూర్ణ స్వాతంత్ర్యమునకును, వలసరాజ్యముల స్వాతంత్ర్యమునకును గల తారతమ్యము సర్వత్ర తెలిసియున్నది. దానిని విశేషము చర్చించుటయు ననవసరము. పండిత మదనమోహన మాళవ్యాగారు వలసరాజ్యపరిపాలనము బాధ్యతాయుత పరిపాలనమని ఎంత సమర్థించినను వారిసమర్థనమందు పసలేదని జవాహరీలాలుగారి ప్రసంగము విశదము చేసినది. కాని లక్ష్మణపురమునందు కూడిన సకలపక్షసమావేశము సకలపక్షముల యభిమతమును నిర్ణయించుటకు ఏర్పడినదిగాని కేవలము కాంగ్రెసు అభిమతమును మాత్రమే నిర్ణయించుటకు ఏర్పడలేదు. జవాహరిలాలు నెహ్రూగారు భేదాభిప్రాయము తెలిపినను వ్యతిరేకముగ సమ్మతి నొసంగలేదు. బాధ్యతాయుత పరిపాలనము విషయమై భిన్నపక్షములందు భేదాభిప్రాయము లున్నను అన్నిపక్షముల వారును నెహ్రూనివేదిక నంగీకరించి దేశమున కవసరమైన కనిష్ఠ రాజ్యాంగ విధానమును నిర్ణయము చేసిరి. ఈ నిర్ణయము భారతీయ యువజనామోదమును బడయక పోయినను భారతీయులసంయోగమును, దేశావసరమును లోకమునకు వ్యక్తము చేయుచున్నది. సకలపక్షసమావేశము దేశకాల పాత్రముల కనురూపముగ నెహ్రూకమిటి నిర్ణయముల నేకగ్రీవముగ నామోదించినది. నెహ్రూకమిటి నిర్ణయించినది కనిష్ఠసామాన్య ప్రమాణముగాని గరిష్ఠసామాన్యప్రమాణము గాదు. ఈ విషయమును సకలపక్ష సమావేశమునందు తేజబహాద్దూరు సప్రూ అలిఇమాముగారులుచేసిన ప్రసంగములు విశదముచేసినవి. స్వరాజ్యస్థాపనమునకు ప్రతిపక్షులు తెలిపెడి ప్రతిబంధకములు కల్పితములుగాని యథార్థమైన ప్రతిబంధకములు గావని సర్వత్ర తెలిసియున్నది.

దేశరక్షణభారము

దేశరక్షణసామర్థ్యము స్వరాజ్యమునకు ముఖ్యావసరమని యందరును సంగీకరించుచున్నారు. ముప్పదిమూడుకోట్ల ప్రజలకు దేశరక్షణసామర్థ్యము సహజముగ గలదనుట నిర్వివాదాంశము. సకలాంగములను

బంధించి కదలుటకు సామర్థ్యము లేదని ఆక్షేపించుట యసంబద్ధము. ఇప్పుడైనను సైన్యమునందు విశేషభాగము భారతీయ సైన్యము. ఐరోపా మహాసంగ్రామమునందును, ఇతరసందర్భములందును భారత యోధులు చూపిన సాహసపరాక్రమములు బ్రిటీషు రాజ్యాధికారుల ప్రశంసలను బడసినవి. చీనా, తుర్కీ, పారసీకము, ఆఫ్గనిస్థానచరిత్రములు సకల జాతులకును సహజముగ గల స్వసంరక్షణసామర్థ్యమును విశదము చేయుచున్నవి. ఒకవేళను లేదని యంగీకరించినను కనడా, ఆస్ట్రేలియా, ఐర్లాండు, ఆఫ్రికా మొదలగు వలస రాజ్యములకు స్వసంరక్షణసామర్థ్యము బాధ్యతాయుత పరిపాలనము స్థాపించినపుడుగాని, ప్రస్తుతముగాని కలదని ఎవరును చెప్పుటకు సాహసింపజాలరు. ఆ దేశముల కవసరములేని సామర్థ్యము భరతవర్షమునకు మాత్ర మేల కావలయునో ప్రతిపక్షులు తెలుపవలసియుందురు. ప్రపంచమంతయును యుద్ధబహిష్కారణమునకు బూనుకొనుచున్న సమయమునందు స్వసంరక్షణసామర్థ్య మేదేశమునకును నవసరము లేదు. ప్రపంచమునం దంతటను ఆయుధనియమమునకును, సంగ్రామబహిష్కారమునకును ప్రయత్నములు జరుగుచున్న యుగమునందు స్వసంరక్షణ సిద్ధాంతమునందు పస లేదని తెలియుచున్నది. ఆసిద్ధాంతము నంగీకరించినను ముప్పదిమూడుకోట్ల ప్రజలకు లేనిసామర్థ్యము మూడుకోట్ల ప్రజలకు గలుగజాలదు. భరతవర్షమునకు సంప్రాప్తమైన దుర్దశ కపారమైన సైన్యవ్యయమే మూలకారణము.

భారతీయులు కోరునది నిరంకుశత్వమునకు బదులు బాధ్యతయు, పరదేశ ప్రాజాపత్యమునకు బదులు స్వదేశ ప్రాజాపత్యమును గాని అరాచకము గాదు. బ్రిటీషు పరిపాలనమువలన నిదివరకు ప్రయోజనము గలిగినను గలుగకపోయినను, ఇపుడును ముందును ప్రయోజనము గలుగజాలదు. పంజరమునందు బంధింపబడిన సింహము శాంతిసౌఖ్యముల ననుభవించుచున్నను వీర్యమును గోల్పోయి కృశించుచున్నది. పరాధీనమైన భరతవర్షము సకల విధములను కృశించుచున్నది. వ్యక్తివికాసమునకును, జాతీయవికాసమునకును, ఆత్మావలంబనమువలె పరావలంబనము ప్రయోజనకరము గాదు. దేశసంరక్షణభారము వహించుటయందు భరతవర్షము దుఃఖము ననుభవించినను దేశావృతమైన నిశ్చేష్టతపోయి వీర్యవంతమై ఆత్మోపలబ్ధిని బడయగలదు. స్వీయప్రతిభను గోల్పోవుచున్న గ్రేటుబ్రిటను భరతవర్షరక్షణభారమును పూర్వమువలె వహింపజాలదు. స్వరాజ్యాభిలాషగల దేశమును నిర్బంధమార్గమున పాలించుటయును సాధ్యమును, ప్రయోజనకరమును గాదు. గ్రేటుబ్రిటనుకు స్వాధీన భరతవర్షము సమకూర్చెడి ప్రయోజనములను పరాధీనభరతవర్షము సమకూర్పజాలదు. స్వీయప్రయోజనములకును, బ్రిటీషు ప్రయోజనములకును భరతవర్షము స్వయంరక్షణసామర్థ్యమును గలిగియుండుట

పరమావసరము. ఆసామర్థ్యము స్వరాజ్యమూలముననే కలుగగలదు.

స్వరాజ్యస్థాపనమునకుస్వదేశసంస్థానములు ప్రబలాటంకములని వాదించుట యాచారమైనది.

స్వదేశ సంస్థానములు

స్వదేశసంస్థానములు భరతవర్షములో మూడవవంతుస్థలమును, నాల్గవవంతు ప్రజలను గలిగియున్నవి. గతించిన ఒడంబడికల ననుసరించి స్వదేశసంస్థానముల సంరక్షణ భారమును బ్రిటీషు ఇండియా ప్రభుత్వము వహించుచున్నది. సంస్థానములకును, బ్రిటీషు రాజ్యములకును ఒడంబడికలేర్పడినను, వ్యవహారమంతయును బ్రిటీషు ఇండియా ప్రభుత్వమూలముననె నడుచుచున్నది. ఇప్పుడు జరుగుచున్న విధముననె ముందును సంస్థానముల వ్యవహారక్రమమును బ్రిటీషుఇండియా ప్రభుత్వము నిరాటంకముగా నిర్వహింపగలదు. బ్రిటీషుఇండియాను విడిచి సంస్థానములు నిలువజాలవు. బ్రిటీషుఇండియాయందు ప్రజాస్వామ్యమును బాధ్యతాయుత ప్రభుత్వమును, సంస్థానములందు నిరంకుశత్వమును స్వేచ్ఛాపరిపాలనములును నసంభవములు. సకలవ్యవహారములకును భరతవర్షమేకత్వమును, నేకాధికారమును గలిగియుండుట యుక్తముగాని అనేకత్వమును, భిన్నాధికారములను గలిగి యుండుట ప్రయోజనకరముగాదు. భారతయుద్ధము, మౌర్యసామ్రాజ్యము, మొగలు సామ్రాజ్యము భారతీయ సామ్రాజ్యలక్ష్యమును విశదము చేయుచున్నవి. ప్రాచీనకాలమునందు సాధ్యమైన సామ్రాజ్యలక్ష్యము వర్తమానకాలమున సులభసాధ్యముగ నుండగలదు. బ్రిటీషు ఇండియాయును, సంస్థానములును స్వీయపరిస్థితుల కనురూపముగ ప్రాంతీయ స్వాతంత్ర్యమును గలిగియుండుటయును, కేంద్రాధికారమునకు లోబడియుండుటయును భారతసామ్రాజ్యమునకు సహజమైన రాజ్యాంగవిధానము. ఆ రాజ్యాంగవిధానమునె నెహ్రూనివేదిక నిరూపించుచున్నది. ఇంతవరకును ఇండియా ప్రభుత్వము నిర్వహించుచున్న యధికారమునే స్వరాజ్యప్రభుత్వమును నిర్వహింపగలదు. ఇందు విపరీత మేమియును లేదు. సంస్థానాధీశులును, బ్రిటీషు రాజ్యాధికారులును భరతవర్షమునకు సహజమైన సాంఘాతిక రాజ్యాంగ విధానము నామోదించుట ప్రయోజనకరము. సంస్థానాధీశులు వారి నిరంకుశాధికారమును విసర్జించి నియమితాధికారమును వారి సంస్థానములందు స్థాపించి భారతమాతను సేవించుట శ్రేయస్కరము. భారతప్రాచీనసంస్కారమునకు నిలయములైన సంస్థానములు నవీనసంస్కారమునకు నిలయములై సకలభారత భాగ్యోదయమునకు దోడ్పడుట పరమధర్మము.

సంస్థానాధీశులు బట్లరుకమిషను సందర్శమున చేయుచున్న యాందోళనము దుర్గ్రాహ్యముగ నున్నది. లక్షలరూప్యముల నిచ్చి సర్ లీలిస్కాటును వారిపక్షమున వాదించుటకు నియమించుట విచిత్రము. కొందరు

స్వతంత్ర సంస్థానములను స్థాపించుటకు గోరుచున్నారు. సంస్థానాధీశులు బ్రిటీషు రాజ్యాధిపతితో సంబంధమును గలిగియుండవలయునని కోరుచున్నారు. స్కాటుగారు చిరకాల మాచరణమునందున్న వ్యవహారక్రమమును మరచి బ్రిటీషు రాజ్యాధికారసంబంధమునే స్థిరపరచుచున్నారు. భారతీయ రాజ్యాధికారమునకును, బ్రిటీషురాజ్యాధికారమునకును నడుమను సంస్థానములు వ్రేలాడజాలవు. ఈసందర్భములను గ్రహించిన మైసూరు సంస్థానాధీశుల వంటి ప్రాజ్ఞులు వారియాశయములను సకల భారతీయాశములందు మేళగించుటకు సిద్ధముగ నుండుట భావిభాగ్యోదయమునకు శుభసూచకముగ నున్నది. బ్రిటీషు రాజ్యాధికారులును, సంస్థానాధీశులును స్వప్రయోజనములను విసర్జించి భారతీయ ప్రయోజనములను నారాధించుటకు భగవంతు డనుగ్రహించుగాత! నైర్మాణి వేదిక స్వదేశసంస్థానములవిషయమై దృఢాభిప్రాయములను తెలుపకుండుటయనుచితమైనను సహజము. బ్రిటీషుఇండియా రాజ్యాధీశులతోపాటు సంస్థానాధీశులనుసైతము ప్రబలశత్రువులను జేయుట దేశప్రయోజనములకు సాధనభూతము గాదు. అయినను భారతీయ నాయకు లీభారమును నిర్భయముగ వహింపవలసిన యవసరమును సంస్థానముల పరిస్థితులు తెల్లముచేయుచున్నవి. సంస్థానప్రజల సమావేశమునందు మోచర్ల రామచంద్ర రావుగారు తెలిపిన భావములును, సకలపక్ష సమావేశమునందు మనీలాలు కొఠారిగారు తెలిపిన భావములును సంస్థానముల సంస్కారణావసరమును విశదము చేయుచున్నవి. బ్రిటీషు ఇండియా ప్రజలును, సంస్థానముల ప్రజలును చేతులు కలిపి పని చేయుట సత్వరస్వారాజ్యసిద్ధికి సాధనము గాగలదు.

దేశమత సాంఘిక భాషా భేదములు

భరతవర్షము విశాలమైనఖండము. 10 లక్షలమైళ్ల వైశాల్యమును, 33 కోట్ల ప్రజలను గలిగియున్నది. హిందువులు, మహమ్మదీయులు, జైనులు, బౌద్ధులు, సిక్కులు, పార్సీలు, క్రైస్తవులు మొదలగు భిన్నమతస్థులు గలరు. హిందీ, ఉర్దూ, బంగాళి మహారాష్ట్రి తమిళ కర్ణాటాంధ్రాంగ్లాది భాషలు గలవు. వివిధకులములు గలవు. భిన్నసంస్కారములు, జాతులు గలవు. బ్రిటీషు రాష్ట్రములు, సంస్థానములు గలవు. ఈ విభేదములన్నియును స్వారాజ్యమునకు ప్రతిబంధకములని బ్రిటీషు రాజ్యాధికారులును, వారి ప్రియశిష్యులును చిలుకపలుకుల వలె పలుకుట పరిపాటి యైనది. పరాక్రమణ జాతీయాహంకారమున కలవాటుపడిన పాశ్చాత్యరాజ్యాధికారుల కిట్టి సిద్ధాంతములు స్వప్రయోజనములకు వినియోగపడినను నవి సహజములు గావు. విశ్వప్రవృత్తి యంతయును భిన్నరూపములనె గోచరంబగుచున్నది. అనంత జీవములు, బ్రహ్మాండతారాగణములు ప్రవృత్తియందలి భిన్నవైచిత్ర్యమును విశదము చేయుచున్నవి. ఈ విచిత్రరూపముల నన్నిటిని నొక టంకసాలయం దేకరూపమునకు మార్చుట

దుస్సాధ్యము. ఒకవేళ సాధ్యమైనను ప్రపంచ కల్యాణమునకు ప్రయోజనకరము గాదు. విశ్వకల్యాణమునకు చీమమొదలు బ్రహ్మవరకును గల జీవజాలము లన్నియును భిన్నరూపములను దోడ్పడుచున్నవి. సకల సంహారమును గోరెడి "నాపాట్ట, నాబట్ట, నాజాతి, నామతము, నాభాష, నాదేశము" సిద్ధాంతములు శాంతి సౌఖ్యములకును, విశ్వవికాసమునకును సాధనంబులు గావు. బలముగలవారిది రాజ్యమను సిద్ధాంతము మూలబడినది. శ్రీకృష్ణపరమాత్ముడు విజయున కుపదేశించినటులు విశ్వమునందు భిన్న ప్రవృత్తులకును స్థానము గలదు. విశ్వకల్యాణమునకు ధర్మము సాధనమైనటులు ధనముగాని, బలముగాని సాధనములు గావు. అశోకుడు ౨౨౦౦ పూర్వము ప్రతిపాదించిన ధర్మమునే వర్తమాన కాలమునందు పాశ్చాత్యులు మెల్ల మెల్లగా గ్రహించుచున్నారు.

యూరపు ఖండమునందు గతించిన రెండు శతాబ్దములందును ప్రబలిన జాతీయ దురహంకారము మహాసంక్షోభమును గలుగ జేసినది. ఐరోపామహాసంగ్రామానుభవమైనను నీ దురహంకారమును పోగొట్టలేదు. వివిధమతములకును, జాతులకును, భాషలకును నిలయమైన భరతవర్ష రాజ్యాంగవిధాన మీసమస్యను,లోకమునకు నిర్ణయింపవలసియున్నది. భావమువం దేకత్వము, రూపమునం దనేకత్వము సృష్టిరహస్యము. ఆరహస్యమే భారతరాజ్యాంగనిర్మాణమునందు పరిస్ఫుటము గావలసి యున్నది. నెకలపతినమావేశమునందు డాక్టరు పెజంటమ్మగా రీరహస్యమును సభ్యులకు హృద్యముగ విశదముచేసిరి. అమెరికా, ఆఫ్రికా, స్విజర్లాండు మొదలగు దేశముల రాజ్యాంగము లీవిధానమునకు మార్గదర్శకములుగ నున్నవి. భరతవర్ష రాజ్యాంగవిధానము రాజ్యాంగ చరిత్రమునందు నూతనాధ్యాయము నేర్పరుపగలదు. భాషాప్రయుక్తరాష్ట్రవిభాగ మీ సిద్ధాంతమునే యనుసరించుచున్నది.

నెహ్రూనివేదిక భాషాప్రయుక్తరాష్ట్రవిభాగముల నామోదించినది. కాని ఉపసం

భాషాప్రయుక్త రాష్ట్రములు, ఆంధ్రరాష్ట్రము

ఘపుద్రిష్టి వాదప్రతివాదములకు మూలమైన సింధురాష్ట్రము మీదనే లగ్నమైనది. సింధురాష్ట్రనిర్మాణము విషయమై హిందువులకును మహమ్మదీయులకును పట్టుదల లేర్పడినది. ఆనమస్య రాజ్యాంగస్వభావమును గోల్పోయి సాంఘిక స్వరూపమును దాల్చినది. నివేదికయందు అవసరమైన యితరభాషావిభాగముల ప్రస్తావన లేకపోయినను,సింధురాష్ట్రము ప్రముఖతను వహించి పట్టుదలలకు గారణమైనది. కష్టమైన సాంఘిక రాజకీయ సమస్యలందు మునిగియున్న ఉపసంఘులత్యము ఆంధ్రోత్కలాది రాష్ట్రనిర్మాణమునందు లగ్నము గాకుండుట సహజము. మోతీలాలు నెహ్రూగారి లక్ష్యమీసమస్యయందు లగ్నమైనపుడు వారు నకలపతినమావేశమునందు భాషాప్రయుక్తరా

ప్రతిప్రస్తావమును విస్తరింపజేసి రాజ్యాంగవిధానమును సార్థకము చేసిరి. ప్రపంచమునందు గల భిన్నజాతులు, మతములు, భాషలు, దేశములువలెను భరతవర్షమునందును భిన్నజాతులు, మతములు, భాషలు, భాగములు గలవు. ఆ భిన్న భాగముల వికాసమునం దైక్యానందము సాధ్యముగాని భిన్నభాగముల సంహారమునం దైక్యానందము సాధ్యముగాదు.

అనంతములైన ప్రకృతి వైభవములందు వ్యక్తులవలెను జాతులును, భాషలును, సాంప్రదాయాచారములును ప్రత్యేక లక్షణములను గలిగి విశ్వవికాసమునకు వినియోగపడుచున్నవి. ప్రవృత్తియం దైక్యము భావమునందు సాధ్యముగాని రూపమునందు సాధ్యముగాదు. వివిధ మతములకును, భాషలకును, జాతులకును, సాంప్రదాయాచారములకును నిలయమైన భరతవర్షము లోకమునకు నవయుగ సందేశమును ప్రకటించుటకు సకలవిధములను దగియున్నది. ఆసందేశము సర్వసమత్వ సందేశము. సర్వసమత్వ సందేశమును భౌతిక రూపమునను సార్థకము చేయుటకు ఫ్రెంచి పరివర్తనము పందొమ్మిదవ శతాబ్దారంభమునందు ప్రయత్నము చేసినది. ఇరువదవ శతాబ్దమునందు సోవియట్‌రూపమునను రుష్యారాజ్యము సర్వ సమత్వ సిద్ధాంతమును సార్థకము చేయుటకు విశ్వప్రయత్నము చేయుచున్నది. సమత్వము త్యాగమునందును, ధర్మమునందును సాధ్యముగాని భోగమునందును, విజయమునందును సాధ్యముగాదు. భౌతికవిషయములందు జాతీయత్వమును, సర్వసమత్వమును స్థాపించుటకు పాశ్చాత్య రాజ్యములు చేసిన ప్రయత్నములును, వారిసిద్ధాంతములును సంక్షోభమును గలుగజేసిన రీతిని శాంతి వికాసములను గలుగజేయలేదు. భారతస్వరాజ్యసిద్ధికి ప్రతిపక్షులు నిరూపించెడి ప్రతిబంధకములె సహజమైన సాధనములని నవయుగ ధర్మము విశదము చేయగలదు. భారతీయులందరును భేదాభిప్రాయములను విడిచి వారి లక్ష్యమును దేశమునందును, ధర్మమునందును, దైవమునందును లక్ష్యముచేసి దేశమాతృమును, లోకకల్యాణమును సాధింతురుగాక! సకలపక్షసమావేశమునం దీలక్ష్యము గోచరంబైన విధమును సభ్యులప్రసన్నవదనములు, శాంతప్రవర్తనము, ధర్మస్వభావము విశదము చేసినవి.

వ్యాపార ధనలక్ష్యముగల ప్రభుత్వమునకు ధర్మలక్ష్యము సంకుచితమగుట సహజము.

యూరపియను వర్తకుల ఉద్యోగుల ప్రయోజనము

స్వరాజ్యస్థాపనము బ్రిటీషు వర్తకమునకును, బ్రిటీషుప్రజల యుద్యోగములకును కొంత ప్రతిబంధకములను గల్పించుట సహజము. స్వదేశవ్యాపారమునకును, స్వదేశప్రయోజనములకును ప్రతిబంధకములైన వ్యాపారోద్యోగముల కాటంకములను గల్పించుటయె స్వరాజ్యమునకు ప్రయోజనము. దేశారిష్టమునకు మూలమైన విదేశవ్యాపారమును, పౌరసేవోద్యోగుల ప్రాబల్య

మును నరికట్టుట రాజ్యాంగమునకు సహజ ప్రయోజనము. ఆప్రయోజనములను ధర్మాత్ము లందరును నిరభ్యంతరముగ నంగీకరింపవలసి యుందురు. కాని ధర్మపరాయణులైన భారతీయులు వారి ధర్మబాధ్యతను మాత్రము విస ర్జింపరు. ఆవిషయమును నెహ్రూనివేదిక సువ్య క్తముచేసినది. యూరపువర్తకుల సొమ్మున కును, పనిచేయుచున్న యుద్యోగస్థుల హక్కు లకును నష్టము గలుగజాలదు. ఇట్టి స్వల్పవిష యములను నిర్ణయించుట సులభసాధ్యము. బ్రిటీషు రాజ్యాధికారులు సరళమార్గము నవ లంబించునపుడు సకలజాతులకును స్వాగతంబు నొసంగిన భారతీయులవలనను వారి న్యాయ మైన హక్కులకు భంగము గలుగజాలదు. నెహ్రూనివేదికయం దీవిషయము స్పష్టము చేయబడినది. నానాపక్షసమావేశమును నీవిష యము నంగీకరించినది.

నెహ్రూనివేదిక భారతదేశపరిస్థితుల కను రూపమైన రాజ్యాంగవిధానమును ఏడవ య

రాజ్యాంగ విధానము,

ధ్యాయమునందు 87 నిబంధన లందు వ్యక్తము చేయుచున్నది. ఈ నిబంధన లితర రాజ్యాంగ విధానములనుండి ఎత్తి వ్రాయబడిన వని యాక్షేపించుట సులభము. మానవనిర్మా ణము లన్నియును గతానుభవమును బట్టి యేర్పడుచున్నవి. ముఖ్యముగ రాజ్యాంగవి ధానము లనుభవమునుబట్టి నిర్మింపబడుచు న్నవి. ఈనియమములం దసంబద్ధ నియమము లున్న నిరాకరింపవచ్చును; వానిని మార్చవ చ్చును. నివేదికను పరిశీలించి విమర్శించుట రాజ్యాధికారులకు ధర్మమైయున్నది. బర్కెను హెడ్ప్రభువు చేసిన సవాలునకు బదులుగ నెహ్రూనివేదిక ప్రచురింపబడినది. ఇతరప్రయ త్నములకువలెను, దీనికిని సంపూర్ణత్వ మసం భవము. ఆంగ్లేయ పత్రికలు నివేదికను నిర సించుటయును, నిందించుటయును సహజము. నిష్పక్షపాత బుద్ధితో నిరంకుశవర్గము నెహ్రూనివేదికను విమర్శించునని భారతీయులు కలలోనైనను తలచియుండరు. కాని నెహ్రూ నివేదికయును, సకలపక్షసమావేశ మామోదిం చిన తీర్మానములును భారతరాజ్యాంగనిర్మా ణమున కఖండమైన ప్రయోజనమును సమ కూర్చగలవు.

భారతరాజ్యాంగము సంయుక్తరాజ్యాం గవిధానమనియును (Federal Type), కేంద్రా ధికార రాజ్యాంగవిధానమనియును (Unitary-Type) భేదాభిప్రాయములు ప్రబలియున్నవి. నెహ్రూనివేదికయందు రెండువిధానములును చేర్పబడినవి. భారతీయ రాజ్యాంగసమస్య లపూర్వములు. అపూర్వమైన సమస్యల కపూర్వమైన రాజ్యాంగవిధానము లేర్పడుట యును సహజము. ప్రయోజనము ప్రధా నముగాని నామరూపములు ప్రధానములు గావు. నెహ్రూ ఉపసంఘము సంకుచిత పరిస్థితులందు సమర్పించిన భారతరా జ్యాంగ విధానము వివేకమును, నిగ్ర హమును, దూరదృష్టిని, సాహసధైర్యములను, వ్యవహార దక్షత్వమును గలిగి ప్రాజ్ఞుల యాశీ

ర్వాదములను బడయుచున్నది. సైమను సప్తక మేమిచేయునో కాలము తెలుపగలదు.

లక్ష్మణపురమునందు గూడిన సకలపక్ష సమావేశమునకు దిగ్విజయము గలిగినది. సకల రాజకీయపక్షములవారును, భిన్నసంఘములవారును, భిన్నమతములవారును, భిన్నప్రదేశములవారును వారి సంకుచితాభిప్రాయములను, ప్రత్యేకలాభములను విసర్జించి, స్వధర్మనిర్వహణమునుజేసి, ప్రతిపక్షులకు విషాదమును, స్వదేశీయుల కానందమును గలుగజేసిరి. నిరంకుశవర్గము చేయుచున్న కుట్రల మీదను లక్నో తీర్మానములు పిడుగువలె పడి భయభ్రాంతులను గలుగజేయగలవు. ప్రపంచమునందు ధర్మమునకు విజయముగలుగునుగాని యధర్మమునకువిజయముగలుగజాలదు. సైమను కమిషను నిర్ణయములను, వారి సహకారుల నిర్ణయములను సకలపక్ష సమావేశ మామోదించిన తీర్మానములు పరివర్తనము చేయగల విధమును కాలము విశదము చేయగలదు. శాసనసభాసభ్యులు నిరంకుశాధికారుల మాయలలోబడి దేశానర్థమునకు సాధనంబైన సహకారము నంగీకరించుట భారతీయుల పతితస్థితికి నిదర్శనముగ నున్నది. సైమను సప్తకమును బహిష్కరించుటకు నిర్ణయించిన చెన్నరాష్ట్రశాసనసభ తిరిగిసహకారము నామోదించుట పరమవిచారమును గలుగజేయుచు భారతీయుల దుర్దశను విశదము చేయుచున్నది.

ఆరుమాసములు తిరుగకపూర్వమే చెన్నరాష్ట్రశాసనసభ వెనుక చేసిన నిర్ణయమును మార్చుకొని తనయాత్మగౌరవమును నాశనము చేసికొనినది. స్వప్రయోజన పరాయణులైన సభ్యు లనుచితముగ ప్రవర్తించినను సభాగౌరవమును గాపాడవలసిన సభాధ్యక్షులైనను ధర్మసంరక్షణమునకు బూనుకొనకుండుట సంతాపకరము. సభాధ్యక్షులు ప్రతిపాదనమునకును, మోషనునకును గల్పించిన భేదములును, చేసిన నిర్వచనములును వారి న్యాయవాదిస్వభావమును దెలుపుచున్నవి గాని ధర్మస్వభావమును దెలుపుట లేదు. నిరంకుశవర్గమునకు గల బలసామర్థ్యముల కిది యొక నిదర్శనముగ నున్నది. భారతీయులు స్వధర్మనిర్వహణపరాయణులై ఆత్మోపలబ్ధిని బడయుటకు స్వరాజ్యావసరమును నిట్టి యనుచితకార్యములు సంబోధించుచున్నవి. సకలపక్షసమావేశము నెహ్రూనివేదిక నేకగ్రీవముగ నామోదించుటయందు చూపిన దూరదృష్టిని, ధర్మౌత్స్యమును, దేశభక్తిని, సాహసధైర్యములను భారతీయులందరును వ్యక్తముచేసి. దేశమును, ధర్మమును, దైవమును భక్తిశ్రద్ధలతో నారాధించి కృతార్థు లగుదురు గాక!

Printed and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No.7, Thumbu Chetty Street, G.T, Madras

విషయానుక్రమణిక

చిత్రములు

త్రివర్ణచిత్రములు:—రాధ; 'విషయ నిమ్ము'.

సాధారణచిత్రములు:—అబ్రహాముకాలమున అబ్రహామునగరము; చెదపురుగుల గుట్టు; త్యాగరాజమహోత్సవము-సింగరేణికాలియరుస్సు; లక్కచిత్రములు ౫; శ్రీ గాంధి మహాత్ముఁడు; శ్రీ రాజా రామమోహనరాయిగారు; డాక్టరు అనిబెసంటుగారు; ఇతర చిత్రములును.